# PRAPANCHEEKARANA PRABHAVA NAVALALU - PARISEELANA

**A dissertation submitted to the University of Hyderabad in partial fulfillment of the Degree of**

## Doctor of Philosophy
## in
## Telugu


**RESEARCHER**

**M.NAGARAJU**

**SUPERVISOR**

**Prof. S. SARAT JYOTHSNARANI**

Department of Telugu
School of Humanities
University of Hyderabad
Hyderabad–500 046
India


June-2014

# ప్రపంచీకరణ ప్రభావ నవలలు - పరిశీలన

డాక్టరేట్ డిగ్రీ కోసం

హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధనా సిద్ధాంత గ్రంథం


పరిశోధన

**ఎం. నాగరాజు**

పర్యవేక్షణ

**ఆచార్య. ఎస్. శరత్‌జ్యోత్స్నారాణి**

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు – 500 046


జూన్ – 2014

## CERTIFICATE

This is to certify that the dissertation entitled ***Prapancheekarana prabhava navalalu - Pariseelana*** by *Sri **M. Nagaraju*** bearing Reg. No. **08HTPH01** in partial fulfillment of the requirements for the award of Doctor of Philosophy in Telugu is a bonafide work carried out by him under my supervision and guidance. Wich is a plagiarism free thesis.

The dissertation has not been submitted previously in part or in full to this or any other university or institution for the award of any degree or diploma.

Date:

Signature of the Supervisor

Head, Department of Telugu

Dean, School of Humanities

## DECLARATION

I, **M. Nagaraju** hereby declare that this dissertation entitled ***Prapancheekarana prabhava navalalu - Pariseelana*** submitted by me under the guidance and supervision of Prof. Sarat Jyothsna Rani is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this university or any other university or institution for the award of any degree or diploma. I hereby agree that my dissertation can be deposit in shoud ganga / INELIBNET.

M. Nagaraju

Date: Signature of the student

Regd. No. 08HTPH01

# అంకితం

మా కళ్ళలో వెలుగు నింపడంకోసం

మీ ఒంట్లో శక్తినంతా ధారపోసి

మీ సేవ చేసుకునే భాగ్యం కూడా

మాకు తీరకుండానే

మా నుండి భౌతికంగా దూరమైనా

మా కళ్ళలో ఎప్పటికీ సజీవంగా

కదలాడే రూపాలు అమ్మా, నాన్న

అమ్మ తిమ్మమ్మ

నాన్న రంగన్న గార్లకు

ఆర్ధ్రత నిండిన కళ్ళతో...

అనంతమైన వేదనతో....

అపారమైన ప్రేమతో......

మీ

నాగరాజు.

# కృతజ్ఞతలు

నాకు జన్మనిచ్చి తమకు అక్షరం తెలియక పోయినా, నాచదువుల్లోనే తమ ఆనందాన్ని వెతుక్కుని, మాఉన్నతి కోసం తమ జీవితాలను శ్రమకే అంకితమిచ్చి, జీవితంలో కష్టం తప్ప మరొకటి తెలియని నా తల్లిదండ్రులు కీ.శే. తిమ్మమ్మ, కీ.శే. రంగన్న గార్లకు ముందుగా పాదాభివందనములు సమర్పించుకుంటున్నాను.

నా పరిశోధనకు పర్యవేక్షణ బాధ్యతను సహృదయంతో స్వీకరించి, పరిశోధనలో నా అలసత్వాన్ని మన్నించి, కన్నతల్లిలా కరుణ చూపుతూ నా పరిశోధన పూర్తి కావడానికి సహకరించిన 'మానవతా మూర్తి' తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య శరత్‌జ్యోత్స్నా రాణి గారికి వినయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

కనబడిన ప్రతిసారి ఆప్యాయంగా పలకరించే పెద్దలు గౌరవనీయులు శ్రీ వి.వి. రమణ గారికి....

ఈ పరిశోధనకు అవకాశం కల్పించిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి, తెలుగు శాఖకు,

అధ్యాపక సిబ్బంది ప్రొ. బేతవోలు రామబ్రహ్మం, ప్రొ.ఎన్.ఎస్. రాజు, ప్రొ. జి. అరుణకుమారి, ప్రొ.తుమ్మల రామకృష్ణ, డా. రామకృష్ణశాస్త్రి, డా.పి.రాములు, డా. దార్ల వెంకటేశ్వరరావు, డా.డి. విజయలక్ష్మి, డా. పమ్మి పవన్‌కుమార్, డా. భుజంగరెడ్డి, డా. విజయకుమారి గార్లకు...

తల్లిదండ్రుల తర్వాత తల్లిదండ్రులు శ్రీ గురుస్వామి, శ్రీమతిచిట్టెక్క గారికి,

మా కుటుంబానికి పెద్ద దిక్కు అక్కా,బావ అనుమంతమ్మ, చిన్న గిడ్డయ్య వాళ్ళకంటి వెలుగులు శిరీష, మధులకు, మా ఇంటి వెలుగు చెల్లెలు రాజేశ్వరి బావ రామాంజనేయులు వీరి ఆశాజ్యోతులు కార్తీక్‌రాజు, సంతోష్‌లకు....

నా డిగ్రీనుంచి ఆర్థిక, హార్థిక సహకారం అందిస్తున్న శ్రీ బి.వీరప్రకాశ్ సార్ గార్కి కృతజ్ఞున్ని.

మా కష్టసుఖాల్లో పాలుపంచుకునే మేనమామలు తిమ్మయ్య, అనుమన్నలకు....

తను అందరిలో చిన్నవాడయినా పెద్దబాధ్యతల్ని భుజాన వేసుకుని కుటుంబానికి ఆసరగాఉంటున్న తమ్ముడు రమేష్‌కు....

మా కష్టసుఖాల్లో పాలుపంచుకునే ఆత్మీయులు బాబాయి చంద్ర (విఆర్.ఓ)రామచంద్రకు.., తమ్ముళ్ళు బజారి, కృష్ణ, శ్రీకాంత్‌లకు....

తనకు ఊహ తెలిసినప్పటి నుంచి మా కుటుంబంలో ఒకరిగా ఉంటూ మా కష్ట సుఖాలని మాతో కలిసి పంచుకుంటున్న పీటర్‌కు, అన్ని వేళలా మాకు ధైర్యమిచ్చే బావమరిది భూపతి రాజుకు...

పుట్టెడు దుఃఖంలో ఉన్న మాకుటుంబానికి మీకు 'నేనున్నాను' అంటూ ధైర్యమందించిన ఆప్తమిత్రుడు బి. క్రాంతికుమార్( ఎస్.ఐ)కు ఎన్ని చెప్పినా తక్కువే.

అన్ని వేళలా నా ఉన్నతిని కాంక్షించే మామ లక్ష్మన్న(టీచర్)ఆర్థికంగా, హార్ధికంగా సహాయ సహకారాలు అందిస్తున్న తమ్ముళ్ళు జె. మారెన్న(పోలీస్) దేశాయ్ శ్రీనివాస్‌లకు రామాంజనేయులు(ఎస్.ఐ) మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. నా కుటుంబానికి అన్ని వేళలా సహాయ సహకారాలు అందించే మా బావమరుదులు ఎన్. కోదండరాముడు(పోలీస్) ఎన్.హరి (ఎం.టెక్)

నా ఉన్నతిని కోరే మంచి మిత్రులు శ్యామ్, యువరాజు, హుస్సేన్, బి. గిడ్డయ్య, రమణ, ,జాన్, టి.చంద్రన్న, మధుబాబు, మౌళాలిలకు...

పరిశోధనలో అమూల్యమైన సూచనలు, సలహాలు అందించి పరిశోధనకు ఎంతగానో సహాయం అందించిన  డా. పసునూరి రవీందర్, వదిన రజిత గారికి ప్రత్యేక కృతజ్ఞతలు,

నా పరిశోధనలో తగిన సూచనలు సలహాలు అందించి పరిశోధన పూర్తి కావడానికి సహాయ పడిన అన్నలు డా. గుండెమెడ శ్రీనివాసరావు, తన పనులు మానుకుని నా అవసరాన్ని గుర్తించి డి.టి.పి చేసిన అన్న డా.బండారు విజయకుమార్, వదిన బండారు ఉషారాణి గారికి....

ఈ పరిశోధనకు సహకరించిన సీనియర్ మిత్రులు అన్నలు, సిలువేరు హరినాధ్, రత్నశేఖర్, పొనుగోటి రవి, ప్రజాపతి, శ్యామ్‌సుందర్, మాధవరావు, సుబ్బారావు, సోమయ్య లకు...

నాకష్టాల్లో, కన్నీళ్ళలో నన్ను ఓదార్చి పరిశోధన పూర్తి కావడానికి ప్రేరణగా నిలిచిన అన్న డా. మీసాల రామక్రిష్ణకు.....

ఎమ్.ఎ తరగతుల నుండి నాకు అండగా ఉంటున్న రాజీవ్‌బాబు, శివకుమార్, కిరణ్, నారాయణలకు

పరిశోధన విషయంలో సహాయపడిన చిరంజీవి, పైడిరాజు, ఉదయ్, రమేష్, అంజి, కోటి, సత్యనారాయణలకు.

నా సిద్ధాంత గ్రంథాన్ని ఎంతో ఓపికతో, సహృదయంతో అందంగా డి.టి.పి చేసిన రమేశ్. బేతి (తెలుగు విశ్వవిద్యాలయం) గారికి .......

నా పరిశోధనకు ఆర్థిక సహాయం కల్పించిన యుజిసి వారికి..., కావలసిన ప్రతి పుస్తకాన్ని అందించిన ఇందిరా గాంధీ మెమోరియల్ లైబ్రరీ అండ్ సిబ్బంది (హెచ్.సి.యు) మరియు నవలా రచయితలకు.....

అంబేద్కర్ ఆశయాలకు సజీవరూపం దళితస్టూడెంట్స్ యూనియన్‌కు అంబేద్కర్ ఆశయ సాధనకు పాటుపడుతున్న అశేష జనరాశులకు......

తెలుగు శాఖ అధ్యాపకేతర సిబ్బందికి......, నా పరిశోధనకు ప్రత్యక్ష్యంగా, పరోక్షంగా సహకరించిన వారందరికీ.. హృదయపూర్వక కృతజ్ఞతలు.

మీ

నాగరాజు

# ముందుమాట

ప్రస్తుతం ప్రపంచీకరణపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ప్రపంచీకరణ చుట్టుముట్టని రంగం లేదు. దీని ప్రభావం పడని మనిషి లేడు. భారతదేశంలో సరళీకరణ విధానాల ప్రస్తావన గమనిస్తే 1991 జూలై1న ఈ సరళీకరణ విధానాలను దేశంలోకి అనుమతించారు నాటి పాలకులు. ఈ విధానాలు మొదట్లో భారత ఆర్థికవ్యవస్థ అధికంగా వృద్ధి పొందడానికి దోహదపడతాయని అంతా భావించారు. అయితే అవి అభివృద్ధికి దోహద పడకపోగా అన్ని రంగాలపై తన విష ప్రభావాన్ని వేసి వివిధ బహుళజాతి సంస్థలకు భారత మార్కెట్లను వశం చేసింది. ఫలితంగా బహుళజాతి సంస్థలు ఈ దేశంలో అనేక ప్రభుత్వ రంగ సంస్థల మూసివేతకు కారణమైనాయి. బహుళజాతి సంస్థలు మనిషి కోసం సరుకును కాకుండా సరుకు కోసం మనిషిని సృష్టించుకుంటున్నాయి. అవసరం కోసం వస్తువుని కాకుండా వస్తువు కోసం వినియోగదారున్ని వెతుక్కుంటున్నాయి. ఈ పోటీలో వర్ధమాన దేశాల జన జీవనం సమస్త వృత్తులు, జీవనరంగాలు ఛిద్రమై పోతున్నాయి.

మనిషి లేచింది మొదలు పడుకునే వరకు బహుళజాతి సంస్థల ఉత్పత్తులని వినియోగించే అవసరాన్ని కలుగజేసి అవి వర్ధమాన దేశాల్లోని సంపదను క్రమంగా కొల్లగొడుతున్నాయి. నేడు ఈ బహుళజాతి సంస్థలు ఆర్థిక, రాజకీయ నిర్ణయాలను నిర్దేశిస్తూ తమ పట్టుని అన్ని రంగాల్లోనూ మరింత బిగిస్తున్నాయి. వర్ధమాన దేశాల్లోని ప్రజలను ఆధునిక బానిసత్వంవైపు నెట్టి వేస్తున్నాయి.

ప్రపంచీకరణ నేడు సాహిత్యంలో ప్రధాన వస్తువైంది. దీనిపై కవిత్వం, కథల్లో ఎక్కువగా నవలలో కొంత తక్కువగా సాహిత్యంరావడం జరిగింది. ప్రపంచీకరణకవిత్వం,కథలపై ఇంతకుముందే పరిశోధన జరిగి ఉండటం, ప్రపంచీకరణ ఇవ్వాళ నవలల్లో కూడా ప్రధాన వస్తువైంది. అందువల్ల నేను నవలల్లో ప్రపంచీకరణ ప్రభావాన్ని వివరించుటకు ఈ పరిశోధనాంశాన్ని ఎన్నుకోవడం జరిగింది.

ఈ నేపథ్యంలో భారతీయ మార్కెట్లో మనిషి చుట్టూ అల్లుకున్న బహుళజాతి సంస్థల గురించి, వాటి దోపిడీ గురించీ ప్రపంచ సాహిత్యంతో పాటు తెలుగు సాహిత్యంలో కూడా చెప్పుకోదగ్గ ప్రపంచీకరణ వ్యతిరేక సాహిత్యం ఎంతో వెలువడింది. తెలుగు సాహిత్య ప్రక్రియల్లో ప్రపంచీకరణ వ్యతిరేకత గురించి ఎక్కువగా కవిత్వం, కథల్లో వ్యక్తమైనప్పటికీ దానికి సమాంతరంగా నవలా సాహిత్యం కూడా వెలువడింది. అందుకే నా పరిశోధన అంశాన్ని "ప్రపంచీకరణ ప్రభావ నవలలు –

పరిశీలన”గా  నిర్ధారించి డాలర్ డాలర్, డాలర్‌కోడలు, తమసోమా, జీవన్మృతులు వెన్నెల్లో గోదావరి, పడగనీడ, కాంచనమృగం, బతుకుతాడు మొదలైన నవలల్లోని ప్రపంచీకరణ ప్రభావాన్ని ఈ పరిశోధన లో పరిశీలించాను.

పరిశోధన విషయ వివరణ కోసం నా పరిశోధన గ్రంథాన్ని ఏడు అధ్యాయాలుగా విభజించాను.

మొదటి అధ్యాయంలో ప్రపంచీకరణను పరిచయం చేస్తూ పాశ్చాత్య, దేశీయ నిర్వచనాలు, ప్రపంచీకరణ ప్రారంభం, ప్రపంచీకరణ –భారతదేశం, ప్రపంచీకరణ ముఖ్య లక్షణాలు అనే అంశాలను ప్రపంచీకరణ పై సాహిత్యకారుల మధ్య గల భిన్నమైన దృక్పథాలను వివరించాను.

రెండవ అధ్యాయం ప్రపంచీకరణ తెలుగు సాహిత్యం అనే అంశంలో ప్రపంచీకరణ కవిత్వం, ప్రపంచీకరణకథ, ప్రపంచీకరణ పాట, ప్రపంచీకరణ నాటకం, ప్రపంచీకరణనవల అంశాలను క్లుప్తంగా చర్చించాను.

మూడవ అధ్యాయం ‘ఆర్థిక రంగం – ప్రపంచీకరణ ప్రభావ నవలలు’ గురించి కూలంకషంగా చర్చించాను. అందులో భాగంగా ఆయా నవలల్లో కనిపిస్తున్న ప్రపంచీకరణ వ్యతిరేక విధానాలను వివరించాను. ఆక్రమంలో బహుళజాతి సంస్థలు, వ్యవసాయ విధానాలను వివరించాను. అందులో బహుళజాతి సంస్థలు, వ్యవసాయం, పారిశ్రామికరంగం, విద్య, వైద్యరంగం, ప్రసార సాధనాలు, అంతర్జాతీయ వాణిజ్యం, దేశీయ వాణిజ్యం, పేటెంట్ హక్కులు మొదలైన అంశాల గురించి సవివరంగా పరిశోధించాను.

నాల్గవ అధ్యాయం ‘రాజకీయ రంగం – ప్రపంచీకరణ ప్రభావ నవలలు’, ఈ విభాగంలో ప్రపంచ రాజకీయాలు, మొదటి ప్రపంచదేశాలు, రెండవ ప్రపంచదేశాలు, మూడవ ప్రపంచదేశాలు, దేశసార్వభౌమాధికారం, ప్రాథమికహక్కులు, చట్టాలు – న్యాయవ్యవస్థ, ప్రపంచీకరణ – యుద్ధాలు అనే అంశాలను ఈ విభాగంలో క్లుప్తంగా చర్చించాను.

ఐదవ అధ్యాయం ‘సామాజిక రంగం – ప్రపంచీకరణ ప్రభావ నవలలు’ ఈ విభాగంలో పర్యావరణ కాలుష్యం, నిరుద్యోగం, కర్షకులు, కార్మికులు, విదేశీ వలస, వస్తువ్యామోహం, వివాహ వ్యవస్థ, మానవ సంబంధాలు, అవినీతి, చేతివృత్తులు, కులవృత్తులు, జీవవైవిధ్యం మొదలైన అంశాలను పరిశోధనాంశానికి ఆయువుపట్టుగా సమగ్రంగా, విమర్శనాత్మకంగా వివరించాను.

ఆరవ అధ్యాయం సాంస్కృతిక రంగం – ప్రపంచీకరణ ప్రభావ నవలలు ఈ విభాగంలో పండుగలు, ఉత్సవాలు, కళలు, క్రీడలు, ఆహారపు అలవాట్లు, దుస్తులు, స్థానిక భాషాసాహిత్యాలు మొదలైన అంశాలను వివరించాను.

ఏడవ అధ్యాయంగా 'ప్రపంచీకరణ ప్రభావ నవలలు – ఇతివృత్తాలు' అనే అంశంలో నా పరిశోధనకు స్వీకరించిన ప్రపంచీకరణ ప్రభావ నవలలు డాలర్‌కోడలు, డాలర్‌డాలర్, తమసోమా, జీవన్మృతులు, వెన్నెల్లో గోదావరి, పడగనీడ, కాంచనమృగం, బతుకుతాడు నవలల్లోని ఇతివృత్తాలను క్లుప్తంగా వివరించాను.

చివరగా ముగింపులో ప్రపంచీకరణ ప్రభావానికిలోనైన అంశాలను క్లుప్తంగా వివరించే ప్రయత్నం చేశాను.

ఆధార గ్రంథసూచిలో నా పరిశోధన గ్రంథానికి ఉపకరించిన గ్రంథాలను అకారాది క్రమంలో ఇచ్చాను.

ఈ మొత్తం పరిశోధనలో సాధ్యమైనంత వరకు శాస్త్రీయతను, సహేతుకతను పాటించానని భావిస్తున్నాను.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| కృతజ్ఞతలు | | I |
| ముందుమాట | | IV |
| **ప్రపంచీకరణ ప్రభావ నవలలు – పరిశీలన** | | **01** |
| 1 | ప్రపంచీకరణ పరిచయం | 01 |
| 1.1 | పాశ్చాత్యుల నిర్వచనాలు | 02 |
| 1.2 | దేశీయ నిర్వచనాలు | 03 |
| 1.3 | ప్రపంచీకరణ ప్రారంభం | 04 |
| 1.4 | ప్రపంచీకరణ – భారతదేశం | 10 |
| 1.4.1 | మొదటి దశ (1947 – 75) | 10 |
| 1.4.2 | రెండవ దశ (1977 – 91) | 11 |
| 1.4.3 | మూడవ దశ (1991 తర్వాత) | 12 |
| 1.5 | ప్రపంచీకరణ ముఖ్యలక్షణాలు | 14 |
| **2** | **ప్రపంచీకరణ – తెలుగు సాహిత్యం** | **16** |
| 2.1 | ప్రపంచీకరణ –కవిత్వం | 19 |
| 2.2 | ప్రపంచీకరణ –తెలుగు కథ | 20 |
| 2.3 | ప్రపంచీకరణ –పాట | 26 |
| 2.4 | ప్రపంచీకరణ – నాటకం | 34 |
| 2.5 | ప్రపంచీకరణ – తెలుగు నవల | 35 |
| **3** | **ఆర్థిక రంగం – ప్రపంచీకరణ ప్రభావ నవలలు** | **41** |
| 3.1 | బహుళజాతి సంస్థలు | 41 |
| 3.2 | వ్యవసాయం | 45 |
| 3.3 | పారిశ్రామిక రంగం | 49 |
| 3.3.1 | చిన్నపరిశ్రమలులేదాకుటీరపరిశ్రమలు | 53 |
| 3.4. | విద్య | 53 |

| | | |
|---|---|---|
| 3.4.1 | కార్పొరేట్ విద్యా వ్యాపారం | 57 |
| 3.4.2 | ప్రచారం | 59 |
| 3.4.3 | పిల్లలపై తీవ్ర వత్తిడి స్వేచ్ఛను హరించడం | 61 |
| 3.5. | వైద్య రంగం | 63 |
| 3.6. | ప్రసార సాధనాలు | 68 |
| 3.7. | అంతర్జాతీయ వాణిజ్యం | 74 |
| 3.8. | దేశీయ వాణిజ్యం | 76 |
| 3.9. | పేటెంట్ హక్కులు | 77 |
| **4** | **రాజకీయ రంగం – ప్రపంచీకరణ ప్రభావ నవలలు** | **81** |
| 4.1 | ప్రపంచ రాజకీయాలు | 81 |
| 4.1.1 | మొదటి ప్రపంచ దేశాలు | 81 |
| 4.1.2 | రెండవ ప్రపంచ దేశాలు | 82 |
| 4.1.3 | మూడవ ప్రపంచదేశాలు | 83 |
| 4.2 | దేశ రాజకీయ పరిస్థితులు – ప్రభుత్వం | 84 |
| 4.2.1 | దేశ సార్వభౌమాధికారం | 86 |
| 4.3 | ప్రాథమిక హక్కులు | 88 |
| 4.4 | చట్టాలు న్యాయ వ్యవస్థ | 89 |
| 4.5 | ప్రపంచీకరణ యుద్ధాలు | 91 |
| **5** | **సామాజిక రంగం – ప్రపంచీకరణ ప్రభావ నవలలు** | **95** |
| 5.1 | పర్యావరణం – కాలుష్యం | 95 |
| 5.2 | నిరుద్యోగం | 99 |
| 5.3 | కర్షకులు | 102 |
| 5.4 | కార్మికులు | 106 |
| 5.5 | విదేశీ వలస | 108 |
| 5.6 | వస్తువ్యామోహం | 110 |
| 5.7 | వివాహ వ్యవస్థ | 112 |
| 5.8 | మానవ సంబంధాలు | 114 |

5.8.1 కుటుంబ సంబంధాలు 115
5.8.1.1 తల్లిదండ్రులకు పిల్లలకు గల సంబంధం 117
5.8.1.1.1తల్లిదండ్రులు పిల్లలపై చూపే అత్యుత్సాహం 117
5.8.1.1.2 తల్లిదండ్రులు పిల్లలపై చూపే బాధ్యతా రాహిత్యం 118
5.8.1.2 భార్యాభర్తల మధ్య సంబంధం 119
5.9 అవినీతి 120
5.10 చేతి(కుల) వృత్తులు 122
5.11 జీవవైవిధ్యం 127
5.11.1 భారతదేశం – జీవవైవిధ్యం 128

**6 సాంస్కృతిక రంగం – ప్రపంచీకరణ ప్రభావ నవలలు 131**

6.1 నిర్వచనాలు 131
6.2 పండుగలు – ఉత్సవాలు 134
6.3 కళలు 141
6.4 క్రీడలు 145
6.5 ఆహారపు అలవాట్లు – దుస్తులు 147
6.6 స్థానిక భాషా సాహిత్యాలు 150

**7 ప్రపంచీకరణ ప్రభావ నవలలు – ఇతివృత్తాలు 153**

7.1 డాలర్....డాలర్ 153
7.2 డాలర్ కోడలు 160
7.3 కాంచన మృగం 166
7.4 తమసోమా 171
7.5 జీవన్మృతులు 175
7.6 పడగనీడ 182
7.7 వెన్నెల్లో గోదావరి 190
7.8 బతుకు తాడు 195
ముగింపు 199
ఉపయుక్తగ్రంథ సూచిక 204

# అధ్యాయం – 1

# ప్రపంచీకరణ పరిచయం

ప్రపంచీరణ నేడు విస్తృతంగా చర్చించబడుతున్న అంశం. గ్లోబలైజేషన్(Globalization) అని ఆంగ్లంలో వ్యవహరిస్తున్న పదానికి తెలుగులో ప్రపంచీకరణ అను పేరుతో సూచిస్తున్నారు. గ్లోబలైజేషన్ అనే పదానికి తెలుగులో గ్లోబలీకరణ, భౌమీకరణ, భౌగోళీకరణ, విశ్వీకరణ అనే పర్యాయ పదాలు ఉన్నాయి. అయితే 'ప్రపంచీకరణ' అన్న పదమే గ్లోబలైజేషన్‌కు తెలుగులో సమానార్థకంగా ఉపయోగిస్తున్నాం.

ప్రపంచీకరణ అనే పదం సాంఘికశాస్త్రాల్లో 1960 లోనే ఉపయోగించబడినప్పటికీ ఆర్థికవేత్తలచే 1980 నుండి ఉపయోగించబడుతుంది. ఏది ఎలా ఉన్నప్పటికీ 1980 మరియు 1990ల చివరి సగం వరకు దీని విధానాలు ప్రసిద్ధి చెందలేదు. ప్రపంచీకరణ గురించి ముందుగా రచించబద్ద సిద్ధాంత పరమైన విధానాలు మంత్రిగా మారిన ఒక అమెరికన్ వ్యాపారవేత్త అయిన చార్లెస్ తేజ్‌రుస్సేల్‌చే లిఖించబడ్డాయి. 1987లో ఇతను 'వాణిజ్య భూతాలు' అనే పదాన్ని ప్రవేశ పెట్టాడు.

ప్రపంచీకరణ అనేది సాహిత్యపరంగా చూస్తే స్థానిక లేదా ప్రాంతీయ విషయాలను ప్రపంచ విషయాలుగా మార్చేసే ప్రక్రియ. ప్రపంచంలో ప్రజలందరినీ ఏకం చేసి ఒకే సమాజంగా కలిసికట్టుగా పనిచేసేటట్టు చూసే ఒక పద్ధతిగా దీన్ని చెప్పవచ్చు.

బ్రిటీషు లేబర్ పార్టీ సిద్ధాంతవేత్త అంటోనిగిడెన్స్ 'ఆధునికత పర్యవసానాలు' అనే తన పుస్తకంలో ప్రపంచీకరణ అనే పదాన్ని నిర్వచించప్రయత్నించాడు. ప్రపంచదేశాల మధ్య సన్నిహితమవుతున్న, విస్తరిస్తున్న సామాజిక సంబంధాలు, వాటిసాంద్రీకరణ పర్యవసానంగా మారుమూల ప్రాంతాలుకూడా ప్రభావితం కావడాన్ని గిడెన్స్ ప్రపంచీకరణగా నిర్వచించాడు.

అయితే ప్రపంచీకరణ గురించి రకరకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అనేక మంది ప్రముఖులు దీన్ని నిర్వచించే ప్రయత్నం చేశారు. ప్రపంచీకరణ నిర్వచించిన వారిలో అనేక మంది పాశ్చాత్య, దేశీయ ప్రముఖులు, రచయితలు, రచయిత్రులు ఉన్నారు.

## పాశ్చాత్యుల నిర్వచనాలు:

1. The compression of the world and the intensification of Consciousness of the world as a whole ..........Concrete global inter dependence and consciousness of the global whole in Twentieth century (R. Robert : 1992; page – 8)

2. "A Social Process in which the Constraints of geography on Social and Cultural arrangement recede and in which people become increasingly aware that they are receding" (M.Waters : 1995 ; page –3)

3. Integration on the basis of a Project pursuing "Market rule on a global scale" (P. Mc Donald : 2000 ; P.XXIII Page –149)

4. The Historical transformation Constituted by the Sum of particular forms and instances of .......(Making or being Made global)

(i)By the active dissemination of practices, Values, technology and other human products throughout the globe.

(ii) When the globe serves as a focus for, or a premise in shaping, human activities (M. Albert : 1996 ; page –8)

5. As experienced from below, the dominant from of globalization means a historical transformation: In the economy, of livelihoods and modes of existence; in politics, a loss in the degree of control exercised locally.... and in culture, a devaluation of collectivity's achievements..... Globalization of market power......(It) is a domain of knowledge.....(J.H.Mittelman, The Globalization syndrome, 2000,p.6)

పై విధంగా 'Globalization' అనే పదాన్ని పలురకాలుగా నిర్వచించారు పాశ్చాత్యులు.

తెలుగులో గ్లోబలైజేషన్ అను పదాన్ని నిఘంటువుల్లో ప్రాచీనకాలంలో గానీ, ఆధునిక కాలంలో గానీ వాడలేదు. అయితే 1990 తర్వాత వచ్చినటువంటి కొన్ని నిఘంటువుల్లో ఈ 'ప్రపంచీకరణ' అనే పదం కన్పిస్తుంది అయితే 'ప్రపంచీకరణ' అను పదానికి రాజకీయ పదాల డిక్షనరీలో ఈ కింది అర్థాన్నిచ్చారు.

**ప్రపంచీకరణ:** ఏ విషయమైనా ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి తన ప్రభావాన్ని చూపితే దాన్ని ప్రపంచీకరణ అనడం వాడుక ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రపంచీకరణ అంటే అనేక అర్థాలున్నాయి.

"ప్రపంచంలో ఒక మూల నుంచి ఇంకోమూలకి సరుకులు, వనరులు ఎటువంటి ఆంక్షలు లేకుండా తరలించడం. ఈ తరలింపు అంతర్జాతీయ వర్తక రూపంలో అనేక దేశాల్లో విస్తరించినప్పుడే 'బహుళజాతి' సంస్థల రూపంలో జరుగుతుంది." (బాపూజీ, బి.ఆర్; 2002: పుట– 78)

అయితే ఆర్థిక నిఘంటువుల్లో మాదిరిగా తెలుగులో ప్రపంచీకరణను ఎప్పటి నుంచి వాడుతున్నది ఖచ్చితంగా చెప్పలేదు. ప్రపంచీకరణ ప్రారంభం, దాని విధానాలు ఎక్కడ ఏ తెలుగు నిఘంటువుల్లో చెప్పలేదు. ఆర్థిక సరళీకృత విధానాలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రసారసాధనాల ద్వారా 'ప్రపంచీకరణ' అనే పదం వాడుకలోకి వచ్చింది.

## 1.2 దేశీయ నిర్వచనాలు

1. "ఒక ఆర్థిక వ్యవస్థను ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం చేయడమే ప్రపంచీకరణ. ప్రపంచాన్ని ఏకైక అంతర్జాతీయ మార్కెట్‌గా మార్చడమే ప్రపంచీకరణ లక్ష్యం. (డా. సాయిబాబ, పి.సి: 2003; పుట – 57)
2. "ఉత్పత్తి కారకాలకు ప్రపంచ వ్యాప్తంగా సంపూర్ణమైన గమనశీలతను ఏర్పరచడమే "ప్రపంచీకరణ" (అదే పుట)
3. "దేశాల యొక్క జాతీయ ఆర్థిక వ్యవస్థలను, మార్కెట్లను ప్రపంచ ప్రాతిపదికన ఏకీకరణ చేయడమే ప్రపంచీకరణ. (డా. కనకదుర్గ, జె : 2004 ; పుట – 132)
4. "గ్లోబలైజేషన్ అంటే విశ్వస్వేచ్ఛావ్యాపారం" (రాజీవ్ దీక్షిత్ : 2003 ; పుట–4)

5. "ప్రపంచీకరణ అనేది కేవలం ఒక ఆర్థికపరమైన ఏర్పాటు మాత్రమేకాదు మార్కెట్ అనుసంధానం మాత్రమే కాదు. అది ఆధునిక ప్రజాస్వామ్యం, మానవహక్కులు, శాస్త్రసాంకేతిక విప్లవాల విస్తృత భూమిక మీద జరుగుతున్న ఒక విలక్షణ ప్రక్రియ." (భాస్కరం, కల్లూరి: 2006;పుట – 4)

6. "ప్రపంచంలో అన్ని మార్కెట్లనూ గ్లోబల్ మార్కెట్ అనుసంధానం చేస్తుంది. అన్ని సంస్కృతుల్ని గ్లోబల్ సంస్కృతులుగా అనుసంధానం చేయడం జరుగుతుంది. అనుసంధానం గ్లోబలైజేషన్‌లో ప్రధానమైన ఫీచర్" (శ్రీనివాస్, కె : 2002; పుట – 47)

7. "తమ ప్రయోజనాలకు అనుగుణంగా వర్ధమాన దేశాల ఆర్థిక, రాజకీయ విధానాన్ని రూపొందించడానికి సంపన్న దేశాలు అనుసరిస్తున్న వ్యూహమే గ్లోబలైజేషన్".

( గుడిపాటి : 2002 ; పుట –13)

8. "ప్రపంచీకరణ అంటే పెట్టుబడులు, టెక్నాలజీ, ప్రజలు, సంస్కృతి, సంపద మొదలైనవన్నీ దేశాల ఎల్లలు దాటి వ్యాపించడం లేదా ప్రవహించడం." (కుసుమ కుమారి, పి : 2004 ; పుట– 97)

9. "విస్తృతార్థంలో ప్రపంచీకరణ అంటే దేశాల మధ్య స్వేచ్ఛా వ్యాపారం, పెట్టుబడి, సేవలు ఎటువంటి ఆంక్షలు, ఆటంకాలు లేకుండా దేశసరిహద్దులు దాటి స్వేచ్ఛగా నిర్నిబంధనలతో ప్రవహించే వెసులుబాటు". (నరసింహరెడ్డి. ఎ : 2002 ; పుట – 261)

10. ప్రపంచ దేశాల్లోని మానవ జాతుల్ని ఒక జాతిగా, ఒక దేశంగా ఒకే ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ఛత్రం క్రింద కలిసి జీవించే పద్ధతిని ప్రపంచీకరణ అనవచ్చు. (రవికుమార్, మేడిపల్లి: 2003; పుట - 119) పై నిర్వచనాలన్నింటిని పరిశీలించీ ప్రపంచమంతా సామాజిక ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో ఏకరూపత కలిగి ఉండటం ప్రపంచీకరణగా చెప్పవచ్చు.

పై నిర్వచనాలన్నింటిని పరిశీలించి ప్రపంచమంతా ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఏకరూపత కలిగి ఉండటం ప్రపంచీకరణగా చెప్పవచ్చు.

## 1.3 ప్రపంచీకరణ – ప్రారంభం

1994 జూలైలో బ్రెట్టన్ ఉడ్‌లో ఒక సమావేశం జరిగింది. ఆ సమావేశంలోనే రెండు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ఆవిర్భవించాయి. మొదటిది అంతర్జాతీయ ద్రవ్యనిధి. రెండోది

ప్రపంచబ్యాంక్. వివిధ దేశాల్లోని ద్రవ్యసంబంధమైన పరిస్థితుల్ని స్థిరీకరించడంలో సహాయపడటానికి అంతర్జాతీయద్రవ్యనిధిని, యుద్ధానంతర పునర్నిర్మాణానికి కావలసిన వనరులను సమకూర్చడానికి ప్రపంచబ్యాంక్‌ను స్థాపించడం జరిగింది. ప్రపంచ బ్యాంక్ అసలు పేరు అంతర్జాతీయ పునర్నిర్మాణ అభివృద్ధి బ్యాంక్. అప్పటికి వర్ధమానదేశాల్లోని చాలా దేశాలు వలస పాలనలోనే ఉన్నాయి.

ప్రపంచ వాణిజ్యాన్ని విస్తరించడానికి వివిధ దేశాల మధ్య వాణిజ్య అవరోధాలను తొలగించడానికి గాట్ (జనరల్ అగ్రిమెంట్ టారిఫ్ అండ్ ట్రేడ్) అనే సంస్థను స్విట్జర్లాండ్ దేశంలోని జెనీవా అనే నగరంలో 1947లో స్థాపించారు. దీనికి ముందు 1940 నుంచి అంతర్జాతీయ వాణిజ్య సంస్థ(ఐ.టి.ఓ) ఏర్పడింది. ఇది ఐక్యరాజ్యసమితి రక్షణ కింద ఉండేది. అంతర్జాతీయ వాణిజ్యం, ఉద్యోగనియమాలు, వ్యాపార లావాదేవీలు వంటి అంశాలు దీని పరిధిలోకి వచ్చేవి. అయితే అమెరికా వ్యాపార వర్గాలు ఒత్తిడి తీసుకురావడంతో అమెరికా సెనేట్ అంతర్జాతీయ వాణిజ్య సంస్థను రద్దుచేయించగలిగింది. దాని స్థానంలోనే గాట్ 1947లో ఏర్పడింది. అయితే “గాట్ సంస్థకు ప్రజాస్వామ్య నిర్మాణం ఉన్నట్లు కన్పిస్తుంది. అంటే ప్రతీదేశానికి ఒక ఓటు హక్కు ఉంటుంది. కానీ గాట్‌కు ప్రజాస్వామ్య నిర్మాణమున్నట్లు పైకి కన్పించినా గాట్‌లో జరిగే సంభాషణల్ని ప్రభావితం చేసే నిజమైన అధికార సంబంధాల్ని ఆ సంస్థ మరుగు పరుస్తుంది. గాట్ సంబంధాలన్నీ ప్రధానంగా మూడు వాణిజ్య భాగస్వాముల మధ్యే జరిగాయి. అవి అమెరికా, యూరోపియన్‌యూనియన్, జపాన్ దేశాలు. గాట్ సంభాషణల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల భావాలకు అభిప్రాయాలకు ఏ మాత్రం విలువలేదు చోటులేదు. ప్రపంచ వాణిజ్యరంగంలో సింహభాగం చేజిక్కించుకోవడానికి ధనికదేశాలకు గాట్ సంస్థ ఒక ఆయుధంగా ఉపయోగపడింది” (చౌదరి, కె.ఆర్ : 2011 ; పుట 21– 22) అంటే గాట్ సంస్థ కేవలం మూడు వాణిజ్య భాగస్వాముల నిర్ణయం ప్రకారం నడుచుకుంటుంది.

అమెరికా గాట్ సంస్థ సభ్యుల్లో మిక్కిలి బలియమైన దేశంగానే గాక ఇతర సభ్యదేశాలకు నాయకత్వం వహించే విధంగా తయారయింది. అమెరికా అప్పుడప్పుడు వివిధ అంశాలపైన సంభాషణలు జరపడానికి సూచనలిచ్చింది. ఇవన్నీ కూడా తన ప్రయోజనాలను పెంపొందించు కోవడానికే. గాట్ స్థానంలో ప్రపంచ వాణిజ్యసంస్థ ఏర్పడే వరకు 11సార్లు వివిధ అంశాలపై చర్చలు జరిగాయి. ముఖ్యంగా 1982లో జరిగిన 8వ దఫ చర్చల్లో అమెరికా కొన్ని కొత్త అంశాలను అజెండాలో చేర్పించడానికి సూచనలు చేసింది. కానీ ఈ సూచనలను అభివృద్ధిచెందిన,

అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా తీవ్రంగా వ్యతిరేకించాయి. ముఖ్యంగా మేధో సంపత్తి హక్కులు, వ్యవసాయం, సేవారంగం వీటిని అజెండాలో చేర్పించడానికి ఈ దేశాలు వ్యతిరేకత, నిరసన తెలిపాయి. వీటన్నింటికి అమెరికా తన ఆర్థికప్రయోజనాలను నేరవేర్చడానికి ఉద్దేశించినవే. "ఆ క్లిష్టమైన సందర్భంలో అమెరికాలో ఆర్థికమాంద్యం, నిరుద్యోగం ప్రబలి పోయింది. ప్రజల జీవన ప్రమాణాలు చితికిపోయాయి. దాని ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడింది. ఈ క్లిష్టపరిస్థితి నుండి బయట పడటానికి అమెరికా ఈ అంశాలపై పట్టుపట్టింది" (చౌదరి, కె.ఆర్: 2011; పుట – 22) అయితే ఈ అంశాలను మొదట్లో అన్ని సభ్యదేశాలు వ్యతిరేకించి నప్పటికీ తరువాత అమెరికా ఆదేశాలకు తలవంచక తప్పలేదు. 1986లో పై అంశాలను ఈ అజెండాలో చేర్పించడానికి ఆదేశాలు ఆమోదం తెలిపాయి.

ఈ అంశాలపైన 1986 నుండి చర్చలు ప్రారంభమై అవి 1989 వరకు కొనసాగాయి. భారతదేశంతో సహా అనేక దేశాలు అమెరికా ప్రతిపాదనల్ని వ్యతిరేకించాయి. అయితే వీటిపట్ల ఏకాభిప్రాయం కలిగించి ఒక నివేదిక తయారు చేయమని అప్పటి గాట్‌సంస్థ డైరెక్టర్ జనరల్ అయిన డంకెల్‌ను కోరింది అమెరికా. డంకెల్ ఎవరి అభిప్రాయాలను ఖాతరు చేయకుండా తన నివేదికను, ప్రతిపాదనల్ని1989లో సమర్పించారు.

1989 నుండి 1994 వరకు డంకెల్ ప్రతిపాదనలపై చర్చలు కొనసాగాయి. భారత దేశంతో సహా అనేక దేశాలు మొదట్లో డంకెల్ ప్రతిపాదనల్ని వ్యతిరేకించాయి. అమెరికా ఒత్తిడికి, బెదిరింపులకు తట్టుకోలేక తరువాత డంకెల్ ప్రతిపాదనల్ని వ్యతిరేకించడంలో నాయకత్వం వహించమని ఇతర దేశాలు భారత్‌ను కోరాయి. భారతదేశంలో కూడా దాదాపు 250 మంది పార్లమెంట్‌సభ్యులు, మేధావులు, న్యాయనిపుణులు వివిధ ప్రజాసంఘాలు డంకెల్ ప్రతిపాదనల్ని ఆమోదించవద్దని ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించాయి. అయితే అమెరికా లాంటి ధనిక దేశాల ఒత్తిడికి తలొగ్గిన భారత్ పార్లమెంట్ ఆమోదం లేకుండానే డంకెల్ ప్రతిపాదనలపై సంతకం పెట్టింది.

1994 సంవత్సరం డిసెంబర్‌లో దాదాపు 120 దేశాలు డంకెల్ ప్రతిపాదనల ఒప్పందాల పై సంతకం చేశాయి. కొన్ని పేదదేశాలు మాత్రం సంతకం చేయలేదు. మొరాకో దేశంలోని మారకేషన్స్ అనే నగరంలో ఈ సంతకాల కార్యక్రమం జరిగింది. డంకెల్ సిఫారసులకు అనుగుణంగా 1995 జనవరిలో ప్రపంచ వాణిజ్యసంస్థ (డబ్ల్యూ.టీ.ఓ) స్థాపించబడింది.

స్విట్జర్‌లాండ్‌లోని జెనీవాలో దీన్ని స్థాపించారు. 1982 నుండి1994 వరకు జరిగిన పోరాటంలో అంతిమంగా అమెరికాదే పైచేయి అయింది. దీని ఏర్పాటుతోనే ఉదారవాద ఆర్థిక సంస్కరణలు అమలులోకి రావడం జరిగింది. వివిధ దేశాల మధ్య స్వేచ్ఛావాణిజ్యం ఏర్పడింది. దాన్నే నేడు అందరూ ప్రపంచీకరణ (GLOBALIZATION) గా పేర్కొంటున్నారు. అయితే ప్రపంచీకరణ ప్రాచీనకాలం నుంచే ఉన్నదని ఇది విడతల వారిగా అమలు జరుగుతున్నదని చాలామంది పేర్కొంటున్నారు. ప్రాచీనకాలం నుంచి విడతల వారిగా అమలు జరుగుతున్న ప్రపంచీకరణ విధానాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలి.

"ప్రపంచ చరిత్రలో ఆహార సేకరణ దశ తాలూకు వలస ప్రస్థానాలు ప్రారంభమైనప్పటి నుండి గ్లోబలైజేషన్ చరిత్ర ప్రారంభమైంది. బౌద్ధం ఆహారసేకరణ దశ నుండి స్థిర జీవితానికి పౌరసమాజాన్ని తీర్చిదిద్దడంలో మహోన్నత  పాత్రను నిర్వహించింది. ఈ క్రమంలో బహుజన హితాయ, బహుజన సుఖాయ దృక్పథంతో ప్రపంచంలో మొట్ట మొదటిసారిగా వసుధైక కుటుంబ భావనతో గ్లోబలైజేషన్‌ను బౌద్ధం సిద్ధాంతీకరించింది. బుద్ధం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, అనేవి గ్లోబలైజేషన్ మూలసూత్రాలు. వీటితో పాటుగా క్రీస్తు క్రైస్తవం, మహమ్మద్ ప్రవక్త ఇస్లాం కూడా ప్రపంచీకరణగానే పేర్కొన్నారు." (రాములు, బి.యస్ : 2003 ; పుట – 21) ఇది మత పరమైనటువంటి భావన. అంటే మతాన్ని విశ్వవ్యాప్తం చేయడం. దీన్ని విశ్వవ్యాప్తీకరణగా పేర్కొంటున్నారు.

అనంతరం క్రీ.శ. 15 వశతాబ్ధం చివరలో జరిగినటువంటి అంశాలు కూడా ప్రపంచీకరణ విధానాలుగానే పేర్కొన్నారు. 1498 సంవత్సరం వాస్కోడిగామా ఇండియాదీవులను చేరడం, 1492లో క్రిష్టఫర్ కోలంబస్ పశ్చిమ ఇండియా దీవులను కనుగొనడం కూడా ప్రపంచీకరణగానే భావిస్తున్నారు. "భారతదేశం నుంచి వెళ్తూ వాస్కోడిగామా ఓడల్లో నింపుకొని తీసుకుపోయిన వ్యాపారవస్తువులు, ఆయన యాత్రకైన ఖర్చుకు అరవై రెట్ల ధనాన్ని చేకూర్చాయి. (వైకుంఠం, యల్లంపల్లి (సంపా) : 1992 ; పుట – 126) ఆనాటి నుండే తక్కువ పెట్టుబడితో ఎక్కువ రెట్లు ఆదాయం పొందడం అలవరుచుకున్నారు.

క్రీ.శ.16వ శతాబ్ధం నుంచే నయా ఉదారవాద ప్రపంచీకరణ సిద్ధాంతాలు పుట్టినట్లు మనకు తెలుస్తుంది. "నయా సాంప్రదాయక ఉదారవాదం లేక సాంప్రదాయ సరళీకరణ ఆర్థిక సిద్ధాంతాలు, అర్థశాస్త్రచరిత్రలో పదహారవ శతాబ్ధం నుండే అర్థశాస్త్రం పితామహులైన ఆడమ్‌స్మిత్ (1723–

90) రికార్డో(1772-1823) కాలంలో స్వేచ్ఛా వ్యాపారం (laissez -Faire) అనే పేరుతో ఒక ఆర్థిక విధానంగా చర్చించబడింది. దాని పునాదుల మీదనే సరళీకరణ సిద్ధాంతాలు పుట్టుకొచ్చాయి. ప్రజలు ఏ వ్యాపారం ఎంపిక చేసుకుంటారో దాన్ని ఏ అడ్డంకులు లేకుండా కొనసాగించుకోవడమే స్వేచ్ఛా వ్యాపార సిద్ధాంతం. ప్రభుత్వ పరంగా ఏవిధమైన జోక్యం లేకుండా పోటీ పడి వ్యాపార కార్యక్రమాలను కొనసాగించుకోవడం ఆ సిద్ధాంతకీలకాంశం" (మీరానందా : 2012 ; పుట -5) ఈవిధంగా స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతాలు 16 వశతాబ్దం నుంచే ఏర్పడి 18 వశతాబ్దం వరకు కొనసాగాయి.

అనంతరం 18 వశతాబ్దంలో వచ్చిన పారిశ్రామిక విప్లవం మరొక ప్రపంచీకరణకు దారితీసింది. ప్రధానంగా ఈ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవం రావడం, సాంకేతిక పరిజ్ఞానంతో ఇతర దేశాల కంటే యూరప్‌దేశాలు ముందుండటం మరో విడత ప్రపంచీకరణకు కారణం. ప్రధానంగా యూరోపియన్ దేశాలు ఇతర దేశాలను వలసలుగా మార్చుకున్నాయి. పారిశ్రామిక విప్లవం ఫలితంగా ప్రపంచదేశాల్లో రాజకీయ, సామాజిక, సాంస్కృతికంగా ముఖ్యంగా ఆర్థిక విషయాల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి.

పారిశ్రామిక విప్లవంతో అప్పటి వరకు ఉన్న సాంప్రదాయ శక్తివనరులు (మానవ, పశు) కాకుండా యంత్రాలను ఉపయోగించడం వలన వస్తు ఉత్పత్తి అధికమైంది. ఈ అధికోత్పత్తి భారీ వ్యాపారానికీ, విదేశీ మార్కెట్ల అన్వేషణకు దారితీసింది. ముఖ్యంగా పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకు స్వదేశంలో లభించక పోవడంతో ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంతోనే ధనిక దేశాలు ముడిసరుకు మార్కెట్లు తమ ఆధీనంలో ఉంచుకోవడం లాభదాయకం అని తలిచాయి. పారిశ్రామికంగా ముందున్న దేశాలు వెనుకబడ్డ దేశాల్లో వలసలను స్థాపించుకోవడానికి పూనుకున్నాయి.

పారిశ్రామిక విప్లవ ప్రభావం వలన అధిక ఉత్పత్తి సాధించి అది ప్రగతికి దోహద పడినప్పటికీ ఆ ఫలాలు కేవలం సంపన్నదేశాలకే పరిమితం కావడం జరిగింది.ఒక వైపు దీని వలన సాంప్రదాయంగా వస్తున్న వృత్తి, కుటీర, హస్తపరిశ్రమలు దెబ్బతిన్నాయి. అప్పటివరకు తమ వృత్తులతో జీవించిన కార్మికులు యంత్రగారాల్లో వేతనాల కోసం మరొకరి చేతి కింద మామూలు కార్మికుల మాదిరిగా పనిచేయాల్సి వచ్చింది. పరిశ్రమలు స్థాపించిన చోట కార్మికులు పెద్దసంఖ్యలో చేరారు. పరిశ్రమలు తక్కువై కార్మికులు ఎక్కువ కావడం వలన కూలీ రేట్లు తగ్గిపోయాయి.

యంత్రాల వలన చేతి వృత్తులకు ఆధారణ తగ్గి నిరుద్యోగం పెరిగిపోయింది. భారీ పరిశ్రమల్లో తయారైన ఉత్తత్తులు భారీ వ్యాపారానికీ, వలస విధానానికీ దారితీయడం, తరువాత అది సామ్రాజ్యవాదంగా రూపొందడం జరిగింది. సామ్రాజ్యవాదం 19వ శతాబ్ధం మధ్యకాలంలో ఏర్పడింది. 1870 తరువాత కాలం సామ్రాజ్యవాద యుగంగా వెలుగులోకి వచ్చింది. పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ సామ్రాజ్యవాదమని లెనిన్ నిర్వచించాడు.

"పెట్టుబడిదారీ విధానం తెచ్చిపెట్టిన అత్యంత తీవ్రసమస్య సామ్రాజ్యవాదం. సామ్రాజ్యవాదం అంటే యాదృచ్ఛికంగా కొన్ని దేశాలు అవలంబించిన ఒకానొక రాజకీయ విధానం కాదని, పెట్టుబడిదారీ తన అభివృద్ధిని పురస్కరించుకొని ఆ దశకు చేరుకున్నదని లెనిన్ రష్యాలో విప్లవం జరగక ముందే రుజువు చేస్తూ సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ" అనే గ్రంథం రచించాడు. (కొడవటిగంటి కుటుంబారావు : పుట – 9)

19శతాబ్ధంలో గ్రేట్ బ్రిటన్ తొలుత స్వేచ్ఛా వాణిజ్య విధానానికి పట్టం కట్టింది. దీని ఆధారంగా ఆర్థిక ఉదారవాదం తలెత్తింది. ఈ ఆర్థిక ఉదారవాదానికి 1776లో ఆడంస్మిత్ రాసిన 'Wealth of Nations' అనుగ్రంథం పెట్టుబడి దారీ విధానానికి బైబిల్ గా గుర్తించబడింది. "నూతన ఆర్థికవ్యవస్థ ప్రాథమిక సూత్రాలను "Wealth of Nations" పుస్తకం విశదీకరించింది. స్వేచ్ఛావాణిజ్యం ద్వారానే దేశాల సంపద పెరుగుతుందని ఆడంస్మిత్ వాదించాడు. ఆర్థిక కార్యకాలపాలలో రాజ్య ప్రమేయం ఉండకూడదని ఆయన గట్టిగా వాదించాడు." (అమానుల్లాఖాన్ : 2011; పుట –7) ప్రభుత్వ ప్రమేయం లేని స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతం ఆర్థిక ఉదారవాదానికి ప్రాణం. వస్తువుల ఉత్పత్తుల విధానంలో ప్రభుత్వజోక్యం ఉండరాదనీ, వ్యాపారపు ఎగుమతి దిగిమతులపై ప్రభుత్వ పన్నులు విధించరాదనీ, వ్యక్తుల మధ్య స్వేచ్ఛాయుతమైన ఒప్పందాలు ఉండాలని ఈ ఆర్థిక ఉదారవాదులు ప్రచారం చేశారు. ఆర్థిక అభివృద్ధికి వ్యక్తిగత శక్తి సామార్థ్యాలు, స్వార్థచింతనలు ఆధారభూతాలని వీరు ప్రచారం చేశారు. స్వేచ్ఛా వ్యాపార విధానాలు బ్రిటన్ తో పాటు ఇతర ఐరోపా దేశాలు కూడా అనుసరించాయి. (వైకుంఠం, యల్లంపల్లి,(సం,పా) : 1992 ; పుట –135)

ప్రస్తుతం అమలవుతున్న ప్రపంచీకరణ విధానాలు కూడా పారిశ్రామిక విప్లవ కాలంలో బ్రిటన్ అవలంబించిన స్వేచ్ఛా వాణిజ్యం, ఆర్థిక ఉదారవిధానాలకు దగ్గరగా ఉన్నాయి. నేడు విస్తృతమైన సాంకేతిక పరిజ్ఞానం వలన యంత్రాలు రావడంతో కొంత అభివృద్ధి ఉన్నప్పటికీ

నిరుద్యోగం అధికంగా పెరిగింది. వ్యవసాయం దెబ్బతిన్నది. పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రభుత్వ ప్రమేయం తగ్గి ప్రైవేట్ రంగం విస్తరిస్తున్నది. సంక్షేమ పథకాలు కుంటుబడుతున్నాయి. ప్రభుత్వ ఆధీనంలోని అనేక సంస్థలు ప్రైవేట్ వ్యక్తుల చేతిలోకి వెళ్ళిపోతున్నాయి.

ప్రంపచీకరణ నుంచి నేడు అన్ని దేశాలు కొంత లాభాన్ని కూడా పొందడం కనబడుతుంది. కొన్ని దేశాల విజయానికి ప్రపంచీకరణే ప్రధాన కారణం. "తూర్పు ఆసియా విజయాలకు ప్రపంచీకరణే పునాది. ముఖ్యంగా వాణిజ్యానికి అవకాశాలు పెరగటం, మార్కెట్లు, టెక్నాలజీ అందుబాటులోకి రావడం దీనికి కారణాలు. ప్రపంచీకరణ ఆరోగ్యాన్ని పెంచింది. మరింత ప్రజాస్వామ్యం కోసం, సామాజిక న్యాయం కోసం పోరాడే పౌరసమాజాన్ని అభివృద్ధి చేసింది. సమస్య ప్రపంచీకరణతో కాదు. దాన్ని అమలు చేసే పద్ధతిలోనే ఉంది." (స్టిగ్లిజ్, జోసెఫ్ : 2003 ; పుట–85)

పై అంశాలన్నింటిని పరిశీలించినట్లైతే పారిశ్రామిక విప్లవం తర్వాత బ్రిటన్ అనుసరించిన ఉదారవాద ఆర్థిక సంస్కరణలు ఎటువంటి ఫలితాలు చూపాయో నేటి ప్రపంచీకరణ కూడా అటువంటి ఫలితాలను చూపిస్తుంది అనడంలో సందేహంలేదు. అయితే నాటి బ్రిటన్ విధానాలను నేడు 'ప్రపంచీకరణ' పేరుతో అమెరికా ఉదారవాద విధానాలను నిర్వహిస్తున్నది. అయితే నాటి, నేటి పరిస్థితులకు సాంకేతిక, ఆరోగ్య, పౌరజీవన విధానాల్లో కొంత మెరుగు కనిపిస్తుంది. మొత్తానికి ప్రపంచీకరణ వలన అభివృద్ధి చెందిన దేశాలు మరింత అభివృద్ధికి చేరుతున్నాయి. వర్థమాన, పేద దేశాల్లో పెద్దగా అభివృద్ధి కనబడుటలేదు. ఈ తారతమ్యాలకు అనేక అంశాలు దోహదం చేస్తున్నాయి.

## 1.4 ప్రపంచీకరణ – భారతదేశం

ప్రపంచీకరణ భారతదేశంలోకి ఎప్పుడు ప్రవేశించింది? అందుకు దోహదం చేసిన పరిస్థితులేమిటి? అనేవి కూడా తెలుసుకోవాలి. స్వతంత్ర భారతదేశ ఆర్థిక వ్యవస్థను మూడు దశలుగా విభజించి చూడాలి. అవి.

1) మొదటి దశ (1947 –75వరకు)

2) రెండవ దశ(1977నుండి–1991వరకు)

3)మూడవ దశ(1992నుండి)

### 1.4.1. మొదటి దశ (1947–75)

స్వతంత్ర భారతదేశానికి మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. ముఖ్యంగా ఈ కాలంలో నెహ్రూ ప్రభుత్వం వ్యవస్థాపన సౌకర్యాలను మెరుగు పరచుకోవడంపై దృష్టిపెట్టింది. అవి 1). భారీపరిశ్రమల నిర్మాణం 2). గుణాత్మక విద్యను అందించే ఉన్నత విద్యాసంస్థలను నెలకొల్పడం 3). భూసంస్కరణలు. వీటి ద్వారా పారిశ్రామిక వ్యవస్థాపన సౌకర్యాలు ఏర్పడి దిగుమతుల మీద ఆధారపడే పరిస్థితి తొలుగుతుందని ఆర్థిక వ్యవస్థను ఉచ్ఛస్థితికి తీసుకువెళ్ళేందుకు అవసరమైన సాంకేతిక విజ్ఞానాన్ని శ్రామికులను అందించే మానవ వనరులు ఏర్పడతాయని గ్రామీణ ప్రాంతాల కౌలుదార్లకు, భూమిలేని వారికి దున్నేవానికే భూమిని కేటాయించడం లాంటి లక్ష్యాలు నెరవేరతాయని భావించారు. వీటిని సామ్యవాద తరహా కార్యక్రమాలుగా, నెహ్రూ విధానాలుగా చెప్పుకుంటున్నారు. అయితే ఈ విధానాల వలన కొన్ని మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందినప్పటికీ ఇవన్నీ కూడా పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉన్నాయనేటువంటి విమర్శ కూడా ఉంది. “ఆనాటి పెట్టుబడిదారీ వర్గాలకు వ్యతిరేకంగా గానీ, ప్రైవేట్ వ్యాపారాన్ని అణగదొక్కాలనిగానీ నెహ్రూ విధానాలు ప్రవేశపెట్టబడలేదు. వాస్తవానికి నాటి పెట్టుబడిదారీ వర్గాలు నాటి విధానాలను బలపరిచాయి కూడా.” (మీరానందా : 2012 ; పుట – 9)

మూడవ ప్రపంచవర్ష ప్రణాళికాంతం వరకు దేశంలో జరిగిన అభివృద్ధి కాదనలేనిది ముఖ్యంగా పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో వచ్చిన అభివృద్ధి. అయితే ఈ అభివృద్ధి కారణంగా సాధారణజనం కన్నా సంపన్నులే ఎక్కువ లబ్ధిపొందారనడంలో సందేహం లేదు.

### 1.4.2 రెండవదశ(1977–91)

నెహ్రూ తర్వాత పాలక వర్గాలు చేపట్టిన ఇందిరాగాంధీ కూడా కొంతవరకు గత విధానాలనే కొనసాగించారు. అయితే ఇందిరాగాంధీ మధ్యేమార్గాన్ని అనుసరించిందని చెప్పవచ్చు. ఆమె 4వ ప్రణాళికలో పేదరిక నిర్మూలన (గరీబీహఠావో) నినాదాన్ని ప్రవేశపెట్టింది. ఈ కాలంలో ప్రధానంగా బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాల రద్దు, చట్టరీత్యా భూస్వామ్య విధానం రద్దు,

పట్టణ భూములపై గరిష్టపరిమితి, ఇన్సురెన్స్ కంపెనీల జాతీయీకరణ, గుత్తకోటీశ్వర్లపై నియంత్రణ, ప్రజా పంపిణీ వ్యవస్థ, వ్యవసాయోత్పత్తులకు స్వయంసమృద్ధి, ఆర్థిక ద్రవ్యసంస్థలపై నియంత్రణ లాంటివి ఆమె హయాంలో చెప్పుకోదగినవి. మొత్తం మీద సరళీకరణ విధానాల పాత్ర పరిమితంగా ఉండేది.

ఇందిరాగాంధీ ఎన్నికల్లో ఓడిపోయి1977లో జనతా పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తరువాత ఆర్థిక విధానాలను తిరగదోడనారంభించారు. ప్రధానంగా ఈ ప్రభుత్వ పాలనా కాలంలో హైందవీకరణ అజెండాను అమలు చేయడానికి పూనుకున్నారు. "ఆ పార్టీలో ప్రధాన భాగస్వామి అయిన నాటి "జనసంఘ్" నేటి భారతీయ జనతా పార్టీ (బి.జె.పి) తన హైందవీకరణ అజెండాను అమలు చేయ ప్రయత్నించింది. సమూన్నత మానవత్వం(Integral humanism) పరిపూర్ణ స్వేచ్ఛతో మార్కెట్ ఆర్థిక వ్యవస్థ నిర్వహణ (Full – blown free Market) నాటి ప్రభుత్వ ఎజెండాలో ముందుకొచ్చాయి. హైందవీకరణ, ప్రైవేటీకరణ బి.జె.పి ఉద్దేశంలో కవల పిల్లలు" (మీరానందా:2012; పుట -10) ఈ కాలంలో ప్రధానంగా ప్రణాళిక విధానానికి స్వస్తి చెప్పారు. భారీపరిశ్రమల అజెండాను పక్కన పెట్టారు. చిన్నపరిశ్రమలకు ప్రైవేట్ వ్యాపారానికి ద్వారాలు తెరిచారు. "వ్యక్తులుగా, కులాలుగా విభజించబడిన హిందూ సమాజం ఎవరికి వారుగా, వారివారి కులవృత్తులను చేసుకోవడం ద్వారా హైందవీకరించబడిన సమూన్నత మానవత్వంలో ముడివేయబడతారని ఆ పార్టీ ప్రచారం చేసింది". (పైదే పుట-10) ఆనాడు సోషలిజానికీ, పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యమ్నాయంగా 'మూడో వర్గంగా' ఈ సమున్నత భావన హైందవీకరణలను ఆ పార్టీ ముందుకుతెచ్చి దాని విధానాల అమలుకు ప్రయత్నించింది. అయితే కాంగ్రెస్, ఇందిరాగాంధీ వ్యతిరేకతతో ఈ ప్రయత్నం వీగిపోయింది.

రాజీవ్ గాంధీ ప్రభుత్వంలో సాంకేతిక విజ్ఞానంలో వచ్చిన మార్పుల్ని ఆసరగా చేసుకుని సరళీకరణ విధానాలు ఉన్నతస్థాయిలో ప్రారంభించింది. "ఆ తర్వాత రాజీవ్ గాంధీ హయాంలో సాంకేతిక విజ్ఞానంలో వచ్చిన మార్పులను ఆసరగా చేసుకొని ఉన్నత వర్గాల వినియోగానికవసరమైన సరుకుల ఉత్పత్తికి ప్రాధాన్యత నిచ్చారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, ఎగుమతి ప్రాధాన్యత కలిగిన పరిశ్రమల ప్రోత్సాహం అందుకు అవసరమైన రాయితీలు ద్రవ్యవనరులు ఆయన కాలంలో సమకూర్చబడ్డాయి. సరళీకరణ ఉన్నతస్థాయిలో ప్రారంభం కావడానికి పునాదులు ఏర్పడ్డాయి".(పైదేపుట- 11) ఈవిధంగా ఆర్థిక సరళీకరణ విధానాలు అంచెలంచలుగా ఎదిగి రాజీవ్ గాంధీ హయానికల్లా ఉన్నత స్థితిని చేరుకున్నాయని తెలుస్తుంది.

### 1.4.3 మూడవదశ – 1991 తర్వాత

1991 సంవత్సరం ఆరంభంలో భారతదేశంలో ఒక శకానికి, ఒక రకమైన ప్రణాళికబద్ధఆర్థిక వ్యవస్థకు చరమాంకం పలికింది. నయా ఉదారవాద విధానాలకు 1991వ వేసవి బంగారు బాట వేసింది. దాన్ని భారతదేశంలో ద్వితీయ సంగ్రామంగా కొందరు పేర్కొన్నారు. నూతన ఆర్థిక విధానాలను భారతదేశంలో ప్రవేశపెట్టుటకు ప్రధానంగా నాటి ప్రధాని పి.వి.నరసింహారావు, నాటి కేంద్ర ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్‌ల విధానాల ఫలితమే. ఆర్థిక రంగంలో విప్లవ కార్యాచరణకు ఆద్యులుగా వీరిని పేర్కొన్నారు. సరళీకరణను బహుళజాతి సంస్థల ప్రతినిధులు, భారతదేశ సంపన్న వర్గాలు వేనోళ్ళ కొనియాడారు.

1991లో ప్రవేశపెట్టబడిన సంస్కరణలు విదేశీ మారకద్రవ్యంలో ఏర్పడిన లోటును భర్తీ చేయడానికని చెప్పుకున్నారు. ఈ విధానానికి అంతకు ముందు దశాబ్ధకాలం నుంచి ఏర్పడిన పరిస్థితులు కూడా కారణం. 1990 సంవత్సరం నాటికి భారతదేశ ఆర్థిక పరిస్థితుల్లో మాంద్యం ఏర్పడింది. "దేశంలో ఉన్నత వర్గాల్లో పెరిగిపోయిన ఆడంబర వినియోగం. విదేశీ వస్తువులకు పెరిగిన డిమాండ్, వాటిపై పెరిగిన మోజు గల్ఫ్ లో జరిగిన యుద్ధ పర్యవసానంగా పెరిగిన చమురుధరలు. లాభదాయకం కాని ఆర్థిక విధానాల పర్యవసానంగా విదేశాల్లో జీవించే భారతీయులు (ఎన్.ఆర్.ఐలు) తమ పెట్టుబడులను, పొదుపు సొమ్ములను బ్యాంకుల నుండి ఉపసంహరించుకోవడంతో విదేశీ మారకద్రవ్యం లోటు ఏర్పడింది. దీనికోసం అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది" (పైదే; పుట –12) ఈ పరిస్థితుల్లో భారతదేశం అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐ.యం.ఎఫ్) పంచకు చేరింది. ఈ క్రమంలో భారతదేశంలో ఆర్థిక సరళీకరణ విధానాలు ప్రారంభమైనాయి. ప్రపంచ బ్యాంకు దగ్గర అప్పు తీసుకునే దేశాలు దాని విధానాలకు అనుగుణంగా నడుచుకోవాలి. తర్వాత ఎన్.డి.ఎ హయాంలో ప్రైవేటీకరణ జోరుగా సాగింది. 2004లో జరిగిన ఎన్నికల్లో ఎన్.డి.ఎ ఓటమి పాలుకావడంతో దాని విధానాలకు అడ్డుకట్టపడింది.

2009 సంవత్సరం తర్వాత ప్రపంచ వ్యాప్త ఆర్థిక సంక్షోభ కాలంలో యు.పి.ఏ ఆధికార పగ్గాలు చేపట్టింది. ఈ ప్రభుత్వ విధానాల రూపకల్పనలో ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో స్వేచ్ఛగా పాతపద్ధతులను తిరగదోడడం ప్రారంభించింది. ఇక్కడ నుంచి ఆర్థిక రంగంలో తడబాటు మొదలైంది. మొత్తం జాతీయోత్పత్తి పెరుగుదల రేటు తగ్గింది. ఉద్యోగాలు కోల్పోతున్న వారి సంఖ్య నానాటికి పెరిగింది. ఎగుమతుల రంగం ఐ.టి రంగలో సంక్షోభ స్థాయి ఎక్కువగా ఉంది. ఈ

సంక్షోభం అన్ని రంగాలకు నేడు విస్తరించింది. చిల్లర వర్తకంలో కూడా ఎఫ్.డి.ఐ లను (Foreign Direct Investment) ప్రవేశ పెట్టడానికి అనుమతించింది. దీని వలన చిల్లర వర్తకరంగంపై ఆధారపడి జీవిస్తున్న కోట్లాది మంది ప్రజలు ఉపాధిని కోల్పోయే స్థితికి నేడు నెట్టబడింది.

పై అంశాలను పరిశీలించినట్లయితే స్వాతంత్ర్యానంతర కాలం నుంచి భారతదేశంలో నేటి వరకు సాగిన ప్రపంచీకరణ విధానాలు అది విస్తృతమైన తీరు కనబడుతుంది.

## 1.5. ప్రపంచీకరణ ముఖ్య లక్షణాలు

1. వేగం అన్నది ప్రస్తుత ప్రపంచీకరణ ముఖ్యలక్షణంగా చెప్పవచ్చు. సాంకేతిక రంగం అభివృద్ధిచెందడంతో సమాచార ప్రసార సాధనాల్లో సంభవించిన నూతన ఆవిష్కరణల వలన వేగం సంబంవించింది.

2. ప్రపంచీకరణ ఫలితాలు చౌకగా అందుబాటులోకి వచ్చాయి. 19వ శతాబ్ది చివరి వరకు అభివృద్ధి చెందిన దేశాలు పొందలేక పోయిన సాంకేతిక పరిజ్ఞానం కంటే నేడు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువగా ఉంది.

3. మార్కెట్లు విస్తృతంగా ప్రపంచ వ్యాప్తంగా వెలిశాయి. తక్కువ ధరకే ప్రజలకు వస్తువులు అందుబాటులోకి వచ్చాయి.

4. భావప్రసారాలు యదార్థంలోకి రావడం ప్రపంచీకరణ ముఖ్య లక్షణంగా పేర్కొనవచ్చును. ప్రసార సాధనాలు అభివృద్ధి చెందడం వలన ప్రపంచంలో ఏమూలన జరిగిన సంఘటనైనా తక్కువ సమయంలోనే ప్రజలందరికీ వాస్తవరూపంలోకి తెలుస్తుంది.

పై అంశాలతో పాటు క్రింది వాటిని కూడా ప్రపంచీకరణ లక్షణాలుగా పేర్కొన వచ్చును.

1. జాతీయ, రాష్ట్రస్థాయిలలో పెరిగిన సాంకేతిక నైపుణ్యం వలన వ్యాపార సంస్థల్లో ఇంతకు ముందెన్నడు కానరాని అభివృద్ధి కనిపిస్తుంది.
2. ప్రపంచంలో అన్ని దేశాల ప్రజలకు అనుగుణంగా మార్కెట్లు వెలిశాయి.

3. 20 వశతాబ్ధంలో అవసరాలు, ఒత్తిడి, ప్రపంచ చైతన్యం తీవ్రరూపం దాల్చడం వలన దేశాలు ఒక దాని మీద మరొకటి పరస్పరం ఆధారపడి ఉండేలాచేసింది.

4. సామాజిక సాంస్కృతిక అనుక్రమాణిక క్రమబద్ధం కావడానికి ప్రపంచీకరణ కారణమైంది. ప్రపంచీకరణ ఒక సామాజిక ప్రక్రియ.

5. చారిత్రక పరిణామం, విలువలు, అభిరుచులు, సాంకేతికవిలువలు, మానవులకు అవసరమైన సరుకులు ప్రపంచ స్థాయిలో పెరగడం అనేది ప్రపంచీకరణ వల్ల కలిగిన మార్పు.

6. ఆధునికంగా ప్రపంచ దేశాల్లో జీవన ప్రమాణాలు పెరగడం ప్రధానంగా ప్రపంచీకరణ కృషి ఫలితమే.

7. "ప్రపంచీకరణ ఒక చారిత్రాత్మక పరిణామం" ఆర్థిక వ్యవస్థలో, ప్రజా జీవనంలో, రాజకీయంలో, సాంస్కృతిక రంగంలో, సామూహికజీవనంలో కొరవడిన విలువలను లక్ష్య సాధనకు నెరవేర్చలేకపోవడం.

8. ప్రపంచీకరణ రాజకీయ ప్రతిచర్యగా నిలవడం.

9. ప్రపంచీకరణ జ్ఞాన నిలయ కేంద్రం.

ఈ ప్రపంచీకరణ భారతదేశంలోకి ప్రవేశించుటకు గల కారణాలేమిటి అది ప్రవేశించుటకు దోహద పడిన అంశాలేమిటి? అనేవి తెలుసుకోవాలి 1990 నాటికి భారతదేశ ఆర్థిక పరిస్థితుల్లో మాంద్యం ఏర్పడింది. నాడు విదేశీ బకాయిలు చెల్లించలేని స్థితిలో మనదేశం ఉండేది. "మనదేశం మూడు వారాల పాటు మాత్రమే విదేశాలకు చెల్లించవలసిన బకాయి బిల్లులు చెల్లింపగల స్థితిలో ఉంది. ఆపైన చెతులెత్తవలసిందే. నాటి ఆర్థిక మాంద్యం నుండి తెప్పరిల్లుకోవడానికి మన దేశం కూడా గ్లోబలైజేషన్ ను ఆదరించినది. పై రెండు కారణాల వలన మన దేశం ప్రపంచ బ్యాంక్ వద్ద చేయిచాపవలసిన పరిస్థితి ఏర్పడి గ్లోబలైజేషన్ ను అమలు చేసింది."(రాజీవ్ దీక్షిత్: 2003; పుట -9)

# అధ్యాయం–2

# ప్రపంచీకరణ – తెలుగు సాహిత్యం

ప్రపంచీకరణ అన్ని రంగాలపై ప్రభావం చూపింది. ప్రపంచీకరణ ప్రభావితం చేయని రంగం లేదు. తెలుగు సాహిత్యం కూడా దాని బలమైన ప్రభావానికి గురైంది. సాహిత్యం సమాజాన్ని అధ్యయనం చేస్తుంది. ప్రపంచీకరణ పరిణామాలపై అన్ని దేశాల్లో సాహితీకారులు ప్రతిస్పందించారు. భారతదేశంలో కూడా ఎంతో మంది సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాహితీ ప్రముఖులు ప్రపంచీకరణ పై ప్రతిస్పందించారు. తెలుగులో కూడా ప్రపంచీకరణ సాహిత్యం విస్తృతంగా వస్తుంది.

దాదాపు రెండు దశాబ్ధాల కిందట భారతదేశంలో సరళీకరణ వాణిజ్యవిధానాలు అమలు కావడం జరిగింది. 1991 జూలై 1 న అప్పటి ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు నాటి ఆర్థిక మంత్రి మన్‌మోహన్ సింగ్ ఈ విధానాలకు రూపకర్తలు. ఆనాటి నుంచి నేటి వరకు నూతన ఆర్థిక విధానాల ఫలితాలను ప్రజలు చవిచూస్తున్నారు. తెలుగు సమాజంలో నూతన ఆర్థిక విధానాల ఆరంభంలోనే ప్రతిఘటన ఎదురైంది. డంకెల్ ప్రతిపాదనలపై మన దేశం సంతకం చేయకుండా తిరుగుబాటుగా గొప్ప ఉద్యమం దేశ వ్యాప్తంగా జరిగింది. ఆ సందర్భంగా వీధి నాటకాలు, పాటలు, నృత్య రూపకాలు ఊరూర ప్రదర్శించారు.

1990 సంవత్సరం మొదటి రోజుల్లో దళిత సాహిత్యం, స్త్రీవాద సాహిత్యాల ప్రభావం బలంగా ఉంది. 1990 నుండే ముస్లింవాద సాహిత్యం కూడా రావడం జరిగింది. ఇదే సమయంలో ప్రాంతీయచైతన్య సాహిత్యం కూడా రావడం జరిగింది. 90 వదశకపు నుంచి 1996 వరకు నూతన ఆర్థిక విధానాలు  దేశ ప్రజలకు అంతగా అర్థం కాలేదు. 1996 సంవత్సరం తర్వాత నూతన ఆర్థిక విధానాల విషప్రభావాన్ని ప్రజలు చవిచూడటం జరిగింది. ప్రపంచీకరణ విశ్వరూపం మొదలైన తర్వాత నెమ్మదిగా మధ్యతరగతి ఆకాంక్షలను వారి వికలమైన స్వప్నాలను తెలియజేస్తూ కవిత్వం రావడం మొదలైంది. ఇదంతా ప్రపంచీకరణ ఫలితం అని తెలియడానికి ఎంతోకాలం పట్టలేదు.

1990వ సంవత్సరంలో ప్రారంభమైన సరళీకృత ఆర్థిక విధానాలు అన్ని రంగాలపై ప్రభావాన్ని చూపి ప్రజల జీవితంలోకి చొరబడ్డాయి. అమెరికా యుద్ధోన్మాదం అధికమయ్యింది. అమెరికా ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్‌ల మీద యుద్ధం ప్రకటించటంతో తెలుగు సాహిత్య కారులను

చలింపచేశాయి. ముఖ్యంగా వ్యవసాయరంగం సంక్షోభంలో పడటం, చితికిపోయిన మధ్యతరగతి ఆర్థికపరిస్థితి, రైతుల ఆత్మహత్యలు, ప్రభుత్వరంగ కంపెనీలమూత లేదా ప్రైవేటీకరించడం మొదలైనవి. ఇవన్నీ కూడా గ్లోబల్ సందర్భంలో జరిగినటువంటి పరిస్థితులు కాబట్టి కవులు, కళాకారులు, అన్ని వాదాల సాహిత్యకారులు ప్రపంచీకరణపై స్పందించి సాహిత్యాన్ని వెలువరించడం జరిగింది. తెలుగులో ప్రపంచీకరణ సాహిత్యం ఒక ధోరణిగా మారిందని చెప్పవచ్చు. "సాధారణంగా సమాజంలోనూ, సాహిత్యంలోనూ నెలకొని ఉన్న వ్యవస్థపట్ల క్రమంగా నిరసించే వారి సంఖ్య పెరిగి అది ఆందోళన దశకు చేరుతుంది. ఇది మలిదశ, దీన్నే ధోరణి అంటున్నాం" (సత్యనారాయణ: ఆంధ్రజ్యోతి; 11-4-2005)

"ప్రక్రియ భాష, శిల్పం, ఇతివృత్తం, సైద్ధాంతిక దృక్పథం మొదలైన విషయాలలో రచయితలు చెప్పుకోదగిన సంఖ్యలో అనుసరించే మార్గమూ, పద్ధతీ" (నళిని,యస్; 1999)

ముఖ్యంగా సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో దేశంలో ఫ్యాక్టరీలమూత, కార్మికుల ఆకలిచావులు, మేధోవలసలు, విద్యారంగం ప్రైవేటీకరించడం, యాంత్రీకరణ ద్వారా పేదలు ఉపాధి, వృత్తుల్ని కోల్పోవడం, ప్రకృతి వనరులు కూడా వ్యాపారీకరణ పొందటం (అంటే మనిషి ఉచితంగా పొందేటువంటి నీరు కూడా) ప్రసార మాధ్యమాల విచ్చల విడితనం వలన భాష, సంస్కృతి మొదలైన వాటి ఉనికి ప్రశ్నార్థకం కావడం, ఇవన్నీ కూడా తెలుగు కవుల ఆగ్రహానికి, ఆవేశానికి వారి తీవ్రమైన అభివ్యక్తికి కారణాలయ్యాయి. ఈ నేపథ్యంలోనే తెలుగులో ప్రపంచీకరణ ఒక ధోరణిగా సాహిత్యానికి వస్తువుగా రూపాంతరం చెందడం జరిగింది.

రెండు దశాబ్ధాల ప్రపంచీకరణ సాహిత్య సృజనలో ప్రపంచీకరణ పై వ్యతిరేకత ఎక్కువగా కనిపిస్తుంది. ముఖ్యంగా కవిత్వంలో ఎక్కువగా వ్యతిరేకధోరణి కన్పిస్తుంది. కథా సాహిత్యంలో మాత్రం వ్యతిరేకతతో పాటు అక్కడక్కడా కొంత అనుకూలత కూడా కనిపిస్తుంది. "కథల్లో సమాజంలో, కుటుంబసంబంధాలలో గ్లోబలైజేషన్ వల్ల వస్తున్న పరిణామాలనూ మంచినీ, చెడునూ రెండింటిని చిత్రించడం జరిగింది" అని బి.ఎస్.రాములు గారు రెండింటినీ వివరించడానికి ప్రయత్నించారు. (రాములుబి.ఎస్:2003; పుట - 33) ప్రపంచీకరణ సాహిత్యం అంటే ఏమిటో తెలుసుకోవడం అత్యవసరం.

"ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం మల్టీనేషనల్ గ్లోబల్, డాలర్స్ రూపాయి, మార్కెట్ వంటి పదాలు వాడగానే అది గ్లోబలైజేషన్ గురించి రాసిందనుకోవడం పొరపాటు. అలాగే ఆ రకమైన

పదాలు వాడకుండా జరుగుతున్న విధ్వంసాన్ని ప్రతీకాత్మకంగా చెప్పినా అది గ్లోబలైజేషన్ గురించి రాసిన సాహిత్యం కాకపోదు. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో ధ్వంసమవుతున్న జీవన విధానాల చిత్రణ ఈ సాహిత్యంలో ప్రధానం" (గుడిపాటి; 2002: పుట –24) సాహిత్యకారుల్లో గ్లోబలైజేషన్‌పై ఏకాభిప్రాయం లేదు. వారి అభిప్రాయాలను ఇక్కడ పేర్కొనడం సమంజసంగా ఉంటుంది.

1. "సంపన్న దేశాల ఆర్థిక ,రాజకీయ ,సామాజిక జీవిత నమూనాల్ని మన మీద రుద్దడమే గ్లోబలైజేషన్ పని. కనుకనే సామ్రాజ్యవాదం కన్నా ప్రమాదకరమైంది గ్లోబలైజేషన్ .సామ్రాజ్యవాదం మన ఆర్థిక వ్యవస్థను మాత్రమే చిన్నాభిన్నం చేసింది. మన జీవితాల్లోకి పెద్దగా జొరబడలేదు . అప్పుడు కూడా వాళ్ళ సరుకులతో పాటు వాళ్ళ సంస్కృతులు మన దేశంలోకి దిగుమతయినా వాటి ప్రభావం కొంత వరకే పరిమితం. కాని గ్లోబలైజేషన్ ఇప్పుడిక్కడ మన ప్రపంచాన్నే ధ్వంసం చేస్తుంది .ఒక్క మాటలో చెప్పాలంటే సామ్రాజ్యవాదపు వికృతరూపం గ్లోబలైజేషన్". (గుడిపాటి: 2002; పుట – 7)

2. "గ్లోబలైజేషన్ ను వ్యతిరేకించే వాళ్ళు నిర్దిష్ట ఆచరణ రూపాలను ప్రతిపాదించకుండా కేవలం ప్రచారస్థాయిలో వ్యతిరేకించడం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా యథాస్థితి కొనసాగించడానికీ, తద్వారా ప్రస్తుత దోపిడీ వర్గాల, దోపిడీప్రాంతాల, దోపిడీ కులాల ప్రయోజనాలను వ్యతిరేకించే వాళ్ళుగా మిగిలి పోతారు".(రాములు, బి.ఎస్ :2003; పుట –24)

"గ్లోబలైజేషన్ అనేది అభివృద్ధి చెందాల్సిన ప్రాంతాలకు, దేశాలకు, జాతులకు, వర్గాలకు అనువుగా మల్చుకోవల్సిన అవసరం ఉంది. ఒక సామెత ఉంది బర్రె మన కోసం కట్టదు ఈనదు. కాని దాని పాలు పిండుకోవాలి. లేని యెడల చరిత్రలో, అభివృద్ధిలో వెనుకబడిపోతారు". (రాములు, బి.ఎస్.;2003: పుట – 23)

3. "గ్లోబలైజేషన్ దుష్ఫలితాలను గురించి ఆందోళన, అలజడి ఉన్నంతగా దాని గురించి అధ్యయనం లేదు. గ్లోబలైజేషన్ను వ్యతిరేకిస్తున్న వారిలో అధికశాతం తోటి మానవుల వేదనలకు స్పందించి మానవతా దృక్పథంతో మాట్లాడుతున్నారు గాని తగినంత శాస్త్రీయ అవగాహన లేదనే చెప్పాలి"(ఆర్. కె.ఆర్.; 2004: పుట –26)

4. గ్లోబలైజేషన్‌లో భాగంగా ముందుకొచ్చిన టెక్నాలజీని దళితులు తమకు అనువుగా ఉపయోగించుకోవాలన్న ప్రతిపాదనలున్నాయి. (ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కి పైడి తెరేష్ బాబు ఇచ్చిన

ఇంటర్వ్యూ) (గుడిపాటి; 2002: పుట – 14) పై అభిప్రాయాలను పరిశీలించినట్లయితే ప్రపంచీకరణపై కొంత అనుకూలత, మరింత వ్యతిరేకత ఉన్నట్లు మనం గుర్తించవచ్చును.

5. ప్రపంచీకరణను వస్తువుగా ఇతివృత్తంగా తీసుకుని రచనలు చేయడం 1995 కు ముందు కొద్దిమేరకు ఉంది. దీనికి కారణం ప్రపంచీకరణ విధానాలు 1996 వరకు ప్రసిద్ధి కాకపోవడం గమనించవచ్చు. అయితే 1996 తర్వాత తెలుగు సాహిత్యంలో విస్తృతంగా ప్రపంచీకరణవస్తువైంది. నేటి వరకు ప్రపంచీకరణ పై అనేక కవితలు, కథలు, నవలలు, గేయం, పాట, నాటికలు వచ్చాయి. ఈ సాహిత్యాన్నంతా విరివిగా చూడటం సమంజసంగా ఉంటుంది.

## **2.1**. ప్రపంచీకరణ – కవిత్వం

తెలుగు సాహిత్యంలో ఏ వాదమైన, ధోరణి అయినా ముందుగా కవిత్వంలోనే ప్రతిఫలిస్తుంది. ప్రపంచీకరణ ఇందుకు మినహాయింపేమికాదు. 1995కు ముందు వివిధ దిన పత్రికలలో ప్రపంచీకరణను ప్రతిఘటించే కవిత్వం కవితలు ఉన్నాయి. 1995 తర్వాతనే కవిత్వం సంకలనాల రూపంలో రావడం జరిగింది. మంజీర రచయితల ఆధ్వర్యంలో 'మొగులైంది' కవితా సంకలనం 1995లో వెలువడింది. ప్రపంచీకరణను ప్రతిఘటించడంలో కవిత్వానిదే ప్రథమ స్థానం. జూకంటి జగన్నాథం 'ఇండియా ప్రైవేట్ లిమిటెడ్'(1996) అనే సంకలనాన్ని వెలువరించారు.

తెలుగు కవులు కేవలం భారతదేశంలోని సంఘటనలకే కాక ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచంలో జరిగినటువంటి సంఘటనలకూ ప్రతిస్పందించారు. ఈ కోణంలోనే నైజీరియాలో కెన్‌సారోవివాను ఉరితీయడాన్ని తీవ్రంగా నిరసించారు. ఈ నేపథ్యంలో 1997లో ప్రజారచయితల సంఘం వారు ఒక సంకలనాన్ని తీసుకువచ్చారు. ఆ తరవాత విరసం తదితర సాహిత్య సంఘాలు కెన్‌సారోవివా హత్యను నిరసిస్తూ సంకలనాన్ని తీసుకువచ్చారు. 1997 తరవాత జూకంటి జగన్నాథం, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్‌ల సంపాదకత్వంలో ఒక బలమైన వ్యక్తీకరణగా గ్లోబల్‌ఖడ్గం కవితా సంకలనం వచ్చింది. 2000 సంవత్సరంలో బషీర్‌బాగ్‌లో విద్యుత్ చార్జీల వ్యతిరేక నిరసనకారులను ప్రభుత్వం కాల్చి చంపింది. ఈ నేపథ్యంలో 'వికసించిన విద్యుత్ తేజం' కవితా సంకలనం వచ్చింది. ఈ సంఘటనతోనే 'జనకవనం' కవితా సంకలనం కూడా వచ్చింది. అలాగే స్త్రీ వాదరచయిత్రి కొండేపూడి నిర్మల 'మల్టీనేషనల్ ముద్దు' అనే కవితా

సంకలనం ప్రకటించారు. ఈ సంకలనం స్త్రీవాదులు పురుషాధిక్యంతో పాటు ప్రపంచీకరణను కూడా వ్యతిరేకిస్తున్నారు అనే వాదనను బహిర్గతం చేసింది.

2001, సెప్టెంబర్‌లో వరల్డ్‌ట్రేడ్ సెంటర్ మీద దాడి జరిగి అమెరికా భయంతో వణికి పోయింది. ఈ నేపథ్యంలో 'కాగితపులి కళ్ళలో భయం' అనే కవితా సంకలనం ఎన్. వేణుగోపాల్ సంపాదకత్వంలో వచ్చింది. వంశీకృష్ణ 'డబ్బుపిట్ట' ఎండ్లూరి సుధాకర్ 'నల్లద్రాక్ష పందిరి' శిఖామణి 'నల్లగేటూ నంది వర్ధనం' శివారెడ్డి 'అంతర్జనం', శ్రీకాంత్ 'యితర' అద్దేపల్లి రామమోహన్‌రావు 'పొగచూరిన ఆకాశం', శిలాలోలిత 'ఎంతెంతదూరం' జిలకరశ్రీనివాస్ 'కలల గొలుసు' దాదాపు పది సంవత్సరాల ప్రపంచీకరణ కవిత్వంను 'అనేక' అను పేరుతో అఫ్సర్, వంశీకృష్ణ సంపాదకత్వంలో తీసుకురావడం జరిగింది. గ్లోబలైజేషన్ తర్వాత తెలుగు కవిత్వంలో ఎలాంటి మార్పులు వచ్చాయో అక్షర సాక్షిగా నిలిచే కవితలతో ఈ సంకలనం వెలువడింది. ఈవిధమైన కవితా సంకలనాలు వచ్చి ప్రపంచీకరణను బహుళకోణంలో చిత్రించాయి. ఈ కవితాసంకలానాలు ప్రపంచీకరణ భారతదేశంలో తెస్తున్నటువంటి ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక కోణాలను భిన్న రూపాల్లో వ్యక్తీకరించడం జరిగింది.

## 2.2 ప్రపంచీకరణ – తెలుగు కథ

ప్రపంచీకరణ అన్ని రంగాల పై ప్రభావాన్ని చూపింది. ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలతో పాటు సాహిత్యం కూడా దాని బలమైన ప్రభావానికి గురైంది. 1990 వ దశకం నుండి నూతన ఆర్థిక విధానాలు జనజీవితాల్లోకి చొరబడటంతో అన్ని వాదాల సాహిత్యకారులు దీని పై స్పందించి సాహిత్యం వెలువరించారు. ప్రపంచీకరణ అనేది నేడు ఒక ధోరణిగా మారింది. తెలుగు సాహిత్యంలో ఇతర ప్రక్రియల్లాగే ప్రపంచీకరణ పై కథ వ్యతిరేక భావం ఎక్కువగా చూపినప్పటికీ ఇక్కడ కొంత అనుకూలత కూడా కనిపిస్తుంది. ప్రపంచీకరణ ప్రతిఫలనాలను చిత్రించడంలో కవిత్వం, పాటకన్నా వనచ సాహిత్యం కొంత ఆలస్యంగా రావటం కనిపిస్తుంది.

మధ్యతరగతి ప్రజల మీద ప్రపంచీకరణ చూపిన ప్రభావాలను పేదల జీవితంలో వచ్చినటువంటి మార్పుల్ని కథలు బాగా చిత్రించాయి. వ్యవసాయం, విద్య, వైద్యం వంటి విషయాల మీద కథ బలమైన ప్రభావం చూపింది. ముఖ్యంగా తెలంగాణా, రాయలసీమ ప్రాంతాల్లో ఉన్నటువంటి కరువు, ఆకలి చావులు, ఆత్మహత్యల్ని గురించి లోతుగా పరిశీలించింది. గ్లోబలైజేషన్

ఇతివృత్తంతో విశాలాంధ్ర బుక్ హౌజ్ ఒక కథా సంపుటిని  వెలువరించింది. అలాగే మధురాంతకం రాజారాం సాహితీ సంస్థ ప్రతి సంవత్సరం వచ్చే కథల్ని ఒక 'కథా సంకలనం'గా తీసుకు వచ్చింది. ప్రపంచీకరణ నేపథ్యంలో కథా సాహిత్యం 2000 సంవత్సరం తర్వాతనే విరివిగా వచ్చింది.

ప్రపంచీకరణ  ఫలితంగా  ప్రపంచ మార్కెట్ల పై, ఉత్పత్తుల పై బహుళజాతి సంస్థల గుత్తాధిపత్యం పెరిగింది. విదేశీ కంపెనీలు వచ్చి దేశీయ కంపెనీలను, ఉత్పత్తులను కొల్లగొట్టాయి, ఈ పరిస్థితిని ఓల్గా రచించిన 'కోకాకోలా' కథలో చూపించారు. కోకాకోలా కంపెనీలో ఉద్యోగిగా చేరిన శ్రీనివాసరావుని  భార్య పార్వతి  వద్దని  మందలిస్తుంది. విదేశీ కంపెనీతో లాభాలు విదేశాలకు వెళతాయని అంటుంది. మహమ్మద్ ఖదీర్ బాబు రచించిన 'పెండెం సోడా సెంటర్' కథలో కూడా ఇటువంటి దృక్పథానే చిత్రించారు. ఒక దేశీయ కంపెనీ స్థానంలో వచ్చినటువంటి కోకాకోలా కొన్ని వందల కోట్ల సంపాదనను కొల్లగొడుతుంది. ప్రధానంగా శీతల పానియాల దోపిడీని ఈ రెండు కథలు వివరించాయి.

ప్రస్తుతం అమలు జరుగుతున్న  విధానాల వలన కాంట్రాక్ట్ సేద్యం, కార్పొరేట్ వ్యవసాయం పెరిగింది. ఆహార పంటలు స్థానే వాణిజ్య పంటలు రావడం. బ్రెట్టన్‌ఉడ్ సంస్థలు ప్రవచించిన వినాశకరమైన విధానాల వలన సహజ వనరులు దెబ్బతిని పంటల దిగుబడులు తగ్గిపోయాయి. విపరీతంగా రసాయన మందులు వాడటం వలన భూసారం తగ్గిపోయింది. భూగర్భ జలాల్లో ప్రమాదకరమైన నైట్రేట్లు పేరుకు పోయాయి. కార్పొరేట్ సంస్థలు భూస్వాములను వ్యవసాయ కూలీలుగా మార్చిన విధానాన్ని దార్ల రామచంద్ర రచించిన 'గద్దొచ్చె కోడిపిల్ల' కథలో చిత్రీకరించారు.

చేపల నీలి విప్లవాన్ని విచ్ఛిన్నం చేసిన ఆక్వాకల్చర్, పసుపుపచ్చ విప్లవాన్ని నాశనం చేసిన పామాయిల్, శ్వేత విప్లవాన్ని దెబ్బతీసిన సింతటిక్ మిల్క్ ప్యాకెట్స్, నెదర్లాండ్ పాలు, అమెరికాగోధుమలు, చైనా బియ్యం, చక్కెర, పప్పులు చౌకగా మార్కెట్లను ముంచెత్తాక పురుగు మందులు జీర్ణాశయాలకు రంధ్రాలు చేశాయి. ఫ్రాన్స్ కు చెందిన జెరీన్ కంపెనీ ఇక్కడ కూరగాయలను పండించాలని చూస్తుంది. అవి మామూలు కూరగాయలు కావు. వీటికి అధిక మోతాదులో వాడాల్సిన విషరసాయనాల వలన ప్రజల ఆరోగ్యం పై విపరీతమైన ప్రభావాన్ని చూపుతుంది. అంటూ చిత్రీకరించిన కథ పెద్దింటి అశోక్ కుమార్ రాసిన 'కీలుబొమ్మలు'.

సరళీకరణ విధానాల తరవాత పారిశ్రామిక విధానంలో మార్పు వచ్చింది. ప్రపంచీకరణ ద్వారా ప్రైవేటీకరణ జోరు కొనసాగుతోంది. ప్రభుత్వం అనేక ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడానికి ప్రయత్నిస్తుంది. ఈ పారిశ్రామికరంగ దుస్థితినీ, ఫ్యాక్టరీలు మూతపడటంతో కార్మికుల బాధలను వివరించే కథ గొలుసు జగదీశ్వరరెడ్డి రచించిన 'బతుకుగోస'. ఈ క్రమంలోనే చిత్రీకరించిన మరోకథ సోమరాజు సుశీల గారు రచించిన 'చిన్న పరిశ్రమలు – పెద్ద కథలు' ఇందులో ప్రైవేటీకరణ వలన ఉపాధి కోల్పోయిన కార్మికులు రోడ్డున పడ్డ వారి కుటుంబాలు, ఆకలికి తట్టుకోలేక మరణించిన కార్మికుల నేపథ్యాలు ఇతివృత్తంగా ఉన్నాయి. ప్రభుత్వ సంస్థలన్ని ప్రైవేట్ వ్యక్తుల పరమైపోవడాన్ని వివరించే మరో కథ సురేష్ రాసిన 'టైటానిక్'.

నేడు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వలన విద్య కూడా వ్యాపారవస్తువైయింది. కొనగలిగిన వారికే విద్య అందుబాటులో ఉంది. ప్రపంచీకరణలో వేగంతో పాటే వివిధ వృత్తి విద్యాకోర్సులు అంతే వేగంగా మన ముందుకు రావటం అంతలోనే వాటి ఉనికి కోల్పోవడం జరుగుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా తయారయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో వచ్చినటువంటివే పంజాల జగన్నాథం రాసిన 'మట్టివాసనలు', బి.యస్. రాములు రచించిన 'వేపచెట్టు' కథలు.

ప్రపంచీకరణ ప్రభావంతో గ్రామ ఆర్థిక వ్యవస్థలు ఛిన్నాభిన్నం కావడం. చేతి వృత్తులు అంతరించడం, రైతులు ఆర్థికంగా చితికిపోవడం, మూతపడుతున్న ఫ్యాక్టరీలు ఇవన్నీ వినాశనం అవుతున్న సమాజ పరిస్థితిని సూచిస్తున్నాయి. బహుళజాతి సంస్థలు తమ విషప్రయోగాలన్నింటిని వర్థమాన దేశాల పై ప్రయోగించడం, ఇక్కడ పర్యావరణంలో మార్పులు రైతుల ఆత్మహత్యలకు కారణం అవుతున్నాయి. ఈ దుస్థితిని చిత్రీకరించిన కథ కొండవీటి సత్యవతి 'వైరస్'.

సరళీకృత ఆర్థిక విధానాల వలన దిగుమతుల పై ఆంక్షలు తొలగించడం జరిగింది. దీని వలన విదేశీ వస్తువులు మన మార్కెట్లను ముంచెత్తాయి. దేశీయంగా ఉత్పత్తయ్యే సరుకుల రేటు గణనీయంగా పడిపోయింది. తద్వారా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కరువయ్యాయి. ఈ నేపథ్యాన్ని హృద్యయంగా చిత్రీకరించింది పెద్దింటి అశోక్ కుమార్ 'కీలుబొమ్మలు' కథ.

బహుళజాతి సంస్థల కోసం రాజకీయవ్యవస్థ కొత్త చట్టాలను తయారు చేస్తుంది. వస్తువుల కొనుగోలును సృష్టిస్తుంది. అమెరికా భారత్, ఆఫ్ఘనిస్థాన్ కు యుద్ధవిమానాల అమ్మకాన్ని చిత్రించిన కథ నల్లూరి రుక్మిణి 'కథ పాతదే' కానీ స్కూల్ టీచర్ గా ఉన్న భారతమ్మ రిటైరై కొడుకు దగ్గర

ఉంటుంది. కొడుకు పిల్లలు వచ్చి కథ చెప్పమని అడుగగా తోడేలు, బుజ్జిమేక కథను పిల్లలకు చెబుతూ దానిని అమెరికా ఇరాక్ ల యుద్ధానికి అన్వయిస్తుంది.

ప్రపంచ బ్యాంక్ షరతులకు లొంగి 2000 సం. విద్యుత్ ఛార్జీలు పెంచడం జరిగింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అనేక మంది మధ్యతరగతి దిగువ వర్గాల వారు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ ఛార్జీల పెంపుదలను నిరసిస్తూ హైదరాబాద్ లోని బషీర్ బాగ్ లో ఆందోళనలు జరిగాయి. ఈ ఆందోళనలు అణచివేత సందర్భంలో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అనేక మంది గాయపడ్డారు. ముగ్గురు మరణించారు. ఈ నేపథ్యాలను చిత్రించిన కథ కె.రామచంద్రమూర్తి రాసిన 'చెక్' కథ.

ప్రపంచీకరణ ప్రభావానికి విపరీతంగ గురైన రంగాల్లో మీడియా ప్రధానమైంది. ప్రపంచీకరణ ప్రభావం బలంగా విస్తరించడానికి మీడియా సాధనమైంది. ప్రసారసాధనాలు వ్యక్తులలో విలువలు, విశ్వాసాలు ప్రవేశపెడుతుంది. ఒకప్పుడు ప్రభుత్వ ప్రచారంగా ఉన్న మీడియా నేడు స్వేచ్ఛ ముఖ్యమని ప్రజల సమస్యల్ని వక్రీకరిస్తూ తప్పుదారి పట్టిస్తుంది. ప్రజలందరికి ప్రయోజనం ఉన్న అంశాలను మీడియా ప్రచురించాలి. కేతు విశ్వనాథరెడ్డి 'విరూపం' కథలో సిమెంట్ ఫ్యాక్టరీ వదిలే వ్యర్థ బూడిద పదార్థాలు పంట పొలాల పై పడి పంటలు నాశనం అవ్వడం వలన రైతులు ఉపాధిలేక ఫ్యాక్టరీలలో కార్మికులుగా చేరతారు. కల్తీమందుల వలన రైతులు నష్టాల పాలై మరణావస్థకు గురవుతున్నారు అని ఇస్మాయిల్ అనే గ్రామీణ విలేఖరి పత్రికలకు రాస్తాడు. పత్రికా స్వేచ్ఛను పత్రికాధిపతులు చర్యలను ఈ కథ వివరించింది. హిందువులు సృష్టించుకున్న సంపదకు వ్యతిరేకంగా రాయడమేమిటి అని అసిస్టెంట్ ఎడిటర్ అంటాడు.

గీతాంజలి 'కథ 2002' యాజమాన్యం అజమాయిషికి తల ఒగ్గని విలేఖరి ఉద్యోగాన్ని పోగొట్టుకోవటాన్ని తెలియజేస్తుంది. నరేంద్ర ప్రపంచీకరణ ప్రభావాన్ని రాయాలనుకునే క్రమంలో యాజమాన్యం I.T సాధించిన అభివృద్ధిని రాయమంటుంది. అంటే ఇక్కడ ప్రసారసాధనాలు ప్రపంచీకరణ విధానాలకు ఎంతగా ప్రభావితమై పోయింది తెలియజేస్తుంది ఈ కథ.

నూతన ఆర్థిక విధానాలు అమలయిన తరవాత బహుళజాతి సంస్థల గుత్తాధిపత్యంలో ప్రభుత్వాలు నడిచే స్థితికి చేరుకున్నాయి. దేశం సార్వభౌమాధికారం క్రమంగా కోల్పోతున్నది. మనదేశం ప్రపంచ బ్యాంక్ కు అమ్ముడు పోయిన విధానాన్ని ఓల్గా 'కోకాకోలా' కథలో చిత్రించారు. అమెరికా అధ్యక్షుడి కోసం అర్జెంటీనా అధ్యక్షుడు చేసే మర్యాదలు, తమనితాము అమ్ముకొనే విధానం, దేశాన్ని అప్పుల్లో ముంచే సంస్కరణలు మోకాళ్ళమీద నడచే సంఘాన్ని ఏర్పరుస్తారు.

ఎవరికాళ్ళ మీద వాళ్ళు నిలబడటం ప్రమాదకరం కాబట్టి చేతుల మీద నిలబడటం తప్ప గత్యంతరం లేదంటారు. అగ్రరాజ్యాలు మెప్పుకోసం వర్ధమాన దేశాలు చేసే ప్రయత్నాలను ఈ కథ చిత్రించింది.

ప్రపంచీకరణ వాణిజ్యం వలన అనేక పరిశ్రమలు పెరిగి పోతున్నాయి. ఈ పరిశ్రమలనుంచి వెలువడే కాలుష్యం వలన నీరు, గాలి సమస్తం కాలుష్యంకోరల్లో చిక్కుకుంది. పర్యావరణం పూర్తిగా ధ్వంసం అవుతున్నది. ఈ నేపథ్యంలో జీవవైవిధ్యానికి ప్రమాదం ఏర్పడుతోంది. ప్రపంచీకరణ ప్రభావం వలన గ్రామీణ ప్రాంతాలలోని సమస్త కులవృత్తులు అంతరించిపోతున్నాయి. కొన్ని వందల సంవత్సరాలు గ్రామీణ జీవిత అవసరాలు తీర్చిన  కులవృత్తులు, రెండు దశాబ్దాల ప్రపంచీకరణతో అంతమయ్యేస్థితికి చేరుకున్నాయి.  నేడు అనేక బహులజాతి కంపెనీలు ఉత్పత్తి చేస్తున్న వస్తువులకు విశేష ప్రచారం చేస్తూ సాంప్రదాయ దేశీయ వృత్తులను ధ్వంసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చినటువంటి కథ అశోక్ కుమార్ 'కులవృత్తులు' ఈకథలో ఫ్రిజ్ లు వచ్చి కుండలు తయారీ మాయం కావడాన్ని హృద్యంగా చిత్రించారు రచయిత.

అమెరికా పెళ్ళి సంబంధాల మోజులో పడి నేటి యువత తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు. చిన్నతనంలో తాటి ఆకులతో ఆడమగ బొమ్మలు చేసి వాటికి పెళ్ళిళ్ళు చేసి ముచ్చట పడిపోయేస్థితినుంచి, అమెరికా సంబంధాల మోజులో జీవితాలే బొమ్మల పెళ్ళిళ్ళుగా చేసుకొని జీవితాలను నరకప్రాయం చేసుకుంటున్నారని ఆచార్య శరత్ జ్యోత్స్నారాణి 'బొమ్మల పెళ్లి' కథలో చిత్రించారు.

ప్రపంచీకరణ ప్రభావితం చేసిన రంగాల్లో చేనేత రంగం ప్రధానమైనది. ఒకనాడు ప్రపంచమే అబ్బురపరిచేటువంటి చీర నేసిన నేతన్న నేడు ఉపాధిలేక పట్టణాలకు వలసపోయే స్థితికి రావడం బహుళజాతి సంస్థల పాపమే. ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చిన తరవాత గ్రామాల్లోని మరమగ్గాలు మరుగున పడిపోయి చేనేతకారులు జీవనోపాధిని కోల్పోయారు.  ఈ నేపథ్యాలను వివరించిన కథ సుంకోజి దేవేంద్రాచారి రచించిన 'అన్నంగుడ్డ' కథ.  ఇలాంటి దృక్పథానే వివరించిన మరో కథ ఖదీర్‌బాబు 'న్యూబాంబెటైలర్స్'. ఫ్యాషన్ దుస్తులు మార్కెట్లను ముంచెత్తడం, రెడీమేడ్ గా దుస్తులు మార్కెట్లలో విరివిగా దొరుకుతుండటంతో ఉపాధికోల్పోతున్న టైలర్ జీవితాన్ని చిత్రించాడు ఖదీర్ బాబు.

నూతన ఆర్థిక విధానాలు భారతదేశంలోకి ప్రవేశించిన తరవాత యువతకు విదేశీ వ్యామోహం ఎక్కువగా పెరిగింది. అమెరికా అంటే పడిచచ్చేలాగా నేటి యువత తయారవుతున్నది.

దీనికి కారణం అక్కడ అంతులేని సంపదలు ఉన్నాయని, భూతల స్వర్గం అమెరికా అని బహుళజాతి సంస్థలు ఊదరగొట్టడమే. అయితే వాస్తవానికి అమెరికాలో ఉన్న సంబంధాలన్ని ఆర్థిక సంబంధాలే తప్ప మానవత్వసంబంధాలు, ఆప్యాయతలు కరువనీ చిత్రించిన కథ అబ్బూరి ఛాయదేవి ' అదొక సంస్కృతి'. ఈ కథలో ధనవ్యామోహాలకు అమెరికా సంబంధాలకు యువత చిక్కుకున్న తీరును రచయిత్రి వివరించారు.

నగరాలకు వలస వచ్చిన కార్మికుల బతుకుల గురించి సుంకోజీ దేవేంద్రాచారి 'రాబందుల నేరం' కథలో చిత్రించారు. ప్రపంచీకరణతో పాటే దేశంలోకి విస్తృతంగా టెక్నాలజీ రావటం జరిగింది. వివిధ కంపెనీల సెల్ ఫోను భారతీయమార్కెట్లను ముంచెత్తాయి. ఈ పరిస్థితుల్లో STD,ISD, టెలిఫోన్ బూతులు నడుపుతూ బతికేవారు జీవనోపాధిని కోల్పోవడం జరిగింది. ఈ పరిస్థితిని చిత్రించిన కథ వారాల కృష్ణమూర్తి రచించిన 'పారాహుషార్'.

అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు తమ వ్యాపార విస్తృతికోసం ప్రపంచీకరణ అనే పేరుతో ప్రపంచం పై దాడి చేస్తున్నాయి. స్వేచ్ఛా వ్యాపారం పేరుతో కొనసాగుతున్న ఆ దాడి ప్రపంచీకరణ. ప్రపంచ బ్యాంకుల నుంచి ఋణాలు తీసుకొని ఆర్థిక సంక్షోభంలోకి నేడు చిక్కుకునే పరిస్థితి వచ్చింది. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ప్రపంచబ్యాంక్ దాని విధానాలను సమర్థించడం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించడం జరుగుతుంది. పలు ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ కార్పొరేటు సంస్థలకు అప్పగించడం, రాజకీయనాయకుల పరిస్థితిని 'గద్దొచ్చె కోడిపిల్ల' కథలో దార్ల రామచంద్ర చిత్రీకరించారు.

1991 సంవత్సరంలో నూతన ఆర్థికవిధానాలు దేశంలోకి ప్రవేశించిన తరవాత రూపాయి విలువ క్రమంగా తగ్గుతూ వస్తోంది. నాడు పద్దెనిమిది రూపాయల విలువగల డాలర్ నేడు యాభై ఎనిమిది రూపాయలు అయింది. ప్రపంచీకరణ విధానాల వలన ఆర్థిక లావాదేవీలు ప్రస్తుతం డాలర్ మారకం పై ఆధారపడి ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చే నాటికి మన రూపాయి బ్రిటీషు పౌండుతో సమానంగా ఉండేది. పాలకుల విధానాల వలన నేడు మన రూపాయి విలువ తగ్గుతూ వస్తుంది. ఈ పరిస్థితిని వివరించిన కథ బి.ఎస్. రాములు 'కామన్ వెల్త్'.

బహుళజాతి సంస్థలు అన్నింటి పై హక్కుల్ని పొందుతున్నాయి. ఒక మొక్క విలువ, సూక్ష్మజీవి విలువ తెలిసినా తెలియకపోయినా దానిపై పేటెంట్ హక్కుల్ని అమెరికావాడు పొందుతున్నాడు. నేడు పసుపు, అల్లం, వంకాయ, కాకర, శరీర భాగాల పై కూడా ఈ

మేధోహక్కుల్ని పొందుతున్నారు. ఈ పరిస్థితుల్ని వివరించిన కథ పెద్దింటి అశోక్ కుమార్ 'కీలుబొమ్మలు'.

ప్రపంచీకరణ ఇతివృత్తంగా నేడు అనేక కథలు వస్తున్నాయి. అలాగే వ్యాపార సంస్కృతి మీద చిత్ర 'హ్యాపిబర్త్‌డే' కథ రాశారు. అలాగే ప్రపంచీకరణ నేపథ్యంలో చాలా కథలు వచ్చాయి. ఈ క్రమంలో సి.వెంకటేశ్ 'గ్లోబల్ గ్రామం' ఖదీర్ బాబు రాసిన 'ఖాదర్ లేదు' ముదిగంటి సుజాతారెడ్డి 'నిశ్శబ్దం! నిశ్శబ్దం' జూకంటి జగన్నాథం 'వైపని' బమ్మిడి జగదీశ్వరరావు 'దూరానికి దగ్గరగా' గంటేడ గౌరునాయుడు 'తిరుగుడమ్మి' 'నరాలు తెగుతున్ననేల' శాంతినారాయణ 'రతనాల సీమ' డా. వి.చంద్రశేఖర్ రావు 'ఆవుపులి' సలీం 'రూపాయి చెట్టు' 'మరణదృశ్యం', బోన్సాగి' స్వామి 'తెల్లదయ్యం' ముదిగంటి సుజాతారెడ్డి 'జవాబులేని ప్రశ్నలు' 'వ్యాపారమృగం' బుర్రా రాములు 'గీ బతుకెందుకు' కాసుల ప్రతాపరెడ్డి 'శిథిలం' గీతాంజలి 'సంటిది' జె.శ్యామల 'చాపకిందినీరు' కుప్పిలి పద్మ 'సాలభంజిక' 'ప్రకంపనం' 'ఇన్ స్టంట్ లైఫ్' ఓల్గా 'మార్పు' 'ఓ పెళ్ళికథ' కె.వి.నరేందర్ 'ఇల్లు', 'బ్రె' ఓల్గా 'సారీజాఫర్' కాలువమల్లయ్య 'గ్లోబలి' పెద్దింటి అశోక్ కుమార్ 'కాగుబొత్త' 'వలసపక్షి', మీనాక్షి, ' సాఫ్ట్ వేర్' మొదలైనవి ఈ ఇతివృత్తంలో రాసినవి.ఇంకా చాలా మంది కవులు దీనిపై కథలు రాస్తూనే ఉన్నాయి.

తెలుగు సాహిత్యంలో కవిత్వం కన్నా బలంగా కథ ప్రపంచీకరణ ఫలితాలను విశదీకరించింది. ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన మార్పుల్ని బహుముఖ కోణాల్లో ఆవిష్కరించింది కథ. కథా సాహిత్యంలో కూడా ప్రపంచీకరణ పై బలమైన వ్యతిరేకత వ్యక్తమయింది.

## 2.3. ప్రపంచీకరణ – పాట

ప్రపంచీకరణ ప్రారంభంలోనే వాటి విధానాలను ఎండగట్టడంలో ముందున్న గేయ సాహిత్యం పాట. డంకెల్ ప్రతిపాదనలను తెరమీదకు తేవడానికి పాలకులు చేస్తున్న కుట్రలను అక్షరబద్ధం చేసి ఆలపించినది పాట. భారతదేశంలో పెట్టుబడి దారి విధానాల నుంచే వాటిని ప్రతిఘటిస్తూ పాటలను రచించి ఎంతోమంది కవిగాయకులు సమాజాన్ని చైతన్యం చేసేందుకు ప్రయత్నించడం జరిగింది. అంటే దీని మూలాలు ప్రపంచీకరణకు ముందు నుంచే మనం గుర్తించవచ్చు. ఈ క్రమంలోనే పాట ప్రపంచీకరణను కూడా ఎండగట్టింది. సామాన్య ప్రజానికానికి కూడా తేలికగా అంతర్జాతీయ కుట్రలను అర్థం చేయించింది. 1990 నుంచి పాట ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలచింది. నూతన ఆర్థిక విధానాల వలన ప్రజాజీవితం అతలాకుతలం కాసాగింది. దీన్ని నిరసిస్తూ

ఎంతోమంది వాగ్గేయకారులు, కవులు, కళాకారులు పాటలు రచించారు. వీరిలో ముందుగా ప్రజాయుద్ధనౌక గద్దర్, వంగపండు ప్రసాదరావు ప్రజావాగ్గేయకారుడు గోరటి వెంకన్న, డా. అందెశ్రీ, జయరాజు, యాదగిరి, విమలక్క, రసమయి బాలకిషన్ వంటి ప్రజాగాయకులు ప్రపంచీకరణకు వ్యతిరేకంగా గొంతెత్తి గీతాలు ఆలపించారు. గ్రామీణ వృత్తులు అంతరించిడం నుంచి అమెరికా యుద్ధోన్మాదం వరకు అన్ని అంశాలను పాట ప్రజలకు అర్థం చేయించింది. ప్రపంచీకరణ ప్రారంభం నుంచి నేటి వరకు పాట దాని విధానాలను వివరిస్తూ నిర్విరామంగా సాగిపోతూ ఉంది.

ప్రపంచీకరణ ప్రభావం ప్రధానంగా వ్యవసాయరంగంపై పడింది. దీని విధానాల వలన వ్యవసాయం సంక్షోభంలో  పడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయింది. బహుళజాతి సంస్థలు వాణిజ్య పంటలను ప్రోత్సహించడంతో రైతులకు కొద్దిపాటి లాభాలు వచ్చినప్పటికీ, దీర్ఘకాలంలో సంప్రదాయ పంటలు అంతరించిపోయే స్థితికి వచ్చాయి. గ్రామీణ వ్యవసాయ రంగం ఛిద్రమైపోయింది. ఈ పరిస్థితులు కళాకారులను ఆలోచింపజేశాయి. రైతులు ఆత్మహత్యల పై స్పందించి అనేక పాటలు రావటం జరిగింది.

నేడు ప్రధానంగా రైతులు పండించినటువంటి పంటలకు గిట్టుబాటు ధర కరువయింది. ఆ నేపథ్యాన్నే చింతల యాదిగిరి పాటగా చిత్రించాడు.

" ఆధునికరణతో అడుగంటే వ్యవసాయం

గిట్టుబాటు ధరలేక రైతు గుండె పగిలి చస్తుండు" ('ఎర్ర జెండా వెలుగుల్లో' క్యాసెట్ నుండి)

అంటూ యాదగిరి రైతుల దీనస్థితిని గిట్టుబాటు ధరల పతనానికి నిరసించి రైతుల మరణాలను మనముందు ఉంచుతాడు.

ప్రస్తుతం అంతా మారింది అని బుకాయించే పాలకుల మీద ఒక విసురు, వ్యంగ్యం ప్రకటిస్తాడు.

"పాతకాలంకాదు మారిందన్నారు

ఏమేమి మారిందో

నా ఒంటి బట్ట మారలే

నేనున్న గుడిసె మారలే

దోసుకునే తీరు మారలే

మారింది ఏమిటో మరి (అదే పాట నుండి) అని గుండెలో రగిలే భాదల విలపాలను వినిపించాడు. ప్రపంచీకరణ పరిణామాలతో రైతు భూమికి దూరమయ్యాడు. మధ్యతరగతి రైతులు పేదరైతులుగా మారితే చిన్న తరహా రైతులు కూలీలుగా మారారు. కూలీలు వలస పక్షులుగా మారారు. ఈ పరిణామాల్ని రచయితలు గుర్తించి పదాలతో దృశ్యీకరించారు.

"సిరులనిచ్చే బంగారుతల్లి

భూమాతకే నే దూరమా

బువ్వ పెట్టి నన్ను బుజ్జగించే

నేలమ్మలాలనకు దూరమా" (అదే క్యాసెట్ నుండి)అని ఆనంద్ రైతులకు నేలతో గల అనుబంధాన్ని తెలుపుతాడు. భూమి, రైతు ఉత్పాదక శక్తులు. ప్రపంచ జీవన చక్రం సాఫీగా నడవాలంటే పంట పండించే రైతు సంతోషంగా ఉండాలి. ఆరుకాలం శ్రమించి పంటలు పండించే రైతు. నేడు వ్యవసాయం భారమై అప్పులతో ఆకలితో  తల్లడిల్లుతూ, చివరికి పొలంలో వాడే పరుగులమందుతో ఆత్మహత్య చేసుకుంటున్నాడు. రైతు పరిస్థితి దారుణంగా మారింది.

"పురుగుల మందే నీకు

పెరుగన్నమాయెనా" (శ్రీరాములయ్య చిత్రం నుండి)

అని కలేకూరి ప్రసాద్ రైతుల  దీన పరిస్థితిని తెలిపాడు. అయితే రైతులు ఆత్మహత్యలకు పాల్పడవద్దనీ ఉద్యమించి జీవితాలను బాగుచేసుకోవాలని సందేశం అందించారు.

"ఆత్మహత్య నీకు దారి కాదన్నా

బతికుంది బరిలోన నిలువాలిరన్నా

దోచేటి దొంగల్ని తరమాలిరన్న" అని ఉద్బోధించారు.

రాష్ట్రప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచింది. పెరిగిన విద్యుత్ ఛార్జీలు అన్ని వర్గాల ప్రజలకు ఆర్థికంగా భారమైంది. దీని పై ముఖ్యంగా రైతులు మండి పడ్డారు. రైతులు దిక్కుతోచని స్థితిలోకి వెళ్ళిపోయారు. అలాంటి విషమ పరిస్థితిలో దుర్గేష్

"ఎట్లా బతకాలే

కరెంట్ షాకుతోటి ప్రాణమల్లాడే" (కరెంట్ షాక్ పాటల సీడి నుండి) అనే గీతం రాశారు. ప్రపంచీకరణ ప్రభావం వలన సమాజంలో కులవృత్తులు ప్రమాదంలో పడ్డాయి. కొన్ని వృత్తులు అంతరించేస్థితికి వెళ్ళడం జరిగింది.  ఈ నేపథ్యంలో కులవృత్తుల  మీద అనేక పాటలు వచ్చాయి. ఈ క్రమంలో చిరస్థాయిగా నిలిచే  పాట గోరటి వెంకన్న రాసిన 'పల్లెకన్నీరు పెడుతుందో' పాట.

ఈ పాట సామాన్య జనాలనే కాదు మేధావులను, రాజకీయ నాయకులను ప్రభావితం చేసింది. వృత్తుల మీద ఆధారపడిన దేశ ఆర్థిక వ్యవస్థ క్రమంగా కనుమరుగై పోవడం. ఈ పాటలో చిత్రించబడింది.

"పల్లెకన్నీరు పెడుతుందో
కనిపించని కుట్రలో
........ ......... ...........
కుమ్మరి వాగులో తుమ్మలు మొలిసెను
కమ్మరి కొలిమిలో దుబ్బపేరెను
సాలెల మొగ్గం సడుగులిరిగినై
పెద్దబాడిసలు మొద్దు బారి నై
చేతి వృత్తుల చేతులిరిగినాయో – నా పల్లెల్లోనా
గ్రామ స్వరాజ్యం గంగలోన కలిసే – నా పల్లెల్లోనా" (వెంకన్న గోరటి; 2005:పుట–36)

అని కులవృత్తులు కూలిపోవడాన్ని హృద్యంగా చిత్రించాడు గోరటి వెంకన్న. అనేక చరణాలతో సుధీర్ఘంగా సాగే ఈ పాట జనంనోళ్ళలో నానింది. ప్రపంచీకరణ దుష్ఫలితాలను, నేటిగ్రామాల దుస్థితిని ఈ పాట ఆవేదనాభరితంగా చిత్రించింది.

ఈ పాట ప్రేరణతో మరికొన్ని పాటలు వచ్చాయి. నల్లగొండ జిల్లా ప్రజా రచయిత చింతల యాదగిరి వలసెల్లిన ఊరి ధీనస్థితిని.

" వలసెల్లిపోయింది ఊరు
నేడు వల్లకాడయింది సూడు" (ప్రజానాట్యమండలి కరువు పాటల క్యాసెట్‌నుండి)
అంటూ చిత్రించాడు.

సరళీకృత ఆర్థిక విధానాలు అమలయిన తరవాత అనేక పరిశ్రమలు స్థాపించడం జరిగింది. ప్రయాణ వాహనాలు అధికమయ్యాయి. వీటి ద్వారా వెలువడే కాలుష్యం వాతావరణాన్ని ప్రభావితం చేసింది. భూతాపం పెరిపోయింది. ఫలితంగా వర్షాలు తగ్గిపోయి రైతులు కరువు కోరల్లో చిక్కుకున్నారు. పట్టణాలకు వలసలు ఆధికమైనాయి. ఈ నేపథ్యాన్ని పాటలుగా చిత్రీకరించారు కవులు.

" ఊరిడవమన్నది కరువు
ఉరితాడై ఉన్నది పరువు

నవ ధాన్యాల మాటే లేదు పల్లెల్లో

వలవల ఏడ్పుల వలస బాటలో'' (అదే క్యాసెట్ నుండి)

అంటూ ఆర్.ఎ.వాసు రాసిన పాట కరువునూ, పల్లెలు విడిచి పట్టణాలకు వలస వెళ్ళడాన్ని చిత్రించింది. కరువు కారణంగా సేద్యం పాతాళ జలం మీద ఆధారపడింది. ముఖ్యంగా రాయలసీమ,తెలంగాణ ప్రాంతాల్లో భూగర్భజలాలు ఇంకిపోయి, సాగునీరే కాక తాగునీరు కూడా అందని కరువు పరిస్థితుల్లోకి నెట్టబడుతున్నాయి.

నేడు రాష్ట్రంలో ఉండే రైతులకు గ్రామాలలో జీవనోపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్ళుతున్నారు. ఈ పరిస్థితికి అరుణోదయ సాంస్కృతిక కళామండలి సంతోష్

''ఉండుపయిలంగా ఉండు అమ్మమాయమ్మ (పైలం పాటల సీడి నుండి)

ఇల్లు పైలం చూడు తల్లిమాయమ్మ'' (కోదారి శ్రీనివాస్ రచయిత) అంటూ ఆలపించిన గీతం ప్రజలను విశేషంగా ఆకర్షించింది.

ప్రపంచీకరణ వలన నేడు విద్యారంగం వ్యాపారం రంగమైంది. విద్య ప్రైవేటీకరించడం వలన పేదలకు విద్యదూరమైంది. నాణ్యతలేని చదువు పేదలకు అందగా ప్రపంచీకరణకు అనువైన, అవసరమైన విద్య సంపన్న వర్గాల వారికి చేరుతోంది. ప్రభుత్వ సంస్కరణలు పేదలకు శాపాలు అవుతున్నాయి. ఈ పరిస్థితిని సత్తెన్న

''దేశంలో చదువులు సాగుతాయా ముందుకు

సర్కారోళ్ళు సంస్కరణలు తెస్తూ ఉంటే'' (విద్యార్థి కేక క్యాసెట్ నుండి) అని సర్కారి సంస్కరణల్ని ప్రశ్నించింది. ఉన్నత చదువుల కోసం పేదలు పడే కష్టాల్ని పాటల్లో రచయితలు చూపించారు. ఉన్నత విద్య నేడు పేదలకు అందని ద్రాక్షగా మారిపోయేస్థితికి వచ్చింది. ఈ నేపథ్యంలో భాస్కర్ రాసిన పాట ఆలోచనల్ని రేకెత్తిస్తుంది.

''పూటకు లేకున్నా పస్తులుండి

పై చదువులకు నిన్ను పంపిస్తిమి

బిడ్డా పట్నంలో ఒంటరిగా వొదిలిస్తిమి'' (అదే క్యాసెట్ నుండి) అని బిడ్డలను విద్యకోసం పట్టణాలకు పంపిన తల్లిదండ్రుల ఆవేదనను రాశాడు. ఎన్నో ఉత్తమ గీతాలను రాసిన భాస్కర్ ఈ పాటలో సమకాలీన విద్యారంగ పరిస్థితుల్ని వేదనతో చిత్రించాడు.

రాజేష్ ఖన్నా మరో మంచి కవి గాయకుడు. నిరుపేదలు ప్రైవేటీకరణకు దూరమవుతున్న స్థితిని చక్కని ఉపమానాలతో కవితాత్మకంగా

"కమ్మగ పాడే కోయిలమ్మకు

నల్లని రంగే శాపమా

వెన్నెల నిచ్చే చందమామకు

మచ్చలుండుటే నేరమా" (అదే క్యాసెట్ నుండి)అంటూ చిత్రించాడు.

విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా అనేక పాటలు వచ్చాయి. విద్యనేడు కొనగలిగిన వారికి వరమైంది. ఈ పరిస్థితుల్లో పేదలు విద్యకు దూరమౌతున్నారు. విద్య అందరికి అందాలి అనే నేపథ్యంలో

"మీ త్యాగాల బాటలో నడుస్తాం

అడ్డంకులెన్నైనా గెలుస్తాం

అందరికి అందేవరకు సదువు

ఆపము మన ఉద్యమాల దరువు

విద్యావ్యాపారం కుట్రల" (అదే క్యాసెట్ నుండి) పైన అంటూ యుద్ధం ప్రకటిస్తాడు కవి గాయకుడు పసునూరి రవీందర్.

విద్యారంగం వలెనే వైద్యరంగం కూడా పూర్తిగా వ్యాపారీకరణ చెందింది. వైద్యరంగం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి కొరవడడం మూలంగా ప్రైవేట్ వ్యక్తులు వైద్యాన్ని కార్పొరేటీకరణ చేశారు. పేదలకు వైద్యం చేయించుకునే స్థోమతలేక వారి ప్రాణాలు గాలిలో చిరుదీపాలవుతున్నాయి. దీని పట్ల కూడా కళాకారులు స్పందించారు.

"నంజురోగమొచ్చిన పిల్లలురా

వెలివాడలల్లా నేసుకుంటగోసదీస్తరో" (వెంకన్న గోరటి:2005;పుట-46) అని గోరటి వెంకన్న పేదల దీనస్థితిని తెలిపాడు.

భారతదేశ సంస్కృతి ఒకనాడు ఇతర దేశాలకు ఎంతో ఆదర్శంగా ఉండేది. నేడు ప్రపంచీకరణ ప్రభావం వలన మన సంస్కృతి కూడా పరాయీకరణ దిశగా వెళుతోంది. ప్రజల ఆహార అలవాట్లు, వస్త్రధారణ, కళలు అన్నిటిని బహుళజాతి సంస్థలు ప్రసార మాధ్యమాల ద్వారా అమెరికీకరణ చెందిస్తున్నాయి. సంస్కృతి పతనం అవుతుందని ఆవేదన చెందుతూ శ్రీకాంత్

"మన సంస్కృతి హీనంగా

బహు ఘోరంగా దిగజారిపోతుంది" అని రాసిన గీతంలో సంస్కృతి పతనం

అవుతున్న తీరును వివరించాడు. ఈ పాట తిరోగమన వాదులను బలంగా ఆకర్షించింది.

మరొక కవి

"దేశమును ప్రేమించమంటే
ఓరన్న! దేశ సంపదమెక్కుతుండే
మంచి అన్నది పెంచమంటే
దేశాన మంది కొంపలు ముంచుతుండే" అనే గీతంలో విద్యా, కళలు, నైతిక సంస్కృతి అంతరిస్తున్న తీరును ఎండగడతాడు.

"చదువులు పోయెను
శాస్త్రాలు పోయెను
సరిగమ పదనిస
కళలెన్నో ఊడిగెను
బ్రేకుడాన్సులు వచ్చెరా
బ్రెయిన్ చచ్చిపోయెరా"(జయరాజు;2012:పుట-13) అంటూ సంస్కృతి, విద్యారంగాలలో వచ్చిన మార్పులను వివరించాడు.

ఒకప్పుడు ప్రసార సాధనమంటే దూరదర్శన్ మాత్రమే కొన్ని దశాబ్దాల పాటు దూరదర్శన్ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను, ప్రభుత్వ విధానాలను రాజ్యం అనుమతించిన పరిధిలో దృశ్యీకరించింది. దూరదర్శన్ ప్రజలనైతిక విలువలకు భంగం కలగకుండా తన కార్యక్రామాలను ప్రసారం చేసేది. అయితే 1990 తర్వాత వచ్చిన ఉదారవాద విధానాల వలన బహుళజాతి సంస్థలకన్ను మద్య తరగతిని ఆకర్షించే పనిలో పడింది. వివిధ రకాల టెలివిజన్ ఉత్పత్తులను మార్కెట్లలోకి ముంచెత్తింది. ప్రైవేట్ ప్రసారసాధనాలు అందుబాటులోకి తెచ్చింది. రకరకాల సీరియల్స్, ఫ్యాషన్‌షోలు, సినిమాలను ప్రదర్శిస్తూ నేడు ప్రజలను ముఖ్యంగా మహిళలను బానిసలుగా మలిచాయి. ఇవి విస్తరిస్తున్న క్రమంలో నైతిక విలువలకు తిలోదకాలిచ్చాయి. వీటి ద్వారా బహుళజాతి సంస్థలు రెండు ప్రయోజనాలను ఏకకాలంలో పొందుతున్నాయి. 1. తమ వస్తువులకు వ్యాపార ప్రచారం చేసుకుని వస్తువినియోగ సంస్కృతిని పెంచుతున్నాయి. 2. ఈ దేశ సంస్కృతిని ధ్వంసం చేస్తూ విదేశీ సంస్కృతిని ఇక్కడి ప్రజలకు అలవరస్తున్నాయి. అందుకే గద్దర్ టీ.వీ. వ్యసనాన్ని వివరిస్తూ అద్భుతమైన గీతం రచించాడు.

"కయ్యం పెట్టిందిరో

కలర్ టీ.వి. ఇంట్లకొచ్చి

దయ్యం బట్టిందిరో

నాపెళ్ళాం పోరలకు"

ఇంటిలోన టీ.వి

అరె విషం చిమ్ముతున్నది"(గద్దర్ గళం పాటల సీడి నుండి) అంటూ గద్దర్ ప్రసారసాధనాల విష సంస్కృతిని తీవ్రంగా నిరసించాడు.

ప్రైవేటీకరణ కార్మికుల పట్ల ముప్పుగా పరిణమించింది. ఎంతో మంది కార్మికులు ఉపాధి కోల్పోతూ ఆకలి చావులకు గురి అవుతున్నారు. అందుకే ప్రభుత్వ రంగాన్ని తమ ఉపాధిని కాపాడుకోవాలనే స్ఫూర్తిని రగిలించిన గీతం

"అమ్ముతుంటే చూద్దామా?

ప్రభుత్వ రంగాన్ని

మన రక్తం ధార పోసి

పెంచిన సంపదని"(ప్రజా నాట్యమండలి పాటల సీడి నుండి) అని డి.బి.చారి రాశాడు.

పాలకులు బహుళజాతి సంస్థలకు ప్రభుత్వ ఆస్తుల్ని విక్రయించడం నిర్విరామంగా ఒక యజ్ఞంలా కొనసాగిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులకు ప్రజల ఆస్తులను కారుచౌకగా అమ్మడం కార్మికులను, రచయితలను కలవరపరచింది.

"బహుళజాతి పెట్టుబడికి

బానిసై గౌర్నమెంట్

ప్రజల ఆస్తులన్నింటిని

ప్రైవేటోళ్ళ కిస్తున్నది"(ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సీడి నుండి) అని నిస్సార్ ఈ గేయంలో ప్రభుత్వ తీరును ఎండగడతాడు.

ప్రపంచ బ్యాంక్ అప్పుల కొరకు తాకట్టు పెడుతున్నారని తెలిపే పాటలు కూడా వచ్చాయి.

"విద్యా వైద్యం బ్యాంక్ రవాణా

ప్రభుత్వ సంస్థలను మొత్తం

ప్రభుత్వ సంస్థలను

దంకెలోడికి తలొంచి

కాంగ్రెస్ అప్పజెప్పుతుంది" (అదే సీడి నుండి) అని రాములు రాసిన గీతం నూతన ఆర్థిక విధానాలు అమలవుతున్న తొలిదశలో రాసింది.

అమెరికాకు చెందిన కోకాకోలా కంపెనీ భారతదేశంతో సహా 95 దేశాల్లో వ్యాపారం చేస్తున్నది. లక్షల కోట్ల రూపాయల టర్నోవర్ కలిగి ఉంది. కోట్ల రూపాయలను వర్ధమాన దేశాల నుంచి ఈ కంపెనీ కొల్లగొడుతోంది. 1958లో ఈ కంపెనీ భారతదేశంలో తన వ్యాపారాన్ని ప్రారంభించింది. అయితే  ఈ కంపెనీ భారత ఆర్థిక రాజకీయ వ్యవహారాల్లో తలదూర్చి చీకటి వ్యాపారం చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో 1978లో జనతా ప్రభుత్వం, ఆనాడు జార్జిఫెర్నాండెజ్ తదితరులు పట్టుదలతో దేశంలో దీని వ్యాపారం నిషేధించారు. ఆనాడు ఇదొక సంచలనం. దేశభక్తి చర్యగా చెప్పుకున్నారు. కానీ 1991లో నూతన ఆర్థిక విధానాలతో విదేశాలకు గేట్లు బార్లగా తెరిచాక తివాచీ పరచి కోకాకోలాను మరీ ఆహ్వానించారు పాలకులు.

ప్రస్తుతం'కోకాకోలా' భారతీయ మార్కెట్లో ఆధిపత్యం వహిస్తుంది. పెద్దపెద్ద నగరాల నుంచి నీళ్ళు దొరకని గ్రామీణ ప్రాంతాల వరకు దీని విస్తృతి వ్యాపించింది. కానీ దీనిలో హానికర విషరసాయనాలు ఉన్నాయనే వాదన కూడా ఉంది.

సాంబరాజు యాదగిరి కోకాకోలా ఉత్తత్పుల గురించి అందమైన ఆలోచనాకరమైన గీతాన్ని రాశారు.

"ఆలీవన్ కోలా

ఈ కోలా లీలలుచాలా" (ప్రజానాట్యమండలి పాటల సీడి నుండి) అని కోకాకోలా కంపెనీదోపిడిని చిత్రించాడు.

రెండవ ప్రపంచ యుద్ధం తరవాత అమెరికా గణనీయంగా ఆయుధ సంపత్తి పెంచుకుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆదిపత్యదేశంగా ఉంది. నూతన ఆర్థిక విధానాల వలన ఇది భారతదేశంపై కూడా కాలుమోపింది. ఈస్థితిని గద్దర్

"అదిగదిగో అదిగోసూడు అమెరికోడోస్తుండూ

జపాన్ జర్మనితోడు అమెరికోడోస్తుండు

బాంబుల సంచులతోని బందూకులు లోడు చేసి

తల్లి భారతి ఎదలమీద పాదాలు మోపిండుసూడు"(గద్దర్ గళం క్యాసెట్ నుండి) అంటూ ఆలపించాడు

ఈ విధంగా పాట ప్రపంచీకరణను తీవ్రంగా ప్రతిఘటించింది. ప్రపంచీకరణ పట్ల ఇక్కడ ఎక్కువగా వ్యతిరేకత కనిపిస్తుంది. అయితే పాట ప్రపంచీకరణ వలన కలుషితమవుతున్న సంస్కృతిని, ఫ్యాక్టరీలు మూతపడి కార్మికుల ఆకలిచావులను, చేనేతల పరిస్థితిని, కులవృత్తులు అంతరించి పోవుటను, ఛానెల్ల విషసంస్కృతిని తీవ్రంగా వ్యతిరేకించింది. దానికి తగ్గట్టు గాయకులు కూడా గళం విప్పారు. ఈక్రమంలోనే ఎంతో మంది రచయితలు పాటలు రాస్తున్నారు. వారిలో గద్దర్, గోరటివెంకన్న, మిత్ర, విమలక్క, అందెశ్రీ, సత్తెన్న, భాస్కర్, స్ఫూర్తి, యాదగిరి, నేర్నాల కిషోర్, గర్జన, సిధారెడ్డి వంటి కవులు రాసిన పాటలు ప్రపంచీకరణ క్రమంలో ప్రజలను చైతన్యవంతం చేశాయి.

## 2.4. ప్రపంచీకరణ – నాటకం

ప్రపంచీకరణ కవిత, కథ, నవల, పాటలో ప్రతిఫలించినట్లుగానే నాటకంలో కూడా ప్రతిఫలించింది. అయితే నాటకంలో వచ్చిన సాహిత్యం కొంత తక్కువనే చెప్పాలి. నాటకాలు తక్కువగా వచ్చినప్పటికీ ప్రపంచీకరణ ప్రభావాన్ని అధికంగా చూపించాయి.

సామ్రాజ్యవాద ఆర్థిక, రాజకీయ, సంస్కృతి ఫలితంగా గ్రామీణజీవనం అధికంగా విధ్వంసానికి గురైంది. ఈ నేపథ్యంలో వచ్చిన నాటకం 'పడమటిగాలి' దీని రచయిత, దర్శకుడు పాటిబండ్ల ఆనందరావు. ఈ నాటకం రాష్ట్రవ్యాప్తంగా విశేషమైన ప్రజాదరణ పొందింది. కొన్ని వందల సార్లు ప్రదర్శించబడింది. నాలుగున్నర గంటలు పూర్తి నిడివి గల నాటకం ఇది.

ప్రపంచీకరణ నేపథ్యంలో శిథిలమైన గ్రామీణ జీవితాన్ని చిత్రించిన నాటకాలు సుమారు ఐదుకు పైగా ఉన్నాయి. అయితే అవి చాలా వరకు ఆముద్రితాలు. ప్రదర్శన రూపంలోనే అవి అందుబాటులో ఉన్నాయి.

విద్య కార్పొరేటు వ్యాపారం అయిన తరవాత విద్యార్థులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. దీని గురించి చర్చించిన నాటకం 'హింసధ్వని' దీని రచయిత వల్లూరి.
డంకెల్ ఒప్పందాల నేపథ్యంలో వచ్చిన నాటకం 'విజన్ 2020' దీని రచయిత ఇ. వెంకటేశ్వర్లు ఈ నాటకం బ్యాంక్ ప్రయోజిత విధానాలను విమర్శిస్తూ వచ్చింది.

'మూసికోలా' నాటకాన్ని జె. జనార్ధన్ రాశాడు. శీతల పానియాల వ్యాపారం అలవాటు మీద వ్యంగ్యాస్త్రం ఈ నాటకం. కూల్‌డ్రింక్‌ల్లో పురుగుల మందులు వాడటాన్ని ఇతివృత్తంగా చిత్రించింది. సుదీర్ఘ నిడివి కలిగిన నాటకమిది.

ఉదారవాద ఆర్థిక విధానాలు అమలు తర్వాత వ్యవసాయ రంగం గణనీయమైన మార్పులకు లోనైంది. నూతన వాణిజ్య పంటల విధానం రావడం, టర్మినేటర్ విత్తనాలు (బహుళజాతి సంస్థలు అభివృద్ధి చేసినవి) వాడకం మొదలైంది. ఈ పరిస్థితుల్ని దృశ్యీకరించిన నాటకం 'అంకుల్‌శ్యామ్' రచయిత అగ్నిపుత్రుడు.

గాట్ ఒప్పందంలో 'Tread Releated Intelectual Property Rights' అనేది ముఖ్యమైన అంశం. దీనినే వ్యాపార సంబంధ మేధోపర హక్కులు అమలు చేయడం అంటారు. దీని ప్రకారం మనం సాంప్రదాయంగా ఉపయోగించే ఔషధ విలువలు గల పసుపు, అల్లం, వేప లాంటి పదార్థాలపై బహుళ జాతి కంపెనీలు పేటెంట్ హక్కులు పొందాయి. వేప చెట్టుమీద, హక్కుల మీద ప్రాకృతిక ఉత్పత్తుల మీద వచ్చిన నాటకం 'డంకెల్ పుల్లలు' రచయిత శ్యామ్‌రావు. ఇక ఇక్కడి వేప పుల్లలు డంకెల్ పుల్లలుగా అందుబాటులోకి వస్తాయని వ్యంగ్యంగా చెప్పిన నాటకమిది.
డంకెల్ ప్రతిపాధనల మీద వచ్చిన మరో నాటకం 'డంకెల్ భాగోతం' దీని రచయిత వంగపండు ప్రసాదరావు.

ప్రజానాట్యమండలి రూపొందించి ప్రదర్శించిన వీధి నాటకం అప్పా?అమ్మకమా? రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ప్రదర్శనలతో ప్రజలను చైతన్యవంతం చేసిందీ నాటకం.

'డాలర్ భాగోతం' ను అరుణోదయ సాంస్కృతిక సంస్థవారు ప్రదర్శించారు. విద్యుత్ పోరాటం మీద ఆనంగారి భాస్కర్ 'చిరుతల రామాయణం' ప్రదర్శించాడు. నూతన ఆర్థిక విధానాలు దేశంలో కలిగించిన దుష్పరిణామాలు దీనిలో ఇతివృత్తం.

ఈ విధంగా నాటకంలో ప్రపంచీకరణ విధానాలు ప్రదర్శితమయ్యాయి.

## 2.5. ప్రపంచీకరణ – తెలుగు నవల

ఇప్పటి వరకు తెలుగు సాహిత్యంలో ప్రపంచీకరణ పై వచ్చినటు కవిత్వం, కథలతో పోలిస్తే నవలా సాహిత్యంలో దీని విస్తృతి కొంచెం తక్కువనే చెప్పాలి. సమజంలో కలిగిన ఏ సంఘటననైనా కవిత్వం, కథల్లో త్వరగా వ్యక్తమవుతుంది. నవలల్లో వస్తువు మారడం అనేది దీర్ఘకాలికమైంది. అయితే ఈ మధ్య కాలంలో నవలల్లో కూడా ప్రపంచీకరణ వస్తువుగా మారుతోంది. ప్రస్తుతం ప్రపంచీకరణ పై విపరీతమైన చర్చలు, సదస్సులు, వీధిపోరాటాలు, ప్రదర్శితమవుతున్నాయి. అందువల్ల రచయితలు కూడా 'ప్రపంచీకరణ' ను నవలల్లో ప్రధానంగా చూపించే ప్రయత్నం విస్తృతం చేస్తున్నారు.

ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు నవలల్ని పరశీలిస్తే జి. కళ్యాణ రావు 'అంటరాని వసంతం' నవల నుంచి పప్రంచీకరణ ప్రస్తావన కనిపిస్తుంది. ప్రజలు రాజ్యం, సామ్రాజ్యవాదంతో ప్రతి ఘటించడం ఈ నవల చిత్రించింది. వేముల ఎల్లయ్య రాసిన 'కక్క' నవల ఆధునిక సమాజంలో పప్రంచీకరణ ప్రభావంతో ఇవాళ గ్రామీణ ప్రాంతాల్లో వస్తున్న మార్పుల్ని , గ్రామాల్లోని రెడ్లు వవ్యసాయాన్ని విడిచి పెట్టి పట్టణాలకు వెళ్ళి రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి ప్రవేశిండాన్ని వివరించింది. ఇదంతా ప్రపంచీకరణ ప్రభావమే అని తెలుస్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో లౌకిక విలువలు పతనమవుతుండటం, అగ్రకూలలు ఇవాళ హిందూత్వాన్ని గ్రామాల్లోకి తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ పరిణమాలు చిత్రించిన నవల వేముల ఎల్లయ్య 'సిద్ధి'

ప్రపంచీకరణ మూలంగా నేడు వివిధ వర్గాల అస్థిత్వాలు ప్రమాదంలో పడుతున్నాయి. ప్రస్తుతం వివిధ గుర్తింపు ఉద్యమాలు అధికం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చిన నవల 'ఐదుహంసలు' దీని రచయిత డా.వి.చంద్రశేఖర్‌రావు. రాజ్యం వివిధ అస్థిత్వ ఉద్యమాలు అణచివేయడం, రోజురోజుకి మరింత అణచివేతకు ఉపక్రమించడం ఇందులో కనిపిస్తుంది. మతతత్త్వం బలపడటం చిత్రించాడు. ఉదారవాద ఆర్థిక పరిస్థితుల్లో సంభవిస్తున్న పరిణమాలను 'నిరంజన్' పాత్ర ద్వారా చర్చించాడు.

కాశీభట్ల వేణుగోపాల్ రాసిన' నేను – చీకటి' నవలను ప్రపంచీకరణ పరిస్థితుల్లో అర్థం చేసుకోవాలి. ఈక్రమంలో స్త్రీల విలువలు దిగజారిపోతున్నాయి. స్త్రీని ఒక మనిషిగా గాక ఒక సరుకుగా చూపించే పరిస్థితిని నేటి ప్రపంచీకరణ బహుళజాతి సంస్థలు చూపిస్తున్నాయి. దీంతో జీవన విలువలు పతనమవుతున్నాయి. ఈ పరిస్థితుల్ని ఈ నవల హృద్యంగా చిత్రించింది.

సలీం రాసిన నవల 'వెండిమేఘం'. ఇది ముస్లిం జీవితాలను చిత్రించింది. ఈ నవలలో గత దశాబ్ధ కాలంగా ముస్లింలు ఎదుర్కొంటున్న ఆస్థిత్వం కనబడుతుంది. ప్రపంచీకరణ విధానాలు ఆరంభమైన తొలి దినాల్లో ముస్లింల అస్థిత్వం విషమస్థితి ఎదుర్కొంది. ప్రపంచీకరణను, స్త్రీలు అనుభవిస్తున్నటువంటి అవమానాలను ఈ నవల వివరించింది.

ప్రపంచీకరణ విధానాలు, బహుళజాతి సంస్థలు దేశంలో ప్రవేశించిన తర్వాత పర్యావరణంలో పెను మార్పులు సంభవించాయి. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు భారీ ప్రాజెక్ట్‌లను నిర్మిస్తున్నాయి. దీంతో అక్కడ నవసిస్తున్న ప్రజలు ముంపునకు గురవుతున్నారు. పర్యావరణం

దెబ్బతింటుంది. ఈ నేపథ్యాన్ని చర్చించిన నవల చంద్రలత రాసిన 'దృశ్యాదృశ్యం'. ఈ నవల భారీ ప్రాజెక్ట్ ల కారణంగా దెబ్బతింటున్న పర్యావరణాన్ని చిత్రించింది. సమకాలీన పరిస్థితుల నుంచే భారీ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఆదివాసీలు, వివిధ వర్గాల ప్రజలు చైతన్యం అవుతున్నారన్న సంగతి మరవరాదు.

ప్రపంచీకరణ బహుళజాతి సంస్థలు భారత దేశంలోకి ప్రవేశించడంతో ఇక్కడి కుల వృత్తులు దారుణంగా దెబ్బతిన్నాయి.కొన్ని వందల సంవత్సరాల పాటు తమ కులవృత్తులతో జీవనో పాధిని పొంది ప్రశాంతంగా జీవించిన వివిధ వర్గాల ప్రజలు నేడు కులవృత్తులకు దూరమై నగరాలకు వలసలు పోతున్నారు. ఇవాళ కులవృత్తులు కూడా పెట్టనివిగా తయరయ్యాయి. వేలమంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రపంచీకరణ కులవృత్తులను చావు దెబ్బతీసింది. దీని విధానాల ద్వారా మార్పులకు గురైన కులాల్లో గౌడ కులం ఒకటి. గీత వృత్తి కార్మికుల దుర్భర పరిస్థితిని చిత్రించిన నవల నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్ 'బతుకు తాడు'.ఈ నవల గత దశాబ్దల కాలంగా గౌడ కులస్థులజీవితాల్లోని సామాజిక, ఆర్థిక, మార్పులను చిత్రించింది. ఇవాళ బహళజాతి సంస్థల మద్యం మార్కెట్లో ప్రవేశించడంతో గౌడల కల్లుకు ఆదరణ కరువైవారి బతుకులు దుర్భరమవుతున్న స్థితి ఇందులో చూపించారు రచయిత.

ప్రపంచీకరణ నేపథ్యంలో నేడు 'డాలర్' సంపాదన ఒక కల. అది శ్రీమంతులనే కాక మధ్య తరగతి మనుషులనూ సైతం తన వైపు తిప్పుకుంటోంది. డాలర్ వేటలో పడి ఒక మధ్య తరగతి కుటుంబం ఏ విధంగా పతనమైందో చర్చించిన నవల సింహప్రసాద్ రాసిన 'డాలర్ ......డాలర్'.

ప్రస్తుత ప్రపంచీకరణ సందర్భంలో మానవ సంబంధాలన్నీ 'మనీ' సంబంధాలుగా, మార్కెట్ సంబంధాలుగా మారిపోతున్నాయి. మనిషి అన్ని మానవీయ విలువలను అది హరించే స్థితిని కల్పించబోతోంది. సుధామూర్తిగారు రచించిన నవల 'డాలర్ కోడలు'. ఈ నవలలో మధ్య తరగతి జన జీవితంలోని మానవ సంబంధాలను 'డాలర్' ఏ విధంగా ప్రభావితం చేస్తుందో దాని పర్యవసానాలు ఎలా ఉంటాయో ఎంతో హృద్యంగా తెలియజెప్పింది రచయిత.

ప్రసార మాధ్యమాలు సమాజంలో ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేస్తాయనడం నిర్వివాదాంశం. ప్రపంచీకరణ వలన ప్రింట్, ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాల వ్యాప్తి విపరీతంగా పెరిగింది. ప్రసార సాధనాల వలన యువత పెడదోవ పట్టి ఏవిధంగా తమ జీవితాలను నాశనం చేసుకుంటుందో చిత్రించిన నవల 'కాంచన మృగం' దీని రచయిత సలీం.

ప్రపంచీకరణ బహుళ జాతి సంస్థలు ఇవాళ ప్రపంచ మార్కెట్‌లో సింహభాగాన్ని ఆక్రమించుకున్నాయి. మనిషి కోసం సరుకును కాకుండా సరుకు కోసం మనిషిని అది నేడు సృష్టించు కుంటుంది. ఈ ప్రపంచీకరణ బహుళజాతి సంస్థలు తమ మార్కెట్లను ఈ రోజు వర్థమాన దేశాల్లో అధికంగా నెలకొల్పుతున్నాయి. దీనికి కారణం ఇక్కడ నివసించే మధ్యతరగతి ప్రజలకు వస్తు వ్యామెహం కలుగజేసి తమ లాభాలను ఇనుమడింపజేసుకోవడమే. ప్రపంచీకరణ మనిషికి సహజంగా కొన్ని అవసరాలు తీరుస్తున్నది. వస్తువ్యామెహంతో నేడు అధికారులు తీవ్రమైన అవినీతి, లంచగొండితనంలోకి వెళ్ళి పోతున్నారు. ఈ పరిణామాలను చిత్రించిన నవల సింహ ప్రసాద్ రాసిన తమసోమా.

ప్రపంచీకరణ విధానాలు పుష్కలంగా అమలవుతున్న నేడు ప్రతి రంగం వ్యాపార పరమైపోయింది. ఆ కోవలోనే నేడు వైద్యం కూడా ఖరీదైన పెట్టుబడిదారీ బహుళ జాతి కంపెనీల పాలిట కల్పతరువ వుతోంది. కార్పొరేట్ హాస్పిటల్ల దోపిడి తీరుని, వాటి నిర్లక్ష్యం కారణంగా మూడేళ్ళ బాబు జీవితంలో చోటు చేసుకున్న విషాద సంఘటనను అత్యంత హృద్యంగా చిత్రించిన నవల 'జీవన్మృతులు' దీని రచయిత సలీం.

ఆధునిక పోటీ ప్రపంచంలో అన్నీ వ్యాపారమైనట్టుగా విద్యారంగం కూడా అందులో భాగమైంది. ఈ రోజు ఎక్కడ చూసినా అపరిమిత సంఖ్యలో కార్పొరేట్ విద్యాసంస్థలు ఏర్పాటవున్నాయి వీటికి ధన వ్యామోహం తప్ప, మరొకటి కాబట్టదు. ఈ పరిణామాలను నేపథ్యంలో సలీం రచించిన నవల 'పడగనీడ'. ఈ నవల కార్పొరేట్ విద్యా సంస్థల ధనవేటను, తల్లిదండ్రులు తమ ఆశయాలు, లక్ష్యాలను పిల్లలపై రుద్దడం వలన వారు ఏవిధంగా మానసిక, శారీరక వత్తిడిని, హింసను అనుభవిస్తున్నారో చర్చింది.

ఆధునికంగా ఎలక్ట్రానిక్ యంత్రాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రాచీన ఆచారాలు, సంస్కృతులు అంతరించిపోతున్నాయి. నిజానికి ఇవాళ మనవికాని ఆచారాలు, పద్దతులు మన మీద బలవంతంగా రుద్దబడుతున్నాయి. కంప్యూటర్‌లు వచ్చి ఈ-మెయిల్ వంటివి రావడంతో లేఖలు ఏవిధంగా అంతరించి పోతున్నాయి తెలుస్తుంది. ఆధునికంగా మనిషి విశ్రాంతి లేని శ్రమకు అలవాటుడుపడుతూ సహజమైన ప్రేమను కోల్పోతున్నాడు ఈ పరిణామాలను చిత్రించిన నవల ఆదేళ్ళ శైలబాల రచించిన 'వెన్నెల్లో గోదావరి'.

పర్యావరణ పరిరక్షణ ప్రధాన భూమికగా చేసుకొని తోటపల్లి జగన్మోహనరావు రచించిన నవల 'జీవన విధ్వంసం' ఈ నవలలో గ్రానైట్ కంపెనీల కోసం ధ్వంసమవుతున్న కొండలూ, గుట్టల

గురించి, వాటిని కాపాడుకోవడానికి ప్రజలు చేస్తున్న పోరాటాల గురించి రచయిత కళ్ళకు కట్టినట్లు వివరించారు. ఆ పోరాట స్ఫూర్తిని సంఘటింతం చేస్తోన్న పర్యావరణ, ప్రజాస్వామ్య వాదుల కృషిని ఈ నవల చిత్రించింది.

పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన నవల 'జిగిరి'. సాహచర్యాన్ని బట్టి జంతువు మానవీకరణ చెందడం ఒక వైపూ, రాజ్యం సృష్టించిన వితరణ ఆళంబనగా చేసుకుని జంతువులుగా తెగబడ్డ మనుషులు మరోవైపు ఈ నవలలో కనిపిస్తారు. ప్రపంచీకరణ విధనాలు అమలవుతున్న ప్రస్తుతం మానవత మచ్చుకైనా కానరాకుండా పోతుంది. మనుషుల్లో లుప్తమవుతున్న మానవత్వం కోసం దివిటీ పట్టి వెతికిన నవల జిగిరి.

అమెరికా జీవితం అంటే అదొక స్వర్గం అని భ్రమపడతాం. ఒక సామాన్య భారతీయుడు అమెరికా గురించి ఊహించే ఊహకు, కనే కలలకు అసలు అమెరికా జీవన స్రవంతికి ఎంత తేడా? ఉంటుందో వివరించిన నవల డా. ఎస్. శంకరయ్య రచించిన 'పడమటికొండలు'. భూతల స్వర్గంగా భావించే అమెరికాలో కూడా నిరుద్యోగం, అవినీతి, దోపిడీ ఉందనీ అత్యాచారాలు నిత్యం జరుగుతుంటాయని ఈ నవలలో చిత్రించబడింది. రచయిత స్వీయ అనుభవంలోంచి పుట్టుకొచ్చిన నవల ఇది.

ప్రపంచీకరణ నేపథ్యంలో యస్.ఎం.ప్రాణ్‌రావు రాసిన నవల'అందం'. సమాజంలో ఇవాళ డబ్బుదే ప్రదాన పాత్రగా మారింది. ఈ నవలలో ప్రధాన పాత్ర మానస ఆమె కురూపి. ఆమె వేల కోట్ల రూపాయల కార్పొరేట్ సంస్థ చైర్మెన్ ప్రసాదరావు ఏకైక పుత్రిక. ఆ కోట్ల సంపదే ఆమె అందం. ప్రపంచంలోని ఎన్ని అందాలనైనా తన చెప్పుచేతుల్లో నడిపించగలదు ఆ ఆత్మ విశ్వాసం ఆమె అందానికి తోడవుతుంది. ప్రపంచంలో సంపదకు మించిన అందం మరొకటి లేదని ఈ నవల మరో ముఖ్యపాత్ర చంద్రకాంత్ నమ్మకం. ఈనాడు ప్రభావితం అవుతున్న అనేక ఆర్థిక, సామాజిక, కోణాలను ఈనవల ఆవిష్కరించింది.

ఈవిధంగా తెలుగు సాహిత్యంలో నవల కూడా ప్రపంచీకరణను బహుముఖంగా చిత్రిస్తూ ముందుకు పోతున్నది. నా పరిశోధనాంశం 'ప్రపంచీకరణ ప్రభావ నవలలు' కనుక నేను ప్రధానంగా ఎనిమిది నవలల మీద నాపరిశోధన కొనసాగించాను. అవి

1. డాలర్......డాలర్
2. డాలర్ కోడలు
3. కాంచన మృగం

4. తమసోమా!
5. జీవన్మృతులు
6. పడగనీడ
7. వెన్నెల్లో గోదావరి
8. బతుకుతాడు

ప్రపంచీకరణ ప్రభావం వలన పై నవలల్లో కనబడే ఆర్థిక,రాజకీయ,సామాజిక, సాంస్కృతిక అంశాలను తర్వాతి అధ్యాయాల్లో విపులంగా వివరిస్తాను.

# అధ్యాయం –3

# ఆర్థిక రంగం – ప్రపంచీకరణ ప్రభావ నవలలు

## 3.1 బహుళజాతి సంస్థలు

ఏదైనా ఒక పారిశ్రామిక దేశంలో ప్రధాన కేంద్రం కలిగి వుండి వివిధ దేశాలలో వ్యాపార లావాదేవీలను నిర్వహించే సంస్థలనే బహుళజాతి సంస్థలు (Multi National Corporations) అంటారు. వాటినే జాతి అతీత సంస్థలు (ట్రాన్స్‌నేషనల్ కార్పొరేషన్స్ TNC) అని కూడా పిలుస్తారు. ఈ సంస్థలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్నాయి. ఆర్థికంగా శక్తివంతంగా రూపొందాయి. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ లాంటి పారిశ్రామిక సంపన్న దేశాలకు చెందినవే ఈ బహుళ జాతి సంస్థలు. ప్రపంచీకరణ జరుగుతున్నది, అమలవుతున్నది బహుళజాతి సంస్థలు మరియు ఫైనాన్స్ పెట్టుబడుల రూపంలోనే.

“1970 ప్రాంతంలో సుమారు 7000 బహుళజాతి కంపెనీలు వున్నాయి. 1990 దశకం ప్రారంభం నాటికి వాటి సంఖ్య 38,000లకు పెరిగింది. ప్రస్తుతం వాటి సంఖ్య అధికమై ఉంటుంది. వీటిలో 90 శాతం ఎమ్మెన్సీలు పారిశ్రామిక ప్రపంచానికి చెందినవే. ఇవి ప్రపంచంలోని వివిధ దేశాల్లో 2,07,000 అనుబంధశాఖలను కలిగి వున్నాయి. వివిధ రకాల వ్యాపారలావాదేవీలను కొనసాగిస్తున్నాయి” (రంగారావు.పి; 2002: పుట –2)ఈవిధంగా బహుళజాతి సంస్థలు అన్ని వర్ధమాన దేశాల మార్కెట్లను ఆక్రమించాయి.

సత్వర అభివృద్ధి కోసం అన్ని రంగాలను ప్రైవేటీకరించడం తప్పదని ప్రభుత్వం భావిస్తుంది. అందుకు అనుగుణంగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తున్నది. ప్రభుత్వరంగ సంస్థలను బహుళజాతి సంస్థలు కొనుగోలు చేసి తమ అధీనంలో ఉంచుకుంటున్నాయి. అభివృద్ధికి అన్ని రంగాల్లోకి విదేశీ పెట్టుబడులు ఆహ్వానించి ప్రైవేటీకరించడం కీలకాశంగా చూస్తుంది ప్రభుత్వం. 1960 ప్రాంతంలో గుత్తసంస్థలు ప్రవేశించాయి. “ఏదైనా సంస్థ తయారు చేసే ఉత్పత్తికి మరో ప్రత్యమ్నాయం లేనప్పుడు ఆ సరుకు ఉత్పత్తి సరఫరాలపై ఆ ఒక్క సంస్థకే అధికారం ఉన్నప్పుడు అట్టి సంస్థను గుత్త సంస్థ లేక గుత్తాధిపత్యం గల సంస్థ అంటారు. వంద కోట్ల రూపాయల కంటే ఆస్థి ఎక్కువగా ఉన్న సంస్థను గుత్త సంస్థ అంటారు. (రామ్మోహన్, సొదుం; 2004: పుట –16)

ప్రస్తుతం ఈ గుత్త సంస్థల స్థానంలో ప్రపంచీకరణ ఫలితంగా బహుళజాతి సంస్థలు ప్రవేశించాయి. ఒక దేశంలో కంటే ఎక్కువదేశాలలో తన ఆర్థిక కార్యకలాపాలు నిర్వర్తించే సంస్థను బహుళజాతి సంస్థ అంటారు.

"ఒక అంచనా ప్రకారం 300 అతి పెద్ద బహుళజాతి సంస్థలు ప్రపంచ ఉత్పత్తిలో మూడింట ఒక వంతు ఆస్తులను కంట్రోలు చేస్తున్నాయి. అంటే 33శాతం, వీటి ఆస్తుల విలువ 5 అమెరికన్ ట్రిలియన్ డాలర్లు(1 ట్రిలియన్ = 1 లక్ష కోట్లు) అంటే వీటి విలువ 225 లక్షల కోట్ల రూపాయలు. అనేక దేశాల జాతీయ ఆదాయాల కంటే వీటి విలువ అత్యధికం. 120 వర్ధమాన దేశాల జాతీయాదాయం కంటే 15 ఎమ్మెన్సీల ఆదాయం ఎక్కువగా వుంది. ప్రపంచం మొత్తం వ్యాపారంలో70 శాతాన్ని ప్రపంచ దేశాలలో వున్న విదేశీ పెట్టుబడులలో 80 శాతాన్ని 300 బహుళజాతి సంస్థలు కంట్రోల్ చేస్తున్నాయి." (రంగారావు, పి: 2002; పుట – 2)

"ప్రపంచంలోని అత్యంత సంపన్నమైన వంద బహుళజాతి కంపెనీలలో 37 అమెరికాకు చెందినవి కాగా 22 జపాన్‌కు చెందినవి, జర్మనీ 10, ఫ్రాన్స్ 7 ఉన్నాయి. తరవాత స్థానంలో బ్రిటన్ ఉంది." (ఎనాలసిస్:డిసెంబర్,2002;పుట-4)"ప్రపంచంలోని వివిధ దేశాలలో ఉన్న కంపెనీలను కొనుగోలు చేసేందుకు ట్రిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టాయి. 1990 సంవత్సరానికి ప్రపంచ వ్యాప్తంగా 31ట్రిలియన్ డాలర్ల ఆస్తులు తమ దేశాల్లో కాకుండా విదేశాల్లో కలిగి ఉన్నాయి. (పెట్టుబడుల ప్రపంచీకరణ, 1997; పుట -23) "అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రైవేటికరిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను బహుళజాతి సంస్థలు కొనుగోలు చేస్తున్నాయని ప్రపంచ పెట్టుబడుల నివేదిక పేర్కొంది." (ఎనాలసిస్: 2002; పుట- 4) ఈ విధంగా బహుళజాతి సంస్థలు లక్షల కోట్ల రూపాయల ఆస్తులను కలిగి ఉన్నాయి.

"విత్తనాల మార్కెట్‌లో 33శాతం, ఔషధాల మార్కెట్‌లో 35శాతం, పశువైద్యానికి సంబంధించిన మందుల మార్కెట్‌లో 60 శాతం, కంప్యూటర్ల మార్కెట్లో 85శాతం, టెలి కమ్యూనికేషన్‌లో 86శాతం కేవలం 10 బహుళజాతి సంస్థల చేతుల్లో ఉన్నాయి."(పైదే పుట -6) ఈ విధంగా బహుళ జాతి సంస్థలు అన్ని రంగాల్లో తమ వాటాను పెంపొందించుకుంటున్నాయి. పై అంశాలను పరిశీలిస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ప్రపంచ ఉత్పత్తులపై, మార్కెట్లపై బహుళజాతి సంస్థల గుత్తాధిపత్యం పెరుగుతున్నదని అర్థమవుతుంది.

బహుళజాతి కంపెనీల వ్యాపారమంటే ఆయా దేశాల మార్కెట్ల అభివృద్ధి, పారిశ్రామిక అభివృద్ధికి చేస్తున్న కృషిగా పాలకులు చెబుతున్నప్పటికీ, వీటి చరిత్ర అందుకు భిన్నంగా ఉంది. "లాటిన్ అమెరికా, మెక్సికో, బ్రెజిల్ నుంచి ఇండియా వరకు పరిశీలించినా వీటి చరిత్రంతా వంచనాపూరిత చరిత్ర, బందిపోటు చరిత్ర, పాలకులను మార్చిన చరిత్ర, తలలు తీసిన చరిత్ర, ఆర్థిక వ్యవస్థలను తిరోగమింపజేసిన చరిత్ర, ప్రజలను మాడ్చిన చరిత్ర, దేశాలను పీల్చి పిప్పి చేసిన చరిత్ర. ఫక్తు వడ్డీ వ్యాపార లక్షణం తప్ప మరొక లక్షణాలు వీటికి లేవు. ఇన్ని దశాబ్దాలలో వీటి పుణ్యమా అని బాగుపడ్డ వర్ధమాన దేశ ఆర్థిక వ్యవస్థ ఒక్కటి కూడా లేదు"(రంగారావు. పి; 2002; పుట –3).

పై అంశాన్ని పరిశీలిస్తే బహుళజాతి సంస్థలకు అన్ని దేశాలలో లాభార్జనే ఉద్దేశ్యం తప్ప మరొకటి కాదు. బహుళజాతి కంపెనీలు తమ మార్కెట్లను సురక్షితంగా ఉంచుకోవడానికి అనునిత్యం ప్రభుత్వాలను ఉపయోగించుకుంటున్నాయి. "బహుళజాతి సంస్థలు రాజకీయ పార్టీలకు నిధులిచ్చి తమ చేతుల్లో ఉంచుకుంటున్నాయి. లంచాలనిచ్చి ప్రభుత్వ యంత్రంగాలను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయి. వివిధ దేశాలలో మార్కెట్లను కైవసం చేసుకోవడానికి క్రిమినల్ పద్ధతులకు సైతం పాల్పడుతున్నాయని టాక్సపరెన్సీ ఇంటర్నేషనల్ అనే సంస్థ వ్యాఖ్యానించింది. (ఎనాలసిస్: 2002; పుట – 5)

"అలాగే బహుళజాతి సంస్థల కార్యక్రమాలు అత్యధికంగా జాతీయ ఆర్థిక విధానాలపై విస్తరించి ఉంటాయి. రోజులు గడిచేకొద్ది ఎంతో బలోపేతమైన వివిధ దేశాల్లో తమ ఆస్తులను పెంచుకుంటు పోతున్నాయి. దాని పురోగమనం ఏస్థాయిలో ఉందంటే వచ్చే శతాబ్ధం నాటికి వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థలపై ఆధిక్యతను సంపాదించి దేశీయ ఆర్థిక వ్యవస్థను పక్కకునెట్టే పరిస్థితి వస్తుందని అంచనా(పెట్టుబడుల ప్రపంచీకరణ: 1997; పుట –19)

"ప్రపంచీకరణ పేరుతో ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన బహుళజాతి సంస్థలు భారతదేశాన్ని ప్రధానంగా ఎంచుకోవడానికి కొన్ని విశిష్ట లక్షణాలున్నాయి. భారతదేశం వందకోట్ల జనాభా గలదేశం. విశాలమైన ప్రాంతం. ఖనిజాలు, వనరులు, అనేక ప్రకృతి సంపదలు విస్తారంగా లభించే ప్రాంతం. అనేక మతాలు, కులాలు,భాషలు, ప్రాంతీయ తేడాలు గల దేశం. ఒక లక్ష ఉపకులాలతో 700 భాషలతో అనేక జాతులతో అలరారుతున్న ఒక మినీ ఆసియా. ఇంతకు మించి సుదీర్ఘకాలం వలసవాద పాలన కింద మగ్గినదేశం." (రంగారావు.పి: 2002;పుట–4) పై అంశాలు

బహుళజాతి సంస్థలు భారతదేశాన్ని తమ మార్కెట్ వనరుగా ఎంచుకుంటున్న కారణాల్ని తెలియజేస్తుంది.

పై అంశాలను పరిశీలించినట్లయితే భారతదేశం లాంటి వర్ధమాన దేశాలు పెట్టుబడిదారీ బహుళజాతి సంస్థలకు అనుకూలంగానూ, తమ లాభాలను పెంచుకోవడానికి అవకాశంగాను ఉపయోగపడుతున్నట్లుగా అర్థమవుతుంది. నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో వెలువడిన ప్రపంచ బ్యాంక్ ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ బహుళజాతి సంస్థల విస్తృతికి, లాభార్జనకు తోడ్పాటునందిస్తుందని చెప్పడంలో సందేహం లేదు. నేడు ప్రపంచంలో చాలా దేశాలు దీనికి ఋణగ్రస్తులవుతున్నాయి. దీని ఒప్పందాలనే ఆయా దేశాలు అమలు చేయడం నేడు మనం చూస్తున్నాం. దీని ప్రభావం వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్రప్రభావం చూపిస్తుంది.

ఈ నేపథ్యాన్ని వివరించిన నవల సింహప్రసాద్ రచించిన 'తమసోమా'. "రోజు పేపర్లలో చదువుతూనే ఉన్నాం. దొరికినచోట్లల్లా వేల కోట్ల రూపాయల విదేశీ ఋణం తెస్తున్నారు. ఆ సొమ్మును ఎవరు ఎలా ఎందుకు వినియోగిస్తున్నారో లెక్కలు కావాలి. మనల్ని ఋణదాస్యంలోకి నెట్టుతున్న నేతలకి పల్లెల్లో మరుగుదొడ్లు లేక అవస్థపడుతున్న మహిళల దౌర్భాగ్యస్థితి ఎందుకు కనిపించడం లేదని నిలదీయాల్సిన సమయం వచ్చింది." (సింహప్రసాద్: 2012; పుట –124).

నూతన ఆర్థిక విధానాలు అమలు అయిన తర్వాత స్వేచ్ఛావాణిజ్య విధానానికి ప్రభుత్వం గేట్లు బార్ల తెరిచింది. అందిన చోటల్లా, ప్రపంచబ్యాంక్ నుండి ఏటా వేల కోట్ల రూపాయల రుణాన్ని ప్రభుత్వం తీసుకవస్తుంది. అయితే ఈ సొమ్మును ఎందుకు వినియోగిస్తున్నారో సామాన్యులకు తెలియని పరిస్థితిని ప్రపంచీకరణ కల్పించింది. ప్రజా సంక్షేమ రంగాల్ని ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేయడం ప్రపంచబ్యాంక్ దాని అనుబంధ సంఘాల షరతుల పాపమే.

భారతదేశం లాంటి వర్ధమానదేశాల మార్కెట్లను బహుళజాతి సంస్థలు తమ లాభార్జనకు, విస్తృతికి వేదికగా ఉపయోగించుకుంటున్నాయి. దీంతో దేశీయ పరిశ్రమలు మూతపడుతున్నాయి. ఇవి స్వేచ్ఛగా మనదేశీయ సంస్కృతిని దెబ్బతీస్తున్నాయి."వీటికి తోడు ప్రపంచీకరణ పేరుతో దేశాన్ని ముంచెత్తుతోన్న బహుళ జాతి సంస్థల ఉత్పత్తులు! శాటిలైట్ ఛానల్స్ ద్వారా మన సంస్కృతిపై దాడి! సామాన్యుల గోడు ఎవరికీ విన్పించదు" (పైదే పుట –124)

ఈ విధంగా ఆర్థిక సరళీకరణ విధానాల నేపథ్యంలో దేశంలోకి ఆహ్వానించిన బహుళజాతి సంస్థలు దేశం మొత్తాన్ని ఆక్రమిస్తున్నాయి. దీంతో దేశీయ పరిశ్రమలు ఉనికిని కోల్పోతున్నాయి. ఈ సంస్థలు అధిక లాభార్జనతో పాటు భారత ఉత్పత్తులపై దాడి చేస్తున్నాయి. ఫలితంగా దేశీయ ఉత్పత్తులు అంతరించి విదేశీ బహుళజాతి సంస్థలు పుట్టగొడుగుల్లా మన ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి.

## 3.2. వ్యవసాయం

భారతదేశం అధిక జనాభా కలిగిన దేశం. సువిశాలమైన దేశం. సహజ భౌగోళిక సంపద కలిగిన ప్రాంతం కావటం వలన ఇక్కడి ప్రజలు ఎక్కువగా వ్యవసాయరంగంపై ఆధారపడి ఉంటారు. నేటికీ దేశంలో అత్యధిక ఉపాధిని కలిగిస్తున్న రంగాల్లో వ్యవసాయ రంగం ఒకటి. దేశంలో 65శాతం ప్రజలు వ్యవసాయరంగం ద్వారా ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను ఉపాధి పొందుతున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన వ్యవసాయరంగంలో ఉపయోగించే పద్దతులన్నీ సాంప్రదాయ పద్ధతులని మనం చూస్తున్నాం. అందువలన ప్రజలు అధికంగా ఆహార పంటలు పండిస్తున్నారు. సాంకేతిక పద్ధతుల్లో వ్యవసాయం చేయకపోవటం వలన దిగుబడి కూడా చాలా తక్కువగా ఉంటుంది. వ్యాపార పంటలను పండించే దిశగా వీరి ఆలోచనలు ఉండవు.

అయితే భారతదేశంలోకి బ్రిటీషు వారు అడుగు పెట్టిన తర్వాత ఇక్కడి ప్రజల ఆహార పంటలను వారు నివారించి, వాణిజ్య పంటలను పండించమని ఒత్తిడి తీసుకురావడం జరిగింది. “19వ శతాబ్దం ప్రథమార్ధంలో బ్రిటీషువారు మనదేశంలో రవాణాసౌకర్యాలు కల్పించి ఎగుమతులకు పనికొచ్చే పంటలు పండించాలని ఒత్తిడి తెచ్చారు. నాటి నుంచే రైతులు పత్తి, పొగాకు, చెరకు వంటి వాణిజ్య పంటలను పండించడం ప్రారంభించారు. అప్పటి నుంచే ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గిపోయింది. ఆ మందుల వల్లనే నేడు సారవంతమైన నేలలు వాణిజ్య పంటలు పండించడం చేత దేశంలో తిండి గింజలు ఉత్పత్తి నిరంతరం తగ్గుతూ వచ్చింది.” (దేవేందర్ శర్మ:2002;పుట– 4).

భారతదేశం ఆహారపంటల మీద ఆధారపడటం నుంచి నిర్దిష్ట ప్రణాళికలు, పరిశోధనలు, వాటి ఆచరణ ద్వారా ఆహార భద్రతను సాధించుకునేందుకు దాదాపు 50 సంవత్సరాలు పట్టింది. దేశం గత మూడు దశాబ్దంల్లో అంతర్గత అవసరాలకు దీటుగా ఆహార ఉత్పత్తిని సాధించడం

జరిగింది. దీనికి గల ప్రధాన కారణం హరిత విప్లవం. ఇది కొంత వరకు దేశాన్ని ఆహార సంక్షోభం నుంచి బయట పడవేయగలిగింది. కానీ సమగ్రంగా అన్ని పంటలకు ఈ హరిత విప్లవం ప్రేరణ కాలేకపోయింది. ఫలితంగా కొన్ని పంటల ఉత్పత్తులను మాత్రమే ఇది అధికం చేయగలిగింది.

నేడు మన వ్యవసాయ విధానం ఒక అగమ్యగోచరమైన స్థితిలో ఉంది. హరిత విప్లవం క్రమంగా తన ఊపును కోల్పోయి ఆహారపంటల దిగుబడి తగ్గిపోయింది. దీనికి గల ప్రధాన కారణం సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యం కలిగిన ప్రపంచీకరణ. సంపన్నదేశాలు వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థతో కలిసి వ్యవసాయం పై దృష్టి పెట్టడం వలన ఆహార పంటలు తగ్గించి తమకు అనుకూలమైన వాణిజ్య పంటల విస్తృతికి అవకాశం కల్పించారు. ఫలితంగా ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు ప్రవేశపెట్టబడ్డాయి.

"నూతన ఆర్థిక విధానాలతో మన రాజకీయ ఆర్థిక వ్యవస్థలోకి బహుళజాతి సంస్థల చొరబాటులో భాగంగా మన వ్యవసాయ రంగంలోకి కాంట్రాక్ట్ వ్యవసాయం, కార్పొరేట్ వ్యవసాయం ప్రవేశించబోతున్నాయి." (వేణుగోపాల్, ఎన్:1999; పుట -130) "ఈ వ్యవసాయ కార్యాచరణ ప్రతిపాదనలోని లోగుట్టును ఒక్క మాటలో చెప్పాలంటే అమెరికాలో చేసినట్లుగా రాష్ట్రంలో సన్నకారు, మధ్యతరగతి రైతాంగాన్ని క్రమంగా రద్దుచేసి మోతుబరులైన కొద్దిమంది ధనిక రైతులను మాత్రమే వ్యవసాయంలో మిగిల్చి వ్యవసాయ భూములను బడా పారిశ్రామికులకు, కార్పొరేషన్లకూ, విదేశీ మల్టీనేషనల్ కంపెనీలకు ధారాదత్తం చేయడం దీనిలక్ష్యం" (ఎ.బి.కె ప్రసాద్ : 2000; పుట-16)

నేడు భారతదేశంలో వ్యవసాయ రంగంలోకి బహుళజాతి సంస్థలు ప్రవేశించి కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నవి. ఈ కార్పొరేట్ సంస్థలు దినదినాభివృద్ధి చెందుతూ సారవంతమైన నేలలను సొంతం చేసుకుంటున్నాయి. ఇక్కడి రైతులను భూమిలేని కూలీలుగా మార్చివేస్తున్నాయి. కార్పొరేట్ వ్యవసాయంలో భాగంగానే సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. దీని వలన బహుళజాతి సంస్థలు తమకు లాభార్జితమైన వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తున్నాయి.

"కాంట్రాక్ట్ సేద్యం మన రైతులకు కొత్తేమికాదు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత స్వావలంబన ఆర్థిక విధానాల కాలంలో చెరకు సేద్యం, పాడిపరిశ్రమ మరియు ఆయిల్ ఫామ్స్ సేద్యంలో కాంట్రాక్ట్ సేద్యం ప్రవేశపెట్టారు."(ప్రసాదరావు,అరిబండి:2004; పుట -29) అయితే స్వాతంత్ర్యానంతరం

అమలైన కాంట్రాక్ట్ సేద్యానికి తేడా ఉంది. నాడు రైతులు లాభపడితే నేడు రైతుల కష్టార్జితం కంపెనీలకు లాభాలను కురిపిస్తుంది. అంటే ఇక్కడ కంపెనీల లాభాపేక్ష ప్రధానం.

ఒక నాడు "ఎత్తైన జొన్న, సజ్జ చేలలో అందులో కలిపివేసే దోసకాయలతో ఒక నాడు పల్లె పట్టులు కన్పించేవి. కంకులు పాలు పోసుకున్న దగ్గర్నుంచి ఊసబియ్యం దాకా కేకలు వేస్తూ. వొట్టి డబ్బాలసప్పుడు చేస్తూ పక్షులను తోలుకుంటూ వేసే కేకలు ఆనందంగా అనిపించేవి. కరువొచ్చినా, కాటకాలొచ్చినా వాటిని దంచుకుని అంబలి తాగి అయినా బతుకుతామని ప్రజలు భావించేవారు". (రంగారావు, పి : 2002 ; పుట -61) అయితే నేటి పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయి. ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటల ప్రవేశం జరిగిన తర్వాత రైతుల పరిస్థితిలో మార్పు వచ్చినా నాటి సంతోషం నేడు రైతులకు లేదనే చెప్పాలి.

"ఎక్కడా జొన్నలు లేవు, సజ్జలు లేవు. యివి అవశేషంగా మిగిలి పోయాయి. అంతటా పత్తి. మిర్చి పంటలే వ్యాపార పంటలు – కాసుల గలగలరాల్చే పంటలు" (పైదే) "ఆహార పంటలస్థానే వాణిజ్య పంటలు వచ్చాయి. సాధారణ వ్యవసాయ పద్ధతుల నుంచి ఆధునిక వ్యవసాయ పద్ధతులు అలవడుతున్నాయి. మారుమూల అటవీప్రాంతాలకు సైతం ఈ వాణిజ్య పంటల ప్రక్రియ పురుగు మందుల విక్రయం, మార్కెట్ ఎకానమీ చేరిపోతున్నది" (పైదే) బహుళజాతి సంస్థల వలన నేడు దేశంలో సాంప్రదాయ ఆహార పంటలు నశిస్తూ వాణిజ్య పంటల ఊపు పెరిగింది. సేద్యంలో కూడా వ్యయం అధికమైంది. కార్పొరేట్‌సేద్యం రైతు సమస్యలను పరిష్కరించకపోగా నూతన సమస్యలను సృష్టిస్తుంది.

"బ్రెట్టన్ ఉడ్స్ సంస్థలు ప్రవచించిన వినాశకరమైన విధానాల ఫలితంగా సహజ వనరులు దెబ్బ తిని దిగుబడులు పడిపోయాయి. విపరీతంగా ఎరువులు వాడడం వలన భూసారం తగ్గిపోయింది. భూగర్భ జలాల్లో ప్రమాదకరమైన నైట్రేట్లు పేరుకు పోయాయి. క్రమంగా అలాంటి భూములన్ని నిస్సారంగా ఉత్పత్తికి పనికి రాని విధంగా మారాయి" (దేవేంద్ర శర్మ:2002;పుట -2)

నూతన ఆర్థిక విధానాల వలన రైతులు తీవ్రమైన నష్టాలకు గురి అవుతున్నారు. పెట్టుబడి వ్యయం అధికమైంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కూడా కరువవుతుంది. దీనంతటికి కారణం ప్రపంచీకరణ మూలంగా ప్రపంచ బ్యాంక్ షరతులకు లొంగడం, విదేశీ ఉత్పత్తులు మన దేశాన్ని ముంచెత్తడంగా చెప్పవచ్చును.

"ప్రపంచీకరణ నేపథ్యంలో మార్కెట్‌లో ధరల నియంత్రణ కూడా ఎమ్మెన్సీలే చేస్తున్నాయి. సంపన్న దేశాలకనుగుణంగా అన్ని దేశాల వ్యవసాయ మార్కెట్లను నియంత్రిస్తున్నారు. మన దేశంలో పత్తి, కందులు, గోధుమలు, వరి తదితర పంటలు పండించి మనమే ఎగుమతికి తద్వారా మార్కెట్‌కు ప్రయత్నం చేస్తున్నాము. అమెరికా తదితర సంపన్న దేశాలు పత్తి, కందులు, నూనెలు మన మార్కెట్లోకి దిగుమతి చేస్తున్నాయి. ఫలితంగా మన మార్కెట్ తలకిందులై మన పంటల గిరాకీ తగ్గుతున్నది. డబ్ల్యూ.టీ.ఓ ఒప్పందం,పేటెంట్ చట్టాల మూలంగా మన వ్యవసాయ రంగం మీద, ఉత్పత్తుల మీద, మన సబ్సిడీల మీద నియంత్రణ జరుగుతున్నది."(రంగారావు.పి: 2002; పుట–65).

ప్రస్తుత వ్యవసాయ విధానాలను వివరించిన నవల సింహ ప్రసాద్ రచించిన 'తమసోమా'! ఇందులో గాంధీ తన తండ్రి చేసేటువంటి అవినీతి, లంచగొండి తనానికి విసిగి తండ్రితో విభేదించి తాతగారి ఊరికి వెళతాడు. అక్కడ వ్యవసాయం గురించి తాతను అడుగుతాడు. సమాధానంగా తాత ప్రపంచీకరణ ఫలితంగా రైతులు అనుభవిస్తున్నటువంటి పరిస్థితుల్ని వివరిస్తాడు. "పొలం గట్లంటా నడుస్తూ "ఈసారి పంటలెలా వున్నాయి తాతయ్యా" అనడిగాను. "వరి బాగానే పండింది కానీ ధాన్యం కొనే నాథుడే లేక పోయాడు. చూస్తోంటే ప్రపంచ ఆర్థిక విధానాలు రైతుల కడుపు కొడతాయేమోనని భయంగా ఉందిరా" (సింహ ప్రసాద్ : 2012; పుట –105) ప్రపంచ ఆర్థిక విధానాల వలన రైతులు నష్ట పోతున్నటువంటి పరిస్థితి మనకు ఈ నవలలో కనిపిస్తుంది.

"కడుపున్నంత వరకు నాగలి పట్టాల్సిందేకదా"

"నిజమేరా! కాని మనక్కావలసిన తిండి గింజలు మనదేశపు రైతే పండించాలని లేదు కదా! విదేశాల్లో అభివృద్ధి చెందిన టెక్నాలజీతో చౌకగా ధాన్యాలు పండించి మన దేశానికి పంపిస్తే ఏమవుతుంది? మన రైతు నోట మట్టే కదా! కేవలం ధాన్యాలే కాదు అన్ని రకాల పారిశ్రామిక ఉత్పత్తులు మన దేశాన్ని ముంచెత్తుతున్నాయి." (పైదే) ఇక్కడ విదేశాల నుంచి ధాన్యం దిగుమతి అవడం వలన మనం పండించిన పంటకు విలువ లేకుండా పోయిన పరిస్థితి కనిపిస్తుంది. అధ్వాన్నమైన రైతుల పరిస్థితి గురించి తెలుస్తుంది.

ప్రపంచ బ్యాంక్ షరతులకులొంగి ప్రభుత్వాలు తమ బాధ్యతలను విస్మరిస్తున్నాయి. ప్రపంచబ్యాంక్, బహుళజాతి సంస్థల షరతులకు తలొగ్గినటువంటి ప్రభుత్వ విధానాల వలన రైతుల స్థితి దీనంగా తయారైంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయి. ఈ

పరిస్థితికి కారణం ప్రపంచీకరణ. ప్రస్తుతం పండించిన పంటలకు ధర లేక కొనే వారు లేక ఉక్కిరి బిక్కిరి అవుతోంది రైతాంగం.

"అన్నట్టు తాతయ్య! ధాన్యాన్ని ఫుడ్‌కార్పోరేషన్ వారు కొనేలా ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చారుకదా" "అలా అని పేపర్లు రాశాయి. ఆచరణలో మాత్రం ప్రగతి పెద్ద సున్నా. ఫుడ్ కార్పోరేషన్ వాళ్ళు ఒకటి చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం మరోటి చెబుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇంకోటి చెబుతోంది. వీరందరి మధ్య ఊపిరాడక కొట్టుకుంటున్నాడు రైతు. పండిన పంటకి ధర లేదు కొనే వాడు లేడు. ఇలాంటి దుస్థితి ఎన్నడూ ఎదురవ్వలేదు" (పైదే పుట-106) ఈవిధంగా పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక చివరికి కొనేవాడు లేక రైతులు తీవ్రంగా నష్టపోవడం మనం ఇవాళ చూస్తున్నాం. రైతులు, వినియోగదారులు నష్టపోతూ దళారీలు ప్రయోజనం పొందేస్థితి నేడు సర్వ సాధారణమైంది.

"ఆరుగాలం పండించే రైతుకేమి మిగలదు వినియోగదారుడికి మిగలదు మధ్యన దళారీలు సొమ్ము చేసుకుంటున్నారు" (పైదే) "అయినా ఏరువాక అంటే తెలియని అధికారులు ఢిల్లీలో ఏసీ రూముల్లో కూర్చుని ధాన్యానికి మద్ధతు ధర నిర్ణయిస్తున్నారు." (పైదే)

ప్రపంచీకరణతో మన వ్యవసాయ రంగం కుదేలైంది. ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు వచ్చి రైతులకు తీవ్రమైన నష్టాలను కలిగిస్తున్నాయి. ఉదాహరణకు వాణిజ్య పంట అయిన పత్తిని సాగుచేసిన రైతులు దేశంలో ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకోవడం మనం చూస్తున్నాం. రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు కూడా ప్రస్తుతం ప్రభుత్వాలు కల్పించుటలేదు.దీంతో వ్యవసాయ రంగంలో రైతుల పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. భారతదేశం ప్రధానంగా వ్యవసాయ దేశమవ్వటం వలన వ్యవసాయరంగంలో సరైన ప్రతిఫలం లేకపోవుట వలన రైతులు ఆత్మహత్యల్ని ఆశ్రయిస్తున్నారు. ఇదంతా ప్రపంచీకరణ ప్రతిఫలమే.

## 3.3. పారిశ్రామిక రంగం

భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశానికి పారిశ్రామికంగా అభివృద్ధి సాధించడం తప్పనిసరి. అభివృద్ధి చెందిన దేశాల ప్రజలే నేడు మెరుగైన జీవన ప్రమాణాలు అనుభవిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలంటే పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడమే మార్గమని

ఆర్థిక వేత్తల అభిప్రాయం. "భారతదేశం ప్రధానంగా వ్యవసాయకదేశం కావటం వలన దీనిలోని ముడి సరుకులు వినియోగించే దేశంలో కొన్ని పరిశ్రమలు బాగానే అభివృద్ధి చెందాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గనులు, ఉక్కు, మాన్యుఫాక్చరింగ్, విద్యుత్, గ్యాస్ మొదలగు భారీ పరిశ్రమలు అభివృద్ధిని సాధిస్తున్నాయి. కొన్ని మౌళిక పరిశ్రమల విషయంలో భారత్ స్వావలంబన సాధించింది. "ఉక్కు, ఇనుము విషయంలో సంపూర్ణ స్వావలంబన సాధించిన మాట అక్షరసత్యం యంత్రాలు రసాయనిక ఎరువుల విషయంలో విదేశాలపై ఆధారపడటం గణ నీయంగా తగ్గింది." (రామ్మోహన్, సొదుం : 2002 ; పుట – 16) ఇది ఒకరకమైన పారిశ్రామిక అభివృద్ధి అయితే సరళీకరణ ఆర్థిక విధానాల తర్వాత పారిశ్రామిక విధానంలో మార్పు వచ్చింది. ప్రపంచీకరణ నేపథ్యంలో బహుళజాతి సంస్థలు, ప్రైవేటీకరణ  వేగం పుంజుకుంది వీటి ప్రభావానికి దేశీయ పరిశ్రమలు ఉత్పత్తులు తగ్గిపోయి బహుళజాతి ప్రైవేట్ సంస్థల ఉత్పత్తులు భారత మార్కెట్లను ముంచెత్తాయి.

"నేడు భారతీయ మార్కెట్‌లో విక్రయిస్తున్న వినియోగ వస్తువులలో 76 శాతం దేశంలో తిష్టవేసిన 1700 విదేశీ బహుళ జాతి కంపెనీలు ఉత్పత్తి చేస్తున్నవే మందులలో నూటికి 80 శాతం దాకా ఎమ్మెన్సీల ఉత్పత్తులే" (రంగారావు, పి. : 2002; పుట –9) పై అంశాన్ని పరిశీలిస్తే విదేశీ బహుళజాతి సంస్థల ఉత్పత్తులు మనదేశాన్ని దోచుకుంటున్న తీరుకి అద్దం పడుతుంది.

ప్రపంచ బ్యాంక్ షరతులకు తలొగ్గిన ప్రభుత్వాలు లాభాల బాటలో నడుస్తున్న అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడానికి ప్రయత్నిస్తున్నాయి. దీనికి పెట్టుబడుల ఉపసంహరణను మార్గంగా ఎంచుకుంటున్నాయి.

"ప్రస్తుతం ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా సుమారు 12,000 కోట్ల రూపాయలు సమీకరించాలని యిందుకు ఐ.డి.పి.ఎల్, ఐ.డి.ఎల్ వంటి కంపెనీలతో పాటు, ఇండియన్ ఎయిర్‌లైన్స్ , ఎయిర్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ మొదలగు కీలక సంస్థలను కూడా ప్రైవేటీకరించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది"(విద్యాభూషణ్: 2003; పుట – 11)ప్రస్తుతం ఖాయిలా పడిన పరిశ్రమలను మూసివేస్తున్నారు. ఈ ఖాయిలా పడిన పరిశ్రమల్లో అన్ని రకాల పరిశ్రమలున్నాయి. ఈ ఖాయిలా పడిన చిన్న పరిశ్రమల సంఖ్య 3317 కు పెరిగింది. (పైదే). ఈవిధంగా ప్రభుత్వం ఒక్కొక్క పరిశ్రమనే మూసివేస్తూ పారిశ్రామికరంగాన్నంత ప్రైవేటీకరిస్తూ ఉంది.

"ఐ.ఎం.ఎఫ్., ప్రపంచ బ్యాంక్, ప్రపంచ వాణిజ్య సంస్థ ఆదేశాల మేరకు 22,220 ప్రభుత్వ రంగ యూనిట్లలో ప్రధానమైన వాటిని అమ్మివేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. వాటిని స్వాధీనం చేసుకునేందుకు బహుళజాతి సంస్థలు దేశీయ పెట్టుబడిదార్లు కాచుకొని ఉన్నారు." (సుకోమల్‌సేన్ : 2001;పుట-29) ఈ విధంగా ప్రపంచబ్యాంక్ ఆజ్ఞలతో పనిచేస్తున్న ప్రభుత్వాలు సమస్త రంగాలను బహుళజాతి సంస్థలకు కట్టబెడుతున్నాయి. తద్వారా ప్రభుత్వరంగ సంస్థలు జవజీవాలు కోల్పోయి ప్రైవేట్ రంగం జోరందుకుంటుంది. ఇప్పటికే అన్ని బహుళజాతి ఉత్పత్తులు భారత్ మార్కెట్‌ను ఆక్రమించాయి. సబ్బులు, షాంపులు, బొట్టు బిళ్లలు, పెన్నులు, పిన్నులు, జున్ను, పాలు, బియ్యం, గోదుమలు వంటి నిత్యవసర వస్తువులు యిబ్బడి ముబ్బడిగా వస్తున్నాయి. ఇవే కాక సాంప్రదాయ ఆహార వ్యవసాయ ఉత్పత్తులు కూడా బహుళజాతి సంస్థల దాటికి విలవిలలాడుతున్నాయి.

"ఎమ్మెన్సీల ధాటికి మన ఉత్పత్తులు వెలవెల బోతున్నాయి. పోటీకి నిలబడలేక పోతున్నాయి. పామాయిల్ దిగుమతి ముందు వేరుశనగ నూనె వణికి పోయింది. విదేశీ పామాయిల్ ముందు స్వదేశీ పామాయిల్ చెట్లు గొడ్డలి వేటుకు తెగిపడుతున్నాయి. కొబ్బరి తోటల తలలు నేలకు కొడుతున్నాయి. పాడి పరిశ్రమ కొండెక్కి పోతోంది. వ్యవసాయ ఉత్పత్తులధరలు ఊసురుమంటున్నాయి."(రంగారావు, పి : 2002 ; పుట - 8) పై అంశాల పరిశీలన వలన సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల దాటికి కూలిపోతున్న దేశీయ పరిశ్రమల పరిస్థితి కనిపిస్తుంది.

ప్రపంచీకరణ అమలు క్రమంలో ప్రైవేటీకరణ ప్రధానమైన భాగంగా మారింది. ప్రభుత్వ రంగ సంస్థల ప్రాధాన్యత తగ్గించడం, ప్రభుత్వరంగ సంస్థలను మూసివేయడం వాటినుంచి పెట్టుబడులను ఉపసంహరించి ప్రైవేటీకరణకు పెద్ద పీట వేయడం వంటి అంశాలన్నీ ప్రపంచీకరణ విస్తరణలో భాగంగా జరుగుతున్నవే. ఈ నేపథ్యంలో ఆయా ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు ఉపాధి కోల్పోయి దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారు.

నేడు ప్రపంచీకరణ నేర్పుతున్న సూత్రం ఒక్కటే. ప్రతి వారినీ డబ్బు సంపాదించే యంత్రాలుగా మార్చడం. డబ్బు సంపాదించడం కోసం సమాజం ఎంతటి నీచమైన దిగజారుడు కైనా సిద్ధపడేలా ప్రపంచీకరణ విధానాలు ఉంటున్నాయి. పారిశ్రామిక దుస్థితిని పారిశ్రామికవేత్తల ధనాశను వివరించిన నవల సింహ ప్రసాద్ రచించిన తమసోమా "ప్రతి వారికీ డబ్బు కావాలి లక్షల కోట్లు కావాలి కోట్లకు పడగలెత్తిన నాయకులకీ, పరిశ్రమాధిపతులకి, బడా వ్యాపారులకు

కూడా మరి కొన్ని కోట్లు – ఇన్ఫినిట్ కోట్లు కావాలి. అందునిమిత్తం ఏమైనా చేస్తారు"(సింహ ప్రసాద్:2012;పుట –102) అంటూ గాంధీ ఆవేదన వ్యక్తం చేస్తాడు. ప్రపంచీకరణలో భాగంగా పారిశ్రామికాధిపతులకు, నాయకులకు, అధికారులకు ధనం పై ఉన్నటువంటి వ్యామోహన్ని తెలియజేస్తుందీ నవల. ఈ పరిస్థితులకు ప్రపంచీకరణ విధానాలే అసలు కారణం.

### 3.3.1 చిన్న పరిశ్రమలు లేదా కుటీర పరిశ్రమలు

అభివృద్ధి చెందుతున్న భారత్ లాంటి వర్ధమాన దేశాలకు చిన్నతరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు ఎంతో అవసరం. కోటి రూపాయలు గాని అంతకంటే తక్కువ పెట్టుబడితో నడిచే పరిశ్రమలను చిన్నతరహా పరిశ్రమలు అంటారు. కాగా 25 లక్షల రూపాయలతో నడిచే పరిశ్రమలను లఘు పరిశ్రమలు అంటారు. కాగా ఆకలి, దారిద్ర్యం, పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలతో సతమతవుతున్న భారత్‌లో ఉపాధి కల్పనకు ఇలాంటి పరిశ్రమలు చాలా అవసరం. దేశంలో లక్షలమంది ప్రజలకు ఇవి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఉపాధిని కల్పిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని బలహీనమైన వర్గాలకు, మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

మన దేశంలో అసంఘటిత రంగంలోనే ఉద్యోగవకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయి. కుమ్మరి, కమ్మరి, నేత పరిశ్రమ, బొమ్మలు, శిల్పాలు, గృహనిర్మాణం, టైలరింగ్, వ్యవసాయరంగం మొదలైన అసంఘటిత రంగాలే అత్యధికంగా ఉపాధిని కల్పిస్తున్నాయి. 1980 నుండి సంఘటిత రంగంతో పోల్చితే అసఘంటిత రంగంలోనే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయనేది నిర్వివాదాంశం. "ప్రభుత్వరంగంలో 25 లక్షల మందికి, ప్రైవేట్ రంగంలో 74 లక్షల మందికి అవకాశాలు ఉండగా, అసంఘటిత రంగంలో హ్యాండ్లూమ్ పరిశ్రమలో135 లక్షల మందికి, చిన్న తరహా పరిశ్రమలలో 130 లక్షలమందికి, కుటీర పరిశ్రమలలో 45 లక్షలమందికి, మిగతా వాటిలో 20 లక్షల మందికి మొత్తం 330 లక్షల మందికి ఉపాధి లభిస్తున్నది" (రంగారావు, పి. : 2002 ; పుట – 6)

ప్రపంచీకరణ ప్రారంభం కావడంతో బహుళజాతి సంస్థలు రంగ ప్రవేశం చేసి సరుకులను తక్కువ ధరలకే సరఫరా చేయడంతో భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలోనూ అనేక చిన్న పరిశ్రమలు మూతపడ్డాయి.

బహుళజాతి సంస్థలు ప్రవేశ ప్రారంభంలో ఉద్యోగ అవకాశాలు అధికంగా కల్పిస్తామని, ప్రభుత్వానికి హామి యిచ్చి తర్వాత ఆ హామీని గాలికొదిలి రాయితీలు, సబ్సిడీలను పొంది తమ లాభార్జననే ప్రధానం చేసుకున్నాయి. "పెప్సీ కోలా సంస్థ శీతల పానీయాల అమ్మకంలో అగ్రగామి. అది 50 వేల మందికి ఉద్యోగాలిస్తాననీ మన ప్రభుత్వానికి హామీ ఇచ్చింది, అయితే అది కేవలం 489 మందికే ఉద్యోగాలు ఇచ్చింది. అమెరికాకు చెందిన కార్గిల్ కంపెనీ 4 లక్షల మందికి ఉద్యోగాలు యిస్తానని చెప్పి ఆస్ట్రేలియాలో అడుగు పెట్టి 20 లక్షల టన్నుల ఉప్పును తయారు చేస్తున్నది. అయితే అది అక్కడ కేవలం 50 మందికి మాత్రమే ఉద్యోగాలిచ్చింది" (పైదే పుట –7) ఈ విధంగా బహుళజాతి సంస్థలు ఉద్యోగవకాశాలు కల్పించక పోగా కుటీర పరిశ్రమలను కూలుస్తూ అనేక మంది కార్మికుల ఆకలి చావులకు కారణమవుతున్నాయి.

అయితే ప్రభుత్వాల నుంచి చిన్న పరిశ్రమలకు, లఘుపరిశ్రమలకు ఎటువంటి సహాయ సహకారాలు అందడం లేదు. విద్యుచ్ఛక్తి, ఆర్థిక సహాయం వంటివి కూడా అందడం లేదు. ఈవిధంగా ఒక వైపు బహుళజాతి సంస్థల ఆధిపత్యం, మరో వైపు ప్రభుత్వాల సహాయ నిరాకరణ వలన కుటీర పరిశ్రమలు, చేతి వృత్తులు నిలువునా కూలిపోతున్నాయి.

నేరెల్ల శ్రీనివాస్ గౌడ్ రచించిన 'బతుకుతాడు' నవలలో కుటీర పరిశ్రమలు, కులవృత్తులు అంతరించి పోవడాన్ని చిత్రించాడు. నేడు సమస్త వృత్తులు అంతరిస్తూ వాటి స్థానంలో బహుళజాతి సంస్థలు విస్తరిస్తున్న తీరు ఈ నవలలో కనబడుతుంది. "కల్లులో నిషాగుణం తక్కువ ఉంటుంది. రైతులు పొలంలో ఎక్కువగా రసాయన మందులు వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందని శాస్త్రజ్ఞులు చెప్పిన ఎవలింటున్నారు. ఇప్పుడు భుమిలో భూసారం లేదు. ఆ మందుల ప్రభావం తాటి చెట్టుపై  పడింది. కల్లులో నిషా వచ్చేలక్షణం పోయింది." (శ్రీనివాస్‌గౌడ్, నేరెళ్ళ : 2004 ; పుట – 131) ప్రపంచీకరణ నేపథ్యంలో సాంప్రదాయ వ్యవసాయం అంతరించి, వాటి స్థానంలో విష రసాయనాలు పంట పొలాలకు విరివిరిగా వినియోగించడం వలన భూమి సారం దెబ్బతిని ఆ ప్రభావం తాటిచెట్లపై పడటం గమనిస్తాం. "కల్లు వాసన పోయింది. అందుకే కల్లు తాగడం బందు చేసి నిషా వచ్చే గుడుంబ, విస్కీ, చీప్‌లిక్కర్ తాగుతున్నారు." (పైదే) అంటూ ఆవేదన వ్యక్తం చేస్తాడు నారాయణ గౌడ్. పై అంశాలు పరిశీలించిన తర్వాత కొన్ని వందల సంవత్సరాలుగా గ్రామీణ సమాజానికి ఆర్థిక స్వావలంబన అందించిన దేశీయ పరిశ్రమలు, వృత్తులు ప్రపంచీకరణ విధానాల వలన ఒక్కసారిగా కుప్పకూలిపోవడం కనిపిస్తుంది.

ప్రపంచీకరణ ప్రవాహంలో పడికొట్టుకుపోతున్న ప్రభుత్వాలు దేశీయ పరిశ్రమలను పట్టించుకోవడం మరిచాయి. ఈ కారణంగా అనేక వృత్తులు, చిన్నపరిశ్రమలు నేడు అనేక సమస్యలకు గురవుతూ చివరికి మూసివేతలకు దారితీస్తున్నాయి.

## 3.4 విద్య

ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యకూడా ప్రధాన వ్యాపార వనరుగా మారింది. స్వాతంత్ర్యపు తొలిదినాలలో అందరినీ విద్యావంతులను చేయడమే లక్ష్యంగా పాలకులు చెప్పడం జరిగింది. అయితే నేటి ప్రపంచీకరణ విధానాల వలన విద్యను సామాజికాంశంగా గుర్తించక, ప్రభుత్వం విద్యను ప్రైవేట్‌రంగానికి వదిలేసి, దానికి కేటాయించాల్సిన నిధులు ఇతర రంగాలకు మళ్ళిస్తోంది. దీంతో విద్యారంగం భవిష్యత్తులో పూర్తిగా ప్రైవేటీకరించడానికి ప్రభుత్వం పునాదులు వేస్తుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

“కొత్త కళాశాలలొస్తున్నాయి, స్వయం పాలిత సంస్థలు, విశ్వవిద్యాలయాలు తామర తంపరగా వెలుస్తున్నాయి. ఇందుకు సంతోషించవలసిందే కానీ అదే సమయంలో వ్యాపార వాణిజ్య సంస్థలూ, రాజకీయవేత్తలూ, మద్యం వ్యాపారులూ విద్యారంగం పైన పట్టు సంపాదించి ఏలుతున్నారన్న సంగతి మరువరాదు. ఈ వర్గాలు విద్యాసంస్థలను బలమైన వ్యాపార సంస్థలుగా మార్చేశారు. అందువల్ల దారుణంగా దెబ్బతింటున్న వారు విద్యార్థులు. విచిత్రమేమిటంటే దేశ ఆర్థిక వ్యవస్థ అవసరాలకు తగిన స్థాయికి ఎదగకుండానే పెద్దయెత్తున ఉద్యోగ అవకాశాలు పెరగక ముందే తామర తంపరగా విద్యా సంస్థలు వెలుస్తున్నాయి. ప్రైవేట్ పెట్టుబడిదారులు ఈ విద్యా సంతను (మార్కెట్) దోచుకుంటున్నారు. (వెంకరామన్, ఎన్.ఎస్. : 2001 ; పుట – 23) ఈ అభిప్రాయం వ్యక్తమై దశాబ్దకాలం దాటిన తర్వాత కూడా ఈ పరిస్థితే సజీవంగా నేడు దేశంలో కనిపిస్తుంది.

విద్యారంగాన్ని సంస్కరించే నెపంతో విద్యారంగంలో ప్రజల పాత్రను పెంచే పేరుమీద ప్రైవేటీకరణ జరుగుతున్నది. ప్రభుత్వరంగ విద్యాలయాల్లో కనీస సౌకర్యాలను కూడా ప్రభుత్వం కల్పించలేక పోతుంది. “ ప్రభుత్వ పాఠశాలలనేకం పాడుబడ్డ భవనాలలో కాలక్షేపం చేస్తున్నాయి. భోదనా ఉపకరణాల విషయానికొస్తే 40 శాతం పాఠశాలల్లో బ్లాక్‌బోర్డులు లేవు. 53 శాతం పాఠశాలల్లో ఆట స్థలం లేదు. 71 శాతం స్కూళ్ళలో గ్రంథాలయాలు లేవు” (విద్యాభూషణ్ :

2003 ; పుట – 41) ఈ విధంగా ప్రభుత్వ పాఠశాలలు అరకొర వసతులతో సతమతమవుతున్నాయి.

ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకరణ, ప్రైవేటీకరణ, వ్యాపారీకరణ వంటివి విద్యారంగంలో పెనుమార్పులు తీసుకువచ్చి విద్యయొక్క అర్థాన్నే మార్చి వేశాయి. విద్యను రెండు రకాలుగా నిట్టనిలువున చీల్చి వేశాయి. అవి వరుసగా విలువలతో కూడిన లేదా నాణ్యత గల విద్య మరియు విలువలు లేని లేదా నాణ్యత లేని విద్య. 1990 సంవత్సరానికి ముందు ఇలాంటి పదాలు ఎప్పుడు వినబడేవి కావు. ఎప్పుడైతే విద్య అంగడి సరుకుగా మారిందో ఫక్తు వ్యాపార ప్రకటనలకే వేలు, లక్షలు, కోట్లు కేటాయించడం మొదలైందో అప్పటి నుండి విద్యారంగంలో పతనం ప్రారంభమైంది.

సమగ్రచట్టం, సమున్నత ఆశయాలు, లక్ష్యాలతో 1956లో విశ్వవిద్యాలయ నిధుల సంఘం (యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్) (UGC) ని ఏర్పాటు చేశారు. అంతకుముందు తరవాత ఎన్నో కమీషన్‌లు, కమిటీలు వేశారు. ప్రభుత్వాలు చట్టాలు చేశాయి. అయినప్పటికీ దేశంలో నేటికీ దాదాపు 30 శాతం నిరక్షరాస్యులుగా మిగలడం విచారకరం. ఎంతో మంది పాలకులు, అధికారులు విదేశాలకు వెళ్ళి అనేక విషయాలు అధ్యయనం చేసి శిక్షణ పొంది వచ్చారు. సూచనలు సలహాలు ఇచ్చారు. అవేమీ అమలు కాలేదు. ఫలితంగా నిరక్షరాస్యత, పేదరికం రెండు పెనవేసుకుంటూ నడుస్తున్నాయి.

"దేశంలో 17 నుంచి 24 సంవత్సరాలలోపు యువతలో కేవలం తొమ్మిది శాతమే కళాశాలల్లో చేరుతున్నారు. ప్రపంచ సగటులో ఇది సగమైన కాదు అమెరికా, జపాన్, జర్మనీ, బ్రిటన్ లాంటి దేశాల్లో విశ్వవిద్యాలయాల సంఖ్య జనాభాతో పోలిస్తే చాలా ఎక్కువ. మనదేశంలో పరిస్థితి అందుకు విరుద్ధం. 121కోట్ల జనాభాకు డీమ్డ్ యూనివర్సిటీలతో కలిపి 670 విశ్వవిద్యాలయాలు మాత్రమే ఉన్నాయి. (ఈనాడు ప్రతిభ,26,11,2012)ఉన్నత విద్య అభివృద్ధి చెందాలంటే కళాశాలలు, విశ్వవిద్యాలయాలు పెంచాలని వాటిలో ప్రస్తుతం 9 శాతంగా ఉన్న విద్యార్థుల నమోదు రేటును 15 శాతానికి చేర్చాలని నేషనల్ నాలెడ్జ్ కమీషన్ ప్రభుత్వానికి ఏనాడో సిఫార్సు చేసింది. అయితే అది అమలైన దాఖలా లేదు. ప్రస్తుతం ఉన్నత విద్య మొత్తం ప్రైవేట్ సంస్థల ఆధీనంలోకి వెళ్ళిపోతున్నది.

"ఆంధ్రప్రదేశ్‌లో పదహారు సంప్రదాయ (ట్రెడిషనల్) విశ్వవిద్యాలయాల పరిధిలో మొత్తం 2,101 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ సహాయంతో నడుస్తున్నవి 430 మాత్రమే

మిగతా 1,671 కాలేజీలు ప్రైవేట్‌వి. దీంతో ప్రభుత్వం వీటిని సొంతంగా నడుపలేక ప్రైవేట్‌పరం చేసింది."(పైదే) ఈ పరిస్థితుల్లో బడుగు, బలహీన వర్గాలకు ప్రైవేట్ విద్య భారమై దూరమవుతోంది. ఈ పరిస్థితికి సరళీకృత ఆర్థిక విధానాల వలన విద్య ప్రైవేటీకరణం చెందడం ముఖ్యకారణం. "ఇంజనీరింగ్ కళాశాలలు దాదాపు700, అందులో 673 కాలేజీలు ప్రైవేట్ విద్యాసంస్థలే. ఇంజనీరింగ్ విద్యార్థుల సంఖ్య 3.5 లక్షలుగా అంచనా. ప్రభుత్వ అధీనంలో ఉన్న ఎం.బీ.ఏ కాలేజీలు 38 మాత్రమే. ప్రైవేట్ సంస్థలు నడుపుతున్న కాలేజీలు 853. రాష్ట్రం మొత్తం మీద ఎంబీఏ విద్యార్థులు 50,193"(పైదే) దీనిని బట్టి ఉన్నత విద్య ప్రైవేట్ విద్యా సంస్థలపైనే అధికంగా ఆధారపడి ఉన్నట్టు తెలుస్తుంది. ప్రభుత్వాలు ఉన్నత విద్యను ప్రైవేటీకరించడంతో బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారింది. ఈపరిస్థితికి మూలం సరళీకృత ఆర్థిక విధానాలే కారణంగా చెప్పవచ్చును.

ప్రపంచీకరణ ఫలితంగా ప్రభుత్వం ఉన్నత విద్యలో విదేశీ యూనివర్శిటీలను ప్రవేశపెట్టడానికి ప్రయత్నం చేస్తుంది. దీని ద్వారా ప్రైవేట్ యూనివర్శిటీలు తమ లాభాల కోసం తప్ప ప్రజా ఉపయోగార్థం ఎటువంటి సేవ చేయవు. ఈ చర్యల వలన అధికంగా నష్టపోయేది గ్రామీణ పేద విద్యార్థులే అధికం.

ప్రస్తుతం ఉన్నత విద్యాసంస్థలు సాంకేతిక పరమైన వృత్తిపరమైన కోర్సులకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ప్రైవేట్ పెట్టుబడులకు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యలో మార్పులు తీసుకు రావడానికి ప్రభుత్వం ప్రయత్నం చేయాలని భావిస్తున్నది. "అందులో భాగంగానే సామాజిక శాస్త్రాలను రద్దుచేసి వాటి స్థానంలో కంప్యూటర్ కోర్సులను పెట్టాలని యోచిస్తున్నారు." (నరసింహారెడ్డి: 2003;పుట –270).

సింహప్రసాద్ రచించిన  డాలర్...! డాలర్....! నవలలో వృత్తి  సాంకేతిక విద్యకు వున్న ఆదరణ గురించి తెలుపుతూ "నాదృష్ట్యా అంతేనమ్మా ఇంజనీరన్నా కావాలి. డాక్టరన్నా కావాలి అంతే .....ఇంకేమైనా అయ్యేకన్నా కిల్లికొట్టు పెట్టుకోవడం ఉత్తమం. చక్కని భవిష్యత్తు, సంతోషకరమైన జీవితం కోరిందల్లా అనుభవించగల భాగ్యం కావాలంటే ప్రొఫెషనల్ కోర్సులో సీటు సంపాదించాల్సిందే" (సింహప్రసాద్ : 2010; పుట –18)అంటూ ముకుందం తన పక్కింటి స్నేహితుడి కూతురికి చెప్పడం చూస్తాం. ప్రపంచీకరణ నేపథ్యంలోనే సంప్రదాయ డిగ్రీలు తమ

ఉనికిని కోల్పోయే విధంగా ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థలు వృత్తి విద్యాకోర్సులను ప్రవేశపెడుతున్నాయి.

సలీం రాసిన 'పడగనీడ' నవలలో "అనూషకు ఆందోళనగా ఉంది. నిజమే ......తనకు లెక్కల్లో నూటికి నూరు మార్కులు వస్తాయి. సైన్స్ అన్నా ఇష్టమే. కానీ తనకు ఇంజనీరు కావాలని లేదు. అలాగని సీ.ఏ చదవాలని కూడా లేదు. తనకు లిటరేచర్ చదవాలని ఉంది. ఒక రోజు అమ్మతో ఆ విషయం చెప్పినపుడు ఇంట్లో పెద్ద రాద్ధాంతం జరిగింది. లిటరేచర్ చదువుతావా? హవ్వా నాదగ్గరన్నావు కాబట్టి సరిపోయింది. ఇంకెక్కడా అనకు పరువు నష్టం" (సలీం : 2010 ; పుట –12) సాహిత్యం చదువుతానన్న ఆసక్తిని కనబర్చిన అనూషకు తన తల్లి చేసే సూచన వలన ఈ రోజు ప్రపంచీకరణ దాడికి గురైన సంప్రదాయ విద్య భాష, సాహిత్యాల విలువ మనకు అర్థమవుతుంది.

"కథలూ కాకరకాయలు చదివితే తిండెలా దొరుకుతుంది? ఉద్యోగాలేం దొరుకుతాయి? ఇపుడు ఇంజనీర్లకున్న డిమాండ్ ఎవ్వరికీ లేదు. ముఖ్యంగా సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు లక్షలకు లక్షలు జీతాలు.. కడుపులో చల్ల కదల కుండా ఏసీ రూముల్లో కంప్యూటర్ ఎదురుగా కూచొని రావొచ్చు" (పైదే) అంటూ అనూష తల్లి అభిప్రాయపడుతుంది. పై అంశాలను పరిశీలిస్తే ప్రపంచీకరణ నేపథ్యంలో సంప్రదాయ విద్యకు ఆదరణ తగ్గుతూ, సాఫ్ట్‌వేర్, ఇంజనీరింగ్ విద్య ప్రాధాన్యత పొందుతుంది. ఐతే ఇంజనీరింగ్ విద్య భారత్‌లాంటి పేదదేశాల ప్రజలకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని వెనుకబడిన వర్గాల వారికి అందని ద్రాక్షగా మారుతుంది. ఎందుకంటే వృత్తి సాంకేతిక విద్యలు నేడు ఖరీదైన విద్యలుగా ఉన్నాయి. అందువలన ప్రపంచీకరణ ద్వారా విద్యా ఉపాధి రంగాల్లో కొన్ని ఉన్నత వర్గాలే అత్యధిక ప్రయోజనం పొందుతారన్నది నిర్వివాదాంశం.

ప్రపంచీకరణ నేపథ్యంలో కంప్యూటర్ విద్యకు విశేషమైన ఆదరణ పుట్టుకొచ్చింది. నేడు ప్రాథమిక విద్యాస్థాయి నుంచి ఉన్నత విద్యా స్థాయి వరకు కంప్యూటర్ కీలకంగా మారింది. భవిష్యత్ అంతా కంప్యూటర్ రంగానిదే అనేటువంటి భావన నేడు ప్రపంచీకరణ కల్పించింది. "అమెరికాలో కంప్యూటర్లో యమ్మెస్ చెయ్యడానికి వచ్చే నెలలో వెళుతున్నాడు. అప్పుడే చక్కని ఉద్యోగం కూడా రెడీ అయ్యింది. మీకు తెలుసుకదా భవిష్యత్తంతా కంప్యూటర్లదీ కంప్యూటర్ ఇంజనీర్లదీనూ" (సింహప్రసాద్ : 2010 ; పుట –73) అంటూ ముకుందం తన కొడుకు గురించి ఇతరులకు చెబుతాడు. పై అంశాలను పరిశీలిస్తే నేడు కంప్యూటర్ విద్యకు ఉన్నటువంటి ప్రాధాన్యం

తెలుస్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో సంప్రదాయ విద్య క్రమంగా మరుగున పడిపోతోంది అనడానికి ముకుందం మాటలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

"హిస్టరీ చదివితే ఏమొస్తుంది? ఉపాధికి పనికి రాని చదువులు వృధా... అదే ఏ కంప్యూటర్ కోర్సో, ఇంజనీరింగో, మెడిసినో చదివేతే మంచి మంచి ఉద్యోగాలొస్తాయి. అమెరికాలాంటి విదేశాలకెళ్ళే అవకాశం ఉంటుంది. చేతి నిండా డబ్బులు సంపాదించొచ్చు" (సలీం:2010;పుట–71) అంటూ అభిప్రాయపడుతుంది ఒక అమ్మాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో సామాజిక శాస్త్రాల పట్ల ఇలాంటి వైఖరి అధికమవుతోంది.అయితే చరిత్ర, సాహిత్యం చదవకుండా మానవత్వపు విలువల గురించి చెప్పేంత తీరిక నేటి తల్లిదండ్రులకు లేదు. అంతా డబ్బు సంపాదనలో తీరిక లేకుండా కష్టపడుతూ డబ్బేసర్వస్వంగా భావిస్తున్నారు. ఈ కంప్యూటర్ విద్యలు ఇలాగే కొనసాగి సంప్రదాయ విద్యలు పతనమైతే కొంత కాలానికి విద్యార్థులకు కవిత్రయమంటే ఎవరో తెలియదు, సింధూనాగరికత గురించి కూడా తెలిసే అవకాశం ఉండదు. సమాజం మరయంత్రాలుగా మారకుండా ఉండాలంటే మనుషులుగా అధ్యయనం చేయడం ఎంతైనా అవసరం.

## 3.4.1. కార్పొరేట్ విద్యావ్యాపారం

నూతన ఆర్థిక విధానాల ఫలితంగా విద్యావ్యవస్థలో వచ్చిన మార్పులలో ప్రధానమైంది ప్రైవేటీకరణ. విద్యా వ్యస్థలో ప్రైవేట్ పెట్టుబడి గతంలో కూడా ఉన్నప్పటికీ ఒక దశాబ్ద కాలంగా సాగుతున్న ప్రైవేటీకరణకు కొన్ని స్పష్టమైన ప్రమాదకరమైన ఫలితాలు ఉంటున్నాయి. సామాజిక శ్రేయస్సే లక్ష్యంగా అందరికీ అందించాల్సిన విద్య నేడు కార్పొరేట్ వ్యాపారపరమైంది. సామాజిక శ్రేయస్సుతో ఎలాంటి సంబంధంలేని పెట్టుబడిదారీ లాభాపేక్ష నుంచి పుట్టిన ఆలోచన ఇది. ఫలితంగా విద్యారంగానికి ప్రభుత్వ వ్యయం తగ్గి మరో వైపు ప్రైవేట్ రంగంలో విద్య వ్యాపారసాధనమైంది. దీన్ని కొనగలిగిన వారే నేడు విద్యను పొందుతున్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు చేజిక్కించుకుంటున్నారు.

సలీం రాసిన 'పడగనీడ' నవల మనకు నేటి ప్రైవేటీకరణ, విద్యావ్యాపారం గురించి వివరిస్తుంది. ఆధునిక విద్య ముసుగులో ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీ ఇందులో చిత్రించబడింది. ప్రపంచీకరణ నేపథ్యంలో మారిపోతున్నటువంటి పరిస్థితులకు అనుగుణంగా ప్రైవేట్ విద్యా సంస్థలు

కోర్సులను ప్రవేశపెడుతూ తద్వారా లాభార్జనే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయి. "బాగా చదివే వాళ్ళందర్నీ చేర్చి జె.యల్ వన్లోనో, టూలోనో వేశారు. బెస్ట్ లెక్చరర్లందరూ ఆ రెండు సెక్షన్లకే వెళ్తారు. ఐ.ఐ.టి. కోచింగ్ తీసుకునే వాళ్ళకి సెపరేట్‌గా మరో సెక్షన్ ఉంది. యింతే కాలేజీ యాజమాన్యం కాన్సన్‌ట్రేషన్ అంతా వీళ్ళమీదే ఉంటుంది. కాలేజీకి అవసరమైన ర్యాంక్‌ల పంట పండించేది వాళ్ళే. మిగతా సెక్షన్లూ విద్యార్థులూ వాళ్ళ కాలేజీకి అవసరమైన ఆర్థిక వనరుల్ని సమకూర్చి పెట్టడానికి ఉపయోగపడే వాళ్ళే. అంతా వ్యాపారం తెలుసా?" (సలీం:2010; పుట–79) పై అంశాలను పరిశీలిస్తే కార్పొరేట్ విద్యా సంస్థల వ్యాపార దోపిడీ ఏ విధంగా ఉంటుందో అర్థమవుతుంది.

నేడు సాంకేతిక విద్యకు ఉన్నటువంటి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ విద్యా సంస్థలు పోటీపడి తమ సంస్థలను ప్రారంభిస్తున్నాయి. వీటిలో వివిధ రకాల కోచింగ్‌ల పేరుతో ప్రచారం ఊదరగొట్టి వేలకు వేల రూపాయిలను సంపాదిస్తున్నాయి. "అనూషను విజయవాడలో చేర్పిద్దామండీ శ్రీ చరిత జూనియర్ కాలేజీకి మంచి పేరుంది. బాగా రుబ్బుతారట. యంసెట్లో మనమ్మాయికి ర్యాంక్ ఖాయం అందో రోజు. ప్రతి వాళ్ళు యంసెట్ల వెంట వేలం వెర్రిగా పడబట్టే కాలేజీలన్నీ యంసెట్ కోచింగ్‌లంటూ వేలకు వేలు దండుకుంటున్నాయి." (సలీం; 2010; పుట – 10) అంటూ ఒక విద్యార్థి తండ్రి వ్యక్తం చేసే ఆవేదన మనల్ని ఆలోచింపచేస్తుంది. పై అంశాల్ని పరిశీలిస్తే ఆధునిక విద్య నేపథ్యంలో ర్యాంకుల పేర్లతో ప్రేవేట్ సంస్థలు దోచుకునే స్థితి మనకు ఈ నవలలో కనబడుతుంది.

నేటి ప్రైవేట్ విద్యాసంస్థలు పోటీ పడుతూ విద్యార్థుల్ని పరీక్షలకు తయారుచేస్తున్నారు. విద్యా సంస్థల ధన దాహానికి విద్యార్థులను సాధనాలుగా వాడుకుంటున్నారు. పరీక్షాఫలితాల అనంతరం తమ కళాశాలల ఫలితాలను పెద్దపెద్ద ప్రకటనలతో ఊదరగొడుతూ ప్రచారం సాగిస్తున్నారు. దీనికంతా కారణం విద్యా వ్యాపారం ద్వారా సులభంగా డబ్బు సంపాదించటం. "రోజూ గంటల తరబడి చదివిందే చదివిస్తారు. సబ్జెక్ట్ అర్థమైనా కాకున్నా, బేసిక్స్ మీద అవగాహన లేకున్నా, ఫలానా ప్రశ్నకు ఫలానా జవాబులు అనేది మాత్రం మెదళ్లో రికార్డయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటారు. ఎక్కువ మార్కులు తెచ్చుకోవడానికి అవసరమైన రకరకాల టెక్నిక్‌లు చెప్తారు. అందుకే మార్కులు వచ్చేస్తాయి కానీ సబ్జెక్ట్ మాత్రం శూన్యం. ఒక ప్రశ్నని కొద్దిగా తిప్పి అడిగితే సమాధానం చెప్పలేరు ఏం చేస్తాం? వాళ్ళకు వాళ్ళ గొప్ప కోసం ఎట్లాగైనా సరే తొంభై శాతానికి పైగా మార్కులు తెప్పించాలి. పేపర్లలో పెద్దపెద్ద ప్రకటనలిచ్చుకోవాలిగా బిజినెస్ కదా మరి" (పైదే పుట –77)

అంటూ అనూష అభిప్రాయపడుతుంది. పై అంశాలను పరిశీలిస్తే ప్రపంచీకరణ పేరిట శరవేగంగా పుట్టుకొస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల ధోరణి అర్థమవుతుంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే సామాజిక ప్రయోజనం కలిగిన విద్య పూర్తిగా కార్పొరేట్ వర్గాల గుత్తాధిపత్యం కిందికి వెళుతుందని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు.

## 3.4.2. ప్రచారం

ఆధునిక కాలంలో వృత్తి సాంకేతిక విద్య ప్రాధాన్యత సంతరించుకున్న క్రమంలో ప్రైవేట్ విద్యాసంస్థలు విపరీతమైన ప్రచారంలో ముందున్నాయి. ఆర్థిక సరళీకరణ విధానాల వలన అన్ని రంగాల్లోకి ప్రైవేట్ భాగస్వామ్యాన్ని విస్తరించిన ప్రభుత్వం  విద్యారంగంలో కూడా దాని భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేసింది. దీని వలన ధనార్జనే ధ్యేయంగా కలిగిన ప్రైవేట్ వర్గాలు పోటీపడి ప్రచారాలు చేస్తున్నాయి. ఒక వైపు ప్రభుత్వ రంగంలో విద్య కొంతవరకే పరిమితమైంది. ఈ పరిస్థితి ప్రైవేట్ రంగాలు అభివృద్ధి చెందడానికి దోహద పడింది. మొత్తం మీద విద్యావ్యవస్థలోని ఒక ముఖ్యమైన భాగం కేవలం కొన్ని వర్గాల గుత్తాధిపత్యం కిందికి వెళ్ళిపోతోంది. మరో వైపు ప్రైవేట్ విద్యా సంస్థల విశేష ప్రచారం వలన విద్యార్థులు అధికంగా ప్రైవేట్ విద్యా సంస్థల్లో చేరుతున్నారు.

ప్రపంచీకరణ ప్రైవేటీకరణ పేరిట వేగంగా వృద్ధి చెందుతున్న కార్పొరేట్ విద్యాలయాలు వాటి ప్రచారం లాభార్జనను విస్తృతంగా చర్చించిన నవల సలీం రాసిన 'పడగనీడ'. నేడు ప్రతీది ప్రచారాలపైనా, హంగూ ఆర్భాటాల పైనే ఆధారపడి మన గలుగుతుంది. విద్య కూడా అందులో భాగంగానే ప్రచారం చేయబడుతుంది. "నర్సరీ క్లాసు నుంచే కంప్యూటర్ శిక్షణ అని ఓ స్కూలు ప్రచారం చేస్తుంది. మీ పిల్లలకు ఎల్కేజీ నుంచే గుర్రపుస్వారీ, స్విమ్మింగ్ నేర్పించే ఏకైక విద్యాసంస్థ అని మరొకడంటాడు. ఏసీ క్లాసు రూములు, ఏసీ బస్సులు మరొక స్కూల్ అట్రాక్షన్. వీటికీ చదువుకున్న భాదరాయణ సంబంధమేమిటో ఎంత బుర్రలు బద్దలు కొట్టుకున్నా అర్థం కాదు. కానీ ఆ స్కూళ్లు నిండి పోతుంటాయి. అడ్మిషన్లు దొరకవు, భారీగా డొనేషన్లు.... రికమెండేషన్లు" (సలీం : 2010 ; పుట – 88) పై అంశాన్ని పరిశీలిస్తే ప్రైవేట్ విద్యా సంస్థల ప్రచారంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల్ని  ఏస్కూల్లో చేర్పించాలో కూడా ఊపిరాడనంతా స్థితికి నెట్టబడ్డారు. నేటి విద్యా వ్యవస్థ ప్రచారాలతోనే మనుగడ సాగిస్తున్నది అయితే ప్రభుత్వ రంగంలోని పాఠశాలలకు సరైన ప్రచారం జరగడంలేదు. దీని వలన ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో ఆశించిన స్థాయిలో

విద్యార్థులు ఉండటం లేదు. ఈ పరిస్థితుల్లో కొన్ని ప్రభుత్వ పాఠశాలలను రద్దు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది.

నేడు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం తమ ఉద్యోగులతోనే ఇంటింటి ప్రచారం చేయిస్తున్నాయి. కళాశాలల్లో పాఠ్యాంశాల్ని బోధించాల్సిన లెక్చరర్లు ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారు. ఈ అంశాలను చర్చించిన నవల సలీం రచించిన 'పడగనీడ'. "నా పేరు సుందరం. శ్రీ చరితకాలేజీలో లెక్చరర్ని, మీ అమ్మాయిని ఇంటర్మీడియట్ ఎక్కడ జాయిన్ చేయాలనుకుంటున్నారు?

"సునందా కాలేజీ అని చెప్పడానికి ఆమె మొహమాట పడి" ఇంకా నిర్ణయించుకోలేదండి కొన్ని కాలేజీలు అప్పుడే తెర్చినా మిగతా కాలేజీల్లో చేరడానికి ఇంకా టైం ఉందిగా అంది.

"అందుకే వచ్చాను. మీ అమ్మాయిని మా కాలేజీలో చేర్చండి. మంచి ఫ్యాకల్టీ ఉంది. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాఠాలు చెప్తారు. యంసెట్లో ర్యాంక్ గ్యారంటీ ఒక వేళ ఇప్పటికే వేరే కాలేజీలో చేర్చినా పర్లేదు మా కాలేజీకే మార్పించండి"(సలీం:2010; పుట – 85).

పై అంశాల్ని పరిశీలిస్తే నేడు కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలు తమ ప్రచారాన్ని ఏవిధంగా చేస్తున్నాయో అర్థమవుతుంది. పాఠాలు భోదించాల్సిన అధ్యాపకుల చేత ప్రచారాలు నిర్వహించడం ప్రైవేట్ విద్యా సంస్థల వ్యాపార స్వభావానికి నిదర్శనం. ప్రైవేట్ విద్యాసంస్థల ప్రచారం ప్రపంచీకరణ నేపథ్యంలో ఎక్కువైంది. ఎక్కడ చూసినా ప్రచార పత్రాలు, రాతలే మనకు నేడు విరివిగా కనిపిస్తున్నాయి.

"మరునాడు మధ్యాహ్నం మూడింటికి రిజల్ట్స్ వెలువడ్డాయి. సాయంత్రానికల్లా టీవీల నిండా ప్రచారపు హోరు ... ఏ ఛానెల్ తిప్పినా ఒకటే గోల .... యంసెట్ ర్యాంకుల గురించి.... శ్రీ చరిత జూనియర్ కాలేజీ ప్రభంజనం....... ఇంజనీరింగ్ లో మొదటి ర్యాంక్ తో పాటు మూడు నాలుగు ర్యాంకులు కైవసం ..... మొదటి వందర్యాంకుల్లో యాభై ఆరుస్థానాలు నిలబెట్టుకున్న శ్రీ చరిత ..... అని ప్రకటన వచ్చిన కొద్దిసేపటికే సునందా కాలేజీ వాళ్ళ ప్రకటన....... గత కొన్ని సంవత్సరాలుగా మెడిసిన్ ర్యాంకుల్లో విజయఢంకా మోగిస్తున్న ఏకైక విద్యాసంస్థ........ గెలుపుకి మరో పేరు సునందా...... విజయానికి అసలైన దారి సునందా......" (సలీం:2010;పుట–102)

అంటూ కార్పొరేట్ విద్యా సంస్థలు  గ్లోబల్ ప్రచారం చేస్తున్నాయి. ఈ పోటీలో ఒక కళాశాలకు మించి మరొక కళాశాల ముందుంటున్నాయి.

పై అంశాల పరిశీలన వలన  పెట్టుబడిదారీ కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న విపరీత ప్రచారాల వలన తమ విద్యా వ్యాపార ధోరణిని మరింత సరళతరం చేసుకుంటున్నాయి. మరో వైపు ప్రభుత్వరంగ విద్యాలయాలు  వీటి ప్రచార తీవ్రతకు తట్టుకోలేక విద్యార్థుల సంఖ్య తగ్గి  కొన్ని కళాశాలు, పాఠశాలలు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయి.

## 3.4.3. పిల్లలపై తీవ్ర ఒత్తిడి, స్వేచ్ఛను హరించడం

ప్రపంచీకరణ  పేరిట శరవేగంగా విస్తరిస్తున్న ప్రైవేట్ రంగాలలో విద్యారంగం ప్రధానమైంది. నేటి పోటీ యుగంలో విద్యార్థులు తీవ్రమైనటువంటి ఒత్తిడి, హింసను ఎదుర్కొంటున్నారు. తల్లిదండ్రుల అత్యుత్సాహం, కళాశాలల  ర్యాంకులు, మార్కుల దాహం వలన విద్యార్థుల స్వేచ్ఛ హక్కును హరిస్తున్నారు. దీంతో విద్యార్థిలోకం తీవ్రమైన ఒత్తిడి, నిరాశ,  నిస్పృహలకు గురవుతోంది. ఈ పరిస్థితిని చిత్రించిన నవల సలీం రాసిన 'పడగనీడ', సింహప్రసాద్ రచించిన 'డాలర్ డాలర్'.

"ఇక నుంచి ఒక్క క్షణం కూడా వృధా చేయొద్దురా. అనుక్షణం చదువు! చదువు!చదువు! చదువు తప్ప మరేం వద్దు. పూర్వం ఋషులు సర్వసుఖాలు త్యజించి అడవులకెళ్ళి తపస్సు చేసుకునేవారు.  నువ్వూ అలాగే అన్నింటినీ వదులుకొని విద్యాతపస్సు చేయాలిరా. నీ మోక్షం నేను నిర్ధేశించిన లక్ష్య సాధనలో వుంది. అది నీకు దక్కేలా నేను చూస్తాను. వెళ్ళరా  నీ గదిలో  కెళ్ళి చదువుకో. ఆల్ ది బెస్ట్ మై డియర్ బోయ్"! (సింహప్రసాద్:2010; పుట-8) అంటూ తన కొడుకును ఆదేశిస్తాడు ముకుందం. పై విషయాన్ని పరిశీలిస్తే చదువును బలవంతంగా  పిల్లల పై రుద్దే నేటి సమాజం తల్లిదండ్రులు కనిపిస్తారు.

ఒకప్పుడు విద్య అనేది ఆటపాటలతో  హాయిగా సరదాగా  గడిచిపోయేది. కానీ నేడు ఆటలు లేవు పాటలు లేవు. తల్లిదండ్రులు, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థులకు నేర్పుతున్నది ఒకటే అదే చదువు! చదువు. ఈ స్థితిని తెలియేజేసిన నవల సలీం రాసిన 'పడగనీడ'. "విశ్రాంతి లేని చదువు .... మనసుకు ఏ రకమైన ఉల్లాసం లేదు. ఆటల్లేవు. కనీసం ఇండోర్ గేమ్స్ కూడా లేవు. ఆటల వల్ల

సమయం వృథా అవుతుందట. ఎక్స్‌ట్రా కర్రికులర్ యాక్టివిటీల్లేవు. వక్తృత్వ పోటీలు, వ్యాస రచన పోటీల్లాంటివి ఉండవట. క్విజ్ లూ కవిత్వాలు పనికి రావట, అంతా చదువు ... చదువు..... చదువు ....."(సలీం:2010; పుట– 28) అంటూ అనూష బాధపడుతుంది. ఈ పరిస్థితి నేడు కార్పొరేట్ ప్రపంచం కల్పించిన పరిస్థితికి అద్దం పడుతుంది.

నేటి పోటీ యుగంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు కాస్తంతయినా స్వేచ్ఛ ఇవ్వడం లేదు. తమ కలలను, ఆశయాలను పిల్లలపై బలవంతంగా రుద్ది వారిని ఊపిరి సడలనంత వత్తిడికి గురి చేస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రపంచీకరణ కాలంలో డబ్బు పై ఆశ సమాజాన్ని పట్టిపీడించడమే. నేడు ప్రతి ఒక్కరికి లెక్కలేనంత ధనం కావాలి. దాని కొరకు తమ పిల్లల భవిష్యత్తును ముందే ఊహిస్తూ వారి స్వేచ్ఛను హరిస్తున్నారు. ఈ పరిస్థితులకు అద్దం పట్టిన నవల సింహ ప్రసాద్ రాసిన 'డాలర్ .. డాలర్'... ఈ నవలలో ముకుందం ఒక చిన్నపాటి ఉద్యోగి. చాలి చాలని జీతం. ఇతనికి ధనం సంపాదించి విలాసవంతమైన భవనం, గౌరవం సంపాదించాలని ఆశ. ఇవి తను సంపాదించలేడు. అయితే తన కొడుకు దొరబాబు ద్వారా నిజం చేసుకోవాలని కొడుకు కు నిత్యం తన ఆశలు ఆశయాలు నూరిపోస్తుంటాడు. "టెన్త్ లో, ఇంటర్లో, యంసెట్ లో ర్యాంకులు సాధించాలి. ఇంజనీరింగ్ లో గోల్డ్ మెడల్ సంపాదించాలి. అమెరికా వెళ్ళాలి. ఉన్నత విద్యనభ్యసించి అక్కడే గొప్ప ఉద్యోగం చేపట్టాలి. కోట్లకు పడగలెత్తాలి. నీ వయస్సువాళ్ళకెవ్వరికీ సాధ్యం కానివన్నీ సాధించాలి. చెప్పరాబాబూ, ఇవన్నీ సాధిస్తావు కదూ. నా స్వప్నాలను సత్యాలు చేస్తావు కదూ, చెప్పరా చెప్పు"(సింహప్రసాద్; 2010 ; పుట–7) అంటూ ఊగిపోతాడు ముకుందం. ఈ పరిస్థితుల్లో పిల్లలు తీవ్రమైన వత్తిడికి గురవడం జరుగుతుంది. దీంతో ఒక్కక్షణం కూడా వృథా చేయక చదవడం వలన పనిచేసే యంత్రాలుగా మారిపోతున్నారు.మరికొంత మంది పిల్లలు ఈ పరిస్థితులకు కలత చెంది ఆత్మహత్యల వైపు అడుగులేస్తున్నారు.

## 3.5 వైద్యరంగం

మనిషి కోసం మందులా? మందుల కోసం మనిషా? అని ఒక వైద్యరచయిత ప్రశ్నవేశాడు. మన భారతీయ సాంప్రదాయ ఆయుర్వేద, హోమియోపతి వైద్యం మసక బారింది. అల్లోపతి అందల

మెక్కింది. సూదిమందులు, ట్యాబ్లెట్ల వైద్యం వేగవంతమైంది. ఈ మార్పు ప్రజల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా వచ్చినదే.

అయితే ప్రపంచీకరణ నేపథ్యంలో వైద్యం నేడొక పెద్ద వ్యాపారం అయింది. మన జబ్బుల మీద బోలెడంత లొసుగులతో వైద్యం జరుగుతున్నది. యాంటీబయాటిక్స్ బోలెడన్ని పెరిగిపోయాయి. మాత్రలు మూటలు ముల్లెలుగా పెరిగాయి. ప్రస్తుతం మనిషికి సహజ సిద్ధంగా ఉండే రోగ నిరోధక శక్తి తగ్గిపోతోంది. దీంతో రకరకాల అనారోగ్యాలు మనిషి మీద దాడి చేస్తున్నాయి. వైద్యంలో వచ్చిన స్పెషలైజేషన్ రోగ నిర్ధారణను, వైద్యప్రక్రియను పెంచింది. అయితే సామాన్యుడికి మాత్రం వైద్యం పై ఖర్చు గుండె గుబులుగా తయారైంది. నేడు వైద్యం అంతా ఖరీదైన ప్రక్రియగా మారిపోయింది. మరొకవైపు కార్పొరేట్ వైద్యం రోగాల మీద తిష్టవేసుకు కూర్చున్నది.

సరళీకృత ఆర్థిక విధానాల పేరిట శరవేగంగా అన్ని రంగాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. అందులో వైద్యరంగం కూడా ఒకటి. “భారతీయ మార్కెట్లో రూ. 60,000 లకు పైగా వివిధ రకాల మందులున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూ.హెచ్.ఓ) ప్రకారం 250 రకాల మందులు  భారత్ లో సరిపోతాయి. కానీ చాలా భాగం సైడ్ ఎఫెక్ట్స్ కలిగించేవి కూడా బేఫీకర్ గా ఇండియా మార్కెట్లో అమ్ముడవుతున్నాయి. కొన్ని దేశాలు నిషేధించిన మందులు అదే పేరున, మారుపేరున ఇక్కడ అమ్ముతున్నారు”. (రంగారావు.పి: 2002; పుట-66). పై అంశాల పరిశీలన వలన  భారత దేశంలో  అవసరానికి మించిన మందులు ఇక్కడ విరివిగా అమ్మబడటం వైద్యం పేరుతో వ్యాపారం ఈ దేశంలో ఎంత బాగా జరుగుతుందో ఊహించవచ్చు.

భారత దేశం సహజంగా ఆధికజనాభా కలిగిన దేశం. అభివృద్ధి చెందుతున్న దేశం. కాబట్టి ప్రపంచీకరణ బహుళజాతి సంస్థలు ఈ దేశంపై తన వ్యాపార మార్గాలను విస్తృతం చేసుకున్నాయి. అధిక జనాభా కలిగి ఉండటం వల్ల ఆరోగ్య వసతులు కూడా అధికంగానే కలిగి ఉంటుంది. ఈ పరిస్థితి బహుళ జాతి సంస్థలకు వరంగా మారింది. “భారతీయ వైద్యరంగంలో  వాడే మందులు ఎక్కువగా మల్టీనేషనల్స్ (ఎమ్మెన్సీలు) తయారు చేసినవే. ఇక్కడ ప్రముఖ కంపెనీలన్నీ ఎమ్మెన్సీలవే. బేయర్, ఫెట్జర్ లాంటివన్నీ ఎమ్మెన్సీలవే”. (పైదే పుట -66).

ఆధునికంగా వైద్యరంగం గొప్ప ప్రగతిని సాధించింది. పూర్వం నయంకాని జబ్బులను నేడు నయం చేస్తున్నారు. అన్ని రకాల వైద్య యంత్రాలు అందుబాటులో ఉంటున్నాయి. ఇది వైద్యరంగం సాధించిన ప్రగతిగా చెప్పవచ్చు. ఐతే నేటికీ వైద్యరంగంలో కీలకమైన యంత్రాలన్నీ విదేశీ

బహుళజాతి సంస్థల ఆధిపత్యంలోనే ఉన్నాయి. వీటి దిగుమతికి కోట్ల రూపాయలు ఖర్చవుతున్నాయి. ఇక్కడ మనకు ఒక విషయం స్పష్టంగా అర్థమవుతుంది. అంతిమంగా లాభాలను ఆర్జించేది బహుళ జాతి సంస్థలే. "తలనొప్పి బిళ్ళ నుంచి కడుపు నొప్పి సూది వరకు ఎమ్మెన్సీల (బహుళజాతి సంస్థలు) మందులు విరివిగా ఈ దేశంలో అమ్ముడవుతున్నాయి. ఎక్స్ రే ఫిల్మ్ ల నుంచి వివిధ స్పెషలైజేషన్ యంత్రాల దాకా అన్నీ విదేశీ కంపెనీల మందులే లక్షలాది రూపాయలు ఖరీదు పెట్టి దిగుమతి చేసుకుంటున్నాము. మన డ్రగ్ ఇండస్ట్రీలో, వైద్య నిర్ధారణ యంత్రాలలో, అల్లోపతి వైద్య ప్రక్రియ మొత్తంలో విదేశీ బహుళ జాతి సంస్థలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి" (పైదే). పై అంశాలను పరిశీలిస్తే దేశీయ వైద్యంలో విదేశీ బహుళజాతి సంస్థల పెత్తనం మనకు అర్థమవుతుంది.

అలానే నేడు ఆధునిక వైద్యం, అందులో ప్రత్యేకతలు పెరిగినా రోగికీ డాక్టర్ కు మధ్య ఉన్న సంబంధం మారింది. యంత్ర భాష అలవడిందని చెప్పవచ్చు. "వైద్య పరిభాష తడబడుతోంది. అందుకే వైద్యం అంతుబట్టని వ్యాధిగా మారుతుంది. దీనిలోకి దళారులు, కమీషన్ దారులు పెరిగిపోతున్నారు. అందుకే సాధారణ వైద్యం కార్పొరేట్ వైద్యంగా రూపాంతరం చెంది స్టార్ హాస్పిటల్ వ్యాపారమైంది. రానున్న కాలంలో ఎమ్మెన్సీలు (బహుళజాతి సంస్థలు) వైద్యం మొత్తాన్ని నడిపిస్తాయి. కార్పొరేట్ స్థాయి దాటి మల్టీనేషనల్ స్థాయికి పోతుంది". (పైదే, పుట – 68).

నైతిక విలువలు మరచి డబ్బుపిండే యంత్రాల్లా మారిన డాక్టర్ల గురించీ, ఆపరేషన్ ఖర్చుల మీద ఆకర్షణీయమైన రాయితీలు ప్రకటించి వైద్యాన్ని ఫక్తు వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ హాస్పిటళ్ళ గురించి, మూడేళ్ళ బాబు జీవితం వైద్యుల నిర్లక్ష్యం కారణంగా దేనికీ కొరగాని గడ్డిపూవులా మారిపోయిన పరిస్థితిని గురించి చర్చించిన నవల సలీం రాసిన 'జీవన్మృతులు'. డాక్టర్లకు, డాక్టర్లకు మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందాన్ని సునిశితంగా తెలియజేసిన మరో నవల సింహప్రసాద్ రాసిన తమసోమా...!

'జీవన్మృతులు' నవలలో జయంతి, రాకేష్ లకు మూడేళ్ళ బాబు ఉంటాడు. ఒకరోజు బాబుకి కడుపునొప్పి ఏర్పడుతుంది. తల్లిదండ్రులు బాబును ఒక ప్రైవేట్ హాస్పిటల్ కి తీసుకెళతారు. అక్కడి వైద్యులు ఒక మందుకి బదులు మరో మందుని బాబుకి ఎక్కిస్తారు. అది వికటిస్తుంది. దీంతోబాబు మెదడు నరాలు దెబ్బతిని అచేతనంగా మారిపోతాడు. ఇక అతడు కదలడు మెదలడు అచేతనాస్థితికి వెళ్ళిపోతాడు తను జీవితాంతం ఇలాగే ఉండి పోతాడని వైద్యులు చెప్పడం విన్న

జయంతి రాకేష్ లు కుమిలి పోతారు. ఈ పరిస్థితి నేడు ప్రైవేట్ వైద్యసంస్థలు చేస్తున్న నిర్లక్ష్య వైద్యానికి ప్రతీక. హర్ జ్యోత్ అనే మూడేళ్ళ బాబు జీవతంలో 'మెడోస్' ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్ల కలిగిన విషాదం తదుపరి యదార్ధ సంఘటనల ఆధారంగా ఈ నవల రాశారు సలీంగారు.

పవిత్రంగా వుండే వైద్యరంగం నేడు వ్యాపారం అయింది. నాడు "డాక్టర్లను వైద్యో నారాయణో హరి" అంటూ దేవుళ్లలా ఆదరించేవారు. డాక్టర్లు కూడా అలానే ఆచరించేవారు. కానీ నేడు డాక్టర్ కోర్సులో చేరడానికి ముఖ్యకారణం డబ్బుసంపాదించాలనే కోరిక, వైద్యం చేయడంలో ముఖ్యోద్దేశ్యం ధనార్జన. లాభార్జనకు, దురాలోచనలకు దూరంగా ఉండాలనే అంతర్జాతీయ నియమావళికి నేడు తిలోదకాలిస్తున్నారు. కొన్ని సంవత్సరాలక్రితం 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రికలో మూత్రపిండాల వ్యాధులతో సతమతమయ్యే రోగులకు సువర్ణావకాశం! సబ్సీడీ ధరలకే మూత్రపిండాల మార్పిడి! అనే ప్రకటన వచ్చిందంటే వైద్యరంగం ఎంతగా వ్యాపార ధోరణిలోకి వెళ్ళిందో అర్ధమవుతుంది.

ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ పేరిట శరవేగంగా మారిపోతున్నటువంటి పరిస్థితుల నేపథ్యంలో వైద్యం వ్యాపారమైంది. రోగుల పట్ల వైద్యులకు ఉండే బాధ్యత తగ్గిపోతోంది. సామాజిక విలువలకు నేడు తిలోదకాలు ఇస్తున్నారు. "మనం మన వృత్తికి న్యాయం చేయడం లేదనిపిస్తోంది డాక్టర్ శ్రీధర్. అందుకే అలా అంటున్నాను. పేషెంట్‌తో మనం సరైన కమ్యూనికేషన్ ఏర్పాటు చేసుకోవడంలేదు. మనకంత తీరిక లేదు. పేషెంట్‌కు వచ్చిన జబ్బుగురించి వివరించడానికి మనకు టైంలేదు. ఏవో టెస్టులు రాస్తున్నాం, తర్వాత ఏవో మందులు ఇస్తున్నాం. వాటి గురించీ, వాటి సైడ్ ఎఫెక్ట్స్ గురించీ మనం వాళ్ళకు వివరించడం లేదు. ప్రొఫెషనల్ జలసీ... అవసరం లేకున్నా ఆపరేషన్లు.. మన క్రెడిబిలిటీ పోవడానికి మనమే కారణం. ప్రొఫేషనల్ ఎథిక్స్ ఎక్కడున్నాయి ఈ రోజుల్లో ....!" (సలీం:2010; పుట-154) అంటూ అభిప్రాయపడతాడు డాక్టర్ ప్రకాష్. పై అంశాల్ని పరిశీలిస్తే ఆధునికంగా వైద్యరంగంలో విలువలు నశించి పోతున్న స్థితి మనకు అర్థమవుతుంది.

ప్రస్తుతం వైద్యం పేరుతో పెద్ద ఎత్తున వ్యాపారం నిర్వహిస్తున్నారు. అవసరం ఉన్నాలేకున్నా రోగులకు స్కానింగ్‌లు, ఈసీజీలు తీయిస్తున్నారు. దీంతో ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేస్తున్నారు. ఈ పరిస్థితులని వివరస్తుంది. సింహప్రసాద్ రాసిన 'తమసోమా' నవల. "ఫైవ్ స్టార్స్ హాస్పిటల్స్ లో వైద్యం చేస్తున్నది డాక్టర్స్ కాదు. బిజినెస్ మెన్. అవసరమున్నా లేకపోయినా స్కానింగ్‌లూ,

ఈసీజీలు తీయిస్తున్నారు. సిటీస్కాన్  ఓ ఆసుపత్రిలో ఎనిమిదొందలకు చేస్తే ఇతర ఆసుపత్రుల్లో వెయ్యి నుంచి పద్దెనిమిది వందలు గుంజుతున్నారు. ఎంచేతంటే సిటీస్కాన్, ఎమ్మారై టెస్ట్ వగైరాల ఛార్జీల్లో కొంత భాగం 'కిక్ బాక్'గా డాక్టర్లకు ముడుతున్నాయి". (సింహప్రసాద్: 2010 ; పుట–19) అంతేకాకుండా "ఒక డాక్టర్ మరో డాక్టర్‌కి ఆసుపత్రి కేసులను రిఫర్ చేసినందుకు పది నుంచి నలభైశాతం కమీషన్ ముట్ట చెబుతున్నారు. ఇవి కల్పిత మాటలు కాదు పచ్చినిజాలు". (పైదే) పై అంశాల పరిశీలన వలన ప్రజల ఆరోగ్య అవసరాలను ఆసుపత్రులు ఏ విధంగా వ్యాపారంగా మలచుకుంటున్నాయో అర్థమవుతుంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూ.హెచ్.ఓ) అభిప్రాయం ప్రకారం 90 శాతం జబ్బులు సరైన నీరు లభించకనే వస్తున్నాయని తెలిపింది. సరైన తిండిలేక పౌష్టికాహారం లోపం భారతదేశంలో అధిక జబ్బులకు కారణమవుతుంది. ఐతే వీటి మీద వైద్యులు శ్రద్ధకనపరచడం లేదు.  విదేశీ వైద్యం, మందులను  అంతకంతకూ దిగుమతి చేసుకోవడం మీదనే మనసులగ్నం చేస్తున్నారు. విదేశాల్లో అవుట్ డేటెడ్ గా  ప్రకటించినవి కూడా యిక్కడ డంపింగ్  చేస్తున్నారు. అత్యవసరమైన వాటికి ఆధునిక వైద్యం మీద ఆధారపడుతూనే దేశీయ వైద్యం పెంచడం మీద అంతకుమించి రోగం రాకుండా తీసుకోవాల్సిన చర్యల మీద శ్రద్ధ వహించడం లేదు.

"మనదేశంలో ఉన్న దౌర్భాగ్యస్థితి ఇదే. దేశంలో మొత్తం తొమ్మిది వేల డ్రగ్ కంపెనీలు అరవై వేల రకాల మందుల్ని తయారు చేసి అమ్ముతున్నాయి. డబ్బుమోజులో  పడిన డాక్టర్లు ఎథిక్స్ మరిచిపోయి పేషెంట్ల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు. మనకు 248 రకాల మందులుంటే చాలు. తొంభైతొమ్మిది శాతం రోగాల్ని వీటితో నయం చేయవచ్చు. టానిక్కులూ, విటమిన్లే తీసుకో మన వాళ్ళు పిప్పరమెంట్ బిళ్ళలు నమిలినట్లు వీటిని వాడేస్తుంటారు. వీటి అవసరం మామూలుగా ఉండదు. ఇవి వాడినా అందులో మన శరీరానికి ఉపయోగపడేది ఒక శాతం కూడా ఉండకపోవచ్చు" (సలీం:2001; పుట–176) పై అంశాల పరిశీలన వలన మనదేశంలో అవసరంలేకున్న వైద్యుల సూచనతో మందుల్ని వినియోగిస్తున్నారు. ఈ పరిస్థితిని నేటి ప్రైవేట్ రంగం, బహుళజాతి సంస్థలు కల్పించాయి.

ప్రపంచీకరణ నేపథ్యంలో వైద్యంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యం ఎక్కువైంది. భారత దేశంలో అన్ని నగరాల్లో ప్రైవేట్ ఆసుపత్రుల మధ్య తీవ్రమైన పోటీనడుస్తుంది. ఈ పరిస్థితుల్లో రోగులను ఆకట్టుకోవడానికి ప్రైవేట్ ఆసుపత్రులు పోటీపడి ప్రచారం చేసుకుంటున్నాయి. వీటిని

నమ్మి వచ్చిన రోగులు తీవ్రంగా మోసపోతున్నారు. "పోటీని తట్టుకోవాలంటే పేషెంట్ ను సంతృప్తిపరచాలి. ఇదో కారణం. అయితే మరో కారణం ఇదంతా ఓ పెద్ద రాకెట్ లా నడపటమే. డయాగ్నోస్టిక్ కంపెనీలిచ్చే కమీషన్ కోసం అవసరమున్నా లేకున్నా టెస్టులు రాయడం మందుల కంపెనీలు చూపే ప్రలోభాలకు లోబడి ఆ బ్రాండ్ మందులు వాడమని రాయడం అంతావ్యాపారం. కొత్తగా మార్కెట్ లోకి వస్తున్న ఆ బ్రాండ్ వాడటం వల్ల కలిగే దుష్ఫలితాలు గురించి వారికి అవగాహన ఉండదు. మెడికల్ రెప్ లు చెప్పే తీయటి మాటల్నే నిదర్శనాలుగా తీసుకొని ఎడాపెడా రాశేస్తారు". (పైదే) ఈ విధంగా వైద్యులు, ప్రైవేట్ బహుళజాతి సంస్థలు కుమ్మక్కై రోగుల నుంచి డబ్బును ఏ విధంగా వ్యాపార మార్గంలో దోచుకుంటున్నారో మనకు అర్థమవుతుంది.

సాధారణ ఆరోగ్య సమస్యలకూ నేడు మార్కెట్లో బహుళజాతి సంస్థల మందులు విరివిగా లభ్యమవుతున్నాయి. ఉదాహరణకు డయేరియాకి ఒక గ్లాసుడు నీళ్ళలో చిటికెడు ఉప్పు, కొద్దిగా పంచదార కలిపివాడితే అమోఘంగా పనిచేస్తుంది. ఈ మందుని బ్రిటీషు మెడికల్ జర్నల్ 'దిలాన్సెట్' ఈ శతాబ్దపు ముఖ్యమైన మెడికల్ ఎఛీవ్‌మెంట్‌గా పేర్కొంది. అయితే నేడు డయేరియాకు మార్కెట్లో రకరకాల మందులు లభ్యమవుతున్నాయి. డయేరియాకి మార్కెట్లో 75 కంపెనీలు 200 రకాల మందులు తయారు చేస్తున్నాయి. అందులో ఒకదాంట్లో 'హేలోజినేటెడ్ హైడ్రోక్సెనో క్వినోలిన్' ఉంది. పలకడానికే కష్టంగా ఉన్న ఈ మందువాడితే మరిన్ని కష్టాలు వస్తాయన్న విషయం ప్రజలకు తెలియదు. దీని వాడకం వల్ల ఆప్టికల్ నెర్వస్ దెబ్బతినే ప్రమాదం ఉంది". (సలీం : 2001 ; పుట–177) 1975లో హాథి కమీషన్ రిపోర్ట్ లో నాణ్యతను, వాటి దుష్ప్రభావాలను కంట్రోల్ చేయడానికి డ్రగ్ అథారిటీని ఏర్పాటు చేయాలని సూచించింది. దాన్ని మన ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. కానీ పక్క దేశాలైన బంగ్లాదేశ్ , శ్రీలంకలు ఈ సూచనలను పాటించాయి. ప్రమాదకరమైన కొన్ని మందుల్ని నిషేధించాయి.

నేడు కార్పొరేట్ హాస్పిటల్స్ డబ్బులు పిండే యంత్రాలుగా తయారవుతున్నాయి. ప్రజలు ఏ చిన్న సమస్యతో హాస్పిటల్ కి వెళ్ళినా రకరకాల పరీక్షల పేరుతో నిలువుదోపిడి చేస్తున్నారు. ప్రైవేట్ హాస్పిటళ్ళ పని తీరు డబ్బుసంపాదన మార్గంగా తయారయింది. ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేస్తున్నారు. "కార్పొరేట్ హాస్పిటళ్ళ పనితీరు గురించి ఏం చెప్పమంటారు? మీరు బిజినెస్ మాన్ కదా .... ఏ చిన్న అనుమానంతో వెళ్ళినా అదే నిజమని భయపెట్టేస్తారు. డబ్బులు గుంజడానికి ఏదో ఒక కారణం వెతికి మొదట ఆందోళనకు గురి చేస్తారు. నాలుగైదు రోజులు హాస్పిటల్ లో ఉన్నాక మీ అదృష్టం బావుంటే 'అన్ని పరీక్షలూ చేశాం దోషమేమి లేదు' అని చెప్పి యాభైవేలో

అరవై వేలో బిల్లు వేస్తారు. అదృష్టం బాగోలేదా....... ఆపరేషన్ చాలా అవసరం లేకపోతే పేషెంట్ అవుట్! అని బెదరగొట్టి మరింత డబ్బులు పిండుతారు". (పైదేపుట-185). ఈ విధంగా కార్పొరేట్ ఆసుపత్రులు మోసాలకు పాల్పడుతున్నాయి.

ప్రపంచీకరణ అమలువుతున్న పరిస్థితుల్లో సమస్త రంగాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వైద్యరంగం కూడా అభివృద్ధి చెందుతూ ఉంది. అయితే కార్పొరేట్ ఆసుపత్రుల ధన సంపాదనకు అడ్డుకట్టవేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి ప్రభుత్వం. ఆరోగ్యాన్ని సామాజిక ప్రయోజనంగా భావించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా మెరుగైన వైద్యాన్ని పేదలకు అందించాలి. భారత్ లాంటి వర్ధమాన దేశాల్లో ప్రజలు అధికంగా అల్ప, మధ్య ఆదాయ వర్గాల వారు. వీరికి ఖరీదైన వైద్యం చేయించుకునే స్తోమత తక్కువగా ఉంటుంది. అందువలన ప్రజారోగ్యాన్ని ప్రభుత్వం కాపాడ గలగాలి. అప్పుడే దేశ అభివృద్ధి సాధ్యపడుతుంది.

## 3.6. ప్రసార సాధనాలు

1. ప్రచార మాధ్యమం
2. వార్తా పత్రికలు
3. టెలివిజన్

ప్రపంచీకరణ ప్రభావానికి వేగంగా గురైన రంగాల్లో మీడియా ప్రధానమైంది. ప్రపంచీకరణ ప్రభావం విస్తృతమవ్వడానికి మీడియా సాధనమైంది. ప్రజల అభిప్రాయాలను, తద్వారా ప్రపంచ పరిణామాలను ప్రభావితం చేయడంలో నేడు మీడియా పాత్ర గణనీయంగా పెరిగింది. మీడియా సంస్థలపై ప్రజలకు సార్వభౌమాధికారం ఏదీలేదు. అయినప్పటికీ ప్రజాసంస్థల నియంత్రణ నుంచి కార్పొరేట్ రంగాన్ని కాపాడేందుకు కార్పొరేట్ సంస్థల నియంత్రణలో మీడియాను విస్తరించడం జరుగుతుంది. స్వాతంత్ర్యానికి పూర్వం పత్రికలన్నీ కొన్ని పత్రికలు మినహా మిగతావన్నీ స్వాతంత్ర్య పోరాటాన్ని బలపరిచాయి. అయితే స్వాతంత్ర్యానంతరం పత్రికల పాత్ర మారింది. పత్రికారంగం పెట్టుబడిదారులకు హస్తగతమయింది. ప్రపంచీకరణ క్రమంలో నేడు పత్రికలు పూర్తిగా కార్పొరేట్ రంగంలో పని చేస్తున్నాయి.

సాధారణ ప్రజలకు సమాచారాన్ని తెలియజేసేందుకు, అభిప్రాయాలు కలుగజేసేందుకు పని చేసేదే మాస్ మీడియా వ్యవస్థ. ఇవి విస్మయాన్ని, వినోదాన్ని అందిస్తాయి.

వ్యక్తులలో విలువలు, విశ్వాసాలు కలుగజేస్తాయి. సమాజ నిర్మాణంలో ప్రజలు అంతర్భాగం కావడానికి అవసరమైన ప్రవర్తనా సరళిని కలుగజేస్తాయి.

ఒకసారి పత్రికల పుట్టుపూర్వోత్తరాలు గమనిస్తే "1502 జర్మనీలో మొదటి వార్తా పత్రిక నమోదైంది. ఇంగ్లీషులో తొలి పత్రిక డైలీ కరెంట్ 1655లో ప్రారంభమైంది. ఇండియాలో తొలిపత్రిక బెంగాల్ గెజిట్ ఇంగ్లీషులో 1780 నవంబర్ లో కలకత్తా నుండి వెలువడింది. తెలుగులో తొలి పత్రిక సత్యదూత క్రైస్తవ మత ప్రచారం కోసం 1835లో వెలువడింది. ఇక సుప్రసిద్ధ తెలుగు పత్రిక ఆంధ్ర పత్రిక 1900 లో కాశీనాథుని నాగేశ్వరరావు ప్రారంభించారు. వందేళ్ళు పూర్తి చేసుకున్న పత్రికలు ఇండియాలో 941 వున్నాయని అంచానా" ( నోమ్ ఛామ్ స్కీ, హెడ్వర్డ్ ఎస్. హెర్మన్ : 2000 ; పుట -8)

ముందుగా చెప్పుకున్నట్లు పత్రికలు పూర్తిగా కార్పొరేట్ రంగంలో కలిసి కార్పొరేట్ వర్గ ప్రయోజనాలను రక్షించడానికి ప్రయత్నిస్తున్నాయి. దీనికి కారణం పత్రికల్లో ప్రధానమైనవి కార్పొరేట్ వర్గాల చేతుల్లో ఉండటమే. "స్టేట్ మన్ పత్రిక టాటాలది, అగ్రశ్రేణి పత్రిక హిందూస్థాన్ టైమ్స్ బిర్లాలది, టైమ్స్ ఆఫ్ ఇండియా జైన్ చేతుల్లో ఉంది. అత్యధిక సర్క్యూలేషన్ గల "మలయాళ మనోరమ" ఎం.ఆర్.ఎఫ్ గ్రూప్ చేతుల్లో ఉంది" (పైదే పుట-3)

నేడు మీడియాను ఇంత విస్తృతంగా చేయడంలో కార్పొరేట్ వర్గాలకు ఖచ్చితమైన వ్యాపార ప్రయోజనాలు ఉన్నాయి. పత్రికా స్వాతంత్ర్య పరిరక్షణ అవసరం అంటున్నారు. ఐతే ఇక్కడ అసలు ప్రయోజనం పొందేది వీటిని నడిపించే యాజమాన్యమే.

ప్రపంచంలోని చాలా దేశాల్లో టీ.వీ, రేడియోలు ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే ప్రారంభమై నట్లుగానే ఇండియాలో కూడా ఇవి ప్రభుత్వరంగంలో ఉండేవి. ఈ కారణంగా అవి ప్రభుత్వ ప్రచార సాధనాలుగానూ, అధికార నియంత్రణలో నడుస్తుండేవి. ఇదంతా కూడా స్వాతంత్ర్యం పొందిన తొలి రోజుల్లో. అయితే కాలక్రమంలో ఇవి కూడా పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్ళాయి. ప్రపంచీకరణ నేపథ్యం ఈ వాతావరణాన్ని పూర్తిగా మార్చివేసిందనే చెప్పాలి.

పత్రికలకు, ఎలక్ట్రానిక్ మీడియాకు స్వేచ్ఛ అనేది అత్యంత ముఖ్యమైనదిగా పేర్కొంటారు. ఈ స్వేచ్ఛనే ప్రజా సమస్య లను వెలుగులోకి తీసుకురావడానికి దోహదపడుతుంది. అయితే నేడు

వీటికున్న అతిస్వేచ్ఛ వలన కొన్ని సందర్భాల్లో మీడియా సమస్య లను వక్రీకరిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించడానికి అవకాశం కలుగుతుంది.

“1994 డిశంబర్‌లో గాట్ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఇది మన ఆర్థిక సార్వభౌమ త్వానికి నష్టదాయకమని ప్రగతిశీల శక్తులు వాదించాయి. కానీ, పత్రికలు దాన్ని మింగించడానికి గాట్ వల్ల వాణిజ్యం అపారంగా పెరిగిపోతుందని లెక్కలు ఇచ్చాయి. 200 బిలియన్ డాలర్ల మేరకు ప్రపంచ వాణిజ్యం పెరుగుతుందని, దానిలో మనకు 2 బిలియన్లు లాభమొస్తుందని ప్రచారం జరిగింది. ఈ లెక్కలు ఎన్ని రకాలుగా మారాయో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. టైమ్స్ ఆఫ్ ఇండియా 20 బిలియన్లని, ఎకనమిక్ టైమ్స్ 2-13 బిలియన్లని, హిందూస్తాన్ టైమ్స్ 275 బిలియన్లని తలా ఒకరకంగా తోచిన సంఖ్యలు గుప్పించాయి”. (నోమ్ ఛామ్ స్కీ, ఎడ్వర్డ్ ఎస్.హెర్మన్ : 2000 ; పుట - 8). పై అంశాలు పరిశీలన వలన వివిధ పత్రికలు తమ స్వేచ్ఛ కొద్దీ వివిధ రకాలుగా గణాంకాలు ఇచ్చాయి.

మీడియా సమాజంలో నిర్వహించదగిన పాత్ర ఎంతో కీలకమైనది. ఇది ప్రజలకు వాస్తవ విషయాలను తెలియజెప్పుటలో సహాయపడాలి. అయితే కోట్లాది సామాన్య ప్రజల జీవితాలను ప్రత్యక్షంగా ప్రభావితం చేసే ఆర్థిక విధానాల స్వరూపం అతికీలక అంశాన్ని మరుగున పరచబడుతుంది. పెట్టుబడిదారులకు లాభదాయకమైన ప్రయోజనాలే అందరి ప్రయోజనాలుగా చిత్రించబడుతున్నాయి.

మీడియా ప్రభుత్వంపై ఆధారపడటం, దానితో సంబంధాలు నిర్మాణంలో మరో ముఖ్యాంశం. మీడియా, అధికారంలో ఉన్న ప్రభుత్వం అదుపునకు , వేధింపులకు గురయ్యే అవకాశం ఉంది. సాంకేతిక పరమైన చట్టపరమైన ఈ పరాధీనత మీడియాను అదుపుచేసే ఒక సాధనంగా ఉపయోగించడం జరిగింది. తత్ఫలితంగా మీడియాకు రాజకీయ సంబంధాలు విస్తృతమైనాయి. (పైదే; పుట-21)

ప్రస్తుతం దేశం, రాష్ట్రంలో కూడా ఇటువంటి పరిస్థితులనే మీడియా ఎదుర్కొంటుంది. వార్తా పత్రికల్లో ఒక పత్రిక అధికార పక్షానికి అనుకూలంగా రాస్తుంది. మరో పత్రిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తుంది.

ప్రస్తుతం కొన్ని పత్రికలు సామాజిక నైతిక విలువలకు తిలోదకాలు ఇస్తున్నాయి. కొన్ని పత్రికలు ప్రధానంగా అశ్లీలకర సన్నివేశాలను చిత్రిస్తున్నాయి. పత్రికలు మానవ సమాజాన్ని అత్యంత ప్రభావితం చేస్తాయి. కాబట్టి ఇలాంటి దృశ్యాలను పత్రికల్లో చూపించడం ద్వారా అవి భారతీయ సామాజిక , సాంస్కృతిక, నైతిక విలువలను పతనం చేస్తాయి. ముఖ్యంగా యువతను పక్కదారి పట్టిస్తుంది. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలి. వాస్తవానికి పత్రికల్లో చూపించే సెక్స్, హింస వంటివి ప్రజలు ఇష్టపడరని అనేక అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. అయినప్పటికీ గ్లోబల్ మీడియా దీన్ని పట్టించుకోవడం లేదు. "ప్రజలు సెక్స్ హింస తదితర వినోదాలను తక్కువగానూ, వార్తలు, డాక్యుమెంటరీలు ఇతర సమాచారం ఎక్కువగానూ కోరుకుంటున్నట్లు అనేక సర్వేలు చెబుతున్నాయి" (ఫైదే,2000 ; పుట–x).

సలీం రాసిన 'కాంచనమృగం' నవలలో ప్రసారసాధనాల వలన పతనమవుతున్న సమాజ విలువలు, స్త్రీ ల జీవితాన్ని చెప్పడం జరిగింది. ఈ నవలలో లావణ్య, రేవతి అనే అమ్మాయిల జీవితాల్లో ప్రసారసాధనాలు, సినిమా సృష్టించిన అలజడిని, అవి కలిగించిన ఆశలను, తర్వాత ఆమె జీవితం పగిలిన కుండగా ఎలా మారిపోయిందో ఈ నవల వివరిస్తుంది.

ఈ నవలలో లావణ్య ఇంటర్మీడియట్ ఫెయిలై ఇంటి దగ్గర ఉంటుంది. ఈమెకు మనోరంజిత అనే స్నేహితురాలు ఉంటుంది. లావణ్యకు ఒక వైపు తల్లిదండ్రులు పెళ్ళి సంబంధాలు చూస్తూ ఉంటారు. ఒక రోజు మనోరంజితం లావణ్యను రోజంతా ఏం చేస్తుంటావే? పొద్దెలాపోతుంది అని అడుగుతుంది. "అవునే, బోర్ కొట్టి చస్తున్నాను. పత్రికల్లో శృంగారం దట్టించిన కథలూ, సీరియల్స్ చదివి, టీవీ ఛానల్స్ లో మసాల సీన్లు చూసి మరీ పిచ్చెక్కిపోతుందే. అంతా థీయరీగానే. ప్రాక్టికల్స్ కోసం శరీరం తొందరపెట్టేస్తోంది. ఎపుడెపుడు పెళ్ళి చేస్తారా, మజా చేద్దామా అని ఎదురు చూస్తున్నా" (సలీం:2006; పుట–13) అంటూ అభిప్రాయ పడుతుంది లావణ్య. తర్వాత లావణ్యకు తల్లిదండ్రులు పెళ్ళిచేస్తారు. ఆమె భర్త వెంకటేశ్వర్లు డాక్టర్ గా పని చేస్తుంటాడు. అతడిది సాధారణ అందం. వీరికి ఒక కూతురు పుడుతుంది. అయితే అతనితో సహజీవనం చేయడం లావణ్యకు అంతగా ఇష్టం ఉండదు. తనకు మంచి అందగాడు సినిమా హీరోలాంటి వ్యక్తి భర్తగా ఉండాలని కోరుకుంటూ భర్త, కూతురును వదలి తన ప్రియుడైన మరో వ్యక్తితో ఇంట్లో నుంచి వెళ్ళిపోతుంది. అతడు లావణ్యను శారీరకంగా చాలా కాలం అనుభవించిన తర్వాత మరో అమ్మాయితో పెళ్ళికి సిద్ధపడతాడు. ఎదురుతిరిగిన లావణ్యను చంపేస్తాడు.

పై అంశాల పరిశీలన వలన నేటి పత్రికలు, టీ.వీ, మీడియా అశ్లీలకర సాహిత్యం, చిత్రాలు ఏవిధంగా సమాజాన్ని ప్రభావితం చేస్తున్నాయో అర్థమవుతుంది.

ప్రస్తుతం సినిమాలు కూడా యువతను పెడదోవపట్టిస్తున్నాయి. వారపత్రకల్లో సినీతారల చిత్రాలకు అడ్డు అదుపు లేకుండాపోతుంది. ఇవి ముఖ్యంగా యువతను పాడుచేయడానికి అవకాశం ఉన్నాయి. నేటి సమాజంలో చాలా మంది యువత సినీతారలను అనుకరించే ప్రయత్నం చేస్తున్నారు. సినిమాల మోజులో యువత చదువును తద్వారా భవిష్యత్ ను నాశనం చేసుకుంటుంది. ఈ పరిణామాలను చిత్రించిన నవల సలీం 'కాంచనమృగం'.

"ప్రతి పేజీలో హిందీ, తెలుగు హీరోయిన్ల అర్థనగ్న చిత్రాలలో పాటు, రసవత్తరంగా రాసిన బిట్సు ఉన్నాయి. కొత్తగా వస్తున్న ప్రియాంక అనే హీరోయిన్ గురించి ఏం రాశారో చదివే ముందు ఆమె వేసుకున్న డ్రెస్ వైపు నిశితంగా చూసింది. శరీరంలో ముప్పావు భాగం అనాచ్ఛాదితంగా ఉంది. ఏ అందాలనైతే బహిర్గతపరచటాన్ని సభ్యసమాజం నిషేదించిందో వాటిని ఆఫ్టరాల్ అన్నట్టుగా ఉదారంగా వెదజల్లుతూ ఫోజిచ్చింది" (సలీం:2006; పుట–22) ఈ విధంగా అశ్లీలకరమైన చిత్రాలు సమాజాన్ని ముఖ్యంగా యువతను పెడదోవ పట్టించే అవకాశం ఉంది. సమాజ శ్రేయస్సుకు తోడ్పడవలసిన పత్రికలు ఇటువంటి చిత్రాలను తగ్గించాలి. ఎందుకంటే పత్రికలు సమాజాన్ని బలంగా ప్రభావితం చేస్తాయి.

నేటి సమాజాన్ని టీవీలు, సినిమా విపరీతంగా ప్రభావితం చేస్తున్నాయి. పట్టణాల నుంచి మారుమూల పల్లెల దాకా వీటి ప్రభావంలో పడి కొట్టుకుపోతున్నారు యువత. వీటి ప్రభావం ఏ విధంగా ఉందంటే చివరికి చదువురాని వారిని కూడా ప్రభావితం చేస్తున్నది. "పెద్ద చదువులు, ఆర్థిక స్థోమత లేకున్నా సినిమాల, టీవీల ప్రభావంలో పడి పాశ్చాత్య సంస్కృతిని గుడ్డిగా అనుకరిస్తూ చాలా గొప్పగా మోడరన్ గా భావించుకునే నేటి యువతకి ప్రతిరూపం రేవతి". (పైదే పుట –180). కాంచన మృగం నవలలో రేవతి పేద అమ్మాయి. ఒక జిరాక్స్ షాప్‌లో పని చేస్తూ ఉంటుంది. ఇలాంటి పేద అమ్మాయి ప్రసార సాధనాల వ్యామోహంలో పడి మోసపోయిన వైనాన్ని వివరిస్తుందీ నవల.

ఈ నవలలో మనోజ్ అనే ఒక యువకుడు ఉంటాడు. ఎక్కువగా సినిమాల గురించి ఆలోచిస్తుంటాడు. ఎప్పటికైనా సినిమా హీరో కావాలని కలలు కంటుంటాడు. అందగాడు. తనకు సినిమా ఫీల్డ్‌లో చాలా మంది హీరోలు తెలుసని రేవతిని వలలో వేసుకుంటాడు. ఇతను అంతకు

ముందే లావణ్య అనే పెళ్ళైన వివాహితను లోబరుచుకుని ఆమెతో సుఖాన్ని అనుభవిస్తుంటాడు. మనోజ్ మీద రేవతి కూడా మనసు పెంచుకొంటుంది. దీనంతటికీ కారణం రేవతి కూడా సినిమాలపై ఆసక్తి కలిగి ఉండటంతో మనోజ్ తనకు సినిమాల్లో అవకాశం కల్పిస్తాడని ఆశ. ఈ విషయం తెలిసి లావణ్య రేవతి వాళ్ళ ఇంటికెళ్ళి మనోజ్ గురించి చెబుతుంది. లావణ్యతో రేవతి తల్లి మనోజ్ గురించి ఈవిధంగా అంటుంది. "సినిమా ఫీల్డ్‌లో చాలా మంది తెల్సిన వాళ్ళున్నారట. తప్పకుండా హీరో అవుతాడు. అప్పుడు డబ్బులకేం కొదవా...... మాఅమ్మాయికి కూడా చిన్నప్పటి నుండి సినిమాల పిచ్చి ఎక్కువ. టీవీలో వన్స్ మోర్ ప్లీజ్, డాన్స్ బేబి డాన్స్ ప్రోగ్రాముల్లో బహుమతులు గెలుచుకుంది. సినిమాల్లో నటించటమన్నా, సినిమా యాక్టర్లన్నా దానికి ప్రాణం. అందుకే వాళ్ళిద్దరూ ఒకర్నొకరు ఇష్టపడ్డారు. పెళ్ళయ్యాక రేవతికి కూడా సినిమాల్లో వేషాలిప్పిస్తానన్నాడు(పైదే) అని రేవతి తల్లి చెబుతుంది. అయితే వాస్తవానికి మనోజ్‌కి సినిమాల మీద వ్యామోహం తప్పితే సినిమా ఫీల్డ్ లో ఎవరూ తెలియదు. ఈ నెపంతో లావణ్యను, రేవతిని నమ్మించి మోసం చేస్తాడు. చివరికి లావణ్యను వదిలించుకొని రేవతిని పెళ్ళాడాలని నిశ్చయించుకుంటాడు. ఈ విషయం గమనించి లావణ్య మనోజ్‌పై యాసిడ్‌తో దాడి చేస్తుంది. మనోజ్ ఆమె చేతిలోని యాసిడ్ బాటిల్ గుంజుకుని లావణ్యను పొదవడం జరుగుతుంది. మనోజ్ ముఖం, కళ్ళు కాలిపోతాయి. లావణ్య చనిపోతుంది. ఈ నవలలో లావణ్య తన భర్తను, కూతురిని వదిలి మనోజ్‌తో వచ్చి మోసపోతుంది. మనోజ్ అసలు సంగతి తెలియని రేవతి అతని చేతిలో మోసపోతుంది.

ఈ నవల ప్రధానంగా ప్రసారసాధనాల వలన ప్రభావితమైన యువత జీవితాల్లో కలిగే భయంకరమైన మార్పులను చూపిస్తుంది. ప్రసార సాధనాలు ప్రజలకు సమాచారాన్ని అందజేస్తాయి. వాటిద్వారా దేశ, అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న కొన్ని వాస్తవ విషయాలు ప్రజలకు తెలుస్తాయి, అయితే ఏది ప్రధానంగా ప్రజలకు అవసరం అవుతుందో అటువంటి విషయాలను మీడియా మరుగున పరుస్తుంది. మీడియా కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఎందుకంటే ప్రధానంగా మీడియా వారి చేతుల్లోనే రూపు దిద్దుకుంటుంది కనుక.

సినిమా, టెలివిజన్ ప్రసారమాధ్యమాల గురించి చర్చించిన మరో నవల సింహప్రసాద్ రచించిన తమాసోమా...!, "జనాన్ని సినిమాలు బాగా పాడు చేస్తున్నాయి గాంధీ. వయసొచ్చిన యువతీ యువకులకి ప్రేమగోల తప్ప వేరే ప్రపంచమే లేనట్టు నూరిపోస్తాయనుకో. వాటి ప్రభావం

ఎక్కువగా ఉన్నమాట నిజమే అనుకో వాటి కన్నా టీవీ మరింత ప్రమాదకరంగా తయారైందంటాను. ఎం చేత? ఆటంబాంబు తర్వాత మళ్ళీ అంతటి దుష్ప్రభావం చూపించగల శక్తి టెలివిజన్‌కే ఉంది. విదేశీ చానల్స్ విదేశీ ఉత్పత్తులకు విపరీతమైన పబ్లీసిటి ఇచ్చి వాటి మీద మోజు కల్పించడమే కాదు పాశ్చాత్య సంస్కృతిని మన మీద రుద్దుతున్నాయి." (సింహప్రసాద్:2012; పుట-74). పై అంశాలను పరిశీలిస్తే సినిమా, టీవీల ప్రభావం సమాజం పై ఏవిధంగా ఉందో తెలుస్తుంది. అలాగే మీడియా విదేశీ వస్తువులపై వ్యామోహాన్ని కలుగ జేసి బహుళ జాతి సంస్థల ఉత్పత్తులకు దాసోహమయ్యేలా తయారుచేస్తుంది.

ప్రస్తుతం మీడియా న్యూస్‌రూంలు అంతకంతకు బహుళ జాతి కంపెనీల సామ్రాజ్యాలుగా మారిపోతున్నాయి. దీనంతటికీ కారణం ప్రపంచీకరణ పేరిట ప్రైవేట్ సంస్థలకు పూర్తిగా స్వేచ్ఛనివ్వటమే.

## 3.7. అంతర్జాతీయ వాణిజ్యం

ప్రపంచీకరణ అంటే వివిధ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను సరళీకరించడం. అంటే విదేశీ వాణిజ్యం పై ఉన్న ఆంక్షలు ఎత్తి వేయడం, వివిధ దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యం ప్రవేశపెట్టడం. దీనినే అంతర్జాతీయ వాణిజ్యం అంటున్నాం. అలాగే పారిశ్రామిక దేశాల ఉత్పత్తులను మన దేశమార్కెట్‌లోకి అందుబాటులోకి తెచ్చుకోవడం.

ప్రపంచీకరణ ముఖ్యలక్షణం అంతర్జాతీయ వాణిజ్యం ప్రపంచ వాణిజ్యాన్ని విస్తరింప జేయడానికి జనరల్ అగ్రిమెంట్ ఆన్‌టారిఫ్ అండ్ ట్రేడ్ (జి.ఎ.టి.టి – గాట్ ) అనే సంస్థను 1947లో స్విట్జార్లాండ్ దేశంలోని జెనీవా నగరంలో స్థాపించడం జరిగింది. 1995 సంవత్సరంలో ఈ సంస్థ అంతర్జాతీయ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)గా ఉనికిలోకి వచ్చింది. 2005 సంవత్సరం జనవరి 1 నుంచి ప్రపంచ స్వేచ్ఛా వాణిజ్యం సంపూర్ణంగా అమలులోకి వచ్చింది. ప్రపంచీకరణకు పూర్వం ఆయా దేశాల ప్రభుత్వాలు తమ అవసరాలు తీర్చుకోవడం కోసం ప్రణాళికబద్ద ఆర్థిక విధానాలను అనుసరించాయి. ప్రభుత్వ రంగంలో వివిధ పరిశ్రమలు స్థాపించి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి స్వయం స్వావలంబనకు ప్రయత్నించాయి. చాలా దేశాలు తమ ఆశయాల సాధనకు స్వతంత్రంగా ఆర్థిక విధానాలను రూపొందించుకొని అమలు చేయడం జరిగింది. నాడు

ప్రాధాన్యతను గుర్తించి తగినంత మేరకు విదేశీ ప్రైవేట్ పెట్టుబడులు వాణిజ్యరంగంలో అనుమతించారు. వాణిజ్యరంగంలో కొన్ని నియంత్రణల ద్వారా దిగుమతులపై ఆంక్షలు విధించి ఎగుమతులకు ప్రోత్సాహం కలిగించాయి.

ప్రస్తుతం సరళీకృత ఆర్థిక విధానాల ద్వారా ప్రపంచ వాణిజ్యంలో పలుమార్పులు చోటు చేసుకున్నాయి. ఈ అంతర్జాతీయ వాణిజ్యంలో పెట్టుబడులను నలుదిశలా వ్యాపించడమనేది ప్రధాన లక్షణం. అంతర్జాతీయ వాణిజ్యంపై ఇంతకు ముందున్న ఆంక్షలు, నియంత్రణలు ఎత్తి వేయడంతో స్వేచ్ఛా వాణిజ్యం విస్తృతమైంది, ఫలితంగా అంతర్జాతీయ వాణిజ్యంలో ద్వైపాక్షిక సంబంధాలు చోటు చేసుకున్నాయి.

అంతర్జాతీయ వాణిజ్యం అభివృద్ధి చెందుతున్న భారతదేశం లాంటి దేశాల్ని కొంత ఒడిదుడుకు లకు గురిచేసింది. ఉదాహరణకు భారత్‌ను తీసుకుంటే విదేశీ పెట్టుబడులకు అనుకూలం గా1991లో రూపాయి విలువను తగ్గించింది. దీంతో విదేశీ పెట్టుబడులు మనదేశంలోకి వస్తాయని రూపాయి విలువను తగ్గించారని చెప్పడం జరిగింది. ఐతే వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉంటున్నాయి. "ఎగుమతులు 10వేల కోట్లరూపాయలు పెరిగితే, 16వేల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు వచ్చాయని అంటున్నారు. అంటే 26000 కోట్ల రూపాయలు లాభమన్నమాట. మరి నష్టం సంగతేమిటి? విదేశీ అప్పులు రూపాయి విలువ తగ్గినందు వల్ల ఒక్క సారిగా 45000 కోట్ల రూపాయలకు పెరిగింది. దిగిమతి చేస్తున్న వస్తువుల్ని సగంధరకే అమ్మాల్సి వచ్చింది. అందువల్ల 10000 కోట్లరూపాయలు కోల్పోయాం. దిగుమతుల పైనా 10000 కోట్ల రూపాయల్ని నష్టపోయాం. అంటే 65000 కోట్ల రూపాయలు నష్టం" (చౌదరి, కె.ఆర్.: 2011; పుట –12). పై అంశాలన్ని పరిశీలిస్తే విదేశీ వాణిజ్యం వల్ల భారత్ రూపాయి విలువను తగ్గించుకుంది. తద్వారా నష్టాలను అనుభవించింది. దీనంతటికి కారణం విదేశీ వాణిజ్యం. పెట్టుబడుల్ని భారత్‌లోకి ఆహ్వానించిన ఫలితమే. అంతర్జాతీయ వాణిజ్యం వలన అభివృద్ధి చెందిన దేశాలే అధిక లాభాలు పొందుతున్నాయి.

సరళీకృత ఆర్థిక విధానాల అమలు కారణంగా రూపుదిద్దుకున్న అంతర్జాతీయ వాణిజ్యం వర్ధమాన దేశాలను కొంత ఒడిదుడుకులకు గురిచేస్తున్నది. భారతదేశంలోకి బహుళ జాతి సంస్థల ప్రవేశం దేశీయ, విదేశీ మారక ద్రవ్య లావాదేవీలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.

అంతర్జాతీయ వాణిజ్యంలో అభివృద్ధి చెందుతున్నదేశాల ఎగుమతులు తక్కువగానూ, దిగుమతులు ఎక్కువగానూ ఉంటున్నాయి. కాగా అభివృద్ధి చెందినదేశాల ఎగుమతులు ఎక్కువగా, దిగుమతులు తక్కువగానూ ఉంటున్నాయి. దీంతో అంతర్జాతీయ వాణిజ్యంలో అంతిమంగా అభివృద్ధి చెందిన దేశాలే లాభపడుతున్నాయి.

"దానికి కారణం బాగా అభివృద్ధి చెందిన దేశాలకు అభివృద్ధి చెందుతున్న దేశాలు చేస్తున్న సరుకుల ఎగుమతుల పై సుంకాలు, అదే మార్కెట్లకు పారిశ్రామిక దేశాలు చేస్తున్న సరుకుల ఎగుమతులపై విదిస్తున్న సుంకాలకంటే సగటున నాలుగు రెట్లు ఎక్కువగా ఎదుర్కొనవలసి వస్తున్నది. అభివృద్ధి చెందిన దేశాలలో వాణిజ్య ఆటంకాలు, అభివృద్ధి చెందుతున్న దేశాల ఎగుమతులకు అడ్డుగా వుండి. ఇక్కడి పేద ప్రజల జీవనాన్ని దెబ్బతీస్తున్నాయి" (రామ్మోహన్, సోదుం: 2004 ; పుట –19)

సింహ ప్రసాద్ రచించిన 'తమసోమా...!' నవలలో "వరిబాగానే పండింది కాని ధాన్యం కొనే నాథుడే లేక పోయాడు. చూస్తుంటే ప్రపంచ ఆర్థిక విధానాలు రైతుల కడుపు కొడతాయేమోనని భయంగా ఉందిరా" అంటూ తాతయ్య అభిప్రాయం వ్యక్తం చేయడం ఆలోచింపచేస్తుంది. "నిజమేరా! కాని మనక్కావలసిన తిండిగింజలు మనదేశపు రైతే పండించాలని లేదు కదా: విదేశాల్లో అభివృద్ధి చెందిన టెక్నాలజీతో చౌకగా ధాన్యాలు పండించి మనదేశానికి పంపిస్తే ఏమవుతుంది? మన రైతు నోట మట్టేకదా! కేవలం ధాన్యాలే కాదు. అన్ని రకాల పారిశ్రామిక ఉత్పత్తులు మన దేశాన్ని ముంచెత్తనున్నాయి. బహుళజాతి సంస్థల ప్రవేశంతో దేశంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలన్నీ నిలువునా కూలిపోవడం కాయం." (సింహప్రసాద్ : 2012; పుట – 105) అంటూ తాతయ్య వ్యక్తం చేసే అభిప్రాయం అంతర్జాతీయ వాణిజ్యంతో మన రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేనితనం కనబడుతుంది. అలాగే స్వేచ్ఛా వాణిజ్య విధానంలో మనదేశంలోకి వచ్చిన మల్టీనేషనల్ కంపెనీల వలన మన పారిశ్రామిక సంస్థలు ఏవిధంగా మూత పడుతున్నాయో తెలుస్తుంది.

## 3.8 దేశీయ వాణిజ్యం

ప్రస్తుతం దేశీయ వాణిజ్యంలో తీవ్రంగా చర్చకు వస్తున్నటు వంటి అంశం వ్యాట్ (value Added Tax). దీనినే తెలుగులో విలువ ఆధారిత పన్ను అంటారు. ఇది 2005 ఏప్రిల్ 1వ తేది నుంచి అమలులోకి వచ్చింది. ప్రస్తుతం దేశీయ వాణిజ్యాన్ని వ్యాట్ అధికంగా ప్రభావితం

చేస్తుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. వాణిజ్యంలో అమ్మకపు పన్ను స్థానంలో వ్యాట్ అమల్లోకి వచ్చింది. వస్తువుల తయారీలో ముడిసరుకుల ఉత్పత్తినుంచి అంతిమంగా వస్తువు ఉత్పత్తి అయి, అమ్మకం జరిగే వరకు ప్రతిస్థాయిలోను కొంత విలువ పెరుగుతుంది. ఈ విలువ పై విధించే పన్నునే విలువ ఆధారిత పన్ను అంటారు.

ఈ వ్యాట్‌పై భారతదేశంలోని చాలా రాష్ట్రాల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుంది. ఈ వ్యాట్ రాష్ట్రాలకు నష్టదాయకంగా పరిణమిస్తుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రాల వనరుల సమీకరణకు ప్రధానమైన అమ్మకపు పన్ను రద్దు చేసి దీని స్థానంలో ప్రవేశ పెట్టిన వ్యాట్ పట్ల నిరసన తీవ్రంగా ఉంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో వస్త్రవ్యాపారులు ఈ వ్యాట్‌కు నిరసన తెలియజేయడం మనం చుస్తున్నాం.

## 3.9 పేటెంట్ హక్కులు

ప్రపంచ వాణిజ్యసంస్థలో కుదిరిన ఒప్పందాలు లేదా షరతులలో పేటెంట్ హక్కు ప్రధానమైనది దీనిని ఆంగ్లంలో ట్రేడ్ రిలేటెడ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీరైట్స్ (Treade Related Intellectual Property Rights) అంటారు. తెలుగులో వ్యాపార సంబంధమేధోపరమైన హక్కులు అమలు చేయడం అంటారు. మల్టీ నేషనల్ కంపెనీలు తమ మేధోపరమైన ఆస్తులు ఇతరులు ఎవ్వరూ చోరి చేయకుండా చట్టాలు ఉండాలని కోరుతున్నాయి. మేధోపరమైన ఆస్తి అంటే ఒక వ్యక్తికి గాని, ఒక సంస్థకు గాని, ఒక యూనివర్సిటీగాని సృష్టించిన టెక్నాలజీ కానీ, డిజైన్ కానీ, కొత్త వస్తువుకానీ కావచ్చు. హక్కులు అంటే వీటిని ఇంకెవ్వరు వీరి అనుమతి లేకుండా ఉత్పత్తి చేయకూడదు, అనుకరించకూడదు. తాము సృష్టించిన వస్తువు లేదా విజ్ఞానం మీద 20 నుండి 50 ఏళ్ళ పాటు సర్వ హక్కులు తమకే చెందాలని వీరి వాదన. దీనికోసం ఆ విజ్ఞానాన్ని సృష్టించిన సృష్టికర్తకు పేటెంట్ హక్కు లేదా కాపీరైట్ హక్కు ఇవ్వాలని అందులోని సారాంశం.

పేటెంట్ హక్కులు సాధారణంగా నూతన ఆవిష్కరణలకు (Invention) ఇస్తారు. కాని ప్రకృతి ప్రసాదించిన మొక్కలు, పశుగణం, సూక్ష్మక్రిములు ఎవరూ నూతనంగా ఆవిష్కరించినవి కావు. అయినప్పటికీ బహుళ జాతి సంస్థలు వీటిపై కూడా పేటెంట్ హక్కులు పొందుతున్నాయి. ఉదాహరణకు భారతీయులకు వేల సంవత్సరాలుగా వైద్యానికీ, ఎరువుకు వినియోగించబడుతున్న

వేపచెట్లను గ్రీస్ కంపెనీ పేటెంట్ చేసుకుంది. అల్లంమీద, పసుపుమీద పేటెంట్ హక్కులు పొందారు. పైగా మన వనమూలికలు సహజ సంపద మీద సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలు కన్నువేశాయి. ఈ పేటెంట్ హక్కులు క్రమంగా మన సంప్రదాయక వినియోగం మీద మన ప్రాసెస్ మీద ఆంక్షలు విధించే రోజులు వస్తాయి.ప్రస్తుతం పేటెంట్ హక్కుల కాలపరిమితి 20 సంవత్సరాలకు పెంచడం జరిగింది.

డబ్ల్యూ.టి.ఓ ఒప్పందం వలన, పేటెంట్ చట్టాల మూలంగా మన వ్యవసాయ రంగం మీద, ఉత్పత్తుల మీద, మనసబ్సీడీల మీద నియంత్రణ జరుగుతున్నది. ముఖ్యంగా వ్యవసాయరంగం పై అత్యంత ప్రభావాన్ని పేటెంట్ హక్కులు కల్గిస్తాయి. వ్యవసాయ రంగానికి అపారమైన నష్టం కలుగుతుంది. జీవకణాల్ని పేటెంట్ చేస్తే మన విత్తన పరిశోధనలన్నీ ఆగిపోతాయి. మనకు కావల్సిన నూతన పైర్ల రకాల్ని మనం తయారు చేసుకోలేం. రైతులు తమ విత్తనాల్ని తామే ప్రతి సంవత్సరం వాడటానికి వీలు కాదు. బహుళజాతి కంపెనీల నుండి విత్తనాలను ప్రతిసంవత్సరం కొనవలసి వస్తుంది. విత్తనాల ధరలు పెరుగుతాయి. మన పంటల సరళిమార్చుకోవల్సి వస్తుంది. జీవశాస్త్రసాంకేతికరంగంలో మన పరిశోధనలు ఆగిపోతాయి. ముఖ్యంగా ధనిక దేశాలు పేటెంట్ తీసుకుంటే మన తరతరాల విజ్ఞానాన్ని మనం వాడుకోవడానికి వీలుండదు. ఉదాహరణకు వేప, పసుపు మొదలైనవి.

అయితే మేధోసంపత్తి హక్కుల్ని న్యాయకోవిదులు, శాస్త్రజ్ఞులు, మేధావులు, రాజకీయ పక్షాలు వ్యతిరేకించారు. అయినప్పటికీ భారత పార్లమెంటులో ఈ చట్టాన్ని ఆమోదింపచేయడం జరిగింది.

బహుళ జాతి సంస్థలు పేటెంట్ల పేరుతో మనదేశంలో జరిగే పరిశోధనలు దెబ్బతీయడమే దీని ఉద్దేశ్యం. మన అభివృద్ధి కుంటుపడుతుంది. ధనిక దేశాలకు మన మార్కెట్ వశమవుతుంది. విదేశీ పెట్టుబడులు, జౌళి, వస్త్రాలు, సేవారంగాలకు సంబంధించిన ఒప్పందాల వల్ల ఎన్నో ప్రత్యక్ష, పరోక్ష నష్టాలు మనకు దాపురించడానికి అవకాశం ఉంది.

పై అధ్యాయాలను పరిశీలించిన తర్వాత మనకు ఈ క్రింది అంశాలు అవగతమవుతున్నాయి. గత ఇరవై ఏళ్ళుగా భారత పాలకులు అమలు చేస్తున్న ప్రపంచీకరణ వలన తీవ్రంగా నష్టపోయిన రంగం వ్యవసాయరంగం. ఈ వ్యవసాయ సంక్షోభానికి, దుష్పరిణామాలకు కారణం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న అభివృద్ధి నమూనా లేదా విధానాలే కారణం. ప్రభుత్వాలు వ్యవసాయం పట్ల చిన్నచూపు చూస్తున్నాయి. రైతాంగ వ్యతిరేక విధానాలు అమలు జరుపు తున్నాయి.

వ్యవసాయరంగం భారతదేశంలో నేటికీ అధిక ఉపాధి కల్పిస్తున్న రంగం. ఐతే దీని సంక్షోభం వలన నేడు కూలీలే కాకుండా చిన్న, సన్నకారు రైతులు కూడా వలసలు పోతున్నారు. "గుంటూరు జిల్లాలో 40 మంది రైతులు కిడ్నీలు అమ్ముకున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. న్యూ ఇండియన్ ఎక్స్ ప్రెస్ 2004 వ్యభిచారుణుల్లో 70శాతం మంది వ్యవసాయకుటుంబాల నుండే వచ్చారని తెలిపింది. వ్యవసాయ సంక్షోభం మానాన్నే కాదు ప్రాణాల్ని కూడా తీసింది. గత 13 సంవత్సరాలలో దాదాపు ఒక లక్షయాభైవేల మందిరైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు." (చౌదరి. కె.ఆర్.: 2011; పుట–211).

అయితే ప్రపంచీకరణ ఒక్కటే వ్యవసాయరంగాన్ని నష్టపరచలేదు. పెరుగుతున్న జనాభా నీటివనరులు లేకపోవడం, కరువు, ప్రకృతి వైపరిత్యాలు కూడా ఒక కారణం. "2010లో వచ్చిన నాలుగు తుపాన్లు, అకాల వర్షాలు, అతివృష్టి రైతాంగాన్ని నష్టాలకు గురిచేసింది. తీవ్ర సంక్షోభంలోకి నెట్టి వేసింది." (పైదే,పుట – 210). అంటే ఒక రకంగా ప్రకృతి వైపరిత్యాలు కూడా రైతుల్ని దెబ్బతీస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోవడం జరుగుతుంది. "దేశస్థాయిలో 49 శాతం, రాష్ట్ర స్థాయిలో 82శాతం రైతులు అప్పుల ఊబిలోకూరుకుపోయారని నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ నివేదిక స్పష్టం చేస్తోంది".(పైదే) ఈవిధంగా అప్పుల ఊబిలో కూరుకుపోయి అల్లాడుతున్న రైతాంగం ఆత్మహత్యలను ఆశ్రయిస్తుంది.

వ్యవసాయ దారుల అవగాహనలోపం కూడా ఒక ప్రధాన కారణం. నేడు రైతులందరూ ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. దీని ఫలితంగా ఆహార ధాన్యాల కొరత ఏర్పడుతుంది. ఈ విషయంలో ప్రభుత్వాలు రైతుల దృక్పధాన్ని మార్చాలి. వారికి తగిన మద్ధతు ధరలు ప్రోత్సాహం కలిపించాలి. పంట నష్టపోయినప్పుడు ప్రభుత్వం రైతులను ఉదారంగా ఆదుకోవాలి.

రైతుల దృక్పథాలలో కూడా మార్పు రావాలి. కొద్దికాలం వాణిజ్య పంటలు తగ్గించేసి ఆహార పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావాలి. మనం మారుతున్న కాలానికి అనుగుణంగా మరోసారి వ్యవసాయ విధానంలో కొత్త పద్ధతులు అవలంబించాల్సి ఉందని పరిశోధకుల అభిప్రాయం.

నూతన ఆర్థిక విధానాల ఫలితంగా ప్రభుత్వ రంగంలో ఉండే పరిశ్రమలు మూత పడటం లేదా బహుళజాతి సంస్థల ఆధీనంలోకి వెళ్ళడం జరుగుతున్నది. ప్రభుత్వ ఆధీనంలోని పరిశ్రమలు

బహుళజాతి సంస్థల ఆధీనంలోకి పోవడం వల్ల ప్రభుత్వ ఆస్తులు తగ్గుతాయి. అదేవిధంగా కార్మికులు నిరుద్యోగులుగా మారి ఆకలిచావులకు గురవుతారు.

నేడు ప్రసారసాధనాల మధ్య విపరీతమైన పోటీ ఏర్పడింది. ప్రసార సాధనాలు ప్రస్తుతం ప్రజలకు విలువైన సమాచారాన్ని సేకరించటంకోసం ప్రయత్నిస్తున్నాయి. కొంత కార్పొరేట్ వర్గ ప్రయోజనాల్ని కూడా పరిరక్షిస్తున్నాయి. అయితే ప్రసార సాధనాలు దేశ ప్రయోజనాలను, ప్రజోపయోగాలను దృష్టిలో పెట్టుకోవాలి. ప్రజలకు అవసరమయ్యే సమాచారాన్ని అందించడానికి పోటీపడాలి.

వైద్యరంగం మిగతా వర్ధమాన దేశాల మాదిరి కాకుండా భారతదేశంలో ప్రైవేట్ రంగ విస్తృతి ఎక్కువ. దేశీయ వ్యాపార సంస్థలు వ్యక్తులు ప్రమోట్ చేసిన సంస్థలు ఇవి. "ప్రైవేట్ వైద్యరంగం 70 దశకంలో చిన్నగా మొదలై 80 – 90 దశకాలలో ఉద్ధృతంగా మారి ఇవాళ యాజమాన్యం లోనూ (ఓనర్‌షిప్) కార్యకలాపాలలోనూ బహుళ వైవిధ్యం సంతరించుకుంది" (మాలిని భట్టాచార్య: 2008; పుట – 107) ఆధునికంగా వైద్యరంగంలో వినూత్న మార్పులు కొత్తకొత్త ఆవిష్కరణలు, మందులు అందుబాటులోకి వస్తున్నాయి. కానీ ఉన్నత వర్గాల వారికి మాత్రమే పరిమితవుతున్నాయి తప్ప సామాన్యులకు అందుబాటులో లేవు. ప్రభుత్వాలు సామాజిక ప్రయోజనం, సంక్షేమం కోసం ఈ పరిస్థితి మార్చాలి. ప్రైవేట్ వైద్య సేవలను పేదప్రజలు చెంతకు చేర్చాలి.

# అధ్యాయం – 4

# రాజకీయ రంగం – ప్రపంచీకరణ ప్రభావ నవలలు

ప్రపంచీకరణ సమస్త రంగాలను ప్రభావితం చేసిందని ముందుగా చెప్పుకొన్నట్లు రాజకీయాలను కూడా మార్చివేసింది. ప్రపంచీకరణ ప్రపంచ రాజకీయాలలో పలుమార్పులు తీసుకొచ్చింది. రాజకీయ రంగం ద్వారానే ప్రపంచీకరణ విధానాలు భారతదేశంలో ప్రవేశించాయి. ప్రభుత్వపాలకుల ద్వారానే ఏ రంగంలోనైనా సంస్కరణలు చేయడానికి అవకాశం ఉంది.

## 4.1. ప్రపంచ రాజకీయాలు

ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు అమలవుతూ దాదాపు రెండు దశాబ్దాల కాలం దాటిపోయింది. ఈ క్రమంలో ప్రపంచ రాజకీయాల్లో అనేక మార్పులు చోటు చేసుకోవడం జరిగింది. ప్రపంచంలో ప్రస్తుతం మూడు ప్రపంచాల సిద్ధాంతం కొనసాగుతుంది. ఇందులో అమెరికా, జపాన్, రష్యాలు మొదలగునవి  మొదటి ప్రపంచంగానూ, రెండవది యూరోపియన్ సంపన్న దేశాలు కాగా, తక్కినవి భారత్ వంటి మూడవ ప్రపంచ దేశాలు. వీటినే అభివృద్ధి చెందుతున్న వర్థమాన దేశాలు అని కూడా పేర్కొంటున్నారు.

### 4.1.1. మొదటి ప్రపంచ దేశాలు

రెండో ప్రపంచ యుద్ధందశ వరకూ సామ్రాజ్య వాద దేశాల బలాబలాలన్ని దగ్గరదగ్గరగానే ఉన్నాయి. అమెరికా రెండవ ప్రపంచంయుద్ధంలో ఆయుధాల వ్యాపారం ద్వారా ఎక్కువ లాభం పొందింది. ఈ యుద్ధంలో ఇతర సామ్రాజ్యవాద దేశాలతో పోల్చి చూసినప్పుడు చాలా తక్కువ నష్టంతో బయటపడిన దేశం అమెరికా. అప్పటి నుంచే ఏకైక అగ్రరాజ్యంగా ముందుకు వచ్చింది. రష్యా పతనానంతరం బలీయమైన రాజ్యంగా రూపుదిద్దుకుంది అమెరికా. 1970లో యూరప్ అమెరికాల్లో ఆర్థిక మాంధ్యం వచ్చింది. ఆ మాంధ్యం నుంచి గట్టెక్కడానికి అమెరికా యూరోపియన్ దేశాలతో కలసి 'అమెరికా – యూరోపియన్'గా కామన్ మార్కెట్ ను ఏర్పరచు కున్నాయి. ఈ కూటమి వ్యాపార విస్తృతికోసం ప్రపంచం మీద దాడి మొదలు పెట్టింది. ఈ దాడే స్వేచ్ఛా వ్యాపారం పేరుతో కొనసాగుతున్న ప్రపంచీకరణ. ఈ ప్రపంచీకరణను అన్ని దేశాల పై

బలవంతంగా రుద్దించి తద్వార అధిక లాభాన్ని అర్జించింది. నేడు ప్రపంచంలో అమెరికా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుంది. ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో 4శాతంకు పైగా వాటాను కల్గి ఉంది. నేడు అన్ని ఖండాలలో , దేశాలలో సైనిక స్థావరములు ఏర్పర్చుకుంది. అన్ని దేశాల మిలటరీ బడ్జెట్ కంటే ఎక్కువ మిలటరీ బడ్జెట్ పై ఖర్చు చేస్తోంది. నేడు అమెరికా అన్ని దేశాలకు అగ్రరాజ్యం పాత్ర పోసిస్తుంది. అమెరికా కరెన్సీ డాలర్. ఇది ప్రపంచలావాదేవీల్లో ప్రపంచ కరెన్సీగా చెలామణి అవుతుంది. కాబట్టి ప్రపంచ దేశాల్లో నేడు మనకు అమెరికా పాత్ర ఏంటో అర్థమవుతుంది. ప్రతి రంగంలోనూ అమెరికా ఆదిపత్యం వహిస్తుంది. "ఆర్థిక, సైనిక, రాజకీయ రంగాలలో ప్రపంచం పై ఆధిపత్యం చెలాయిస్తోంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా ప్రమేయం లేకుండా జరిగిన ప్రాంతీయ లేక స్థానిక యుద్ధాలు లేవంటే అతిశయోక్తి కాదు".(వెంకట్రామయ్య, వేముల పల్లి: 2010 ; పుట-40).

రెండవ ప్రపంచ యుద్ధానంతరం నుండి నేటి వరకు అమెరికా అగ్రరాజ్యంగా కొనసాగుతోంది. యుద్ధానంతరం ఏర్పడిన గాట్ నుండి నేటి ప్రపంచ బ్యాంక్ వరకు అన్ని సంస్థలూ ధనిక దేశాల ఆదేశాలకు అనుగుణంగానే ఏర్పడి పేద దేశాలను దోపిడి చేస్తున్నాయి. 1990 సం. నుండి ఈ దోపిడి ఇంకా విస్తృతమయింది. దీనికి కారణం ప్రపంచీకరణ అను పేరుతో అన్ని దేశాల పై అమెరికా ఆధిపత్యం వహించడమే. నేటి ప్రపంచీకరణ అమెరికా కనుసన్నల్లో దాని స్వీయ ప్రయోజనాలకు అనుగుణంగా అమలు జరుగుతున్నదనే విషయం అందరికీ తెలిసిందే. ఇది మొదటి ప్రపంచస్థితి.

### 4.1.2 . రెండవ ప్రపంచ దేశాలు

రెండవ ప్రపంచ దేశాలుగా అభివృద్ధి చెందిన యూరోపియన్ యూనియన్ సంపన్నదేశాలను పేర్కొనవచ్చును. 1970 ప్రాంతంలో అమెరికా, యూరోపియన్ దేశాల్లో ఒకేసారి మాంద్యం సంభవించింది. ఆర్థిక మాంద్యం నుంచి గట్టెక్కడానికి అమెరికా తన ప్రాబల్యం చేత బ్యాంక్ ప్రమాణాలను రూపుదిద్దించింది. ఆర్థిక సరళీకరణను ముందుకు తెచ్చింది. దీని ఫలితాలను అమెరికా మాత్రమే ఎక్కువగా పొందింది. సంపన్న దేశాలంతా కలసి ముందుకుతీసుకువచ్చిన ప్రపంచీకరణ కేవలం అగ్రరాజ్యానికే ఆధికంగా లాభాల నిచ్చింది. దీంతో మిగతా యూరప్ దేశాలపై కూడా ఆధిపత్యం చలాయించే స్థితికి అమెరికా చేరుకుంది. "ఈ యూరోపియన్ దేశాలు

కూడా ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యసంస్థల నుండి అప్పు పుచ్చుకుంటున్నాయి. అయితే ఇవి తృతీయ ప్రపంచ దేశాల లాగా షరతులకు లోబడవలసిన అవసరం లేదు. వీటికి అమెరికాతో సమానంగా కాకపోయినా కొంత వరకు మినహాయింపులున్నాయి"(శ్రీ రాజీవ్ దీక్షిత్: 2003: పుట –7)

సోవియట్ పతనానంతరం ప్రపంచ మార్కెట్‌ను అమెరికాతో కలసి తాము పంచుకోవచ్చని యూరప్‌దేశాలు ఆశించాయి. ఐతే డబ్ల్యూ.టీ.ఓ. వంటి వ్యవస్థలు ఏకైక అగ్రరాజ్యం అమెరికా నీడలో ఏర్పడడంతో తమ వైఖరిని మార్చుకున్నాయి. అమెరికాతో ఇతర సంపన్న దేశాలు ఈ పరిస్థితుల్లో పోటీ పడలేకపోయాయి. దీంతో ఈ దేశాలు "అమెరికా ఆధిపత్యం నుంచి క్రమంగా బయట పడటానికి ప్రయత్నిస్తున్నాయి. ఐరోపా రైతాంగం ప్రయోజనాలు ముఖ్యంగా పశుపోషణ, పాడి పరిశ్రమ రంగాలకు చెందిన ప్రయోజనాలను రక్షించడానికి ప్రయత్నిస్తున్నది. తమ దేశాల మీద విరుచుకు పడుతున్న గ్లోబల్ సంస్కరణల నుండి బయటపడటానికి ప్రయత్నిస్తున్నది. ఇందుకోసం 1950 మే 9న ఫ్రెంచ్ విదేశాంగమంత్రి రాబర్ట్ షుమన్ ప్రతిపాదించిన ఐక్య ఐరోపా లేదా యూరోపియన్ యూనియన్ అవతరించింది" ( శ్రీనివాస్.కె:2004; పుట – 9) ఈ విధంగా యూరోపియన్ దేశాలు 2004 మే 1 వ తేదీ నాటికి 25 దేశాల బలమైన యూనియన్‌గా అవతరించింది. ఈ కారణంగా వీరి కరెన్సీ 'యూరో' చెలామణిలోకి వచ్చింది. యూరప్ విలువలు, శాంతి, స్వేచ్ఛ, ప్రజల న్యాయమైన వర్తకం, పేదరిక నిర్మూలన, సమానత్వం, మానవ హక్కుల పరిరక్షణ కోసం యూరోపియన్ యూనియన్ ఏర్పడింది. అమెరికా ఆధిపత్యం ప్రశ్నిస్తూ ఐక్యంగా తమ ఉనికిని చాటుకోవడానకి రాజకీయంగా బలమైనశక్తిగా ఎదగడానికి ప్రయత్నిస్తున్నాయి యూరోపియన్ దేశాలు.

### 4.1.3 మూడవ ప్రపంచదేశాలు

రెండవ ప్రపంచ యుద్ధానంతరం చాలా దేశాలు వలస దేశాల నుంచి స్వాతంత్ర్యం సంపాదించుకొన్నాయి. అనేక దేశాలు విముక్తి పొంది ఇప్పుడిప్పుడే అభివృద్ధిని సాధిస్తున్నాయి. ఈ దేశాలపై ఆధిపత్యం కోల్పోయిన సామ్రాజ్యవాద దేశాలు తమ దోపిడీని మరో రూపంలో కొనసాగించాయి. అదే నేడు మనకు కనిపిస్తున్న ప్రపంచీకరణ. దీనికే స్వేచ్ఛా వ్యాపారం, సరళీకృత ఆర్థిక విధానాలు అని ముద్దుపేర్లు. "అందుకే ఆధునిక కాలంలో సామ్రాజ్యవాదం తన పాత

ముసుగు మార్చింది. కొత్త రూపాలు ధరించింది. హైటెక్ ఎత్తుగడలు అనుసరించింది. పరభాగ్యోపజీవనమైన తన లక్షణం నెరవేరటానికి కొత్త కొత్త ఎత్తులు వేసింది. వర్ధమాన దేశాలను రుణాల ఊబిలో ముంచేసింది. అప్పులు, వడ్డీలు, తిరిగి అప్పులు అనే చక్రభ్రమణంలో ఇరికించి చక్రం తిప్పటం మొదలేసింది. తద్వార ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థల మీద పట్టుబిగించింది. నట్లు తిప్పింది. ఆయా రాజకీయ వ్యవస్థలను తన ప్రభావంలోనికి తెచ్చుకుంది. ఈ రిమోట్ కంట్రోల్ వ్యవహారానికి అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు, ఐ.ఎం.ఎఫ్, ప్రపంచ బ్యాంక్, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూ.టీ.ఓ) లు సామ్రాజ్యవాదుల కంట్రోల్ గదులుగా మారాయి" (రంగారావు.పి:2002;పుట – 1) ఈవిధంగా మూడవ ప్రపంచ దేశాలు తమ అభివృద్ధికి అవసరమైన ఋణాలు తీసుకుంటూ గత్యంతరం లేక ప్రపంచ బ్యాంక్ షరతులను అంగీకరిస్తున్నాయి. ఫలితంగా నేడు ప్రపంచీకరణ పేరిట అమెరికా, ప్రపంచ బ్యాంక్‌లు విధిస్తున్న షరతులను తృతీయ ప్రపంచ దేశాలన్ని అమలు చేస్తున్నాయి. చివరికి ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడే పరిస్థితుల్ని కల్పించుకుంటున్నాయి. ఇది నేడు వర్ధమాన తృతీయ ప్రపంచ దేశాల రాజకీయ పరిస్థితి.

## 4.2 . దేశరాజకీయ పరిస్థితులు – ప్రభుత్వం

ప్రపంచీకరణ పేరిట శరవేగంగా మార్పులు అన్ని రంగాల్లో వస్తున్నాయి. ఈ నేపథ్యం దేశ రాజకీయాలను కూడా కొంత మార్పుకు గురి చేస్తుంది. "రాజకీయ రంగంలో లేక పాలనారంగంలో ప్రపంచీకరణ సృష్టించిన ఫలితం సుపరిపాలన అనే భావన. ప్రపంచీకరణ ఫలితంగా మాత్రమే ఇది రంగంలోకి వచ్చింది (రామ్మోహన్, సోదుం:2004 : పుట – 12) "ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా అన్ని దేశాలు తమ పాలనా వ్యవస్థలను మెరుగు పరుచుకొంటున్నాయి. ఈ సుపరిపాలనను కొనసాగించడానికి ముఖ్యంగా ప్రపంచబ్యాంక్ నివేదికను దృష్టిలో ఉంచుకొని, మనదేశంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు లాంటి రాష్ట్రాలు సుపరిపాలన అనే భావనకు విశేష ప్రాధాన్యం ఇచ్చాయి". (అదే పుట)

"దేశంలోని అన్ని రాజకీయపార్టీలు కూడా ప్రభుత్వాధికారంలో ఉన్నప్పుడు ప్రపంచ బ్యాంక్ ను సమర్థించడం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రపంచీకరణ విధానాలను వ్యతిరేకించడం పరిపాటి అయిపోయింది. అధికారంలోకి వచ్చిన ప్రతీ రాజకీయ పార్టీ కూడా విదేశాల నుంచి అప్పులు తీసుకొచ్చి ప్రపంచ బ్యాంక్ చెప్పినట్లు నడుచుకొంటున్నాయి. ఈ క్రమంలో దేశాల జాతీయ వనరులు, జాతీయ ఆస్తులు, ప్రజాధనం, ప్రైవేట్‌పరం అయిపోతున్నాయి. ముఖ్యంగా బహుళజాతి

గుత్త పెట్టుబడిదారీ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నాయి (బండారు.యస్.ఆర్:2003; పుట-9) ఈ విధంగా ప్రపంచీకరణ విషయంలో అన్ని రాజకీయ పార్టీల విధానాలు ఒకే విధంగా ఉంటున్నాయి. అయితే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక విధంగానూ, ప్రభుత్వంలో ఉన్నప్పుడు మరొక విధంగా ప్రవర్తిస్తాయి. ఇక్కడ అంతిమంగా ప్రభుత్వంలో ఏ పార్టీ ఉన్నప్పటికీ ప్రపంచీకరణ విధానాలు పరిరక్షిస్తుందనే విషయం అర్థమవుతుంది.

"ప్రస్తుతం దేశ రాజకీయాలను నడిపించేది గుత్తపెట్టుబడిదారీ కంపెనీలు అని పేర్కొంటున్నారు. ఈ గుత్త పెట్టుబడిదారీ కంపెనీలు కొన్ని రాజకీయ పార్టీలకు విరాళాలు ఇస్తుంటాయి"(పైదే పుట-2). ఈ విధంగా రాజకీయ పార్టీలకు గాని, వివిధ సంస్థలకు కాని విరాళాలు ఇచ్చే విషయంలో వీటికి కొన్ని ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ప్రధానంగా దేశంలో ఏర్పడే పాలక వర్గాలకు వీరి ఆదేశాలకు అనుగుణంగా పనిచేసే స్థితిని ఇవి కలిపించాయి. "1991 తర్వాత సాగుతున్న ప్రపంచీకరణ ఆర్థిక విధానాల పాలనలో మన ప్రభుత్వాలు, ద్రవ్యసంస్థలు, అధికార యంత్రాంగం సాగించే రోజువారీ కార్యక్రమాల్లో కూడా అమెరికన్ ప్రభుత్వమో, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలో, బహుళజాతి సంస్థలో ఇచ్చే ఆదేశాలు పనిచేస్తున్నాయి" (వేణుగోపాల్,ఎన్: 2011; పుట - 262) అలాగే "దేశంలో అతిపెద్దదైన కాంగ్రెస్ నుంచి అతిచిన్నవైన ప్రాంతీయ పార్టీల వరకు అన్ని రాజకీయ పక్షాలు ఈ అమెరికా అనుకూలతను, దాస్యాన్ని బహిరంగంగా నిస్సిగ్గుగా కొనసాగిస్తూ వచ్చాయి. అన్ని ప్రభుత్వాలు అమెరికన్ ప్రభుత్వమో, పాలక వర్గాల్లో, బహుళజాతి సంస్థలో కోరుకున్నట్టుగానే భారత ప్రభుత్వాన్ని నడపటానికి ప్రయత్నించాయి". (పైదే పుట – 263)

1947 భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి నేటి వరకు ఎన్నో ప్రభుత్వాలు ఈ దేశాన్ని పాలించాయి. అయినప్పటికీ దేశంలో పేదలకు సరైన న్యాయం చేయలేకపోయాయి. దీనంతటికీ కారణం నాయకుల అవినీతి, మన దేశ ఆర్థిక వ్యవస్థల పై ఇతర దేశాలు ఆర్థిక సంస్థల జోక్యం కూడా ప్రధాన కారణం. ఈ విషయాలను గురించి చర్చించిన నవల సింహప్రసాద్ రచించిన తమసోమా.

"యాభై మూడేళ్ళ కాలం.  వేలకోట్ల రూపాయల ధనం. ఎన్నో ప్రణాళికలు ఎందరో ప్రధానులు అయినప్పటికీ అందరికీ కనీసం అన్నాన్ని, అక్షరాన్ని అందివ్వలేకపోయాం. ఇప్పటికీ ఆకలి కేకలు వీధుల్లో ప్రతి ధ్వనిస్తూనే ఉన్నాయి.  ఎన్నెన్నో గ్రామాల్లోని జనానికి తాగునీరు లేదు.

చలి నుండి వేడిమి నుండి శరీరాన్ని కాపాడుకోవడానికి తగినంత గుడ్డలేదు. మనిషి ప్రాథమికావసరమైన గూడులేక రోడ్లపక్క పేవ్‌మెంట్ల మీద ఎందరెందరో ఈసురోమని బతుకుతున్నారు"(సింహ ప్రసాద్; 2012 : పుట – 123) ఈ విధంగా స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు గడిచినా పేదల పరిస్థితిలో మార్పు పెద్దగా కనబడుటలేదు. మరోవైపు రాజకీయ నాయకులు విదేశాల నుంచి వేల కోట్ల రుణం తీసుకు వస్తున్నారు. "రోజూ పేపర్లలో చదువుతూనే ఉన్నాం. దొరికిన చోట్లల్లా వేలకోట్ల రూపాయల విదేశీఋణం తెస్తున్నారు. ఆ సొమ్ముని ఎవరు ఎందుకు ఎలా వినియోగిస్తున్నారో లెక్కలు కావాలి. మనల్ని ఋణదాస్యంలోకి నెట్టుతున్న నేతలకి పల్లెల్లో మరుగుదొడ్లు లేక అవస్థపడుతోన్న మహిళల దౌర్భగ్యస్థితి ఎందుకు కన్పించడంలేదు" (పైదే పుట – 124) అంటూ వ్యక్తమయ్యే అభిప్రాయం మనల్ని ఆలోచింపచేస్తుంది.

భారతదేశం సహజవనరులు సమృద్ధిగా కలిగిన దేశం. మానవ వనరులకు, ప్రతిభా వ్యుత్పత్తులకు కొదవలేదు. అయినా దేశం ఆశించినంత అభివృద్ధి చెందలేదు. కారణం ఇక్కడి రాజకీయ నాయకులకి అభివృద్ధి చేయడం పట్ల చిత్తశుద్ధి లేకపోవడమే. అలాగే అవినీతి నాయకులకి తగిన శిక్షలు పడకపోవడం. ఈ పరిణామాలు చిత్రించిన నవల తమసోమా!

"మనం ఎన్నితిట్లుతిట్టినా ఎంతగా శపించినా వాళ్ళు మారర్రా. ఎంచేతంటే కోట్లు మింగినట్లు రుజువైనా జయలలిత,లాలూప్రసాద్ యాదవ్ ఒక్కరోజైనా జైల్లోగడిపారా? చిప్పకూడు తిన్నారా? లేదే బుల్లి నేరస్తులకి బెయిల్ కూడా దొరకదు రాజకీయ నేరస్తులకి జీవితాంతం బెయిల్ లభిస్తుంది"(పైదే పుట – 129) పై అంశాన్ని పరిశీలిస్తే నేడు రాజకీయ నాయకుల అవినీతి ఎంత పెరిగిందో వారు చట్టాల నుండి ఎలా రక్షించబడుతున్నారో తెలుసుకోవచ్చు. ప్రపంచీకరణ విధానాల అమలు తర్వాతనే భారతదేశంలో ప్రభుత్వాలు, రాజకీయనాయకుల విపరీతదోపిడి ప్రారంభమైంది.

### 4.2.1. దేశ సార్వభౌమాధికారం

అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు రుణాలిచ్చునప్పుడు విధించు షరతుల వలన పేదదేశాల సార్వభౌమాధికారం ప్రమాదంలో పడుతుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ పేదదేశాల సార్వభౌమాధికారాన్ని నిర్లక్ష్యం చేస్తున్నది. "ధనిక దేశాలకు అనుకూలంగా తయారు చేయబడ్డ

ప్రపంచ వాణిజ్య సంస్థ పేదదేశాల పై సూపర్ గవర్నమెంట్‌గా వ్యవహరిస్తున్నది. మనం సార్వభౌమాధికారాన్ని కోల్పోయి భారత పార్లమెంట్ ఒక దిష్టిబొమ్మగా తయారవుతున్నది" (క్రిష్ణయ్య.వి:2003; పుట-9) "సూపర్ నేషనల్ కోర్టు పద్ధతిని సృష్టించి W.T.O. తాను నిర్దేశించిన నిబంధనల్ని ఉల్లంఘించాయని ఏ దేశాలపై నైనా ఆర్థిక ఆంక్షల్ని విధించే అధికారాన్ని కలిగి ఉంది" (జయ.యస్: 2002; పుట-34) ఈ అంతర్జాతీయ వాణిజ్యసంస్థ షరతులు, నిబంధనల వల్ల ప్రభుత్వాలు ప్రజాప్రయోజనాల కోసం ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడింది. వర్థమాన దేశాలు దీని షరతుల వలన అనేక అధికారాలను కోల్పోవలసి వచ్చింది. ప్రస్తుతం భారత పార్లమెంట్ ఈ కింది అధికారాలు కోల్పోయింది.

1. ప్రజలకు హాని కలిగించే బహుళజాతి కంపెనీలకు లాభాలు చేకూర్చేవి తయారు చేస్తామంటే ప్రభుత్వం లైసెన్స్ లు నిరాకరించవచ్చు. కాని గాట్ ఒప్పందం వల్ల భారత్ పార్లమెంట్ కు ఇక పై అటువంటి అధికారంలేదు. గాట్ ఒప్పందం ప్రకారం విదేశీ పెట్టుబడిదారులు తమకు నచ్చిన రంగంలో తమ ఇష్టం వచ్చినంత పెట్టుబడులు పెట్టుకోవచ్చు.

2. గాట్ ఒప్పందం వలన భారత ఆర్థిక వనరుల పై సైతం కంట్రోలు వదలి వేసుకోవటం జరిగింది.

3. కార్మికులను కర్మాగారాల నుంచి గెంటివేయకుండా ఆపే హక్కులేదు.

4. తప్పుడు చరిత్రగల విదేశీ కంపెనీలు మన దేశంలోకి ప్రవేశించకుండా ఆపే అధికారం లేదు.

5. మన దేశంలోకి విదేశీ బ్యాంక్ గాని, ఇన్సూరెన్స్ కంపెనీ గానీ శాఖ ఏర్పాటు చేసుకోవాలంటే మనప్రభుత్వం అనుమతి కావాలి. కానీ గాట్ ఒప్పందంతో విదేశీ సంస్థలు స్వేచ్ఛగా మన దేశంలో ప్రవేశించడానికి వీలుంది.

6. కలుషితమైన ఆహార పదార్థాల దిగుమతి నిరాకరించే హక్కులేదు. విదేశీ వస్తువుల దిగుమతిని నిషేధించే అధికారం లేదు.

7. పేటెంట్ మందులను మన దేశంలో తయారు చేయాలి అనే నిబంధన రద్దు చేయబడింది.

8. భారతదేశంలోని మొక్కలలో, జంతువులలో అద్భుతమైన జన్యువనరులు ఉన్నాయి. అయితే వీటిని కనుగొనవలసి ఉంది. గాట్ ఒప్పందం వలన వీటిని ముందుగా విదేశీయులు కనుగొన్నారు. వీటిపై విదేశీయులదే హక్కు". (క్రిష్ణయ్య. వి: 2003; పుట -12)

ఈవిధంగా ప్రపంచీకరణ సరళీకృత ఆర్థిక విధానాలు అమలయిన తర్వాత వర్ధమాన దేశాలన్నీ ప్రపంచ బ్యాంక్, వాణిజ్య సంస్థల దగ్గర ఋణాలు తీసుకుంటున్నాయి. ఋణాలు ఇచ్చిన ఆర్థిక సంస్థలు కొన్ని షరతులు విధిస్తున్నాయి. ఈ షరతులకు అంగీకరిస్తూ వర్ధమాన దేశాలు తమ సార్వభౌమత్వాన్ని కోల్పోతున్నాయి. ఈ విధానాలను కొంతవరకు చిత్రించిన నవల సింహప్రసాద్ రాసిన తమసోమా!. బహుళజాతి సంస్థలు వాటి విస్తృతి, ఆర్థిక సంస్థలు వాటి వల్ల కలిగే నష్టాలను ఈ నవల చిత్రించింది. "కోట్లకొద్ది అప్పుకోసం ప్రపంచ ఆర్థికసంస్థల చుట్టూ ప్రదీక్షణలు చేస్తున్నాయి మన ప్రభుత్వాలు. అంచేత ఋణదాతలు విధించే అన్ని రకాల షరతులకీ తలాడించేస్తున్నారు". (సింహప్రసాద్: 2012; పుట –105) పై వాక్యాన్ని పరిశీలిస్తే మనకు ఈ రోజు దేశంలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులు అర్థమవుతాయి. ఋణాలు ఇచ్చి దేశ సార్వభౌమాధికారాన్ని కాలరాస్తున్నాయి ప్రపంచ ఆర్థిక సంస్థలు.

"ఏకాలంలోనైనా ఆర్థికంగా అణచివేయబడటం రాజకీయ అపజయానికి కారణం అవుతుంది. ఏదేశానికైనా ఆర్థిక బానిసత్వం ఏర్పడిందంటే దానికి రాజకీయ బానిసత్వం కూడాఏర్పడిందన్నమాటే". (రాజీవ్‌దీక్షిత్: 2003; పుట –8) ప్రస్తుతం ప్రపంచంలో భారత్‌తో పాటు వర్ధమాన దేశాలన్నీ ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రపంచ బ్యాంక్‌ల చేతిలో కీలు బొమ్మలుగా మారాయి.

## 4.3. ప్రాథమిక హక్కులు

ప్రస్తుతం ప్రపంచీకరణ విధానాలు శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో పౌరుల ప్రాథమిక హక్కులు కూడా హరించబడుతున్నాయి. "మన రాజకీయ వ్యవస్థ కొన్ని బహుళజాతి సంస్థల చేతుల్లోకి పోతుంది. అనగా అన్ని విషయాల్లోనూ ప్రభుత్వం పాత్ర లేకుండా చేయబోతున్నారు. మన ప్రభుత్వం ప్రైవేటీకరణకు తలుపులు తెరిచింది. లాభాలు తెచ్చే ప్రభుత్వ కంపెనీలను, సంస్థలను సైతం ప్రైవేటీకరిస్తున్నది. ఈ ప్రైవేటీకరణ చివరికి బహుళజాతి సంస్థలు స్థిరపడితే రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు హాని జరిగే ప్రమాదం ఉంది." (రామ్మోహన్: 2004; పుట – 22) "ఆర్థిక సంస్కరణలు అమలు జరపడం ద్వారా అనేక ఉద్యమాల సాక్షిగా సాధించుకున్న హక్కులు కోల్పోతున్నాం. కూడు, గూడు, నీడ ఇవ్వాల్సిన ప్రభుత్వాలే తమ బాధ్యతల నుంచి తప్పుకునే పరిస్థితి ఎదురవుతున్నది". (విద్యాభూషణ్: 2003; పుట – 75) ఇప్పటికీ ప్రభుత్వం

వివిధ రంగాలను ప్రైవేటుపరం చేసే ప్రయత్నం జరుగుతున్నది. వీటిలో నీటిపారుదల, ఆరోగ్యం మొదలగు వాటిని ప్రైవేటుపరం చేసే ఆలోచనల్లో ఉంది. "రాజ్యాంగబద్ధమైన హక్కులకోసం న్యాయస్థానాల్లో పోరాడవలసిన పరిస్థితి ఏర్పడింది. ఉదాహరణకు కార్మికులు తమకు జరిగే అన్యాయాలను ప్రతిఘటించడానికి సమ్మె చేసే హక్కు ఉంది. కానీ అసలు సమ్మె హక్కునే రద్దు చేయడం జరుగుతున్నది." (రామ్మోహన్. సోదుం:2004; పుట– 18) బ్యాక్‌లాగ్ పోస్టులను కూడా భర్తీ చేయమని న్యాయస్థానాలు ప్రభుత్వాలను సూచించే స్థితికి వచ్చింది. (విద్యాభూషణ్; 2003: పుట – 75) ప్రపంచీకరణ విధానాల వినాశకర ఫలితాలకు ప్రపంచంలోని వర్ధమాన, పేద దేశాల్లోని ప్రజలు బలవుతున్నారు. ప్రపంచ ద్రవ్య సంస్థలు తమ షరతులతో ప్రజల హక్కులను కాలరాస్తున్నాయి.

## 4.4 చట్టాలు – న్యాయవ్యవస్థ

ప్రపంచీకరణ ప్రభావితం చేయని రంగం లేదని ముందే చెప్పుకున్నాం. నేడు దాని ఫలితంగా చట్ట, న్యాయవ్యవస్థలో కూడా మార్పులు వచ్చాయి. విదేశీ పెట్టుబడుల ముసుగులో భారత పాలకులు ప్రజల సంక్షేమానికి తిలోదకాలిచ్చి, బహుళ జాతి సంస్థలకు అనువైన చట్టాలను తయారు చేస్తున్నారు. ప్రపంచీకరణ కంటే ముందే కొన్ని చట్టాలు యాజమాన్యాలకు అనుకూలంగా వుంటూ వచ్చాయి. అయితే సరళీకృత ఆర్థిక విధానాల అమలు తర్వాత విదేశీ బహుళ జాతి సంస్థలకు అనుగుణమైన చట్టాలు రూపుదిద్దుకున్నాయి. "1992 తర్వాత విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం కొరకు విదేశీ పెట్టుబడులకు అనుకూలమైన చట్టాలు తీసుకురావడం, ప్రతికూల చట్టాలను రద్దు చేయడం, సవరణలుచేయడం జరుగుతూ వచ్చింది. ఒక వైపు దేశీయ పరిశ్రమలను, ప్రభుత్వరంగ సంస్థలను చిన్నాభిన్నం చేస్తూ మరో వైపు విదేశీ పెట్టుబడుల కొరకు, సంస్థల కొరకు వెంపర్లాడటం జరిగింది." (వేణుగోపాల్, ఎన్.: 2011; పుట – 196)

ప్రపంచీకరణ ఫలితంగా న్యాయ వ్యవస్థలో మార్పులు వచ్చాయి. న్యాయస్థానాలు నామ మాత్రపు పాత్రను పోషించాయి, పోషిస్తున్నాయి. ఆర్థికాభివృద్ధికి అనుగుణంగా చట్టాలను రూపొందిస్తున్నాయి. ఐతే ఆర్థికాభివృద్ధితో పాటు సామాన్య ప్రజల అవసరాలను, ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకోవాలి. ఆర్థికంగా అభివృద్ధిని సాధించినంత మాత్రాన (ఆర్థిక పెరుగుదల) సామాజిక సంక్షేమం సాధించినట్లు కాదు. న్యాయస్థానాలు సామాన్య ప్రజలకు సంబంధించిన కేసులకు స్పందించినంత వేగంగా బహుళజాతి కంపెనీల యాజమానులు, రాజకీయ నాయకుల

కేసులకు తీవ్రంగా స్పందించడం లేదు. అంటే ప్రపంచీకరణ విషవలయంలో న్యాయం కూడా బహుళజాతి సంస్థలకు అనుకూలంగా తయారవుతుంది. సామాన్య ప్రజల చిన్న నేరాలకే పెద్ద శిక్షలు అమలు చేసే న్యాయవ్యవస్థ అదే పెట్టుబడి దారుల ఘోరమైన నేరాలను తీవ్రంగా చూడక ఉదాసీన వైఖరి అవలంబిస్తుందనడానికి భోపాల్ ఉదంతమే ప్రబలమైన సాక్ష్యం. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన క్రిమిసంహారకాల కర్మగారంలో ఒక ఘోరమైన ప్రమాదం జరిగింది. ఈ కంపెనీ యూనియన్ కార్బైడ్ అనే అమెరికా బహుళజాతికి చెందిన సంస్థ. దీనిలో భారత దళారీ పెట్టుబడులకు కూడా భాగస్వామ్యం ఉంది. దీనిలో 1984 డిసెంబర్ 2 అర్థరాత్రిన మిథైల్ ఐసోసైనేట్ అనే విషవాయువు బయటపడి ఎనిమిది వేల మందిని బలి తీసుకుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 3, 787 గా ఉంది. సుమారుగా ఐదు లక్షల మంది ఆ విషవాయువు ప్రభావానికి గురై ఆ ప్రభావం వల్లనే ఏటా కనీసం వేయి మంది చొప్పున ఇప్పటికీ ఇరవై ఐదు వేల మంది చనిపోయారు.బాధితులకు ఇప్పటికీ న్యాయం జరగలేదు. ఎవరికీ శిక్ష పడలేదు. “ఇంత మంది మరణాలకు, అనారోగ్యానికి కారణమైన యూనియన్ కార్బైడ్ యాజమాన్యం పై యూనియన్ కార్బైడ్ వంటి కంపెనీలు ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి వీలు కల్పించిన స్థానిక ప్రభుత్వ అధికారులపై, రాజకీయ నాయకులపై ఎటువంటి విచారణ జరగలేదు. ఎవరికీ శిక్ష పడలేదు”. (పైదే; పుట – 325)

సరళీకృత ఆర్థిక విధానాల ముందు తర్వాత కూడా రాజకీయ నాయకుల అవినీతి ఎక్కువగా జరుగుతుంది. ఎన్నో సందర్భాల్లో ఈ అవినీతి బయట పడిందికూడా. ఐతే న్యాయవ్యవస్థ వారిని శిక్షించలేక పోయింది. ముందు నుండి హవాలా, తెహల్కా కేసుల వరకు కూడా న్యాయవ్యవస్థ అవినీతికి పాల్పడిన వారిని శిక్షించలేక పోయింది. జె. ఎం.ఎం.పార్లమెంట్ సభ్యుల బ్యాంక్ ఖాతాలో 161 లక్షల సొమ్ము దొరికింది. అయినప్పటికీ సుప్రీంకోర్టు సదరు నాయకులను విడిచి పెట్టింది.”(బండారు. యస్.ఆర్; 2003: పుట –116) పై అంశాలని గమనిస్తే న్యాయవ్యవస్థ కూడా బహుళ జాతి సంస్థల ప్రలోభాలకు తలొగ్గుతుందేమోనన్న అనుమానం కలగక మానదు.

“భారతదేశంలో న్యాయవ్యవస్థ పడిపోయింది. కొంతమంది న్యాయమూర్తులు ఘనమైన పార్టీలకు, విస్కీసీసాలకు దాసోహం అవుతున్నదని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఇ. యస్. వెంకట్రామయ్య పేర్కొన్నారు”. (పైదే పుట –116)

రాజకీయ నాయకులు, అధికారులు అవినీతి గురించి చర్చించిన నవల సింహప్రసాద్ రచించిన తమాసోమా...!

ఇందులో గాంధీ తండ్రి డీ.సి.టీ.ఓ ఆఫీసర్. ఇతను అక్రమంగా ధనం సంపాదించి దాని ద్వారా పెద్దపెద్ద బంగళాలు నిర్మించుకోవాలని ఆరాటపడుతూ అవినీతి చేస్తుంటాడు. గాంధీ కళాశాల విద్యార్థి తన తండ్రి అవినీతి నచ్చని గాంధీ ఇళ్ళు వదిలి బయట ఉంటూ అవినీతికి వ్యతిరేకంగా 'వందేమాతరం' అనే సంస్థను మిత్రులతో కలిసి ఏర్పాటు చేస్తాడు. ఈసంస్థ అవినీతికి వ్యతిరేకంగా సభలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేస్తుంటుంది. ఇందులో పాల్గొన్న యువతీ యువకులు అవినీతిపై వివిధ అభిప్రాయాలు వ్యక్తం చేస్తారు.

"టీవీలో ప్రసారమవుతున్న తెహల్కా టేపుల్ని చూస్తోన్న శిరస్సులు సిగ్గుతో భూమిలోకి కృంగి పోయాయి. ఈ దేశపు నేతలు అత్యున్నత రక్షణాధికార్లు మరీ ఇంత అవినీతి పరులూ దగా కోరులు, మోసగాళ్ళునా? డబ్బుకోసం ఎంతటి నీచానికైనా పాల్పడగల వీళ్ళు బేరం వస్తే దేశాన్ని కూడా అమ్మేయడానికి సిద్దపడరూ!

తెహల్కా డాట్‌కామ్ వాళ్ళు లేని కంపెనీ పేరుతో వస్తేనే వారి మంచి చెడ్డలు సైతం తెలుసుకోకుండానే సాగిలపడిపోయారు. ఇక ఏ పాకిస్థాన్ గూడాచారులో మారువేషాల్లో వచ్చి వుంటే ఏం జరిగేదో వూహించడానికే భయమేస్తోంది అంది శిరీష.

ఈ సరికే అలాంటివి జరగలేదని నమ్మకం ఏమిటి చెప్పు? వీళ్ళ వరుస చూస్తోంటే దేశ కీలక రహస్యాలని ఎప్పుడో అమ్మేసినట్లే ఉన్నారు. అంతా బద్మాష్‌లే, తోడుదొంగలే. దేశాన్ని నిలువునా దోచుకుతినేస్తున్నారు. నాయాళ్ళు తిట్లందుకున్నాడు షాజహాన్.

మనం ఎన్ని తిట్లు తిట్టినా ఎంతగా శపించినా వాళ్ళు మారర్రా. ఎంచేతంటే కోట్లు మింగినట్లు రుజువైనా జయలలితా, లాలలూప్రసాద్ ఒక్కరోజైనా జైల్లో గడిపారా? చిప్పకూడు తిన్నారా? లేదే బుల్లి నేరస్తులకు బెయిల్ కూడా దొరకదు. (సింహప్రసాద్: 2012; పుట –149) రాజకీయ నేరస్తులకి శిక్షలు వేసి బెయిల్ కూడా రాకుండా చేసే వ్యవస్థ రాజకీయ నాయకుల అవినీతికి తలొగ్గుతుంది. మన చట్టాల్లో న్యాయ వ్యవస్థలో మార్పు రావాలి. అలా జరిగినప్పుడే రాజకీయనేతల నుండి అవినీతి అధికార్ల వరకు తమ విధులను సమర్ధవంతంగా అవినీతికి

తావులేకుండా నిర్వహించగలుగుతారు. అప్పుడు ప్రజల్లో న్యాయవ్యవస్థపై కూడా నమ్మకం కలుగుతుంది.

## 4.5 ప్రపంచీకరణ – యుద్ధాలు

ప్రపంచంలో ఏదేశమైనా తాము ఉత్పత్తి చేసిన వస్తువులకు డిమాండ్ సృష్టించాలంటే ముందుగా ఆవస్తువులకు అవసరాలను సృష్టించాలి. అవసరాలను సృష్టించటం ద్వారా ఆ వస్తువులు అమ్ముడుపోయి అధిక ఆదాయం వస్తుంది. ప్రస్తుతం ప్రపంచంలో సామ్రాజ్యవాద దేశాలు పాటిస్తున్న సూత్రమిదే. ఈ దేశాలు అనుసరిస్తున్న నవీన సిద్ధాంతం యుద్ధాలు. యుద్ధభయంతోనో యుద్ధాల నెపంతోనో అగ్రరాజ్యాలు తాము తయారు చేసేటటువంటిఖరీదైన యుద్ధసామాగ్రితో పాటు వివిధ రకాల ఇతర వస్తువులకు గిరాకీ ఏర్పరచుకొంటున్నాయి. వీటిని వర్ధమాన దేశాలకు విక్రయించి అధిక ఆదాయాలను పొందుతున్నాయి.

అభివృద్ధి చెందిన అమెరికా, ఐరోపాదేశాలు తమ గడ్డ మీద యుద్ధాలు జరగనివ్వమని ఐతే వ్యాపారార్థంమాత్రం యుద్ధసామాగ్రి తయారు చేస్తుంటామని ప్రకటించాయి. తమ ఆర్థికాభివృద్ధిని సాధించడం కోసం ఇవి ఇతర దేశాలను నాశనం చేయడానికి సిద్ధపడుతున్నాయి.

“అమెరికా సామ్రాజ్యవాదానికి యుద్ధం ఒక జీవన శైలిగా మారింది. అధిక లాభాలు గడించేందుకు యుద్ధాలు చేయడం ఆయుధాలను విక్రయించడం సాధనాలుగా మారిపోయాయి. ఇంతటి లాభాలను సాధారణ పరిశ్రమలు సంపాదించి పెట్టలేవు. యుద్ధం చేయడం అంటే ధనాన్ని సముపార్జించడం. రాజకీయ అధికారం ఆధిపత్యాన్ని సొంతం చేసుకోవడం స్వదేశంలో లేని ఉపాధిని అవకాశాలను కల్పించడం, అధిక లాభలను పిండు కొనేందుకు దురాశ పూరితమైన బహులజాతి సంస్థలకు ప్రపంచం ఒక గనిగా మారింది. హింసాకాండ, మరణాలు, రక్తపాతం మినహా మరేది తెలియకుండా పిల్లలు పెరిగే పరిస్థితులు నెలకొన్నాయి. (సుందరం ఎన్.ఎం; 2007: పుట – 21,22)

అమెరికా లాంటి సామ్రాజ్యవాద దేశాలు ఒక వైపు శాంతి మంత్రం పలుకుతూనే మరో వైపు వ్యాపార, ఆర్థిక అభివృద్ధి కొరకు వర్ధమాన దేశాలపై యుద్ధాలు ప్రకటిస్తున్నాయి.

సామ్రాజ్యవాద దేశాలు తమ ప్రయోజనాల కొరకు వర్ధమాన దేశాలపై యుద్ధాలు చేస్తున్నాయి. తమకు అనుకూలంగా లేని దేశాలపై లేక తమకు అవసరమైన ముడిసరుకును కలిగి

ఉన్న దేశాలపై ఈ యుద్ధాలను కొనసాగిస్తున్నాయి. ఈ వేటలో ఇరాక్, అఫ్ఘనిస్తాన్ వంటి దేశాలు అమెరికా సామ్రాజ్య వాద కబంధహస్తాల్లో బలై పోయాయి. ఈ చర్యలన్నింటినీ అమెరికా ఉగ్రవాదం పై పోరుగా అభివర్ణించుకున్నది. వాస్తవంగా దాని ప్రయోజనాలు ఇంకో విధంగా ఉండటం గమనార్హం. ప్రపంచంలో ఉండే అన్ని దేశాలపైన ఏదో ఒక వంకతో అమెరికా జోక్యం చేసుకోవడం నిత్యకృత్యమైంది.

"ప్రపంచంలో ఏ మారుమూల దేశపు అంతరంగిక వ్యవహారాల్లోనైనా ఏదో ఒక వంకతో జోక్యం చేసుకొనే హక్కు తనకు ఉందని అమెరికా దురహంకార పూరితంగా ప్రకటించుకుంది. ఇందుకోసం తన భద్రత, ప్రయోజనాలకు ముప్పు వాటిల్లుతోందని సాకులు చెప్పడం దాని అనవాయితీగా మారింది. ఈ చెప్పబడుతున్న ముప్పు దాని భూభాగం లేక దాని సాయుధ దళాలకు మాత్రమే పరిమితం. దూకుడుగా వ్యవహరించే క్రియశీలక యుద్ధ విధానాన్ని అమెరికా రూపొందించిన విషయం కొత్తగా వెలుగులోకి వచ్చింది. యుద్ధానికి ముందస్తు చర్యల నుండి యుద్ధ నివారణ చర్యలకు దాని నుండి క్రియశీలక యుద్ధానికి అనుకూలంగా పరిణామాలు చోటుచేసుకున్నాయి. తమ అదుపు ఆజ్ఞలలోలేని తన ప్రయోజనాలకు అనువుగా లేని దేశాలపై పెత్తనం చెలాయించి వాటిని తమ బానిసలుగా, అడుగులకు మడుగులొత్తే విధంగా మలచుకోవడం అమెరికా తాజా విధానం. దాడి జరుపుతానని హెచ్చరికలు జారీచేయడం ద్వారా ఆదేశాలను లొంగదీసుకోవడానికి ప్రయత్నిస్తున్నది" (పైదే పుట – 16)

ఆధునికంగా అమెరికా లాంటి అగ్రదేశాలు తాము తయారు చేసినటువంటి ఆయుధాలను ప్రపంచదేశాలకు అమ్ముతూ అధిక ఆదాయాలను పొందుతున్నాయి. భారతదేశం కూడా వివిధ దేశాలతో ఆయుధాలను కొనుగోలు చేస్తూ రక్షణ పేరిట అధికవ్యయం ఖర్చు చేస్తోంది. అయితే రక్షణ పేరిట జరిగే ఆయుధ వ్యాపారంలో అంతిమంగా అగ్రరాజ్యాలే లాభపడుతున్నాయన్న సంగతి గమనించదగింది.

పై అధ్యాయంను పరిశీలించిన పిమ్మట క్రింది విషయాలు అవగతమవుతాయి. మన రాజకీయ నాయకులు మన దేశ ప్రజల ప్రయోజనాలకు అనుకూలంగా కాక విదేశాల సౌలభ్యం కోసం చట్టాలు చేస్తున్నారు. ఇది క్రమంగా దేశప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను దెబ్బతీసేటువంటి పరిస్థితిని ఏర్పరుస్తున్నది. ప్రభుత్వాలు క్రమంగా తమ బాధ్యతల నుంచి తప్పుకొని సంక్షేమ కార్యక్రమాలకు దూరమవుతూ ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయి. విదేశీయుల కోసం

అవసరమైన చట్టాలు చేయడం వలన మన దేశీయుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనుహరించాల్సిన పరిస్థితి నేటి ప్రపంచీకరణ కలిగించింది.

ఏ దేశానికైనా విశిష్టమైనది సార్వభౌమాధికారం. అలాంటి అత్యున్నతమైన దేశ సార్వభౌమాధికారం క్రమంగా విదేశాల చేతుల్లోకి వెళుతున్నది. ఇది క్రమంగా మరోసారి వలసపాలనకు దారితీస్తుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు. రాజ్యానికి అతిముఖ్యమైనటువంటి సార్వభౌమాధికారం కోల్పోయినపుడు రాజ్యం నామమాత్రంగా మిగిలి పోతుంది. సార్వభౌమాధికారం కోల్పోతే విదేశాలు చేసే సూచనలకు అనుగుణంగా పాలకులు విదేశాలకు ప్రతినిధులుగా వ్యవహరించవలసి ఉంటుంది. ప్రస్తుత ప్రపంచీకరణ పరిస్థితుల్లో చాలా దేశాల సార్వభౌమాధికారం ప్రమాదంలో పడింది.

ప్రస్తుతం ప్రపంచీకరణ అమలు జరుగుతుందంటే దానికి మన ప్రభుత్వం జాతీయ, రాజకీయ విధానాలే కారణం. ప్రపంచంలో అగ్రరాజ్యంగా చెలామణి అవుతున్న అమెరికా ఆధిపత్యం నుంచి బయటపడటానికి యూరప్ దేశాలు యూరోపియన్ యూనియన్‌గా ఏర్పడ్డాయి. మిగిలిన ప్రపంచ దేశాలు కూడా తమతమ దేశాల అభివృద్ధికి ప్రయత్నం చేస్తున్నాయి.

అయితే మన దేశపరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. బహుళ పార్టీల వ్యవస్థ అమలులో ఉన్న భారత్‌లో రాజకీయ నాయకులు ప్రభుత్వంలో ఉన్నపుడు ప్రపంచీకరణను సమర్థించడం ప్రతిపక్షంలో ఉన్నపుడు వ్యతిరేకించడం సాధారణమైపోయింది. అంతే కాకుండా అధికారంలో ఉన్నటువంటి పార్టీలు వివిధ ప్రభుత్వ రంగ సంస్థలను అపరిమితంగా లాభాలు ఆర్జించే ప్రైవేట్ వర్గాలకి తక్కువ ధరలకే విక్రయించడం జరుగుతోంది. ఇలాంటి చర్యల వలన అంతిమంగా ప్రయోజనం పొందేది పెట్టుబడిదారీ బహుళజాతి సంస్థలే. ఇటీవల కాలంలో ప్రభుత్వాలలో విపరీతమైన అవినీతికనబడుతోంది. ఉదా: 2G స్కామ్‌లో 1.76లక్షల కోట్లు అవినీతి జరిగినట్లుగా ప్రచారం జరుగుతోంది. బొగ్గుస్కామ్, క్రీడల స్కామ్ మొదలైనవి అధికార పార్టీల్లోని వ్యక్తులకు సాధారణమైపోయింది. రాజకీయ నాయకులకు స్వీయ ప్రయోజనాలు తప్ప, దేశ ప్రయోజనాలకు పాటుపడటం లేదు. అమెరికా వంటి దేశాలలో రాజకీయ పార్టీలు తమ స్వీయ ప్రయోజనాలతో పాటు దేశాభివృద్ధికి కూడా కృషి చేస్తున్నాయి. అమెరికా పరిరక్షణ కోసం అవసరమైన చట్టాలు రూపొందించే సమయంలో అక్కడ ఉన్న అన్ని రాజకీయ పార్టీలు ఏక గ్రీవంగా ఆమోదం తెలిపాయి. వాళ్ళు తమ దేశ ప్రయోజనాల్ని అత్యంత ముఖ్యమైన అంశంగా భావిస్తారు. ప్రస్తుతం

మన దేశ రాజకీయ పార్టీల పనితీరు అమెరికా దేశ రాజకీయ విధానాలకు వ్యతిరేకంగా కనబడుతుంది. అక్కడ దేశ ప్రయోజనాల్ని ఉమ్మడిగా ఆమోదిస్తే ఇక్కడ పార్టీలు తమ స్వీయ ప్రయోజనాలకు దేశ భవిష్యత్తును విస్మరిస్తున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో రాజకీయాలలో విపరీతమైన అవినీతి పెరిగింది.

# అధ్యాయం – 5

# సామాజిక రంగం – ప్రపంచీకరణ ప్రభావ నవలలు

## 5.1 పర్యావరణం – కాలుష్యం

సాధారణార్థంలో పర్యావరణ క్షీణతను 'కాలుష్యం'గా చెప్పవచ్చు. నేడు ప్రపంచవ్యాప్తంగా పర్యావరణం పై విస్తృతంగా చర్చ జరుగుతోంది. వాతావరణం వేడెక్కి, పూర్తిగా కాలుష్యం అయిందని దీనిపై తగిన జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు. సామాజిక వేత్తలు దృఢంగా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణంలో కలుగుతున్న మార్పుల గురించి దానికి గల కారణాలను పరిశోధకులు పరిశోధిస్తున్నారు. ప్రస్తుతం పర్యావరణక్షీణతకు ప్రపంచీకరణ విధానాలు ఒక ముఖ్యమైన అంశంగా పలువురు పేర్కొంటున్నారు. పారిశ్రామిక విప్లవం ఫలితంగా పరిశ్రమల వ్యాప్తి పెరిగి వాయు కాలుష్యానికి దారితీసింది. ప్రపంచీకరణ విధానాల అమలు నేపథ్యంలో బహుళజాతి సంస్థలు వాణిజ్యమే ప్రధాన లక్ష్యంగా ఆవిర్భవించాయి. ఈ సంస్థలు నీటిని కాలుష్యం చేసి కాలువల్లోకి, నదుల్లోకి వదలడం వలన నీరు కలుషితం అవుతోంది. అత్యంత ప్రమాదకరమైన విషరసాయనాలు కూడా ఈ బహుళజాతి సంస్థలు విడుదల చేసే నీటిలో ఉన్నాయి. ప్రధానంగా క్లోరోఫ్లోరోకార్బన్లు వెదజల్లే విషవాయువుల వల్ల వాతావరణం వేడెక్కుతోంది. ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలలో ప్రమాదకర విషవాయువులు వెదజల్లడం అధికంగా ఉంది.

నేడు వాతావరణం గురించి ఆలోచిస్తున్నది శాస్త్ర వేత్తలు, పర్యావరణ వేత్తలు మాత్రమే కాదు. సామాన్యులు సైతం ప్రశ్నించుకొనే స్థితికి వచ్చారు. దీనికి కారణం పీల్చేగాలి, తినేతిండి, త్రాగేనీరు, నివాస ప్రాంతాలు కలుషితమవుతున్న తీరుని ప్రజలు ప్రత్యక్షంగా చూస్తుండటమే. ఇలా రావడానికి కారణాలున్నాయి వాటిని పరిశీలిస్తాను.

భూగోళమంతా మానవ నివాసానికి యోగ్యంగా లేదు. కాని అనేక జీవరాశులకు నిలయంగా ఉంది. అతికొద్ది శాతం భూమి పైనే మానవజాతి ఆధారపడి జీవిస్తుంది. ఈనాడు కొద్ది శాతంగా ఉన్న మానవుడు తన  అవసరాల కోసం, ప్రకృతిని తనకనుగుణంగా మార్చుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమం కూడా సమంగా లేదు. ఎక్కడి వారక్కడి సహజసిద్ధంగా దొరికిన వనరులపై ఆధారపడి పెరుగుతున్న అవసరాల కనుగుణంగా అనేక సౌకర్యాలు పెంచుకున్నారు. మానవుడు

ప్రకృతికి లోబడి వున్న స్థితి నుంచి దాని పై ఆధిపత్యం సాధించుకోవడానికి అనేక మార్పులు చేసుకున్నాడు. మానవుడికి ప్రకృతి పై  పూర్తి ఆధిపత్యం రాకపోయినా అనేక సహజ వ్యవస్థలు తనకనుగుణంగా మార్చుకున్నాడు. "రవాణా మార్గాలు వేయడం, ఓడ ప్రయాణాలు, నదులకు ఆనకట్టలు నిర్మించడం, అడవులు నరికి వ్యవసాయం, ఇతర నిర్మాణాలు చేయడం, జంతువులను చంపి ఆహారానికి వినియోగించడం చేశాడు. ఈ పరిణామక్రమంలో సహజసిద్ధమైన జీవ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. దీనికి తోడు మానవ సమాజంలో వర్గాలు ఏర్పడటం, ఒక వర్గం దోపిడీ, ఆధిపత్యం కోసం పరుగులు తీయడంతో పర్యావరణ వ్యవస్థ విధ్వంసానికి దారితీసింది. రాను రాను పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదం విస్తరించడంతో యుద్ధాలు, ప్రపంచ యుద్ధాలు ముందుకు వచ్చాయి. ప్రపంచ వ్యాప్తిత విచ్చలవిడి దోపిడి, ఆధిపత్య క్రమాలు ముందుకు వచ్చి సహజ పర్యావరణ వ్యవస్థలు ధ్వంసం అయ్యాయనేది చారిత్రక సత్యం"(దివాకర్,గాదె:2010;పుట – 31)

గాలి విషతుల్యమై మనుషుల ప్రాణాలను మింగేస్తుంది. ప్రజల ఆరోగ్యాలకు ఎసరు పెడుతుంది. ముఖ్యంగా పట్టణప్రాంత వాసుల్లో అత్యధికుల అనారోగ్యానికి అపరిమిత వాయు కాలుష్యం  ప్రధాన కారణంగా మారింది. దేశ జనాభాలో మూడింట ఒక వంతు మంది ప్రజలు కలుషితమైన గాలి బారిన పడుతున్నారు. జనంతో కిక్కిరిసిపోయిన మహానగరాలే కాదు చిన్న నగరాలు, పట్టణాలు కూడా వాయు కాలుష్యం కోరల్లో చిక్కుకు పోతున్నాయి. ఉత్తరాదిన  ఢిల్లీ వంటి మహానగరాలే కాదు దక్షిణాదిన కూడా అన్ని నగరాల్లో ప్రజలు అతిగా కలుషితమైన గాలితోనే జీవనం కొనసాగిస్తున్నారు.

భూమి ఉపరితల వాతావరణంలో దుమ్ము, ధూళి,ఆవిరి, వాహనాలు వదిలేటువంటి పొగవంటి కంటికి కనిపించనంతటి ద్రవ, ఘన రేణువులు చేరి గాలిని కలుషితం చేస్తున్నాయి. ఇటువంటి కాలుష్య కారకాలను పార్టిక్యులేటర్ మీటర్ (పీ.ఎం) అని అంటారు. ప్రాంతాన్ని బట్టి సమయాన్ని బట్టి గాలిలోని కాలుష్యకారకాల రంగు సాంద్రత పరిమాణం, రూపం మారుతూ ఉంటాయి. 10 మైక్రో మీటర్ల వ్యాసం కలిగిన కలుషిత రేణువులను పార్టిక్యులేట్ మీటర్ 10 (పీ.ఎం 10) అని పిలుస్తారు. గాలిలో వీటి సాంద్రత ఎంత ఎక్కువగా ఉంటే ఆ గాలి పీల్చినవారికి అంత ఎక్కువగా హాని జరుగుతుంది. "కేంద్రీయ కాలుష్య నియంత్రణ మండలి (సీ.పీ.సీ.బీ) గాలి నాణ్యత పై వెలువరించిన తాజా గణాంకాల ప్రకారం మన రాష్ట్రంతో సహా దక్షిణాది రాష్ట్రాలల్లోని 47 నగరాలలో  పీఎం 10 రేణువులు నిర్దేశిత ప్రమాణాలకన్న అధికంగా ఉన్నాయి. హైదరాబాద్ బెంగళూర్, చెన్నై వంటి పెద్ద నగరాలతో పాటు విజయవాడ, ట్యుటికోరిన్, హుబ్లి, ధార్వాడ్

నగరాల్లో వాయు కాలుష్యం చాలా హెచ్చుమోతాదుల్లో ఉంది. నల్గొండ, గుంటూరు, కర్నూలు, బెంగళూరు సహా14 నగరాల్లోని గాలిలో పీఎం 10 రేణువుల కాలుష్యం అపరిమితంగా ఉంది." (రాంబాబు, పంతంగి: 4; – 2013)పై అంశాలను పరిశీలిస్తే వివిధ నగరాలు కాలుష్య కోరల్లో చిక్కుకు పోతున్న పరిస్థితి తెలుస్తుంది.

పర్యావరణం, ప్రపంచ వ్యాప్తంగా విడుదల అవుతున్న కర్బన ఉద్గారాల గురించి అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. ప్రకృతిలో ఒక చోట జరిగే మార్పు అక్కడికే పరిమితం అవుతుందని చెప్పలేం. కాబట్టి పర్యావరణ మార్పులపై అంతటా చర్చ జరుగుతోంది. "సహజ వనరులకు, జీవావరణానికి భౌగోళిక సరిహద్దులు లేవు. అమెరికా ఇరాక్‌పై విషపూరిత బాంబులు వేస్తే, ఆవిష గాలుల ప్రభావం ఆ ఒక్కదేశానికే పరిమితం కావు. వియత్నాం పై అమెరికా దాడి సందర్భంలో పంటలపై చల్లిన విషపదార్థాల ప్రభావం అనేక దేశాలకు విస్తరించాయి. గల్ఫ్ యుద్ధంలో వెలువడిన విషపు గాలులు కేరళ తీరాన్నితాకాయని విన్నాం. ప్రకృతిలో ఒక దగ్గర జరిగే మార్పు అక్కడికే పరిమితం అవుతుందని చెప్పలేం. ఈ స్థితిలో యు.ఎన్.ఓ. అంతర్జాతీయ స్థాయిలో పర్యావరణ పరిరక్షణకు 1972 నుంచి అనేక సభలు, సమావేశాలు, చర్చలు నిర్వహించి అనేక మార్గదర్శకాలను నిర్దేశించి తన సభ్య దేశాలకు సూచనలు చేసింది. కాని ఒక్క అగ్రిమెంట్ కూడా చేయలేక పోయింది. దీనికి కారణం ప్రపంచంలో అధిక స్థాయిలో వాతావరణంలోకి విషాన్ని వదులుతున్న అమెరికా, యూరప్‌దేశాలే" (దివాకర్,గాదె: 2010;పుట – 31)పై ఆరోపనల్ని పరిశీలిస్తే అభివృద్ధి చెందిన అగ్రదేశాలే పర్యావరణ విషతుల్యం కావడానికి కారణం అవుతున్నాయి. అదే విధంగా తమ పలుకుబడితో ఐక్యరాజ్యసమితి వంటి వాటిని కూడా దారికి తెచ్చుకుంటున్నాయి. అందువలన కాలుష్య నియంత్రణపై కఠినమైన చర్యలు రావడం లేదు.

అదే విధంగా "5 శాతం జనాభా కలిగిన అమెరికా 27శాతం వాయుకాలుష్యాన్ని వెదజల్లుతుంది. దీనిని నియంత్రించడంలో ఇటీవల యూ.ఎన్.ఓ ఆధ్వర్యంలో జరిగిన కోపెన్ హెగెన్ సమావేశంలో సైతం అమెరికా కాలుష్యాన్ని నియంత్రించే చర్యల్ని అమలు చేయలేక పోయింది. అమెరికా క్యోటో ఒప్పందాల్ని ఇతర అంతర్జాతీయ ఒప్పందాల్ని ఉల్లంఘించడానికి తమ దేశంలోని ఆటోమొబైల్ పరిశ్రమలయిన ప్రముఖ ఆయిల్ కంపెనీల లాబీ వత్తిడి ఒక కారణంగా ఉందని అనేక మంది అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ ఒప్పందాలు, సుద్దులు తమకు వర్తించవని బరితెగించి వ్యవహరిస్తున్నారు.(పైదే పుట – 31) పై విషయాన్ని పరిశీలిస్తే

అంతర్జాతీయ ఒప్పందాల్ని యధేచ్ఛగా ఉల్లంఘిస్తూ అమెరికా వంటి అగ్రరాజ్యాలు ప్రపంచంలో పర్యావరణం దెబ్బతినడానికి ప్రధాన కారణం అవుతున్నాయనే విషయం అర్థమవుతుంది.

అభివృద్ధి చెందిన సామ్రాజ్యవాద దేశాల్లో వాయు, జలసముద్ర భూభాగాలలో కాలుష్య స్థాయి పెరిగింది. ఆహారం కలుషితమైంది. దీని ఫలితంగా అనేక రకాల కాలుష్య కారక పదార్థాలను వెనుకబడిన, ముఖ్యంగా ఇండియా లాంటి దేశాలకు అంటగట్టడం జరుగుతోంది. సామ్రాజ్యవాద దేశాలు ఉపయోగించిన పనికిరాని తొలగించిన యంత్రాలను, అణుధార్మిక పదార్థాలను మూడవ ప్రపంచ దేశాలకు అమ్ముతున్నారు. దీని ఫలితంగా ఇక్కడి కాలుష్యం అధికమవ్వడానికి అగ్రరాజ్యాలు కారణమవుతున్నాయి. "అంతే కాదు ఆస్ట్రేలియాలో పశువులు వేసిన పేడను మన దేశానికి ఎరువుగా దిగుమతి చేస్తున్నారు. దీనిలో అధికశాతం విషపదార్థం ఉందని ఆదేశ ప్రజలు వ్యతిరేకించిన తర్వాతనే మనదేశానికి దిగుమతి చేశారు. దీనిపై గుజరాత్ ప్రజలు వ్యతిరేకించడంతో ఈ కుట్ర వెలుగు చూసింది. కర్బన ఆధారిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లోనే కనిపిస్తుంది. ముఖ్యంగా అమెరికా, యూరప్, జపాన్‌లలో దీనిని గమనించవచ్చు. విదేశాల నుండి ముఖ్యంగా అమెరికా నుండి వచ్చే ప్లాస్టిక్ ఈ – వేస్ట్ లాంటి వ్యర్థ పదార్థాలను ఇండియా లాంటి దేశాలకు దిగుమతి చేస్తున్నాయి. ముఖ్యంగా అణుఒప్పందం, అణుప్రమాదాలలో నష్టపోయిన వారికిచ్చే పరిహార బిల్లుపై జరిగిన చర్చల్లో అనేక వాస్తవాలు బహిర్గతమయ్యాయి. అణువిద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి అవసరమైన టర్బైన్స్, జనరేటర్స్ అమెరికాలో ఉపయోగించి వదలి వేసినవే. అవి ఇక్కడ ఎంత గ్యారంటీగా పనిచేస్తాయో తెలియదుగాని జరిగే ప్రమాదాలను మాత్రం నివారించలేరు. నియంత్రించలేరనేది వాస్తవం. ఇప్పటికే అమెరికా, యూరప్ సముద్ర తీర ప్రాంతాలలో నిర్మించిన పెట్రో రసాయన కర్మాగారాల మూలంగా వందల సంఖ్యలో 'డెడ్‌జోన్స్' ఏర్పడినట్లు నివేదికలు తెలుపుతున్నాయి. అవి తిరిగి కోలుకోవాలంటే వందల సంవత్సరాలు పడుతుంది. అక్కడ నుండి తరలించిన రసాయన పరిశ్రమలనే 100శాతం ప్రత్యక్ష పెట్టుబడుల పద్ధతిలో భారతదేశ తీర ప్రాంతాలకు తరలించబోతున్నారు" (పైదే పుట –32). ఈ విధంగా భారతదేశానికి అనేక పరిశ్రమల పేరిట కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలు అధికంగా రాబోతున్నాయి. పై విషయాలను పరిశీలించిన తర్వాత సామ్రాజ్యవాద అగ్రదేశాలకు ఇండియాలాంటి దేశాలు డంప్‌యార్డ్‌గా ఉపయోగపడుతున్నాయి.

భారతదేశంలో కాలుష్యం పెరగడానికి విచ్చలవిడి పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడిదారుల లాభాపేక్షయే కారణం. రాజకీయ నాయకులు పరిశ్రమలు స్థాపించడం వలన పెరిగిన కాలుష్యం గురించి సూక్ష్మంగా చర్చించిన నవల 'సింహప్రసాద్' రాసిన తమసోమా'

"మురుక్కాలువ నిజంగానే మురికిగా వుంది. దుర్గంధం ముక్కుపుటాల్ని అదరగొడుతోంది.

"కాలువ ఇది వరకు ఇంత అధ్వాన్నంగా ఉండేది కాదుకద తాతయ్య"

"ఈ మధ్యనే ఇలా అయ్యింది. ఓ ఎంపి గారి బంధువులు అట్టల ఫ్యాక్టరీ కట్టారే దాన్నుంచి కలుషిత నీరంతా కాలువలోకి వదిలేస్తున్నారు. కాలువనీ పరిసరాలను కాలుష్యమయం చేస్తున్నారు." (సింహప్రసాద్: 2012; పుట – 107) అంటూ తాతయ్య గాంధీకి చెబుతాడు. ఇక్కడ రాజకీయ నేతలు యధేచ్ఛగా నిబంధనల్ని గాలికి వదిలేస్తూ విచ్చల విడిగా పరిశ్రమలకు అనుమతిస్తూ మరో వైపు తామే సొంతంగా పరిశ్రమలను స్థాపిస్తూ కాలుష్యం పెరగడానికి కారణమవుతున్నారు.

పరిశ్రమల వలన నదులు, సరస్సులు, కాలువలు, భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయి. పట్టణాలలో, పారిశ్రామిక వాడల్లో గాలిలో కార్బన్, సల్ఫర్‌నైట్రేట్, పాస్ఫేట్ మరియు కాంతి రసాయనిక వాయువులు తీవ్ర స్థాయిలో చేరాయి. వీటి మూలంగా ఆ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యం క్షీణించడంతో పాటు ఆహారన్నదించే కొన్ని రకాల పంటలు, ఫల వృక్షాలకి తీవ్రమైన నష్టం జరుగుతోంది.

ప్రపంచీకరణ విధానాలు అమలువుతున్న నేపథ్యంలో వర్ధమాన దేశాలు ప్రధానంగా అభివృద్ధి చెందిన దేశాలకు ప్రయోగశాలలుగా మారిపోతున్నాయి. ప్రపంచంలో పలు పర్యావరణ సమస్యలకు అభివృద్ధి చెందిన దేశాలే ప్రధాన కారణమవుతున్నాయి.

## 5.2. నిరుద్యోగం

నేడు దేశం ఎదుర్కొంటున్న అతిపెద్దసామాజిక, ఆర్థిక సమస్య నిరుద్యోగం. ప్రస్తుత ప్రపంచీకరణ విధానాలు అమలు నేపథ్యంలో ప్రపంచంలోని చాలా దేశాల్లో ఈ సమస్య తీవ్రత అధికంగా ఉంది. భారత్ లాంటి వర్ధమాన దేశాల్లో నిరుద్యోగం ఈరోజు కొత్తగా వచ్చిందేమి కాదు. అయితే ప్రపంచీకరణ విధానాలకు పూర్వం ఉన్న నిరుద్యోగానికి నేడు ఉత్పన్నమవుతున్న

నిరుద్యోగానికి బేధం ఉంది. ప్రస్తుతం ఇంజనీర్లు, డాక్టర్లు కూడా నిరుద్యోగులుగా మారుతున్నారు. ఆర్థిక సరళీకృత విధానాల వలన భారతదేశంలో నిరుద్యోగం నివారించబడక పోగా నిరుద్యోగ సమస్య మరింతగా పెరగడానికి కారణమైంది. "2001 జనవరి నుండి సెప్టెంబర్ వరకు నమోదు చేసుకున్న వారి సంఖ్య 2,48,7 భర్తీ చేసిన పోస్టులు 2,091 మాత్రమే అని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సర్వే 2001 – 2002 ప్రకటించింది".(వెంకట్రామయ్య, వేములపల్లి: 2003; పుట – 52) ఇవి ఒక దశాబ్దికాలం కిందటి గణాంకాలు. నాటి నుంచి నేటి వరకు ఈ పరిస్థితిలో ఏ మార్పు కనబడటం లేదు. నిరుద్యోగుల సంఖ్య ఇంకా అధికమైంది.

భారతదేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు అమలయిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్యను కుదించే ప్రయత్నం జరుగుతున్నది. ప్రభుత్వ ఉద్యోగులపై ఖర్చు చేస్తున్న వ్యయాన్ని తగ్గించుకోవడానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు క్రమంగా ఉద్యోగుల సంఖ్యను కుదించడం జరుగుతున్నది. "పదవీ విరమణ చేసే ఉద్యోగుల సంఖ్యను భర్తీ చేయకుండా ఉన్న ఉద్యోగాలలో సంవత్సరానికి 1.9 శాతం చొప్పున 50 సంవత్సరాల పాటు ఉద్యోగులను కుదించాలన్నది ప్రపంచ బ్యాంక్ ఆదేశం". (విద్యాభూషన్ : 2003; పుట – 24) "1999 అక్టోబర్ 1 నాటికి రాష్ట్ర ఉపాధి కల్పనా కేంద్రాల్లో నమోదైన ఇంజనీర్లు 20,000 డాక్టర్లు 3,900 వ్యవసాయధికార హోదాకై 2000, పశువైద్యులు 25,437పట్టభద్రులు3,50,887 ఇంటర్మీడియట్ చదువుతున్నవారు 4,80,846 పదోతరగతి తత్సమాన పరీక్షలో పాసైన వారు 12,01,514 మంది ఉన్నారు" (పైదే) అంతే కాకుండా ఎంప్లాయ్‌మెంట్ రిజిష్టర్లలో నమోదు చేసుకొంటున్న అభ్యర్థులసంఖ్య ఏడాదికేడాది పెరుగుతోంది.

ఈ నివేదికలు దాదాపు ఒక దశాబ్ధం కిందటివి. అయితే నేటి పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా తయారైంది. యువతకు ఉపాధి చూపాలన్న ఉద్దేశ్యంతో దేశవ్యాప్తంగా ఉపాధి కల్పనా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. నేటికి దేశవ్యాప్తంగా సుమారు 1000 ఉపాధి కల్పనా కేంద్రాలు ఉన్నాయి. మన రాష్ట్రంలో వాటి సంఖ్య31 అయితే ఈ కేంద్రాల ద్వారా ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. "డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ 2011 నాటి నివేదిక ప్రకారం అన్ని రాష్ట్రాల కంటే యువతకు మార్గదర్శకంగా నిలుస్తూ ఉపాధి కల్పించడంలో దేశంలోనే గుజరాత్, మహరాష్ట్ర, కేరళ, తమిళనాడు, జార్ఖండ్ రాష్ట్రాలు తొలి అయిదు స్థానాల్లో ఉండగా ఆంధ్రప్రదేశ్ వెనుక నుంచి రెండో స్థానంలో ఉంది. ఏటా 2, 25, 600 మందికి ఉపాధి చూపుతూ దేశంలో ప్రథమ స్థానంలో ఉన్న గుజరాత్‌లో మొత్తం 41 ఉపాధి

కల్పనా కేంద్రాలు ఉన్నాయి. మహారాష్ట్ర 47 కేంద్రాలతో 1,65,600 మందికి ఉపాధి చూపుతూ రెండో స్థానంలో నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ మాత్రం కేవలం 800 కి మాత్రమే ఉపాధి చూపగలుగుతుంది." (పద్మజ,మూల్పూరి: మే 16, 2013).

| దేశంలోని ఉపాధి కల్పన గణంకాలు తొలి అయిదు స్థానాల్లోని రాష్ట్రాలు | | | |
|---|---|---|---|
| రాష్ట్రం | కేంద్రాలు | రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులు | ఇచ్చిన ఉద్యోగాలు |
| గుజరాత్ | 41 | 4,16,500 | 2,25,600 |
| మహారాష్ట్ర | 47 | 6,82,500 | 1,65,600 |
| కేరళ | 89 | 4,72,000 | 13,500 |
| తమిళనాడు | 34 | 10,86,500 | 11,200 |
| జార్ఖండ్ | 41 | 97,800 | 8,700 |
| జమ్ముకాశ్మీర్ | 17 | 41,400 | 1300 |
| ఉత్తరాంచల్ | 24 | 1,83,500 | 11,00 |
| చత్తీస్‌గఢ్ | 18 | 2,21,000 | 900 |
| ఆంధ్రప్రదేశ్ | 31 | 2,36,000 | 800 |
| ఢిల్లీ | 14 | 1,64,400 | 200 |

ఆధారం: డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్. 2011.

భారతదేశంలో నిరుద్యోగం ఎంత వేగంగా పెరిగిపోతున్నదో పై వివరాలు తెలియజేస్తున్నాయి.

సరళీకృత ఆర్థిక విధానాలు అమలయిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఏటా నిరుద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగిపోతున్నది. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 7 కోట్ల30 లక్షల మంది ఉద్యోగ వేటకోనసాగిస్తున్నారని, ప్రపంచంలో నిరుద్యోగ సమస్య మరింత తీవ్రరూపం దాల్చొచ్చని అంతర్జాతీయ కార్మిక సంస్థ(ILO) హెచ్చరించింది. 15 –24 ఏళ్ళ వయసున్న 7.3 కోట్ల మంది ఉద్యోగాల వేటలో అలసి సొలసి పోతున్నారని ఆ నివేదికలో పేర్కొంది. గత ఆరేళ్ళలో నిరుద్యోగుల సంఖ్య 35 లక్షలు పెరిగింది. ILO (ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్) ప్రకారం ప్రపంచంలో నిరుద్యోగుల సంఖ్య 2012 నాటికి 197 మిలియన్లు. ఈ గణంకాలను బట్టి ప్రపంచ వ్యాప్తంగా నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందో స్పష్టమవుతుంది.

## 5.3. కర్షకులు

సరళీకృత ఆర్థిక విధానాలు దేశంలో ప్రవేశించిన తర్వాత అధికంగా నష్టపోయిన రంగాల్లో వ్యవసాయ రంగం ప్రధానమైంది. భారతదేశం ప్రధానంగా వ్యవసాయ సంబంధమైన ఉపాధి కలిగిన దేశం. ప్రపంచీకరణ విధానాల ఫలితంగా వ్యవసాయం కార్పొరేటీకరణ, కాంట్రాక్ట్ చెందడంతో ఉపాధి పొందుతున్న చిన్న, సన్న కారు రైతులు వ్యవసాయానికి దూరం అవుతున్నారు. అలాగే వ్యవసాయ పనుల్లో యాంత్రీకరణ మూలంగా కూలీలకు ఉపాధి పడిపోయింది. సామ్రాజ్యవాద దేశాలు భారతదేశ సహజ వనరుల్ని, మానవ శ్రమను ఎప్పటినుంచో దోచుకుంటున్నాయి. ముఖ్యంగా మన వ్యవసాయ రంగంపై దాడి జరుపుతున్నాయి. హరిత విప్లవం అని పిలువబడే వ్యవసాయ దశ నుండి అంటే 1965 నుండి ఈ దాడి ఉధృతమైంది. ఈ ప్రపంచీకరణ దాడిలో సమిధలవుతున్నది రైతులే.

వ్యవసాయ కూలీలకు కష్టాలు, నష్టాలు, బాధలు, వేదనలు కొత్తేమీకాదు. వారి బతుకులు హీనంగా, దయనీయంగా ఉన్నాయి. కానీ వారి పరిస్థితులు, బతుకు ఉదారవాద ఆర్థిక సంస్కరణలు మొదలైనప్పటి నుంచి మరింత దిగజారిపోయి దుర్భరమయ్యాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ విధానాల ఆర్థికసంస్కరణల పైన ఆధారపడి ఉన్నాయి. ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ ఈ ఆర్థిక విధానాలముఖ్య రూపాలు. ఆర్థిక సంస్కరణలు,

వ్యవసాయ విధానాలు వ్యవసాయ కార్మికుల బతుకుల పైన తీవ్రమైన దుష్ప్రభావం కలిగించాయి. ఉపాధిని తగ్గించుట నిజవేతనాల్లో తగ్గుదల, ధరల పెరుగుదల, తగిన ఆహార అలభ్యత మొదలైనవి ఈసంస్కరణల ప్రభావమే.

గత పదేళ్ళలో వ్యవసాయ కూలీల పనిదినాలు తగ్గిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో 200 దినాల నుండి 150 దినాలకు మరికొన్ని ప్రాంతాల్లో 150 నుండి 100 దినాలకు పని దినాలు తగ్గిపోయాయి. గత రెండు మూడు సంవత్సరాల కాలంలో వ్యవసాయ కూలీల పనిదినాలు మరింత తగ్గిపోవడం జరిగింది. ఈ విషయాన్ని అనేక సర్వేలు తేటతెల్లం చేస్తున్నాయి.

“సరళీకృత ఆర్థిక విధానాల అమలు వల్ల రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధి మందగించింది. ఉత్పత్తి, ఉత్పాదక పెరుగుదల రేటు తగ్గిపోయింది. అందువల్ల పని దినాలు వేగంగా తగ్గిపోతున్నాయి. వ్యవసాయకూలీల సంఖ్య కూడా పెరిగి పోతుంది. పరిశ్రమలు మూత పడటం చేతివృత్తులవారు వృత్తుల్ని కోల్పోవడం చిన్న రైతులు వ్యవసాయంలో నష్టాల, అప్పుల మూలంగా తమ భూముల్ని కోల్పోవడం జరిగింది. వీటన్నింటిలో ఉన్న వీరందరూ వ్యవసాయ కూలీలలోని జనాభా పెరుగుదల కూడా వీరి సంఖ్య పెరగడానికి కారణమైంది. పెరిగిన వ్యవసాయ కూలీల సంఖ్య మూలంగా పనిదినాలు తగ్గిపోయాయి” (చౌదరి, కె.ఆర్: 2011; పుట – 42) మరో వైపు ప్రభుత్వం యాంత్రీకరణను ప్రోత్సహిస్తుంది. ముఖ్యంగా ఉత్పత్తి ఖర్చులు తగ్గించడానికి కూలీ ఖర్చులు తగ్గించడానికి ఈ చర్యలు చేపట్టింది. “1981లో ట్రాక్టర్ల సంఖ్య 6 లక్షలుంటే 1991కి ఈ సంఖ్య 17 లక్షలకి పెరిగింది. 1998 కి ఈ సంఖ్య 25 లక్షలకి పెరిగింది. ప్రస్తుతం అన్ని వ్యవసాయ పనులకు యంత్రాల్ని ఉపయోగిస్తున్నారు. దుక్కి దున్నడానికి, నాట్లు వేయడానికి, విత్తనాలు వేయడానికి, కలుపులు తీయడానికి యంత్రాల్ని వాడుతున్నారు. వరికోత కోసే యంత్రం ఒక గంటలో ఒక ఎకరం పొలంలో వరికోత కోస్తుంది. అంటే 8 గంటల్లో దాదాపు 160 పని రోజుల్ని వ్యవసాయ కూలీలకు దక్కకుండా చేస్తుంది. వరికోతల్లో దాదాపు ఒక నెల రోజులు వ్యవసాయ కూలీలకు పని దొరికేది. ఇప్పుడు ఆ అవకాశం లేకుండా పోతోంది” (పైదే పుట –43). పై అంశాల్ని పరిశీలిస్తే ప్రపంచీకరణ విధానాలు అమలయి యంత్రాల్ని వాడటం వల్ల పేద కూలీల పని దినాల సంఖ్య తగ్గిపోతుందనే విషయం తెలుస్తుంది.

కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు అనేక ప్రజా వ్యతిరేక విధానాల్ని, కార్యక్రమాల్ని సంస్కరణల పేరిట రూపొందించి అమలు చేస్తున్నాయి. ఈ ప్రక్రియ గత పది సంవత్సరాల నుంచి ఊపందుకుంది.

అనేక రంగాల్లో ప్రైవేటీకరణ,సరళీకరణ, ప్రపంచీకరణ మొదలైన విధానాల్ని అమలు చేస్తున్నాయి. వ్యవసాయరంగంలో కూడా ఆర్థిక సంస్కరణలకు అనుగుణంగా వ్యవసాయ విధానాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాయి. ఈ విధానం కోట్లాది మంది రైతులు ముఖ్యంగా సన్నకారు, చిన్నకారు రైతుల, వ్యవసాయ కూలీల ప్రయోజనాల్ని కాపాడ్డానికి కాకుండా వారి సంక్షేమాన్ని దెబ్బతీసే విధంగా రూపొందించబడింది. దేశీయ వ్యాపార సంస్థలకు, బహుళజాతి సంస్థలకు మేలు చేకూర్చే విధంగా నూతన వ్యవసాయ విధానాలు రూపొందించబడుతున్నాయి.

అందులో భాగంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కూడా కార్పొరేట్ లేదా కంపెనీ వ్యవసాయాన్ని దేశంలో ప్రవేశ పెట్టడానికి దాన్ని భారీ ఎత్తున అమలు చేయడానికి రూపకల్పన చేసాయి. కార్పొరేట్ వ్యవసాయమంటే వ్యవసాయాన్ని కంపెనీలకు అప్పచెప్పడమే అది రైతులు చేసే వ్యవసాయం కాదు. రైతులు వ్యవసాయం నుండి నెట్టబడతారు.

ప్రభుత్వాలు వ్యవసాయంలో ఉత్పత్తి ఖర్చులు, కూలీల ఖర్చులు తగ్గించుకోవడానికి యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నాయి. భారతదేశంలో వ్యవసాయరంగంపై 70 శాతం మంది ప్రజలు ఆధారపడి ఉన్నారు. వారిలో 40 శాతం ప్రజలు వ్యవసాయ కూలీలు 20 శాతం ప్రజలు పేద రైతులు వీరందరికి రోజు కూలీ జీవనాధారం. వ్యవసాయ కార్మికులకు సంవత్సరంలో 100 దినాలే పని దొరుకుతుంది. ఈ కొద్ది రోజుల పని దినాల్ని కూడా కార్పొరేట్ వ్యవసాయం యాంత్రీకరణ మూలంగా హరిస్తుంది. ప్రస్తుతం వ్యవసాయ విధానాలు రైతులకు ఏమాత్రం ఉపయోగకరంగాలేవు. కొన్ని వందల సంవత్సరాల పాటు వ్యవసాయంలో దేశీయ విత్తనాల్ని ఉపయోగించిన రైతు నేడు ప్రైవేట్ కంపెనీలపై ఆధారపడి సాగు చేయాల్సి వస్తుంది. మరో వైపు కార్పొరేట్ సంస్థల పుణ్యమా అని నాణ్యత లేని కల్తీ విత్తనాలు మార్కెట్లో ప్రవేశించాయి.

ప్రభుత్వం వాణిజ్య పంటలకు అత్యధిక ప్రాముఖ్యత ఇవ్వడం వలన ఆహార ధాన్యాల ప్రాముఖ్యత తగ్గుతుంది. మన జనాభాకు ఆహార కొరత ఏర్పడే పరిస్థితి ముందు ముందు రావొచ్చు. తిండి గింజల ధరలు పెరుగుతాయి. ఆహార భద్రత దెబ్బతింటుంది. ప్రజలు ఆకలి మంటలకు గురువుతారు. అంటే ప్రపంచీకరణ విధానాల వలన ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటల చేరికతో దేశ ఆహార భద్రతకు తీవ్ర విఘాతం కల్గుతుంది. కార్పొరేట్ వ్యవసాయం ప్రధానంగా ఎగుమతుల కొరకే ఉద్దేశించబడింది. అంతర్జాతీయ మార్కెట్ ఎప్పుడూ నిలకడగా ఉండదు. అంతర్జాతీయ మార్కెట్‌పై అత్యాశ పెంచుకొని ఎగుమతుల కొరకే పంటలు పండిస్తే రైతులు

విపరీతంగా నష్టపోతారు. అంతే కాక ఆహార భద్రతను కోల్పోతాం. తిండి గింజల కోసం విదేశాలపై ఆధారపడే దుస్థితి దాపురిస్తుంది. ఈ విషయంలో మనం ఆఫ్రికా దేశాల అనుభవాల్ని గుర్తించుకోవాలి. మరో వైపు బహుళజాతి సంస్థల రాకతో వ్యవసాయంలో విష రసాయనాల వాడకం అధికమైంది. కలుపు నివారణకు కూడా రసాయనాల్నే వాడుతున్నారు. పురుగుల మందులు విపరీతంగా వాడుతున్నారు. వీటి ఫలితంగా భూమి కలుషితమై పోతుంది. వ్యవసాయోత్పత్తులు విషపూరితమవుతాయి. ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడుతుంది. మొత్తం పర్యావరణం కలుషితం అవుతుంది.

రైతులు సంవత్సర కాలం శ్రమించి పండించిన పంటలకు ప్రభుత్వం కనీస గిట్టుబాటు ధరలను కూడా కల్పించలేక పోతుంది. దీని ద్వారా మధ్యవర్తులు, దళారీలు ప్రయోజనం పొందుతున్నారు. గిట్టుబాటు కాని ధరలు వ్యవసాయ సంక్షోభానికి ప్రధాన కారణమని ఆర్థిక వేత్తలు విశ్లేషిస్తున్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు గగ్గోలు పెడుతున్నారు. వ్యవసాయోత్పత్తుల ధరలు తక్కువగా ఉండటమే కాక అస్థిరంగాను ఉంటున్నాయి. దీని వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇతర రంగాల్లోని ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తులకు తామే ధరలు నిర్ణయిస్తుండగా వ్యవసాయోత్పత్తుల ధరలు రైతులు నిర్ణయించడం లేదు. “వ్యవసాయోత్పత్తి ధరలను వ్యాపారవేత్తలు, మిల్లర్లు, పారిశ్రామికవేత్తలు నిర్ణయిస్తున్నారు. వాళ్ళ లాభాలను దృష్టిలో ఉంచుకొని, వ్యవసాయోత్పత్తులకు తక్కువ ధరలను నిర్ణయిస్తున్నారు. ఆ ధరలతో మాత్రమే కొంటున్నారు. రైతాంగాన్ని దోపిడీ చేస్తున్నారు. పెట్టుబడిదారీ, సరళీకరణ విధానాలే వ్యవసాయోత్పత్తుల ధరలను శాసిస్తున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ ఈ అగ్గికి ఆజ్యం పోస్తుంది”. (చౌదరి, కె.ఆర్: 2011; పుట – 202)

రైతులు తాము పండించిన పంటలకు వేరే వ్యక్తులు ధరలు నిర్ణయించడం వలన రైతులు నష్టపోయే స్థితిని వివరించిన నవల సింహప్రసాద్ రచించిన తమసోమా!

పొలంగట్ల మీద నడుస్తూ ఈ సారి పంట లెలావున్నాయి తాతయ్య అని అడుగుతాడు గాంధీ. దానికి తాతయ్య “వరి బాగానే పండింది కానీ ధాన్యం కొనే నాథుడే లేక పోయాడు చూస్తోంటే ప్రపంచ ఆర్థిక విధానాలు రైతుల కడుపు కొడతాయోమోనని భయంగా ఉందిరా” (సింహప్రసాద్:2012; పుట–105) అంటూ అభిప్రాయపడతాడు తాతయ్య. “అన్నట్టూ తాతయ్యా! ధాన్యాన్ని ఫుడ్ కార్పోరేషన్ వారు కొనేలా ముఖ్యమంత్రి కేంద్రప్రభుత్వం మీద ఒత్తిడి

తీసుకొచ్చారు కదా అలా అని పేపర్లు రాసాయి. ఆచరణలో మాత్రం ప్రగతి పెద్దసున్నా ఫుడ్‌కార్పోరేషన్ వాళ్ళు ఒకటి చెబుతారు. కేంద్రప్రభుత్వం మరోటి చెబుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇంకోటి చెబుతోంది. వీరందరి మధ్య ఊపిరాడక కొట్టుకుంటున్నాడు రైతు. పండిన పంటలకు ధరాలేదు కొనే వాడులేడు ఇలాంటి దుస్థితి ఎన్నడూ ఎదురవ్వలేదు.

"సిటీలో మాత్రం బియ్యం ధర ఆకాశానికంటుతోంది. అవునాలాగే ఉంది. ఆరుగాలం పండించే రైతుకేమి మిగలదు. వినియోగ దారుడికీ మిగలదు. మధ్యన దళారులు సొమ్ము చేసుకుంటున్నారు.

స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళు గడిచినా సరైనా పంపిణీ వ్యవస్థ నెలకొల్పుకోలేక పోయాం. అయినా ఏరువాక అంటే తెలియని అధికారులు ఢిల్లీలో ఏసీ రూముల్లో కూర్చుని ధాన్యానికి మద్దతు ధర నిర్ణయిస్తున్నారు." (పైదే, పుట – 106) అంటూ తాతయ్య తన మనవడు అయిన గాంధితో వ్యక్తీకరించే అభిప్రాయం మనల్ని ఆలోచింప చేస్తుంది.

ప్రస్తుతం వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉంది. ఒకప్పుడు పంటలు పండించి రైతులు పండుగలు, పబ్బాలు చేసుకునే వారు. అయితే నేడు వీరి పరిస్థితి మనుగడ సాగించడమే దుర్భరంగా ఉంది. నేడు వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టి వేయబడింది. దీనికి కారణం "1991 నుండి అమలు చేస్తున్న నూతన ఆర్థిక విధానాలే ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రం చేశాయి. వ్యవసాయం క్షీణించింది. 1980 దశకంలో వ్యవసాయ అభివృద్ధి రేటు 3.5 శాతం ఉంటే 2000 దశకంలో కొన్ని సంవత్సరాల్లో నెగటివ్‌గా ఉంది. ప్రస్తుతం 1.8 శాతానికి పడిపోయింది. రైతులు అప్పుల ఊబిలో కూరుకుని పోయారు. దేశ స్థాయిలో 49 శాతం, రాష్ట్రస్థాయిలో 82 శాతం రైతులు అప్పుల ఊబిలో కూరుకుని పోయారని నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ నివేదిక స్పష్టం చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగం పేదరికంలో మగ్గిపోతున్నారు. వారి జీవన స్థాయి కనిష్టంగా ఉంది. వారికి ఉపాధి సౌకర్యాలు తగ్గిపోయాయి. నిరుద్యోగం 5.6 శాతం నుండి 9 శాతానికి పెరిగింది. ఇతర రంగాల వారితో పోల్చుకుంటే రైతుల ఆధాయం చాలా తక్కువగా ఉంది. 1950లో జాతీయ ఆదాయంలో రైతుల వాటా 50 శాతం ఉండేది. ఇప్పుడు అది 17 శాతానికి పడిపోయింది. (చౌదరి, కె.ఆర్:2011; పుట –210) పై అంశాలని పరిశీలిస్తే ప్రపంచీకరణ విధానాల వలన వ్యవసాయం సంక్షోభం నుండి విపత్తుకు, విపత్తునుండి వినాశనానికి వేగంగా పయనిస్తున్న స్థితి అర్థమవుతుంది.

## 5.4 కార్మికులు

ప్రపంచీకరణ క్రమంలో ప్రైవేటీకరణ చాలా ప్రదానమైన భాగం. ప్రభుత్వ రంగ ప్రాదాన్యాన్ని తగ్గించడం, ప్రభుత్వరంగ సంస్థలను మూసివేయడం వాటి నుంచి ప్రభుత్వ పెట్టుబడులను ఉపసంహరించడం వాటిని ప్రైవేట్ వ్యాపార వేత్తలకు, బహుళజాతి సంస్థల దళారీలకు అప్పగించడం. కొత్త సంస్థలన్నింటినీ ప్రైవేట్ రంగంలో ప్రోత్సాహించడం వంటి పరిణామాలన్నీ నూతన ఆర్థిక విధానాలలో విపరీతంగా జరిగిపోయాయి. ఫలితంగా కొన్ని లక్షల మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయి. కార్మికులలో సామర్థ్యం పుష్కలంగా ఉన్నా పరిశ్రమలు మూతపడటం లేదా ప్రైవేటీకరించడం జరుగుతున్నది. దీంతో మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ఉపాధితో జీవించిన కార్మికులు ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ పరిస్థితుల్లో ఉపాధి కోల్పోయి ఆకలి కేకలతో అలమటించే స్థితికి నెట్టివేయబడ్డారు.

ప్రైవేటీకరణతో పాటు వచ్చి పడిన మరొక పెద్దప్రమాదం ఉత్పత్తి పద్ధతులలో వచ్చిన మార్పులు. పనిని చిన్నచిన్న ముక్కలుగా విడగొట్టడం. అనేక మంది కాంట్రాక్టర్లకు, సబ్‌కాంట్రాక్టర్లకు అప్పగించడం జరుగుతుంది. అసలు ఉత్పత్తి సంస్థలకు కార్మికులకు ఎటువంటి సంబంధం లేక పోవడం ప్రస్తుతం సాధారణమైంది. కార్మికులు ఒకే చోట సంఘటితంగా ఉండలేని పరిస్థితులు కల్పించి చిన్నచిన్న సంస్థలలో, ఇళ్ళలో పని అప్పగించడం, దాన్ని స్త్రీలు చిన్న పిల్లలు చేయడం వలన కార్మికులు ఒక సంఘటిత నిర్మాణంలోకి రాలేకపోవడం వంటి పరిస్థితులు తలెత్తాయి.

కొన్ని వందల సంవత్సరాల భారతీయజీవనంలో చిన్న కుటీర పరిశ్రమల వలన అత్యధిక మంది ఉపాధి పొందారు. అయితే ప్రపంచీకరణ విధానాలు భారతదేశంలో ప్రవేశించిన తర్వాత ఇక్కడి దేశీయమైన పరిశ్రమలను, చేతి వృత్తులను దారుణంగా దెబ్బతీసింది. ఉదా: తమ ఉపాధి కోసం ఆదివాసులు అడవుల మీద ఆధారపడుతూ వస్తున్నారు. వీరు కుంకుళ్ళు సేకరించి అమ్ముకుంటారు. వివిధ బహుళజాతి సంస్థలు పంపిణీ చేస్తున్న సబ్బుల వల్ల కుంకుళ్ల గిరాకీ పడిపోయింది. ఇది కేవలం ఒక చిన్న ఉదాహరణ అలాంటి అనేక అటవీ ఉత్పత్తులకు బహుళజాతి సంస్థలు  ప్రత్యమ్నాయ వస్తువులను ఉత్పత్తి చేస్తున్నాయి. ఈవిధంగా ఆదివాసుల ఉపాధికి గండి పడింది. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు పదిలక్షల మంది మహిళలు బీడి కార్మికులుగా ఉపాధి

పొందుతున్నారు. కంపెనీల సిగరెట్లు వచ్చి బీడీల గిరాకీ తగ్గడం వల్ల వారి ఆదాయం పడిపోయింది. బీడీ ఆకుల్ని సేకరించే ఆదివాసి మహిళల ఉపాధి కూడా తగ్గిపోయింది. అలాగే చేనేత, మరమగ్గాల వస్త్ర కార్మికులు నేడు ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. చాలిచాలని విద్యుత్ సరఫరా విద్యుత్ చార్జీల పెంపు, నూలు కండెలు, పెరిగిన రసాయనాల ధరలు, ఎక్సైజ్ డ్యూటీ, ఇతర పన్నులు గిరాకీ తగ్గడం వంటి దేశీయ విధానాల వల్ల, ప్రపంచీకరణ వల్ల ఈ కార్మికులు స్వదేశంలోనూ, అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బహుళజాతి సంస్థలతో పోటీపడలేకపోతున్నారు. ఈదేశంలోకి దిగుమతి అవుతున్న బట్టలు, దుస్తుల వల్ల చేనేత మగ్గాలు, మరమగ్గాలు వస్త్ర పరిశ్రమల కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు భారతదేశంలోకి ప్రవేశించిన తర్వాత ఇక్కడి పరిశ్రమలు క్రమంగా మూతపడ్డాయి. మరికొన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబడ్డాయి. అలాగే శాశ్వత ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్ట్, క్యాజువల్ ఉద్యోగాలు ఏర్పడటం జరిగింది. దీంతో అప్పటి దాకా ఉద్యోగాల్లో ఉన్నకార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. మరొక వైపు ప్రైవేట్ పరిశ్రమల్లో చాలిచాలని జీతాలతో బతుకులు వెళ్ళదిస్తూ కార్మికులు ఆకలికేకలతో ఆత్మహత్యలనే పరిష్కారంగా ఎంచుకుంటున్నారు.

## 5.5 విదేశీవలస

ప్రస్తుతం విదేశాలకు వలస వెళ్ళడానికి ఆసక్తి చూపుతున్నది వర్ధమాన దేశాల ప్రజలు. ఈ వలసలు ఉపాధికోసం వెతుకులాట కావచ్చు. లేక పెళ్ళి చేసుకున్న మూలాన కావచ్చు. ఏదైతేనేం ఒక ప్రాంతం లేదా దేశం ప్రజలు మరొక దేశానికి తరలి పోవడాన్ని 'వలస' గా చెప్పవచ్చు. అయితే ప్రస్తుతం విదేశాలకు వెళ్ళడానికి ఆసక్తిని చూపుతున్నది విద్యావంతులు. విద్యావంతులు ఒక దేశం వదిలి మరొక దేశం వలస పోవడాన్ని 'మేధావుల వలస' అని కూడా పేర్కొనడం పరిపాటి. ప్రస్తుతం విదేశాలకు వెళుతున్న యువతీ యువకుల సంఖ్య అధికంగా ఉంది. ఒకటి రెండు దశాబ్దాల కిందట వందల్లో ఉన్న మేధో వలస నేడు విపరీతంగా పెరిగిపోయింది. కొద్దికాలం కిందట కేవలం ఉద్యోగాల కోసమే విదేశాలకు వెళ్ళేవారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. విద్యార్థులు ఉన్నత విద్య, ప్రాజెక్టుల కోసం విదేశాలకు వెళ్ళాలను కోవడం సహజమైపోయింది. నేడు మధ్యతరగతి వారికి తమ కుటుంబంలో కనీసం ఒక్కరైనా ఉద్యోగం

చేస్తూ లేదా కనీసం చదువుతూనైనా ఉండాలనేది పలుకుబడి సమస్యగా మారింది. ఉన్నత వర్గాల వారు తమ పిల్లల్ని విదేశాల్లోనే చదివిస్తూ అక్కడే వారు ఉద్యోగాలను సంపాదించుకునే అవసరమైనా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎగువ మధ్యతరగతి కుటుంబాలకు సంబంధించిన వారు సైతం తమ పిల్లలను ఏదో ఒక కంప్యూటర్‌కోర్సులో చేర్పించి ఇతరులనుంచి లేదా బ్యాంక్‌ల నుంచి అప్పు తీసుకొనైనా సరే విదేశాలకు పంపేందుకు ఆరాటపడుతున్నారు.

ప్రపంచీకరణ అమలు విధానాల నేపథ్యంలో విదేశీ విద్యా, ఉద్యోగాల ఫలితంగా చాలా కుటుంబాల్లోని జీవన విధానాల్లో విపరీత మార్పులు మనం ఈనాడు చూస్తున్నాం. తమ పిల్లలు అమెరికాలో చదవాలనో లేదా ఉద్యోగాల్లో ఉంటూ అక్కడే స్థిరపడాలనో కలలుగనే తల్లిదండ్రుల సంఖ్య సమాజంలో నానాటికి పెరుగుతుంది. విదేశాల్లో స్థిరపడ్డ వ్యక్తుల జీవన స్థితిగతుల్లో వస్తున్నటువంటి మార్పులు ఇండియా నుండి వెళ్లేవారిని మరింతగా ఊరింపచేస్తున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో ఈనాడు సమాజంలో ఇంటర్నేషనల్ స్కూల్స్ విపరీతంగా ఏర్పడుతున్నాయి. అలాగే పేరు పొందిన విద్యాలయాల్లో చదివే విద్యార్థినీ విద్యార్థులు సైతం ఉన్నత విద్యకోసం విదేశాలకు వెళ్ళాలని కలలు కంటున్నారు. ముఖ్యంగా డాక్టర్స్, కంప్యూటర్, ఇంజనీరింగ్ డిప్లొమాలు పూర్తిచేసిన విద్యార్థులలో అధిక శాతం విదేశాలకు వెళ్ళి ఉద్యోగాలు చేసేందుకు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. మరో వైపు సమాజంలో తమ పిల్లలు విదేశాల్లో చదవడం లేదా ఉద్యోగం చేయడం అనేది ఒక సామాజిక హోదాగా నేటితరం భావిస్తుండటం వలన అమెరికాలాంటి విదేశాలకు వలసలు అధికంగా ఉంటున్నాయి.

విదేశీ వ్యామోహం ఎంత తీవ్రంగా ఉందో వివరించిన నవల సింహప్రసాద్ రచించిన డాలర్ డాలర్. ఇందులో ముకుందం పార్వతీ దంపతులు. వీరి కుమారుడు దొరబాబు. ముకుందం తన కొడుకును పెద్దచదువులు చదివించి ఉన్నత ఉద్యోగంలో ఉంచి తను కలలుగన్న పేరు ప్రఖ్యాతిని ఆర్జించాలని ఆరాట పడే వ్యక్తి. అందుకు తగ్గట్టుగానే చిన్నతనం నుంచే దొరబాబుపై చదువు విషయంలో ప్రత్యేక దృష్టి నిలుపుతూ చదివిస్తుంటాడు. ఈ విధంగా చదివించడం దొరబాబుకి ఇష్టంలేకున్నా తాను కన్న కలలను సాకారం చేసుకోవడం తన కొడుకు ద్వారానే సాధ్యం అని ముకుందం నిరంతరం కొడుకును చదివిస్తుంటాడు. కొడుకు బాగా చదివి అమెరికా వెళ్ళి అక్కడ ఉద్యోగం చేయాలన్నది ముకుందం కోరిక దానికి తగ్గట్టుగానే శ్రమపడుతూ దొరబాబు పదోతరగతి పాసవుతాడు. తర్వాత ఏంచదవాలనుకుంటాడో దొరబాబు తన తల్లికి వివరిస్తాడు. పార్వతి తన భర్త ముకుందానికి కొడుకు ఆలోచన గురించి వివరిస్తుంది. అయితే దొరబాబు డాక్టర్ అవ్వాలని

అనుకుంటాడు. ముకుందం కలలుగన్న దానికీ కొడుకు ఆలోచనకు తేడా ఉంది "అదేం లాభం లేదురా ఇది వరకు విదేశాలకు వెళ్ళడానికి డాక్టర్లకెక్కువ అవకాశం వుండేదన్నమాట నిజమే కానిప్పుడు వారికి డిమాండ్‌లేదు. వారి సంపాదనా పడి పోయింది. ఇక్కడే చూస్తున్నావుగా సందుకో డాక్టర్ ఉంటున్నాడు. ఈగలు తోలుకుంటూ కూర్చునే వాళ్ళే ఎక్కువ. అంచేత నీవు ఇంజనీరువి కావాలని ఎప్పుడో నిర్ణయించేశాను." తండ్రి మాటలకు దెబ్బతిన్నట్లు చూశాడు బాబు అయితే చెలరేగుతున్న భావసంచలనాన్ని పట్టించుకోలేదు ముకుందం. "ఈజీగా అమెరికా వెళ్ళాలన్నా తక్కువ కాలంలో కోట్లకు పడగలెత్తాలన్నా అది ఇంజనీరింగ్ వల్లనే సాధ్యంరా రాబోయే కాలమంతా ఎలక్ట్రానిక్స్‌దేరా నువ్వు ఎలక్ట్రానిక్స్ ఇంజనీరువి అయి తీరాల్సిందే యింకెలాంటి వెధవాలోచనలు పెట్టుకోకు" (సింహప్రసాద్:2010; పుట –36) అంటూ కొడుకు పట్ల ముకుందం చేసే హెచ్చరికలో అమెరికా వెళ్ళి చదివి ఉద్యోగం చేయాలనే తపన ఎంత బలంగా ఉందో తెలియజేస్తుంది.

ఇంటర్మీడియట్ తర్వాత దొరబాబు బీ.టెక్ చేరి మూడో సంవత్సరంలోకి రాగానే కొడుకు అమెరికా వెళ్ళడం కోసం ముకుందం అమెరికాలోని తన బంధువులకు ఉత్తరం రాస్తాడు. ముకుందం తన కొడుకు చదువు కోసం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తాడు. తాను ఆర్థికంగా ఎంత చితికి పోయినా అమెరికా అనే వ్యామోహంలో పడి అవన్నీ మరచిపోతాడు. ఇంతగా శ్రమపడుతున్నా ముకుందంతో అమెరికా పంపడమంటే మాటల్తో కాదనిపిస్తోందండి అంటుంది భార్య పార్వతి. "నిజమే మనం అంతకి తూగలేం కాని తూగాలి ఏదో దారి చూస్తాను అంటాడు అందుకామె ఇంకేం దారులున్నాయి. పొలం అమ్మేరు. పల్లెలోని ఇంటి వాటాని మీ అన్నయ్యకు అమ్మేరు ఆఫీసు నుంచి తర్వాతెప్పుడో రావల్సినవి కూడా ఇప్పడే తీసేసుకున్నారు. నోరు కట్టుకుని అప్పుచేస్తూ ఇలా ఎన్నాళ్ళు... పోనీ ఇక్కడే చదివిస్తే? ఆ చదువు ఇక్కడ లేదంతే? ఉంది కానిక్కడ చదవడు. అమెరికాలోనే చదువుతాడు. ఇక్కడ చదివితే విలువేముంటుందే పిచ్చిదానా! అదే ఆభూతల స్వర్గంలో చదివితే నెలకు వేల డాలర్లు ఇస్తామంటూ ఎగురేసుకుపోతారు. కళ్ళుమూసి తెరిచేంతలో కళ్ళు మిరుమిట్లు గొల్పేంత స్థాయికెదిగి పోతాడు నాబిడ్డ"(పైదే) అంటూ ముకుందం తన భార్యతో చెప్పే మాటలు ఆలోచింపచేస్తాయి. ప్రస్తుతం అమెరికా వెళ్ళే వారి పరిస్థితులు ఏవిధంగా తయారవుతున్నాయో ముకుందం పాత్ర ద్వారా చెప్పించాడు రచయిత సింహప్రసాద్.

ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో అమెరికా లాంటి విదేశాలకు వెళ్ళేవారి సంఖ్య భారత్ వంటి వర్ధమాన దేశాలలో విపరీతంగా పెరుగుతోంది.

## 5.6 వస్తు వ్యామోహం

నేడు సమాజంలో ఒక రుగ్మతగా మారిన అంశం వస్తువ్యామోహం. భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమై విదేశీ బహుళజాతి సంస్థలు ప్రవేశించడంతో ఇది మరింతగా విస్తృతమైంది. నేడు మనిషి అవసరాల కోసం వస్తువును కాకుండా వస్తువు కోసం మనిషిలాగా తయారు చేస్తున్నాయి బహుళజాతి సంస్థలు. దీనంతటికి కారణం నేడు అమలవుతున్న ప్రపంచీకరణ. ఈ రోజు బహుళజాతి సంస్థల పెట్టుబడిదారులు తాము ఉత్పత్తి చేసిన వస్తువులకు విపరీతమైన ప్రచారం కల్పిస్తున్నారు. ప్రింట్‌మీడియా ప్రసారసాధనాలు కంప్యూటర్లు మొదలైన అన్ని రకాల మాద్యమాల్లో వీటికి విశేష ప్రచారం కల్పించి సరుకులను అమ్ముకుంటున్నారు. సామ్రాజ్యవాదులు మన సంస్కృతిని కాలరాస్తూ ఒక నూతన సంస్కృతిని ప్రవేశపెడుతున్నారు. దానినే వస్తువినిమయ సంస్కృతి అంటున్నారు. ప్రపంచీకరణ అమలు తర్వాత వస్తువినిమయదాహం పెరిగింది. అవసరం ఉన్నా లేకున్నా పెట్టుబడిదారీ దేశాలు తమ వస్తువులతో మన మార్కెట్లను నింపేస్తున్నాయి.

“ఈవిధంగా సరుకును మార్కెట్లలో నింపడం ద్వారా వాళ్ళ సరుకును కొనేటట్లు చేయడాన్ని అమెరికా వాడు ఇప్పుడు మెక్‌డొనాల్డైజేషన్ అంటున్నాడు. ఈవిధంగా మెక్‌డొనాల్డైజేషన్ ద్వారా మనం పరాయీకరించబడుతున్నాం. ఈవిధంగా మన సంస్కృతి నుండి మనం దూరం చేయబడుతున్నాం. వస్తువినియోగ సంస్కృతికి లోనవుతున్నాం. ఇది వస్తువినియోగ వ్యామోహం దగ్గరే ఆగిపోదు. దానిని ప్రదర్శించుకోవాలనిపిస్తుంది. నాదగ్గర ఇన్ని వస్తువులు ఉన్నాయని చూపించుకోవాలనిపిస్తుంది. ఈ ఆర్భాటానికి హద్దంటూ ఏమీలేదు. అవసరం ఉన్నా లేకున్నా యాభై నుంచి అరవై లక్షలు ఖరీదు చేసే ఇళ్ళు కడుతున్నారు. పెళ్ళిళ్ళు చేస్తే కోట్లు ఖర్చు పెట్టి చేస్తున్నారు. పెళ్ళంతా వైభవంగా ఫలానా ఆయన చేశాడు అని ప్రచారం కావడం కూడా వినియోగ సంస్కృతికి పరాకాష్ట. వస్తువులను గురించి ఆర్థిక శాస్త్రంలో ఒక విభజన ఉంటుంది. అదేమిటంటే అవసరాలు, సౌకర్యాలు, విలాసాలు ఇరవై ఏళ్ళ క్రితం అందరికీ అవసరాలు తీరాలని కొంతైనా ఉండేది. కాని ఇప్పుడు అవసరాల కంటే విలాసాల మీదనే ఎక్కువ ఖర్చు పెట్టే దుబారా సంస్కృతి పెట్టుబడిదారీ వర్గాలచే పెంచి పోషించబడుతున్నది. ఈ ప్రచారం వల్ల సరుకు అమ్మకానికి మార్గం సుగమం అవుతుంది”. (వేణుగోపాల్, ఎన్: 2011; పుట – 190)

వస్తువ్యామోహం గురించి చర్చించిన నవలలు చాలా ఉన్నాయి. సింహప్రసాద్ రచించిన డాలర్...డాలర్ వస్తువ్యామోహం గురించి ప్రధానంగా చిత్రించింది. ఈనవలలో ముకుందం పార్వతి దంపతులకు దొరబాబు కొడుకు. అతడు ఇండియాలో చదివి అమెరికాలో ఉద్యోగం కోసం వెళతాడు. అక్కడ ఒక కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగానికి ఎంపిక అవుతాడు. అది తెలిసిన తల్లిదండ్రులు తమకున్న ఆశలు, వస్తువ్యామోహన్ని కొడుకుకు తెలియజేయడం ఈ నవలలో చిత్రించారు రచయిత సింహప్రసాద్.

"అధిక జీతం వచ్చే కంపెనీలో చేరినందుకు చాలా సంతోషంగా వుంది.నువ్వింకా పైపైకి ఎదిగి  చుక్కల్ని చూడాలని నా ఆశ. ఇకపోతే అక్కడ నీఖర్చులవీ సాధ్యమైనంత తగ్గించుకొని డబ్బంతా ఇక్కడికి పంపించెయ్. మనం ఎప్పట్నుంచో కలలు కంటున్న అధ్భుతమైన ఇంటిని నిర్మిస్తాను. కారు కొనేస్తాను. మన సుఖసంతోషాల కోసం ఏమేం అవసరమో అవన్నీ కూడా ఏర్పాటు చేస్తాను" (సింహప్రసాద్:2010; పుట -86) అంటూ అమెరికాలో ఉద్యోగం లభించిన తన కొడుకుకు రాసే ఉత్తరం మనల్ని ఆలోచింపచేస్తుంది. ఇవాళ సమాజంలో వస్తువ్యామోహం ఏవిధంగా ఉందో పై వాక్యాలు అందుకు నిదర్శనం.   వస్తువ్యామోహం గురించి చర్చించిన మరో నవల ఆదెళ్ళ శైలబాల రచించిన 'వెన్నెల్లో గోదావరి'.

"ఆర్థిక ఇబ్బందులుండి ఆడవారు ఉద్యోగం చేసారంటే అర్థం ఉంది. కానీ రెండు కార్లు మూడు ఇళ్లూ లేదా బ్యాంక్ బ్యాలెన్స్, ఎల్‌సీడీ  టీవీల కోసం మేము ఉద్యోగాలకు వెళ్ళి ఎంత ఒత్తిడికి లోనవుతున్నామో మీ మగవాళ్ళకు అర్థం అవుతోందా?" (శైలబాల, ఆదెళ్ళ: 2011; పుట -193) పై విషయాన్ని పరిశీలిస్తే నేటి సమాజంలో వస్తువుల పట్ల మనుషులకు ఉన్నటువంటి వ్యామోహం మనకు అర్థమవుతుంది. ఏదయితేనేం ఈ రోజు ప్రపంచీకరణ బహుళజాతి సంస్థలు మనకు అవసరం కంటే అధికంగా వస్తువులను విక్రయించి లాభాలు పొందుతున్నాయి. దీనికి కార్పొరేట్ మీడియా విపరీతమైన ప్రచారం కూడా తోడై వస్తువుల పట్ల జనం వెర్రి వ్యామోహాన్ని పెంచుకోవడం మరింతగా ప్రోత్సాహించింది.

## 5.7. వివాహ వ్యవస్థ

భారతీయ సామాజిక జీవనంలో వివాహానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. రెండు భిన్న కుటుంబాల్లో పుట్టి, భిన్న ప్రాంతాలు, వాతావరణాల్లో పెరిగి, భిన్న అలవాట్లు, అభిప్రాయాలు కలిగుండే ఇద్దరి మనుషులను ఒక 'పసుపుతాడు అజన్మాంతం' కలిసి బతికేటట్లు చేసే పటిష్టమైన వివాహబంధం కలిగిన సామాజిక వ్యవస్థ మనది. కొన్ని వందల సంవత్సరాలు భారతీయ వివాహ వ్యవస్థ ఇతర దేశాలకి ఆదర్శంగా వస్తోంది. నాటి సమాజంలో వివాహసంబంధాల్లో ప్రేమానురాగాలు, ఆత్మీయతలు పదిలంగా ఉండేవి. దంపతుల మధ్య అన్యోన్యత ఉండేవి. "నమ్మకం, గౌరవం, కష్టాలు వచ్చినప్పుడు ఒకరి కొకరు అండగా నిలబడటం మానసికంగా ఆలంబన కలగజేయడం. మనసా,వాచా, కర్మణ తన భాగస్వామితోనే జీవన సౌఖ్యాలను పొందడం సత్సంతానంగా పుట్టిన బిడ్డలను పెంచి పెద్దచేయడం, ఇద్దరి తల్లి దండ్రులను గౌరవించి ఆదరించడం వృద్ధాప్యంలో తోడు నీడగా జీవన సంధ్యను గడుపు కోవడం" (విశాలాంధ్ర దినపత్రిక: జూన్ 16, 2012). ఈవిధంగా వివాహ సంబంధాలు సామాజిక జీవనంలో ఎంతో పటిష్టంగా ఉండేవి.

అయితే ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో వివాహ వ్యవస్థలో భిన్నమార్పులు వస్తున్నాయి. నేడు యువతీ యువకులు ఉద్యోగాలు, చదువులు కేరీర్ విషయాల్లో పడి వివాహాల పట్ల సుముఖత ప్రదర్శించుట లేదు. నేడు ముప్పై సంవత్సరాలు దాటినా యువతీయువకుల్లో వివాహాల పట్ల ఉత్సాహం లేకపోవడం ఆలోచించాల్సిన పరిణామమే. ఈనాడు సమాజంలో వివాహబంధాలు ఆత్మీయత అనుబంధాల కన్నా డబ్బే సర్వస్వంగా మారిపోయింది. అందుకే 'యువత ముందు డబ్బు, ఉద్యోగం తర్వాత పెళ్ళి' అనే భావనలో పడిపోయింది. వివాహ విషయాల్లో కూడా సమాజంలో విశిష్టమైన పరిస్థితులు కనబడుతున్నాయి. ఈనాటి యువతీయువకులు ముఖ్యంగా అమెరికా సంబంధాలంటేనే ఆసక్తి చూపుతున్నారు. ఒకనాడు సామాజిక సంబంధాలు, కుటుంబ సంబంధాలు వివాహాల్ని శాసించేవి. అయితే నేడు డబ్బు, డాలర్లు, అమెరికా వంటి అంశాలు వివాహ సంబంధాలను పెంపొందిస్తూ కూలుస్తున్నాయి.

'సుధామూర్తి' రచించిన 'డాలర్ కోడలు' నవల ఈనాటి సమాజంలో వివాహ స్థితిగతుల్ని చక్కగా వివరించింది. మారిపోయిన వివాహవ్యవస్థ పద్ధతులు, పెళ్ళి వరున్ని కొనుక్కోవడం పెళ్ళి

కాకుండానే ఒకరి కొకరు సహజీవనం చేయడం, పెరిగి పోతున్న విడాకులు మొదలైన విషయాలన్నింటిని ఈ నవలలో చిత్రించింది.

నేడు సమాజంలో మధ్యతరగతి, ఉన్నత వర్గాలవారికి అమెరికా వివాహ సంబంధాలు ఒక సామాజిక హోదాకు సంబంధించినవిగా పరిణమించాయి. ఈనాడు ఉన్నత, మధ్య తరగతి వర్గాల వారు అమెరికా అల్లుళ్ళనే కోరుకొంటున్నారు. వారు దాని కోసం ఎంతకైనా పరితపిస్తున్నారు. ఆస్తులను అమ్మి అయినా, అప్పులు చేసైనా అమెరికా సంబంధాల కోసం వెంపర్లాడుతున్నారు. డాలర్ కోడలు నవలలో శ్యామన్న గౌరమ్మ దంపతులు వీరికి శేఖర్, గిరీశ్, సురభి ముగ్గురు పిల్లలు. శేఖర్ వివాహమై అమెరికాలో ఉద్యోగం చేస్తుంటాడు. గిరీష్ కూడా వివాహం అయి భార్యతో కలిసి ఇంటి దగ్గరే ఉంటాడు. గౌరమ్మకు అమెరికాన్న అక్కడి డాలర్లన్నా విపరీతమైన వ్యామోహం అందుకే కూతురు సురభికి కూడా అమెరికా సంబంధం తేవాలని పరితపిస్తుంది. “గౌరమ్మ మరింత చురుకుగా సంబంధాలు వెతకసాగారు. పెళ్ళి బ్రోకర్‌తో మాకు ఇక్కడ వరుడొద్దు అమెరికా వరుడు కావాలి. ఉంటే చెప్పండి ఎంత ఖర్చయినా పరవాలేదు.” (సుధామూర్తి: 2008;పుట –57) అంటూ పెళ్ళి బ్రోకర్‌తో చెబుతుంది. పై విషయాన్ని పరిశీలిస్తే ఈ ఒక్కమాట నేడు సమాజంలో అమెరికా వరులకు ఉన్న డిమాండ్‌ను తెలియజేస్తుంది.

“మరో వైపు ప్రపంచీకరణ నేపథ్యంలో వివాహ సంబంధాలు నేడు మూడు రోజుల ముచ్చటగా మారుతున్నాయి. అధిక సంఖ్యలో నేడు వివాహజంటలు విడాకులు పొందుతున్నాయి. ప్రపంచీకరణ ప్రభావంతో చిన్న వయసులో చిన్న కారణాలతో విడిపోయి విడాకులు తీసుకున్న వారి కోసం ‘సెకండ్ షాదీ. కామ్’ పేరుతో ఢిల్లీ కేంద్రంగా ఒక వెబ్‌సైట్ (పునర్వివాహసంస్థ) జూన్ 2007లోనే ప్రారంభించారంటే జీవితంలో వివాహబంధంతో కొనసాగవలసిన వయసులోనే విడిపోతున్న వారి సంఖ్య విపరీతంగా పెరిగిందని అర్థం. 25 – 40 సంవత్సరాల మధ్య వయసులో పునర్వివాహం కోసం ఎదురు చూస్తున్న వారి సంఖ్య 2,30,000లకు చేరిందంటే ఈ సమస్య తీవ్రతను అంచనా వేయవచ్చు” (విశాలాంధ్ర దినపత్రిక: మే 9, 2012)

ప్రపంచీకరణ ప్రభావంతో భారతదేశ సంస్కృతి, మానవీయ విలువలు, కుటుంబ సంబంధాలు, నీతి నియమాలు, వివాహబంధ విలువలు నాశనం అవుతున్నందు వలన అధిక సంఖ్యలో యువతీ యువకులు విడాకులను ఆశ్రయిస్తున్నారు. ప్రపంచీకరణ ఆర్థిక సరళీకరణ దుష్ప్రభావాలను విద్యార్థులకు ప్రత్యేకించి నేటి యువతకు విశదీకరించి చెప్పాలి. లేదంటే మన

బావిభారత యువతీయువకుల భవిష్యత్తు అశాంతి, అంధకారమయం, సమస్యలనిలయం కావడం కుటుంబ వ్యవస్థ, సమాజం విచ్ఛిన్నం కావడం ఖాయం.

## 5.8 మానవ సంబంధాలు

మనిషి మనిషికీ మధ్య ఉండే సంబంధమే మానవ సంబంధం. మానవుడు తనకు ఊహ తెలిసిన తర్వాత తన, పర అనే భేదాలు తన చుట్టూ ప్రపంచంలో ఉన్నాయని తెలుసుకొంటాడు. తరతరాలుగా మనిషికి వస్తున్న కట్టుబాట్లు, సాంస్కృతిక సంప్రదాయాలతో జీవనం కొనసాగిస్తారు. ఈక్రమంలో ప్రతి మనిషి ఇతర మనుషులతో సంబంధాలను కలిగి ఉంటాడు. ఈ సంబంధాలు మనిషి పుట్టుకతోనే ఏర్పడతాయి. "మనిషి తాను జన్మించడంతోనే తనకు తెలియకుండానే ప్రకృతిలో తాను నివశించబోయే సమాజంలో సంబంధాన్ని కలిగి ఉంటున్నాడు. మనిషి ప్రకృతిలో తోటి వ్యక్తితో తన సంస్కృతిలో క్రమంగా సంబంధంలోకి వస్తున్నాడు" (వెంకటేశ్వరరెడ్డి, అన్నపురెడ్డి:1991; పుట–17) ఈవిధంగా పుట్టుకతోటే ఏర్పడే సంబంధాలు జీవన క్రమంలో ప్రేమసంబంధాలు ఇలా ఎన్నో సంబంధాలు మనిషికి ఏర్పడతాయి. సమాజం యొక్క లక్ష్యం పరస్పరం ఒకరికొకరు సహకరించుకోవడం. సంఘ జీవనంలో మనిషి ఎప్పుడు ఒంటరిగా బతకటంకుదరదు. నిరంతరం ఎవరితోనో ఒకరితో ప్రతి మనిషి సంబంధాలను కలిగి ఉంటాడు. ఇలా ఏర్పడే మానవసంబంధాలు సామాజిక వ్యవస్థకు అనుగుణంగా మార్పు చెందుతాయి. "సామాజిక వ్యవస్థలో సంస్కరణలు వచ్చినప్పుడు మానవ సంబంధాల్లోనూ సంస్కరణలు వస్తాయి. సామాజిక వ్యవస్థలో గుణాత్మక మార్పులు వచ్చినప్పుడు మానవ సంబంధాల్లోనూ గుణాత్మక మార్పులే వస్తాయి. ఒకరకంగా చెప్పాలంటే మానవసంబంధాల చరిత్రే సమాజ చరిత్ర అవుతుంది." (రాములు, బి. ఎస్:2001; పుట- iii)

ప్రస్తుత సామాజిక జీవనంలో పెరుగుతున్న 'ఆధునికత' మానవ జీవితాల్లో కొన్ని వికృతమైన మార్పులను తీసుకువస్తోంది. నేడు ఆధునిక జీవితంలో ప్రతి మనిషి బిజీ జీవితానికి అలవాటుపడుతున్నాడు. నగరాల్లో నివసించే ప్రజల జీవన విధానాల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. నేడు సమాజంలో ప్రతి ఒక్కరి దృష్టి డబ్బు సంపాదనపైనే పడింది. ఫలితంగా మానవ సంబంధాలు 'మనీ' సంబంధాలుగా మారిపోతున్నాయి. దీంతో మనుషుల మధ్య సహజమైన ఆత్మీయత, ప్రేమ, అనుబంధాలు లోపిస్తున్నాయి.

## 5.8.1 కుటుంబ సంబంధాలు

కుటుంబం అంటే ఏమిటి? ఈ సంబంధాలు ఎలాకొనసాగుతాయి? అని మనం ఒక్కసారి ఆలోచిస్తే...అనేక మంది సభ్యులతో కూడుకున్న ఒకానొక వ్యవస్థగా దీన్ని పేర్కొనవచ్చు. మానవుడు జన్మించింది మొదలు ఏర్పడే మొట్టమొదటి అనుబంధం కుటుంబంతోనే ఏర్పడుతుంది. తల్లి, తండ్రి, అక్క, చెల్లి, అన్న, తమ్ముడు మొదటగా ఏర్పడే అన్ని సంబంధాలు దీంతోనే ప్రారంభమవుతాయి. వ్యక్తి రాగద్వేషాలు, సుఖశాంతులు, ఆనందోద్వేగాలు ఈవిధంగా ఆలోచిస్తే చాల వరకు సంబంధాలన్ని కుటుంబ పరిధిలోనే ఇమిడి ఉన్నాయి. సమస్త రంగాలలో పెనుమార్పులు తీసుకు వచ్చిన ప్రపంచీకరణ మానవసంబంధాలు, కుటుంబ సంబంధాల్లోనూ మార్పులు కలుగజేసింది. ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో 'డబ్బు' ప్రధానంగా మారి కుటుంబ సంబంధాలను కూడా ధ్వంసం చేస్తుంది. "ఇప్పుడు సకలం ధ్వంసం కావడం అంగీకరించక తప్పని వాస్తవం. మానవీయ విలువలు ఉద్వేగాల్ని హరించుకుపోతాయి. బరువుగా ఏదో తప్పదన్నట్లుగా బతకడం మనుషుల రీతి అవుతుంది." (గుడిపాటి:2004; పుట – 44)

డబ్బు, డాలర్‌తో కుటుంబ సంబంధాలు ఏ విధంగా శాసించబడుతున్నాయో చిత్రించిన నవల సుధామూర్తి రచించిన 'డాలర్‌కోడలు'. గౌరమ్మ శ్యామన్న దంపతులకు ఇద్దరు కొడుకులు వీరంతా హైదరాబాద్‌లో నివాసం ఉంటారు. చిన్న కొడుకు గిరిష్ అతడి భార్య వినుత. వినుత ఒక ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూ భర్త, అత్త, మామలకు తోడుగా ఉంటుంది. పెద్దకొడుకు శేఖర్ అతడి భార్య జమున. శేఖర్ అమెరికాలో ఉద్యోగం చేస్తుంటాడు. గౌరమ్మకు రూపాయి కోడలు వినుత కన్నా అమెరికా జమున అంటే ఎక్కువ ఇష్టం. ఆమె దృష్టిలో రూపాయికి విలువలేదు. ఆమె దృష్టి కేవలం డాలర్ల వైపే. వినుత ఇంటి దగ్గర ఎన్ని పనులు చేస్తూ వీరికి తోడ్పడినా గౌరమ్మకు మాత్రం జమునంటేనే ప్రేమ. కొడుకు, కోడలు కోరికమేరకు గౌరమ్మ ఒక సంవత్సరం పాటు అమెరికా వెళ్ళి శేఖర్ జమునల దగ్గర ఉంటుంది. అప్పుడు అసలు విషయం గౌరమ్మకు అర్థమవుతుంది. డాలర్ల ముసుగులో తన కోడలు జమున తమను ఎంత తక్కువగా చూస్తుందో అర్థమవుతుంది. డబ్బు, డాలర్లు కుటుంబ సంబంధాలను కూడా ఎలా ధ్వంసం చేస్తూన్నాయో గౌరమ్మ అమెరికా వెళ్ళిన తర్వాత తెలుసుకుంటుంది. మరో వైపు డాలర్లపై ప్రేమతో గౌరమ్మ తన చిన్న కోడలును ఎలా నిర్లక్ష్యం చేసిందో ఇపుడు పశ్చత్తాప పడుతుంది.

వినుత తల్లి లేని అనాథ. తన ప్రేమ, ఆప్యాయతల కోసం ఎంత పరితపించి పోయిందో దాని యందు ఎంత నిర్లక్ష్యంగా ప్రవర్తించింది తను? పదేపదే గౌరమ్మ కళ్ళముందు వినుత రూపం కదలాడ సాగింది. వినుతకు ఏమీ చేయలేదన్న బాధ ఆమెను దహించసాగింది. ఆమెకే నాడు ఒక మంచి చీర కొనివ్వలేదు. తన దగ్గరున్న బంగారాన్ని జమునకు కొత్త గాజుల రూపంలో ఇచ్చినా వాటికి విలువ లేకుండా పోయింది. ఇదే కనుక వినుతకిచ్చినట్టయితే? "అత్తగారిచ్చారని అందరికీ చూపిస్తూ ఎంతో గర్వపడేది, మురిసిపోయేది ఆమెను ఏమాత్రం లెక్క చెయ్యలేదు. అందుకే పురిటికి బెంగుళూరు వెళ్ళి పోయింది. కేవలం జమున కోసమే అన్నట్టు సురభి పెళ్ళి రోజు నిశ్చయం చేసింది. వినుత కొడుకు హర్ష నామ కరణానికి కేవలం వంద రూపాయలు ఇచ్చింది. అదేజమున కూతురు మానసికి బంగారు గొలుసు, ఖరీదైన గౌను ఇచ్చింది. సొంత డబ్బుతో కొని చూలింతకి ఒక్క బ్లౌజ్ ముక్క కూడా ఇచ్చిన పాపాన పోలేదు తను. గిరిశ్‌కి తక్కువ జీతం కాబట్టి దానికెందుకంత ఖరీదైన దివ్వటం? అన్న చులకన భావం వినుతపై ఉండేది. జమునకి ఐదువేల రూపాయల ఆకుపచ్చ పట్టుచీర తెచ్చింది. కాని ఆమె దాన్ని ఏదో తక్కువ చీర అన్న భావనతో మూల పారేసింది. ఒక్కసారి కూడా కట్టుకోలేదు ఆమె దృష్టిలో ఐదువేలకు విలువలేదు." (సుధామూర్తి: 2006; పుట –121) అంటూ గౌరమ్మ తన ఇద్దరు కోడళ్ళ గురించి వ్యక్తీకరించే అభిప్రాయం ఆలోచింపచేస్తుంది.

డాలర్ కోడలైన జమునను అధికంగా ప్రేమించి, రూపాయిలు కోడలు అయిన వినుతను నిర్లక్ష్యం చేస్తుంది గౌరమ్మ. అమెరికా వెళ్ళిన గౌరమ్మ జమున అసలు స్వరూపం తెలిసి నిర్ఘాంత పోతుంది. జమున దృష్టిలో డాలర్లు పడేస్తే తన అత్త, చోళ్ళు కారుస్తుంది అని జమున ఉద్దేశ్యం. జమునలోని ఈ విషయాన్ని గమనించిన గౌరమ్మకు ఒక విషయం అర్థమవుతోంది. వినుత తనను ఎంతో ప్రేమగా చూసుకుంటోంది. అయినా తను వినుతను నిర్లక్ష్యం చేసింది. ఏ డాలర్ కోడల్ని ఐతే తాను అధికంగా ప్రేమించిందో ఆమె చేతిలోనే నేడు గౌరమ్మ పొందింది అవమానం. నేడు డాలర్లు కుటుంబాలను ఏవిధంగా శాషిస్తున్నాయో కుటుంబ సంబంధాలను ఎంతంగా ధ్వంసం చేస్తున్నాయో మనకు అర్థమవుతుంది.

### 5.8.1.1. తల్లిదండ్రులకు పిల్లలకు గల సంబంధం

#### 5.8.1.1.1. తల్లిదండ్రులు పిల్లలపై చూపే అత్యుత్సాహం

ఆధునిక సమాజంలో బిజీ జీవితానికి అలవాటు పడ్డ కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకం పట్ల పెద్దగా ఆసక్తి చూపడంలేదు. నేటి సమాజంలో భార్యభర్తలిద్దరూ తమ దృష్టిని ఉద్యోగాల వైపు, డబ్బు సంపాదించే మార్గాల వైపు ఉంచుతూ తమ పిల్లలకి కావలసిన ఆలనా పాలన విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో పిల్లలు తల్లిదండ్రుల మధ్య ఉండవలసిన అనుబంధం ఉండటం లేదు. మరికొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలపట్ల విపరీతమైన ఉత్సాహం చూపిస్తున్నారు. తమ ఆశలు, కోర్కెలు, ఆశయాలు అన్నింటిని తమ పిల్లలపై రుద్ది వారి ద్వారా తమ కలల్ని నిజం చేసుకోవాలనే ఆలోచనల్తో పిల్లల్ని విపరీతమైన ఒత్తిడికి గురిచేస్తున్నారు.

ఆధునిక సమాజంలో పిల్లలు పుట్టింది మొదలుకొని వారి విద్యను ఇంటర్నేషనల్ స్కూల్లో ప్రారంభింపచేస్తున్నారు. దీనికోసం వేలు మొదలుకొని లక్షలు కుమ్మరించి కార్పొరేట్ కాలేజీల వెంట పరుగులు తీస్తున్నారు. నేటి తరం తల్లిదండ్రులు తమ పిల్లల్ని గొప్ప వాళ్ళుగా చేయాలనే ఉద్దేశ్యంతో చిన్నతనం నుంచే వారిని చదువుల్తో బందీలుగా చేస్తున్నారు. దీంతో పిల్లలు తమ బాల్యం, స్వేచ్ఛలనూ కోల్పోతున్నారు. అటువంటి స్థితిలో వారు తీవ్ర ఒత్తిడికి గురై చివరకు ఆత్మహత్యలను ఆశ్రయిస్తున్నారు. ఇంకొందరు పిల్లలు ఇళ్ళ నుంచి పారిపోతున్నారు. మరికొందరు వివిధ వ్యసనాలకు బానిసలవుతున్నారు.

సింహప్రసాద్ రచించిన 'డాలర్.....!.....డాలర్!' నవల పిల్లలపై తల్లిదండ్రుల అత్యుత్సాహాన్ని వివరిస్తుంది. అత్యుత్సాహం వల్ల పిల్లల పరిస్థితి ఏవిధంగా తయారవుతుందో ఈ నవలలో సింహప్రసాద్ చక్కగా వివరించారు.

ఈ నవలలో ముకుందం తన కుమారుడి లక్ష్యాన్ని తెలియజెప్పడానికి ఒక పోస్టర్ తెచ్చి ఇంటిలో అతికిస్తాడు. "దీన్నెందుకు అతికించానో తెలుసా అంటూ కొడుకు దొరబాబుని అడుగుతాడు. ఎందుకో తెలియని దొరబాబు తండ్రి ప్రశ్నకు సమాధానంగా తల అడ్డంగా ఊపుతాడు. నీ లక్ష్యాన్ని తెలియజెప్పడానికి అనుక్షణం నీ గమ్యమేమిటో నీకు గుర్తు చెయ్యడానికి ఒక్క మాటలో చెప్పాలంటే నీ పథక నిర్దేశకర్త ఈ పోస్టర్ ఇవన్నీ నువ్వు సాధించాలి. గొప్ప వాడివి

కావాలి. తరగని సంపదలు నీ సొంతం కావాలి. ఈ భూమ్మీద అరుదైన అదృష్టవంతుల్లో నువ్వొకడివి కావాలి.

"మన బాబు అదృష్ట జాతకుడండీ తప్పకుండా గొప్పవాడవుతాడు" టెన్తులో, ఇంటర్లో, యంసెట్‌లో ర్యాంకులు సాధించాలి. ఇంజనీరింగ్‌లో గోల్డ్ మెడల్ సంపాదించాలి. అమెరికా వెళ్ళాలి. నీ వయస్సు వారికి సాధ్యం కాని వన్నీ సాధించాలి చెప్పరా బాబు ఇవన్నీ సాధిస్తావు కదూ నా స్వప్నాలని సత్యాలు చేస్తావు కదూ. చెప్పరా చెప్పు" (సింహప్రసాద్: 2010;పుట -7) అంటూ ఊగిపోతూ అడుగుతాడు ముకుందం తన కొడుకును.

తండ్రి కలలు ఆశయాలు కలలకు తగ్గట్టుగానే దొరబాబు టెన్త్, ఇంటర్ యంసెట్, బి.టెక్ పాసై అమెరికా వెళ్ళి ఉద్యోగం చేస్తాడు. తర్వాత తల్లిదండ్రులు దొరబాబుకు హైదరాబాద్‌లో ఉండే ధనవంతుల అమ్మాయితో వివాహం చేస్తారు. ఇద్దరూ కలిసి అమెరికా వెళ్ళి పోతారు. భార్యకు కూడా డబ్బుపై ఎనలేని వ్యామోహంతో దొరబాబును నిరంతరం డబ్బు అధికంగా సంపాదించమని వేదిస్తుంది. ఈ పరిస్థితుల్లో ఒక వైపు తల్లిదండ్రుల ఒత్తిడి, మరొకవైపు భార్య ఒత్తిడితో దొరబాబు డ్రగ్స్ కు అలవాటుపడి చివరకు ఆత్మహత్య చేసుకుంటాడు. ఈ నవలలో రచయిత పిల్లలపై తల్లిదండ్రుల అత్యుత్సాహం వలన కలిగే దుష్ఫలితాలను చక్కగా చిత్రించారు.

ఈనాటి పిల్లలపై బలవంతపు చదువులు రుద్దుతూ కొందరు తల్లిదండ్రులు పిల్లల బాల్యాన్ని హింసిస్తున్నారు. వారికి ఇష్టంలేని చదువులు చదివిస్తున్నారు. యంసెట్ మాయలో పడిన తల్లిదండ్రులు కార్పొరేట్ కాలేజీల బంధీలో తమ పిల్లల భవిష్యత్తును, వారి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, చివరికి వారి జీవితాలను ఏ విధంగా ఛిదిమేస్తున్నారో విస్తృతంగా చర్చించిన మరో నవల సలీం రచించిన 'పడగనీడ'

## 5.8.1.1.2. తల్లిదండ్రులు పిల్లలపై చూపే బాధ్యతారాహిత్యం

నాటి సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లల్ని తమ కంటి పాపలుగా పెంచేవారు. అయితే ప్రస్తుత ప్రపంచీకరణ యుగంలో ఆ పరిస్థితి మారిపోతోంది. గ్రామాల్ని మినహాయిస్తే పట్టణాలు నగరాల్లో అధిక శాతం తల్లిదండ్రులు ఉద్యోగాల్లో ఉంటున్నారు. భార్యాభర్తలు ఎవరికి వారే సంపాదించడం, ఎవరి జీవితం వారిదే అన్నట్టుగా నేడు నగరాల్లో నివసిస్తున్న దంపతుల్లో ఇలాంటి

పరిస్థితి కనబడుతోంది. దీంతో దంపతుల్లో పిల్లల పెంపకం పట్ల ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. మరికొద్ది మంది తల్లిదండ్రులకు తమ పిల్లలు ఏం చేస్తున్నారు? ఎలా ఉన్నారు? ఎలా చదువుతున్నారు అని కూడా ఆలోచించటం లేదు. నేటి ఈ పరిస్థితులకు కారణం నిస్సందేహంగా ఆర్థిక ప్రపంచీకరణే. నేడు మనుషులు కేవలం డబ్బు సంపాదించే యంత్రాలుగా మారి కుటుంబ సంబంధాలను, పిల్లల పట్ల కనీస బాధ్యతలను విస్మరిస్తున్నారు. 'సింహప్రసాద్' రచించిన 'తమాసోమా...!' నవల తల్లిదండ్రులు తమ పిల్లలపై చూపే బాధ్యతారాహిత్యాన్ని వివరిస్తుంది.

## 5.8.1.2 భార్యా భర్తల మధ్య సంబంధం

"నమ్మకం, గౌరవం, కష్టాలు వచ్చినపుడు ఒకరికొకరు అండగా నిలబడడం మానసికంగా ఆలంబన కలగజేయడం మనసా, వాచా కర్మేణా తన భాగస్వామితోనే జీవన సౌఖ్యాలను పొందడం, సత్సంతానంగా పుట్టిన బిడ్డలను పెంచి పెద్ద చేయడం ఇద్దరి తల్లిదండ్రులను గౌరవించి ఆదరించడం, వృద్ధాప్యంలో తోడూనీడగా జీవన సంధ్యను గడుపుకోవడం! అదే అన్యోన్యత" (విశాలాంధ్ర దినపత్రిక : జూన్,19, 2010) అయితే ప్రపంచీకరణ ప్రస్తుత యుగంలో డబ్బే ప్రధానంగా అన్ని సంబంధాలను నిర్మిస్తుంది. ధ్వంసం చేస్తోంది. అనాటి అన్యోన్యత నేటి సమాజంలోని దంపతులలో సన్నగిల్లుతోంది. దీనికి కారణం మనీ సంబంధాలే నేడు మానవ సంబంధాలుగా రూపాంతరం చెందుతుండటం.

"మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అని కారల్ మార్క్స్ ఏనాడో చెప్పాడు. అది నిజమేనని నేడు సమాజం నిరూపిస్తోంది. మానవ సంబంధాల్లో ఆర్థిక పరమైన అంశాలకే మనుషులు ప్రాధాన్యం ఇస్తున్నారు. మానవుడు సంఘజీవి తన తోటి వారితో కుటుంబ సభ్యులతో ప్రేమానురాగాలతో ఉండాల్సింది పోయి మనిషి నేడు ఆర్థిక విషయాలకే ప్రాధాన్యం ఇవ్వడం విచారకరం. మనిషిలో పెరుగుతున్న స్వార్థం, డబ్బు మీద పెరుగుతున్న మోజు కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి." (ప్రజాశక్తి: అక్టోబర్ 5, 2012) పై వాక్యాలు ప్రస్తుతమున్న సామాజిక సంబంధాలకు అద్దం పడుతున్నాయి. నేటి కంప్యూటర్ యుగంలో భార్యాభర్తల మధ్య సంబంధాలు కూడా ఆర్థికపరమైన అంశాలతో ముడిపడి ఉండటం గమనార్హం.

'సింహప్రసాద్' రాసిన 'డాలర్'.....! డాలర్...! నవల భార్యాభర్తల మధ్య ఆర్థిక సంబంధాలు ఏవిధంగా ఆత్మీయ సంబంధాలను ధ్వంసం చేస్తున్నాయో వివరిస్తుంది. ఈ నవలలో ఇంద్రాణి దొరబాబుని భర్తగా కాక ఒక డబ్బు సంపాదించే యంత్రంగా చూస్తుంది. తన భర్త లక్షల కోట్లు ఆర్జించడమే ఆమె ధ్యేయం భార్యభర్తల మధ్య ఉండాల్సిన అన్యోన్య దాంపత్యం స్థానంలో ఇంద్రాణి వలన డబ్బే ప్రధాన అంశంగా మారుతోంది. ఆమె ధన దాహానికి ఒకింత అయోమయం ఆవేదనకు గురై దొరబాబు మనసులోనే ఇలా అనుకుంటాడు.

"డబ్బు!సంపద!సుఖం!స్వర్గం!

నిన్నటి దాకా డాడీకల – ఆశ –ఆకాంక్ష అది!

ఇవాళ ఇంద్రాణికల –ఆశ –ఆకాంక్ష అదే!

ఇద్దరిమద్యాతను?

ఇద్దరి కోర్కెలను ఆ దరికి చేర్చే పడవతను!

భోరున ఏడ్వాలన్న కోరికను బలవంతంగా నిగ్రహించుకున్నాడు బాబు. అన్నీ అందర్నీ మర్చి పోవడానికి కంప్యూటర్ ముందు కూర్చున్నాడు. క్షణాల్లో అందులో నిమగ్నమైపోయాడు

ఇంద్రాణి చూసింది.

తన మాటల్ని మన్నించి కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌కు సంబంధించిన పరిశోధనలో నిమగ్నమై పోయినందుకు పొంగిపోయింది.

ఇలాగే రాత్రి పగలూ శోధిస్తే పరిశోధిస్తే – అతడి విజయం విలువ లక్షల కోట్ల డాలర్లవుతుంది.

అప్పుడిహ.....ఓహ్!ధనవంతుల్లో కెల్లా ధనవంతులై పోతారు.

అక్షరాల ఆనంద నాట్యం చేసింది ఇంద్రాణి" (సింహప్రసాద్ : 2010 ; పుట –114) పై వాక్యాలను పరిశీలిస్తే భర్త కష్ట, నష్టాలను, బాధల్లో సాంత్వన కలిగించాల్సిన భార్య ఇంద్రాణి కేవలం డబ్బు కోసమే వెంపర్లాడటం మనకు తెలుస్తుంది. ఈవిధంగా నేడు భార్యాభర్తల్లో కూడా డబ్బు చిచ్చుపెట్టి మానవ సంబంధాల్ని మనీ సంబంధాలుగా మారుస్తోంది.

## 5.9. అవినీతి

నేడు ప్రపంచంలో అవినీతి అతిపెద్ద సామాజిక సమస్యగా మారింది. ప్రపంచంలోని అన్ని దేశాల్లో  ఈ అవినీతి విలయ తాండవం చేస్తోంది. అవినీతి అంటే సాధారణార్థంలో ఒక వ్యక్తి కాని ఏదైనా ఒక సంస్థగాని నిజాయితీగా కాకుండా అక్రమంగా సొమ్మును సంపాదిస్తే దాన్ని 'అవినీతి'గా మనం చెప్పవచ్చును. ప్రపంచంలోని ఇతర దేశాల్తో పోలిస్తే భారతదేశంలో ఈ సమస్య అధికంగా ఉంది. ప్రస్తుతం అటెండర్ స్థాయి నుంచి ఐ.ఎ.ఎస్.ఆఫీసర్ వరకు పంచాయితీ సర్పంచ్ మొదలు పార్లమెంట్ నాయకుల వరకు ఈ అవినీతి చాపకింద నీరులా విస్తరించింది. ప్రస్తుత ప్రపంచీకరణయుగంలో ఈ అవినీతి అధికంగా పెరిగిపోయింది. అయితే అవినీతి భారతదేశంలో నేడు కొత్తగా ఉత్పన్నమైన సమస్య **కా**నప్పటికీ ప్రపంచీకరణ మూలంగా దాని విస్తృతి ఇంకా అధికమైంది అని చెప్పడంలో సందేహం లేదు. ఎందుకంటే ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకరణ మూలంగా భారతదేశంలోకి విదేశీ బహుళజాతి సంస్థలు ప్రవేశించాయి. ఈ సంస్థలు భారతదేశంలో వస్తువినియోగ సంస్కృతిని పెంచి పోషిస్తున్నాయి. వస్తు వ్యామోహవాదాన్ని పెంపొందిస్తున్నాయి. ఫలితంగా వస్తు వినియోగ సంస్కృతిని అలవరచుకున్న అధికారులు ప్రపంచీకరణ మరింతగా విస్తరించాలని కోరుకుంటున్నారు.

"ప్రపంచీకరణ, పెట్టుబడిదారీ సంస్కృతి ఈ వ్యవస్థలో ఉన్న రకరకాల ఉన్నత వర్గాలకు ఐ.ఎ.ఎస్. ఆఫీసర్లకు ఏమిచ్చిందని వాళ్ళు ప్రపంచీకరణ జరగాలని కోరుకుంటున్నారు? లంచం ఇచ్చిందని చెప్పక తప్పదు. ఈ ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. అధికార్లు మనం సెక్రటేరియట్‌కి వెళితే ఒకప్పుడు లంచగొండితనం మరిగిన వాళ్ళు ఒక్కళ్లో, ఇద్దరో కనబడేవారు. కాని ప్రపంచీకరణ మొదలైన తర్వాత ఉన్న అధికార్లందరిలో ఒక్కరో ఇద్దరో నిజాయితీపరులు, మిగిలిన వారందరూ కరప్ట్ అని తెలుస్తుంది. జూబ్లీహిల్స్ ప్రక్కన ఉన్న 'ప్రకాశ్ నగర్' వెళ్ళి చూస్తే ఒక్కొక్క అధికారి కోట్ల రూపాయలు పెట్టి ఇల్లు కట్టుకున్నారు. వీరందరూ ఈ విధమైన సుఖ లాలసతకు మరిగిన తరువాత ప్రపంచీకరణ ఫలితంగా వచ్చిన ఈ హోదాతో ప్రపంచీకరణ జరగాలని కాక వారు మరేం కోరుకుంటారు? (వేణుగోపాల్,ఎన్:2011;పుట–191) ప్రస్తుతం భారతదేశంలో రాజకీయ అవినీతి అధికంగా పెరిగింది. "ఈ దేశంలో ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన మెజారిటీ ఎంపీలు, ఎంఎల్ఎలు అవినీతి నేరంలో భాగస్వాములు. మీరు మన ఎంపీల ఆస్తులు 2004లో ఎలా ఉన్నాయో, 2009లో ఎలా ఉన్నాయో పరిశీలించండి. ఒక్కొక్కరి ఆస్తులు వెయ్యి రెట్లు.

అయిదు వేల రెట్లు, ఏడు వేల రెట్లు పెరిగి పోయాయి. ఈ పెరుగుదలలో కూడా మహారాష్ట్ర, పంజాబ్, ఆంధ్రప్రదేశ్‌లు మొదటి స్థానంలో ఉన్నాయి. మహారాష్ట్రలో 2004 ఎన్నికల్లో 104 మంది కోటీశ్వర్లు గెలిచారు. ఈ సంఖ్య 2009 ఎన్నికల తరువాత 186కు పెరిగింది. కాని మహారాష్ట్ర శాసనసభలో మొత్తం సభ్యుల సంఖ్య 288. వీళ్ళలో 186 మంది ప్రకటిత కోటీశ్వర్లు ఇంకా ప్రకటించని కోటీశ్వర్లు మరో వంద మంది వరకు ఉన్నారు. అధికారికంగా తీసుకున్న 2004 నుండి 2009 మధ్య కోటీశ్వరుల సంఖ్య 70 శాతం పెరిగింది. (సాయినాథ్, పాలగుమ్మి:2012:పుట –5) ఈవిధంగా భారతదేశంలో అవినీతి నానాటికి పెరిగిపోతుంది.

అవినీతి లంచగొండితనం గురించి విస్తృతంగా చర్చించిన నవల 'సింహప్రసాద్' రచించిన 'తమసోమా' గాంధీ తండ్రి డి.సి.టీ.ఓ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తుంటాడు. ఉద్యోగంలో అవినీతికి అలవాటుపడి చాలా ఆస్తులు సంపాదిస్తాడు. గాంధీ ఒకసారి తల్లిని తన తండ్రి ఉద్యోగానికి ముందున్న ఆస్తుల నుంచి ప్రస్తుత ఆస్తుల వరకు ఎలా సంపాదించారని అడుగుతాడు. తల్లి గాంధీ అడిగిన ప్రశ్నలకు తడబడుతుంది. తీవ్రస్వరంతో గాంధీ ప్రశ్నిస్తాడు తల్లిని. ఇదంతా గమనిస్తున్న తండ్రి 'లంచాలు తీసుకుని' అంటూ ఆగ్రహంతో వూగిపోతూ "చెప్పరా ఏం చేస్తావో చెప్పు. ఈ ఇల్లు ఈ ఫర్నీచరూ, మీ మమ్మీ మెడలోని నగలూ, నీ ఒంటి మీది బట్టలూ, నీకు కట్టిన ఫీజులూ, ఆఖరికీ నువ్వు తిన్నతిండీ అంతా లంచంతో వచ్చిందేరా నేనే కాదు నూటికి తొంభైమంది అధికారులిలాగే బతుకుతున్నారు. ఏం చేస్తావురా. చెప్పు! ఇది తప్పు అని మా అందరికీ నీతి పాఠాలు చెబుతావా? అవినీతి బురదని కడుక్కోమని బతిమాల్తావా? ఏసీబి వాళ్ళకి చెప్పి పట్టిస్తావా? చెప్పరా" (సింహప్రసాద్ : 2012; పుట –88) అంటూ గాంధీని ప్రశ్నిస్తాడు తండ్రి. అయితే అవినీతి అంటే గిట్టని గాంధీ మీరు చేస్తున్నది తప్పు ఆత్మద్రోహం ప్రభుత్వం దగ్గర జీతం తీసుకుంటూ ప్రజల దగ్గర లంచాలు తీసుకోవడం నేరం అంటాడు.

దానికి సమాధానంగా తండ్రి "నాకేం పచ్చకామెర్ల వ్యాధి రాలేదు. నువ్వేరంగు కళ్ళు జోడులోంచి చూస్తున్నావు. దేశం అంత గొప్పది. ఇంత గొప్పది, పుణ్యదేశం, పవిత్రదేశం, వేద భూమి, సత్యహింసల భూమి అంటూ పుస్తకాల కబుర్లు వల్లిస్తున్నావు. నువ్వనుకుంటున్న దేది నిజం కాదు. దేశంలోని నాయకులూ, కాంట్రాక్టర్లూ, అధికారులూ, వ్యాపారులూ, ఉద్యోగులు వాళ్ళు వీళ్ళూ అని కాదు. ఆస్తులు సంపాదించిన ప్రతీ వాళ్ళు అవినీతి మార్గాన అడ్డదార్లు తొక్కి సంపాదించిందేనని ఖచ్చితంగా చెప్పగలను. నీళ్ళు ప్రవహించని చోట కూడా అవినీతి జీవనదియై ప్రవహిస్తోందని ఘంటాపథంగా చెప్పగలను" (పైదే పుట –89) అంటూ గాంధీతో తండ్రి వ్యక్తం

చేసే అభిప్రాయం నేడు విశృంఖలంగా విస్తరిస్తోన్న లంచగొండితనం, అవినీతిని సూచిస్తుంది. పై వాక్యాలు ప్రస్తుతం దేశంలో ఉన్నటువంటి లంచాలు, అవినీతిని తెలియజేస్తాయి. ప్రస్తుతం భారతదేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సామాజిక సమస్య అవినీతి దీనిని నివారించాలంటే కఠినమైన చట్టాలు ఉండటం, ప్రజలు చైతన్యవంతులు కావడం ఒక్కటే మార్గం.

## 5.10 చేతి(కుల)వృత్తులు

భారత దేశ గ్రామీణ జీవన వ్యవస్థలో వ్యవసాయం తర్వాత అత్యంత ముఖ్యమైంది కుల వృత్తులు. అలాంటి వృత్తులు నేడు కనుమరుగయ్యే స్థితిలోకి నెట్టివేయ బడ్డాయి. ఒకప్పుడు చేతి వృత్తుల వారికి చేతి నిండా పని ఉండేది. అయితే మారుతున్న నాగరిక సమాజ పోకడలకు అనుగుణంగా మార్కెట్లో యంత్రాలు, కార్పొరేట్ సంస్థలు ప్రవేశించడంతో చేతి వృత్తుల వారికి పని లభించకుండా పోతుంది. ఆధునిక డిజైన్లతో కూడిన వస్తువులు, వస్త్రాలు ఇతరత్ర అందుబాటులోకి రావటంతో చేతి వృత్తుల వారి జీవనం దుర్భరంగా తయారైంది. ప్రస్తుతం అందుబాటులోకి వస్తున్న అధునాతన వస్తువుల వైపు కొనుగోలు దారులు మొగ్గు చూపటంతో నాటి చేతి వృత్తులకు ఆదరణ తగ్గిపోయింది. ఫలితంగా చేతి వృత్తిని నమ్ముకున్న వారు ప్రస్తుతం చాలీచాలని జీవనం గడపాల్సిన దుస్థితి నెలకొంది.

ఆధునికంగా సంస్కరణల వేగం పెరిగి చేతి వృత్తి దారుల బతుకులు చితికి పోతున్నాయి. చేతి వృత్తుల్లోనూ యంత్రాల రాక కార్పొరేట్ సంస్థల ప్రవేశం పెచ్చుమీరి పోయింది. ఫలితంగా చేతి వృత్తుల వారు చేయి విరిగి మూలన పడుతున్నారు. ప్రభుత్వ ప్రపంచీకరణ విధానాలు పల్లెలపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. దాని ఫలితంగా ఒకప్పుడు వెలుగు వెలిగిన కులవృత్తుల వారు నేడు కానరావడం లేదు. కులవృత్తులకు ఆదరణ తగ్గిపోవడంతో వీరు పలురంగాల్లో కూలీలుగా దర్శనమిస్తున్నారు. కొందరు పరిశ్రమల్లో, మరి కొందరు వ్యవసాయ కూలీలుగా కాలం వెళ్ళదీస్తుండగా కొంత మంది మాత్రం ఇదే వృత్తులతో, పస్తులతో కాలం వెళ్ళదీస్తున్నారు.

### పంచకర్మలు

పంచకర్మలు అంటే ఇందులో కంసరులు, స్వర్ణకారులు, వడ్రంగి, కుమ్మరులు, కమ్మరులు వస్తారు. వీరిలో కమ్మరులు ఇత్తడి వస్తువులు తయారు చేసి విక్రయిస్తుంటారు. సంస్కరణల

ప్రభావం వలన స్టీల్ వస్తువుల రాకతో వీరి వృత్తికి ఆదరణ కరువైంది. వడ్రంగి, కమ్మరులు రైతులకు కుడి, ఎడమ భుజాల వంటివారు. రైతులకు పొలం పనుల్లో అవసరమైన కర్ర సామాగ్రిని తయారుచేసి ఇవ్వడం వడ్రంగి వారి వంతైతే ఇనుప వస్తువులను తయారుచేసి ఇవ్వడం కమ్మరుల యొక్క ప్రధాన వృత్తిగా ఉండేది. అయితే వీరి వృత్తిలోకి ఆధునిక యంత్రాలు, వెల్డింగ్, భారీ వడ్రంగి మిషన్లు రావడంతో వీరి వృత్తులు దుర్భరంగా మారాయి. ఫలితంగా వీరి వృత్తులు వీరికి కూడు పెట్టని స్థితి ఏర్పడింది. మరో వైపు కుమ్మరులు ఎంతో కళాత్మకంగా నైపుణ్యంతో కుండలు తయారు చేశేవారు. వీరి కుండలు ఒకప్పుడు గ్రామాలు మొదలుకొని పట్టణాలదాకా విరివిగా ఉపయోగించే వాళ్ళు అయితే ప్రపంచీకరణ నేపథ్యంలో ఫ్రిజ్‌లు ఇతర కూలింగ్ యంత్రాలు మార్కెట్లో ప్రవేశించడంతో కుండల ఉనికి ప్రశ్నార్థకంగా మారి వాటిని తయారు చేసే కుమ్మరుల జీవితాల్లో చీకట్లు అలుముకున్నాయి.

## మాదిగలు

ప్రపంచీకరణ విధానాల వలన బహుళజాతి సంస్థలు దేశంలోకి ప్రవేశించడంతో దెబ్బతిన్న మరో చేతి వృత్తిదారు చర్మకారుడు. ఒకనాడు కిర్రుచెప్పులు చేసి దానికి పూలగుత్తి పెట్టి గ్రామ పెద్దలకు ఇచ్చి తమ పనితనం చూసి చర్మకారులు మురిసిపోయేవారు. పాదరక్షలు అందంగా తయారు చేసి ఇవ్వడం చర్మకారులకు అనాది నుండి వచ్చిన వృత్తి అయితే చర్మకారుల వృత్తి నేడు దెబ్బతిన్నది. ఈ వృత్తి పై బహుళజాతి కంపెనీల, విదేశీ కంపెనీల కన్నుపడింది. ఫలితంగా పెట్టుబడి దారులే చెప్పుల కంపెనీలు పెట్టారు. ఫలితంగా చర్మకారులు ఈ వృత్తి నుంచి దూరమయ్యారు. అభివృద్ధి క్రమంలో ఈ మార్పులు సహజమే. అయితే దేశీయ పరిశ్రమలను కూల్చుతూ నేడు విదేశీ పెట్టుబడి దారీ సంస్థలు ప్రతీరంగాన్ని ఆక్రమించుకుంటున్నాయి. ఫలితంగా ఆయా చేతి వృత్తుల వారు ఉపాధిని కోల్పోతున్నారు.

“భారతదేశంలో చెప్పుల వినియోగంలో విదేశీ కంపెనీలదే ఎక్కువగా మార్కెట్ అవుతున్నాయి. బాటా కంపెనీ జెకోస్లోవేకియాది. యిది ప్రస్తుతం ఇండియాలో లీడింగ్‌రోల్‌లో ఉంది. కెరోనా, నైక్, సావర్, ఎడిడాస్, యాక్షన్, చెరిబ్లాసమ్, కీవీ తదితర కంపెనీలన్నీ విదేశీ బహుళజాతి కంపెనీలే ఈ కంపెనీల చెప్పులు, షూస్‌లే మార్కెట్‌లో లీడింగ్‌లో ఉన్నాయి” (రంగారావు.పి.: 2002; పుట –71) ఈవిధంగా బహుళజాతి సంస్థల ఉత్పత్తులు దేశీయ కార్మికుల జీవనోపాదిని దెబ్బతీస్తున్నాయి.

## స్వర్ణకారులు

బంగారం, వెండి వస్తువులను అందంగా తయారు చేయడంలో స్వర్ణకారులది విశిష్టమైన పనితనం. రెండు దశాబ్ధాల కిందటి వరకు సంవత్సరమంతా వీరికి ఉపాధి దొరికేది. పెళ్లిళ్ళ సమయం వచ్చిందంటే వీరికి తీరికలేనంత పని ఉండేది. అయితే ఆధునికంగా బంగారం, వెండి ఆభరణాల తయారీ యంత్రాలు రావడం, సాంకేతిక నైపుణ్యం పెరిగి కొత్త డిజైన్లతో బంగారం, వెండి వస్తువులు లభ్యమవుతుండటంతో వీరి వృత్తి ప్రమాదంలో పడింది. నేడు వీరికి చిన్నచిన్న పనులు, రిపేర్లు, మెరుగులు తప్ప మరో దారి లేకుండా పోయింది. ఫలితంగా వీరి జీవనం గందరగోళానికి గురైంది.

## రజకులు

ప్రపంచీకరణ నేపథ్యంలో బహుళజాతి సంస్థలు ప్రవేశించడంతో కులవృత్తి కోల్పోతున్న మరో వృత్తిదారులు రజకులు. కొన్ని వందల సంవత్సరాల పాటు సమాజానికి తమ పనితనంతో సేవలు చేస్తూ జీవనం చేసిన వారు రజకులు. అలాంటి వీరి జీవితం నేడు ఒడిదుడుకులను ఎదుర్కొంటుంది. నేడు విదేశీ పెట్టుబడిదారుల కంపెనీలో వాషింగ్‌మెషిన్లు రకరకాల డిటర్జెంట్లు, వాషింగ్‌పౌడర్‌లు విరివిరిగా లభ్యమవుతున్నాయి. ఫలితంగా వీరి పనితనం వీటి కింద చిన్న బోయింది. "గ్రామాల్లో చాకలి బండల మీద గతంలో వినిపించిన ఉస్సోయ్...ఉస్సోయ్" మోతలు తగ్గిపోయాయి. చెరువు గట్లమీద వాగుల ఒడ్డున కాలువల ప్రక్కన చాకలులు సామూహికంగా కబుర్లాడుతూ లయబద్ధంగా ఉస్సోయ్... అంటూ అరుస్తూ బట్టలుతికి ఆరవేసే పద్ధతి అరకొరగానే మిగిలింది. సోడా ఉప్పు వేసి కాయపట్టిన బట్టల్ని ఉడక పెట్టే రోజులు గతించిపోయాయి. ఆ చాకలి పొయ్యిలు కూలిపోయాయి" (పైదే, పుట –21)

## నాయీ బ్రాహ్మణులు

ఒకప్పుడు క్షౌరవృత్తి దారులకు చక్కని ఆదరణ లభించేది. ఈ వృత్తి వారు ఏడాది పొడవునా గ్రామాల్లో వృత్తిని కలిగి ఉండేవారు. వారి జీవనానికి స్థానికంగానే ఉపాధి లభించేది. అయితే ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఈ వృత్తిలోకి పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలు ప్రవేశించాయి. అధునాతనమైన ఎలక్ట్రానిక్ మిషన్లు సెలూన్లలోకి ప్రవేశించడం క్షౌరవృత్తి దారుల చేతి పనికి గొడ్డలి పెట్టయ్యింది. ఒక వైపు ఆధునికంగా వస్తున్న ఎలక్ట్రానిక్ మెషన్లను, కార్పొరేట్

షాపులను ఏర్పాటు చేసుకొనే స్తోమత వీరికి లేక పోవడంతో వీరి జీవనం గగనమైంది. గ్రామాల్లో వీరికి ఆదరణ తగ్గడంతో పొట్టచేత పట్టుకొని పట్టణాల్లో పెద్దషాపుల్లో దినసరి, నెలసరి కూలీలుగా పనిచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. "నేడు భారతీయ మార్కెట్లో బ్లౌజులు, లోషన్‌లు, సేవింగ్ క్రీమ్‌లు రూపంలో రకరకాలుగా వచ్చి పడ్డాయి. ఎమ్మెన్సీ లోషన్ మనకు ఫ్యాషన్, వాటి బ్లౌజ్ మన కత్తికి సవాల్. జిల్లెట్ బ్లేడులు ఆఫ్టర్‌సేవింగ్ లోషన్సు నేడు మార్కెట్‌లో మెరుపులు మెరిపిస్తున్నాయి. ప్రకటనలు గుమ్మరిస్తున్నాయి." (పైదే పుట – 54)

## మేదరులు

ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాలలో రైతులు ధాన్యం నిల్వ ఉంచుకోవడానికి మేదరులు గుమ్మీలు, తట్టలు, బుట్టలు తయారు చేసేవారు. ఆ వృత్తితోనే వారు జీవనం సాగించేవారు. నేడు తట్టలు, బుట్టలు చూద్దామన్నా కనిపించని పరిస్థితి గోచరించింది. ప్రస్తుతం ప్రపంచమంతా ప్లాస్టిక్ మయం అవుతోంది. పెద్ద డ్రమ్ముల నుండి చిన్న వస్తువుల వరకు అన్ని ప్లాస్టిక్‌లోనే  దొరుకుతున్నాయి. అందువలన ప్రజలు వీటినే విరివిగా వినియోగిస్తున్నారు. ఒక వైపు ప్రపంచమంతా కాలుష్యమయం అవుతోంది అని పర్యావరణ కర్తలు ఆవేదన వ్యక్తం చేస్తుంటే, ప్లాస్టిక్ వస్తువులు మన మార్కెట్లను అధికంగా ముంచెత్తుతున్నాయి. ఈ పరిస్థితి ఒక వైపు పర్యావరణం కలుషితం అవుతుండగా మరో వైపు మేదరులు ఉపాధిని కోల్పోయి పేదరికంలో జీవిస్తున్నారు.

## చేనేతలు

ప్రపంచీకరణ విధానాలు అమలు తర్వాత బహుళజాతి సంస్థలు భారతదేశంలో ప్రవేశించి అనేక రెడీమేడ్ వస్త్రాలు అందుబాటులోకి తెచ్చాయి. ఈ నేపథ్యంలో ఉపాధి కోల్పోయిన వారు నేత కార్మికులు. కొన్ని వందల సంవత్సరాల పాటు శరీరానికి అవసరమైన దుస్తుల్ని ఉత్పత్తి చేసి జాతికి సేవలందించేవారు నేత కార్మికులు. భారతీయ నేత కార్మికులు అగ్గిపెట్టెలో ఒదిగే పట్టు చీరలు తయారు చేసి ప్రపంచ ఖ్యాతిని పొందారు. అయితే నేడు విదేశీ వస్త్రాలు మన మార్కెట్లను ముంచెత్తడంలో వీరికి ఉపాధి కరువై ఆత్మహత్యలను ఆశ్రయిస్తున్నారు. విదేశీ బహుళజతి సంస్థలు చావు దెబ్బతీసిన రంగాలలో చేనేత ప్రధానమైంది.

## దర్జీ

పూర్వం గ్రామీణ జీవనంలో బట్టలు కుట్టేవారిని ‘మేరోల్లు’ అని పిలిచేవారు. అప్పట్లో కేవలం వీరు మాత్రమే బట్టలు కుట్టేవాళ్ళు. అయితే కాలక్రమంలో దర్జీవృత్తిలో ఇతరులు కూడా కొనసాగు తున్నారు. రెండు దశాబ్దాల కిందటివరకు జనం బట్టలు కుట్టించుకొనెందుకు వీరి వద్ద క్యూ కట్టే వారు. ప్రస్తుతం రెడీమేడ్ దుస్తులు భారతీయ మార్కెట్లను ముంచెత్తడంలో వీరికి వృత్తి లేకుండా పోయింది. ఈ వృత్తిలో పనిచేస్తున్న అనేక మంది ఇతర రంగాల్లోకి  వెళ్ళడం జరిగింది. మరి కొంతమంది మాత్రం దర్జీ వృత్తులలోనే కొనసాగుతున్నారు. అయితే పెరిగిన ధరలకు అనుగుణంగా ధర్జీ పనివారి ధరలు పెరగడం మరో వైపు మార్కెట్లో వివిధ రకాల డిజైన్ వస్త్రాలు రెడీమేడ్‌గా అందుబాటులోకి రావడంతో వీరి వృత్తి కుంటుపడింది. ప్రజలు పట్టణాలకు వెళ్ళి రెడీమేడ్ దుస్తుల దుకాణాలను ఆశ్రయిస్తుండటంతో వీరికి ఉపాధి లభించక అర్థాకలితో అలమటించే స్థితిలో ఉన్నారు.

## గీతకార్మికులు

గీత కార్మికుల కుటుంబాలు ప్రధానంగా ఈత, తాటి చెట్లపై ఆధారపడి జీవిస్తుంటారు. వీరు ఈ చెట్ల నుండి కల్లు తీసి అమ్ముకుని జీవిస్తారు. ముఖ్యంగా పల్లె ప్రాంతాల్లో అలసట చెందిన రైతులు, గీత కార్మికులు ఈ కల్లును సేవించేవారు. ప్రస్తుతం మార్కెట్లో వైన్స్, విదేశీ కంపెనీల మద్యం విచ్చలవిడిగా అందుబాటులోకి రావడంతో విదేశీ సరుకు అంటూ అటు వైపు మొగ్గు చూపటంతో గీత కార్మికుల భవిష్యత్ ప్రశ్నార్థకమైంది. ఫలితంగా వీరి వృత్తికి గండిపడి, విదేశీ మద్యంతో వీరికల్లు పోటీ పడలేకపోతోంది దానితో వీరి జీవనం అగమ్యగోచరమైంది.

ఈ విధంగా గ్రామాలలోని కులవృత్తులు కనుమరుగవుతున్నాయి. ఈ కనుమరుగవుతున్న వృత్తులను ముఖ్యంగా గీతకార్మికుల సమస్యలను ప్రధానంగా చిత్రించిన నవల నేరేళ్ళ శ్రీనివాస్ గౌడ్ రాసిన  ‘బతుకుతాడు’ నవల.

“కల్లులో నిషాగుణం తక్కువ ఉంటది. రైతులు పొలంలో ఎక్కువగా రసాయన మందులు వాడడం వల్ల భూసారం దెబ్బతింటుందని శాస్త్రజ్ఞులు చెప్పిన ఎవలింటున్నారు. ఇప్పుడు భూమిలో భూసారం లేదు. ఆ మందుల ప్రభావం తాటిచెట్టుపై పడింది. కల్లులో నిషావచ్చే లక్షణం పోయింది.

కల్లు వాసన పోయింది. అందుకే ఎక్కువ మంది కల్లుతాగుతలేరు. అంటే ప్రజలు తాగుతలేరని కాదు. కల్లు తాగడం బందు చేసి నిషా వచ్చే గుడుంబా, విస్కీ, చీప్‌లిక్కర్‌ను తాగుతున్నారు. ఒక్కప్పుడు బాగ పనిచేసి అలసి పోయినప్పుడు ఆ అలసట నుండి ఉపశమనం పొందేందుకు కల్లు తాగేవారు కాని ఇప్పుడు తాగుతున్నది నిషాకోసం". (శ్రీనివాస్ గౌడ్, నేరెళ్ళ: 2004; పుట -131) అంటూ నారాయణ గౌడ్ వ్యక్తం చేసే అభిప్రాయాలు మనల్ని ఆలోచింపచేస్తాయి. ప్రపంచీకరణ విధానాలు అమలైన తర్వాత పంటలకు విషరసాయనాలు వాడటం వల్ల భూసారం తగ్గిపోయింది. మరో వైపు విదేశీ మద్యం విచ్చలవిడిగా దొరుకు తుండటం. దాన్ని నిషాకోసం ఎక్కువగా ఉపయోగించడం వల్ల గీత కార్మికుల నిషాలేని కల్లు మరుగున పడబోతుంది.

## 5.11. జీవ వైవిధ్యం

ప్రపంచీకరణ, ప్రపంచ వాణిజ్య విధానాల ఫలితంగా అంతర్జాతీయంగా జీవ వైవిధ్యం దెబ్బతింటోంది. మునుపెన్నడూ లేని విధంగా నేడు వృక్ష, జంతుజాలాలకు ముప్పు కలుగుతోంది. అసలు జీవవైవిధ్యం అంటే "అన్ని రకాల నివశించే, ఆవాసాలలో ఉండే వైవిధ్యాన్ని కలిపి జీవవైవిధ్యం అంటారు". (.ప్రసాద్, కె.ఎస్.వి: 2012 ; పుట -14) మనకు తెలిసి ఈ విశ్వంలో జీవరాశి వున్న ఏకైక గ్రహం భూమి మాత్రమే. నేడు భుమి పలు పర్యావరణ ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కొంటున్నది. కాలుష్యం పెరగడం, అడవులు అంతరించి పోవడం, వాటి నరికివేత మొదలైన మానవ ప్రేరేపిత చర్యల వలన భూమి వేడెక్కడం (గ్లోబల్ వార్మింగ్), పర్యావరణ అసమతుల్యత (ఎకోఇన్‌బ్యాలెన్స్), రుతుక్రమం మారటం (క్లయిమెట్ ఛేంజ్) వంటి వాటి వల్ల ఆమ్ల వర్షాలు, ఓజోన్ పొరకు రంధ్రం వంటి తీవ్ర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ పరిస్థితులు భూమిపై వృక్ష, జంతు, మానవజాతుల జీవమనుగడకు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి.

ఆదిమ కాలం నుంచి ఈ భూగోళం అనేక జీవరాశులకు పుట్టిల్లుగా ఉంది. అనేక రకాల వృక్ష, జంతు జాతులతో భూమి అత్యధిక జీవ వైవిధ్యంతో ఉండేది. ఆదిమ మానవ జాతి మనిషి తనకు దొరికిన పళ్ళు, కాయలు, దుంపలు, కొన్ని జంతువులు వేటాడి వాటి ఆహారంతో జీవనం సాగించాడు. ఆదిమ కాలంలో వేటకై మనుషులు ఆధారపడినప్పుడు కూడా జంతు జాతులు అంతగా అంతరించలేదు. కానీ "పారిశ్రామిక విప్లవం ఎప్పుడైతే ప్రారంభమైందో రెండొందల సంవత్సరాల నుండి పర్యావరణానికి, జీవజాతులకు ప్రమాదం ఏర్పడింది. మార్కెట్ ఆధారిత లాభాపేక్ష వృద్ధి అయ్యాకనే ఓజోన్ పొరకు చిల్లు, గ్లోబల్ వార్మింగ్, ఎల్‌నినో, సునామీ, భూకంపాల

వంటి పెను ప్రమాదాలు విరుచుకుపడుతున్నాయి. ప్రతీ ఇరవై నిమిషాలకో జీవజాతి అంతమవుతోంది."(పైదే, పుట –16)

ఈవిధంగా మానవుడి లాభపేక్ష వలన సమస్త వృక్ష జంతు జాలానికి ప్రమాదం వాటిల్లుతోంది. దీనికి నేడు అమలవుతున్న ప్రపంచీకరణ విధానాలు ఒక ముఖ్య కారణంగా చెప్పవచ్చు.

## 5.11.1 భారతదేశం – జీవవైవిధ్యం

భారతదేశంలో అత్యద్భుతమైన జీవవైవిధ్యం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక జీవ వైవిధ్యం ఉన్న దేశాల్లో మనది ఒకటి. అందుకే ప్రపంచంలో భారతదేశానికి అతిపెద్ద జీవవైవిధ్య దేశంగా గుర్తింపు వచ్చింది. "ప్రపంచంలోని మొత్తం జీవ జాతుల్లో 8 శాతం ప్రాణులకు మనదేశం పుట్టినిల్లు. దేశంలో 18 వేలకు పైగా వృక్ష జాతులు, 390 రకాల క్షీరదాలు, 458 జాతులు మనుగడ సాగిస్తున్నాయి. దాదాపు ఆరువేల రకాల చేపల జీవవైవిధ్యంతో ప్రపంచంలో భారత్ అగ్రస్థానంలో ఉంది. దేశంలో 668 రక్షిత ప్రాంతాలున్నాయి. పదహారు లక్షల చదరపు కి.మీ. పైగా మొత్తం భూభాగంలో సుమారు 5శాతం జీవ వైవిధ్య ప్రత్యేకతల రీత్య రక్షిత ప్రాంతంగా గుర్తించబడింది. 102 జాతీయ పార్కులు 515 వన్యమృగ సంరక్షణ కేంద్రాలు, పులులు 40 కేంద్రాల్లో, ఏనుగులు 28 కేంద్రాల్లో విశాలమైన అటవీ ప్రాంతంలో జీవిస్తున్నాయి. ఫ్లోరా అండ్ ఫానా' ప్రత్యేకతల రీత్యా ప్రపంచ వ్యాప్తంగా యునెస్కో గుర్తించిన హెరిటేజ్ సెంటర్లలో రెండు.. తూర్పు హిమాలయాలు, పడమటి కనుమలు మనదేశంలో ఉన్నాయి. ఫలపుష్ప జాతులు ఇతర జీవజాతుల ప్రత్యేకతల దృష్ట్యా ఇరుగు పొరుగు దేశాలు సంయుక్తంగా పనిచేసేందుకు యునెస్కో తగు ఏర్పాట్లు చేసింది. జాతులు, ప్రజాతుల పరంగా రికార్డు చేసిన 45 వేల వృక్షజాతులు, 91 వేల జంతు జాతులతో మన దేశం ప్రపంచ జీవవైవిధ్య సంరక్షణ రంగంలో కృషి చేస్తున్న వారికి ప్రముఖ సందర్శనీయ స్థలంగా యునెస్కో అభివర్ణించింది. పంటల వైవిధ్యం రీత్యా ప్రపంచంలో ఎనిమిది ప్రధాన దేశాల్లో మన దేశం ఒకటి. వరి, తృణధాన్యాలు, కూరగాయలు తదితర 375 వైవిధ్య పూరిత రకాలు, 140 రకాల పెంపుడు జంతువులు మన నిత్య జీవితంలో పెనవేసుకున్నాయి."(పైదే పుట – 15) ఈ విధంగా గొప్ప జీవ వైవిధ్యానికి భారతదేశం ప్రసిద్ధి చెందింది. అయితే ప్రస్తుత ప్రపంచ వాణిజ్య విధానాల ఫలితంగా సర్కారు నిర్లక్ష్యం కారణంగా జీవ వైవిధ్యం అంతరించే పరిస్థితి కనబడుతోంది. ముఖ్యంగా బహుళజాతి కంపెనీల ధనదాహం వలన జీవ వైవిధ్యానికి

ముప్పు కలుగుతోంది. భారతదేశంలో "పెద్దల సంపాదన ప్రైవేట్ బహుళజాతి కంపెనీలకు దోచిపెట్టే ప్రభుత్వ విధానాల వల్లనే పర్వతాలకు బొర్రెలు పడుతున్నాయి. అడవులు, పర్యావరణం, వన్యప్రాణులు నాశనం అవుతున్నాయి. జీవవైవిధ్యం విచ్ఛిన్నమవుతోంది" (పైదే) జీవవైవిధ్యానికి అంతర్జాతీయ స్థాయిలో కృషి జరుగుతోంది. దీనికి సంబంధించి 1992 రియోలో మొదటి 'ఎర్త్ సమ్మిట్' జరిగింది. ఈ సమావేశం మనిషి ప్రకృతి నుండి మనిషి పొందే లాభంలో సమతూకం పాటించాలని అభిప్రాయపడింది. ప్రకృతి పరిరక్షణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, విధివిధానాలు ఈ సమావేశంలోనే రూపొందించారు. దీనిపై భారత్‌తో సహా 193 దేశాలు సంతకం పెట్టాయి. అయితే అగ్రదేశమైన అమెరికా సంతకం చేయలేదు. అప్పటి నుండి ఇప్పటి వరకు ప్రతీ రెండేళ్ళకు ఒక సారి నిర్వహించే అంతర్జాతీయ సదస్సులు పది జరిగాయి. ఐక్యరాజ్యసమితి 2011 –20 సంవత్సరాలను జీవ వైవిధ్య దశాబ్దంగా ప్రకటించింది. పదకొండవ జీవవైవిధ్య సదస్సు హైదరాబాద్ వేదికగా అక్టోబర్ 1 నుండి 19వ తేది వరకు జరిగింది. ఈ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల ప్రతినిధులు హాజరై జీవవైవిధ్యం పై అనేక ఒప్పందాలు, సూచనలు చేయడం జరిగింది. అయితే వీటిని చిత్తశుద్ధితో అమలు జరిపితే జీవవైవిధ్యం మెరుగు పడుతుంది. లేకపోతే భావితరాలకు ముప్పు అధికంగా వాటిల్లుతుంది.

"ఆదెళ్ళ శైలబాల" రచించిన "వెన్నెల్లో గోదారి" నవల జీవ వైవిధ్యాన్ని అంతరించి పోతున్న జంతు జాతులను గురించి చర్చించింది.

"కానీ ఈ దరిద్రపు మొబైల్స్ కారణంగా పిచ్చుక జాతి అంతరించి పోతోందంటే నాకు చాలా బాధగా ఉంటుంది. మనం మనుషులం కాబట్టి, మనకి తెలివి తేటలు ఉన్నాయి కాబట్టి టెక్నాలజీ అభివృద్ధి చేస్తాం. మా సుఖం కోసం సృష్టిలో మిగతా జాతులు అంతరించి పోయినా మాకు లెక్కలేదు అనుకుంటూ ఎలా? మనకు బలం ఉంది కదా అని వేరే జాతుల్ని నాశనం చేసే అధికారం ఎవరిచ్చారు?"( శైలబాల,ఆదెళ్ళ:2011; పుట–171) అంటూ శైలు తన భర్త కుమార్‌తో వెలిబుచ్చే అభిప్రాయం ఆలోచింప చేస్తోంది. అలాగే "మనిషి ధర్మాలలో ఒకటి పశుపక్ష్యాదులకు ఆహారం పెట్టడం అట. చిన్నప్పుడు మాతాత గారు చెప్పేవారు. కానీ ఇప్పుడు పిల్లలకు ఇవి ఏమీ చెప్పడం లేదు. చివరికి సీతాకోక చిలుకలను చూడాలన్నా 'జూ'కి వెళ్ళి చూడాల్సిన పరిస్థితి వస్తుందేమో? కొన్ని రోజులు పోయాక ప్రపంచంలో ఏం ఉండదు. ఎక్కడ చూసినా మనుష్యులు, ల్యాప్‌ట్యాప్‌లు, మొబైల్ ఫోన్సే ఉంటాయి" (పైదే, పుట – 172) అంటూ శైలజ వ్యక్తం చేసే అభిప్రాయం నేడు ఆధునిక మనిషి అభివృద్ధి ముసుగులో అంతం చేస్తోన్న జీవ

వైవిధ్యాన్ని మనకు వివరిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతానికి 90 లక్షల జీవ జాతులు ఉన్నాయని అంచనా వేయగా ఇప్పటికి కనుగొన్నది 45 లక్షలు మాత్రమే అయితే ప్రకృతిలో తెలిసిన వాటి కంటే తెలియనివే ఎక్కువ ఉన్నాయి.శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఆధునికంగా ఇంతగా అభివృద్ధి చెందినా ఒక జీవిని నూతనంగా సృష్టించలేము. కాబట్టి ప్రకృతి లేనిదే మానవుడు లేడు. ప్రకృతిని పరిరక్షించడమే మానవుల ప్రధాన కర్తవ్యం. అదే భవిష్యత్ తరాలకు జీవనాధారం.

పై అధ్యాయాన్ని పరిశీలించిన తర్వాత ఈ కింది విషయాలు అవగతమవుతున్నాయి. బహుళజాతి సంస్థలు పరిశ్రమలు వ్యాప్తి చేస్తున్న కాలుష్యం వలన పర్యావరణం దెబ్బతింటోంది. అలాగే నిరుద్యోగం పెరిగింది. రైతులు, కార్మికులు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు. ప్రపంచీకరణ డాలర్ సంపాదన ఆశతో విదేశీ వలసలు అధికమైనాయి. బహుళజాతి కంపెనీలు చేస్తున్న విస్తృత ప్రచారం మూలంగా సమాజంలో వస్తు వ్యామోహం అధికమైంది. మన సంప్రదాయ వివాహ వ్యవస్థ ప్రమాదంలో పడి దేశంలో విడాకులు పెరిగిపోతున్నాయి. సమాజంలో ఇవాళ మానవ సంబంధాలు పతనమవుతూ మార్కెట్ సంబంధాలు అలవడుతున్నాయి. అలాగే వస్తు వినిమయ సంస్కృతికి అలవాటు పడి ఉద్యోగులు అధికారులు అవినీతికి దగ్గరవుతున్నారు. సమాజంలో చేతి వృత్తులు అంతరించిపోతున్నాయి. ప్రపంచీకరణలో భాగంగా విస్తరించిన ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాల మూలంగా జీవావరణం దెబ్బతింటోంది. అనేక జీవుల ఉనికి నేడు ప్రశ్నార్థకమవుతోంది. ఈవిధంగా ప్రపంచీకరణ వర్ధమాన దేశాల్లో పెను విషాదాన్ని నింపుతోంది.

# అధ్యాయం – 6

# సాంస్కృతిక రంగం– ప్రపంచీకరణ ప్రభావ నవలలు

సంస్కృతిని అనేకులు అనేక రకాలుగా నిర్వచించటానికి ప్రయత్నించారు. అయితే సంస్కృతి అంతా తేలికగా నిర్వచించబడని పదం. ఎవరైతే తన ప్రవర్తనలో నాగరికత చూపిస్తారో వారిని సంస్కృతి ఉన్న వ్యక్తులు అంటారు. ఇంకొంచెం ఆలోచిస్తే 'ఒక నియమిత సమాజంలో ప్రజల జీవన విధానాన్ని సంస్కృతి అనవచ్చు.' రాతికాలం నుండి నేటి వరకు మనిషి సుఖంగా ఆనందంగా ఉండటానికి సంతృప్తి గల జీవితాన్ని ఇచ్చేది సంస్కృతి. చట్టానికి లోబడి మానవ ప్రశాంత జీవనానికి, సామాజిక ప్రవర్తనకి పొందినజ్ఞానంతో పెరిగే విలువలు ప్రమాణాలతో జీవనం సాగించటమే సంస్కృతి. సంస్కృతితో పాటు నాగరికత పదమూ అవినాభావ సంబంధం కలిగి ఉంది. ఒక్కోసారి ఒకదానికొకటి కలిపి వాడుతుంటాం. నాగరికత అనేది సంస్కృతికి ఉన్న బాహ్యా రూపం. అంటే మనం ఉపయోగించే వస్తువులు, యంత్రాలు మొదలైనవి. అంతరీకమైనది. సంస్కృతి నాగరికత శరీరమైతే సంస్కృతి ఆత్మ. నాగరికత అనేది సంస్కృతిలో బాహ్యా పార్శ్వం. లేదా భౌతిక సంస్కృతి, సామాజిక జీవన వ్యవస్థలు, కట్టుబాట్లు, ఆచారాలు, విలువలు, కళలు, సాహిత్యం, సంగీతం, సమాజంలోని వ్యక్తుల పరస్పర చర్యలు. సంబంధాలలో పొందే అభివృద్ధి వీటన్నిటిని కలిపి అభౌతిక సంస్కృతి అంటారు. ఈ పార్శ్వాన్నే విస్తృతార్థంలో సంస్కృతి అంటాం. అంటే సంస్కృతికి భౌతిక, అభౌతిక పార్శ్వాలు ఉన్నట్లు తెలుస్తుంది. మనుషులు దేన్ని కలిగి ఉన్నారో దాన్ని నాగరికత అని మనుషులు అంటే ఏమిటో చెప్పేది సంస్కృతి అని 'మకైవార్' అనే విశ్లేషకుడు సూక్ష్మంగా చెప్పాడు. భౌతిక సంస్కృతి తేలికగా మారిపోతుంది. అభౌతికం అంతా తేలికగా మారదు.

## 6.1 నిర్వచనాలు

1. "ఇంగ్లీషులో సంస్కృతిని Culture అంటారు. దీనికి కృషి అని అర్థం. ఇది మూడు రకాలుగా కనిపిస్తుంది. మనిషి మాటతీరుని, ప్రవర్తనని, అలవాట్లని, నడవడికను తెలిపేది వ్యక్తిగత సంస్కృతి. ఒకే వర్గంలోని వివిధ వ్యక్తుల, సంస్కృతులలోను సారుప్యత తెలిపే వర్గ సంస్కృతి రెండోది కాగా, ఒక సమాజం లోని వ్యక్తులు, భాష, విశ్వాసాలు, మతాలు, కళలవిషయాల్లో ఏకీభావం చేస్తే సమాజ గత సంస్కృతి మూడవది" (సంస్కృతి కుటుంబం:1992;పుట– 174)"

2."ఆయా చారిత్రక కాలాలలోని ఒకానొక జాతి యొక్క ఆర్థిక, రాజకీయ, సామాజిక జీవన సంబంధాల, ఆధ్యాత్మిక, భౌతిక అనుభూతుల, శాస్త్ర విజ్ఞాన నిధుల సాహిత్య కళ సంపదల సమాహారమే ఒకానొక జాతి యొక్క సంస్కృతి". (భాషాసంస్కృతి – ఉద్యమం: 2003; పుట– 5)

3. "సంస్కృతి అంటే కేవలం ఆట, పాట, సంగీతం, సాహిత్యం మాత్రమే కావు. ప్రజల యొక్క జీవన విధానం సంస్కృతి. సమస్త మానవ సంబంధాల సారం సంస్కృతి. ప్రజల హృదయాలలో కదలి భావాలలో మెదలి దైనందిన చర్యలతో ప్రదర్శితమయ్యే జీవితాచరణే సంస్కృతి. మనం నాగరికత యొక్క ఏ పొదలమీద జీవిస్తున్నామో తెలియపరిచే కొలబద్ద సంస్కృతి".(మాతృభాష సంస్కృతి:1999; పుట –8 )

ప్రజల జీవన విధానంలో సాంస్కృతిక సంబంధాలు అంతర్భాగం. ఆహార అలవాట్లు అభిరుచులు కట్టుబాట్లు, భాష, కళలు, సాంప్రదాయాలు మొదలగు అంశాలన్నింటిని కలిపి ఒక జాతి సంస్కృతిగా చెప్పవచ్చు. ప్రపంచీకరణ నేపథ్యంలో దేశీయ సంస్కృతి పై పెద్ద ఎత్తున దాడి జరుగుతున్నది. ఒకప్పుడు భారతీయ సంస్కృతి ప్రపంచ దేశాలకు ఒక ఆదర్శంగా ఉండేది. అయితే ప్రపంచీకరణ బహుళ జాతి సంస్థలు భారతదేశంలోకి అడుగిడిన తర్వాత మన సంస్కృతిని మరుగు పర్చి, పాశ్చాత్య సంస్కృతి వైపు ప్రజల దృష్టిని మారుస్తున్నాయి. బహుళజాతి సంస్థలు దేశీయ సంస్కృతిని కాలరాస్తూ, ప్రజలని సాంస్కృతిక బానిసత్వం, పాశ్చాత్యం వైపు నడిపించే కార్యక్రమంలో పాక్షికంగా విజయం సాధించాయి. ఇంకాదాని లక్ష్యం నెరవేరలేదు. అందుకే ఈరోజు భారతీయ పల్లెల్లో ఇంటింటా టీ.వీ. సంస్కృతిని పెంచి వ్యాపార లాభాలను పొందుతున్నాయి.

భారతీయ ప్రజలు నాటి నుంచి ప్రధానంగా శ్రమజీవులు. ఉదయాన్నే నిద్రలేచి తమ వృత్తుల్లో నిమగ్నమయ్యే వారు. ప్రపంచీకరణ ప్రక్రియలో బహుళజాతి సంస్థల టీ.వీ, పాశ్చాత్య సాంస్కృతిక కార్యక్రమాలు విస్తరించిన తర్వాత ఒక వైపు నిద్రకు దూరమవుతూ, మరొక వైపు వృత్తికి దూరమై పోతున్నారు. భారతదేశంలో మధ్యతరగతి వారిపై దీని ప్రభావం అధికంగా ఉంది. "ఎనిమిది తొమ్మిది గంటలకే ఆదమరచి నిద్రపోయే ఊరు అర్థరాత్రి దాకా మేల్కొంటున్నది. టెలివిజన్ వచ్చి సినిమా మాయజాలనికి ఎడిక్ట్ అవుతున్నది. ఫలితంగా తెల్లవారుజామునే లేచి కోడి కూతలతో గలగల లాడుతూ వ్యవసాయ పనుల హడావుడిలో ఉండే వారు ఆదమరచి పొద్దెక్కిందాకా సాగిల పడుతున్నారు. సీరియల్స్ సినిమాలు టీవీ ముందు కదలకుండా,

కండ్లార్పకుండా కూర్చో బెడుతున్నాయి. ఫలితంగా కాలు చేయి ఆడాల్సిన శ్రమజీవులు కుటుంబాల వారు సీరియల్స్ వలలో కాలు, చేయి విరగొట్టుకుంటున్నారు"(పి.రంగారావు:2002; పుట -73) పై పరిశీలనలో టీ.వీ సినిమా, సిరియల్స్ ప్రభావం ప్రజలపై ఏవిధంగా ప్రభావం చూపుతుందో అర్థమవుతుంది.

నేడు భారతదేశంలో టీవీలో చూపుతున్న ప్రసారాలు పరిశీలిస్తే అవి జాతికి కొంత ఉపయోగపడినప్పటికీ, అధికమోతుదు వీటిలో ప్రసారమవుతున్న అంశాలు వ్యక్తులను గందరగోళానికి గురిచేసేవిగా ఉన్నాయి. "టీవీ మాధ్యమం నేడొక పదునైన ఆయుధం. ఆమాధ్యమం ఇంటింటా పాకింది. ప్రతి మనిషిని తట్టింది. అయితే ఈ మాధ్యమం నుంచి ప్రసారం అవుతున్న భావజాలంలో విజ్ఞాన పరమయింది 10వ వంతు అయితే నిర్వీర్యానికి, విస్తృతికి, అచేతనానికి ఆగమ్యగోచరంగా మార్చడానికి ప్రయత్నం చేసేది 90 వంతులుగా వుందనేది వాస్తవం"(రంగారావు,పి:2002; పుట–74) "పెట్టుబడిదారీ తాత్వికులు, వర్ధమాన మార్కెట్ మాంత్రికులు, ఆర్థికవేత్తలు దీనిని మానసిక ఆర్థిక వ్యాపారంగా, పరాయికరణకు ప్రతిబింబంగా మరింత తీర్చిదిద్దుకున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంక్షలు సడలించి సామ్రాజ్యవాద విషసంస్కృతిని టీవీ ఛానళ్ళ ద్వారా వర్ధమాన ప్రపంచం మీద గుప్పిస్తున్నారు" (పైదే పుట -74) పై పరిశీలన ద్వారా సామ్రాజ్యవాదులు తమ సంస్కృతిని దేశీయ సంస్కృతి మీద గుప్పించేందుకు ప్రసారమాధ్యమంగా టీవీని చక్కగా ఉపయోగించుకుని తమ విషసంస్కృతిని వ్యాపింప జేస్తున్నారు. సామ్రాజ్యవాదులు ఇక్కడ రెండు రకాల ప్రయోజనాలను ఏకకాలంలో సొంతం చేసుకుంటున్నారు. 1 తమసంస్కృతిని వర్ధమాన దేశాలపై వ్యాపింపజేయడం 2. తమ ఉత్పత్తులకు విశేష ప్రచారం కల్పించి లాభాలను పెంచుకోవడం.

సరళీకృత, ఆర్థికవిధానాలు అమలైన తర్వాత భారతీయ సంస్కృతి ప్రమాదంలో పడి మనిషికి ఉండే సహజమైన ప్రేమ, మానవీయ విలువలను కోల్పోతుంది. ఈపరిస్థితికి టీ.వీ. సీరియల్స్, సినిమాల ప్రభావమే అధికంగా ఉంది. "ఎలక్ట్రానిక్స్ మీడియా సెల్యులాయిడ్ సినిమాలు వర్ధమాన దేశాల ప్రజల ఆచార వ్యవహారాలను, వారి సంస్కృతిని చిన్నాభిన్నం చేస్తున్నాయి. వాటిని ప్రజాస్వామికంగా అభివృద్ధి చేసే బదులు, వాటి మీద సామ్రాజ్యవాద విషసంస్కృతిని, అల్లరి చిల్లర చేష్టలు విలువలు మరచి వలువలు విడిచే సంస్కృతిని రుద్దుతున్నారు. దానినే గొప్ప నాగరికతగా చెప్పుతున్నారు" (పైదే, పుట -75) "నాగరికత ముసుగున మనిషిలోని వికటత్వాన్ని, కపటత్వాన్ని, మృగపులక్షణాలను వెలికితీసి వాటికి చట్టబద్ధత కల్పిస్తున్నారు. ఆప్యాయతలు, అనురాగాలు,

అనుబంధాలు, మానవతా లక్షణాలన్నింటిని మరిపించి మార్కెట్ సంబంధాలనే పెంచుతున్నారు. ఒక్కమాటలో మానవ సంబంధాల మాటున మనీ సంబంధాలు అభివృద్ధి చేస్తున్నారు"(పైదే) ఇందు చేతనే మనిషి సాముహికత దెబ్బతింటున్నది. అంతకు మించి అనుబంధాలు, ఆప్యాయతలు నశిస్తున్నాయి. మనీ మార్కెట్ వేటలో ఆ పరుగు పందెంలో తనను తను మరచిపోతున్నాడు. పరాయికరణకు గురవుతున్నాడు. ఫలితంగానే కుటుంబాలు, జీవనాలు, భాషలు, సంస్కృతులూ అన్నీ విపరీత సంఘర్షణలకు గురవుతున్నాయి"(పైదే)

పై పరిశోధకుడి పరిశీలనలో వర్ధమాన దేశాల సంస్కృతులు, భాష, ఆచార, వ్యవహారాలు, కళలు, భాష, జీవన విధానాలు అన్ని కనుమరుగయ్యేస్థితిలో ఉన్నాయి. ఇవాళ మన సంస్కృతి మనకు కాకుండా అయిపోతుంది. పాశ్చత్యసంస్కృతి వర్ధమాన దేశాలపై బహుముఖంగా విస్తరించుకుంటుంది.

## 6.2 పండుగలు – ఉత్సవాలు

మనం నిత్యం జరుపుకొనే పండుగలు, ఉత్సవాలు, జాతరలు, మొదలైనవన్ని మన సంస్కృతిలో భాగం. పండుగలు ఉత్సావాలు అన్ని మతపరమైనవి కావు. కొన్ని పండుగలు పూర్తిగా మానవుని ఉత్పత్తికి సంబంధించి అంటే వ్యవసాయం, పశుపోషణ వంటి వాటికి సంబంధించి ఉంటాయి. కొన్ని ప్రకృతులపై మానవుడు విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకొని జరుగుతుంటాయి. కొన్ని పండుగలు పూర్తిగా మత నమ్మకాల, కథలపై ఆధారపడి ఉంటాయి. అయితే వీటన్నింటిని పూర్తిగా ఇలా విడదీసి చూడటం కష్టం. మానవుని ఉత్పత్తికి, ప్రకృతిపై విజయాలకు సంబంధించిన పండుగల్లో కూడా మతపరమైన నమ్మకాలు, ఆచారాలు ఉంటాయి. అదే సమయంలో పూర్తిగా మతపరమైన కథలపై ఆధారపడిన పండుగల్లో వెలికి చూస్తే మానవ సమూహాల అభివృద్ధికి సంబంధించిన అనేక చారిత్రక విషయాలు కన్పిస్తుంటాయి.

మానవుడు మనుగడకోసం ప్రకృతిలో సాగించిన పోరాటంలో ఒక్కొక్క విజయం సాధించడం ద్వారానే అభివృద్ధిపథంలో ముందుకు పోతూ వచ్చాడు. అయితే ప్రకృతిలో మనిషి ఒంటరిగా పోరాడలేదు. సామూహికంగా, సమిష్టిగా పోరాడాడు. అందువల్ల ప్రకృతిపై విజయం సాధించినప్పుడు మానవులు సమిష్టిగానే సంతోషం పంచుకున్నారు. అవే సంబరాలు ఉత్సవాలయ్యాయి. (వెంకట్రావ్.యస్:2004;పుట –1)

ప్రకృతిలో మానవుడు సమిష్టిగా పోరాడాడని చెప్పుకున్నాం కదా! ఈ సమిష్టిపోరాటంలో మానవుల మధ్య కూడా అనేక రకాల సంబంధాలేర్పడ్డాయి. ఒక జాతిని మరొక జాతి పీడించడం జరిగింది. ఈ పీడనలో విముక్తి కోసం పోరాటాలు జరిగాయి. ఈ పోరాటాల్లో జయపజయాలు పండుగలు, పర్వదినాలు, దుర్దినాలుగా మారి మన సంస్కృతిలో భాగమైయ్యాయి. ప్రాచీన గణవ్యవస్థలో గణనాధులే తర్వాత దేవుళ్లు, దేవతలు అయ్యారు. వారి కొలుపులు పండుగలు, ఉత్సవాలుగా మారాయి. పరాయిపీడన నుండి విముక్తి కోసం జరిగిన పోరాటాలలో నేల కొరిగిన వీరుల జన్మదినాలు పర్వదినాలుగా మారాయి. పాలన నుంచి విముక్తి జరిగిన దినాలు ముఖ్యమైన జాతీయ పర్వదినాలుగా మారాయి.

ఈవిధంగా ఆదిమానవుడు నిప్పు, నీరుపై విజయం సాధించినప్పటి నుంచి నిన్న మొన్న పరాయి పాలన విముక్తి వరకు మానవజాతి ప్రయాణంలోని ప్రతివిజయం, అపజయం పండుగగానో మరో ముఖ్యమైన దీక్షాదినంగానో మారుతూవచ్చాయి. వాటి చుట్టూ అనేక కథలు, నమ్మకాలు ఏర్పడుతూ వచ్చాయి. అందువల్ల పండుగలు, ఉత్సవాలు మన సుదీర్ఘ సంస్కృతిలో ఒక భాగంగా చెప్పవచ్చు.

మన సాంస్కృతిక వారసత్వమంతా అంటే మానవుడు అప్పటి వరకు నేర్చుకున్న విజ్ఞానం, కళలు, సాహిత్యం, నృత్యం, సంగీతం మొదలగునవన్నీ పండుగల్లో ప్రదర్శితమవుతాయి. మానవుడు వ్యక్తిగతంగా గాని, సమష్టిగా గాని సంపాదించిన భౌతిక సంపద ప్రదర్శించడానికి పండుగలు వేదికలవుతాయి. ఒక మానవ సమూహం, సాంస్కృతిక వారసత్వాన్ని తెలుసుకోవాలంటే వారి పండుగలు ఉత్సవాలు, జాతరలను పరిశీలిస్తే చాల విషయాలు తెలుస్తాయి.

మానవ సమాజంలో మనం చేసుకునే పండుగలు, ఉత్సవాలు, జాతరలు పర్వదినాలలో అనేక రకాలున్నాయి. అన్ని పండుగలు మతంలో ముడిపడి ఉన్నప్పటికీ వీటిలో కొన్ని మానవ ఉత్పత్తిలో ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని సంబంధం కలిగి ఉన్నాయి. ఉత్పత్తి అంటే ఆహార ఉత్పత్తి మాత్రమే కాదు. పునరుత్పత్తి కూడా పంటలు, ఋతువులను బట్టి ఈ పండుగలు జరుపుకుంటారు. కొన్ని పూర్తిగా ఆధ్యాత్మిక పండుగలున్నాయి. మానవ జాతి చరిత్రలో ఈ పండుగలు సాపేక్షంగా తర్వాత ఉద్భవించినవై ఉంటాయి. ఇక ఇటీవల కాలంలో జరిగిన రాజకీయ విముక్తి ఉద్యమాలు, పోరాటాల్లో త్యాగాలు చేసిన వారి జయంతులు, వర్థంతులు పండుగగా

జరుపుతున్నారు. రాజకీయ విజయదినాలు కూడా పండుగలు, పర్వదినాలలో చేరిపోయాయి. ఈ మార్పుకేవలం మన ఒక్క సమాజంలోనే కాక ప్రపంచమంతా నేడు చూస్తున్నాం. భారతసమాజానికి చెందినంత వరకు పండుగలను ఆరు రకాలుగా విభజించారు వెంకట్రావుగారు.

**ఆధ్యాత్మికపండుగలు:** ఈ పండుగలు దేవుళ్ల పుట్టిన రోజులు, మతపరమైన ఘట్టాల కథలలో ముడి పడి ఉంటాయి. ఉదా:– శివరాత్రి, శ్రీరామనవమి, రంజాన్, క్రిస్టమస్, గుడ్‌ఫ్రైడె మొదలైనవి.

**ఉత్సవాలు, జాతరలు:** తిరుమల బ్రహోత్సవాలు, కళ్యాణోత్సవాలు, సమ్మక్క – సారక్క జాతరలు, రథోత్సవాలు, స్థానిక తిరునాళ్లు, పుష్కరాలు, సముద్రస్నానాలు, బోనాలు, మారెమ్మ, సుంకాలమ్మ, పెద్దమ్మ జాతరలు మొదలైనవి.

**వ్రతాలు క్రతువులు:** వరలక్ష్మీ వ్రతం, కార్తీక పౌర్ణమి, గౌరీవ్రతం మొదలగునవి.

**రాజకీయపరమైన ఉత్సవలు:** స్వాతంత్ర్యదినోత్సవం, రిపబ్లిక్ డే,మేడే, కార్మిక దినోత్సవాలు, ఆంధ్రప్రదేశ్ అవతరణ మొదలైనవి.

**నాయకుల జయంతి– వర్ధంతి:** అంబేద్కర్ జయంతి, గాంధీ జయంతి, భగత్‌సింగ్ వర్ధంతి.

**ఉత్పత్తితోముడిపడిన పండుగలు:** సంక్రాంతి, ఉగాది, దసరా, బతుకమ్మ మొదలైనవి. సంక్రాంతి వ్యవసాయదారుల పండుగ. ఉగాది కూడా వ్యవసాయ ధారమైన పండుగే తెలుగు వారికి కొత్త సంవత్సరం ఉగాదితో ప్రారంభం అవుతుంది. ఉత్పత్తికి సంబంధించిన పండుగలలో దసరా కూడా ఒకటి దసరా ప్రకృతిపై మానవ విజయోత్సవానికి సంబంధించిన పండుగ ముఖ్యంగా వ్యవసాయంలో సాధించిన విజయాలతో ఇది ముడిపడి ఉంది. ఉత్తరాదిలో దసరా సందర్భంగా రామలీల ఉత్సవాలు చేస్తే దక్షిణాదిలోనూ, బెంగాళీలోనూ దేవీనవరాత్రులు జరుపుతారు. ప్రధానంగా విజయ దశమి విజయానికి సంబంధించిన పండుగ. ఆరోజు అన్ని ప్రాంతాలలో ఆయుధపూజ చేయడం అనవాయితీ. అయితే ఇందులో కొన్ని పండుగలు వ్రతాలు, క్రతువులు, ఉత్సవాలు నానాటికీ తమ ఉనికిని కోల్పోతున్నాయి. మన సంప్రదాయ పండుగల స్థానంలో నేడు విదేశీ సంస్కృతి ప్రాబల్యం వహిస్తోంది. దీని ఫలితంగా మన పండుగలు, సంస్కృతి ధ్వంసం చేయబడుతుంది.

గ్లోబల్ పెట్టుబడి ప్రవేశించిన తర్వాత మన పండుగలు, వేడుకలు, సంస్కృతి స్థానాల్లో మదర్స్‌డేలు, ఫాదర్స్‌డేలు, వాలెంటైన్స్‌డేలు తదితర పశ్చిమ దేశాల సంస్కృతులు చొరబడ్డాయి. ఇవి ఈనాడు మన పండుగలను మించిన వేడుకలుగా విషమిస్తున్నాయి. సినిమాహాళ్లు, రెస్టారెంట్లు,

పబ్‌లు, సంగీత కంపెనీలు, గ్రీటింగ్ కార్డులు అన్నీ కూడా ఈ సంప్రదాయాన్ని విస్తృత పరుస్తూ యువత జీవితాన్ని మార్కెట్ సంస్కృతిలోకి లాగడానికి కుట్ర చేస్తున్నాయి. పెట్టుబడి శక్తులు కేవలం మన సంస్కృతిలోకి మాత్రమే చొరబడలేదు అవి మన ఆలోచనలు, అలవాట్లు, విలువలతో కూడిన పద్ధతుల్లోకి చొరబడి ఒక కొత్త మానవ ప్రవర్తనను సృష్టించి వినియోగ సంస్కృతిని రుద్దుతున్నాయి.

సింహప్రసాద్ రచించిన 'తమసోమా' నవల నేడు దేశంలో పాశ్చాత్య సంస్కృతి ప్రవేశించి జనవరి 1 మదర్స్ డేలు , ఫాదర్స్‌డేల వంటి సందర్భాల్లో సామాన్య ప్రజలను కార్పొరేట్ సంస్థలు ఏవిధంగా దోచుకుంటున్నాయో వివరిస్తుంది.

నూతన సంవత్సరం ఆరంభం కాబోతుంది. ఎటూ చూసినా పండుగ వాతావరణం కోలాహలం కనిపిస్తుంది. ముఖ్యంగా గ్రీటింగ్ కార్డుల కోసం ఇసుక వేస్తే రాలనంతజనంతో షాపులు కళకలలాడతున్నాయి. నూతన సంవత్సరాది ఆరంభానికి ముందు నుంచే క్లాసులు జరగటం లేదు. గాంధీ సహజ ఇద్దరూ స్నేహితులు నూతన సంవత్సర సందర్భంగా సహజ గాంధీ కోసం ఒక గ్రీటింగ్ కార్డు తీసుకుని గాంధీకి ఇచ్చి విష్యూ హేపీ న్యూ ఇయర్ చెబుతుంది. గాంధీ గ్రీటింగ్ కార్డు తెరచిన వెంటనే ఐలవ్యూ ఐలవ్యూ అంటూ వినబడతుంది. సహజకు కృతజ్ఞత చెప్పి ఇది చాలా ఖరీదేమో అంటాడు. ప్రేమ మనసుకి ఖరీదు కట్టే షరాబులేడోయ్ అంటుంది సహజ. "ఒప్పుకుంటున్నాను ఈ కాస్ట్ లీ గిఫ్ట్‌స్‌ని చూస్తుంటే న్యూ ఇయర్స్ డే, వాలెంటైన్స్ డే, మదర్స్ డే, అంటూ విపరీత ప్రచారం చెయ్యడం ఇలాంటివి అమ్ముకోవడానికి వేసిన వ్యాపారపుటెత్తులు అన్పిస్తోంది.

"నువ్వన్నీ విపరీతంగా ఆలోచిస్తావు గాంధీ. న్యూ ఇయర్ డే నాడు గ్రీంటింగ్స్, చెప్పడంలో వ్యాపారమేముంటుంది చెప్పు? పైగా మదర్స్‌డే లాంటి వాటి వల్ల మదర్‌కెంతో గుర్తింపు, గౌరవం ఇచ్చినట్టు కదా! దీనికింకా ప్రచారం జరగాలంటాను.

"అది జరగాల్సింది ఇక్కడ కాదు పాశ్చాత్య దేశాల్లో రెక్కలు రాగానే తల్లినీ తండ్రినీ మరచి వేరే గూడు వెదుక్కుని వెళ్ళిపోయే చోట ఆ రకంగానైనా ఏడాదికొక రోజున తల్లినీ, తండ్రినీ గుర్తించుకుంటారని అలాంటి అవసరం, అగత్యం మనకి లేవు. "ఏం ఎందుకు లేవు?"

"మాతృ దేవోభవ అంటూ ప్రథమ వందనం తల్లికి, ఉత్కృష్ట సంస్కృతి గల దేశం మనది గనుక" (సింహ ప్రసాద్:2012; పుట-55) అంటూ సుదీర్ఘంగా ఉపన్యాసం చేస్తాడు. ఇందులో అందివచ్చిన ప్రతి అవకాశాన్ని, తమకు అనుకూలంగా కార్పొరేట్ సంస్థలు మలచుకొని చేస్తున్న దోపిడీ తీరు అర్థమవుతుంది

ప్రపంచీకరణ పేరిట శరవేగంగా చొచ్చుకువస్తున్న సామ్రాజ్యవాద సంస్కృతి దేశీయ సంస్కృతిని ధ్వంసం చేస్తుంది. లేకపోతే వస్తువినిమయ సంస్కృతిగా మారుస్తుంది. మన పండుగల ప్రధాన్యాన్ని తగ్గించి విదేశీ విషసంస్కృతిని పెంచి పోషిస్తు ప్రజలను దోచుకుంటున్నాయి పెట్టుబడిదారీ సంస్థలు. తెలుగు వారికి ఉగాది కొత్త సంవత్సరాది. అయితే దీనికంటే నేడు జనవరి 1 కి అధిక ప్రాధాన్యతను కల్పిస్తున్నాయి పాశ్చాత్య బహుళ జాతి సంస్థలు. నూతన సంవత్సరాదికి స్వాగతం చెప్పడానికి డిసెంబర్ 31 అర్ధరాత్రి వరకు వేచి చూడటం, విందులు, వినోదాలు, క్లబ్బులు, ఫ్యాషన్ షోలు నిర్వహిస్తూ ప్రజల ధనాన్ని దోచుకుంటున్నాయి బహుళ జాతి వర్తక సంస్థలు ముఖ్యంగా నేటి యువతను  పెడదోవ పట్టిస్తున్నాయి. వేడుకలు, వినోదాల పేరుతో యువతను మత్తువైపు మళ్ళించి దోపిడీ చేస్తున్నాయి స్వదేశీ విదేశీ కార్పొరేట్ వినిమయ సంస్థలు. ఈ విషయాలను చర్చించిన నవల సింహప్రసాద్ తమాసోమా.

సహజ ఒక మధ్య తరగతి అమ్మాయి గాంధీ డిసిటివో గారి అబ్బాయి వీరిద్దరూ ఒకే కళాశాలలో చదువుతుంటారు.  సహజ పల్లె నుంచి వచ్చిన అమ్మాయే అయినా పట్టణాలలో ఉన్నటువంటి విష సంస్కృతికి త్వరగా అలవాటు పడుతుంది. గాంధీ సిటీ అబ్బాయి వ్యక్తిత్వం వున్న యువకుడు. సహజ ప్రేమ పేరుతో గాంధీకి దగ్గరవుతుంది. నూతన సంవత్సర ప్రారంభానికి ముందు రోజు డిసెంబర్ 31న నగరంలో ఎక్కడికైనా వెళ్లి ఎంజాయ్ చేద్దామంటూ గాంధీతో చెబుతుంది ఎదైనా ఆహ్లాదకరంగా చక్కని ప్రోగ్రాం వేసుకుందామంటాడు గాంధీ. "ఒకటి కాదు రెండు కాదు బోలెడన్ని ప్రోగ్రాములున్నాయి. బఫేలూ, డ్యాన్స్‌లు, గజల్లు ఓహో ఎంత సంబరమో చెప్పలేను. రామోజీఫిలింసిటీలో స్పెషల్ న్యూఇయర్ ప్రోగ్రాం వుంది. హోటల్ గోల్కొండలో మిడ్నైట్ బఫె ఉంది. సెంట్రల్ కోర్టు హోటల్‌లో డైన్ అండ్ డ్యాన్స్ మిలీనియం ప్రోగ్రామ్స్ ఉన్నాయి. స్పెషల్ న్యూ ఇయర్ రూం ప్యాకేజీ కూడా వుంది రాత్రికి అక్కడే వుండవచ్చు. కంట్రీక్లబ్బులో మమతాకులకర్ణి డ్యాన్స్ ప్రోగ్రాం వుంది. ఇంకా ట్రెజర్ ఐలాండ్‌లో లక్కి ఆలీ సునితరావుల చక్కని ప్రోగ్రాం వుంది ప్రతిదీ థ్రిల్లింగ్ ప్రోగ్రామే డియర్ నువ్వేది ఒకేచేసినా సరే నాకు ఒకే ఉత్సాహంగా అంది.

"అవన్ని ఖరీదైన ప్రోగ్రాములు అంత ఖర్చు అనవసరం సహజా" చెల్లున చెంప మీద కొట్టినట్లు చూసింది.

"మనస్ఫూర్తిగానే అంటున్నాను. అదంతా దండగమరి వ్యవహారం. బిజినెస్ కోసం వ్యాపార వర్గాలు వేసే గిమ్మిక్స్ లో మనం పడటం మంచిది కాదు." నన్ను అనాగరికుడుగా చూసి అంది" అలా డల్లుగా మాట్లాడుతున్నవేంటి గాంధీ అందరూ ఎన్నెన్ని ప్రోగ్రాములు వేసుకుంటున్నారో

తెలుసా? న్యూఇయర్ డే సెలబ్రేషన్స్ గొప్పగా మరపురాని విధంగా సెలబ్రేట్ చేసుకోవాలని పోటీపడుతున్నారు? అంటుంది సహజ.

"అలా అని సభ్యత సంస్కృతి సంప్రదాయం మరచిపోకూడదు సహజా పాశ్చాత్య దేశాల మోజులో కొట్టుకుపోకూడదు. ఇంగ్లీషు సంవత్సరాది ఆరంభ సమయమైనంత మాత్రానా స్టార్ హోటళ్ళో, క్లబ్బుల్లో, పాశ్చాత్య సంగీతపు హోరులో ఊగిపోనక్కర్లేదు. అశ్లీల నృత్యాల జోరుతో జతకలపాల్సిన పనిలేదు".

"మరేం చేయ్యాలట? మడికట్టుకొని ముట్లుడిగిన ముసలమ్మలా ఇంట్లోకూర్చోవాలా?

అసహ్యంగా మాట్లాడకు ట్రైటూ అండర్‌స్టాడ్ సహజా. ప్రతియేడాది ఆరోజున సిటీలో జరుగుతున్న బాగోతం నీకు తెలీదూ? యువతి యువకులు అర్ధరాత్రి తాగి రోడ్లపైకి వచ్చి వెర్రి గంతులు వేస్తున్నారు. కేరింతలు కొడుతూ హ్యాపీ న్యూ ఇయర్ అంటూ పిచ్చిగా అరుస్తూ నానా హంగామా చేస్తూ ట్రాఫిక్‌కు సైతం అడ్డొస్తున్నారు. అసలు వాళ్ళు ఎవరికి న్యూ ఇయర్ చెబుతున్నారో తెలియకుండా బైక్ మీద తిరుగుతున్నారు. పీకల దాకా తాగి రోడ్లపై ఒళ్ళు ఇల్లూ మరచి మరీ దొర్లుతున్నారు. ఇది విస్తరిస్తున్న విషసంస్కృతికి పరాకాష్ట కాదూ?" (సింహప్రసాద్: 2012;పుట – 56) అంటూ గాంధీ సుధీర్ఘ ఉపన్యాసం చేస్తాడు. ఇందులో అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ తమకు అనుకులంగా మార్చుకుంటున్నాయి కార్పొరేట్ సంస్థలు. పెట్టుబడి దారులు ఏవిధంగా భారతీయ సంస్కృతిని కాలరాస్తూ పాశ్చాత్య విష సంస్కృతి వ్యాపింప చేస్తున్నారో మనకు అర్థమవుతుంది. ప్రస్తుతం భారతీయ యువతి యువకులు విదేశీ సంస్కృతి వైపు ఎంతగా ఆకర్షింపబడుతున్నారో తెలుస్తుంది. రంగు రంగుల పాశ్చత్య సంస్కృతి భారతీయ సంస్కృతిని ఎలా ధ్వంసం చేయజూస్తుందో బలంగా వ్యక్తీకరించారు ఈ నవలలో రచయిత సింహప్రసాద్.

ఒక నాడు భారతీయ సంస్కృతి ఉత్కృష్టమైన సంస్కృతిగా ప్రపంచదేశాలతో కీర్తించబడింది. అయితే నేడు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పాశ్చాత్య సంస్కృతే విశిష్టమైన సంస్కృతిగా ప్రచారం ప్రారంభించారు పెట్టుబడిదారులు. కొన్ని శతాబ్దాలపాటు ఉన్నతమైన సంస్కృతిలో జీవించిన ప్రజలు నేడు కార్పొరేటు పెట్టుబడిదారి విషసంస్కృతిలో కొట్టుకుపోతున్నారు. ముఖ్యంగా యువత ఈ తరహా సంస్కృతికి త్వరగా బానిసలవుతున్నారు క్లబ్బులో తాగుతు మత్తులో జోగుతున్నారు.

తమాసోమా నవలలో క్లబ్బు బయటా లోపల భూతల స్వర్గమా అన్పించేలా ఏర్పాట్లు చేశారు. రంగురంగుల విద్యుద్దీపాలు, రకరకాల పూలమొక్కలు, ప్రత్యేకమైన లైటుస్తంభాలు,

రంగుల లైటింగ్ ఫోకస్ చేయబడిన స్టేజి, ఎన్నో రకాల స్టాల్స్, నోరూరించే ఆహార పదార్థాలు, హాట్‌డ్రింక్స్, సంగీత బృందాలు డాన్సర్ల్..!

ఇహక్లబ్బు కొచ్చిన వారిలో అత్యధికులు యువతీయువకులు. మిగతా వారు వయసు మల్లిన వారు. అంతా హైక్లాస్ అప్పర్ మిడిల్ క్లాస్ వాళ్ళే అని చెప్పాలి. లేకపోతే ఆ ఖరీదుని భరించడం సామాన్యుల వల్ల కాదు.

అంతా వింత వింత డ్రెస్సుల్లో మెరిసిపోతున్నారు. ఆనందోద్వేగంతో ఊగిపోతున్నారు తమ తమ పార్టనర్స్‌ని విడిచి వుండలేమన్నట్టుగా హత్తుకుపోతున్నారు. తింటున్నారు, తాగుతున్నారు, ఊగుతున్నారు, పేలుతున్నారు. సహజ కూడా వారిలో ఒకరైపోయింది. కాని నాకు ఊపిరాడ కుండా ఉంది. ఒకరకమైన నిషాలో యువత మునిగిపోతోంది అని బాధగా ఉంది. వెర్రితలలు వేస్తున్న నాగరికతను కళ్ళారా చూస్తోంటే వేదనగా వుంది"(సింహ ప్రసాద్; 2012:పుట – 63) గాంధీ పాత్ర ద్వారా చెప్పబడే ఈ మాటలు నేటి యువతని ఆలోచనల్లో ముంచెత్తేవే. ముఖ్యంగా పాశ్చాత్య సంస్కృతి భారతీయతపై తీవ్రమైన దాడి చేస్తోంది.

తెలుగు వారికి ఉగాది ఎంతో ప్రాముఖ్యత కలిగిన పండుగ. తెలుగు వారి నూతన సంవత్సరాది ఉగాది. అందువల్ల తెలుగుప్రజలు ఈ పండుగను ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుపుకుంటారు. భోగి నుంచి పండుగ అయిపోయే వరకు ప్రతి కుటుంబం, పిల్ల,పెద్దలతో ఇళ్ళన్ని కళకళలాడుతాయి. వసంత కాలంలో జరుపుకునే ఉగాది పండుగ రోజు ప్రకృతి వింత వింత శోభలతో మనకు కనువిందు చేస్తుంది. జీవితంలోని కష్టసుఖాలు, ఆనంద విశేషాలు అన్నింటిని మేళవించి చేసే ఉగాది పచ్చడికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. అయితే కాలక్రమంలో మన పండుగలు ఉనికిని కోల్పోతున్నాయి. ప్రపంచీకరణ పేరిట శరవేగంగా దూసుకొస్తున్న మార్పులు చివరకి పండుగలను కూడా మింగేస్తున్నాయి. ఉగాదిని ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రముఖమైన పండుగగా ప్రజలు చేసుకుంటున్నప్పటికీ, విదేశాలలో ఉన్నటువంటి తెలుగు ప్రజలు ఉగాది పండుగను మరచిపోయే స్థితి కన్పిస్తుంది. విదేశాలలో ఉన్నటువంటి తెలుగు వారు పండుగలను ఆచార వ్యవహారాలను మరచిపోతున్న స్థితిని చర్చించిన నవల సుధామూర్తిగారి 'డాలర్ కోడలు,' ఇందులో గౌరమ్మ పెద్దకొడుకు శేఖర్ అమెరికాలో ఉద్యోగం చేస్తుంటాడు. అతని భార్య గర్భవతి అవడంతో తల్లిని అమెరికాకు రమ్మని కోరతాడు శేఖర్. గౌరమ్మకు అమెరికాన్న అక్కడి డాలరన్నా వీపరీతమైన వ్యామోహం. శేఖర్ రమ్మనగానే భారతదేశం నుంచి అమెరికాకు వెలుతుంది. అక్కడికి వెళ్ళగానే గౌరమ్మ తన కోడలిని చూసి ఆశ్చర్యపోతుంది. భారత్‌లో ఉన్నప్పుడు

ఎంతో లక్షణంగా మర్యాదగా ఉండే కోడలు జమునలో మార్పుచూసి ఆశ్చర్యపోతుంది. అక్కడికి వెళ్ళిన గౌరమ్మ తన కోడలు తనను చూడగానే తన కాళ్ళకి నమస్కరిస్తుందని ఊహించి విజయవాడలో కనకదుర్గమ్మ ఆలయంలో అంక్షితలు తీసుకెళుతుంది. అయితే అక్కడికి వెళ్ళిన గౌరమ్మకు ఇవేవి జరగలేదు. ఊహించని పరిణామాలకు ఆశ్చర్యపోతుంది. ముఖ్యంగా అక్కడ ఉన్నటువంటి తెలుగు ప్రజలు మన పండుగలు సంస్కృతిని మరచిపోతున్న స్థితికి ఆవేదన చెందుతుంది.

సూక్ష్మగ్రాహి అయిన గౌరమ్మ ఇక్కడ పద్దతులు, వాతావరణాన్ని తొందరగానే ఆకలింపుచేసుకున్నారు. ఇండియావస్తే ఎంతో గౌరవ మర్యాదలు, వినయాలు నటించే జమునకు నిజంగా పెద్దలంటే గౌరవం లేదని తెలుసుకుంటుంది. చూలింత కట్టుకుంటుంది కదా అని ఐదువేల రూపాయలు పెట్టి పట్టుచీర, పచ్చని గాజులు తెచ్చిస్తే నిర్లక్ష్యంగా పక్కన పడేస్తుంది జమున.

ఉగాది అనేది తెలుగు వారికి అతి ముఖ్యమైన పండుగ, ఆ పండుగ కూడా ఎవరింట్లోనో జరుపు కున్నారే గాని, ఇంట్లో గుమ్మాలకి పసుపు పూసి కుంకుమపెట్టలేదు. ఇండియాకి వచ్చినపుడు ఎంతో ప్రేమ ఒలకబోస్తూ మాట్లాడే జమున ఇక్కడ మౌనంగానే ఉంటుంది. ఎంతో అవసరమైతే తప్ప మాట్లాడదు.(సుధామూర్తి : 2006; పుట – 87) ఈవిధంగా అమెరికా వంటి దేశాలలో ఉంటున్న తెలుగు వారు మన సంస్కృతిని నిర్లక్ష్యం చేస్తున్నారు.

## 6.3. కళలు

మానవుని బుద్ధి సూక్ష్మాలకు ఉపయోగించే దాన్ని కళ అని చెప్పవచ్చు. మానవాళికి ఉపయోగాన్ని చేకూర్చడంతోపాటు ఒక విధమైన సంతోషం, ఉల్లాసాలను తృప్తిని కలిగించేవి జానపద కళలు. సౌందర్యం ఆనందాల మేళవింపే కళలు. జానపదకళల ఆవిర్భావం ఆదిమానవుని మొదటి కాలం నుంచే కొనసాగుతున్నదని పేర్కొంటున్నారు. ఈ కళలు సాంప్రదాయ బద్దంగా తరతరాలుగా వారసత్వంగా తరువాతి తరాలకి సంక్రమిస్తున్నాయి. భారతదేశంను సంప్రదాయ జానపద కళలకి నిలయంగా చెప్పవచ్చు. అతి పురాతన కాలం నుండి జాతికి వారసత్వంగా సంక్రమిస్తున్న కళలు నేడు తమ ఉనికిని కోల్పోయే స్థితిలో కొట్టు మిట్టాడుతున్నాయి.

ప్రపంచీకరణ పేరిట శరవేగంగా చొచ్చుకొస్తున్న సామ్రాజ్యవాద విషసంస్కృతి తృతీయ ప్రపంచదేశాల సాంస్కృతిక వైవిధ్యాన్నీ ధ్వంసం చేస్తుంది. వీటిని తమ గుప్పెట్లో పెట్టుకొనేందుకు ఆధిపత్య రాజ్యాలకు ఓగొప్ప ఆయుధం ప్రపంచీకరణ. ఇందులో భాగంగానే ప్రపంచ దేశాల మీద

సాంస్కృతిక గుత్తాధిపత్యాన్ని రుద్దుతుంది. మనదైన ప్రతిదాన్ని, విలువలను, సాంస్కృతిక రూపాలను కబలించేసి మనది కాని వాటిని మన చేత స్వీకరింపచేస్తున్నది. ప్రపంచీకరణలో ఇవాళ మనదేశం కూడా ఈ ఫలితాలనే అనుభవిస్తున్నది.

మల్టీ టీవీ ఛానెళ్ళు నేడు నగరాలనుండి పల్లెలకి పాకిన తర్వాత ప్రజల సాంస్కృతిక జీవిత మంటే టీవీల ముందుకూర్చుని గంటలు గంటలు కాలక్షేపం చేయడంగా మారింది. ప్రతి పల్లెకు పల్లెలోని ప్రతి గుడిసెలోకి చొరబడిన ఈ రంగుల పెట్టె మన సమస్త కళలను, సంస్కృతిని ధ్వంసం చేస్తుంది. వినోదం పేరుతో అది చిమ్ముతున్న విషకాలుష్యం తరతరాల సాంస్కృతిక వారసత్వంగా వస్తున్న మన కళారూపాలను నాశనం చేస్తుంది. ఆ కళలనే నమ్ముకున్న జానపదుల బతుకు చిద్రమై చెల్లాచెదురవుతున్నారు. శతాబ్ధాల మన సాంస్కృతిక వారసత్వసంపదకు ముప్పు ఏర్పడింది. దీనతంటికి కారణం ప్రపంచీకరణ.

ప్రపంచంలోని వైవిధ్యాలను చెరిపేసి కుప్పలు తెప్పలుగా సరుకులను ఉత్పత్తి చేసి ఆధునికత పేరుతో ఆ సరుకుల వెంట పరుగులు తీసే మందను సృష్టించటం. ఆ మందకు సరుకులను అమ్ముకొని లాభాలు సంపాదించడం ఇదే ప్రపంచీకరణ సారం. దానికి లాభాలే ముఖ్యం. అందుకోసం ఎంతకైనా తెగిస్తుంది. దీని వల్ల ఎన్ని నాగరికతలు, సంస్కృతులు, కళలు, భాషలు, ఆహార్యాలు తన పదఘట్టనల కింద పడిచితికిపోతున్నా అదిలెక్క చేయదు. గతకొన్ని సంవత్స రాలుగా ప్రపంచమంతటా జరుగుతున్నదిదే.

ఇదిలా వుండగా మనదేశంలో హిందూత్వ వాదులు సంస్కృతిపరిరక్షణ పేరిట కొద్దిమంది ఆధిపత్య వర్గాల అల్ప సంస్కృతినే భారతీయ సంస్కృతిగా దేశ ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. భారతదేశం భిన్న సంస్కృతులకు నిలయమనే అంశాన్ని ఉద్దేశపూరితంగానే విస్మరించి అల్ప సంఖ్యాకులైన అగ్రవర్ణాల సంస్కృతికి పట్టం కట్టాలని చూస్తున్నారు. ఇది దేశీయంగా అమలవుతున్న సాంస్కృతిక సామ్రాజ్యవాదం.

అంతకంతకూ పెరుగుతున్న విదేశీ, స్వదేశీ శక్తుల సాంస్కృతిక దాడి మూలంగా వైవిధ్య భరితమైన, సుసంపన్నమైన మన జానపద కళలు, సాంస్కృతికంగా కనుమరుగవుతున్నాయి. నేడు వెన్నెల రాత్రుల్లో పల్లె నుండి పల్లెకు ప్రవహించే పాటలు లేవు. మనష్యులను ఒక జట్టుగా నిలిపి గెలిపించే ఆటలు లేవు. డప్పుల దరువులు లేవు, కోలాటాలు, చిందులు లేవు. చెక్కభజనలు, చెమ్మచెక్కలు, తోలుబొమ్మలు, కీలుగుర్రాలు, సాముగారడీలు, పగటివేషాలు – పటం కథలు, రేల పాటలు – దూల పాటలు, మందెచ్చులు, చిందుభాగోతాలు, గంగిరెద్దులు– గొల్లసుద్దులు,

గుస్సాడీలు– గురవయ్యలు, బుర్రకథలు – జముకుల కథలు, కాటిపాపలు– బాలసంతులు, కత్తుల నృత్యాలు – సాహసకృత్యాలు ఇలా ఒకటా రెండా లెక్కకు మించిన కథాగానాలు ......., మానవ జీవితాన్ని సౌందర్యభరితం చేసిన సాంస్కృతిక వృత్తులు ప్రమాదంలో కొట్టుమిట్టాడుతున్నాయి. వందల వేల సంవత్సరాల ఈ చారిత్రక వారసత్వ సంపదను కోల్పోవడమంటే జీవితాన్ని కోల్పోవడమే అవుతుంది.

ఒకప్పుడు ఊరి మధ్యలో చప్పుడైందంటే చాలు ఏవీధిలో గంగిరెద్దులు ఆడిస్తున్నారని భావించి పల్లెజనం గుంపులు గుంపులుగా అక్కడికి చేరేవారు. అక్కడ గంగిరెద్దులు చేసే విన్యాసాలకు ఆట పాటలకు పల్లెజనం ఉర్రుతలూగే వారు. ఇది రెండు దశాబ్దాల కిందటి మాట. ఇప్పుడు ఆ ఆటలు పాటలు కనుమరుగవుతున్నాయి. పల్లె కళాకారుల ప్రదర్శనలు అంతరించి పోతున్నాయి. ఇంటింటికి విస్తరించిన డిష్ యాంటీనాలు కేబుల్ ప్రసారాల పుణ్యమా అంటూ పల్లెపల్లెకూ పాకి పాశ్చాత్య సంస్కృతి ముంచెత్తింది. బుల్లి తెరపై రంగుల ప్రపంచాన్ని తిలకిస్తున్న పల్లె జనానికి మన ప్రాచీన కళలపై ఆసక్తి కొరవడుతోంది. దీని ఫలితంగా వీధి కళాకారుల జీవితాలు వీధుల పాలై ఈ పోటీ ప్రపంచంలో పొట్టకూటి కోసం పరుగులు తీస్తున్నారు. దుర్భర దారిద్ర్యంలో మునుగుతున్న కొందరు కళాకారులు యాచకులుగా మారుతున్నారు. ప్రాచీన కళల చరిత్రలో సింహభాగం నిలిచే గ్రామీణ కళలు వర్తమానంలో కానరావడం లేదు. భవిష్యత్ తరాలకు మచ్చుకైనా కన్పించేలా లేవు.

గ్రామీణ కళల్లో హరికథకు అత్యంత ప్రాముఖ్య ఉంది. మహాభారతం, రామాయణం, భాగవతం వంటి పురాణ గాథల్లో ఒక్కొక్క పర్యాయాన్ని కథలుగా మలుచుకొని సంగీతంలో ప్రావీణ్యం ఉన్న పండితులు ఈ కళలను పోషించేవారు. అనేక పాత్రలు అందులో లీనమైపోయి కథలుగా ప్రదర్శింస్తుంటే జనం మైమరచి వినేవారు. పగటి వేషగాళ్ళది మరో ప్రత్యేకత. బుడబుక్కలు, బుడగజంగాలు, హరిదాసులు, బాలసంతులు, దొమ్మర్లు, ఫకీర్లు, ఈ తరహా కళాకారులనే చెప్పుకోవచ్చు. వీరంతా ఏదో ఒక రూపంలో గ్రామాల్లో నిత్యం సంచరించే వారు. ఒళ్ళంతా కత్తులు గుచ్చుకుని వికృత రూపంలో కనిపించే బేగరులు, వేపాకునుంచి పాములను తేళ్ళను సృష్టించి కాటుక కనుపాపలలో కనుకట్టుని ప్రదర్శించి పల్లె జనాలను అబ్బురపరచే సాధనాసూరులు. చెక్కబొమ్మలాట, తోలుబొమ్మలాట, ఒకటేమిటి గ్రామీణ కళలు దేనికవే గొప్పగా కనిపిస్తాయి. మానవుడి మనోవికాసానికి వినోదానికి మంచి నడవడికకి జానపదకళారూపాలు ఆలంబనగా నిలిచాయి.

సినిమాలు, టీవీలు లేని ఆ రోజుల్లో ఈ వృత్తి కళాకారుల ప్రదర్శనలకు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. అలసిపోయిన పల్లె ప్రజలను వీరి ప్రదర్శనలు సేదతీర్చేవి. కళలను నమ్ముకొని జీవనం సాగించిన కళాకారులకి నేడు ఆదరణ కరువ్వడంతో కళలను నమ్ముకోలేక, నమ్ముకున్న కళలు కూడు పెట్టక దుర్భర జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం నాటి కళలను కళాకారులను రక్షిస్తామని ప్రకటనలు చేస్తున్నారే తప్ప అందుకు చర్యలు మాత్రం శూన్యం. విదేశీ సంస్కృతిని, వారి అలవాట్లను పుణికి పుచ్చుకుంటున్న నేటితరం వారికి నాటి జ్ఞాపకాలను, కళలను పట్టించుకోనే అవకాశం లేకుండా పోతుంది.

ప్రపంచీకరణ విధానాలు విశ్వవ్యాప్తంగా అమలవుతున్న ఈ రోజుల్లో టీ.వీ ఒక ప్రధాన సాంస్కృత ప్రసార మాధ్యమైయింది. పట్టణాలు మొదలు పల్లెల వరకు ఎక్కడ చూసినా టెలివిజన్ హావానే నడుస్తోంది. దీంతో ఇంతవరకు మన సమాజపు ప్రధాన వినోధాలుగా ఉన్న వివిధ కళారూపాలు ఒక్కొక్కటిగానే అంతరించిపోయే స్థితికి చేరువుతున్నాయి. మరో వైపు టీ.వీల్లో వివిధ రకాల ఛానల్స్, సినిమాల పేరుతో వ్యాపార వర్గాలు అందిన కాడికి దోచుకుంటున్నాయి. “పట్టణాలలో కనెక్షన్లే కనక్షన్లు 100 ఛానల్స్, రకరకాల ప్రోగ్రాములు, ఆడేవారికి ఆట, పాడే వారికి పాట, అసహనంగా టీ.వీ ముందు కూర్చొని కదలకుండా చూపుడు వేలితో బటన్స్ నొక్కుతూ రంగురంగుల ఛానళ్ళ రకరకాల హోయలు సోయగాలు చూస్తూ ఆదమరచి అఘోరిస్తున్న మధ్య తరగతి విగత జీవులు అనేకమంది నప్పేసంస్కృతి నుంచి విప్పేవికృతి దాకా ఎన్నో సరాగాలు విరాగాలు.”(రంగారావు.పి: 2002;పుట –75)

ఈవిధంగా ప్రపంచీకరణ నేపథ్యంలో కార్పొరేట్ వర్గాల వ్యాపార ప్రసార మాధ్యమాల కింద సమస్త కళలు నశించి పోతున్నాయి. మరో వైపు సామాన్య ప్రజల ఆలోచనలు కూడా కార్పొరెట్ వర్గాల వారి ఒత్తిడికి తలొగ్గుతున్నాయి. ఒక నాడు కళలను ప్రధానంగా ఆదరించి ప్రోత్సహించిన సమాజం నేడు కళలపట్ల నిరాదరణ, నిర్లక్ష్యం వహించడం మనకు కనబడుతుంది. దీనంతటికీ ప్రధాన కారణం ప్రపంచీకరణ విషసంస్కృతే. కొన్ని వందల సంవత్సరాల పాటు ప్రజలకు ఆనందం, ఉల్లాసం కలిగించిన జానపదకళలు కేవలం కొన్ని దశాబ్దల కాలంలోనే పెనుమార్పులకు లోనవడం నేడు మనం ఆలోచించాల్సిన అవసరం ఉంది. సింహప్రసాద్ రచించిన డాలర్.. డాలర్...!నవలలో సామాజిక జానపద కళలు నేడు ఏవిధంగా ఉనికిని కోల్పోతున్నాయో చర్చించడం జరిగింది.

డాలర్......!డాలర్....! నవలలో ముకుందం రామారావు స్నేహితులు ముకుందం కొడుకు దొరబాబు. రామారావుకి ఇద్దరు పిల్లలు సుస్మిత, శ్రీను దొరబాబు ఉన్నత చదువులు చదువుతూ అమెరికాలో ఉద్యోగం చేస్తుంటాడు. ముకుందం కేవలం డబ్బు సంపాదించి అధిక ధనవంతున్ని కావాలనే ఉద్దేశ్యంతోనే దొరబాబుకి చిన్న తనం నుంచి చదువు ఒక్కటేలోకంగా నేర్పుతాడు. అయితే రామారావు తన పిల్లలకు చదువుతో పాటు వారికిష్టమైన సంగీతంలో కూడా ప్రోత్సహిస్తాడు. సుశ్మిత డాక్టర్ అవుతుంది, శ్రీను సినీనేపథ్య గాయకుడిగా పని చేస్తుంటాడు. అయితే ముకుందానికి ఈ సంగీతాలు, సరదాలన్నా గిట్టేవి కావు. ఆయన దృష్టిలో కేవలం కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివి విదేశాలకెళ్ళి డబ్బు సంపాదించడమే గొప్ప. ఆ ఉద్దేశ్యంతోనే కొడుకు దొరబాబుని తీర్చిదిద్దాడు. అయితే దొరబాబుకి సుశ్మిత శ్రీను లాగా ఎంతో ఆనందంగా గడపాలన్నా వీలుండేది కాదు. ఈ విషయాలన్ని దొరబాబు సుశ్మిత శ్రీను వాళ్ళ ఇంట్లో పదేపదే చెబుతాడు. అయినప్పటికీ తండ్రి కోర్కేమేరకు కంప్యూటర్స్‌లో  ఎమ్మెస్ చేయడానికి వెళ్ళి అక్కడ ఒంటరితనంతో డ్రగ్స్‌కు అలవాటు పడతాడు. శ్రీను సినీ నేపథ్య గాయకుడిగా ఒక సినిమాలో పాటకి జాతీయ అవార్డు దక్కించుకుంటాడు. సుశ్మిత డాక్టర్‌గా పేదలకు వైద్యం అందిస్తుంది. అంటే ఇక్కడ రెండు కుటుంబాల్లోని పిల్లలపై తల్లి, దండ్రి పాత్రలు ఏవిధంగా ఉంటాయో తెలుస్తుంది.

శ్రీనుకు జాతీయ అవార్డు రావటంతో నగరంలోని సంగీత సాంస్కృతిక సంస్థలన్ని కలిసి గొప్ప సన్మానం చేయాలని ఏర్పాట్లు చేస్తారు. ఆ సన్మాన కార్యక్రమంలో శ్రీను తన తల్లిదండ్రుల ప్రోత్సహాన్ని అక్కడ చెప్తాడు. కార్యక్రమానికి వచ్చిన కొద్దిమంది తల్లి దండ్రులైనా మారి తమ పిల్లలకు విద్యతో పాటు తమ కిష్టమైన రంగాన్ని ఎంచుకోవడానికి అవకాశం కలిగిస్తారని శ్రీను ఆశపడుతూ "ఈ నాటి తల్లి దండ్రులు తమ పిల్లలు డాక్టరో, ఇంజనీరో కావాలనుకుంటారు తప్ప ఒక సంగీతకారుడో, ఒక చిత్రకారుడో, ఒక క్రీడాకారుడో, ఒక సాహితీపరుడో కావాలనుకోరు. ఎందుకంటే వాటిల్లో ఆదాయం తక్కువ శ్రమ ఎక్కువ గనుక. సుఖ సంతోషాలకి కేవలం డబ్బే చాలదని ఒక ఆసక్తి, ఒక అనురక్తి, ఒకతృప్తి ఉండాలని వారు గ్రహించరు. కేవలం డబ్బు సంపాదించే యంత్రాలుగా తమ పిల్లలని మార్చాలని చూస్తారు". (సింహప్రసాద్;2012: పుట – 125) పై మాటలు సమాజాన్ని ఒక సారి ఆలోచించమని చెబుతాయి. నేడు చాలా మంది తల్లి దండ్రులు తమ పిల్లల్ని సంపాదించే యంత్రాలుగా చూస్తున్నారే తప్ప వారి ఆసక్తి, ప్రతిభను గుర్తించడం లేదు. ఈ పరిస్థితి మారాలి. సమాజంలో మనుష్యులకి కేవలం డబ్బు సంపాదన ఒక్కటే కాదు. సంస్కృతి కళలు కూడా ఎంతో అవసరం.  వీటి ద్వారానే మనిషి నిజమైన ఆనందాన్ని

పొందుతాడు. మన ప్రాచీన సంప్రదాయ జానపద కళారూపాలను సంరక్షించుకోవాల్సిన భాద్యత మనందరిపైన ఉంది.

## 6.4 క్రీడలు

ప్రంపచీకరణ ప్రభావానికి గురికాని రంగంలేదని మనం ముందుగానే చెప్పుకున్నాం దీని ప్రభావానికి గురైన మరో అంశం క్రీడలు. వ్యక్తుల శారీరక దారుఢ్యానికి, మానసిక వికాసానికి, ఉల్లాసానికి తోడ్పడేవి క్రీడలు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాలలో వీరివీరి గుమ్మడి పండు, గోళీలు, బొంగరాలు, తొక్కుడుబిళ్ళ, రైలాట, బంతాట, కబడ్డీ, అష్టాచమ్మా, పులిమేక, వామన గుంటలు, ఒప్పుల కుప్ప మొదలైన ఆటలతో సందడిగా ఉండేది. అయితే నేటి పరిస్థితి ఇందుకు విరుద్దంగా ఉంది. ఆనాటి ఆటలన్నీ ప్రకృతిలోనే ఆడేవి. ఆటకు కావలసిన వనరులు కూడా సహజవనరులే. ఇక ఆర్థికంగా వ్యయమంటూ వీటికొరకు అయ్యేదికాదు. కావలసింది బుద్ధిబలము, దేహశ్రమ మాత్రమే అందుకే ఎన్ని తిన్నా కూడా అరుగుదల అయ్యేది. గ్రామీణ సంప్రదాయ క్రీడలన్నీ నేడు కనుమరుగయ్యే స్థితికి చేరుకున్నాయి.

ఒకనాడు పల్లెలోనూ పట్టణాల్లోనూ, ఆట, పాటలతోపాటు చదువులూ సమాంతరంగా సాగేవి. అయితే నేడు ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయిందని చెప్పవచ్చు నేటి పిల్లలకు కంప్యూటర్ ఆటలు లేకపోతే క్రికెట్. ఈనాటి ఆటల్లో ప్రధానంగా దేహశ్రమ కనబడుటలేదు. ఇపుడు పల్లెల్లో ఆడే ఆటలు కూడా ప్రపంచీకరణ ప్రభావానికి లోనయ్యాయి. నేడు విద్యాసంస్థల్లో నర్సరీ నుంచే ర్యాంకులయావ కనబడుతుంది. విద్యలో వ్యాపార ధోరణి, మా పిల్లలు ఆకాశశిఖరాలను అందుకోవాలనే అనే పేరాశల మధ్య ఈ ఆటలన్నీ నిర్వీర్యమైపోయాయి. కొన్ని ఆటలు పూర్తిగా నశించి పోయాయి. ఈనాడు కంప్యూటర్‌లో ఆటలాడటం సాధారణమైపోయింది. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రతిదీ వ్యాపారమైనట్టే క్రీడల్లో కూడా వ్యాపార ధోరణి ప్రవేశించింది. ప్రతిదీ వ్యాపారమైన నేటి పరిస్థితుల్లో ఆటలు ఇందుకు అతీతంకాదు. నేటి సమాజంలో క్రికెట్, చదరంగం, టెన్నిస్, గోల్ఫ్ వంటి ఆటలు నేర్చుకొని త్వరగా కోట్లు సంపాదించాలనే తాపత్రయం తప్ప మరోటి కనబడదు. దీనంతటికి కారణం జీవితాల్లోకి చొచ్చుకొచ్చిన గ్లోబలైజేషన్.

నేడు కార్పొరేట్ విద్యాసంస్థల్లో క్రీడల పరిస్థితి మరింత దిగజారింది. పిల్లలకు ఆటల్లేని చదువు చంద్రుడు లేని వెన్నెలలా ఉంటుంది. పిల్లల భవిష్యత్‌కు పునాది చదువేనన్న విషయం అందరికీ తెలుసు. కానీ ఆటలతో పిల్లల మానసిక ఆరోగ్యం ఆధారపడి ఉంటుందనే విషయం

మరువరాదు. ఇటీవల విద్యాసంస్థల్లో నెలకొన్న పోటీ వలన చదువుకు ఇచ్చిన ప్రాధాన్యత ఆటలకు ఇవ్వడం లేదు. పిల్లలకు శారీరక శ్రమ కలిగించే ఆటలు కానీ, మైండ్ గేమ్స్ కానీ అందుబాటులో ఉంచకుండా కేవలం చదువు ఒకటే చాలు అనుకుంటే చాలా ప్రమాదం. పిల్లలకు ఆటలు లేని చదువు వారి మానసిక ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపుతుంది. నేడు చాలా మంది పిల్లలు సరైన క్రీడా వ్యాయమాలు లేక స్థూల కాయత్వంతో బాధపడే స్థితిని మనం చూస్తున్నాం. అయితే రోజులు మారిపోయాయి. క్రీడల్లో కొత్త కొత్త పోకడలు దిగుమతి అవుతున్నాయి. చిన్నతనంలో విపరీతమైన ఆకర్షణ ఉంటుంది. పిల్లలు దేన్ని చూస్తే అదే కావలనే విషయం మనకు తెలిసిన విషయమే. మారుతున్న కాలంతో పాటు కొత్తగా వస్తున్న ఆటలు కూడా పిల్లల్ని విపరీతంగా ఆకర్షించడం మొదలు పెట్టాక ఇప్పుడు క్రికెట్, హాకి, టెన్నిస్, గోల్ఫ్, చెస్ వంటివి తప్ప ఏ ఆటలు గుర్తుకు రావడం లేదు. ప్రస్తుతం ఈ ఖరీదైన ఆటలే దేశంలో రాజ్యమేలుతున్నాయి. అయితే ఈ ఖరీదైన ఆటలు ప్రస్తుతం యువతను విపరీతమైన వ్యామోహానికి గురి చేస్తున్నాయి. మరో వైపు కార్పొరేట్ సంస్థలు తమ పెట్టుబడులను అనుత్పాదక రంగాలైన క్రీడల వైపు మళ్ళించాయి. నేడు దేశీయంగా క్రికెట్‌కు ఉన్నటువంటి ప్రచారం, ఆదరణ మరో క్రీడలకు ప్రభుత్వాలు కల్పించలేక పోతున్నాయి. ఫలితంగా సంప్రదాయక్రీడలు అంతరించిపోతూ, క్రికెట్ లాంటి క్రీడలు దూసుకుపోతున్నాయి. ముఖ్యంగా వాణిజ్య సంస్థలు క్రికెట్ క్రీడాకారుల చేత తమ వస్తువులకు వాణిజ్య ప్రకటనలు చేయించుకుంటూ వారికి విలువైన బహుమతులు, సౌకర్యాలు ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. వీరి ద్వారా వాణిజ్యవేత్తలు నూతన మార్కెట్లను సృష్టించుకుంటున్నారు. క్రీడాకారులు చేసే ఈ వాణిజ్య ప్రకటనలు ఎంతగా ప్రభావితం చేస్తున్నాయంటే బిస్కట్ ప్యాకెట్ నుంచి బీర్ల వరకు, చెడ్డీల నుంచి చెప్పుల వరకు, చివరకు అగ్గిపెట్టెలు, సబ్బుల వరకు క్రీడాకారుల బొమ్మలు లేకుండా మార్కెట్లోకి రావడం లేదు. ప్రస్తుతం ఐ.పి.యల్ అనుపేరుతో నిర్వహిస్తున్న క్రికెట్ క్రీడ ప్రజల డబ్బును పొందడంతో పాటు విద్యార్థుల చదువుల్ని నాశనం చేస్తోంది. అసలు ఎవరి ప్రయోజనాలకు ఇటువంటి క్రీడలను భారత్‌లో ప్రవేశపెడుతున్నారని ఆలోచిస్తే ముఖ్యంగా పెట్టుబడిదారీ వాణిజ్య వేత్తలకే లాభాల పంటలుగా ఇవి ఉపయోగపడుతున్నాయి.

## 6.5. ఆహారపు అలవాట్లు – దుస్తులు

మనం తినేటువంటి తిండి, మనం ధరించే వస్త్రాలు కూడా మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. ప్రపంచీకరణ ప్రభావంవలన మన సంస్కృతిలోని అనేక విభాగాలు వ్యాపారంలోకి

ప్రవేశిస్తున్నాయి. ముఖ్యంగా మన ఆహారం, అలవాట్లు, దుస్తులు మన పండుగలు, మన పరిసరాలు, మానవ ప్రవర్తన అభివృద్ధి పేరిట అనుహ్య పరిణమాలకు గురికాబడుతున్నాయి. అందులో భాగంగానే మన దేశంలోని ఆహార పదార్థాలు, అలవాట్లలో మార్పులు వస్తున్నాయి. కొంత కాలం క్రితం వరకు మన దేశంలోని పెద్దపెద్ద నగరాలు, పట్టణాలు, గ్రామాలు పెద్దగా రెస్టారెంట్లను ఎరిగి ఉండవు. ఒకప్పుడు రోడ్ల పై యాత్రికులు గాని, ఇతర ప్రయణీకులు గాని వంటలు వండుకుని అక్కడే తినేవారు. కానీ ఇపుడు దారులవెంట హోటళ్లు, రెస్టారెంట్లు వెలిశాయి. క్యాటరింగ్ పేరిట ఆహార సరఫరాలు జరుగుతున్నాయి. ఆహార పదార్థాలు ఒకప్పుడు స్థానిక రుచులతో సంప్రదాయంగా తయారయ్యేవి. వ్యాపారం చొరబడిన తర్వాత మొత్తం ఆహారపు పదార్థాలు, రుచులు నియంత్రించబడ్డాయి. మెక్‌డొనాల్డ్స్, పిజాహాట్స్, డోమినోస్ పిజ్జా, వాంపీస్ లాంటి సంస్థలు ప్రవేశించిన తరువాత మొత్తం ఆహారపు వ్యవస్థే మారిపోయింది. మహానగరాల్లో ఫాస్ట్‌ఫుడ్ ఉత్పత్తుల దిగుమతి మొదలైంది. స్థానికంగా ఇండ్లలో తయారు చేసుకునే వంటలకు బదులు పెద్దపెద్ద కంపెనీలు ఆహార ఉత్పత్తుల సరఫరా ప్రారంభమైంది. ఇళ్ళలో తయారు చేసుకునే పచ్చళ్ళకు బదులు కంపెనీల పచ్చళ్ళు ప్రవేశించాయి. ఈవిధంగా వ్యక్తులు తమకు నచ్చిన రుచులు, అలవాట్లకు బదులు మార్కెట్లు నిర్ధారించిన రుచులు, అలవాట్లకు మారిపోతున్నారు.

ప్రస్తుత భారతదేశంలో ఫాస్ట్‌ఫుడ్ సంస్కృతి అధికంగా విస్తరించింది. ఒక నాటి అంబలి అన్నం స్థానంలో నేడు బర్గర్, పిజ్జా, చాకోబార్, కేకులు, నూడిల్స్, గోబి మంచూరీయాలు తింటున్నారు. బేకరి సంస్కృతి విస్తృతమైపోయింది. ముఖ్యంగా విదేశీ కంపెనీలు భారతదేశంలో తమ రెస్టారెంట్లు ప్రారంభించి ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయి. వీటిలో మెక్‌డొనాల్డ్, బౌల్ ఓ చైనా రెస్టారెంట్, బాస్కిన్ రాబిన్స్, కె.ఎఫ్.సి (కెంటకీ ఫ్రైడ్‌చికెన్) మొదలగునవి. నాటి చల్లని మజ్జిగ, కొబ్బరి బొండాల స్థానంలో పెప్సీ, కొకాకోలా, థమ్స్ అప్ వంటివి వచ్చి చేరాయి. మొత్తానికి మన ఆహార అలవాట్లు మనవి కాకుండా చేస్తూ పాశ్చాత్య ఆహార అలవాట్లు మనకు పరిచయం చేస్తూ వర్ధమాన దేశాలను దోచుకుంటున్నాయి సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలు. అదేవిధంగా వస్త్రధారణలో విపరీతమైన మార్పులు నేడు మనం చూస్తున్నాం. శరీరానికి రక్షణతో పాటు సౌందర్యాన్ని ఇచ్చేవి దుస్తులు కొన్ని వందల సంవత్సరాల పాటు భారతీయ సంస్కృతికి దర్పణంగా నిలిచిన వస్త్ర సంస్కృతి నేడు పాశ్చాత్యులను అనుకరించేస్థితికి చేరిపోవడం ఎంతో బాధాకరం. మారే కాలంతో పాటు మనిషి అభిరుచుల్లో మార్పురావడం సహజమే అయితే ఆధునికత

ముసుగులో అశ్లీలకర, అసభ్యకరమైన. దుస్తులు ధరించడం యువతకు ఒక ఫ్యాషన్‌గా మారుతోంది. దీని పై ఆలోచించాల్సిన అవసరం సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉంది.

ఆధునిక సమాజం పేరుతో మన అంగంగాలనే కాకుండా ఇటీవలి వరకు మనం లోపలే దాచుకున్న మన లైంగిక ఇంద్రియానుభూతులను కూడా బహిరంగంగా వ్యక్తీకరించుకునే రకం సంస్కృతి సినిమాల రూపంలో, టీవీషోల రూపంలో మనం చూస్తున్నాం. ఇపుడు వచ్చిన పాపులర్ సంస్కృతి యూరప్ అమెరికాల్లో దశబ్దాల క్రితమే ఆ సమాజాలను ఆవహించేసింది. మన సమాజంలో ఇటీవలే అడుగు పెట్టింది. రావడం ఆలస్యంగా వచ్చినా సరికొత్తగా వస్తున్న దాని ప్రకంపనలకు మనం కదలిపోతున్నాం. లంగా, ఓణి, చీరలకు భారతీయ సంస్కృతిలో విశిష్టస్థానం ఉంది. ఆధునిక సమాజంలో వస్తున్న మార్పుల ఫలితంగా ప్రస్తుతం యువత సంప్రదాయ దుస్తులను పక్కన పెట్టి జీన్స్, టీషర్ట్‌ల వంటి వాటిని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. నేడు పసిపిల్లలు మొదలుకొని పండు ముసలుల వరకు పాశ్చాత్య వస్త్ర సంస్కృతికి ప్రాధాన్యతనిస్తున్నారు. వీటిని తయారు చేసే సంస్థల్లో అధికభాగం బహుళజాతి సంస్థలుండటం గమనార్హం. ఫలితంగా తరతరాలుగా సమాజానికి వస్త్రాలను అందిస్తున్న చేనేతలు, సంప్రదాయ దుస్తులను కుడుతూ ఉపాధి పొందే మన దర్జీలు ఉపాధికోల్పోయి ఆకలి కేకలతో అలమటించే స్థితికి నెట్టబడుతున్నారు.

'సింహప్రసాద్' రచించిన తమసోమా.....! నవలలో మారుతున్న ఆహార అలవాట్లు యువత తీరు సంస్కృతిని వివరిస్తుంది.

"బైక్‌మీద వెళ్తోంటే అంది ఆకలిగా ఉంది గాంధీ అని దగ్గర్లలోని రెస్టారెంట్‌లోకి వెళ్ళాం "బర్గర్ తింటావా లేక పెప్జీనా? నీకేది ఇష్టం చికెన్‌బర్గర్ నాకు అదే ఇష్టం"(సింహప్రసాద్: 2012; పుట– 75) పై వాక్యాన్ని పరిశీలిస్తే నేడు భారతీయ ఆహార అలవాట్లలో వస్తున్నటువంటి మార్పు స్పష్టంగా తెలుస్తుంది.

సంప్రదాయ ఆహార వంటకాలను కాటేస్తున్న బహుళజాతి కంపెనీల రెస్టారెంట్లు చివరికి భారతీయులకు ఆహారపదార్థాలను కూడా తాము చేసుకోలేని స్థితిని తెచ్చిపెడుతున్నాయి. మధ్యతరగతి, ఉన్నత వర్గాల వారికి వంటలు తయారు చేసుకోలేని స్థితి ఈ బహుళజాతి సంస్థల రెస్టారెంట్లు, స్వగృహ వంటి సంస్థలు తెచ్చి పెట్టాయి.

'ఆదెళ్ళ శైలబాల' రచించిన వెన్నెల్లో గోదావరి' నవలలో ప్రపంచీకరణ ఫలితంగా మారుతున్న జీవన విధానం, సంస్కృతులు వివరించారు.

"మాకు వంట రాదు. మా అమ్మలా, అమ్మమ్మలా మా జనరేషన్‌లో చాలామందికి వంట చేయడం రాదు. ఇంటికి ఎవరైనా అథితులు వస్తున్నారంటే టెన్షన్ మొదలవుతుంది. ఏమి వండాలి? ఎలా వండాలి? అని తెగకంగారుపడతాం. సంప్రదాయ వంటలు అస్సలురావు చెప్పుకుంటే సిగ్గుచేటు మొన్నీమధ్య మా ఫ్రెండ్‌ను శ్రీరామనవమి రోజు వాళ్ళ ఆయన పానకం చేయి అన్నాడట. వెంటనే నాకు ఫోన్ చేసి పానకం ఎలా చెయ్యాలి? అని అడిగింది. ఎలాంటి స్థితిలో ఉన్నామో మేము చూసావా? పులిహోర, చక్రపొంగలి, గారెలు, బొబ్బట్లు ఏవీ చేయటం రాదు. అందాకా ఎందుకు మంచి ఫిల్టర్ కాఫీ పెట్టడం కూడా రాదు. అన్నింటిని స్వగృహ ఫుడ్స్‌కు కానీ స్వీట్ షాపుకు కానీ పరుగులు పెట్టడమే" (శైలబాల,ఆదెళ్ళ:2011;పుట - 191) విశ్వీకరణ సమాజంలో మార్పులు ఆహార పదార్థాలలోనే కాకుండా తమ ఆహారాన్ని తాము తయారు చేసుకోలేని స్థితిలోకి క్రమంగా నెట్టబడుతోంది సమాజమని పై వాక్యాల పరిశీలనలో తెలుస్తుంది.

ఆధునికత పేరిట ఆహారపు అలవాట్లేకాదు, దుస్తులూ మారిపోతున్నాయి. లంగా, ఓణీ, చీర, ఖద్దరు వంటి సంప్రదాయ వస్త్రాల స్థానంలో స్కర్టులు, మిడ్డీలు, జీన్సు, పెన్సిల్‌కట్ వంటివి నేడు ఫ్యాషన్‌గా మారితున్నాయి. కొన్ని ఫ్యాషన్ షోలలో లోదుస్తులను ధరిస్తూ మోడల్స్ వికృత చేష్టలు ప్రదర్శిస్తున్నారు.

సుధామూర్తి రచించిన 'డాలర్‌కోడలు' నవలలో భారతీయ సాంస్కృతిక జీవితంలో వస్తున్నటువంటి వివిధ సంస్కృతి పరిణామాలను చిత్రించారు. ఈ నవలలో గౌరమ్మ, శ్యామన్నలు దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు. పెద్దకొడుకు శేఖర్ పెళ్ళిచేసుకొని అమెరికాలో ఉంటాడు. అమెరికా అంటే గౌరమ్మకు పిచ్చి వ్యామోహం అక్కడి వారన్న, అక్కడి డాలరన్నా అక్కడి వస్తువులన్నా ఈమెకు ఎక్కడి లేని వ్యామోహం. శేఖర్ పిలుపుమేరకు గౌరమ్మ అమెరికా వెళుతుంది. గౌరమ్మ శేఖర్ ఇంటికి చేరుకోగానే కోడలు జమునను చూసి ఆశ్చర్యపోతూ నమ్మలేక పోయింది. "సురభి పెళ్ళిలో నిమిషానికొక పట్టుచీర మారుస్తూ ఒంటి నిండా ఆభరణాలతో కళ్ళు మిరుమిట్లు గొలిపేలా పెళ్ళి పందిరంతా తెగతిరిగిన మహాలక్ష్మి లాంటి ఆ జమునేనా ఇది అనిపించింది. చిన్న బాబ్, మొకాళ్ళ పైకి ఫ్రాక్‌లాంటిడ్రెస్సు బొట్టులేని నుదురు తాళిబొట్టులేని మెడ, ముక్కు పుడకలేదు, గాజులు లేని మొండి చేతులు ఒంటి నలుపు విరిగింది. సికింద్రాబాద్‌లో చాపల మార్కెట్‌లో చాపలమ్మే దానికి ఏ మాత్రం తీసి పోనట్టుంది" (సుధామూర్తి:2006; పుట-75) ఆని గౌరమ్మ మనసులో కోడలును అనుకొంటుంది. ముఖ్యంగా అమెరికా వెళ్ళిన భారతీయులు భారతీయ సంస్కృతులను మరచిపోతున్నారు. ప్రస్తుత ఆధునికత ముసుగులో భారతీయ సంస్కృతి

సంప్రదాయాలను ధ్వంసం చేస్తుంది ప్రపంచీకరణ. సింహప్రసాద్ 'తమసోమా' ఆదేళ్ళ శైలబాల' వెన్నెల్లోగోదావరి' నవలల్లో కూడా భారతీయ సంస్కృతి విచ్ఛిన్నమవుతున్న తీరు చిత్రించబడింది.

## 6.6 స్థానిక భాషా సాహిత్యాలు

ప్రపంచీకరణతో ఆయా దేశాల రాష్ట్రాల స్థానిక మాతృభాషలకు పెద్ద ఎత్తున విఘాతం కలుగుతోంది. ప్రపంచీకరణ ముసుగులో అమెరికా కేంద్రంగా కొనసాగుతున్న ఆంగ్లభాషాధిపత్యం వలన ప్రపంచంలోని దాదాపు 6500 భాషలలో సగానికి పైగా అంతరించిపోయే పరిస్థితి ఏర్పడిందని యూనెస్కో గత 15సంవత్సరాలకు ముందే హెచ్చరించింది. మాతృభాషపై క్రమేపీ మోజు తగ్గడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యావిధానాలు ఆపై ఉద్యోగాల విషయంలో అనుకరిస్తున్న వైఖరులే అందుకు ప్రబల కారణం. మాతృభాషల పరిరక్షణ విషయంలో ఐక్యరాజ్యసమితి వారు కూడా వివిధ దేశాల ప్రభుత్వాలకు ఏనాడో బాధ్యతను గుర్తుచేశారు. మాతృభాష దెబ్బతింటే అది కేవలం భాషాపరమైన నష్టాలకే పరిమితం కాకుండా క్రమేపి జీవన వైవిధ్యం కూడా దెబ్బతింటుంది.

అనాది మానవుల సంజ్ఞలు, సంకేతాలు అక్షర రూపం దాల్చి వివిధ భాషలు అభివృద్ధి చెందాయి. ఆ భాషలు ఆయా దేశాల, రాష్ట్రాల ప్రజల సంస్కృతికి, జీవన వైవిధ్యానికి దర్పణం. అలాంటి మాతృ భాషలపై ప్రజలు ఉదాసీనత వహిస్తే జాతి జీవన ప్రమాణాలకు, సంస్కృతి. సాంప్రదాయాలకు  తీరని మచ్చ ఏర్పడుతుంది. జాతీయ జీవనవిధానంలో ఆయా ప్రాంతాల సంస్కృతి, సాంప్రదాయం, వేషధారణ మాట్లాడటం వంటి వాటితో భాష అభివృద్ధి చెందుతుంది. తల్లి పాలతో గోరుముద్దలతో చందమామరావే జాబిల్లిరావే! అంటూ పిల్లలను ఊరడించే విధానాలకు స్వస్తి పలుకుతూ ఆంగ్లభాషపై మోజు చూపూతూ ఆ వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలనే తపనలో సమాజం ఊవ్విల్లూరుతూ ఉంది.

"ఒక జాతి వికాసం ఆ జాతి భాష, సంస్కృతుల్లో ప్రతిబింబిస్తూ ఉంటుంది. భాష అదృశ్యం కావాలంటే ఆజాతి అదృశ్యం అవ్వటమే, ఆజాతి సంస్కృతి సాహిత్యం అంతరించటమే" (భాషా – సంస్కృతి – ఉద్యమం. 2003; పుట –3) ఐతే ప్రస్తుత ప్రపంచీకరణ విధానాల వలన స్థానిక భాషల అస్తిత్వానికే ప్రమాదం ఏర్పడింది. తెలుగుకు ప్రపంచీకరణ గ్రహణం పట్టింది. ప్రపంచంలో పెద్ద భాషల్లో తొమ్మిదవ స్థానంలో ఉన్న తెలుగు భాష అస్తిత్వ సంక్షోభం లోకి జారిపోయింది. పర్యవసానంగా తల్లి భాష తెలుగుతో సహా ఏభాషలోనూ సలక్షణంగా నాలుగు వాక్యాలు రాయలేని నూతనతరం తెలుగునాట ఆవిర్భవించింది. రాబోయే మూడు దశాబ్దాల కాలంలో దాదాపు సగానికి

పైగా భాషలు అంతరించిపోతుందని అంచనా. ఈ భాషలను పరిరక్షించే ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21 వ తేదీన ప్రపంచ మాతృభాష దినోత్సవంగా జరుపుకోవాలని యునెస్కో తన సభ్యదేశాలకు పిలుపునిచ్చింది. బ్రిటీష్ భాషా శాస్త్రజ్ఞుడైన 'డేవిడ్ క్రిస్టల్' "భాషా రంగంలో మానవ జాతి తొలిసారిగా ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటుందని, ఒకానొక భాష 'విశ్వభాషగా'(గ్లోబల్ లాంగ్వేజ్) ఎదగడం అదే ఇంగ్లీషు భాష కావడం ఆశ్చర్యకరమని" పేర్కొన్నాడు. నేడు ప్రభుత్వాల అండతో ఇంగ్లీషు భాష ప్రాతిపదికన తెలుగుభాష జాతియుల్ని కలవారే లేని వారి బిడ్డలుగా వేరు చేసే కార్పొరేట్ విద్యా విధానమే దీనంతటికీ కారణం. ప్రపంచ వాణిజ్య అవసరాలకు అనుగుణంగా దేశ ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దే క్రమంలో విదేశీయుల గుమస్తా గిరీకి లావాదేవీలకు పనికి వచ్చే ఆంగ్ల విద్యను ప్రభుత్వాలు విచక్షణా రహితంగా ప్రోత్సహించడం జరుగుతోంది. ఫలితంగా భారతదేశానికి ఒక సమగ్రమైన, శాస్త్రీయమైన భాషా విధానం కొరవడింది. అభివృద్ధిని మనుషుల్లో కాకుండా వస్తువుల్లో మాత్రమే చూసే పాశ్చాత్య దృక్పథం సమాజంలో ప్రబలమైంది.

రాజకీయ దురుద్దేశ్యాల కారణంగా కొన్ని భాషలకే ప్రోత్సాహం లభించడం అభివృద్ధి పేరుతో సాగే పర్యావరణం విధ్వంసం కారణంగా అద్భుతమైన ఉన్నతమైన సమాజ భాషా సంపదలు అంతరించి పోయాయి. ఒక భాష అంతరిస్తే ఆ భాషా జాతీయుల అస్తిత్వం అంతరిస్తుంది. తద్వారా జాతి అస్తిత్వం కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. పాఠశాల విద్యలో ఆంగ్ల మాధ్యమం పేరిట ప్రభుత్వం, విద్యావ్యాపార వర్గాలు ప్రజల్లో సృష్టిస్తున్న వేలం వెర్రి సమాజంలో విషవృక్షంగా విస్తరించింది. భావవినిమయానికి, అవగాహనకు మాతృభాషను మించిన సౌకర్యవంతమయిన బాష వేరొకటి ఉండదు. అదీకాక ప్రాథమిక మౌళిక భావనలు మాతృభాషలోనే స్పష్టంగా ఏర్పడతాయి. శిశు వికాసంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రాథమిక భావనలు రూపొందే క్రమం దెబ్బతింటే ముందుతరాల అభివ్యక్తీకరణ సామర్థ్యం దెబ్బతింటుంది. భావితరాల మేధో విధ్వంసానికి దారితీస్తుంది. అందుకే ఫ్రాన్స్, జర్మనీ, తదితర యూరోపియన్ దేశాలు చైనా, జపాన్ తదితర ఆసియన్ దేశాలు మాతృభాషలో విద్య, పరిశోధనలకు ఎనలేని ప్రాముఖ్యత నిచ్చాయి. ఆంగ్ల భాష ఆధిపత్యాన్ని దిక్కరించి మంచి ఫలితాలు సాధించాయి.

తెలుగు జాతిలో మేధావులు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ తెలుగు భాషకు పారిభాషిక భాషాలక్షణం తీసుకు రావడంలో వారందరూ విముఖంగా ఉన్నారు. తమ పరిశోధనలకు విద్యా, ఉద్యోగాలకు పరిపాలనకు పరాయిభాషను ఉపయోగిస్తూ మాతృభాషను కేవలం

వాగ్వ్యవహారాలకు, దైనందిన కార్యకలాపాలకు వినియోగించడం వలన తెలుగు భాష ఆధునికరణకు దూరమై ప్రమాదానికి చేరువయ్యింది. మాతృభాషను ఆధునీకరించి తెలుగు జాతి వికాసానికి కృషి చేసే సంకల్పంలేని ప్రభుత్వాల కారణంగా తెలుగు భాషకు ఈ దుస్థితి ఏర్పడింది. ప్రపంచీకరణ కారణంగా ఆంగ్లభాష అధికంగా విస్తరిస్తున్న క్రమంలో స్థానిక భాషలు గతించి పోయే స్థితికి నెట్టబడుతున్నాయి.

పై అధ్యాయాన్ని పరిశీలించిన పిమ్మట క్రింది విషయాలు అవగతమవుతున్నాయి. తరతరాలుగా ఆచరిస్తున్న మన పండుగలు ఉత్సవాలు, జాతరలు ఉరుసులు ఒక్కొక్కటిగానే ఉనికిని కోల్పోయే పరిస్థితి ఇవాళ కనబడుతోంది. ప్రాచీనమైన మన ఆచారాలు ప్రపంచీకరణ వస్తువినిమయ సంస్కృతిలో వెనుకబడి పోతున్నాయి. ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా టీ.వీ సంస్కృతి పెరిగి. ఇది పట్టణాలు మొదలుకొని పల్లెల వరకు విస్తరించింది.

ఎవరున్నారో గానీ టెలివిజన్ 'ఇడియట్‌బాక్స్' అని అన్నారు. ఆ ఇడియట్‌బాక్స్ ఇండియాలోగిళ్ళలో నేడు క్రెడిబిలిటీ టాక్ అయ్యింది, ఇంటింటా యాంటెనాలు గ్రామాల నుంచి పట్టణాలు, నగరాల దాకా కేబుల్ కనెక్షన్లు మహాజోరుగా అదొక నిత్యవసర వస్తువైంది. మధ్యతరగతి పొదలు ఉండాల్సిన గుడిసె మీద యాంటెనా ఊగులాడుతుంది.

ఒకనాటి మన జానపద కళారూపాలయిన హరికథ, బుర్రకథ, వీదిభాగోతం, చిందుభాగోతం, చిందు, బుడబుక్కలాట, కోలాటం, బయలాట, తప్పెటగుళ్ళు మొదలైన జానపదకళారూపాలు ప్రపంచీకరణ దెబ్బకు ఒక్కొక్కటిగానే అంతరించే స్థితిలోకి నెట్టబడ్డాయి. ఈనాడు మన భాష, ఆచారాలు, సంస్కృతి, దుస్తులు, కళలు, మొదలైనవి అంతరిస్తూ పరభాష, ప్యాషన్‌షోల సంస్కృతి, పిజ్జా, బర్గర్లు, పాస్ట్‌ఫుడ్‌ల సంస్కృతి నేటితరానికి అలవడుతోంది. దీనంతటికి వేగంగా విస్తరిస్తున్న ప్రపంచీకరణ పాశ్చాత్య విష సంస్కృతే కారణంగా చెప్పవచ్చును.

# అధ్యాయం – 7

# ప్రపంచీకరణ ప్రభావ నవలలు – ఇతివృత్తాలు

## "ఇతివృత్తం" నిర్వచనం

ఒక రచయిత కథను నిర్మించుకోవడానికి ముందు ఒక ప్రణాళికను సిద్ధం చేసుకుంటాడు. ఎన్నో సన్నివేశాల నుంచి తన రచన నిర్మాణానికి రచయిత అనుసరించే క్రమబద్ధమైన సన్నివేశాల కూర్పునే 'ఇతివృత్తం' అని చెప్పవచ్చు. ఇతివృత్తం అనే పదానికి సమానార్థకంగా ఆంగ్లంలో Plot అని పిలుస్తున్నాం. ప్లాట్ అంటే 'ఒక ప్రదేశం'క్షేత్రం అని అర్థం.

"ఒక భావనను తీసుకోవటం ప్రధానం. దీన్నే కొంతమంది ఇతివృత్తం అంటారు". (శరత్జ్యోత్స్నారాణి, ఎస్: 2005; పుట – 25)

"నవలలో గానీ నాటకంలోగానీ, రచయిత ఊహాజన్యమైన చర్యల, పాత్రల, ఆలోచనల, ప్రత్యేకమైన, కాలనియమితమైన సమ్మేళనమే ఇతివృత్తం"(మృణాళిని,సి: 1988; పుట– 41)

"ఎన్నుకున్న సన్నివేశాలను క్రమబద్ధంగా, విస్మయాత్మకంగా, ఉత్కంఠభరితంగా నిబంధించేది ఇతివృత్తం". (నాగభూషణ శర్మ మొదలి: 2005; పుట–54)

"ఒక ఇతివృత్తాన్ని ఏర్పరచుకున్న తర్వాత ఆ కథను ఏపాత్ర దృష్టి నుంచి చెప్పాలో రచయిత నిర్ణయించుకుంటాడు. అదే నవల యొక్క కథా కథన శిల్పంలోని ముఖ్యాంశమైన దృక్కోణం(Point of view)" (మృణాళిని, సి: 1988; పుట –41)

## 7.1 "డాలర్....!డాలర్.......!"

ప్రపంచీకరణ నేపథ్యంలో నేడు 'డాలర్' ఒక కల. అది శ్రీమంతులనే కాక నేడు మధ్యతరగతి మనుషులను సైతం తన వైపు తిప్పుకుంటోంది. 'డాలర్' వేటలో పడి ఒక మధ్య తరగతి కుటుంబం ఏవిధంగా పతనమైందో వివరించిన నవల "డాలర్.....!డాలర్...!. దీని రచయిత సింహప్రసాద్. ఈ నవల 1999లో చతుర లో ప్రచురింపబడి 2010లో ముద్రణ రూపం పొందుకుంది.

ఈ నవలలో ముకుందం స్థానికంగా పట్టణంలోని మున్సిపల్ ఆఫీసులో గుమస్తాగా ఉద్యోగం చేస్తూ జీవిస్తుంటాడు. ఇతని భార్య పార్వతి, కుమారుడు దొరబాబు. ముకుందం తన కోరికలు ఆశలు, ఆశయాలు, లక్ష్యాలు అన్నింటినీ తన కుమారుడు దొరబాబు ద్వారా నెరవేర్చుకోవాలని కలలు కంటాడు. తన లక్ష్యం నెరవేరాలంటే తన కుమారుడు పెద్దపెద్ద చదువులు చదివి అమెరికా వెళ్ళి ఉద్యోగం చేసి మిగతా వారెవరికీ సాధ్యం కానివన్నీ సాధించాలని తపన పడతాడు. “టెన్త్ లో ఇంటర్లో, ఎమ్సెట్లో ర్యాంకులు సాధించాలి. ఇంజనీరింగ్‌లో గోల్డ్‌మెడల్ సంపాదించాలి. అమెరికా వెళ్ళాలి. ఉన్నత విద్యనభ్యసించి అక్కడే గొప్ప ఉద్యోగం చేపట్టాలి. కోట్లకు పడగెత్తాలి. నీ వయస్సు వాళ్ళకెవరికీ సాధ్యం కానివన్నీ సాధించాలి. చెప్పరాబాబూ ఇవన్నీ సాధిస్తావు కదూ. నా స్వప్నాలను సత్యాలను చేస్తావు కదూ.”(సింహప్రసాద్:2010; పుట-7) అంటూ ఉద్వేగంతో ఊగిపోతూ దొరబాబుని అడుగుతాడు. అయితే ఇవన్నీ తెలియని చిన్నతనంలో ఉన్న దొరబాబు అయిష్టంగానే తండ్రి మాటల్ని ఒప్పుకుంటాడు.

ముకుందం పక్క ఇంట్లో రామారావు అతని భార్య సరస్వతి ఉంటారు. వీరికి ఇద్దరు పిల్లలు కూతురు సుశ్మిత, కుమారుడు శ్రీను.  రామారావు ముకుందం స్నేహితులు. రామారావు తన పిల్లలకు ఇచ్చినటువంటి స్వేచ్ఛను ముకుందం తన కుమారుడు దొరబాబుకి ఇవ్వడు. ముకుందం దొరబాబు అక్షరబ్యాసం నాడే గుర్తుగా ఒక మామిడి చెట్టుని ఇంటిపెరట్లో నాటుతాడు. మొక్క ఎదిగేకొద్ది బాబు కూడా అభివృద్ధి చెందుతాడని ముకుందం నమ్మకం.

దొరబాబు, సుశ్మిత ఇద్దరూ ఒకే  పాఠశాలలో పదవతరగతి చదువుతుంటారు. ముకుందం అప్పుడప్పుడు పాఠశాలకు వెళ్ళి తన కుమారుని గురించి అక్కడి ఉపాధ్యాయులను అడుగుతుంటాడు. దొరబాబు ర్యాంక్‌హోల్డర్ అని వారు చెబుతారు. ఇంతలో పదవతరగతి పరిక్షాఫలితాలు వస్తాయి. ర్యాంక్ వస్తుందనీ ఆశతో ముకుందం పేపర్లలో తన కుమారుడి గురించి వెతుకుతాడు ఎక్కడా దొరబాబు పేరు కనబడదు. ఒక్కక్షణం హతాశుడవుతాడు. అయితే సుశ్మిత దొరబాబు ఇద్దరు ప్రథమ శ్రేణిలో పాసవుతారు. రాష్ట్ర స్థాయిలో కాకపోయినా జిల్లా స్థాయిలో 545 మార్కులతో ప్రథముడిగా నిలుస్తాడు దొరబాబు. దీంతో తల్లిపార్వతి సంతోషపడుతుంది.అయితే ముకుందానికి అనుకున్నంత సంతోషం కలగదు దొరబాబుని రామారావు సుశ్మిత వచ్చి అభినందిస్తారు.

పదవతరగతి ఫలితాల అనంతరం దొరబాబు సుశ్మితను కలిసి ఇంటర్లో ఏమి తీసుకోవాలనుకుంటున్నావని అడుగుతాడు. తను బైపీసి తీసుకుని డాక్టర్ని అవుతానని చెబుతుంది. మీరేమి తీసుకుంటారని అడుగుతుంది సుశ్మిత నాక్కూడ డాక్టరు అవ్వాలనుంది అంటాడు దొరబాబు. అయితే అతని చదువు, అతని తండ్రి నిర్ణయం మీద ఆధారపడిఉంది. సుశ్మిత బైపీసి తీసుకుంది. నేను కూడా బై.పీ.సి తీసుకుని డాక్టర్ని అవుతానని దొరబాబు తండ్రితో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తాడు. అయితే అందుకు ముకుందం ఒప్పుకోడు ప్రస్తుతం “ఈజీగా అమెరికా వెళ్ళాలన్నా తక్కువ కాలంలో కోట్లకి పడగెత్తాలన్నా అది ఇంజనీరింగ్ వల్లనే సాధ్యంరా రాబోయే కాలమంతా ఎలక్ట్రానిక్స్ దేరా నువ్వు ఎలక్ట్రానిక్స్ ఇంజనీరువి అయితీరాల్సిందే” (సింహప్రసాద్:2010; పుట – 36)అంటూ తెగేసి చెబుతాడు.

ముకుందం దొరబాబుని గుంటూరులోని రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ ఎం.పి.సిలో చేర్పిస్తాడు ముకుందం. హాస్టల్ జీవితం కొత్తకావడం వలన దొరబాబు భయపడి జ్వరం తెచ్చుకుంటాడు. దీంతో కళాశాల వార్డెన్ అతని ఇంటికి టెలిగ్రామ్ పంపిస్తారు. ఇది తెలిసి దొరబాబు తల్లి పార్వతి తన బాబుకు ఏమైందోనని తీవ్రంగా దుఃఖిస్తుంది. ముకుందం, పార్వతి ఇద్దరూ కలిసి హాస్టల్‌కి వస్తారు. బాబుకి హాస్టలు జీవితం కొత్తకావడం వలన జ్వరం వచ్చింది. అబ్బాయిని కొన్ని రోజులు ఇంటికి తీసుకెళ్ళి విశ్రాంతి ఇవ్వండి అని చెబుతారు కాలేజీ సిబ్బంది. ఇంటికెళ్ళిన తర్వాత దొరబాబు తాను గుంటూరు వెళ్ళనని ఇక్కడే కాలేజీలో చేరి చదువుకుంటానని చెబుతాడు. అయితే కోటి ఆశలను తన కుమారుని ద్వారా సఫలం చేసుకోవాలనుకున్న ముకుందం అందుకొప్పుకోడు. చివరకు దొరబాబుని ఒప్పంచి మళ్ళీ గుంటూరుకు పంపిస్తారు. కాలేజీలో మిగతా విద్యార్థులు ఎంతో ప్రశాంతంగా ఏ సమయంలో ఆ పనులు చేస్తూ ఆనందిస్తుంటారు. అయితే దొరబాబు మాత్రం నిత్యం చదువులోనే ఉంటాడు.

సంక్రాంతి సెలవులకు ఇంటికి వస్తాడు దొరబాబు. కుమారుడు ఇంటికి వచ్చినందుకు సంతోషంగా పాయసం చేసి పెడుతుంది పార్వతి. ముకుందం ఇంటికి వస్తూనే మార్కులెలా వస్తున్నాయని దొరబాబుని అడుగుతాడు. బాగానే వస్తున్నాయి డాడీ అంటాడు అతను. ఇంట్లో అతనికి ఇష్టమైనవన్నీ చేసి పెడుతుంది తల్లి. మీ తాత వాళ్ళు నిన్ను చూడాలనిపిస్తుందని కబురు పెట్టారు. ఒక సారి వెళ్ళిరారా అంటుంది. దీనికి ముకుందం అడ్డు తగిలి ఎందుకొచ్చిన తిరుగుళ్ళు చదువు పాడవుతుందంటాడు. సాయంత్రం తనకు ఇష్టమైన సుశ్మిత వాళ్ళింటికెళ్తాడు దొరబాబు. గుమ్మంలోనే ఎదురౌతుంది సుశ్మిత, వాళ్ళ అమ్మ సరస్వతి. సుశ్మిత ఇది వరకటి కంటే అందంగా

తయారయింది. హాయ్ అంటూ పలకస్తాడు. ఎప్పుడొచ్చావ్ లోపలకి రా అంటుంది సుశ్మిత. సుశ్మిత తమ్ముడు శ్రీను ఒక కీర్తనని సాధన చేస్తూ కనిపించాడు. బాగానే పాడుతున్నాడే అంటాడు దొరబాబు. సంగీతమంటే వాడికి ప్రాణం. ఈ మధ్యనే రేడియోలో కూడా పాడాడు. అప్పట్నుంచి వాడి సాధన ఎక్కువైందటుందంటుంది సుశ్మిత. దొరబాబుకి చిన్నప్పట్నుంచి కవిత్వమంటే ప్రాణం. రాత్రుళ్ళు అందరు పడుకున్నప్పుడు నిద్ర పట్టక ఏదో గీకుతుంటానని దొరబాబు తన జేబులో వున్న నాలుగు కాగితాలు బయటికి తీసి సుశ్మితకు చూపిస్తాడు. అవి చదివి ఆనందిస్తుంది ఆమె. ఆమె గీసిన చిత్రాలను చూసి దొరబాబు మెచ్చుకుంటాడు. ఎంతో ఆనందంగా తిరిగి ఇంటికెళ్తాడు .కొడుకు ఆనందాన్ని చూసి ముకుందం ఆశ్చర్యపడుతూ ఆనందిస్తాడు. సుశ్మిత అంటే బాబు కెంతో ఇష్టమని అనుకుంది పార్వతి. సుశ్మిత తన కోడలు అయితే బాగుంటుందని మనసులో అనుకుంటుంది. తర్వాత ముకుందం అనుమతితో దొరబాబు తాతగారి ఊరికెళతాడు.

తమ ఊరికి వచ్చిన మనవుడ్ని చూసి మురిసి పోతారు. తాత, అవ్వ నాంచరయ్య, కనకమ్మ, మేనత్త కూతురు కాత్యాయిని సిగ్గుపడుతూ వచ్చింది. ఏం చదువుతున్నావని అడిగితే నైన్త్ అని వంకర్లు పోతూ చెబుతుంది. బాగా చదువుకో అంటాడు దొరబాబు, ఇంతలో గుర్తొచ్చింది నిన్న సుశ్మికి చూపించిన కవితలు నిన్నటి షర్ట్‌జేబులో మరచి పోయి వచ్చాడు. దీన్ని చూసి తన తండ్రి ఏమి అనుకుంటాడో అని భయపడుతూ తిరిగి ఇంటికి వస్తాడు. తాను ముందుగా అనుకున్నట్లే వాటిని చూసిన ముకుందం ఈ పిచ్చిరాతలు ఏమిట్రా. వీటిని రాసే బదులు బుద్ధిగా చదువుకో అని మండి పడుతూ వాటిని చింపేస్తాడు. వాటిని చించుతూ ఉంటే తన గుండె నెవరో కోసేస్తున్నట్లుగా విలవిల లాడుతాడుదొరబాబు. తిరిగి చదువుకోవడానికి గుంటూరు వెళతాడు.

మే నెల వేసవి సెలవులు ముకుందం అన్న గారు కృష్ణారావు కుటుంబ సమేతంగా వస్తాడు. అతను రైతు డిపార్ట్‌మెంటులో ఆఫీసర్ హోదాలో ఉద్యోగం చేస్తుంటాడు. దొరబాబు గురించి ముకుందాన్ని అడుగుతాడు. రైల్వేసర్వీసు కమీషన్‌కి రాసే ఉద్దేశం వుంటే ముందే చెప్పు ప్రయత్నిద్దామంటాడు కృష్ణారావు. రాయడంటాడు ముకుందం. తమ్ముని మాటకు ఆశ్చర్య పడతాడు. అతని ఆలోచనంతా కుమారున్ని ఇంజనీరింగ్ చేయించి కోట్లకు పడగెత్తడమే తన అన్న కుటుంబాన్ని వచ్చినప్పటినుంచి గమనిస్తున్నాడు ముకుందం. వారి మాటల్లో, దుస్తుల్లో ఏదో హుందా తనముందనుకున్నాడు. తన కుమారున్ని వీరికి అందనంత ఎత్తుకు ఎదిగిస్తాననుకుంటాడు మనసులోనే.

జూనియర్ ఇంటర్ రిజల్ట్స్ వస్తాయి. దొరబాబుకి 94శాతం మార్కులు వస్తాయి. ఆ మార్కుల్ని చూసి ముకుందం నువ్వు చదువుకుంటున్నావా అక్కడ గాడిదలు కాస్తున్నావా? అంటూ తిడతాడు. ఈ విషయాన్ని దొరబాబు సుశ్మితకు చెబుతాడు. వారి సంభాషణ విన్న రామారావు ముకుందాన్ని హెచ్చరిస్తాడు. పిల్లల పట్ల వత్తిడి వద్దురా ఇంజనీరింగ్ తప్ప ఏకోర్సులు లేవన్నట్లు బాధపడకు అంటాడు. ఇంకా చాలా కోర్సుల గురించి చెబుతాడు రామారావు. అంతా శాంతంగా విన్న ముకుందం నిజమా బతికితే ఒక గొప్ప ఇంజనీర్లానే బతకాలంటాడు ముకుందం మాటలకు రామారావు నోరు తెరుస్తాడు.

ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయిన వెంటనే ఎమ్సెట్ కోచింగ్ మొదలు పెట్టేశారు. ఇంటర్మీడియట్ రిజల్ట్స్ వచ్చాయి. దొరబాబు సుశ్మిత ఇద్దరు ఫస్ట్ క్లాస్‌లో పాసవుతారు. బాబుకి 43వ ర్యాంక్ వస్తుంది. సుశ్మికి 913వ ర్యాంక్ వస్తుంది. ముకుందం ఎంతో సంతోషిస్తాడు. రామారావు దంపతులు కూడా సంతోషిస్తారు. పల్లెలో తన ఆస్తి వాటాను అమ్మి ఎప్పుడైనా ఎమ్సెట్ కౌన్సిలింగ్ మొదలు కావచ్చని యాభైవేలు వద్ద ఉంచుకున్నాడు ముకుందం. ఇంతలో ఐఐటి ఎంట్రెన్స్ రిజల్ట్స్ కూడా వచ్చాయి. అందులోనూ మంచి ర్యాంక్ వచ్చింది  దొరబాబుకి.  మద్రాసు ఐఐటి కాలేజీలో సీటు వచ్చింది. సుశ్మిత ఎం.బి.బి.యస్ లో చేరుతుంది.

నాంచారయ్యకు సీరియస్‌గా ఉందని పల్లెనుంచి ఫోన్ వస్తుంది. ముకుందం పార్వతి ఇద్దరూ వెళతారు. తాతయ్య తన మనవడ్ని చివరి సారిగా చూడాలని చెబుతాడు. ముకుందం ఫోన్ చేసి పిలిపిస్తానని చెప్పి బయటికి వచ్చి. దొరబాబుకి ఏవో పరీక్షలు ఉన్నాయంటా ఇప్పుడు రాలేదని చెబుతాడు ముకుందం ఇంతలో నాంచారయ్య ప్రాణం పోతుంది. క్రిస్టమస్ సెలవులకు వచ్చిన దొరబాబు తన తండ్రి చెప్పిన తప్పుకి, తాతయ్య మరణానికి చింతిస్తాడు. చూస్తుండగానే దొరబాబు బి.టెక్ ఫైనల్ ఇయర్‌కి వస్తాడు. కుమారున్ని అమెరికా పంపి చదివించేందుకు అన్నింటిని అమ్మేస్తాడు ముకుందం. దొరబాబు డిస్టింక్షన్‌తో బి.టెక్ పాసవుతాడు. అంతే కాకుండా కంప్యూటర్ లో యమ్మెస్సీ సీటు ఇస్తూ అప్లై చేసిన ఆరు యూనివర్శిటీల నుండి ఉత్తరాలు వస్తాయి.

దొరబాబుని అమెరికా పంపడానికి చివరకు తానుంటున్న ఇంటిని కూడా  అమ్మేస్తాడు. ఆ డబ్బుతో  దొరబాబు అమెరికా ఖర్చులు, విమానచార్జీలు అన్నింటిని చెల్లిస్తాడు. ఇప్పుడు ముకుందం పార్వతి ఊరికి చివర అద్దె ఇంటిలో ఉంటారు. దొరబాబుని పంపడానికి అతని మిత్రులు రైల్వేస్టేషన్ దాకా వచ్చి విడ్కోలు పలుకుతారు. సుశ్మిత కూడా వచ్చి నీ విద్యను విజ్ఞానాన్ని మన దేశం కోసం

ఉపయోగించినప్పుడే నీవు ఈ దేశానికి మేలు చేసిన వాడవవుతావు అని చెప్పి వీడ్కోలు పలుకుతుంది. ముకుందం, కుమారునితో పాటు హైదరాబాద్‌కి వచ్చి విమానం ఎక్కిస్తాడు. దొరబాబు అమెరికా వెళ్ళి పోతాడు. మరో వైపు సుశ్మిత ఇక్కడనే యం.డి. చేరుతుంది.

అమెరికాలో దొరబాబు యమ్మెస్ పూర్తి కాకుండానే పెద్దపెద్ద కంపెనీల నుండి ఉద్యోగం ఆఫర్లు వస్తాయి. ఈ విషయం తల్లిదండ్రికి తెలియజేస్తాడు. ఇది తెలుసుకొని ఆనందిస్తారు ముకుందం దంపతులు అధికజీతం వచ్చే కంపెనీలో చేరిపోమంటారు. అంతకుముందే ముకుందం రిటైరైపోయి ఉంటాడు. ఇప్పుడు కుమారుడు పంపించే డబ్బుతో ఇళ్ళు కట్టుకోవాలని స్థలాన్ని అన్వేషించి పోష్‌లోకాల్టిలో వెయ్యి గజాల స్థలంకొని ఇళ్ళు కట్టిస్తాడు. అలాగే ఒక కారు కూడా తీసుకొంటాడు. సుశ్మిత యం.డి పూర్తిచేసి సొంతంగా క్లినిక్ ప్రారంభిస్తుంది. సుశ్మిత తమ్ముడు శ్రీను సినిమా నేపధ్యగాయకుడిగా మారతాడు. అమెరికా నుంచి దొరబాబు ఇండియాకు వస్తాడు. అక్కడ దొరబాబు పరిస్థితులను అడుగుతుందిసుశ్మిత. తర్వాత సుశ్మిత హాస్పటల్‌ను సందర్శిస్తాడు దొరబాబు. కుమారున్ని చూసి గర్వంగా నవ్వుతాడు ముకుందం పార్వతి కూడా ఆనందపడుతుంది.

దొరబాబుకి పెళ్ళి సంబంధాలు చూడాలనే ప్రస్తావన వస్తుంది. సుశ్మితంటే దొరబాబుకి ప్రాణం. చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్నారు. సుశ్మితను కోడలిగా తెచ్చుకుందామంటుంది పార్వతి. ఈ ప్రతిపాదనను ముకుందం తీవ్రంగా వ్యతిరేకిస్తాడు. వాళ్ళు మన స్థాయికి సరిపోరంటాడు. చివరకు మూడు నాలుగు సంబంధాలు చూస్తారు. అందులో ఇంద్రాణి అనే అమ్మాయి కూడా ఉంటుంది. వాళ్ళ నాన్న భూషణం వారికి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఒక భవనం ఉంది గొప్ప శ్రీమంతులు. దొరబాబుకి ఇష్టం లేకున్నా ఈ పెళ్ళికి ఒప్పుకుంటాడు. వివాహం వైభవంగా జరుపుతారు. తర్వాత దొరబాబు ఇంద్రాణిని తీసుకుని అమెరికా వెళ్ళిపోతాడు.

రామారావు సరస్వతీ దంపతులు కూడా సుశ్మితకు పెళ్ళి సంబంధం చూస్తారు. పెళ్ళి కుమారుడి పేరు రవి అతడు కూడా డాక్టర్‌గా పని చేస్తుంటాడు. రామారావు దంపతులు ముకుందం దంపతులను సుశ్మిత వివాహానికి ఆహ్వానిస్తారు. దొరబాబుకి కూడా ఆహ్వానం పంపుతారు అయినా అతను గ్రీటింగ్స్ పంపి వివాహానికి రాడు.సుశ్మిత పెళ్ళి అయిపోతుంది అమెరికా వెళ్ళిన బాబు నుంచి ఈ మద్య ఉత్తరం, ఫోన్ వంటివి రావడం లేదు. పెళ్ళి తర్వాత మారిపోయాడనుకుంటుంది పార్వతి అయితే ముకుందం మాత్రం అలాంటిదేంలేదు బాబు ఉద్యోగంలో బిజీగా ఉన్నట్టున్నాడంటాడు. అయితే ముకుందం ఈ మద్య దొరబాబు పెళ్ళి విషయం ఇంద్రాణితో చేసి

తప్పు చేశానా అంటూ బాధ పడుతుంటాడు. మరో వైపు ముకుందం ఆరోగ్యపరిస్థితి కూడా కొంత క్షీణిస్తుంది. అతనికిప్పుడు బాబుని చూడాలనిపిస్తుంది వైద్యం కోసం సుశ్మిత దగ్గరికెళతాడు ముకుందం. సుశ్మిత ముకుందాన్ని పరీక్షించి కొన్ని మందులు రాసి వేసుకోమంటుంది.

ముకుందం బాబుకి ఫోన్ చేసి ఇంటికి వచ్చేయిరా ఇక్కడే ఉందాం అంటాడు. ఫోన్‌లో ఏమి మాట్లాడావు అన్న విషయాన్ని అతని భార్య ఇంద్రాణి అడగగా మా డాడీ మన దేశం వచ్చేయండి ఇక్కడే ఉందాం అంటున్నాడని చెబుతాడు. అయితే అందుకు ఇంద్రాణి ఒప్పుకోదు. మనం ఈ దేశం విడచి వెళ్ళడానికి వీల్లేదు. మీరు కంప్యూటర్‌లో అద్భుతాలు సృష్టించగలరని మీ కొలిగ్స్ అంటున్నారు మనమే సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేసి లక్షల డాలర్లు సంపాదిద్దాం. కోట్లకు పడగెత్తుదాంమంటుంది. ఆ మాటలు విన్న బాబు అయోమయంగా ఆమె వైపు చూసి డబ్బు! సంపద! సుఖం! స్వర్గం! నిన్నటి దాకా డాడీ కల ఆకాంక్ష ఇది ఇవాళ ఇంద్రాణి కూడా ఇదేకోరుకుంటుంది. మరోవైపు కావలసినవన్నీ నెరవేర్చుకున్నాడు ముకుందం. అయితే  తినాల్సిన వయసులో తినలేక పోయాడు. ఇవాళ అన్నీ ఉన్నా తినలేక పోతున్నాడు. కారణం డబ్బు సంపద వ్యామోహంలో పడి ఆరోగ్యంతో పాటు అన్నింటిని కోల్పోయాడు. ఇంకోవైపు బాబుకి ఫోన్ చేసినా ఇంద్రాణి ఫోన్‌లో మాట్లాడి ఆ మాటలు బాబుకి చేరకుండా అడ్డుకుంటుంది. ఈ విషయం తెలిసిన బాబు చాలా బాధపడతాడు. దొరబాబు అమెరికా వెళ్ళిన మొదట్లో వివిధ కవితలను రాసి సుశ్మితకు మెయిల్ చేసే వాడు కాని ఇప్పుడు మెయిల్స్ తక్కువయినాయి. బాబు కవితల్లో జీవం ఉండటం లేదు. దొరబాబును ఒక్కోసారి ఇంద్రాణి దగ్గరకు కూడా రానిచ్చేది కాదు.ఆ పరిస్థితుల్లో దొరబాబు ఒంటరిగా బాధ పడుతూ డ్రగ్స్‌కి బానిస అవుతాడు. చివరకు తీవ్రమైన వత్తిడిలో ఒంటరితనంతో బాధపడుతూ సుశ్మితకు ఉత్తరం రాశి ఆత్మహత్య చేసుకుంటాడు. ఈ విషయం దొరబాబు తల్లి దండ్రికి తెలియదు.

ఇంద్రాణి అమెరికా నుంచి హైదరాబాద్‌కి వచ్చేస్తుంది. ముకుందం పార్వతి దంపతులు బాబుకి ఫోన్ చేస్తారు. ఎన్ని సార్లు రింగయినా ఫోన్ ఎత్తక పోవడం వలన వీరికి అనుమానం కల్గుతుంది. ఇంద్రాణికి ఫోన్ చేశాడు ఆమె ముక్తసరిగా మాట్లాడి ఫోన్ పెట్టేస్తుంది. బాబు గురించి అడిగినా చెప్పదు. ఈ విషయాన్ని సుశ్మితకు తెలియజేస్తారు. దీనికి సుశ్మిత ఇంద్రాణితో ఇప్పుడే ఫోన్‌లో మాట్లాడాను. బాబు ఎదో పని మీద కెనడా వెళ్ళాడాట. ఇంద్రాణి తిరిగి పుట్టింటి కొచ్చింది. మీకు తెలిస్తే బాధపడతారని బాబు ఫోన్ చేసి ఉండడని సుశ్మిత చెబుతుంది. తర్వాత ముకుందం తీవ్ర అనారోగ్యనికి గుర్తై ఐ.సి.యు లో చేరతాడు. పార్వతి నగరంలోని అన్ని దేవాలయాలకు వెళ్ళి

పూజలు చేస్తుంది. ముకుందంను ఐ.సి.యు నుంచి స్పెషల్ వార్డులోకి మారుస్తారు. బాబు నుంచి ఏమైనా ఫోన్ వచ్చిందా అని అడుగుతాడు ముకుందం సుశ్మితను. బాబు ఆత్మహత్య విషయం తెలిస్తే ముకుందం భయపడతాడని సుశ్మిత రవిలు బాబుతో మాట్లాడిస్తాం అంటూ శ్రీను గొంతుతో బాబు లాగా మాట్లాడిస్తారు. పార్వతి బాబుని త్వరగా ఇండియాకు వచ్చెయమంటుంది.మనకు ఆ డబ్బువద్దు డాలర్లు వద్దు ఇక్కడే ఉండి కలోగంజో తాగుదాం అంటుంది. వచ్చేయ్‌రా నామాట విని వచ్చేయరా బాబు అని రిసీవర్ పెట్టబోతుండగానే గబుక్కున ముకుందం ఫోన్ అందుకుంటాడు. అయితే అప్పటికే ఫోన్ కట్టవుతుంది.  ముకుందం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంటి కొచ్చేశారు. అయినా అతని శరీరంలో బి.పి షుగరూ పెరిగాయి. రోజురోజు అతని ఆరోగ్యస్థితి మనః స్థితి కూడా దిగజారుతున్నాయి. మందులు సరిగా పనిచేయడం లేదు. ఒక రకంగా మంచానికి అతుక్కుపోయారు. బంధుమిత్రులు వచ్చి సానుభూతితో ముకుందాన్ని చూసి పోతున్నారు. బాబు కోసం కలవరిస్తున్నాడు. పార్వతి అతని బాధను భరించలేక ఆవేశపడి దొరబాబు అన్ని ఫోన్ నెంబర్లకు ఫోను చేస్తుంది కానీ ఏ నెంబరూ కలవదు. డాక్టర్ సుశ్మిత వచ్చి ముకుందాన్ని పరీక్షిస్తుంది. అప్పుడు ముకుందం నా మీద ఒట్టేసి చెప్పమ్మా బాబు వస్తానని నీతో చెప్పాడా? అని అడుగుతాడు సుశ్మితను. అప్పుడు సుశ్మితకు కళ్ళలో నీళ్ళు వచ్చాయి. ఆ విషయాన్ని ఎలా దాచిపెట్టాలో తెలియక వారి ముందు బేలగా ఏడుస్తుంది. "బాబు లేడు! లే....డు అని అరచినట్టుగా చెప్పుతుంది సుశ్మిత. ఎమాయ్యాడు? ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ  అంటూ చిన్నగా అరిచారు ముకుందం బావురుమంది పార్వతి ఉలుకు పలుకు లేకుండా శూన్యంలోకి చూస్తుండి పోయాడు ముకుందం. ఆయన ప్రాణం ఆ శరీరపు బందీఖానాలో ఉండలేక ఇమడలేక కొట్టుకుని కొట్టుకుని నవరంధ్రాల నుంచి పారి పోయింది. అక్కడ ఉన్న వారంతా ఘొల్లున ఏడుస్తారు. అక్కడికి చాలా మంది వస్తారు కాని వచ్చిన వారిలో తల కొరివి పెట్టడానికి వరసైన వారెవరూలేరు. ఇది స్థూలంగా ఇతివృత్తం.

## 7.2 డాలర్ కోడలు

మధ్యతరగతి జన జీవితాల్లోని మానవ సంబంధాలను 'డాలర్' ఏవిధంగా ప్రభావితం చేస్తుందో దాని పర్యవసానాలు ఎలా ఉంటాయో ఎంతో హృద్యంగా తెలియజెప్పిన నవల డాలర్‌కోడలు. దీని రచయిత సుధామూర్తి ఈ నవల 2006 జనవరిలో తెలుగు ముద్రణ పొందింది.

శ్యామన్న, గౌరమ్మ దంపతులు. శ్యామన్న స్కూలు టీచర్‌గా పని చేస్తూజీవనం సాగిస్తుంటాడు. వీరికి ముగ్గురు పిల్లలు రాజశేఖర్, గిరీష్, సురభి. వీరు హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరిలో నివాసం ఉంటారు. శ్యామన్న గారిది గొప్ప వ్యక్తిత్వం. వివేకి, నిదానస్తులు ఓర్పు గలవారన్న మంచి పేరు కలిగిన వ్యక్తి. దీనికి విరుద్దంగా గౌరమ్మ వ్యక్తిత్వం ఉంటుంది. సంపన్నుల గనియైన అమెరికా అంటే ఆమెకు విపరీతమైన ఇష్టం. తక్కువ సమయంలో భాగ్యవంతులవ్వాలంటే ఆ డాలర్ ప్రపంచంలో అడుగు పెట్టాలని గ్రహించి అందుకు అనుగుణంగా పిల్లల్ని చదివించాలనే లక్ష్యంగా పెట్టుకుందామె శేఖర్ ఇంజనీరింగ్ పూర్తి చేస్తాడు. గిరీష్ కామర్స్‌లో డిగ్రీ చేసి బ్యాంక్‌లో క్లర్క్ ఉద్యోగంలో స్థిరపడతాడు. సురభి ఇంటి దగ్గరే ఖాళీగా ఉంటుంది.

బెంగళూరులో బ్యాంక్ టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగంలో చేరడానికి శేఖర్ విజయవాడ రైల్వేస్టేషన్‌లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఎక్కుతాడు. అదే రైలులో వినుత అనే అమ్మాయి తోటి స్నేహితురాళ్ళతో కలిసి బెంగళూరుకి ప్రయాణిస్తుంటుంది. వినుత ఒక పాట పాడుతుంది. ఆమె గంధర్వ గానానికి శేఖర్ ముగ్ధుడవుతాడు. అతను ఎస్.28 బెర్తులో కూర్చొని ఉంటాడు. ఇంతలో వినుత వచ్చి ఇది నాసీటు అంటూ టికెట్ చూపిస్తుంది. పొరపాటున టీ.సి ఇద్దరికి ఒకే బెర్తుకేటాయిస్తాడు. శేఖర్ ఆ సీటును వినుతకు వదిలి తను కింద పడుకుంటాడు. బెంగుళూరు రాగానే దిగి వినుత కోసం చూస్తాడు ఆమె కనబడదు అంతలో తన దూరపు బంధువు కిట్టీ వచ్చి శేఖర్‌ను తమ ఇంటికి తీసుకెళతాడు.

శేఖర్ బెంగుళూరులో తన దూరపు బంధువు కిట్టీ ఇంట్లో ఉండటం ఇష్టం లేక అద్దె గది కోసం మిత్రుడు శ్యామ్‌భాగ్‌తో కలిసి వెతుకుతాడు. తన ఆఫీసు దగ్గరగానే గదిని వెదకడం ప్రారంభిస్తారు. అక్కడ భీమన్న గారి ఇంటికి వెళ్ళి తలుపు తడతాడు తలుపు తీయగానే శేఖర్ నిర్ఘాంత పోతాడు. ఎదురుగా వున్నది వినుత అయినా ఏమీ తెలియనట్టుగా భీమన్నగారు ఉన్నారా? అంటాడు. ఆయనని కలిసి ఆయన విధించే షరతులన్నింటిని ఒప్పుకుని ఆ ఇంట్లో మేడ మీద గదిలో అద్దెకుంటాడు. ఆ ఇంట్లో ప్రతి పని వినుతనే చేస్తూ ఉండేది. ఆమెను మొదట్లో అనాథ అనుకుంటాడు శేఖర్. అయితే వినుత తల్లిదండ్రులు చనిపోతే తన ఇంట్లోనే పెదనాన్న భీమన్న కుటుంబంతో కలిసి ఉంటుందని తెలుసుకొంటాడు. పని చేస్తూనే ఆమె వినిపించే గానాన్ని మెచ్చుకుంటాడు శేఖర్. కొన్ని రోజుల తర్వాత హైదరాబాద్ ఎన్.ఆర్.ఎస్.ఎ (ఇస్రోలో ఒక భాగం) ఉద్యోగం దొరికిందన్న సమాచారం అందుతుంది శేఖర్‌కి. అందుకు సంతోషంగాను, వినుతను వదిలి వెళుతున్నందుకు బాధతోను హైద్రాబాద్‌కి వెళతాడు. అతనికి అమెరికా వెళ్ళాలన్న కోరిక

ఉంటుంది. ఈ జాబ్ ద్వారా అమెరికా వెళ్ళ వచ్చుననుకుంటాడు. అందుకు అనుగుణంగానే కంపెనీ వారు శిక్షణ నిమిత్తం అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రానికి పంపడానికి అవకాశం కల్పిస్తారు. దీంతో శేఖర్ అమెరికా వెళ్ళాలన్న బలమైన ఆకాంక్ష నెరవేరబోతోంది. గౌరమ్మకు కూడా కొడుకు అమెరికా వెళ్తున్నందుకు ఎక్కడ లేని సంతోషం కలుగుతుంది. శేఖర్ అమెరికా వెళ్ళి తిరిగి సంవత్సరం కల్లా ఇండియాకు రావాలి. సురభి, గౌరమ్మ చీరలు, వాచీలు, కేసరి, ఏలకులు తీసుకురా వచ్చేటపుడు అని చెబుతారు. ఆ ఇంట్లో ఏమీ కోరనిదల్ల శ్యామన్న గారు, గిరీష్ మాత్రమే.

శేఖర్ తను కలగన్నట్లుగానే అమెరికాలో అడుగుపెడతాడు. మానవుడికి ప్రాథమిక సౌకర్యాలు కల్పించి సేద తీర్చడంలో ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంటుంది ఆ దేశం. అమెరికాను చూసి అక్కడి డాలర్ శక్తికి వశమై పోతాడు. ఇంతలో ట్రైనింగ్ పీరియడ్ ముగుస్తుంది. ఆ దేశాన్ని వదిలి రావడం అతనికి ఇష్టం లేదు. తను ఇండియా వస్తే మళ్ళీ అమెరికా వెళ్ళలేను అనుకుంటాడు. అందుకే పేపర్‌లో పడ్డ ఒక ప్రకటన చూసి కంపెనీ ఉద్యోగానికి దరఖాస్తు పంపుతాడు. అందులో చేరితే గ్రీన్‌కార్డు ఇప్పించే బాధ్యత కంపెనీనే తీసుకుంటుంది. అక్కడ ఎంపికై ఇండియా తిరిగి రాకుండా అమెరికాలో ఉండి పోతాడు.

బెంగళూరులో భీమన్న గారు చనిపోతే వినుత తన మేనత్త ఇళ్ళైనా హైదరాబాద్ వచ్చి స్కూలు టీచర్‌గా పని చేస్తుంది. రోజూ బస్సులో వెళ్ళి తిరిగి వస్తుంటుంది. ఒక రోజు బస్సులో టికెట్ కోసం వందరూపాయలు ఇస్తుంది. కండక్టర్ చిల్లర లేదంటాడు. అదే సీట్లోకూర్చొని గిరీష్ బ్యాంక్‌కు వెళ్తుంటాడు. అతడిని చూసి కండక్టర్ మీ ఆయన ఇస్తాడులే అంటాడు. ఆ మాటకు వినుత గిరీష్ వైపు చూస్తుంది. అతను నవ్వుకుంటాడు. బస్సు దిగిన తర్వాత చిల్లర ఇస్తాను అంటుంది వినుత. దిగి చిల్లరకోసం ప్రయత్నించి దొరకక తన దగ్గర వున్న వందరూపాయలను గిరీష్‌కి ఇచ్చి నేను మీ బ్యాంక్‌కి వచ్చి తీసుకుంటాలే అంటుంది.

వినుత అత్త ఇందుమతి, మామ నారాయణమూర్తి. వినుతకు పెళ్లి సంబంధాలు చూస్తుంటారు. ఇందుమతి వినుతను ఈ ఆదివారం ట్యూషన్లు పెట్టుకోకు అంటుంది. ఎందుకత్తా అని వినుత అడుగుతుంది.నీకు ఈ రోజు పెళ్ళి చూపులు పెళ్ళి కొడుకు? బ్యాంక్ ఉద్యోగి, వాళ్ళ అన్న గారు అమెరికాలో ఉంటారు అని చెబుతుంది. పెళ్లి వారు వచ్చాక తీరా చూస్తే బస్సులో తనతో పాటు ప్రయాణించిన గిరీష్ అని సంబరపడుతుంది. పెళ్లి నిశ్చయమవుతుంది. మరో వైపు అమెరికాలో శేఖర్ మునిసోటా ప్రాంతానికి అలవాటు పడతాడు. గ్రీను కార్డుకు అప్లై చేస్తాడు.

ఇప్పుడు శేఖర్‌కి ఒంటరితనం బాధిస్తుంది. అతని దృష్టి పెళ్లి వైపు మళ్ళుతుంది. వినుత గురించి ఆలోచించి ఆమెకు ఒక ఉత్తరం రాస్తాడు. అక్కడ ఎవరూ లేకపోవడం వల్ల ఆ ఉత్తరం తిరిగి శేఖర్‌కి వస్తుంది. అందుకు శేఖర్ వినుతపై ఆలోచనను ఆపేస్తాడు. ఇంతలో గిరీష్‌కి పెళ్లి అంటూ ఒక ఉత్తరం అందుతుంది. అయితే గ్రీను కార్డు వస్తున్న సమయంలో తమ్ముడి పెళ్లికి వెళితే ఇక అంతే అనుకుని దీనికి బదులు ఒక వంద డాలర్లు పంపితే ఏమైనా కొనుక్కొంటారని పంపుతాడు. వినుత ఇపుడు ఎక్కడ ఉందో ఆమెను చేసుకున్నవారు అదృష్ట వంతుడనుకుంటాడు.

గిరీష్ వినుతల పెళ్లి అయిపోతుంది. అత్తారింట్లో అట్టే కలిసిపోతుంది వినుత. శ్యామన్న ప్రేమానురాగాలు వినుతకు తన తండ్రిని గుర్తుకి తెస్తాయి. అమితంగా ప్రేమించే భర్త ఇక ఇంతకన్న ఏమి కావాలి అనుకుంటుంది. స్కూల్లో శశికళ వినుతకు ఆప్త స్నేహితురాలు అయితే ఆమె శంకర్ అనే వ్యక్తి వలన మోసపోతుంది. అతను శశికళతో పెళ్లి నిశ్చయం చేసుకుని మరో భారతీయ అమెరికా అమ్మాయిని వివాహం చేసుకుంటాడు. శేఖర్‌కి ఆ రోజు చాలా ఆనందంగా ఉంది. దానికి కారణం ప్రమోషన్ గ్రీన్ కార్డు రావడం. తన పెళ్లి గురించి గిరీష్ శేఖర్‌కి ఉత్తరం రాసి పెళ్లి ఫోటో పంపిస్తాడు. ఫోటో చుసి శేఖర్ హతాశుడైతాడు. ఎక్కడ బెంగళూరు, ఎక్కడ సికింద్రాబాద్ నిజంగా శేఖర్ షాక్ తింటాడు. దాన్నుంచి కోలుకోవడానికి అతనికి రెండు రోజులు టైమ్ పడుతుంది. పెళ్లికి ముందు గిరీష్ అన్నగారు అమెరికాలో ఉన్నారని తెలిసినా శేఖర్ అనుకోలేదు వినుత. ముందుగా అద్దెకు వచ్చిన వ్యక్తిగా, సభ్యతగల యువకునిగా శేఖర్ పరిచయం పెళ్లి అయ్యాక అతని ఫోటో చూసి ఆశ్చర్యం కలుగుతుంది వినుతకు. ఇప్పుడు అతనే తన బావగారైనారు. అంతే తప్ప ఆమె మనసులో అతని పట్ల ఎలాంటి భావన ఉండదు.

శేఖర్ మూడు సంవత్సరాల తర్వాత ఇండియాకు రాబోతున్నాడు. విమానం నుంచి దిగుతున్న కొడుకుని చూసిన గౌరమ్మ భావోద్వేగానికి లోనై ఆమె కళ్ళు ఆనందంతో వర్షిస్తాయి. ఇంటికి వచ్చి తండ్రి కాళ్ళకు నమస్కరిస్తాడు శేఖర్. తలుపు దగ్గర నిలబడి ఉన్న వినుతను బాగున్నారా? జ్ఞాపక మున్నానా? అంటూ పలుకరిస్తాడు. అమెరికా నుంచి తాను తెచ్చిన చీరలు వినుత కిచ్చి తలా ఒకటి పంచమంటాడు. ఇండియాకు వచ్చిన శేఖర్ దేశాన్ని చూసి ఆశ్చర్యపోతాడు దేశంలో జన సంఖ్య ఎక్కు వైంది. ఎక్కడ చూసిన అశుభ్రతే అనుకుంటాడు.

శేఖర్‌కి నగరంలోనే ధనవంతుల్లో ఒకరైన కృష్ణమూర్తి గారి అమ్మాయితో అంగ రంగ వైభవంగా వివాహం జరుగుతుంది. అమ్మాయి పేరు జమున. పెళ్ళి పనులను క్షణం తీరిక లేకుండా

పని చేస్తారు. వినుత, గిరీష్‌లు. పెళ్లి తర్వాత శేఖర్, జమునలు అమెరికా వెళ్ళిపోతారు. పెళ్లి తరువాత ఇంటి వాతావరణం పూర్తిగా మారిపోతుంది. గౌరమ్మది ఎప్పుడూ జమున స్తోత్రమే. నిన్నటి వరకు ఇంటికి వినుత ముద్దుల కోడలు, ఇప్పుడు జమున జపమే గౌరమ్మది. ఎందుకంటే జమున ధనవంతుల అమ్మాయి కావడమే జమున పెళ్ళి తర్వాత వారి ఫోటోలు, వీడియోలు వాళ్ళు ఇచ్చిన కానుకలు ఇతరులకు చూపించడానికే గౌరమ్మ సమయం సరిపోతుంది. కోడలి నుంచి ఉత్తరం వస్తే గౌరమ్మ కాళ్ళు నేల మీద నిలబడవు. గిరీష్, శ్యామన్న గారు నిర్లిప్తంగా ఉండేవారు. సురభి మాత్రం ముగ్దురాలయ్యేది. వినుత మనసు చిన్న బోయేది.

ఇంట్లో సురభి పెళ్లి విషయం ప్రస్తావన వచ్చింది. గౌరమ్మ అమెరికా సంబంధమే చేయాలనుకుంటుంది. ఒక సంబంధం అమెరికా నుంచి వచ్చింది. అయితే దీనిని వద్దంటారు గిరీష్ వినుతలు. కారణం సురభిని ఒక అబ్బాయి ప్రేమిస్తుంటాడు. అయితే గౌరమ్మ పట్టుదలతో అమెరికా సంబంధం కావాలంటుంది. అయితే ఆ అబ్బాయికి అమెరికాలో మరో అమ్మాయితో సంబంధం ఉందని తెలుసుకుని అంతకు ముందు సురభిని ప్రేమించిన అబ్బాయితో పెళ్లి జరిపిస్తారు. వినుత ఒక మగ బిడ్డకు జన్మనిస్తుంది. హర్ష అని పేరుపెడతారు. పిల్లవాడు కాస్త పెద్దై ఇళ్ళంతా కలియ తిరుగుతుంటాడు. శ్యామన్న గారికి హర్షతోనే పొద్దు పోతోంది. జమున కూడా కడుపుతో ఉంటుంది. కంపెనీ పని మీద ఒక రోజు శేఖర్ హైదరాబాద్‌కి వస్తాడు. గౌరమ్మ శేఖర్‌ని కలిసి డాలర్ కోడలి గురించి అడుగుతుంది. ఆమెకు ఇంట్లో ఉన్న వినుత కుమారుడు హర్ష కన్నా ఇంకా పురుడు పోసుకోని డాలర్ కోడలు జమునకు పుట్టబోయే కొడుకు మీదే ప్రేమ గౌరమ్మ తను కూడా జమున పురుడు కోసం అమెరికా వస్తాను అని అడుగుతుంది శేఖర్‌ని. సరే రమ్మని చెప్పి అతడు అమెరికా వెళ్ళిపోతాడు. గౌరమ్మ అమెరికా బయలు దేరుతూ ఒక సంవత్సరం పాటు రాను అవసరమైన వస్తువులు ఇక్కన్నుంచి అమెరికా వచ్చే వారితో ఇచ్చి పంపించు చీటి రాసిస్తే అని చెబుతుంది వినుతతో. అయితే అక్కడే వున్న తన కుమారుడు హర్ష గురించి ఒక్క మాటైనా చెప్పకుండా వెళ్తే బాధపడతుంది వినుత.

గౌరమ్మ ఇండియా నుంచి అమెరికా వెళ్తే అక్కడ ఎయిర్ ఫోర్ట్‌లో శేఖర్ కనిపించి ఇంటికి తీసుకెళ్తాడు. అమెరికా అందాలను, శేఖర్ ఉంటున్న ఇంటిని చూసి ముగ్ధురాలవుతుంది ఆమె. ఆమె ఇక్కడికి వచ్చి వారం రోజులైంది. అంతలో జమున ఆడ పిల్లకు జన్మనిస్తుంది. పాపను ఒక గదిలో ఒంటరిగా వుంచి ఆడుకోడానికి వివిధ ఆట పరికరాలు వుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తారు. దీన్ని చూసి నాతో పాపను అంటిపెట్టుకుంటాను అని గౌరమ్మ జమునతో చెబుతుంది. అయితే జమున

వద్దు అత్తయ్య మీరెళ్ళి పోయిన తర్వాత నాకు ప్రాబ్లమ్ అవుతుందని చెబుతుంది. వెంటనే గౌరమ్మకు హర్ష గుర్తొస్తాడు. హర్ష చంటి పిల్లాడిగా వున్నప్పటి నుంచే తాత పక్కన పడుకునే వాడని గుర్తు చేసుకుంటుంది.

జమున రెండు నెలల సెలవులై పోతాయి. తనకు తెలిసిన స్నేహితులందరినీ తన కూతురు నామకరణానికి పిలుస్తుంది. గౌరమ్మ వచ్చిన వారికి ఎంతో ఉత్సాహంగా పిండివంటలు తయారు చేయసాగింది. శుక్రవారం పుట్టిన ఆడపిల్ల కాబట్టి లక్ష్మి పేరు వచ్చేట్లు పెట్టాలన్నది గౌరమ్మ కోరిక. కానీ వినే వాళ్ళెవరు? ఆసుపత్రిలోనే పాపకు 'మానసి' అన్న పేరు రాయిస్తారు. గౌరమ్మ అమెరికా వెళ్ళిన కాలంలో అనేక మంది భారతీయులని కలసింది. వాళ్ళలో చాలా మంది ఒంటరితనంతో బాధపడుతుండటం, విడాకులు పెరిగి ఒకరికొకరు దూరంగా ఉండటం గమనించింది. అమెరికాలో చాలా మంది కష్టపడి పనిచేసే వాళ్ళే. అక్కడ భారతీయులు ఎప్పుడో ఒక సారి తప్ప మిగతా సమయాల్లో కలుసుకోరని తెలుసుకుంటుంది.

గౌరమ్మ తను అమెరికాలో ఉంటున్న కాలంలో అమెరికాలో ఉండే సంస్కృతి, సంప్రదాయాలు అక్కడి పద్ధతులు, విడాకులు, ఒంటరితనం, మనుషులు యంత్రాల్లాగా కష్టపడటం అన్నింటిని చూస్తుంది. అమెరికాలో ప్రతి శనివారం ఒక్కొక్కళ్ళ ఇంట్లో తెలుగు స్నేహితురాళ్ళ కలయిక ప్రోగ్రాం పెట్టుకుంటారు. ఈ వారం జమున వంతు. నాలుగైదు గంటల పాటు పాటలు, కథలు, పిచ్చాపాటి మాటలు మాట్లాడి వెళ్ళాలనుకుంటారు. బాగా నచ్చిన పదార్థాలు చేయమని అత్తగారితో చెబుతుందది జమున. ఏమి చేయాలన్నా కోడలిని అడిగే చేస్తుంది గౌరమ్మ. పనుల్లో ఉండగా జమున ఇల్లు ఇది అనే భావన ఆమెలో నాటుకు పోతుంది. ఆమె పనుల్లో ఉండగా జమున తన స్నేహితురాళ్ళతో కబుర్లు పెట్టింది. తన గురించి కోడలు అందరికి మంచిగా చెబుతోందని, తన గొప్పతనం పొగుడ్తోందని భావించి గౌరమ్మ అటు వైపు వెళ్తుంది. వారంతా మాటల్లో పడి గౌరమ్మ వచ్చిన శబ్దాన్ని ఎవ్వరూ గ్రహించరు. జమున తన స్నేహితురాలు రోహిణితో తన అత్త గురించి చెబుతూ "చూడు రోహిణి మా అత్త అమెరికా అంటే కుక్కలా చొల్లు కారుస్తుంది. శేఖర్‌కి అమ్మను పిలిపించుకోవాలని ఉండేది. నేనొక ఉపాయం చేశాను. నా పురిటి సమయానికి వస్తే ఆమె కోరిక తీరుతుంది. నాకు సహాయంగా కూడా ఉంటారు అని ఒక సంవత్సరం వీసా తీయించాను."(డాలర్‌కోడలు, పుట – 119) ఈ మాటలు విన్న గౌరమ్మ తనను పనిచేయించుకోవడానికే ఇక్కడికి పిలిపించుకున్నదని, తనను పనియంత్రం లాగా

ఉపయోగించుకుంటుందని బాధ పడుతుంది. జమున సిరితనం తనను ఎంత గుడ్డిదాన్ని చేసిందనుకుంటుంది.

ఆ రాత్రంతా గౌరమ్మ ఏడుస్తూనే ఉంది పశ్చాత్తాపంతో దహించుకుపోతోంది. వినుత తల్లి లేని పిల్ల. తన ప్రేమ ఆప్యాయతల కోసం ఎంతగా తపించింది తను అనుకుటుంది. పదేపదే ఆమె కళ్ళ ముందు వినుత రూపం కదలాడ సాగింది. తాను వెంటనే ఇండియాకు వెళ్ళి పోతానంటుంది శేఖర్‌తో. మరో వైపు వినుత తన అత్తగారి చిన్న చూపుకు చాలా బాధపడసాగింది. ఈ విషయం తెలుసుకున్న శ్యామన్న ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా మీరు బెంగుళూరు వెళ్ళిపోండి. అక్కడే వినుత ఇంట్లో ఉండండి, అక్కడి సెంట్రల్ స్కూల్‌కు మీట్రాన్స్‌ఫర్‌కు ప్రయత్నిస్తానంటాడు. అయితే హర్ష లేని లోటు కొంత బాధాకరమే, అవసరమైతే నేనే అప్పుడప్పుడు అక్కడికి వచ్చి కలుస్తానని చెప్పి వారిని బెంగళూరు పంపిస్తాడు శ్యామన్న.

మినిసోటా నుండి బాంబేకు శేఖర్ మిత్రుడు పనిమీద వెళ్తుంటాడు. వెళ్తానని పట్టుబడుతున్న గౌరమ్మను అతనితో పంపించడానికి ఏర్పాటు చేస్తాడు శేఖర్. గిరీష్, హర్షకు షర్టులు తీసుకుటుంది. హర్షకు ఆట సామాను కొంటుంది. ఊరికి వెళ్ళే రోజు వచ్చింది. జమున, శేఖర్ గౌరమ్మ కాళ్ళకు నమస్కరిస్తారు. బహుశా ఇదే మొదటి సారి, చివరి సారి ఇక్కడికి రావడం అనుకుంటుంది మనసులోనే ఎయిర్ పోర్ట్‌లో వారికి వీడ్కోలు చెప్పి మాతృదేశానికి తృప్తిగా వెనుదిరుగుతుంది. గౌరమ్మ.

విమానం త్వరగా హైదరాబాద్ చేరుకున్నా ఏమిటి ఇంత అరిష్టం అని విసుక్కుంటుంది. ఈ సంవత్సరం కాలంలో ఆమె నేర్చుకున్న పాఠాలు, చూసిన దృశ్యాలు జీవితంలో మర్చిపోలేని సరికొత్త అనుభవాలు అయ్యాయి. శ్యామన్న ఎయిర్ ఫోర్ట్ కెళ్ళి గౌరమ్మను కలుస్తాడు. ఆమె వినుత సురభిల గురించి అడుగుతుంది. శ్యామన్న జరిగిన విషయం చెబుతాడు. ఇప్పుడు గౌరమ్మకు అందరి స్వభావాలు తెలిసిపోయాయి. "డాలర్ కోడలి ఉదారమైన రంగు మాసిపోయి అసలు రంగు బయటపడింది. అక్కడ కూడా ఇక్కడిలా సుఖదుఃఖాలున్నాయి. ఇవన్నీ అక్కడికి వెళ్ళిన తరువాత తెలిశాయి. ఈ యాత్ర నా కళ్ళు తెరిపించింది" (సుధామూర్తి:2006; పుట–134)అంటుంది.

తిరిగి వచ్చేటప్పుడు నేనెంత అదృష్టవంతురాలిని వినుత లాంటి కోడలు దొరికింది అనుకుంటుంది. అయితే ఇక్కడి కొచ్చిన తరువాత అంతా చేజారి పోయిందని రెండు చేతులూ ముఖానికి అడ్డు పెట్టుకొని వెక్కివెక్కి ఏడుస్తుంది. గిరీష్‌ని ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేసుకోమనండి

అంటుంది. అయితే శ్యామన్న వాళ్ళని వాళ్ళలాఉండనీయడం మంచిది అంటాడు. అయితే మనం త్వరగా వెళ్ళి ఒక వారం రోజులు వినుత, హర్షలతో గడిపి వద్దామా అని అడుగుతుంది. శ్యామన్న అందుకు మహరాజులా వెళ్ళి వద్దాం అంటాడు.

గౌరమ్మ తను తీసుకు వచ్చిన సూట్‌కేసు తెరుస్తుండగా దారి ఖర్చులకని శేఖర్ ఇచ్చిన వంద డాలర్ల నోటు బయట పడుతుంది. దాన్ని గౌరమ్మ బాధతో చుస్తుంది. ఈ రోజు ఆమె దృష్టిలో డాలర్‌కు ఎలాంటి విలువ లేదు. గుర్తించ గలిగింది రూపాయి విలువను చివరకు రూపాయే గెలిచింది. స్థూలంగా ఇది ఇతివృత్తం.

## 7.3 కాంచన మృగం

ప్రసారమాధ్యమాలు సమాజంలో ప్రతి ఒక్కరిని ప్రభావితం చేస్తాయనడం నిర్వివాదం. అయితే ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ ప్రసార సాధనాల వ్యాప్తి విశృంఖలంగా పెరిగింది. ప్రసార సాధనాల వలన సమాజానికి మంచి, చెడు రెండు కలుగుతున్నాయి. అయితే ప్రసార సాధనాల వల్ల యువత ఏవిధంగా పెడదోవపట్టి తమ జీవితాలను నాశనం చేసుకుంటుందో వివరించిన నవల సలీం రాసిన 'కాంచన మృగం'.

లావణ్య పద్దెనిమిదేళ్ళ అమ్మాయి ఆమెది నూజివీడు. నూజివీడు మామిడి పండులా అరుదైన సోయగం ఆమె సొంతం. ఒక రోజువేప చెట్టు కింద మంచం మీద వెల్లికిలా పడుకుని ఆలోచిస్తుంటుంది.ఆమె తల్లి పిలిచినా పలుకదు. లావణ్య నిన్నేనే ఎన్ని సార్లు పిలిచినా పలకవేం అని ఆమె తల్లి వస్తుంది. తనకు త్వరగా పెళ్లి చేయమని తల్లిని అడుగుతుంది. నీకు ఎప్పుడూ పెళ్లియావనే తప్ప మరో ధ్యాస ఉండదా అంటుంది. లావణ్య ఇంటర్మీడియట్ తప్పి ఇంటి దగ్గరే ఉంటుంది. ఈ రోజు పప్పు వండటానికి తోటకెళ్ళి నాలుగు మామిడి కాయలు పట్టుకురా లావణ్యతో చెపుతుంది. తోట కెళ్ళిన లావణ్య అక్కడ ఒక అందమైన యువకుడు తనను తదేకంగా చూడటం గుర్తిస్తుంది. తొందరగా ఇంటికి పరుగెత్తుకొస్తుంది. ఆ యువకుడు కూడా ఇంటి దాకా ఆమెను అనుసరిస్తూనే వస్తాడు. అతడి రూపాన్ని ఆమె కళ్ళల్లో చిత్రించుకుంటుంది. ఆ సంఘటన జరిగినప్పటి నుండి ఆమెకు అతడే గుర్తుకు వస్తుంటాడు.

మనో రంజితం, లావణ్య స్నేహితులు. వీరిద్దరిది ఒకే ఊరు వీరిద్దరూ కలిసి ఇంటర్ దాకా చదువుకొని వుంటారు. లావణ్య ఇంటర్ తప్పితే మనో రంజితం ఇంటర్ తర్వాత నర్స్‌ట్రైనింగ్ పూర్తి

చేసి విజయవాడలో డాక్టర్ వెంకటేశ్వర్లు దగ్గర నర్స్ గా పని చేస్తుంది. వెంకటేశ్వర్లు అనాథ. తల్లి తండ్రి లేనివాడు. అతిపేదస్థితి నుంచి చదువుకుని పైకొస్తాడు. తన దగ్గరికి వచ్చే రోగుల్ని ఆప్యాయంగా పలకరిస్తూ వైద్యం చేస్తుంటాడు. ఇంత మంచి డాక్టర్ వద్ద పనిచేస్తున్నందుకు సంతోషపడుతుంది మనో. అతని మంచితనం, సేవా గుణం చూసి అతన్ని మనసులోనే నిండుగా ప్రేమిస్తుంది. ఇలాంటి వ్యక్తిని వివాహమాడాలని నిత్యం జీసస్‌కి ప్రార్థన చేస్తుంటుంది. అయితే వెంకటేశ్వర్లు దృష్టిలో ఆమె ఒక మంచి మనిషిగా, నర్స్ గా తప్పితే అతని మనసులో ఆమెకు ఎలాంటి ప్రత్యేక స్థానం ఉండదు.

మనోరంజితం ఒక రోజు లావణ్యను కలిసినపుడు. మనో ఎప్పుడు డాక్టర్ గారి గురించి చెప్పడం గుర్తించిన లావణ్య ఏమే డాక్టరికి లైనేస్తున్నావా? ఎప్పుడూ అతని గురించే మాట్లాడతావు అంటుంది. దానికి మనో లేదే ఆయన చాలా మంచివాడు. రోగులను అధికంగా ప్రేమించి సేవలు చేస్తాడంటుంది. అవునే నీకు పొద్దెలా పోతుంది రోజంతా ఏం చేస్తుంటావని లావణ్యని అడుగుతుంది. అవునే బోర్ కొట్టి చస్తున్నాను. పత్రికల్లో శృంగారం దట్టించిన కథలూ, సీరియల్స్ చదివి, టీవీ ఛానల్స్ లో మసాలా సీన్లు చూసి – మరీ పిచ్చెక్కి పోతుందే అంతా థీయరీగానే ప్రాక్టికల్స్ కోసం శరీరం తొందర పెట్టేస్తోంది. ఎప్పుడెపుడు పెళ్లి చేస్తారా మజా చేద్దామా అని ఎదురుచూస్తున్నా" (సలీం:2006; పుట – 13)అని చెబుతుంది లావణ్య.

లావణ్య ఆ రోజు మామిడి తోటలో జరిగిన సంఘటనే మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకుంటూ. అతను మళ్ళీ వస్తాడా నా కోసం అనుకుంటూ ఊహల్లో తేలుతుంది. గుడ్‌ఫ్రైడే సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లును మనో తన ఇంటికి ఆహ్వానిస్తుంది. పల్లెలంటే అతనికీ ఇష్టం ఉంటుంది. నూజివీడులో మామిడి తోటలను మరీ ఎక్కువగా ఇష్టపడతానని చెబుతాడు. పండుగరోజు వెంకటేశ్వర్లు నూజివీడుకి వచ్చి భోజనం చేసిన తరువాత మనోతో కలిసి మామిడితోట వైపు వెళ్తాడు. అక్కడే తన ఊహా ప్రియుడి కోసం వెతుకుతున్న లావణ్యను చూసి ముగ్ధుడై పోతాడు. ఆ సమయంలోనే మనో వెంకటేశ్వర్లు మీద తన కున్న ప్రేమను వ్యక్తం చేస్తుంది. అందుకు వెంకటేశ్వర్లు నిన్ను ఏ రోజు అలా ఊహించుకోలేదని చెబుతాడు. అందుకు మనో మనసులోనే బాధపడి బయటికి మాములుగానే ఉంటుంది. వెంకటేశ్వర్లుకి అక్కడే వున్న లావణ్య మీద మనసుపడుతుంది. అనాథనైన నాకు పెళ్లి పెద్దగా వ్యవహరించి వాళ్ళ తల్లీదండ్రితో మాట్లాడమని మనోతో వెంకటేశ్వర్లు అర్థిస్తాడు. అందుకు మనో ఒప్పుకుని లావణ్య తల్లి దండ్రితో పెళ్లి సంబంధం గురించి మాట్లాడుతుంది. దీనికి లావణ్య ఒప్పుకోదు. వెంకటేశ్వర్లు ఆమె దృష్టిలో ఒక అందవిహీనుడు.

అయితే తల్లిదండ్రి ఆమెకు నచ్చ చెప్పి డాక్టర్ వెంకటేశ్వర్లుతో ఆమె ఇష్టఇష్టాలతో సంబంధం లేకుండా వివాహం చేస్తారు. పెళ్లి అయిన తరువాత కూడా లావణ్య అతడిని దగ్గరికి రానీయదు. పైగా అతడు సంపాదించిన ధనమంతా మంచి నీళ్ళలా ఖర్చు చేస్తుంది. ఈ విషయం తెలిసి మనో బాధపడి ఏసు ప్రభువుకి ప్రార్థన చేస్తుంది ఇప్పటి జీవితం కన్నా తాను అనాథగా పెరిగిన జీవితమే మేలు అనుకుంటాడు అతను. అయినా అన్నింటిని ఓర్పుతో భరిస్తాడు.

లావణ్య వెంకటేశ్వర్లుని శారీరకంగా సుఖపెట్టడం లేదు. చివరికి అతను తనకు పిల్లలంటే ప్రాణం అని లావణ్యతో అంటాడు. అయితే ఒక కండీషన్ మీరు కేవలం ఒక బిడ్డ వరకే నన్ను తాకాలి. తరువాత నన్ను తాకకూడదన్న షరతులతో అతనితో కలుస్తుంది. ఆమెను శారీరకంగా అతను కలిసినప్పుడల్లా కళ్ళుమూసుకొని ప్రియుణ్ణి ఊహించుకుంటుంది లావణ్య. లావణ్యను ఈమధ్య తన ఎదిరింట్లో ఇంజనీరింగ్ కుర్రాడు వేణు వచ్చి కలుస్తుంటాడు. భర్త గమనించినా ఆమె భయపడదు. మీరేమైనా అంటే నేను ఆత్మహత్య చేసుకుంటానని భయపెడుతుంది. అన్నింటిని మౌనంగానే భరిస్తాడు వెంకటేశ్వర్లు. ఈ మధ్య వీరి కలయిక మరింత ఎక్కువైంది. ఈ విషయం తెలిసి మనో విపరీతంగా బాధపడతుంది. లావణ్య ఆరునెలల కడుపుతో ఉన్నప్పుడు సాయంత్రం ఒక సముద్రపు ఒడ్డుకు తీసుకొస్తాడు వెంకటేశ్వర్లు. అయినా ఇవన్నీ ఆమెకు సంతోషాన్నియ్యవు. నీలో మార్పు చూడాలనుకుంటున్నానని చెబుతాడు. అలా అంటే నేను ఆత్మహత్య చేసుకుంటానని సముద్రం దగ్గరికి పరుగెత్తుతుంది. ఆమె ఆత్మహత్య చేసుకొని తనను ఒంటరిగా విడచి వెళ్ళిపోయిందని కుమిలికుమిలి ఏడుస్తాడు. అయితే ఆమె అతని కంటే ముందుగానే గెస్ట్ హౌస్‌కి వచ్చి ఉంటుంది. దీంతో ఊపిరి పీల్చుకుంటాడు అతను.

లావణ్యకు కూతురు పుడుతుంది. మూడురోజులు పిల్లకు పాలివ్వకుండా మొండికేస్తుంది. అయినా ఏదో ఒక రకంగా ఆమెతో రాజీ పడుతూ ఇంటి వద్ద వున్న లాకర్ తాళంచెవి కూడా ఆమెకే ఇస్తాడు. ఈ విషయంమనోరంజితం తెలుసుకుని ఆమె తల్లిదండ్రులకు చెబుతాను డాక్టర్ అంటుంది. అయితే అతను మనోని వారిస్తాడు తనకు కష్టమో, నష్టమో తానే భరిస్తానని చెబుతాడు. ఒక సారి ఇంజనీరింగ్ కుర్రాడితో సన్నిహితంగా వున్న లావణ్యను క్లినిక్ నుంచి ఇంటికి వచ్చి గమనించి ఆమెపై కోప్పడతాడు. అయితే లావణ్య వంటగదిలో గ్యాస్ ఆన్ చేసుకొని అగ్గిపుల్ల గీస్తూ చనిపోతానని భయపెడుతుంది. నిజానికి ఆమెకు చనిపోవాలని లేదు. తన కోరికలన్నింటినీ తన ఊహా ప్రియుడితో కలిసి తీర్చుకోవాలన్నదే ఆమె కోరిక. ఆత్మహత్య చేసుకుంటానని ప్రయత్నించడం భర్తను భయపెట్టడానికే.

ఒక రోజు ఇంట్లో కాలింగ్‌బెల్ మోగింతే భర్త అని లావణ్య విసుగ్గా తలుపుతీస్తుంది. ఎదురుగా తాను మామిడితోటలో చూసిన రాకుమారుడు తన కలల ప్రపంచం కనిపిస్తాడు. అతని పేరు మనోజ్. ఈ రెండు సంవత్సరాలు ఎక్కడికెళ్ళావని అతన్ని అడుగుతుంది. ముంబాయి వెళ్ళి వారం క్రితమే  తిరిగి వచ్చానని, నీఅడ్రస్ తెలుసుకుని ఇక్కడికి వచ్చానని చెబుతాడు ఆ యువకుడు. ఇద్దరూ కలిసి  ఎక్కడికైనా వెళ్ళి పోవాలని నిర్ణయించుకుంటారు. వెళ్ళే ముందు పాపను మనో కిచ్చి. లావణ్య వెళ్ళిపోతుంది. ఈ వార్త మొత్తం విజయవాడకే  తెలుస్తుంది. కొద్దికాలం తర్వాత వారు చీరాలలో ఉంటున్నారని తెలిసి ఆమె తల్లిదండ్రులు వెళ్ళి ఆమెను ప్రశ్నిస్తారు. అయితే నేనేమీ తప్పు చేయలేదు. నాకు కావలసిన వాడితో ఇల్లు వదిలి వచ్చానని చెబుతుంది. దీంతో ఆమె తల్లిదండ్రులు ఏమీ మాట్లాడకుండా వెళ్ళి పోతారు.

మనోజ్, లావణ్య చీరాల వచ్చి నెలవుతోంది. లావణ్య తనతో తెచ్చుకున్న డబ్బుల్తో కావలసినవి కొనుక్కుని అతనితో శారీరక సుఖం పొందింది. ఇపుడిపుడే ఆమెకు వివేకం కలుగుతోంది. ఇంతలో ఏదో ఒక పని వెతుక్కోవాలి అనుకుంటుంది. వీరు అద్దెకుంటున్న గది యజమాని కూతురు లాయరు. పేరు ఝాన్సి. మొదట్లో ఆమెకు భయపడినా క్రమంగా ఆమెతో మాట్లాడుతుంది లావణ్య. మనోజ్ రెండు సంవత్సరాల కిందట ముంబై వెళ్ళి అక్కడ సినిమా అవకాశాల కోసం ప్రయత్నించి అవకాశాలు రాక తిరిగి వచ్చేస్తాడు.  మొదట్లో కొంత బాగానే ఉన్న ఈ మధ్య తాగుతూ రాత్రిళ్ళు ఇంటికి వస్తున్నాడు. ఇద్దరూ చాలా సార్లు గొడవ పడతారు. సరేలే నాకర్మ అనుకుని అన్నింటిని సహిస్తుంది లావణ్య. తాగి రావడం దినచర్యగా మార్చుకుంటాడు మనోజ్. ఒక రోజు ఇంటి యజమాని కూతురు ఝాన్సి మీరు ఇళ్లు ఖాళీ చేసి వెళ్ళండి అంటుంది. కానీ ఇదంతా తన మంచి కోసం ఆమె చెబుతున్న మాట అని తెలుసుకుంటుంది లావణ్య, ఝాన్సీ లావణ్యను ఒక ప్రింటింగ్ ప్రెస్‌లో ఉద్యోగానికి పంపిస్తుంది. మనోజ్ తాగిరావడం లావణ్యను నిర్లక్ష్యంగా మాట్లాడటం, కొట్టడం మాములై పోయింది. అయినా ఆమె అన్నింటినీ భరిస్తుంది. మరో వైపు లావణ్య కూతురు వెంకటేశ్వర్లు వద్ద పెరుగుతుంది. ఈమె తల్లి  మంచిది కాదని అందరూ అనుకుంటారని వెంకటేశ్వర్లు క్లినిక్‌ని విజయవాడ నుంచి హైదరాబాద్‌కి మార్చుకుంటాడు. పాతమలక్‌పేటలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని దగ్గర్లోనే క్లినిక్ షాప్ ప్రారంభిస్తాడు. ఆదివారాలు చర్చి కెళ్ళే మనో  కోసం ఇంట్లోనే ఒక గదిలో పూజ మందిరం క్రీస్తు విగ్రహాన్ని, మరియమ్మ పటాన్ని తెచ్చి పెడతాడు.

మనోజ్ రేవతి అనే మరో అమ్మాయిని తన వలలో వేసుకుంటాడు. ఆమెకు సినిమాల్లో అవకాశాలు ఇప్పిస్తానని మోసగించి తన వైపు తిప్పుకుంటాడు. దీంతో లావణ్య మనోజ్‌ని నిలదీస్తుంది. అయినా నేను నీ తాళికట్టిన మొగుణ్ణి కాదు అంటాడు మనోజ్ లావణ్యతో. ఈ విషయం లావణ్య ఝాన్సీతో చెబుతుంది. మనోజ్ రేవతితో పెళ్ళి నిశ్చయించుకుంటాడు. మరో వైపు తాను పనిచేసే దగ్గర నరసింహతో అవమానాలు ఎదుర్కొంటుంది లావణ్య. లావణ్య తాను ఏమి ఆశించి ఇక్కడికొచ్చిందో దానికి భిన్నంగా మారిపోయింది ఆమె పరిస్థితి. మరో వైపు తన భర్త మంచి వాడైన వెంకటేశ్వర్లు తన కూతురు సుజీ, స్నేహితురాలు మనోని అనవసరంగా వదిలి వచ్చానే అని పశ్చాత్తాపపడుతుంది లావణ్య మరో వైపు మనో వెంకటేశ్వర్లు పెళ్ళి చేసుకోవడానికి నిశ్చయించుకుంటారు. ఇంతలో లావణ్య నుంచి వెంకటేశ్వర్లుకు ఉత్తరం వస్తుంది. మిమ్మల్ని సుజీని వదిలి వచ్చి పెద్ద తప్పు చేశాను. దయతో నన్ను క్షమించండి పాపను ఒక సారి చూడాలని ఉంది అని దాని సారాంశం. మనో అప్పటికీ సంతోషిస్తుంది లావణ్య వస్తే కేవలం తను పాపను పెంచుతానని ఆమెనే మీరు భార్యగా  ఉంచుకుంటే మంచిదని వెంకటేశ్వర్లుతో అంటుంది. అయితే నా మనసులో ఆమెకు స్థానం లేదు అంటాడు.వెంకటేశ్వర్లు. మనోజ్ తమ పెళ్లి కార్డుతో లావణ్య దగ్గరికి వచ్చి మీరు ఎంతైనా నా మొదటి ఉంపుడుగత్తె కదా అందుకే మా పెళ్లి మొదటి కార్డు మీకే ఇస్తున్నా అంటాడు. మనోజ్ మీద ముందుగానే మనసులో కసి పెంచుకుంటుంది లావణ్య. ఏ అందం నీలో ఉందని నా భర్తను వదిలి ఇక్కడికి వచ్చి నీ చేతిలో మోస పోయానో  ఆ అందమే లేకుండా చేయాలని ముందే నిశ్చయించుకుని. అతడు పెళ్లి కార్డు ఇవ్వగానే సీసాలో ఉన్నటువంటి యాసిడ్‌ను మనోజ్‌పై పోస్తుంది. అతడు ఆ బాధతో విలవిలలాడుతూ కూడా కిందపడిన బాటిల్‌ను చేతిలోకి తీసుకుని లావణ్య కడుపుపై గుండెల్లో కసిగా పొడుస్తాడు. ఇద్దర్నీ హాస్పిటల్‌కి తరలిస్తారు. విషయం తెలుసుకుని వెంకటేశ్వర్లు, సుజీ, మనో చీరాల వస్తారు. లావణ్య వారిని క్షమించమని అడుగుతుంది. లాయర్ వచ్చి మరణ వాంగ్మూళం నమోదు చేస్తాడు ఇది స్థూలంగా ఇతివృత్తం. ఇక్కడ సినిమా, ప్రసార సాధనాల వలన లావణ్య జీవితం అంతం కావడం తెలుస్తుంది.

## 7.4 తమసోమా

ప్రపంచీకరణ ఆధునికంగా మానవునికి కొన్ని అవసరతలు తీరుస్తున్నప్పటికీ అంతిమంగా మనిషిని వస్తువ్యామోహవాదం వైపు నడిపిస్తుంది. కృత్రిమ అవసరాలు తీర్చుకునేందుకు

కొంతమంది అధికారులు 'అవినీతి' పరులుగా మారుతున్నారు. అలాగే ప్రపంచీకరణ విధానాలు ఏవిధంగా వర్ధమాన దేశాల పొట్టకొడుతున్నాయో చర్చించిన నవల సింహప్రసాద్ రాసిన 'తమసోమా' 2012.

గాంధీ ఎం.సి.ఏ విద్యార్థి. ఒకరోజు పొలానికి సంబంధించిన ఈ సీ తీసుకురమ్మని తండ్రి చెబితే సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుకి వెళ్తాడు. అక్కడ ఆఫీసర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. ఈసీ తీసు కోవాలంటే లంచం ఇవ్వాలని చెప్తారు. లంచం అంటే గాంధీకి నచ్చదు. అక్కడికే ఇంకో వృద్ధుడు పొలం పట్టాకోసం వస్తాడు ఆయననూ లంచం అడుగుతారు. గవర్నమెంట్ నుంచి జీతాలు పొందుతూ తమను లంచం అడగటమేంటని వారితో వాదులాడి ఇంటికి వస్తాడు గాంధీ. తండ్రి ఏరా ఈసీ తెచ్చావా? అని అడుగుతాడు. తీసుకురాలేదు వాళ్ళు లంచం అడిగారు నేనివ్వలేదు అని తండ్రికి సమధానమిస్తాడు దీనికి బాధపడుతూ యాభై కాకుంటే వందరుపాయలు వాళ్ళ మొహన కొట్టి తీసుకురావాల్సింది అని కోప్పడతాడు. ఎందుకంటే అతను కూడా అవినీతి పరుడే. అతను డిప్యూటి కమర్షియల్ టాక్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. గాంధీ తల్లి స్వాతంత్ర్య సమరయోధుడి కూతురు. అలాగే తండ్రికి విదేశీ వస్తువ్యామోహం అత్యధికం. బ్లేడ్ దగ్గరి నుంచి వీసిఆర్ వరకు సమస్తమూ విదేశీవే ఉపయోగిస్తుంటాడు. దేశీయ ఉత్పత్తులంటే ఆయనకు ఎలర్జీ. గాంధీ అన్నయ్య పేరు ఆనంద్.

గాంధీ మళ్ళీ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుకి వచ్చి ఈసీ కావాలని క్లర్కు శేషావతారంను అడుగుతాడు. ఇంతలో గుమస్తా వీరయ్య వచ్చి శేషావతరం మొండిఘటమయ్య డబ్బు ఇవ్వనిదే అతను ఏపని చేయడని చెబుతాడు. అందుకు వీరయ్యా ఇక్కడ ఏ.సి.బి ఆఫీసు ఎక్కడా? అని అడుగుతాడు గాంధీ. ఈ మధ్య ఏ.సి.బి డైరెక్టర్‌గా పేర్వారం రాములు వచ్చాడు అతను వచ్చిన తర్వాత లంచగొండుల్ని వలవేసి పడుతున్నారు. ఈ మాట విన్నాక వీరయ్య భయపడి ఈసీ పని పూర్తిచేసి తీసుకు వచ్చి అతనికి ఇస్తాడు. పొలం పని మీద వచ్చిన వృద్ధుడు లక్షయ్య పనిని కూడా పూర్తి చేసి ఇస్తారు. అందరు గాంధీని కృతజ్ఞతా పూర్వకంగా చూస్తారు. అధికారులను జాగ్రత్తగా ఉండమని చెప్పి అక్కడి నుంచి వెళ్ళిపోతాడు.

ఆనంద్ సులోచనలు రహస్యంగా రిజిస్ట్రార్ ఆఫీసులో వివాహమాడతారు. ఈ పెళ్ళి గాంధీ సమక్షంలో జరుగుతుంది. గాంధీకి చాలా మంది స్నేహితులు ఉంటారు. అందులో షాజహాన్, మురారి, పాపారావు, కరుణానందం, సహజ, శిరీషా. గాంధీకి సహజ చాలా దగ్గరగా ఉంటుంది.

గాంధీ కాలేజీలో చాలా శాంతియుతంగా ఉంటూ. అందరితో చాలా సన్నిహితంగా. కాలేజీలో జరిగే గొడవల్ని శాంతి యుతంగా పరిష్కరిస్తాడు. ఒక రోజు కాలేజీ అయిపోయిన తరువాత బైక్ స్టార్ట్ చేస్తుండగా వెనుక వచ్చి సహజ కూర్చుంటుంది. ఎక్కడికి? అంటాడు గాంధీ. షాపింగ్ చేయాలని స్నేహితుని వివాహానికి కానుక తీసుకోవాలని చెబుతుంది. డిస్కౌంట్, ఆఫర్ ఉన్న షాప్‌కెళ్ళి గిఫ్ట్ తీసుకుని ప్యాక్ చేయమంటారు. అయితే షాప్‌వాడు డిస్కౌంట్ పేరుతో అక్కడికి వచ్చే కస్టమర్లను మోసం చేస్తుంటాడు. గాంధీ ఈ విషయంపై షాప్ వారిని నిలదీసి మోసం జరగకుండా చుస్తాడు. అయితే అతను ఇలా ప్రవర్తించడం సహజకు నచ్చదు. ఆమెదంతా సంపన్నుల మనస్తత్వం గాంధీ ఇందుకు పూర్తి విరుద్ధం అవినీతి మోసాన్ని ఎంత మాత్రం సహించడు.

నూతన సంవత్సర ఆరంభం దగ్గరపడి ఎక్కడ చూసినా పండుగ వాతావరణం కనబడుతుంది. హైదరాబాద్‌లో ముఖ్యంగా గ్రీటింగ్ కార్డ్స్ షాప్‌ల నుండి ఇసుకేస్తే రాలనంత జనం. సహజ ఒక గ్రీటింగ్ కార్డు కొని గాంధీకి కానుకగా ఇస్తుంది. దాన్ని తెరుస్తాడు గాంధీ ఐలవ్యూ ఐలవ్యూ ఐలవ్యూ అని వినిపిస్తుంది. థాంక్యూ సహజా ఇది చాలా ఖరీదేమో అంటాడు. ప్రేమ మనసుకు ఖరీదు కట్టే షరాబు లేడోయ్ అంటుంది సహజ. "ఒప్పుకుంటున్నాను. ఈ కాస్ట్‌లీ గిఫ్టుల్ని చూస్తోంటే న్యూ ఇయర్ డే, వాలెంటైన్స్ డే, మదర్స్ డే అంటూ విపరీత ప్రచారం చెయ్యడం ఇలాంటివి అమ్ముకోవడానికి వేసిన వ్యాపారపుటెత్తులు అన్పిస్తోంది" (సింహప్రసాద్:2012;పుట–55)అంటాడు గాంధీ. నువ్వన్నీ విపరీతంగా ఆలోచిస్తావు అంటుంది సహజ. దానికి గాంధీ సమాధానమిస్తూ ఇవన్నీ జరగాల్సింది ఇక్కడ కాదు పాశ్చాత్య దేశాల్లో రెక్కలు రాగానే తల్లిని తండ్రిని మరచి వేరే గూడు వెదుక్కొని పోయేచోట ఆ రకంగానైనా వారు తల్లి దండ్రిని గుర్తించుకుంటారని, ఆ అగత్యం, అవసరం మన దేశానికి లేవని అంటాడు. నూతన సంవత్సర సందర్భంగా డాన్సులు, పబ్‌లకు వెళ్దాం అంటుంది సహజ. కానీ గాంధీ శాస్త్రీయ నృత్యం, ఆహ్లాదకర సంగీతాన్ని ఆస్వాదిద్దామంటాడు. మరుసటి రోజు హ్యాపీ న్యూ ఇయర్ అంటూ శిరీష గులాభి ఇస్తుంది గాంధీకి. సహజకు గాంధీ పద్ధతులు నచ్చడం లేదు. సహజను వద్దని వారించినా క్లబ్ డాన్స్‌లకుగాంధీని తీసుకుని వెలుతుంది. అక్కడ జరిగే అసభ్యతను చూసి గాంధీ అసహ్యించుకుంటాడు. అక్కడికి వెళ్ళి చూసిన తర్వాత గాని సహజకు అర్థం కాలేదు. పల్లెటూరి నుంచి వచ్చిన ఆమె ఎందుకిలా దుర్గంధం వైపు ఆకర్షింపబడిందో గాంధీకి అర్థం కాదు. కొంత కాలం తరువాత గాంధీని అమెరికా వెళదామంటుంది సహజ కానీ ఆ డాలర్ల కోసం ఆశపడి నేను వెళ్ళనని చెబుతాడు. దేశం కోసం మనం ఇక్కడే పని చేయాలంటాడు. కానీ సహజకు ఇవి నచ్చవు.

గాంధీ పద్ధతులు నచ్చక వేరే అబ్బాయితో కలిసి తిరుగుతుంది శిరీష మాత్రం గాంధీకి దగ్గరవుతుంది.

ఆనంద్‌ని పెళ్ళి చేసుకున్న అమ్మాయి సులోచన ఒక రోజు ఇంటికి వస్తుంది. గాంధీ తల్లి భయపడుతుంది. ఎవరూ ఈ అమ్మాయి అని ఆనంద్‌ని అడుగుతుంది నాస్నేహితురాలు అంటాడు ఆనంద్. అక్కడే ఉన్న గాంధీ ఈమె ఆనంద్ భార్య అంటాడు. వీళ్ళు నేను ఈసీ కోసం తిరిగినపుడే పెళ్లి చేసుకున్నారు. నన్ను సాక్షిగా సంతకం చేయమంటే చేశాను అని చెప్పి వదినకు మద్దతుగా నిలుస్తాడు. ఇదంతా గమనించి తండ్రి ఇద్దరినీ పిలిచి ఆశీర్వదిస్తాడు.

గాంధీ ఒక రోజు  నాన్నకు జీతం ఎంతవస్తుందని వాళ్ళ అమ్మను అడుగుతాడు. కటింగ్‌లు అన్నీ పోగా తొమ్మిది వేలు అని చెబుతుంది. అయితే మనకున్న ఇన్ని ఆస్తులు కార్లు ఎలా వచ్చాయమ్మా అని తల్లిని నిలదీస్తాడు ఆమె మౌనంగా మీ నాన్న లంచాలు తీసుకోవడం వల్లరా అంటుంది. ఇదంతా గమనించిన తండ్రి ఆవేశంగా వచ్చి ఏమిచేస్తావో చెప్పరా ఇన్ని వివరాలు అడుగుతున్నావు అంటాడు. ఈ  ఇల్లు, నువ్వుతినే తిండి, మీ అమ్మ మెడలోని నగలూ, ఆఖరికి నీకు కట్టిన ఫీజు అన్నీ లంచాలతో  వచ్చిందేరా.  నేనే కాదు ఈ దేశంలో నూటికి తొంభై మంది ఇలాగే బతుకుతున్నారని. “దేశంలోని నాయకులూ, కాంట్రాక్టర్లూ, అధికారులూ, వ్యాపారులూ, ఉద్యోగులు వాళ్ళు వీళ్ళు అని కాదు. ఆస్తులు సంపాదించిన ప్రతి వాళ్ళు అవినీతి మార్గాన అడ్డదారులు తొక్కి సంపాదించిందేనని ఖచ్చితంగా చెప్పగలను” (సింహప్రసాద్, 2012; పుట – 89)అని అంటాడు. ఇప్పటికైనా మీరు మారండి డాడీ అంటాడు గాంధీ. అసలు మారాలని లేదు. ఒక వేళ మారాలనుకున్నా మారలేను. ఈవ్యవస్థ నన్ను మార నివ్వదు వెంటాడి వేటాడి మరీ చంపుతుంది అంటాడు. మీరు మారక పోతే నేను ఈ ఇంట్లో ఉండలేను అంటూ బయటికెళ్ళి పోతాడు గాంధీ.

ఇంటి నుంచి బయలు దేరి గాంధీ తన తాతగారి ఊరికి వెళ్తాడు. ఏడాది తర్వాత ఆ ఊరికి రావడం ఇదే మొదటిసారి. ఊరు చాలా మారి పోయింది. “కేబుల్ కనెక్షన్లూ, ఫోన్లూ, బైకులూ, అన్ని గ్రామాల్లోనూ మంచి నీళ్ళుదొరకవు, కానీ బ్రాందీ విస్కీలు దొరుకుతాయి. సరైన రోడ్లుండవు. కాని కేబుల్ కనెక్షన్లుంటాయి. స్కూళ్ళలో పిల్లలు కూర్చోవడానికి బెంచీలుండవు. కాని పేకాట క్లబ్బులుంటాయి” (పైదే;పుట– 97) అని అనుకుంటాడు.  తాతయ్య మహాత్మాగాంధీ ఆదర్శాలలో పయనించే వ్యక్తి ఆయనకు ముగ్గురు కొడుకులు ఇద్దరు కూతుళ్ళు. అయినా ఎవరూ ఆయనను చూడటానికి రారు. ఈ వయసులోనూ కొంత మంది పిల్లలకు ఆయన పాఠాలు బోధిస్తుంటారు.

గాంధీ తన తాతయ్య, అమ్మమ్మను కలుస్తాడు. ఏరా? ఎలా! ఉన్నావని గాంధీని అడుగుతాడు తాతయ్య. బాగానే ఉన్నానంటూ సమాధానమిస్తాడు గాంధీ. గాంధీ వాలకం చూసి ఇంట్లో నుంచి చెప్పకుండా వచ్చాడని గ్రహిస్తాడు తాతయ్య. వేడినీళ్ళతో స్నానం చేసి తాతతో పాటు పొలం గట్ల వెంట నడుస్తాడు. ఈ సారి పంటలెలా ఉన్నాయి తాతయ్య అని అడుగుతాడు. వరి బాగానే పండింది కానీ ప్రపంచ ఆర్థిక పరిస్థితులు రైతుల కడుపు కొడతాయేమోనని భయంగా ఉందిరా అంటాడు. కడుపున్నంత వరకూ నాగలి పట్టాల్సిందే కదా తాతయ్య అంటాడు. "నిజమేరా! మనక్కావల్సిన తిండిగింజలు మన దేశపు రైతే పండించాలని లేదుకదా! విదేశాల్లో అభివృద్ధి చెందిన టెక్నాలజీతో చౌకగా ధాన్యాలు పండించి మన దేశానికి పంపిస్తే ఏమవుతుంది? మన రైతునోట మట్టే కదా! కేవలం ధాన్యాలే కాదు, అన్ని రకాల పారిశ్రామిక ఉత్పత్తులు మన దేశాన్ని ముంచెత్తనున్నాయి. బహుళజాతి సంస్థల ప్రవేశంతో దేశంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలన్నీ నిలువునా కూలిపోవడం ఖాయం" (పైదే; పుట- 105) అంటూ తాతయ్య గాంధీకి అనేక విషయాలు చెబుతాడు.

పది రోజులు తర్వాత తిరిగి సిటీకి వస్తాడు గాంధీ. ఇన్నాళ్ళు ఏమయ్యావు గాంధీ? అని శిరీష అడుగుతుంది మా తాత గారి పల్లెకు వెళ్ళొచ్చానని చెబుతాడు. గాంధీ అతని మిత్రులు కలిసిఅవినీతికి వ్యతిరేకంగా 'వందేమాతరం' అను సంస్థను ప్రారంభించాలని నిర్ణయిస్తారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి యాభై మూడేళ్ళైనా నేటికీ ప్రాథమిక అవసరాలు కూడా తీరని స్థితిలో ఉన్నాం. సమాజంలో ఎక్కడ చూసినా దోపిడీ దళారితనం అవినీతి నిత్యకృత్యమైంది. "వీటికి తోడు ప్రపంచీకరణ పేరుతో దేశాన్ని ముంచెత్తుతున్న బహుళజాతి సంస్థల ఉత్పత్తులు; శాటిలైట్ ఛానెల్స్ ద్వారా మన సంస్కృతిపై దాడి! సామాన్యుల గోడు ఎవరికీ విన్పించదు(పైదే; పుట – 124)అంటూ ఈ రోజు నుంచి 'వందేమాతరం'సంస్థ సమాజానికి 'వాచ్‌డాగ్‌లా' పనిచేస్తుంది. అవినీతి లీలల్ని, రౌడీ రాజకీయాలను ఎండగడతాం అంటూ వందేమాతరం సభలో ప్రారంభ ఉపన్యాసం చేస్తాడు గాంధీ. సభను అందరూ చప్పట్లతో మారుమోగిస్తారు. ఆసభలో చాలా మంది విద్యార్థులు, వృద్ధులు ప్రసంగిస్తారు. లంచగొండి అవినీతి అధికారుల భరతం పట్టాలని ఈ సభ నిర్ణయిస్తుంది.

మీ అన్నయ్యకి రామనారాయణ గారి అమ్మాయికి వచ్చే నెల పెళ్లంట అని పిడుగు లాంటి వార్త చెబుతుంది శిరీష. అంతకు ముందే సులోచనను పెళ్లి చేసుకొని ఆమెకు విడాకులు ఇచ్చి మరో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు ఆనంద్. రామనారాయణ దోపిడీదారుడు ఆవివరాల న్నింటిని గాంధీ  స్నేహితులు సేకరించి పత్రికలకు రిలీజ్ చేస్తారు. ఫలితంగా ఆనంద్ పెళ్లి

రద్దవుతుంది. మరో వైపు రెండు వందల మంది యువకులతో కలిసి తన తండ్రి ఇంటిని ముట్టడించి ఆయన అవినీతి భాగోతాన్ని వివరిస్తూ లంచగొండిని గౌరవిస్తారా అంటాడు అందరితో లేదులేదు అంటారు వారు. గాంధీ తండ్రి పోలీసుల ద్వారా గాంధీని భయపెట్టాలని చూస్తాడు, అయినా గాంధీ భయపడదు. గాంధీ తల్లి మాత్రం 'సత్యమేవజయతే' అని అతనికి మద్దతునిస్తుంది.

తీవ్రమైన ఆవేదనతో తాను చేసిన తప్పులకి, లంచాలకి ప్రాయశ్చిత్తపడుతూ ఈ జాతి, దేశం నన్ను క్షమించమని, గాంధీ లాగా బ్రతకాలని, ఈ అవినీతి డబ్బు నన్ను పాడు చేసింది. సులోచనని నాకోడలిగా మన స్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను. మీ అమ్మను బాగా చూసుకోండి. ఆమె అమాయకురాలు. ఆమెకు ఏకష్టమూ రానివ్వకండి. మరి శెలవు. నాకోరిక తీర్చరా గాంధీ...ప్లీజ్ ఇట్లు ఒక పాపిష్టి తండ్రి అని ఒక లేఖ రాసి ఆత్మహత్య చేసుకుంటాడు. తండ్రి దహన సంస్కారాలు చేశారు. ఆనంద్ సులోచనల ఒకరి చేతుల్లో ఒకరివి అలాగే గాంధీ శిరీషల చేతుల్ని కలుపుతుంది వాళ్ళ అమ్మ. తరువాత వాళ్ళ అమ్మ తన తండ్రి గారి దగ్గర అనాథపిల్లలకు సేవ చేస్తూ శేష జీవితం గడపాలని వెళ్ళిపోతుంది. దీంతో నవల ముగుస్తుంది.

## 7.5 జీవన్మృతులు

ప్రపంచీకరణ విధానాలు పుష్కలంగా అమలవుతున్న నేడు ప్రతీదీ వ్యాపారమైంది. ఆకోవలోనే నేడు వైద్యం కూడా ఖరీదై వ్యాపార పెట్టుబడిదారీ వర్గాల పాలిట కల్పతరువవుతోంది. కార్పొరేట్ హాస్పిటళ్ళ నిర్లక్ష్యం కారణంగా మూడేళ్ళ బాబు జీవితం ఎందుకు కొరగానిలా ఎలా తయారైందో హృద్యంగా చిత్రించిన నవల సలీం రాసిన 'జీవన్మృతులు' ఇది ఫిబ్రవరి 2001 లో రచించబడింది.

జయంతి, సురేష్‌లు భార్యాభర్తలు, వీరికి బాబీ అనే మూడేళ్ళ కొడుకు వుంటాడు. సురేష్ డిగ్రీ పూర్తి కాకుండానే చదువు మధ్యలో ఆగిపోవడం వలన మంచి సెంటర్లో కిరాణషాప్ పెడతాడు. వీరు హైదరాబాద్‌లో నివాసం ఉంటారు. ఒక రోజు బాబీ గాడికి జ్వరం అని జయంతి సురేష్‌కి చెబుతుంది. మాములు జ్వరమని సురేష్ సాయంత్రం హాస్పిటల్ కి తీసుకెళ్తానంటాడు. మరుసటి రోజు హాస్పిటల్‌కి తీసుకెళ్తాడు. అక్కడి డాక్టర్ ఇంజక్షన్ వేసి మందులు రాసి ఇంటికి పంపుతాడు వారం రోజులైనా బాబీకీ జ్వరం తగ్గదు.

శ్రీనర్సింగ్ హోమ్ రెండంతస్తుల హాస్పిటల్ భవనం. దీనికి అధినేత డా. శ్రీధర్ అక్కడ అధునాతనమైన అన్ని సౌకర్యాలు ఉన్నాయి. ఈ హాస్పటిల్‌లోనే డా. ప్రకాశ్ పని చేస్తుంటాడు. ఇతడు రోగులను ఎంతో ప్రేమగా, దేవుడిలా వైద్యం  చేస్తుంటాడు. చాలా మంది డాక్టర్లు, సిబ్బంది ఇందులో పని చేస్తుంటారు. శ్రీవాణి అనే ఒక అమ్మాయి  నర్స్ గా పనిచేస్తుంటుంది. ఈమె కష్టపడుతూ తన తల్లి, తమ్ముడి కోసం ఇక్కడ పనిచేస్తుంది. ఈ మధ్య కాలంలో శ్రీవాణికి రాకేష్ అనే ఒక యువకుడు హాస్పిటల్‌కి వస్తే పరిచయం కలిగి ప్రేమగా మారుతుంది. అయితే కొంత కాలం కలిసి తిరిగిన రాకేష్  శ్రీవాణిని మోసం చేసి వెళ్ళి పోతాడు. అందువల్ల శ్రీవాణి నిత్యం అతడి రాకకోసం, అతని ఆలోచనలోనే ఉంటుంది. బాబీకి జ్వరం తగ్గకపోతే శ్రీ నర్సింగ్ హోమ్‌కి తీసుకువస్తారు. డా. ప్రకాశ్ పరీక్షించి టైఫాయిడ్  అని తేల్చి క్లోరోఫెనికాల్ మందు రాసి శ్రీవాణీకి బాబుకి ఇంజక్షన్ చేయమని చెబుతాడు. అయితే రాకేష్ చేతిలో మోసపోయి నెల తప్పిన శ్రీవాణి క్లోరోఫెనాల్‌కి బదులు క్లోరోక్విన్ అనే మందు ఇస్తుంది. దీంతో బాబు గుండె కొట్టుకునే వేగం  తగ్గి మెదడుకి ఆక్సిజన్ సరఫరా క్రమంగా  తగ్గి కోమాలోకి వెళ్లి పోతాడు. ఈస్థితి గమనించి ప్రకాశ్‌ను పిలుస్తుంది శ్రీవాణి.  ప్రకాశ్ వచ్చి శ్రీవాణి చేసిన తప్పును చూసి ఎంత పని చేసావు? నేను రాసిన మందేమిటి నువ్విచ్చిన మందేమిటని తీవ్రంగా ఆమెపై కోప్పడతాడు. బాబీని వెంటనే ఐసియూలోకి తీసుకెళ్ళి అత్యవసర చికిత్స చేస్తారు. శ్రీవాణి తాను చేసిన తప్పుకి కుమిలి పోతుంది. ఈ బిడ్డను కాపాడు తండ్రీ అని దేవున్ని వేడుకుంటుంది. డాక్టర్ శ్రీధర్ వచ్చి నువ్వేమీ భయపడకు శ్రీ నీకు నేనున్నా అంటాడు. ఒక వైపు శ్రీధర్‌కి కూడా శ్రీవాణిని అనుభవించాలనే ఆశ ఉండటం వల్ల ఆమెకు ధైర్యం చెబుతాడు. అయితే చేసిన పొరపాటుకి మాత్రం శ్రీవాణి మిక్కిలి వేదన పడుతుంది. జయంతి సురేష్ ని హాస్పిటల్ వద్ద వుండమని ఇంటికెళ్ళి భోజనం  తీసుకువచ్చే లోపలే ఇంత ఘోరం జరిగిపోతుంది. జయంతి వచ్చి సురేష్‌ని నిలదీస్తుంది. నాబాబీకి ఏమైందని ప్రశ్నిస్తుంది. రెండు రోజులు కోమాలో ఉండి మూడవ రోజుస్పృహలోకి వస్తాడు బాబి. అయితే మునుపటిలా బాబీ తిరుగలేడు. కేవలం ఊపిరితో వుంటూ అచేతనంగా పడి వుంటాడు. జీవితాంతం బాబీకి ఇంకొకరి తోడు కావల్సిందే అని ఒంటరిగా వున్నప్పుడు సురేష్‌తో చెబుతాడు డాక్టర్ ప్రకాశ్. జయంతికి తెలియకుండా మూడు రోజుల తర్వాత బాబీని డిశ్చార్జ్ చేస్తారు. అయితే బాబీ విషయంలో జరిగిన తప్పుని సురేష్ ఆమెకు తెలియనీయడు.

బాబుని ఇంటికి తీసుకు వచ్చినప్పటి నుంచి జయంతి బిజీ అయిపోతుంది. వాడికి డాక్టర్లు చెప్పినట్లు మందులియ్యడం పప్పో, మజ్జిగో వేసి తినిపించడం చేస్తుంది. బాబు క్షేమంగా ఉన్నాడన్న

సంతోషంలో మొదటి రెండు రోజులూ ఆమె అంతగా గమనించదు మూడవ రోజున ఆమె వాడి పరిస్థితి చూసి కంగారు పడుతుంది. బాబీకి ఏమైందో నిజం చెప్పండని డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తుంది. బాబు గురించి నిజం చెప్పండి డాక్టర్ ఏమైందో వాడికి నాకు పూర్తిగా తెలియాలి. బాబీకి జ్వరం వచ్చినప్పటి నుంచి శ్రీనర్సింగ్ హోమ్‌లో చేర్పించినప్పటి వరకు జరిగిన సంఘటనలన్నింటిని పూర్తిగా చెప్పింది. డాక్టర్ బాబీని పరీక్షించి బాబుకి మెదడు బాగా దెబ్బతిన్నట్లుందమ్మా! అతనికేం కావాలో అతనేం చేస్తున్నాడో తెలుసుకోలేని స్థితిలో ఉన్నాడని డాక్టర్ చెబుతాడు జయంతికి.

డాక్టర్ బాబుకి బాగు కావాలంటే ఎక్కడికి తీసుకెళ్ళాలి. ఏడాక్టర్‌కి చూపించాలి ఎంతఖర్చైనా ఫరవాలేదు డాక్టర్ అని అడుగుతుంది. ప్చ్ ఏం లాభం లేదమ్మా ప్రపంచంలోని ఏడాక్టర్ మీ అబ్బాయిని మామూలు మనిషిగా చేయలేడు అని డాక్టర్ సమాధానం విన్న తరువాత ఆమెకు అంతులేని కసి, పొంగు కొస్తున్న పగతో బాబు విషయంలో తప్పు చేసిన వాళ్ళను వదలకూడదు. కోర్టు కీడ్చాలి, వాళ్ళ పరువును బజారు కీడ్చాలి అనుకుంటుంది.

బాబీ విషయంలో నిర్లక్ష్యం జరిగినప్పటి నుంచి శ్రీవాణి నర్సింగ్‌హోమ్‌కి వెళ్ళడం మానేస్తుంది. ఆమె ఒక వైపు రాకేష్ చేతిలో మోసపోయి గర్భవతిగా వుండటం, మరో వైపు తన తప్పిదం వల్ల బంగారం లాంటి బాబీ జీవితం నాశనం అవ్వటం తలచుకొని ఒంటరిగా ఇంట్లోనే ఉండి కుమిలి పోతుంది. జయంతి నర్సింగ్‌హోంకి వెళ్ళి జరిగిన సంఘటనకు ప్రధాన కారణం శ్రీవాణినే అని తెలుసుకుని శ్రీవాణి అద్దెకుంటున్న ఇంటికి వస్తుంది. బంగారం లాంటి నా బాబు జీవితం నాశనం చేశావు కదే అని జయంతి శ్రీవాణిని ఇష్టం వచ్చినట్లు కొడుతుంది. అయినా వీటన్నింటిని భరిస్తుంది శ్రీవాణి. చేసిన తప్పుకి తాను కూడా మరో వైపు కుమిలిపోయింది కాబట్టి. బాబీని తీసుకుని జయంతి సురేష్ దగ్గరికెళ్ళి మన బాబీ విషయంలో జరిగిన అన్యాయాన్ని ఊరికే వదిలి పెట్టకూడదండీ వాళ్ళను కోర్టు కీడ్చాలి అంటుంది. అయితే ఈ విషయాన్ని అదే నర్సింగ్‌హోమ్‌లో పని చేస్తున్న డాక్టర్ ప్రకాశ్ దగ్గరకు వెళ్ళి చెబుతాడు సురేష్. ఎందుకంటే ప్రకాశ్ మంచి వాడు నిజాయితీగా విధులు నిర్వహిస్తాడని తెలియడం వలన అతన్ని సలహా అడుగుతాడు. అవసరమైతే కోర్టుకి వెళ్ళండి కోర్టులో సాక్ష్యం చెప్పాల్సి వస్తే నేను నిజాల్ని దాచను సరేనా అంటాడు డాక్టర్ ప్రకాశ్ సురేష్‌తో.

బాబీ విషయంలో జరిగిన తప్పిదం గుర్తొచ్చిన ప్రతి సారి శ్రీవాణీ కృంగి పోయేది. ఒక రోజు ధైర్యం చేసి జయంతి వాళ్ళ ఇంటికెళ్తుంది. శ్రీవాణీని చూసిన జయంతి ఎందుకొచ్చావే

రాక్షసీ! నీవలనే బంగారం లాంటి నాబాబీగాడు దేనికీ పనికి రాకుండా ఇలా అచేతనంగా ఉండి పోయాడని ఆవేశంతో అంటుంది. బాబీ విషయంలో జరిగిన తప్పిదానికి నన్ను క్షమించండి. పూర్తిగా తప్పంతా నాదే మీరు ఒప్పుకుంటే జీవింతాంతం బాబీకి దగ్గర వుండి సేవలు చేస్తాను అని వేడుకుంటుంది. అసలు ఏ ముఖం పెట్టుకుని వచ్చావు. బాబు మీద నీనీడ కూడా పడటానికి వీలులేదు. నీ క్రూరమైన ముఖం నాకు చూపించకు నేను ఆవేశంలో ఏం చేస్తానో నాకే తెలియదు. నిన్ను చంపేయాలన్నంతా కసి ఉంది. అలా చేస్తే అసహాయకుడైన నా కొడుక్కి నా ఆసరా కూడా లేకుండా పోతుంది. నన్ను నరహంతకురాల్ని చేసి నాకొడుకుని అనాధగా చేయవద్దు. వెళ్ళి పో అంటూ శ్రీ వాణిని నెట్టి పెద్ద శబ్దం వచ్చేలా తలుపు వేసుకుంటుంది జయంతి. శ్రీవాణికి ఓ క్షణం ఏమి చేయాలో తెలియదు. ఆమెకు జీవితం శూన్యంలా అనిపిస్తోంది. బాబుకి తోడుగా అండగా మరో అమ్మలా ఉండిపోవాలనే బలమైన కోర్కెతో జయంతిని వేడుకోవడానికి వచ్చింది. చివరికి అదీ అందకుండా పోయింది. పిచ్చి దానిలా అడుగులు వేసుకుంటూ వెళ్ళి పోతుంది. ఇంతలో డాక్టర్ ప్రకాశ్ గమనించి శ్రీవాణిని తన ఇంటికి తీసుకెళ్తాడు. బాబీవిషయంలో జరిగిన దానికి పశ్చాత్తాపపడుతున్నట్లు చెబుతుంది ప్రకాశ్‌తో శ్రీవాణి. ప్రకాశ్ శ్రీనర్సింగ్ హోమ్‌తో పాటు తన ఇంట్లో కూడా పేదల కోసం క్లినిక్ నడుపుతుంటాడు. ప్రకాశ్ మంచివాడు. పేదలకు ఉచితంగా వైద్యం చేస్తాడు. శ్రీవాణి శ్రీనర్సింగ్‌హోంలో పనిచేయడానికి ఇష్టపడటం లేదు. అయితే ప్రకాశ్ తన మంచితనంతో మాటలతో తన క్లినిక్‌లో నర్స్ గా శ్రీవాణిని పనిచేయడానికి ఒప్పిస్తాడు.

కోర్టుకి వెళ్ళాలన్న కృత నిశ్చయింతో వున్న సురేష్ లాయర్ రామనాధాన్ని సంప్రదిస్తున్నాడనే విషయం శ్రీనర్సింగ్‌హోం అధిపతి శ్రీధర్‌కి తెలుస్తుంది. దీంతో తమ ఆసుపత్రి పరువు బజారు పడటం ఇష్టం లేక నష్ట పరిహారం ఇవ్వడానికి సిద్దంగా ఉన్నానంటూ లాయర్‌కి ఫోన్ చేస్తాడు. సాయంత్రం సురేష్, లాయర్ రామనాధం వస్తారు. పాతిక లక్షలైనా ఇవ్వాల్సిందే అని చెబుతాడు సురేష్. ఒక లక్ష రూపాయల కంటే ఎక్కువగా ఇవ్వను అవసరమైతే కోర్టులోనే కల్సుకుందాం అంటాడు శ్రీధర్ చివరకు రెండున్నర లక్షల వరకు వస్తాడు. మేం వచ్చింది నష్ట పరిహారం కోసం తప్ప మీరు ఇవ్వగల దానం కోసం కాదంటూ బయటకు వస్తాడు రామనాధం. అతన్ని అనుసరిస్తూనే సురేష్ వస్తాడు.

లాయర్ రామనాధం కబురంపితే సురేష్, జయంతిలు కలిసి అతని ఆఫీసుకు వెళ్తారు. జయంతి మాత్రం జరిగిన విషయం మీద కోర్టుకెళ్ళి కేసువేద్దామనే ఆలోచన ఉందని చెబుతుంది లాయర్‌తో . అయితే కేసువేయడం వలన సమస్య పరిష్కారం చాలా ఆలస్యం అవుతుంది అంటాడు

రామనాధం. అయితే జయంతి మాత్రం కేసు వేయాల్సిందేనని చెబుతుంది. రామనాధం కల్పించుకొని ఈ నెలాఖరులోనే కేసువేద్దాం. చివరగా మరో సారి చెబుతున్నాను. శ్రీధర్ రెండున్నర లక్షలు ఇస్తానన్నాడు. మనం అతన్ని ఐదులక్షల వరకు ఒప్పించవచ్చు మీరు అంగీకరిస్తే అతనితో మాట్లాడతానంటాడు. అందుకు జయంతికి కోపం వచ్చి "అంటే డబ్బు కోసం చేస్తున్నామనుకుంటున్నారా? వాడిచ్చే ముష్టి అయిదు లక్షలు నాసంతోషాన్ని నా బాబు భవిష్యత్తు తిరిగి ఇవ్వగలవా.. నాక్కావల్సింది అది కాదు. వాణ్ణి బజారు కీడ్చాలి. వాడి హాస్పిటల్ ఎలాంటిదో పదిమందికి తెలియాలి. ఈ డాక్టర్లు డబ్బు పిండేయంత్రాల్లా మారి రోగుల్ని ఎలా పీడిస్తున్నారో బట్ట బయలు కావాలి" (సలీం:2001;పుట –143) అంటుంది. వాడు ఇవ్వలేనంత డబ్బు కాంపెన్సేషన్‌గా అడగండి. ఇరవై కాదు యాభై లక్షలు దావా వేయండి. నాకొడుకు జీవితం యాభై లక్షలేనా కోటి రూపాయలు దావా వేయండి . వాడివ్వడం కాదు నాక్కావల్సింది వాడివ్వలేక పోవడం వాడితో పాటు ఆనర్స్‌కి శిక్ష పడేలా చూడండి అంటుంది జయంతి. మరలా కలుస్తా అంటూ సురేష్ జయంతిని వెంటబెట్టుకుని బయటకు తీసుకెళ్తాడు.

శ్రీవాణి ప్రకాశ్ క్లినిక్‌లో నర్స్ గా చేరుతుంది. డాక్టర్ ప్రకాశ్ తన జీవితంలో జరిగిన సంఘటనలు తన తల్లి యాక్సిడెంట్‌లో చనిపోయిన విషయాన్ని శ్రీవాణికి చెప్పి బాధపడతాడు. శ్రీవాణి ప్రకాశ్‌ను ఓదారుస్తుంది. మరో వైపు శ్రీనర్సింగ్‌హోమ్ లోని డాక్టర్ల నిర్లక్ష్యం గురించిన వార్త ప్రముఖ దిన పత్రికల్లో ప్రచురించబడటం జరుగుతుంది. ఈ విషయాన్ని చూసి శ్రీధర్ చాలా అశాంతికి లోనవుతాడు. దీని గురించి డాక్టర్ ప్రకాశ్‌తో చర్చిస్తాడు. అతని వాదన విన్న ప్రకాశ్ ఇటువంటి పరిస్థితి రావడానికి కారణం మనమే అనుకుంటాను డాక్టర్! "ఒకప్పుడు పవిత్రంగా ఉండే వైద్యరంగం నేడు వ్యాపారం అయింది. ఒకప్పుడు వైద్యోనారాయణోహరి అంటూ డాక్టర్లను దేవుళ్ళలా ఆదరించేవారు. డాక్టర్లు కూడా అలానే ఆచరించేవారు. కానీ నేడు డాక్టర్ కోర్సులో చేరడానికి ముఖ్య కారణం డబ్బు సంపాదించాలనే కోరిక వైద్యం చేయడంలో ముఖ్యోద్దేశ్యం ధనార్జన.. లాభర్జనకు, దురాలోచనలకు వైద్యులు దూరంగా ఉండాలనే అంతర్జాతీయ నియమావళికి తిలోదకాలిచ్చి చాలా కాలమైంది. కొన్నేళ్ళక్రితం టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రికలో మూత్రపిండాల వ్యాధులతో సతమతమయ్యే రోగులకు సువర్ణావకాశం సబ్సీడి ధరలకే మూత్ర పిండాల మార్పిడి! అనే ప్రకటన వచ్చిందంటే మనం ఎంతగా దిగజారి పోయామో అర్థమవుతోంది" (పైదే; పుట – 154) అంటాడు శ్రీనర్సింగ్ హోం అధిపతి శ్రీధర్‌తో ప్రకాశ్.

బాబీ జీవితంలో జరిగిన సంఘటనతో దీనిపై ఏదైనా ఒక పోరాటం చేయాలనుకుంటుంది జయంతి. నీలిమా అనే మరో వైద్య బాధితురాలితో కలిసి ప్రణాళిక రూపొందిస్తుంది. 'సోసైటీ ఫర్ పబ్లిక్ హెల్త్ అవేర్‌నెస్‌అండ్‌యాక్షన్' అను ఒక సంస్థ ముంబైలో డాక్టర్ల వైద్యం విషయంలో ప్రజల్ని చైతన్యం చేస్తుంది. అలాంటి సంస్థను మన రాష్ట్రంలో కూడా ఒకటి నెలకొల్పాలనుకుంటారు.ఆ సంస్థ ద్వారా ప్రతి నెలా వైద్య బాధిత సంఘసభ్యులందరూ సమావేశమవుతుంటారు. వైద్యుల నిర్లక్ష్యాలను ప్రపంచానికి తెలియజెప్పడమే లక్ష్యంగా ఆ సంస్థను జయంతి, నీలిమలు ఒక ఉద్యమంలా నడుపుతారు.

ఆదివారం ఉదయం ఆదర్శనిలయం పేషంట్లందరూ వెళ్ళి పోయాక శ్రీవాణి ప్రకాశ్‌తో అంది. ఎందుకు డాక్టర్ ఇన్ని మందులు రాస్తారు డాక్టర్లు అని దీనికి ప్రకాశ్ "పోటీని తట్టుకోవాలంటే పేషంట్‌ను సంతృప్తి పరచాలి. ఇదో కారణం అయితే మరో కారణం – ఇదంతా ఓ పెద్ద రాకెట్‌లా నడపటమే డయోగ్నోస్టిక్స్ కంపెనీలిచ్చే కమీషన్ కోసం అవసరమున్నా లేకున్నా టెస్టులు రాయడం – మందుల కంపెనీలు చూపే ప్రలోభాలకు లోబడి ఆ బ్రాండ్ మందులు వాడమని రాయడం – అంతా వ్యాపారం. కొత్తగా మార్కెట్‌లోకి వస్తున్న ఆ బ్రాండ్ వాడటం వల్ల కలిగే దుష్ఫలితాల గురించి వారికి అవగాహన ఉండదు. మెడికల్ రెప్‌లు చెప్పే తీయటి మాటల్నే నిదర్శనాలుగా తీసుకునిఎడాపెడా రాసేస్తారు" (పైదే, పుట – 176) అంటూ నేడు ప్రపంచీకరణ ముసుగులో జరుగుతున్న కార్పోరేట్ ఆసుపత్రుల విధానాలను వివరంగా చెబుతాడు.

జయంతి, నీలిమలు వైద్య బాధిత సంఘం తరుపున తప్పు చేసిన డాక్టర్లపై కేసులు పెట్టిస్తున్నారు. రవీంద్రభారతి లాంటి పెద్దపెద్ద వేదిలకపై ఉపన్యాసాలు ఇచ్చి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తున్నారు. మరో వైపు శ్రీవాణి, ప్రకాశ్‌లు మరింత దగ్గరయ్యారు. ప్రకాశ్ శ్రీవాణీని పెళ్లి చేసుకోవాలనుకుని పెళ్లి విషయాన్ని ఆమె దగ్గర ప్రస్తావిస్తాడు. రాకేష్ వల్ల నేను చెడిపోయానని శ్రీవాణి చెబుతుంది. అయితే తరతరాలుగా స్త్రీలు పురుషునితో మోసపోతునే ఉన్నారు అంటాడు ప్రకాశ్. రాకేష్ విషయంలో జరిగిన అన్యాయాన్ని తలచుకొని బాదపడుతున్న శ్రీవాణికి ధైర్యం చెప్తాడుప్రకాశ్. శ్రీ చివరి వరకు జీవితాంతం నీతోడు నాకు కావాలని ఆశిస్తున్నా అంటాడు. జయంతికి ఒక్క క్షణం తీరిక ఉండటం లేదు. ఒక వైపు బాబీని చూసుకోవాలి. మరో వైపు మీటింగ్‌లకి వెళ్ళాలి. ఆర్థిక పరిస్థితి కూడా కొంత దిగజారింది. శ్రీధర్‌తో ఒక రోజు శ్రీవాణి ప్రకాశ్ అంటే తనకు ఇష్టమే అని అతనిని పెళ్లి చేసుకోవడానికి తాను సిద్దంగా ఉన్నానని చెబుతుంది. ఈ విషయాన్ని శ్రీధర్ ఒక రోజు ప్రకాశ్ క్లినిక్‌కి వెళ్ళి అతనికి వివరిస్తాడు. పక్కనే శ్రీవాణి సిగ్గుతో

తలదించుకుని ఉంటుంది. ప్రకాశ్ ఈ పెళ్లి నీకు ఇష్టమే కదా అని శ్రీధర్ అంటాడు. శ్రీకి ఇష్టమైతే నాకు ఇష్టమే అని ప్రకాశ్ శ్రీధర్‌కి చెబుతాడు. పెళ్లిలో పది లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా శ్రీవాణికి రాసిస్తానంటాడు పెద్దమనసుతో శ్రీధర్ శ్రీవాణి ఒక కండీషన్ పెడుతుంది. మీరు పెళ్లికి ముందే జయంతి, సురేష్‌లను పిలిచి వారికి కొంత కాంపెన్సేషన్ ఇవ్వండి అంటుంది. దీంతో తేరుకున్న శ్రీధర్ సరేనమ్మా నీకు ఇస్తానన్న పదిలక్షలు వారికి ఇచ్చేస్తాను అని చెబుతాడు.

ఒక రోజు ప్రకాశ్ సురేష్, జయంతిలను తన క్లినిక్‌కి పిలిచి శ్రీధర్ ఇవ్వాలనుకున్న నష్టపరిహారం గురించి చెబుతాడు. పది లక్షల వరకు శ్రీధర్ ఇవ్వాలనుకున్న నష్ట పరిహారం గురించి చెబుతాడు. పది లక్షల వరకు శ్రీధర్‌ను నేను ఒప్పించగలను అంటాడు ప్రకాశ్. దీన్ని బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకున్నా నెలకు ఏడెనిమిది వేలు చేతికి వస్తుందంటాడు. ఎలాగు బాబుకి ఒక నర్స్ అవసరం అవుతుందని జయంతితో ప్రకాశ్ చెబుతాడు. అవసరమైతే మీ లాయర్‌ని అడిగి పరిహారం తీసుకోమని చెబుతాడు. శ్రీధర్ కూతురు వివాహమైన మూడు రోజుల తర్వాత డాక్టర్ శ్రీధర్, డా. ప్రకాశ్ కలిసి ఉంటారు. ఇంతలో సురేష్, జయంతి, వీరి లాయర్ రామనాధం వస్తారు. మొదట జయంతికి ఈ నష్ట పరిహారం తీసుకోవడం ఇష్టం లేక పోయినా ఇంట్లో ఆర్థిక పరిస్థితి, బాబీగాడి అవసరాల కోసం అంగీకరించి పది లక్షల పరిహారాన్ని తీసుకుంటుంది. లాయర్‌తో కలిసి బాబీ కోసం ఒక నర్స్‌ని ఏర్పాటు చేయాలనుకుంటారు.

డాక్టర్ ప్రకాశ్, శ్రీవాణిల వివాహం రిజిస్ట్రార్ ఆఫీసులో జరుగుతుంది. ప్రకాశ్ తరుపున శ్రీధర్, శ్రీవాణి తరుపున శ్రీధర్ భార్య సంతకం చేస్తారు. పెళ్లి అత్యంత వైభవంగా జరుగుతుంది. ఆదివారం సాయంత్రం ఆరుగంటల సమయం ప్రజాక్లినిక్‌లో ప్రకాశ్, సురేష్, జయంతి ఒడిలో బాబీగాడు వుంటారు. బయట నలుగురు నర్సులు ఇంటర్వ్యూ కోసం కూచొని ఉంటారు. వారి నలుగురి క్వాలిఫికేషన్స్, నర్స్ గా అనుభవం ఎంత జీతం కోరుకుంటున్నారు? లాంటి వివరాలడిగాక నలుగురిలో ఎవరిని ఎన్నుకోవాలా అనే ఆలోచనలో పడ్డారు. నా ఉద్దేశంలో ఇప్పుడు వచ్చిన నలుగురిలో బెస్ట్ ఎవరూ లేరు అంటాడు ప్రకాశ్. బాబుని చూసుకోవాలంటే బోలడంత ఓపికా సహనం ఉండాలి. ఆమెకు నర్స్ మెదడు – అమ్మ హృదయం ఉండాలని చెబుతాడు. వీళ్ళలో ఎవరికీ ఆ లక్షణాలు లేవని చెబుతాడు. వీళ్ళలో ఎవరినో ఒకరిని పెట్టుకుందామా లేక మరోసారి ప్రకటన ఇచ్చి మరికొంత మందిని నిర్ణయిద్దామా? అని జయంతిని అడుగుతాడు ప్రకాశ్. తొందరేమి లేదు మీరనుకుంటే ఆగటమే మంచిదేమో అనిపిస్తుంది డాక్టర్ అంటుంది జయంతి. ఇంతలో తలుపు మీద “టక్‌టక్” మని శబ్దం వినిపిస్తే ముగ్గురూ తలెత్తి చూస్తారు. తలుపు

తెరుచుకుని మరో నర్స్ లోపలి కొచ్చింది. “తెల్లటి యూనిఫాంలో ఆమె మూర్తీభవించిన అనురాగంలా ఉంది. దయతో, కరుణతో వెలుగుతున్న ఆమె కళ్ళు చుస్తుంటే మదర్ థెరిస్సాను గుర్తుకు తెస్తున్నాయి. ఆమె నెమ్మదిగా నడచి వచ్చి ప్రకాశ్ ఎదురుగా నిలబడి పేపర్‌లో ప్రకటన వస్తే చూసి వచ్చాను. ఇవి నా సర్టిఫికేట్స్. నాకు నర్స్ గా చాలినంత అనుభవం ఉంది. అంతకన్నా ఎక్కువగా బాబుకు సేవ చేయాలన్న ఆకాంక్ష ఉంది. నాకు జీతం అక్కర లేదు. బాబుని నాప్రాణంలా చూసుకుంటాను. నాకు అవకాశం ఇవ్వండి(పైదే; పుట – 260) అన్న శ్రీవాణి మాటలకు ప్రకాశ్ జయంతి వైపు చూశాడు శ్రీవాణి జయంతి వైపు తిరిగి అభ్యర్థనగా అంది “మీ బాబు విషయంలో నేను చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా నైనా నన్ను బాబుకు నర్సుగా ఉండనీయండి బాబును నాకన్న కొడుకులా చూసుకుంటాను. బాబీ ఆరోగ్యం మెరగవడం కోసం నా శాయశక్తుల ప్రయత్నిస్తాను. కాదనకండి ప్లీజ్(పైదే; పుట – 261)అంటుంది శ్రీవాణి. ఆవేశాన్ని ఆపుకోలేక శ్రీవాణిని ఏమి చేస్తుందో అని భయపడతారు.” జయంతి మాత్రం శ్రీవాణిని సమీపించి ఆమె జోడించిన చేతుల్ని పట్టుకొని” వద్దు చేతులు జోడించాల్సిన అవసరం లేదు. ఇన్నాళ్ళు నీ మనసెలా దహించుకుపోయిందో నేనర్థం చేసుకోగలను” అన్నట్టు ఆర్థంగా ఆమె కళ్ళలోకి చూసింది” (పైదే; పుట –264) మరో వైపు నన్ను క్షమించారు. బాబుకి జీవింతాంతం తోడుగా వుంటాను. మీకు కృతజ్ఞతగా వుంటాను. శ్రీవాణి కళ్ళనుంచి జారిపడ్డ కన్నీటి బిందువులు సమాధానమిచ్చాయి. జయంతి కన్నీళ్ళను తుడుచుకుంటూ సురేష్ ఒడిలో వున్న బాబీని ఎత్తుకుని శ్రీవాణికిచ్చింది జయంతి డాక్టర్ ప్రకాశ్ వైపు తిరిగి “మాబాబికి ఇపుడు ఇద్దరు అమ్మలు” అని అనడంతో నవల సమాప్తమవుతుంది.

## 7.6 పడగనీడ

ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యారంగం వ్యాపారమైంది. ఎక్కడ చూసినా మానవతా విలువలు లేని కార్పొరేట్ కాలేజీలే నేడు దర్శనమిస్తాయి. కార్పొరేట్ కాలేజీల ధన వేటలో తల్లిదండ్రుల ఆశయాలు, లక్ష్యాల సాధనలో విద్యార్థులు ఏవిధంగా మనో వేదనను, వత్తిడిని, హింసను అనుభవిస్తున్నారో వివరించిన నవల పడగనీడ. ఈ నవలను 2010లో ‘సలీం’ రాయడం జరిగింది.

అనూష పదవ తరగతి చదువుతోంది. వాళ్ళ నాన్న రామారావు ఆడిటర్ ఆఫీసులో ఉద్యోగం చేస్తూ సంసారాన్ని లాక్కొస్తుంటాడు. ఆమె తల్లి గృహిణి, తమ్ముడు అనిరుధ్. పదవతరగతి ఫలితాలు రాకుండానే వాళ్ళ అమ్మ అనూషను శ్రీ చరిత జూనియర్ కాలేజీలో చేర్పిద్దామండి. దానికి మంచి పేరుంది, బాగా రుబ్బుతారట. యంసెట్లో మన అమ్మాయికి ర్యాంక్ ఖాయం అని భర్తతో అంటుంది. ప్రతీ వాళ్ళు యంసెట్ల వెంట పరుగులెత్తబట్టే కాలేజీలన్నీ యంసెట్ కోచింగ్‌లంటు వేలకు వేలు దండు కుంటున్నాయి. ఇక్కడే ఇంటర్మీడియట్ చేర్చి తర్వాత సి.ఎచదివిద్దాం అంటాడు. అనూషకు లెక్కలన్నా ఇష్టమే, సైన్స్ అన్నా ఇష్టమే కానీ తనకు లిటరేచర్ చదవాలని ఉంటుంది. ఇదే విషయాన్ని ఒక రోజు ఇంట్లో తల్లితో చెబితే పెద్ద రాద్ధాంతం జరిగింది. ఈ విషయాన్ని ఇంకెక్కడా అనకు పరువునష్టం అని తిడుతుంది తల్లి దీంట్లో పరువునష్టమేముందమ్మా నాకు లిటరేచర్ అంటే ఇష్టం కథలూ, నవలలూ చదివితే ఎంత సాహిత్యముందో తెలుస్తుందమ్మా ...ఇంగ్లీషు లిటరేచర్ అయినా పర్లేదమ్మా అని అడుగుతుంది. “కథలూ కాకరకాయలు చదివితే తిండెలా దొరుకుద్ది? ఉద్యోగాలెలా దొరుకుతాయి? ఇపుడు ఇంజనీర్లకున్న డిమాండ్ ఎవ్వరికీ లేదు ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు లక్షలకు లక్షలు జీతాలు కడుపులో చల్ల కదలకుండా ఎ.సి రూముల్లో కంప్యూటర్ ఎదురుగా కూచోనిరావొచ్చు. ఆడపిల్లలకు ఇంతకు మించిన ఉద్యోగాలేం ఉంటాయి? మరో ఆలోచన పెట్టుకోకు ఇంజనీరింగ్ కోర్సు చదువు పదిమందిలో గౌరవం కూడా... పెళ్ళి చేయాలన్నా ఈ రోజుల్లో అదోముఖ్యమైన క్వాలిఫికేషన్ (సలీం;2010: పుట -12)అంటూ అనూషను నోరు మూయిస్తుంది తల్లి.

పదవ తరగతి ఫలితాలు వెలువడ్డాయి. అనూషకు ఐదువందల ఇరవై రెండు మార్కులు వస్తాయి. అన్ని మార్కులొచ్చినా అనూష సంతోషం వ్యక్తం చేయడానికి వీలు లేకుండా పోయింది. కారణం ఆరోజు ఇంట్లో అనూష తల్లిదండ్రుల మధ్య గొడవ మరింత ముదిరింది. తల్లేమో ఇంజనీరింగ్ అంటుంది. తండ్రేమో సి.ఎ. అంటున్నాడు. చివరికి తల్లి మాటేనెగ్గించుకుంది. విజయవాడ కాలేజీలో చేర్పించడానికి నిర్ణయిస్తారు. విజయవాడకు వెళ్ళే రోజు వలవలా ఏడుస్తుంది అనూష. విజయవాడేగా శాతవాహన ఎక్కితే ఐదు గంటల ప్రయాణం అంటుంది అమ్మ. చివరికి హైదరాబాద్ నుంచి విజయవాడకు బస్సెక్కారు తండ్రీకూతురు. బస్సులో వాళ్ళ నాన్న ఏమి మాట్లాడలేదు. చివరికి విజయవాడ చేరుకొని కాలేజీ దగ్గరికి వెళ్ళారు. అదొక రెండంతస్తుల భవనం లోపల విశాలమైన ప్రాంగణం కిందనే మెస్ ఉంది. మొదటి అంతస్తులో హాస్టల్ గదులు, రెండో అంతస్థులో క్లాస్ రూమ్‌లు ఉన్నాయి. గదులు సరిపోవడం లేదని మూడో అంతస్థు కట్టిస్తున్నారు.

అడ్మిషన్లు పూర్తయిన తర్వాత బాగా చదువుకో, బెంగపెట్టుకోకు ఆరోగ్యం జాగ్రత్త ఏదైనా అవసరమైతే ఫోన్‌చెయ్యి అని జాగ్రత్తలు చెప్పి బయలు దేరాడు అనూష తండ్రి. మొదటి రోజు ఇంటి ఊహల్లోంచి బయటపడి అర్థరాత్రికి నిద్రపోతుంది అనూష.

ఉదయం నాలుగు గంటలకే నిద్రలేపారు. రాత్రి నిద్ర సరిగా లేనందు వలన కళ్ళు అగ్ని గోళాల్లా మండుతున్నాయి. స్నానాల దగ్గర చాంతడంత క్యూ. ఐదున్నర నుంచే క్లాసులు. లెక్చరర్ చెప్తున్న పాఠం ఎక్కటంలేదు. కళ్ళు మూతలు పడుతున్నాయి. పన్నెండింటికి లంచ్‌కొదిలారు. మధ్యలో అరగంట టీ బ్రేక్ ఇచ్చారు. మరలా ఏడుగంటల వరకు చదువు ఏడు నుంచి ఎనిమిది వరకు డిన్నర్, ఎనిమిదింటికి విశాలమైన స్థలంలో కుర్చీలు వేసి పుస్తకాలు ముందుంచారు అప్పటికే విసుగొచ్చింది అనూషకు. అనూష లెక్కలేసుకుంటుంది. ఏడు గంటలు పాఠాలు వినాలి. ఏడున్నర గంటలు చదవాలి. యంసెట్లో ర్యాంకులు రావాలంటే ఇన్ని గంటలు చదవాలా అనుకొని ఒక సారి తన చుట్టూ పరిశీలనగా చుసింది. మొత్తం నాలుగు వందల మంది అమ్మాయిలున్నారు. కాలి మీద ఎదో పాకుతున్నట్లు అనిపించి గట్టిగా విదిలించింది. దోమలు తమ ఇష్టం వచ్చిన చోట కుట్టి తమ రక్తాన్ని పీలుస్తున్నాయి. మరలా కాలి మీద ఏదో పాకుతుంది కాలిని విదిలించినా పోలేదు చేత్తో గట్టిగా విదిలిస్తుంది చూస్తే మిడత కెవ్వున కేకేసి కాళ్ళ వైపు చుసుకొంది. అందరి పరిస్థితీ దాదాపు అలాగే ఉంది. అవి మిమ్మల్నేమి కొరుక్కు తినవు చదవండి" అని గదమాయించింది చీఫ్ వార్డెన్ ఆమె పేరు సత్యవతి ఇంటి ఊహల్తో అలాగే చదువుతున్నట్లు నటిస్తూ కూర్చొంది అనూష. కొద్ది సేపటి తర్వాత 'నేను రూంకి వెళ్ళి వస్తాను' అని ఎవరో పెద్దగా అంటుంటే బైటపడి తలెత్తి చూసింది తన రూం మేట్ కల్పన .. చీఫ్ వార్డెన్‌తో అంటుంది. ఎందుకు అని సత్యవతి అసహనంగా కల్పనను అడుగుతుంది. నాకు తల నొప్పి అని కల్పన చెప్పింది. ఇక్కడ కూర్చోబెట్టింది మీ ఇష్టం వచ్చినట్లు తిరగడానిక్కాదు. ట్యాబ్లెట్స్ తెప్పిస్తా వేసుకొని కూచో అంది సత్యవతి. ఫరవాలేదు నేను టాబ్లెట్ వేసుకోను అంటుంది కల్పన. కొద్దిసేపటి తర్వాత నేను రూం కెళ్తున్నా అంది కల్పన ఎందుకని సత్యవతి అడిగితే బాత్రూంకి అని సమాధానం ఇచ్చింది. ఆ మాటకు కొంతమంది ఆడ పిల్లలు శబ్దం వచ్చేలా నవ్వారు. కంట్రోల్ చేసుకో ఇంకో గంటలో స్టడీ అవర్ అయిపోతుంది అని అంది సత్యవతి. నేను వెళ్తున్నా అంటూ విసురుగా లేచి వెళ్ళిపోయింది కల్పన. పదిహేను నిమిషాలు అయినా కల్పన రాదు. అందరూ కలిసి వెతికితే మూడో అంతస్థు పిట్ట గోడ దగ్గర నిలబడి ఏడుస్తుంటుంది కల్పన. సత్యవతి కల్పనను దిగిరా ఎందుకు వెళ్ళావు? అక్కడికీ అంటుంది. నేను రాను నాకు బతకాలని లేదు అంటుంది. సత్యవతి ప్రిన్సిపాల్ గారికి ఫోన్‌చేసి విషయం చెప్పమని మరో వార్డెన్‌కి చెప్పింది.

చివరికి ప్రిన్సిపాల్ వచ్చి దిగమన్నా కిందకి రాదు. నన్నెవరూ ప్రేమించరు, నేనెవరికీ అక్కరలేదు మా అమ్మానాన్నలకు కూడా నా మీద ప్రేమ లేదు. అందుకే చచ్చిపోదామనుకున్నా అంటుంది కల్పన. మీ నాన్న ఫోన్ నెంబర్‌తో ఇప్పుడే మాట్లాడాను ఆయన బయలుదేరి వుంటాడని చెప్పగానే కిందకి దిగివస్తుంది. వెంటనే కల్పన తండ్రి హాస్టల్‌కి వస్తాడు. నాకూతుర్ని డాక్టర్ని చేయాలని ఉంది. అది చచ్చిపోతాంనంటుందిగా చచ్చిపోమనండి, దాంతో పాటు నేను, నా భార్య కూడా ఉరేసుకొని చచ్చిపోతాం అంటూ భోరున ఏడుస్తాడు. దీంతో నువ్వలా ఏడ్వకు నాన్న నేనిక్కడే ఉండి చదువుతాను అంటుంది కల్పన. అతను వెళ్ళి పోయాక అందరూ కల్పన చుట్టూ చేరి నువ్వుదిగాలు పడకు మేమందరం నీతోడు ఉంటాం అని చెబుతారు.

సాయంత్రం ఐదు గంటల తర్వాత ఇంటికి ఫోన్ మాట్లాడటానికి సమయం కేటాయించారు. ఒక్కొక్కరు కేవలం రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడాలనే నిబంధనతో అందరూ క్యూలో వుంటారు. అనూషకు ఈ మధ్య ఇంటి పై ధ్యాస ఎక్కువైంది నాన్న ఎలా ఉన్నాడో? అనిరుధ్ ఏం చేస్తున్నాడో? అమ్మ ఏం చేస్తుందో? అని అయితే అప్పటికీ క్యూలో ఎక్కువ మంది ఉండటం వలన కల్పన అనూష ఇద్దరూ కలిసి ఒక సిమెంట్ గట్టు పై కూచొని మాట్లాడుతున్నారు. హాస్టల్‌లో చాలా మంది అమ్మాయిలు ఉంటున్నారు. వాళ్ళలో కల్పన మాత్రమే అనూషకు మొదట పరిచయమైంది. తర్వాత స్పందన, ముస్లీం అమ్మాయి ఆసియాసుల్తానా మొదలైన వారందరూ అనూష, కల్పనలకు బాగా దగ్గరయ్యారు. అక్కడ హాస్టలు వారి పట్ల జైలు లాగా ఉంది. ఆడుకోవడానికి స్వేచ్ఛలేదు. తల్లీదండ్రితో మాట్లాడటానికి లేదు. ప్రతినిత్యం చదువు, చదువు తప్ప మరేమీ అక్కర లేదు అన్నట్లుగా కాలేజీ యాజమాన్యం ప్రవర్తిస్తుంది కళాశాల వాతావరణం పడక అనూషకు జ్వరం వస్తుంది.

రామారావు ఆఫీసుకి సెలవు పెట్టి నల్లకుంట వైపు బయల్దేరాడు. అతడికి తన కూతురు భవిష్యత్ గురించి బాధలేదు. ఎప్పుడైనా అత్తారింటికి వెళ్ళే అమ్మాయి. కొడుకు అనిరుధ్ గురించే అతని తపనంతా అనిరుధ్ ప్రస్తుతం తొమ్మిదవ తరగతి. వాన్ని ఎలాగైనా రామయ్య ఐఐటిలో చదివించాలనుకుంటున్నాడు. అక్కడ సీటురావాలంటే శాస్త్రి కోచింగ్ సెంటర్లో కోచింగ్ తీసుకోవాలి. ఆయన శాస్త్రికోచింగ్‌సెంటర్‌కి వెళ్ళేటప్పటికే అక్కడ చాలా మంది జనం శాస్త్రి కోచింగ్‌లో తమ పిల్లల్ని చేర్చడానికి అప్లికేషన్లు తీసుకోవడం కోసం వేచివుంటారు. రామారావుకి నాలుగింటికి అప్లికేషన్ ఫామ్స్ చేతికొస్తుంది. దాన్ని తీసుకుని ఇంటికి వస్తాడు. అంతలోనే శ్రీచరిత ఇంజనీరింగ్ కాలేజీ నుంచి అనూషకు ఒంట్లో బాగుండటం లేదని ఫోన్ వస్తుంది. వెంటనే

విజయవాడకి బయల్దేరి అనూషను ఇంటికి తీసుకొస్తాడు. ఆమెకు మలేరియా, టైఫాయిడ్ రెండూ ఉన్నాయని డాక్టర్ చెబితే దానికి సంబందించిన టాబ్లెట్స్ ఇంజక్షన్స్ వేసి బాగు చేయిస్తాడు. తిరిగి విజయవాడకి తీసుకెళ్ళి హాస్టల్‌లో వదిలేస్తాడు. జ్వరంతో అనూష తరగతిలో బాగా వెనకబడిపోతుంది.

మధుమిత పదవతరగతి పూర్తి చేసింది ఆమె తండ్రి హరికృష్ణ. ఆంధ్రజ్యోతి డెయిలీలో జర్నలిస్టు, ఇంటర్‌లో జాయిన్ కావడానికి ముందు మధుమితను నీవు ఏమి చదువుతావు? ఏదంటే నీకిష్టం అంటాడు నాకు హిస్టరీ అంటే ఇష్టం అంటుంది. దాని తర్వాత బ్యాచిలర్ డిగ్రీ ఆర్ట్‌స్‌లో పూర్తిచేసి ఐ.ఎ.ఎస్.. కావాలనుకుంటున్నా నాన్న అంటుంది మధుమిత. కూతురు ఇష్ట ప్రకారమే ఒప్పుకుంటాడు హరికృష్ణ అంతే కాకుండా ఇంటర్ స్థాయిలో ఓ డిబెట్ లో పాల్గొని హిస్టరీ సబ్జెక్ట్ మీద ప్రసంగించి మొదటి బహుమతి సాధిస్తుంది మధుమిత.

హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ లో ఎనిమిదో వీధిలో ఒక ఇంటి అడ్రస్ వెతుకుతుంటాడు సుందరం. అతని చేతిలో పదికి పైగా కంప్యూటర్ షీట్లు పెట్టుకొని ఉంటాడు. అందులో ఒక్కో షీట్‌లో ఇరవైకి పైగా అడ్రస్‌లుంటాయి. పదవతరగతి ఫలితాల అనంతరం అతను మంచి మార్కులు వచ్చిన అమ్మాయిల అడ్రస్‌లు కనుక్కొని వాళ్ళను శ్రీచరిత జూనియర్ కళాశాలలో చేర్పించండి అంటూ ప్రచారం చేస్తుంటాడు. ఇతను కార్పొరేట్ కాలేజీల వాళ్ళు నియమించుకున్న ప్రచారకర్త. అంటే నేడు ప్రతిదీ వ్యాపారపరమైంది. విద్య కూడా అందులో అంతర్భాగమైయింది.

ఇంటర్ పరీక్షలు అయిపోయిఫలితాలువెలువడానికి సిద్ధంగా ఉన్నాయి. యంసెట్ ఫలితాలు కూడా శ్రీచరిత కాలేజీ ప్రిన్సిపాల్ ఈశ్వరరావు తన పలుకుబడి పరిచయాల్ని వాడుకుని ఫలితాలను ముందుగానే తెలుసుకుంటాడు. అతని కాలేజీకి ఇంజనీరింగ్‌లో మూడు నాలుగు ర్యాంక్‌లు వస్తాయి. ప్రత్యర్థి అయిన సునందా కాలేజీకి రెండో ర్యాంక్ ఐదో ర్యాంక్ వచ్చాయి మెడిసిన్‌లో మొదటి ర్యాంక్ సునందా కాలేజీకి వస్తుంది. ఈశ్వరరావు ఆతృతగా ఇంజనీరింగ్‌లో మొదటి ర్యాంక్ సంపాదించిన విద్యార్థి వివరాలు కనుక్కొన్నాడు. అతను కార్పొరేట్ కాలేజీలో చదువలేదు. ఓ మోస్తారు పేరున్న కాలేజీలో చదివి ఉంటాడు. పేరు రామారావు. వెంటనే ఈశ్వరరావు ఆ విద్యార్థి ఇంటికెళ్తాడు. మొదటి ర్యాంక్ విద్యార్థి తండ్రిపేరు వెంకటేశ్వర్లు మీఅబ్బాయిని ఇంజనీరింగ్ చదివించే స్తోమత మీకు ఉందా అని అడుగుతాడు వెంకటేశ్వర్లుని ఈశ్వరరావు. అయితే

అంతస్తోమత మాకు లేదయ్యా అంటాడు. అయితే నేను మీ అబ్బాయిని చదివిస్తానని చెబుతాడు. ఇంతలో రామారావు అక్కడికొస్తాడు. ఏ కాలేజీలోచదివావు? అని అడుగుతాడు రామారావుని ఈశ్వరరావు. సెయింట్ థామస్ జూనియర్ కాలేజీలో సార్ అంటాడు యంసెట్ కోసం ఎక్కడైనా కోచింగ్ తీసుకున్నావా? మరళా అడిగాడు ఈశ్వరరావు. లేదు సార్ సెల్ఫ్ కోచింగే అంటూ రామారావు సమాధానం. సరే తర్వాత ఏమి చేద్దామనుకుంటున్నావు? కంప్యూటర్ ఇంజనీరింగ్ కావాలన్నది నా కల సార్. యంసెట్ కూడా బాగా రాశాను వెయ్యిలోపలే ర్యాంక్ వస్తుందన్న నమ్మకం ఉంది సార్ అంటాడు రామారావు. చూడు వేలకి వేలు ఫీజులు కట్టాలి. మీ నాన్న అంత డబ్బు కట్టలేడు. అందుకే నేనీ ప్రపోజల్‌తో వచ్చా యంసెట్ కోచింగ్ శ్రీచరిత కాలేజీలో తీసుకున్నానని చెప్పు. పేపర్ల వాళ్ళొచ్చి అడిగినా, టీవీ వాళ్ళొచ్చి అడిగినా ఇదే విషయం చెప్పు. నీ ఫీజులన్నీ నేను కట్టి ఇంజనీరింగ్ చదివిస్తానంటాడు ఈశ్వరరావు. రామారావు ఈ విషయానికి ఉక్కిరి బిక్కిరై సరే అంటాడు. మీరు ఎవరు వచ్చి అడిగినా మాటమార్చకూడదంటూ వాళ్ళదగ్గరహామీ తీసుకుంటాడు. మొదట ఐదులక్షలిద్దామనుకున్నాడు ఈశ్వరరావు ఇక్కడికి రాకముందు అప్పటికీ ఒప్పుకోకుంటే మరో రెండు లక్షలు ఎరవేద్దామనుకుంటాడు తీరా ఇక్కడికొచ్చి వీళ్ళపేదరికం చూశాక చేప ఊరకనే గాలానికి తగులుకుంటుందని అర్థమైందతనికి, వెంటనే ఇరవై అయిదు వేలు వాళ్ళ చేతిలో పెట్టి అక్కడి నుంచి వెళ్ళిపోతాడు. శ్రీచరిత జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఈశ్వరరావు. ఆ వెంటనే విషయం తెలుసుకున్న సునందా కాలేజీ ప్రిన్సిపాల్ రామ్మూర్తి అక్కడికి కారు తీసుకుని వస్తాడు. మీ అబ్బాయికి లక్ష రూపాయలు ఇస్తాను మా కాలేజీ పేరు చెప్పండి అని ప్రాదేయపడతాడు. అయితే వెంకటేశ్వర్లు రామారావు అంతకు ముందే ఇచ్చిన మాటకు కట్టుబడి దాన్ని తిరస్కరిస్తారు.

మరుసటి రోజు మూడుగంటలకు ఫలితాలు వెలువడతాయి. సాయంత్రానికల్లా టీవీల నిండా ఒకటే ప్రచారపు హోరు యంసెట్ ర్యాంకుల గురించి శ్రీచరిత జూనియర్ కాలేజీ ప్రభంజనం ఇంజనీరింగ్‌లో మొదటిర్యాంక్‌తో పాటు మూడు నాలుగు ర్యాంకుల కైవసం. మొదటి వంద ర్యాంకుల్లో యాభై ఆరుస్థానాలు నిలబెట్టుకున్న శ్రీచరిత అంటూ ఏ టీవీ తిరగేసినా ఒకటే హోరు కన్పిస్తుంది. మరో వైపు ఆ ప్రకటన వచ్చిన కొద్ది సేపటికే సునంద కాలేజీ వాళ్ళ ప్రకటన గత కొన్ని సంవత్సరాలుగా మెడిసిన్‌లో విజయఢంకా మోగిస్తున్న సునందా .. గెలుపుకి మరోపేరు సునందా అంటూ ఒకటి తరువాత ఒకటి పోటీపడి ప్రకటనలిస్తున్నాయి. శ్రీచరిత ఒకడుగు ముందుకేసి గౌరవనీయులైన ముఖ్యమంత్రి చేతుల మీదుగా మొదటి ఐదు ర్యాంకులు తెచ్చుకున్న విద్యార్థులకు

బహుమతులు, బోకేలు ఇప్పిస్తుంది. సునందా కాలేజీ వాళ్ళు తామేమి తీసి పోమని చెప్పడానికి ముఖ్యమంత్రి ద్వారా ర్యాంకులు తెచ్చుకున్న వారికి నగదు బహుమతులు ఇప్పిస్తారు. ప్రకటనల యుద్ధం రెండు వారాల దాకా హోరాహోరిగా సాగింది.

ఆ రోజు ఆదివారం శ్రీచరిత లేడిస్ హాస్టల్ కోలాహలంగా మారింది. కారణం ఆరోజు ఔట్ పర్మిషన్‌డే కావడం చాలామంది పిల్లల తల్లిదండ్రులు అక్కడికి వచ్చి ఇంటి నుంచి తీసుకు వచ్చిన ఆహారాన్ని వారికి గారాభంగా తినిపించారు. ఆసియాసుల్తానా వాళ్ళ చెల్లెలు అయేషా సుల్తానా, వాళ్ళ నాన్న వస్తారు. వారిద్దరినీ అనూష, కల్పనలకు పరిచయం చేస్తుంది. కల్పన కోసం ఎవరూ రారు. అందుకు నన్ను ఎవరూ ప్రేమించడం లేదు. ఆమెకు నాన్న గుర్తొస్తాడు. చనిపోయిన వాళ్ళ తమ్ముడు గుర్తొస్తాడు. ఎందుకు నాన్నకు తనంటే ఇష్టం లేదు కనీసం అమ్మనయినా పంపించి ఉండొచ్చుకదా అని బాధపడి అర్ధరాత్రి సమయంలో రూంకి వెళ్ళి పడుకుంటుంది.

శుక్రవారం రోజు మూడో అంతస్థులోని క్లాసుల నిర్మాణం పూర్తయి ప్రారంభించారు. ఆరోజున పిల్లలంతా కొత్త రూముల్లోకి వచ్చినందుకు సంతోషంగా ఉన్నారు. ఆసియా సుల్తానా పరుగు పందెంలో దిట్ట. ఎవరు ముందు పైకి వెళ్ళి తొందరగా కిందకు వస్తారో అంటూ మొదటి అంతస్థులో నిలబడి అనూషతో పందెం కాచి పరుగెత్తుతుంది. రెండవ అంతస్థు దాటి మూడవ అంతస్తు గ్రిల్ ముట్టి వెనుకకు తిరగాలి అనుకున్నంతలోనే ఒక్కసారిగా పెద్దశబ్దంతో మూడవ అంతస్తుకూలిపోతుంది. దానికింద దాదాపు పాతిక మంది పిల్లలున్నారు. ఈ ప్రమాదంలో ఆసియాసుల్తానా సహా అందరిని ఆసుపత్రికి తరలిస్తారు. వెంటనే మీడియాకు సమాచారం అంది మీడియా వస్తుంది. నిర్మాణం చేసిన కాంట్రాక్టర్‌ను విలేకరులడిగితే తప్పంతా ప్రిన్సిపాల్‌దే అంటాడు. నాలుగు నెలలు కావలసిన నిర్మాణ పనులు ప్రిన్సిపాల్ ఒత్తిడి పై రెండు నెలల్లో పూర్తి చేయడమే ఈ ప్రమాదానికి కారణం అని పోలీసులు కేసు నమోదు చేస్తారు. ప్రమాదంలో ఆసియా సుల్తానా కుడికాలు మోకాలి క్రింది భాగం వరకు పోతుంది. తల్లిదండ్రి వచ్చి విలవిలలాడతారు. తోటి పిల్లలందరూ ఈ సంఘటనతో కన్నీళ్ళు పెడతారు.

రామారావు తన కొడుకు అనిరుధ్‌ని ఐఐటీ ఒరియంటేషన్ కోర్సుకి పంపుతుంటాడు. ఒక రోజు అనిరుధ్‌ని ఐదు గంటలకే నిద్రలేపి నల్లకుంటలో కోచింగ్ సెంటర్ వద్ద విడిచి వస్తాడు అయితే అనిరుధ్ కి ఈ కోచింగ్ పట్ల ఆసక్తిలేదు. పోయిన నెలలో కూడా అనిరుధ్‌కి తక్కువ మార్కులు వచ్చాయి. రామారావు కొడుకుని నల్లకుంట దగ్గర దించి ఇంటికి రాగానే అనిరుధ్

నిన్నటి రాత్రి వాళ్ళ నాన్న  జేబులో కొట్టేసిన వంద రూపాయాలతో కాచిగూడ వెళ్ళి అక్కడ రైలు ఎక్కి కర్నూలుకి వచ్చేస్తాడు. సాయంత్రం అనిరుధ్ కోసం కోచింగ్ సెంటర్‌కి వస్తాడు రామారావు అయితే అనిరుధ్ కనబడడు దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాడు. కర్నూలు వెళ్ళిన అనిరుధ్ అక్కడ డబ్బులు పోగొట్టుకుంటాడు. తినడానికి కూడా ఏమీ ఉండవు. దీంతో తాను కిడ్నాప్ అయినట్లు నాటకమాడి తండ్రికి ఫోన్ చేస్తాడు. అక్కడ కర్నూలు రైల్వే పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుంటారు  పోలీసులకి తమ ఇంటి పరిస్థతి గురించి, తనకు పరీక్షలంటే భయంవేసి పారిపోయి వచ్చానని చెబుతాడు. పోలీసులు రామారావుని పిలిపించి పరీక్షలు, చదువుల పేరుతో పిల్లల్ని ఒత్తిడికి గురిచేయుద్దండీ అని రామారావుకి చెప్పి అనిరుధ్‌ని తండ్రి వెంట పంపుతారు.

కల్పన వారం నుంచి కంటికి నిద్రలేకుండా సత్యవతి పెట్టుకున్న అక్రమ సంబంధాన్ని గుట్టురట్టు చేస్తుంది. దీంతో ప్రిన్సిపాల్ ఆమెను విధుల నుంచి తప్పిస్తారు. అనూషకు ఈ చదువు ఇష్టం లేకున్నా అలాగే కాలం గడిపేస్తుంది. కల్పన మాత్రం తనకు ఎవరూ లేరంటూ దిగులు పడుతుంది. యంసెట్ మ్యాక్‌టెస్ట్ లో తక్కువ మార్కులు వస్తాయి కల్పనకు. లెక్చరర్ ఆమెను అందరి ముందు నిలబెట్టించి షేమ్ అనిపిస్తుంది. దీంతో తీవ్ర మనోవేదనకు గురై కల్పన ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంటుంది. కల్పన తల్లీ తండ్రి వచ్చి నీకు ఎవరూ లేరని చనిపోయావా నీకు మేమున్నాము తల్లీ అంటూ కన్నీరు మున్నీరుగా విలపిస్తారు. కల్పన ఆత్మహత్య తర్వాత నుంచి అనూషకు నిద్రపట్టడం లేదు. తనకు చదువు ఇష్టం లేదన్నా తల్లిదండ్రుల బలవంతం మీద చదువుతోంది. అయితే కల్పన ఆత్మహత్య తర్వాత అనూష దెయ్యం పట్టినట్లుగా వ్యవహరిస్తుంది. వెంటనే కాలేజీ వాళ్ళు రామారావుకి ఈ విషయం తెలియజేస్తారు. రామారావు వచ్చి కాలేజీ యాజమాన్యాన్ని దూషిస్తాడు. అయితే వాళ్ళు మీ బిడ్డకు దెయ్యం పట్టింది. ఏదైనా జబ్బు చేస్తే డాక్టర్లకు చూపిస్తాం. మీ అమ్మాయికి దెయ్యం పట్టింది కాబట్టి మేమేమి చేయగలం అంటూ సమాధానమిస్తారు. దీంతో చేసేది లేక రామారావు తన కూతూరు ఇంజనీర్ కాకపోయినా ఫరవాలేదు మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా వుంటే చాలు భగవంతుడా అంటూ అనూషను తీసుకెళ్తాడు.

నాన్న ప్రేమ, అమ్మ అనురాగం తమ్ముడి సామీప్యం వాడి అల్లరి, వాడితో గిల్లికజ్జాలు చదువు ర్యాంకుల ఊసే లేకుండా హాయిగా గడిపిన రెండు వారాల్లోనే అనూష పూర్తిగా కోలుకుంటుంది. తల్లిదండ్రుల సూచనతో మరళా హాస్టల్‌కి చేరి ఫస్టియర్ పరీక్షలు దగ్గరపడటంతో అన్ని విషయాలు

పక్కన పెట్టి మంచి మార్కులు తెచ్చుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతుంది. మరో వైపు హరికృష్ణ ఈ పోటీ ప్రపంచంలో కార్పొరేట్ కాలేజీలు చేస్తున్న వ్యాపారదృక్పథాన్ని నిరసిస్తూ అందరికీ ఆదర్శంగా ఉండేలా తన మిత్రుల సహకారంతో కొత్త కాలేజీని ప్రారంభిస్తాడు.

మూడు సంవత్సరాలు గడిచి పోతాయి అనూషకు మంచి ఇంజనీరింగ్‌లో ఫ్రీసీటుకి సరిపడా ర్యాంక్ రాదు. "డిగ్రీ చదవాలనే కోరికని మరోసారి బైటపెట్టి, వాళ్ళమ్మ కోరిక ముందు తల వంచి సిటీకి ముప్పై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ అనామకమైన ఇంజనీరింగ్ కాలేజీలో కంప్యూటర్ కోర్సులో జాయినైంది. ఆంధ్ర రాష్ట్రం నిండా తామర తంపరగా పుట్టుకొచ్చిన ఇంజనీరింగ్ కాలేజీల వల్ల యంసెట్లో లక్ష ర్యాంక్ వచ్చినా ఏదో ఓ కాలేజీలో ఎదో ఓ బ్రాంచీలో సీటు గ్యారంటీ యింజనీరనిపించు కోవడానికి ఢోకాలేదు. కానీ ఆ తర్వాత ఫ్యూచర్ ఏమిటి? ప్రతిభ లేకుండా ఉద్యోగాలెలా వస్తాయి అంటూ మథనపడింది (పైదే పుట –183)అనూష.

ఆదర్శంతో హరికృష్ణ కాలేజీ ప్రారంబిస్తాడు. హరికృష్ణ కూతురు మధుమిత బి.ఏ డి.గ్రీలో చేరుతుంది. హరికృష్ణ ప్రారంభించిన కాలేజీలో హ్యూమానిటీస్ చదవడానికి కొంతమంది విద్యార్థులు చేరినా యం.సెట్ కోచింగ్ కోసం విద్యార్థులెవ్వరూ చేరరు. తనకు బాగా కావలసిన వాళ్ళను కలుసుకొని ఓ పదిమందిని చేర్చుకుంటాడు. వారికి యంసెట్ కోచింగ్ చెప్పిస్తాడు. రెండవ సంవత్సరం పాతిక మందిని చేర్చుకున్నారు. మొదట చేరిన పదిమంది ఈ సంవత్సరం యంసెట్ పరీక్షలు రాశారు. రేపే రిజల్ట్స్ వస్తాయి కనుక హరికృష్ణ తొందరగా తయారై గుండెనిండా ఆశతో అనంతమైన విశ్వాసంతో తను స్థాపించిన కళాశాల వైపు అడుగులేస్తాడు. అంతటితో నవల ముగుస్తుంది.

## 7.7 వెన్నెల్లో గోదావరి

ఆధునిక ఎలక్ట్రానిక్ యంత్రాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రాచీన ఆచారాలు పద్ధతులు అంతరించిపోతున్నాయి. నిజానికి ఇవాళ మనవి కాని ఆచారాలు, పద్ధతులు మన మీద బలవంతంగా రుద్దబడుతున్నాయి. కంప్యూటర్‌లు వచ్చిన తర్వాత లేఖలు ఏవిధంగా అంతరించి పోతున్నాయో అందరికీ తెలుసు విశ్రాంతి లేని పనికి అలవాటుపడి మానవుడు ఆధునికంగా

ప్రేమను ఎలా కోల్పోతున్నాడో చిత్రించిన నవల ఆదెళ్ళశైలబాల రచించిన వెన్నెల్లో గోదావరి ఈ నవల 2011లో ముద్రించబడింది.

కుమార్, శైలజలు  చిన్నప్పటి నుంచి స్నేహితులు. ఇద్దరూ ఒకే తరగతిలో కలిసి చదువుకుని వుంటారు. ఇద్దరికీ ఒకరి పట్ల ఒకరికి ప్రేమ ఉంటుంది. పదవతరగతి తర్వాత వేర్వేరు చోట్ల చదువు వల్ల వేరవుతారు. అయినా ఇద్దరి ఊహలు, ప్రేమ, జ్ఞాపకాలు ఇద్దరిలోనూ పదిలంగా ఉంటాయి. కుమార్ ఇంజనీరింగ్ పూర్తి చేసి అమెరికా వెళ్ళి ఉద్యోగంలో చేరతాడు. శైలజ వాళ్ళ అమ్మమ్మ, తాతయ్య వాళ్ళ ఇంటి వద్ద ఉంటుంది. కొంత కాలం తర్వాత పెద్దల అంగీకారంతో తన చిన్ననాటి స్నేహితురాలు శైలజను పెళ్లి చేసుకుంటాడు కుమార్. పెళ్లి అయిపోయిన వెంటనే శైలజను తీసుకుని కుమార్ అమెరికా వెళ్ళి పోతాడు. శైలజ చిన్నప్పుడు కుమార్‌కి ఒక ప్రేమలేఖ రాసి ఉంటుంది. ఆ విషయాన్ని వివాహం తర్వాత కుమార్‌ని అడుగుతుంది. అయితే కుమార్ ఆ లేఖను చదివి ఉండడు. తను నిత్యం కంప్యూటర్ ఈమెయిల్స్ ఆఫీసు పనుల్లోనే నిమగ్నమై ఉంటాడు. నేను రాసిన ప్రేమ లేఖలో నీకు ఏమి ఇష్టం అని కుమార్‌ని శైలజ అడుగుతుంది. అసలు ఇంతకు ఆ లేఖ చదివావా? అని అడుగుతుంది. కుమార్ కల్పించుకుని కొద్దిగా చదివాను శైలు అంటాడు. తాను రాసిన ప్రేమలేఖను కుమార్ చదవలేదనే విషయం శైలజకు అర్థమవుతుంది దీంతో మనస్థాపం చెందుతుంది. తాను ఎంతో ప్రేమతో పెళ్లికి ముందే రాసిన లేఖను కుమార్ చదవకుండా నిర్లక్ష్యం చేశాడని అమెరికా నుండి తిరిగి ఇంటికి వస్తుంది శైలజ .ఆఫీసు పనుల్లో ఉంటూనే కుమార్‌కి శైలజ గుర్తొస్తే ఇంటికి ఫోన్ చేస్తాడు. అయితే ఫోన్ రిసీవర్ ఎత్తడానికి అక్కడ శైలు ఉండదు. దీంతో ఆఫీసు పని ముగించుకొని ఇంటికి వచ్చి చుసిన కుమార్‌కి శైలజ కనిపించదు. కుమార్ శైలజలకు వివాహం అయి అమెరికా వచ్చి నాలుగు రోజులయి ఉంటుంది. దీంతో కుమార్ శైలజ ఎక్కడికెళ్ళిందోనని భయపడతాడు. వచ్చి నాలుగు రోజులే అయింది కనుక శైలజకు అమెరికా అంతగా తెలిసే అవకాశం లేదు. ఇండియాకు వెళ్ళి ఉంటుంది అనుకుంటాడు.

కుమార్ పై అలిగి శైలజ అమెరికా నుంచి ఇండియాకు వస్తుంది. తాత గారింటికి వెళ్ళే సమయానికి రాత్రి  పదకొండు గంటలవుతుంది. ఇంత సమయంలో ఒక్కతే ఎలా వచ్చింది అని భయపడతారు శైలు అమ్మమ్మ తాతయ్య. అయితే అక్కడ జరిగిన విషయాన్ని శైలజ చెబితే విని ముసిముసి నవ్వులు నవ్వుకుంటారు. అయితే వీళ్ళకు సరదా అనిపించినా శైలజకు మాత్రం అది ఒక ప్రాముఖ్యమైన అంశం అవుతుంది. తాను అంతప్రేమగా లేఖరాస్తే కనీసం ఇంత వరకు చదవడా? అని ఆక్రోశిస్తుంది. ఈ విషయంలో తాతయ్య, అమ్మమ్మలు శైలజకు మద్దతు ఇస్తారు.

శైలజ ఇండియాకు వచ్చి ఉంటుందని కుమార్ అనుకుంటాడు. శైలజ వాళ్ళతాతయ్య ఇంటికి ఫోన్ చేస్తాడు. పనిమనిషి ఫోన్ ఎత్తితే శైలజ ఉందా? అని అడుగుతాడు. ఇంట్లో ఎవరూ లేరు అందరూ గుడి కెళ్ళారని చెబుతాడు పనిమనిషి. కుమార్‌కి తెలియని ఆందోళన. తన బుచ్చమ్మ (శైలుకి కుమార్ పెట్టిన ముద్దు పేరు) ఎక్కడుందో అని కంగారు పడతాడు. చివరికి కుమార్ తన ఇంటికి ఫోన్ చేస్తాడు. అమ్మ ఫోన్ ఎత్తుతుంది. శైలజ గురించి అడుగుతాడు. శైలజ ఇక్కడి నుంచి వెళ్ళి పోయిందమ్మా, వాళ్ళ అమ్మకి ఒక్కసారిగా ఆందోళన ఏమి మాట్లాడాలో అర్థం కాలేదు. కోడలూ నువ్వు అంటూ ....నిట్టూర్పు అదేం లేదమ్మా నేను, శైలు విడిపోవడం లేదు అంటాడు కుమార్.

శైలజ వాళ్ళ తాతగారి ఊరికి వచ్చిందని కుమార్ కుటుంబానికి తెలుస్తుంది. కుమార్ వాళ్ళ అక్క కూడా ఈ విషయం తెలిసి ఇంటికి వస్తుంది. ఒక సారి శైలజతో మాట్లాడదామని ఫోన్ చేస్తుంది శైలజ ఫోన్ తీసి కుమార్‌కి తనకు మధ్య జరిగిన విషయం గురించి వివరిస్తుంది. తను ప్రేమ లేఖ రాయడం దాన్ని ఇంతవరకు కుమార్ చదవకపోవడం అన్నింటిని వివరిస్తుంది. కుమార్ వాళ్ళ అక్కద్వారా శైలు ఎందుకు ఇండియా వెళ్ళి పోయిందో తెలుసుకుంటాడు.

కుమార్ శైలజకు ఉత్తరం రాయాలని ఎంతో ప్రయత్నిస్తాడు అయితే ప్రేమ లేఖ ఏవిధంగా రాయాలో అతనికి అర్థం కావటంలేదు. తను ఉత్తరం రాయడం ద్వారా తన బుచ్చమ్మతో తన బాధ వ్యక్తీకరించగలనను కుంటాడు తాను ఎంత ప్రయత్నించినా ఒక్క ముక్క కూడా వ్యక్తీకరించలేక పోతాడు. ఎలాగోలా ఒక నాలుగు వాక్యాలను రాసి కవర్‌ని తన మిత్రుడు శర్మకు ఇచ్చి దీన్ని ఇండియాకు పోస్ట్ చేయమని చెప్పి హడావిడిగా ఆఫీసుకెళ్ళి పోతాడు కుమార్.

కుమార్ నుంచి ఉత్తరం రాగానే శైలజ ఎంతో ఆనందం వ్యక్తం చేస్తుంది తన గురించి కుమార్ ఏమి రాశాడో అని ఉత్సాహంగా ఉంటుంది. నీ ప్రేమలేఖ చదివాను బుచ్చమ్మా మన మధ్య జరిగిన సంఘటనలన్నీ ఎంత బాగా గుర్తించుకున్నావు అని రాసి ఉంటాడా? అని ఊహించుకుంటుంది శైలజ. ఉత్తరం ఎదురుగా ఉంచుకొని ఊహలెందుకని ఉత్తరం విప్పి చదువుతుంది. మావి కొమ్మని మురళిగా చేసుకొని కోకిలమ్మ వాయించే మురళీగానంలా ఉంటుందని ఎంతో ఆశపడ్డాను అని కుమార్ రాసిన ఉత్తరంలో ఉంటుంది. కుమార్ ఉత్తరం తనకు ఊరటనిస్తుంది అనుకుంటుంది అయితే అందులోని నాలుగు వాక్యాలు అవి కూడా తన స్నేహితున్ని

కూర్చోబెట్టుకొని గబగబా నాలుగు వాక్యాలు రాసి తన మోహన విసిరి కొట్టాడన్నమాట అనుకుంది శైలజ.

కుమార్ ప్రేమలేఖ వ్యవహారం అతని మిత్రులకు తను పనిచేసే ఆఫీసులో బాస్‌కీ అందరికీ తెలుస్తుంది. కుమార్ శైలజ రాసిన ప్రేమ లేఖ కనిపించక ఉక్కిరిబిక్కిరిఅవుతాడు. తమ వివాహం తర్వాత ఆ లేఖను ఎక్కడ ఉంచాడో గుర్తుకు రావడం లేదు కుమార్‌కి. వాళ్ళ అక్కకి ఫోన్ చేసి శైలజ గురించి అడుగుతాడు. శైలజ చాలా మంచి అమ్మాయిరా పాపం నువ్వు తను రాసిన లేఖను చదువకుండా ఆమెకు కోపం తెప్పిస్తున్నావు. మన ఇంట్లో అందరూ శైలజ అంటే చాలా ఇష్టపడుతున్నారు. ప్లీజ్ నువ్వు ఆ ఉత్తరం చదివి అమ్మాయికి లేఖ రాయి అంటుంది. శైలజ రాసిన ఉత్తరం కనిపించడం లేదక్కా మన ఇంట్లో ఎక్కడైనా ఉంటే వెతికి పెట్టవా ప్లీజ్ అడుగుతాడు. ఆప్రేమ లేఖను శైలజ వాళ్ళ తాతగారి ఇంటి దగ్గర నుంచి రాసినట్లు కుమార్‌కి గుర్తు ఆ ఇంట్లో ఇంకో కాపీ ఏమైనా ఉంటే శైలుకు తెలియకుండా వాళ్ళ అమ్మమ్మను అడిగి వెతికి పెట్టక్కాదయచేసి అంటాడు కుమార్.

శైలజ, కుమార్ గురించే ఆలోచిస్తుంది. అతను లేకుండా తను లేననుకుంటుంది. తన ఊపిరిలో ఊపిరిగా చూసుకుంటుంది కుమార్ శైలజ తమ మద్య జరిగిన ప్రతి చిన్న విషయాన్ని జ్ఞాపకంతో రాసుకుంటుంది. కుమార్ మాత్రం మొదట చదువు విషయంలో, తర్వాత ఉద్యోగ విషయంలో గతాన్ని తలచుకుంటే కుమార్‌కి కూడా తానెంత కోల్పోయింది ఇప్పుడు అర్థమవుతోంది. కంప్యూటర్‌లు, ఈ మెయిల్స్ వంటివి వచ్చినా ఆధునిక సమాజంలో చేతితో రాసిన ప్రేమలేఖ ఎంత మధురంగా ఉంటుందో కుమార్‌కి ఇప్పుడు గుర్తొస్తుంది. శైలజ రాసిన ప్రేమలేఖల బాటనే కుమార్ స్నేహితుల భార్యలు కూడా కోరుతున్నారు. ఇపుడు తన బాస్ కూడా శైలజ రాసిన ప్రేమలేఖను చదివారా? అని అడుగుతాడు. మరో వైపు కుమార్ శైలజకు ఈమెయిల్ లవ్‌లెటర్ రాస్తాడు. కుమార్ శైలజ పట్ల ఉన్న ప్రేమను, ఆమె తనపట్ల చూపుతున్న ప్రేమను మరువలేకపోతున్నాడు. అక్కడ శైలజ ఇక్కడకుమార్‌కి ఇద్దరికీ ఏదో కోల్పోతున్నామన్న బాధ ఏపని చేయడానికి ఇష్టం లేదు కుమార్‌కి అనుకున్న వెంటనే ఇండియాకు ప్రయాణమవుతాడు మరోవైపు కుమార్ మెయిల్ చదివిన శైలజ వెంటనే అతనికి ఫోన్ చేస్తుంది అయితే ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. దీంతో అమ్మమ్మ దగ్గరి కెళ్ళి కుమార్‌కి ఏమైందో అని వెక్కివెక్కి ఏడుస్తుంది. ఆరాత్రంతా నిద్రపోదు.

కుమార్ అమెరికా నుంచి ఇంటికి వచ్చేస్తాడు. నిజానికి వెన్నెల్లో గోదావరి ఇంత అద్భుతంగా ఉంటుందని అతను అనుకోలేదు. అప్పటికే శైలజ వాళ్ళ అమ్మమ్మను, తాతయ్యను తీసుకుని కుమార్ ఇంటి కొస్తుంది. ఇంట్లో అందరినీ తీసుకుని భద్రాచలం వెళ్తాడు. నిజానికి ఎప్పుడైతే శైలజ అమెరికాను అలిగి ఇంటికి వస్తుందో తర్వాత ఆ ప్రేమ లేఖ విషయం అమ్మకి చెప్పి వెతకమంటాడు. ఆ మరుసటి రోజే కుమార్ వాళ్ళ అమ్మకి ఆ ఉత్తరం దొరుకుతుంది అయినా ఉత్తరం దొరకలేదంటే కుమార్ ఏం చేస్తాడోనని ఆతృతంగా దాచేస్తుంది. నిజానికి కుమార్‌కి శైలజ ఎదుటనే ఆ ఉత్తరాన్ని చదవడం బావుండడాన్ని  మించి బావుంది శైలు రాసిన ప్రేమ లేఖలో ఏముందంటే

"నువ్వు నా నేస్తం ....నువ్వు నా భరోసా...
నువ్వు నా ధైర్యం.... నువ్వు నా ప్రోత్సాహం
నువ్వు నా తొలి ప్రేమ... నువ్వు నా తొలి ముద్దు
నువ్వు నా ఊపిరి ... నువ్వు నా జీవితం..
నా జీవితం అంతా నువ్వే....

నువ్వు నాతో ఉంటే నేను చిరునవ్వుకి చిరునవ్వుని అయిపోతాను. సంతోషం సింహాసనం మీద కూర్చుని ఆనందం సామ్రాజ్యాన్ని శాసించేస్తాను అదే నువ్వు లేకపోతే....!!?

వాగర్థాలలో వాక్కు మాత్రమే నేను..
అర్థం, పరమార్థం అన్నీ నువ్వే..
నిజం నాకు అన్నీ నువ్వే అయినప్పుడు
ఇక ఏ ఆకృతిలో నా అంతరంగం నీ ముందు పరువను?
ఏవిధంగా  నా అంతరంగ మధనం  నీకు విన్పించను ?
ఒకటి మాత్రం నిజం
నీ నుంచి విడిపోతే నేను శున్యాన్ని"

నీ

శైలు  (బుచ్చమ్మ) (శైలబాల, ఆదెళ్ళ;2011:పుట – 257)

25 సంవత్సరాల తరవాత

ఇండియా

రాజమండ్రి దగ్గర ప్రక్కిలంక...

సమయం అర్ధరాత్రి పన్నెండు గంటలు...

ఎవరో తలుపు చదుతున్న శబ్దం వినిపించింది. అందరూ ఆందోళన పడ్డారు. కుమార్ శైలజ వెళ్ళి తలుపు తీసి చూస్తే ఎదురుగా అల్లుడు గారు.. ఒక్క క్షణం ఆశ్చర్యంతో కూడిన ఆందోళన. కుమార్, శైలజల కూతురు గీతాంజలిని మురళి కిచ్చి పది రోజుల క్రితం వివాహం జరిగింది. పెళ్లైన వెంటనే ఇద్దరు అమెరికా వెళ్ళి పోయారు,అయితే మురళీ ఇంటి కొచ్చిన వెంటనే ఇద్దరు ఏమి అడగలేక పోయారు. మురళి కాసేపటికి చెప్పాడు "పెళ్ళికి ముందు మీ అమ్మయికి నేను ఒక ప్రేమ లేఖ రాశాను అది ఇప్పటి వరకు మీ అమ్మయి చదవనే లేదు నాకు ఈ విషయం రెండు రోజుల క్రితం తెలిసింది చాల బాధగా అనిపించి మీ అమ్మయిని అడిగాను సారీ మురళి ప్రాజెక్ట్ వర్క్ లో చాలా బిజీగా ఉన్నాను. ప్రశాంతంగా కుర్చుని చదువుదామని..." (వెన్నెల్లో గోదావరి – పుట–259) అల్లుడు చెప్పిన మాటకు ఆ ఇంట్లో కుమార్, శైలజ వాళ్ళ అమ్మమ్మ తాతాయ్య కుమార్ తల్లి తండ్రిఅందరు ఒకే సారి బిగ్గరగా నవ్వుతారు, సర్గిగా 25 సంవత్సరాల క్రితం కుమార్ శైలజల జీవితంలో జరిగిన సంఘటన కుమార్ మాత్రం తనను తాను కుతురిలో చుసుకుంటూ నవ్వేస్తాడు వెంటనే దృశ్యం కూడా మరో అందమైన "వెన్నెల్లో గోదావరి రుపుదిద్దుకుంటోంది అక్కడ మరో జంట ఏంచుకోబోయే మురిపాల కోసం గోదావరి ఇసుక తిన్నెలు తమను తాము సిద్ధం చెసుకుంటున్నాయి "(పైదే, పుట–259)దీంతో నవల ముగుస్తుంది.

## 7.8 బతుకుతాడు

ప్రపంచీకరణ సరళీకృత ఆర్థిక విధానాలు భారతదేశంలోకి ప్రవేశించి అనేక బహుళజాతి కంపెనీలు దేశం నిండా విస్తరించాయి. దీంతో సమస్త వృత్తులు కలిగిన భారతీయులు బహుళజాతి కంపెనీల దెబ్బకు అతలాకుతలమై పోయారు. కులవృత్తులను క్రమంగా నశిస్తున్నాయి. ప్రపంచీకరణ వలన ఉపాధి కోల్పోతున్న కులవృత్తుల్లో గౌడల కల్లుగీత వృత్తి ఒకటి. గీత కార్మికుల సమస్యలను గురించి ప్రధానంగా చర్చించిన నవల ఇది. దీని రచయిత నేరెల్ల శ్రీనివాస్‌గౌడ్.

ధర్మయ్య గౌడ్ కరీంనగర్ జిల్లాలోని హన్మాజిపేటలో కులవృత్తి అయిన కల్లుగీత వృత్తితో జీవనం చేస్తుంటాడు. అతనికి ముగ్గురు కుమారులు భూమయ్యగౌడ్, నారాయణగౌడ్, లక్ష్మన్‌గౌడ్ ముగ్గురు కుమార్తెలు అందరికీ వివాహాలు చేస్తాడు. పెద్ద కొడుకు భూమయ్య గౌడ్ ఇక్కడ ఆర్థిక

పరిస్థితులు సరిగా లేక బొంబాయి వెళ్ళి కారప్పొడి వ్యాపారం చేస్తుంటాడు. నారాయణగౌడ్ మాత్రం తమకు తరతరాలుగా వారసత్వంగా వచ్చిన కులవృత్తినే నమ్ముకుని జీవనం చేస్తాడు. లక్ష్మణ్ గౌడ్ కూడా కులవృత్తి మీదనే ఆధారపడి ఉంటాడు.

నారాయణగౌడ్ కల్లుగీత వృత్తి చేపట్టే నాటికి గ్రామంలో పటేలుల పెత్తనం కొనసాగుతుంది. ఒక రోజు పటేల్ మనిషి కల్లు అడిగితే అయిపోయిందని సమాధానమిస్తాడు నారాయణగౌడ్. ఈ విషయం లక్ష్మణ్‌రావు పటేల్ తెలుసుకుని నారాయణ గౌడ్‌ని ఇంటికి పిలిపించుకుని తీవ్రంగా కొట్టి ఒక చోట కట్టేస్తాడు. ఈ విషయం తెలిసి అతని భార్య లక్ష్మి  ఇద్దరు పిల్లలు కొడుకు శ్రీనివాసగౌడ్, కూతురు గంగవ్వను వెంట బెట్టుకుని పటేల్ దగ్గరికి వస్తుంది. అయ్యా పిల్లల ముఖం చూసి నా భర్తను విడవండి అని వేడుకుంటుంది. రాత్రి బాగా పొద్దు పోయిన తర్వాత విడచి పెడతాడు.

భూమయ్య గౌడ్ మాత్రం బొంబాయి వెళ్ళి మొదట కారప్పొడి వ్యాపారం చేసి తర్వాత కల్లు దుకాణం ప్రారంభిస్తాడు. అక్కడ బాగా సంపాదిస్తాడు. తన అన్న సంపాదన చుసి నారాయణ గౌడ్‌కి బాగా సంపాదించాలనే కోరిక కలుగుతుంది. తన ఆర్థిక పరిస్థితి మెరుగు పరచుకొనేందుకు తన గ్రామం పక్కన  ఉన్న ధర్మపురి దగ్గరి రాయక్క పల్లెలో కల్లు మాములు పడతాడు. అక్కడ కల్లు తాగేవారు చాలా తక్కువ. కల్లును ధర్మపురికి తీసుకెళ్ళి ఇంటింటికీ తిరిగి అమ్మేవాడు. ఎంత కష్టపడినా ప్రభుత్వానికి నెలనెలా పన్నులు చెల్లించడానికి కూడా ఎల్లదు.

రాష్ట్రంలో గౌడల పరిస్థితి చాలా దయనీయంగా తయారైంది. వారు పన్ను కట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఎందరో గీత కార్మికులు పస్తులు ఉంటున్నారు. చాలా మంది గీత కార్మికులు ఇతర రాష్ట్రాలు, విదేశాలకు వలస వెళ్తారు. మరో పక్క దళారీలు కాంట్రాక్టర్లు కల్లు అమ్మకాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడానికి సిద్ధ పడుతున్నారు. ఈ పరిస్థితులన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత పనివారల సంఘం 'చలో హైదరాబాద్' కి పిలుపునిస్తుంది. రాష్ట్రం నలుమూలల నుంచి కల్లుగీత కార్మికులు హైదరాబాద్‌కి తరలి వస్తారు. సభలో ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మికుల సంఘం అధ్యక్షుడు ధర్మభిక్షం ప్రసంగిస్తూ ప్రభుత్వం దోపిడీ వర్గానికి కల్లుమాములులు కాంట్రాక్ట్ ఇవ్వకూడదు నేరుగా అంటే ముఖ్యంగా అద్రస్ విధానాన్ని రద్దు చేయాలి. గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఒక చట్టం తేవాలి. ప్రమాదవశాత్తు గీత కార్మికులు తాటి చెట్టుపై నుండి కిందపడి మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. వికలాంగులైన వారికి ఆర్థిక సహకారం అందించాలి. గీత కార్మికుల సంక్షేమం కోసం ఫైనాన్స్

కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి” (శ్రీనివాస్ గౌడ్, నేరెళ్ళ:2004; పుట –18)అని కోరతాడు అన్నారు. ఈ సభలో ఇతర నాయకులు దేశిని చినమల్లయ్య బాలగౌడ్, రాజలింగం గౌడ్, నిమ్మల రాము మొదలగు వారు పాల్గొని ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పిస్తారు.

1956లో ఆంధ్రప్రదేశ్‌లో కల్లుగీత పనివారల సంఘం ఏర్పడింది. ఈ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాలు, ఎక్సైజ్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తారు. ప్రదర్శనలు జరుపుతారు. ఫలితంగా 1964 సంవత్సరం నుంచి కల్లుగీత కార్మికుల సహకార సంఘాలు పనిచేస్తాయి.

నారాయణగౌడ్ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతుంది. ఇంట్లో కొడుకులు శ్రీనివాస్‌గౌడ్ తిరుపతిగౌడ్, కూతురు గంగవ్వల కడుపు నింపడం కూడా అతనికి కష్టమవుతుంది.

ఆంధ్రప్రదేశ్ అవతరణ నుంచి కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగుతుంది. ఎంత మంది ముఖ్యమంత్రులు మారినా గౌండ్ల పరిస్థితిలో మార్పురావడం లేదు. తర్వాత కాంగ్రెస్ పార్టీకి పోటీగా ఎన్.టి.రామారావు పార్టీ స్థాపించి విజయం సాధింస్తాడు. శ్రీనివాస్‌గౌడ్ ఇపుడు నాల్గవతరగతి చదువుతున్నాడు. కొడుకు చదువు కోవడం నారాయణ గౌడ్‌కి ఇష్టం లేదు. శ్రీనివాస్‌గౌడ్ ఇంటి ఆర్థిక పరిస్థితిని కొద్దికొద్దిగా అర్థం చేసుకుంటున్నాడు. తండ్రికి కల్లు అమ్మకంలో సహాయం చేస్తున్నాడు. శ్రీనివాస్‌గౌడ్ ఒక వైపు చదువుతూనే మరో వైపు ఇంటి పనులు చేస్తున్నాడు. మరో వైపు నారాయణ గౌడ్ తమ్ముడు లక్ష్మణ్ గౌడ్ కూడా పెద్ద అన్న భూమయ్యతో పాటు బొంబాయికి వెళ్ళిపోతాడు.

నారాయణగౌడ్ బతుకు తెరువుకోసం పడరాని పాట్లు పడుతున్నా చివరికి ఇంకా పూరిగుడిసెలోనే ఉండాల్సి వస్తుంది. వానాకాలంలో గుడిసె అంతా చిత్తడి చిత్తడిగా మారిపోతుంది. మరో వైపు శ్రీను ఏడవతరగతికి వచ్చాడు. ఇక నారాయణగౌడ్‌కి చదివించే స్తోమత లేక శ్రీనివాస్‌గౌడ్‌ను బడిమానిపిస్తాడు. నారాయణగౌడ్ ఆర్థిక పరిస్థితిలో ఏ మార్పు. తాను ఎంత కష్టం చేసినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుంది. ఎప్పుడో వేసుకున్న గుడిసె అలాగే ఉంది. ఎప్పుడో చేసిన అప్పు అలాగే ఉంది. తను అప్పు మాత్రమే కట్టలేక పోతున్నాడు. భూమయ్యగౌడ్ బొంబాయి నుంచి వచ్చి తమ్ముడు నారాయణగౌడ్‌కు కొంత సహాయం చేస్తాడు. శ్రీనివాస గౌడ్ తండ్రికి తోడుగా వుంటూ కొంత వరకు సంపాదిస్తాడు.

శ్రీనివాసగౌడ్‌కి మరింత సంపాదించాలనే ఆలోచన కలిగి తండ్రిని అడిగి బొంబాయికి వాళ్ళ పెదనాన్న భూమయ్య గౌడ్ దగ్గరికి వెళ్తాడు. అయితే అక్కడ భూమయ్యగౌడ్ కల్లును కల్తీచేసి వ్యాపారం చేస్తుంటాడు. ఇది శ్రీనివాస్‌గౌడ్‌కునచ్చదు. కొన్ని రోజుల పాటు భూమయ్య గౌడ్ దగ్గర పని చేసి తిరిగి హన్మాజిపేటకు వస్తాడు. నారాయణగౌడ్ శ్రీనివాసగౌడ్‌కు పెళ్లి చేస్తాడు. ఇంతలోనే బొంబాయికి వెళ్ళిన శ్రీనివాస గౌడ్ చిన్నాన్న వ్యాపారం కలిసిరాక ఆత్మహత్య చేసుకుంటాడు.

మరోపక్క రాష్ట్రంలో మల్లాది సుబ్బమ్మ సారానిషేధ ఉద్యమం లేవదీస్తుంది. ఇదే సమయంలో నారాయణమూర్తి 'దండోర' పేరుతో ఒక సినిమా తీస్తాడు. సారా తాగి జీవితాలను నాశనం చేసుకుంటున్న వ్యక్తుల దయనీయ స్థితి ఈ చిత్రంలో చూపించబడింది. సారా ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. దీంతో ప్రభుత్వం సారాను నిషేదిస్తుంది. సారా నిషేధం వలన ప్రభుత్వం గీత కార్మికులకు అధికంగా పన్ను విధిస్తుంది. మరో వైపు అబ్కారోల్లు లంచాలు కూడా పెంచుకున్నారు. మరో వైపు జగిత్యాల మండలంలోని ఈత, తాటి చెట్లను జగిత్యాల పరిధిలోకి తీసుకు వచ్చి ఒక కాంట్రాక్టర్‌కు అప్పచెబుతుంది ప్రభుత్వం . దీని ప్రకారం ఆయా గ్రామాలలో ఉన్న చెట్లన్నింటి మీద పెత్తనం వీరికే చెందుతుంది. దీనిపై గౌడలు న్యాయపోరాటం చేయాలని నిర్ణయించుకుంటారు. హన్మాజిపేట గ్రామస్తులు అయితే వీరు ఎక్కడికెళ్ళినా లంచాలతోనే పనులు అవుతాయని అధికారుల ద్వారా తెలుసుకుని నారాయణగౌడ్ కొంత డబ్బును వీరికి సమర్పించుకుంటాడు. నారాయణగౌడ్, గంరాజంగౌడ్, కత్తి గంగ రాజంగౌడ్ మరి కొందరు ఈ పని మీద తిరుగుతారు.

శ్రీనివాసగౌడ్ ఏపనిలోను ఇమడలేక ఒక పనిని వదిలి మరొక పనికి వెళ్తున్నాడు. కులవృత్తి తిండి పెట్టడం లేదు దీంతో ఊళ్ళోని కొందరు యువకులు సౌదీ మరికొందరు దుబాయికి వలస వెళ్తారు. ఇంతలో నారాయణగౌడ్ చిన్నకొడుకు తిరుపతిగౌడ్‌కు పెళ్లి చేస్తాడు. శ్రీనివాసగౌడ్ తమ్ముని పెళ్లి ఖర్చులో సగం భరించాల్సి వస్తుంది దీంతో మరింత అప్పుల్లో పడతాడు శ్రీనివాస్‌గౌడ్.

తాటి చెట్లను వదలి చాలా మంది సౌది, దుబాయి లాంటి దేశాలకు వెళ్తారు. గీత కార్మికులు హన్మాజీపేటలో తిరుపతిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌లు ఇద్దరే మిగిలిపోతారు. నారాయణగౌడ్ హన్మాజీపేట కల్లు మాముల కోసం అధికారుల వద్దకు తిరిగితిరిగి తనకున్న సంపద అంతా పోగొట్టుకుంటాడు. శ్రీనివాసగౌడ్, తిరుపతిగౌడ్‌లు ఈ కులవృత్తుల ద్వారా ఇన్ని సంవత్సరాలు ఏమీ

సంపాదించలేదని ఇక ఈవృత్తులతో లాభం లేదంటారు నారాయణగౌడ్‌తో. తన బాధనంతా నారాయణగౌడ్ ఇట్నేని సివలింగం దగ్గర చెప్పుకుంటాడు. నారాయణగౌడ్ మాటలు విన్న సివలింగకు బాధ కలుగుతుంది. సివలింగం కూడా తనకొడుకుని చదివించి ఉద్యోగస్తున్ని చేసాడు. అయినా ఎప్పుడు తండ్రిని చీదరించుకుంటాడు అతని కొడుకు. అయితే సివలింగం తన బాధ ఎవ్వరితో చెప్పలేకపోతున్నాడు. "నారాయణ నేను మెల్లగ పోత" అన్నాడు సివలింగం తాల్లకు గౌండ్లొల్లు వచ్చే సమయం అయింది.  ఈ కులవృత్తులన్నీ కూడు పెట్టని కులవృత్తులే కానీ ఇగ నేను కూడా వత్తున్న పా (పైదే పుట -132) అని ఆవు దగ్గరికి నడుస్తాడు నారాయణగౌడ్ దీంతో నవల సమాప్తం.

# ముగింపు

పూర్వ అధ్యాయాలను  పరిశీలించిన తర్వాత ప్రపంచీకరణ ప్రభావ నవలల్లోని ఆర్థిక రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలపై ప్రపంచీకరణ విధానాలు వాటి వలన కలిగిన ఫలితాలు చూశాక గ్లోబలైజేషన్ వల్ల కలిగిన లాభం కంటే నష్టమే అధికంగా ఉందని చెప్పడం నిర్వివాదం.

1980 దశకం  చివరి భాగంలో భారతదేశంలో ఆర్థిక సంక్షోభం పరాకాష్ఠ దశకు చేరుకున్నది. ఈ సమస్యకు పరిష్కారం ప్రపంచీకరణ మాత్రమేనని, ఇందుకు ప్రత్యమ్నాయం మరేది లేదనే వాదన ఆనాడు బలంగా ముందుకు వచ్చింది. ప్రభుత్వరంగం ప్రభుత్వ జోక్యం అజమాయిషీలతో విసిగి పోయిన ప్రజలకు నాడు ప్రపంచీకరణ ఒక సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా కనిపించింది. 1991లో నూతన ఆర్థిక విధానాల పేరిట ప్రపంచీకరణ భారతదేశంలోకి ప్రవేశించినపుడు దానికి వ్యతిరేకత అంత బలంగా ఏమీ కనిపించలేదు. వామపక్షాల నుండి మాత్రం కొంచెం నిరసన వ్యక్తమైంది. కానీ ప్రపంచీకరణ స్థిరపడి బలపడేకొద్దీ దాని దుష్పరిణామాల ప్రభావానికి అత్యధిక ప్రజాసమూహం గురికావడమనేది మొదలైంది. గ్లోబలైజేషన్ వల్ల భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఒక సమర్థవంతమైన ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటుందన్న ప్రజల ఆశ భగ్నమైపోయింది అనే విషయాన్ని నేడు పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నూతన ఆర్థిక విధానాల గురించి సంక్షిప్తంగా చెప్పాలంటే ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణ, సరళీకరణలతో ప్రపంచీకరణ ముడిపడి ఉంటుంది. అంతేకాకుండా ఇవి ఒక దానిని మరికటి బలోపేతం చేసుకుంటాయి. ఈక్రమం గుత్తాధిపత్యాన్ని, బహుళజాతి సంస్థల ఆధిపత్యాన్ని బలోపేతం చేస్తుంది. బహుళజాతి సంస్థల ప్రధాన ఉద్దేశ్యం లాభార్జనే తప్ప ప్రజాసంక్షేమం కాదు. నూతన సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలు భారతదేశంలో అమలై నేటికి దాదాపు 25 సంవత్సరాలు కావస్తున్నది.

నేడు ప్రపంచీకరణ అన్ని రంగాలపై ప్రభావాన్ని చూపింది. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలతో పాటు సాహిత్యం కూడా దాని బలమైన ప్రభావానికి గురైంది. తెలుగు సాహిత్యంలో కవిత్వం, కథ ప్రపంచీకరణ ప్రతిఫలనాలను చిత్రించడంలో ముందు వరుసలో ఉంది. సాహిత్యంలోని ఇతర ప్రక్రియలలాగే నవల కూడా దాని ప్రతిఫలనాలను ఇవ్వాళ బహుముఖంగా చిత్రిస్తోంది.

నా పరిశోధనలోని నవలల్ని పరిశీలించినపుడు ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతికపరమైన అనేక అంశాలు తెలుస్తున్నాయి.

'బతుకుతాడు' నవల పరిశీలన వలన ప్రపంచీకరణ బహుళజాతి సంస్థలు పుట్టగొడుగుల్లా భారతదేశంలోకి ప్రవేశించడం, తరతరాలుగా ప్రజలకు ఉపాధి కల్పించిన దేశీయ వృత్తులు అంతరించడం తెలుస్తుంది. అదేవిధంగా గౌడల కులవృత్తి అయిన 'గీతవృత్తి'దెబ్బతిన్న పరిస్థితి ఈ నవలలో కనబడుతుంది. కొన్ని వందల సంవత్సరాల పాటు జాతి జనానికి ఉపాధి కల్పించిన అనేక కులవృత్తులు నేడు బహుళజాతి సంస్థల ఉత్పత్తుల మూలంగా అంతరించి పోతున్నాయి. చేతివృత్తుల కార్మికుల జీవితాలు గందరగోళమవుతున్న స్థితిని ఈ నవల వివరించింది.

'డాలర్‌కోడలు' నవల విదేశీ వ్యామోహాన్ని, మారిపోతున్న మన సంస్కృతి, సాంప్ర దాయాలను చిత్రించింది. ప్రపంచీకరణ మూలంగా నేడు మానవ సంబంధాలు 'మనీ' సంబంధాలుగా, 'మార్కెట్'సంబంధాలుగా రూపాంతరం చెందుతున్నస్థితిని, అమెరికా, డాలర్ వ్యామోహాల్ని ఈ నవల ప్రదానంగా చర్చించింది.

'జీవన్మృతులు' నేటి ఖరీదైన కార్పొరేట్ ఆసుపత్రుల పనితీరుని చిత్రించింది. కార్పొరేట్ ఆసుపత్రుల ధనవ్యామోహాన్ని, రోగులపట్ల వాటి నిర్లక్ష్యాన్ని, ధన సంపాధన వేటలో డాక్టర్లు నైతిక విలువలకు తిలోదకాలు ఇస్తున్న స్థితిని ఈ నవల తెలిపింది. ప్రపంచీకరణ క్రమంలో వైద్యంలో అనేక నూతన ఆవిష్కరణలు జరిగినప్పటికీ అవి పేద ప్రజలకు అందుబాటులో లేనటువంటి పరిస్థితి ఈనవల ద్వారా తెలుస్తుంది.

ప్రపంచీకరణ క్రమంలో బహుళజాతి సంస్థల ఉత్పత్తులు అధికమవుతున్నాయి. వాటికీ ఆ సంస్థలు విశేషమైన ప్రచారం కల్పిస్తున్నాయి. ఫలితంగా వర్థమాన దేశాల్లోని వస్తువ్యామోహవాదం వైపు నడిపిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ అధికారులు వస్తువ్యామోహానికి అలవాటు పడుతూ వాటిని నెరవేర్చుకునే క్రమంలో అవినీతికి అలవాటు పడుతున్నారు. రాజకీయ నాయకులు కూడా లంచగొండితనాన్ని పెంచి పోషిస్తున్నారు. అలాగే ప్రపంచీకరణ విధానాల ప్రభావం దేశంలో వ్యవసాయ రంగాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. రైతులు పండించిన తమ పంటలకు గిట్టుబాటు ధరను కూడా పొందలేక పోతున్నారు. బహుళజాతి సంస్థల వ్యవసాయ ఉత్పత్తులు భారతదేశాన్ని ముంచెత్తడంలో భారతదేశంలోని వ్యవసాయరంగం తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టి వేయబడుతోంది. ఈ అంశాలను వివరించిన నవల సింహప్రసాద్ రాసిన 'తమసోమా'.

‘పడగనీడ’ నవల దేశంలో ఇవాళ పాతుకుపోయిన కర్పొరేట్ విద్యాసంస్థల ధన వ్యామోహన్ని వివరిస్తుంది. ప్రపంచీకరణ నేపథ్యంలోనేడు విద్యా వ్యాపారమైంది. కొనగలిగిన వారే నేడు విద్యను పొందుతున్నారు. విద్యార్థుల సహజ సామార్థ్యాలను నియంత్రిస్తూ వాళ్ళను మార్కులు తెచ్చుకునే మరయంత్రాలుగా మారుస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థల పడగనీడని కళ్ళకు కట్టేలా చిత్రించిందీ నవల.

ప్రస్తుతం సమాజంలో డాలర్ ఒక కలగా మారింది. అది శ్రీమంతులనే కాక నేడు మధ్యతరగతి మనుషుల్నీ ప్రభావితం చేస్తోంది. ఆధునిక మానవుడు డబ్బు కోసం పెట్టే అందని పరుగులను వస్తువ్యామోహాన్ని, డాలర్ వేటలో చిక్కుకుని మనుషులు ఏవిధంగా పతనమవుతున్నారో ఆలోచింప జేసిన నవల సింహప్రసాద్ రాసిన డాలర్.....!డాలర్.....!

ఆధునిక సమాజాల్లో ప్రసార సాధనాల వ్యాప్తి విస్తృతమైంది. బహుళజాతి సంస్థలు తమ ప్రయోజనాలకు అనుగుణంగా ఈ సాధనాలను వాడుకుంటున్నాయి. ప్రసారసాధనాలు సమాజాన్ని అధికంగా ప్రభావితం చేస్తాయి. అయితే బహుళజాతి సంస్థల అధిపత్యంలోని పత్రికలు, టీవీలు విషసంస్కృతిని వెదజల్లుతున్నాయి. ఫలితంగా మనిషి లౌకిక విలువలకు తిలోదకాలిచ్చే పరిస్థితుల్ని కల్పిస్తున్నాయి. ప్రసార సాధనాల వలన అధికంగా ప్రభావితం అవుతున్నది యువత. కొన్ని పత్రికలు, ఛానల్స్‌లో చూపిస్తున్న అశ్లీలకర సన్నివేశాలు యువత భవిష్యత్తును అంధకారం చేస్తున్నాయి. ఈ అంశాలన్నింటిని చర్చించిన నవల సలీం రాసిన ‘కాంచనమృగం’.

ఆదెళ్ళ శైలబాల రచించిన నవల ‘వెన్నెల్లో గోదావరి’. ఈ నవల నేడు సమాజంలో అంతరించి పోతున్న మానవ సంబంధాలు సహజ విలువలు వివరించింది. అంతే కాకుండా ఆధునికంగా మానవుడు డబ్బు సంపాదనలో పడి సహజమైన ప్రేమకు దూరమవుతున్న స్థితిని బహుళజాతి సంస్థల ఆహార ఉత్పత్తులు మార్కెట్లను ముంచెత్తడంతో మన ఆహార అలవాట్లు, అభిరుచుల్లో వస్తున్న మార్పుల్ని చిత్రించింది. నేడు మనిషి సౌలభ్యం కోసం బహుళజాతి సంస్థలు రకరకాల ఫోన్‌లను మార్కెట్లోకి విడుదల చేసి తమ లాభార్జనను పెంచుకుంటున్నాయి. అయితే సెల్ ఫోన్ టవర్‌ల వల్ల వివిధ రకాల పక్షులు ప్రమాదంలో పడి అంతరిస్తున్న స్థితిని వివరించింది.

ఈ విధంగా తెలుగు నవల ప్రపంచీకరణ ప్రతిఫలనాలను చాల వరకు చిత్రిస్తూ వస్తుంది. అయితే నవలల్లో ప్రపంచీకరణ విధానాలు కొంత అసంపూర్ణంగానే చిత్రితమయ్యాయి. ప్రపంచీకరణ ప్రతిఫలనాల్ని నవలా సాహిత్యం ఇంకా అధికం చేయాల్సిన అవసరం ఉంది.

భారతదేశం విషయానికి వస్తే ప్రపంచీకరణ కలిగించిన లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉన్నాయి. భారతదేశం అనాది నుండి వ్యవసాయ ప్రాధాన్యం కలిగిన దేశం అయితే ఈ రోజు వ్యవసాయ రంగంలో పని చేస్తున్న రైతులు, కూలీలు తీవ్రమైన సంక్షోభంలో మునిగిపోయారు. కారణం బహుళజాతి సంస్థల విత్తనాలు, పురుగుల మందులు ఈ దేశంలోకి ప్రవేశించి వ్యవసాయ రంగాన్ని చిన్నాభిన్నం చేస్తున్నాయి. పండించిన పంటకు కనీస మద్దతు ధరలేదు. ఫలితంగా అనేక మంది రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతూ ఆత్మహత్యల్ని ఆశ్రయిస్తున్నారు.

బహుళజాతి సంస్థలు, పెట్టుబడిదారీ పరిశ్రమలు విడుదల చేస్తున్న క్లోరోఫ్లోరో కార్బన్ వంటి విషవాయువుల వలన నేడు మొత్తం భూగోళం కాలుష్యమయంగా మారింది. ఫలితంగా మనుశుల ప్రాణాలకే కాక అనేక జీవరాసులకు ఇది ముప్పుగా పరిణమిస్తోంది.

భారతదేశంలో ప్రపంచీకరణ వల్ల బహుళజాతి సంస్థలు ప్రవేశించి తాము తయారు చేస్తున్న ఉత్పత్తులకు విశేషమైన ప్రచారం కల్పించుకొని ఇక్కడి ప్రజలను వస్తువ్యామోహం వైపు నడిపిస్తున్నాయి. అదే విధంగా బహుళజాతి సంస్థలు ఈదేశ సంస్కృతిని ధ్వంసం చేస్తూ పాశ్చాత్య విషసంస్కృతిని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నాయి. దీనికి తమ ఆధిపత్యం కింద ఉంటున్న ప్రసార మాధ్యమాలను అనువుగా ఉపయోగించుకుని ఈ దేశ ప్రజలను సాంస్కృతిక బానిసత్వం వైపు నడిపిస్తున్నాయి. అన్ని చోట్లా టీ.వీ సంస్కృతిని అలవరుస్తున్నాయి. ఫలితంగా ఈ రోజు భాషలోనూ ఆహారపు అలవాట్లలోనూ, తినే తిండిలోనూ విపరీతమైన మార్పులు వస్తున్నాయి. మన భాష కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు అన్నీ కూడా అంతరించేస్థితికి చేరువవుతున్నాయి.

భారతీయుల సమస్త జీవన రంగాల మీద నేడు ప్రపంచీకరణ బహుళజాతి సంస్థలు పట్టుబిగించాయి. అందుకే నేడు పల్లె మారింది. మనిషి కూడా మారాడు. పరస్పర ఆత్మీయ ఆప్యాయతలు కరువవుతున్నాయి. ప్రతి ఒక్కరు డబ్బు సంపాదనే పరమావధిగా ఉరుకు పరుగుల వేటలో పడిపోవడం వలన సమస్త విలువలు పతనమవుతున్నాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే భారతదేశం లాంటి వర్ధమాన దేశాలకు ప్రపంచీకరణ వలన అనుకున్నంత మంచి జరగక పోగా, అది పెనువిషాదాన్ని కల్గిస్తుంది. ఇప్పటికైనా అభివృద్ధి చెందుతున్న దేశాలన్నీ ప్రపంచీకరణను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ఐక్యం కావలసిన అవసరం ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు సంఘటితంగా ఒక్కటై తమకు కావలసిన

డిమాండ్లను పెట్టి సాధించుకోవాలి. ప్రపంచీకరణ విధానాలు అన్ని దేశాలకు న్యాయబద్ధంగా సక్రమంగా అమలయ్యేలా ఉండాలి. మరింత మానవీయత కలిగిన ప్రపంచీకరణ అమలు కావడానికి సంపన్నదేశాలపై వర్ధమాన దేశాలు ఒత్తిడి తీసుకు రావాలి. వర్ధమాన దేశాలు తమకు అవసరమైన వస్తువులను మాత్రమే దిగుమతి చేసుకునేలా చట్టాలు రూపొందించుకోవాలి. ప్రతి దేశమూ తమ వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిరక్షించుకొనేటట్లు వాణిజ్య సంస్థ ఒప్పందాల్లో మార్పుల కోసం పోరాడాలి. బహుళజాతి సంస్థలకు ధీటుగా వర్ధమాన దేశాల్లోని దేశీయ మార్కెట్లు నిలబడేలా చూడడం అత్యవసరం. ప్రపంచీకరణ నుంచి వర్ధమాన దేశాలు లబ్ధిపొందాలంటే ఈ దేశాలన్నీ ఒక్కతాటి పై నిలబడి వాణిజ్య సంస్థల ఒప్పందాల్లో అన్ని దేశాలకు న్యాయమైన ఒప్పందాల అమలు జరగడం కోసం కలిసి కట్టుగా పోరాడటం తప్ప మరో మార్గంలేదు.

సాహిత్యపరంగా పరిశీలించినపుడు ప్రపంచీకరణకు సంబంధించి రచయితల చిత్రీకరణ బాగుంది. ప్రపంచీకరణ ప్రభావ నవలల్లో కనిపించే వస్తువైవిధ్యం రచయితల స్పందనను తెలియజేస్తుంది. కవిత్వం, కథలతో పోల్చినపుడు నవలల్లో ప్రపంచీకరణ చిత్రణ ఇంకా అధికం కావలసి ఉంది. రచయితలు ప్రపంచీకరణ దుష్ఫలితాలను చూపినట్టుగానే దాని పరిష్కార మార్గాలను కూడా సూచిస్తే బాగుంటుంది. ప్రపంచీకరణ ప్రభావంతో దళిత, స్త్రీవాద, విప్లవ, మైనార్టీ కవుల స్పందనపై కూడా మరొక పరిశోధన జరిగితే బాగుంటుంది. అలాగే ప్రపంచీకరణ నేపథ్యంలో సాహిత్యంలో చిత్రితమవుతున్న మానవ సంబంధాలపై కూడా విడిగా పరిశోధన జరగాల్సిన అవసరం ఉంది. అన్ని విషయాలను తెలిసిన వాడిని కానుగానీ నాకు తెలిసినంత వరకు చెప్పడానికి ప్రయత్నం చేశాను. కనుక ఈ సిద్ధాంత విషయమై ఏమైనా లోటుపాట్లు, సవరణలు, వివరణలు తెలియజేసినట్లయితే వాటిని దిద్దుకోవడం ద్వారా మరిన్ని విషయాలను తెలుసుకోగలనని భావిస్తున్నాను.

# ఉపయుక్తగ్రంథ సూచి

1. అమానుల్లాఖాన్,ఆర్.రాజేశమ్(అను) : 2011.'ప్రపంచ ఆర్థిక సంక్షోభం పాపాలెవరివి? భారాలెవరికి'? ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్.
2. అరుంధతీరాయ్, కె.సురేష్(అను) : 2012, 'పెట్టుబడిదారీ విధానం ఒక ప్రేతాత్మ కథ', మలుపు బుక్స్ ప్రచురణ, హైదరాబాద్.
3. అశోక్‌కుమార్, పెద్దింటి : 2002, 'ఊటబాయి' నయనం ప్రచురణలు సిరిసిల్ల, కరీంనగర్ జిల్లా.
4. ఆనందరామం. సి : 1994 'నవలా విమర్శ', పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్.
5. ఆర్.కె.ఆర్ : 2004 'దృక్కోణ', పంచవటి ఎడ్యుకేషనల్‌సోసైటీ, హైదరాబాద్.
6. ఎ.బి.కె : 2000 'రుణాంధ్రప్రదేశ్', ఎఐపిఆర్ ఎఫ్ ప్రచురణలు, హైదరాబాద్.
7. కుటుంబరావు. కొడవటిగంటి : 1995, 'సామ్రాజ్యవాద సంస్కృతి వ్యాస సంకలనం'. విరసం ప్రచురణలు. హైదరాబాద్.
8. క్రిష్ణయ్య. వి : 2003, 'భారతదేశంలో ప్రపంచీకరణ పర్యవసానాలు', ప్రకాశం జిల్లా, ఏపి.టీచర్స్ ఫెడరేషన్.
9. ఖాదర్ మొహియుద్దీన్ : 1991; 'పుట్టుమచ్చ' కవిత్వం ప్రచురణలు, విజయవాడ.
10. గాట్స్ ఉన్నతవిద్య – భవిష్యత్ : 2005, పిడియస్‌యు ప్రచురణ, హైదరాబాద్
11. గుడిపాటి : 2002, 'గ్లోబలైజేషన్ సాహిత్యదృక్పథం' మొలక ప్రచురణ, హైదరాబాద్.
12. గుడిపాటి : 2003 'ఇతివృత్తం' ఋషిప్రచురణ, హైదరాబాద్.
13. చంద్రశేఖర్ రెడ్డి, రాచపాలెం(సంపా): 2003, '1980 తర్వాత దళిత నవల' శ్రీలక్ష్మి గణపతి ప్రింటర్స్, అనంతపురం.
14. చామ్‌స్కీ,నోమ్. ఎడ్వర్డ్ ఎస్ హెర్మన్ : 2002 తెలకపల్లి రవి(అను) 'మీడియా మాయాజాలం' ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్.
15. చెన్నప్ప,మసన : 1991, 'ప్రాచీన కావ్యాలు – గ్రామీణ జీవన చిత్రణ', గాయత్రి పబ్లిషర్స్, ఆంధ్రసారస్వత పరిషత్, హైదరాబాద్.

16. చౌదరి,కె.ఆర్ : 2011 'వ్యవసాయం – ప్రపంచీకరణ' వీక్షణం పబ్లికేషన్స్, హైదరాబాద్.

17. జగన్నాథం, జూకంటి : 2004 'వైపని' నయనం ప్రచురణలు, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లా.

18. జననాట్యమండలి పాటలు. క్రాంతి ప్రచురణలు. 1979.

19. జయ.యస్ : 2004. 'దేశంటే మార్కెట్ కాదోయ్' హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్.

20. జయరాజు : 2012 'వసంతగీతం', కొత్తగూడెం, ఖమ్మం జిల్లా.

21. జూకంటి జగన్నాథం, ప్రవీణ్‌కుమార్,ఒద్దిరాజు(సంపా) : 2001 'గ్లోబల్‌ఖడ్గం' అక్షరం ప్రచురణలు, హైదరాబాద్.

22. జేమ్స్, పెట్రాస్ : 1996, '20 వ శతాబ్దాంతంలో సాంస్కృతిక సామ్రాజ్యవాదం', నవయువ సమాఖ్య ప్రచురణలు,హైదరాబాద్.

23. జ్యోతిరాణి, తోట (సం) : 2007 'ప్రపంచీకరణ పరిణామాలు –ప్రభావాలు మహిళల జీవితం' స్త్రీ జనాభ్యుదయ సంస్థ, వరంగల్లు.

24. జ్వాలాముఖి : 2005 'సంస్కృతి – సామ్రాజ్యవాదం' ప్రజాసాహితి జన సాహితి ప్రచురణలు, విజయవాడ.

25. డేవిసన్ బుధూ. కోదండరామిరెడ్డి(అను) : 2004. 'దినదిన గండం'. పర్‌స్పెక్టివ్ ప్రచురణ,హైదరాబాద్.

26. తిరుమలరావు, జయధీర్.(సంపా) : 2001 'తెలుగు కథ 2000', పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

27. దివాకర్, గాదె : 2010 'కోస్తాకాలుష్య కాసారంలో నిప్పుకణికలై మండుతున్న సోంపేటలు', సి.పి.ఐ(ఎం.ఎల్)న్యూడెమోక్రసీ ప్రచురణ.

28. దేవేందర్ శర్మ. ప్రభాకర్. మందార(అను) : 2000 హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్.

29. దేవేందర్, అన్నవరం : 2002. 'మరోకోణం'. సామాజిక వ్యాసాలు, నూతన సాహితీ, కరీంనగర్.

30. నవీన్, వాసిరెడ్డి. పాపినేని, శివశంకర్(సంపా) : 2004 'కథ 2003' కథా సాహితి ప్రచురణ. సికింద్రాబాద్.

31. నాగభూషణశర్మ, మొదలి : 2005 ‘నాటక శిల్పం’ విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

32. నిర్మల, కొండేపూడి : 2001 ‘మల్టీనేషనల్ ముద్దు’, స్వీయ ప్రచురణలు, హైదరాబాద్.

33. పద్మ, కుప్పిలి : 2001 ‘సాలభజింక’, మాతా పబ్లికేషన్స్, హైదరాబాద్.

34. పెట్టుబడుల ప్రపంచీకరణ : 1997, ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్.

35. ప్రతాపరెడ్డి, కాసుల : 1990 ‘తెలుగు నవలా వ్యాపారధోరణి’ మానస ప్రచురణలు, హైదరాబాద్.

36. బండారు, ఎస్.ఆర్.బి. భాస్కర్(అను) : 2003. ‘ప్రైవేటీకరణ రాజకీయాలు – ప్రభావం’ ప్రజాశక్తి బుక్ హౌస్ ప్రచురణ, హైదరాబాద్.

37. బాలగోపాల్,కె : 1986 ‘ప్రాచీన భారతదేశ చరిత్ర’, డి.డి.కోశాంబి పరిచయం, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్.

38. బిపిన్‌చంద్ర : 1983 ‘ఆధునిక భారతదేశ చరిత్ర’ హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, హైదరాబాద్

39. భాస్కరం, కల్లూరి : 2006, ‘ప్రపంచీకరణ తెలుగు సాహిత్య స్పందన’ వార్త దిన పత్రిక, హైదరాబాద్.

40. మగ్గం ముక్కలవుతుంటే : 1992, విప్లవరచయితల సంఘం, విరసం ప్రకాశం యూనిట్.

41. మాలినీ భట్టాచార్య(సంపా) సత్యరంజన్ (అను) : 2008. ‘ప్రపంచీకరణ మహిళలు’, ప్రజాశక్తి బుక్ హౌస్ ప్రచురణ, హైదరాబాద్.

42. మీరానందా. సత్యశోధన (అను) : 2012,‘సంతలో దేవుడు ప్రైవేటీకరణ – ప్రపంచీకరణ – హైందవీకరణ’, విశాలాంధ్ర విజ్ఞాన సమితి, హైదరాబాద్.

43. మురళి, అట్లూరి (సంపా) : 2003. ‘ప్రపంచీకరణ పదేళ్ళ అనుభవాలు’, సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రచురణ, హైదరాబాద్.

44. మృణాళిని, సి : 1988, ‘సాంఘిక నవల కథన శిల్పం’, తెలుగు పరిశోధన ప్రచురణలు, హైదరాబాద్.

45. రంగనాథాచార్యులు.కె.కె : 2005. 'ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు' ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్.
46. రంగారావు.పి : 2002, 'సామ్రాజ్యవాద సాలెగూటిలో జన జీవితం', సి.పి.ఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ పబ్లికేషన్, హైదరాబాద్.
47. రవి, తెలకపల్లి.(సంపా) : 2002 'జనకవనం' ప్రపంచీకరణ పై కవితా ప్రతిధ్వని, ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్.
48. రవి, తెలకపల్లి : 2001 'గమనం సాహిత్య ప్రత్యేక సంచిక', ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్.
49. రవికుమార్, మేడిపల్లి : 2003, 'ప్రపంచీకరణ కవిత్వం,ప్రజాజీవితం' ప్రజాసాహితి.
50. రాజగోపాల్, అరవింద్. బి.భాస్కర్ (అను) : 2003, 'మతం రాజకీయాలు టీవి', , ప్రజాశక్తిబుక్ హౌస్, హైదరాబాద్.
51. రాజీవ్, దీక్షిత్, కన్నెగంటి సీతారామయ్య.(అను) : 2003 'గ్లోబలైజేషన్'. రావిపాటి ట్రస్ట్, హైదరాబాద్.
52. రామకృష్ణ, తుమ్మల : 2004 'మట్టి పొయ్యి కథలు' చంద్రకళ పబ్లికేషన్స్, కర్నూలు.
53. రాములు, బి.ఎస్ : 2000, 'మమతలు మానవసంబంధాలు' (రాచపాలెం చంద్రశేఖరరెడ్డి ముందుమాట)విశాల సాహిత్య అకాడమి, జగిత్యాల, కరీంనగర్.
54. రాములు, బి.యస్ : 2003. '50 ఏళ్ళ తెలుగు కథ తీరు తెన్నులు'. విశాల సాహిత్య అకాడమి. కరీంనగర్.
55. రాములు,బి.ఎస్ : 2003, 'ప్రపంచీకరణ నేపథ్యంలో తెలంగాణ వేపచెట్టుకథలు', విశాల సాహిత్య అకాడమి, కరీంనగర్.
56. రామ్మోహన్‌రాయ్, కడియాల : 2003 'సంస్కృతి సామ్రాజ్యవాదం' జనసాహితీ ప్రచురణలు, విజయవాడ.
57. రాసాని, విఆర్. మధురాంతకం నరేంద్ర : 2002 'కథా వార్షిక 2002', మధురాంతకం రాజారాం సాహితీ సంస్థ, తిరుపతి.

58. వికసించిన విద్యుత్తేజం : 2000 ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్.

59. విద్మహే కాత్యాయనీ : 1995 'తెలుగు నవలా కథానిక విమర్శన పరిణామం' చరిత్ర ప్రచురణలు, హైదరాబాద్.

60. విద్యాభూషణ్ : 2003, 'ఎవరికోసం ఈ ప్రపంచీకరణ'. దృష్టి ప్రచురణ, హైదరాబాద్.

61. విశ్వనాధరెడ్డి, కేతు. (సంపా) : 1989 'కుటుంబరావు సాహిత్యం' విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

62. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి : 1989 'నవలా శిల్పం' విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

63. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి : 1992 'నవల – ప్రజలు' విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

64. వెంకటేశ్వరరెడ్డి, అన్నపురెడ్డి : 1991. 'సంస్కృతి విన్యాసం'. తెలుగు అకాడమి, హైదరాబాద్.

65. వెంకట్రామయ్య వేములపల్లి : 2003. 'ప్రపంచ బ్యాంక్ విషవలయంలో ఆంధ్రప్రదేశ్', సి.పి.ఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ ప్రచురణ, ఆంధ్రప్రదేశ్.

66. వెంకట్రామయ్య, వేములపల్లి : 2010, 'సామ్రాజ్యవాదం పెట్టుబడి దారీ అత్యున్నత దశ, సి.పి.ఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, ఆంధ్రప్రదేశ్ ప్రచురణ.

67. వెంకట్రావ్, యస్ : 2004 'పండుగలు ప్రజా దృక్పథం', ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్.

68. వెంకన్న, గోరటి : 2005 'రేలపూతలు' గేయకవిత్వం, సహచర ప్రచురణలు, హైదరాబాద్.

69. వేణుగోపాల్, ఎన్ : 1999 'అమ్మకానికి ఆంధ్రప్రదేశ్', విశ్లేషణ ప్రచురణలు, హైదరాబాద్.

70. వేణుగోపాల్, ఎన్ : 2001 'ఖడ్గచాలనానికి ఆహ్వానం' విజయవిహారం జన హర్ష పబ్లికేషన్స్, హైదరాబాద్.

71. వేణుగోపాల్, ఎన్ : 2011 'రాబందు వాలిన నేల', స్వేచ్ఛా సాహితి ప్రచురణ, హైదరాబాద్.

72. వైకుంఠం, యల్లంపల్లి : 1992 'ఆధునిక ప్రపంచ చరిత్ర,' తెలుగు అకాడమి, హైదరాబాద్.

73. శరత్‌జ్యోత్స్నారాణి. ఎస్ : 2002 'ఆధునిక తెలుగు కవిత్వంలో ప్రపంచీకరణ ప్రభావం' వ్యాసజ్యోత్స్న, హైదరాబాద్.

74. శరత్‌జ్యోత్స్నారాణి, ఎస్ : 2002 'వ్యాసజ్యోత్స్న' (పరిశోధన వ్యాస సంపుటి), జ్యోత్స్నా కళాపీఠం, హైదరాబాద్.

75. శరత్‌జ్యోత్స్నారాణి, ఎస్ : 2003. 'స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత వస్తువు– రూపం, శిల్పం', జ్యోత్స్నాకళాపీఠం ప్రచురణలు. హైదరాబాద్.

76. శ్యామల,గోగు.(సంపా) : 2003 'నల్లపొద్దు' (దళిత స్త్రీల సాహిత్యం), హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, హైదరాబాద్.

77. శ్రీనివాస్.కె : 2002, 'కథావార్షిక', విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, హైదరాబాద్.

78. శ్రీరంగం శ్రీనివాసరావు : 1999 'మహాప్రస్థానం' విప్లవ రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్.

79. సత్యనారాయణ, ఎస్వీ(సం) : 2003, 'గ్లోబలైజేషన్ కథలు'. విశాలాంధ్ర పబ్లికేషింగ్ హౌస్, హైదరాబాద్.

80. సలీం : 2004 'రూపాయి చెట్టు' కథా సంపుటి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

81. సలీం : 2006, 'చదరపు ఏనుగు', కథాసంపుటి, శ్రీ విజయలక్ష్మీ పబ్లికేషన్స్, విజయవాడ.

82. సామ్రాజ్యవాద సంస్కృతి : 2001 మహిళామార్గం ప్రచురణలు, హైదరాబాద్.

83. సాయినాధ్, పాలగుమ్మి : 2012 'భారతదేశంలో అవినీతి మూలాలు; జన విజ్ఞాన వేదిక, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్.

84. సింగమనేని నారాయణ(సంపా) : 1992 'సీమకథలు' 'విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, హైదరాబాద్.

85. సుందరం, ఎన్.ఎం : 2007, 'సామ్రాజ్యవాదం నిన్న – నేడు', ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురణలు, హైదరాబాద్.

86. సుదర్శనం, ఆర్.ఎస్ : 1972 'సమాజం – సాహిత్యం', చిత్తూరు జిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘం, చిత్తూరు.

87. సుధాకర్, ఎండ్లూరి : 2005 ఆవుల మంజులత (సంపా)'ఆధునిక సాహిత్యంలో ప్రక్రియలు – ధోరణులు', తెలుగు అకాడమి,హైదరాబాద్.

88. సుశీల, సోమరాజు : 2000 'చిన్న పరిశ్రమలు పెద్దకథలు' ఉమా బుక్స్, సికింద్రాబాద్.

89. స్టిగ్లిజ్, జోసెఫ్. గుడిపూడి విజయరావు(అను) : 2003, 'శృతి తప్పిన ప్రపంచీకరణ' ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాదు.

90. హనుమంతరావు, వి : 2009, 'రైతుకంటకన్నీరు ప్రభుత్వానికి పన్నీరు', విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురణలు, హైదరాబాద్.

## పత్రికలు

1. ఆమె డెస్క్, ప్రజాశక్తి తెలుగు దిన పత్రిక అక్టోబర్5, 2012.

2. ఈనాడు ప్రతిభ : 26, 11, 2012.

3. ఎన్.ఎస్. వెంకటరామన్ : హిందూ దినపత్రిక జూలై24, 2001.

4. కదిలిపోతున్న వివాహ వ్యవస్థ: సంపాదకీయ వ్యాసం, విశాలాంధ్ర దినపత్రిక. జూన్16, 2012.

5. కుసుమకుమారి.పి : 'ప్రపంచీకరణ – పర్యావరణ స్పృహ', వాఙ్మయి, జులై – సెప్టెంబర్ 2004.

6. డా. సాయిబాబ, పి.సి : 'ప్రపంచీకరణ – ఒక పరిశీలన', వాఙ్మయి ఏప్రిల్ –జూన్. 2003.

7. డా.కనకదుర్గ. జె : వాఙ్మయి జూన్ – సెప్టెంబర్ 2004.

8. తెలుగు భాషోద్యమ సమాఖ్య సమాచార పత్రం 2005.

9. ప్రజాసాహితీ(మాసపత్రిక)

10. ప్రసాదరావు, అరిబండి : కాంట్రాక్ట్ సేద్యం రైతుల కష్టాలను తీర్చగలదా? ఎనాలసిస్; సెప్టెంబర్; 1–15; 2004.

11. ప్రసాద్ కె.ఎస్.వి : 'ప్రాణికోటి మూగ వేదన' ప్రజాశక్తి. ఆదివారం సంచిక సెప్టెంబర్. 30, 2013.

12. బహుళజాతి సంస్థల బలాన్ని పెంచిన ప్రపంచీకరణ (సంపా) ఎనాలసిస్: డిసెంబర్ 2002.

13. భాష – సంస్కృతి ఉద్యమం 2003.

14. భాషా సంస్కృతి –ఉద్యమం(జన సాహితి ప్రచురణ)

15. మాతృభాషా సంస్కృతి(జన సాహితి ప్రచురణ)

16. మూల్పూరి, పద్మజ ఈనాడు దినపత్రిక, సంపాదకీయ వ్యాసం : మే16, 2013.

17. రామ్మోహన్, సొదుం. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక రంగం; విజేత కాంపిటీషన్, నవంబర్ 1–15, 2004.

18. విదేశీ పెట్టుబడుల కౌగిట్లో వర్ధమాన దేశాలు (సంపా) ఎనాలసిస్ : ఆగష్టు 16 –31, 2004.

19. విశాలాంధ్ర దినపత్రిక సంపదకీయ వ్యాసం జూన్19, 2010.

20. శ్రీనివాస్. కె : 'ఐక్యమవుతున్న ఐరోపా', ఆంధ్రజ్యోతి, సెప్టెంబర్ 19, 2004.

21. సంగిరెడ్డి, హనుమంతరెడ్డి : 'ప్రపంచీకరణ ప్రభావంతో వివాహాలు పెరుగుతున్న విడాకులు'. విశాళాంధ్ర దినపత్రిక, మే 9, 2012.

22. సత్యనారాయణ : 'ఆధునిక తెలుగు సాహిత్యంలో ఏధి ధోరణి? ఏది ఉద్యమం?' ఆంధ్రజ్యోతి 11 – 4 –2005.

## పరిశీలించిన నవలలు

1. ఆదెళ్ళ శైలబాల : 2011 'వెన్నెల్లో గోదావరి' సాయిబాబా పబ్లికేషన్స్, బాపట్ల, గుంటూరు జిల్లా.

2. ఓల్గా : 1998 'స్వేచ్ఛ', స్వేచ్ఛ ప్రచురణలు, హైదరాబాద్.

3. కళ్యాణరావు.జి : 2008 'అంటరాని వసంతం'. విప్లవ రచయితల సంఘం ప్రచురణ, ఆంధ్రప్రదేశ్.

4. చంద్రలత : 2002, 'రేగడి విత్తులు', బషీర్‌బాగ్ ప్రవర్తన పబ్లికేషన్స్ హైదరాబాద్.

5. డా. శంకరయ్య, ఎస్ : 2010 'పదమటికొండలు', శ్రీ రామలక్ష్మి పబ్లికేషన్స్ హైదరాబాద్.

6. ప్రాణ్‌రావు, ఎస్ : 2010 అందం, రమణ పబ్లికేషన్స్ హైదరాబాద్.

7. వేణుగోపాల్, కాశీభట్ల : 2001 'నేను – చీకటి' వాహిని బుక్ ప్రెస్, విద్యానగర్, హైదరాబాద్.

8. వేముల ఎల్లయ్య : 2002 'కక్క' గోసంగి ప్రచురణలు, నల్గొండ.

9. శ్రీనివాస్ గౌడ్, నేరెళ్ళ : 2004 'బతుకుతాడు', యూనివర్సిటీ ఆఫ్ సోషియల్ ఫిలాసఫి, విశాల సాహిత్య అకాడమి.

10. సలీం : 2001 'జీవన్మృతులు', శ్రీరవితేజ పబ్లికేషన్స్, విజయవాడ.

11. సలీం : 2006 'వెండిమేఘం', శ్రీ విజయలక్ష్మి పబ్లికేషన్, విజయవాడ.

12. సలీం : 2006 'కాంచన మృగం', శ్రీ విజయలక్ష్మి పబ్లికేషన్స్, విజయవాడ.

13. సలీం : 2010 'పడగనీడ', శ్రీ విజయలక్ష్మి పబ్లికేషన్స్, విజయవాడ.

14. సింహప్రసాద్ : 2010 'డాలర్...!డాలర్....!' శ్రీశ్రీ ప్రచురణలు, హైదరాబాద్.

15. సింహప్రసాద్ : 2012 'తమసోమా', శ్రీశ్రీ ప్రచురణలు, హైదరాబాద్.

16. సుధామూర్తి : 2006 'డాలర్ కోడలు', అలకనంద ప్రచురణలు, విజయవాడ.

## నిఘంటువులు

1. నళిని ఎస్. ఎస్ : 2009 'సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ' నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్.

2. బాపూజి. బి.ఆర్ : 2002 'రాజకీయ పదాల డిక్షనరి', నవ్య పబ్లిషర్స్, హైదరాబాద్.

3. బ్రౌన్.సి.పి : 1999 'బ్రౌణ్య తెలుగు – ఇంగ్లీషు నిఘంటువు', తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

4. వెంకటేశ్వరరెడ్డి, అన్నపురెడ్డి : 1993 'లఘువిజ్ఞాన సర్వస్వము' పల్లవి పబ్లికేషన్స్, హైదరాబాద్.

# ఆంగ్ల గ్రంథాలు


1. Abba,J. Ali(2001) Globalization of business practice and theory. Mumbai. Jaiko publishing house.
2. Aurobindo(26$^{TH}$ volume)(1971)pondicheri. Aurobindo ashram trust.
3. Block, Bernard and Trager, Giorge.L(Edit)(1971) Out lines of Linguistic Analysis New Delhi. Oriental books. Reprint corporation.
4. Malcolm Waters.(1995)Globalization. London. Britsh library
5. (Kennedy, X.j;dana gioia;literature – an introduction to fiction, poetry and drama; 1995; p195)

**Website**

www. Google.com.